మలాణ్

(లంబాడీల చారిత్రక నవల)

(MALAAN: A Historical novel of the Lambadis)



కన్నడ మూలం:
ఎన్. శాంత నాయక్

తెలుగు అనువాదం:
రంగనాథ్ రామచంద్ర రావు

మలాణ్

(లంబాడీల చారిత్రాత్మక నవల)

కన్నడ మూలం

డా. శాంత నాయక్

తెలుగు అనువాదం

రంగనాథ రామచంద్రరావు

MALAAN
A novel written in Kannada by -
Prof. N. Shanthanaik

Telugu Translation by
Ranganatha Ramachandra Rao

మొదటి ముద్రణ : 2023

ISBN : 978-81-962450-0-9

Rs. 360/-

Printing : Printone Digital Bangalore

Published By : Vislavath Lalunayak Memorial
Knowledge Center
H. No. 2-17-76/2/11/2
Road No. 8 Raghavendra Nagar,
Kalyanpuri Uppal, Hyderabad - 039
9492531789
Email : raju@vlmemorial.com

విషయసూచిక

నా మాటగా ...!

యస్తు సంచరతే దేశాన్ యస్తు సేవేత పండితాన్
తస్య విస్తారితా బుద్ధిస్తైలబిందురివాంబసి

ఎవరైతే వివిధ దేశాలలో (ప్రదేశాలలో) పర్యటిస్తూ మరియు చాలామంది పండితులను కలుసుకుంటూ ఉంటారో అతని బుద్ధి నీటిలో పడిన నూనె బిందువు వలే విస్తరిస్తుంది. ఈ శ్లోకం మలాణ్ (ప్రయాణం) అనే చారిత్రక నవలలో అక్షర సత్యం. ఎందుకంటే చౌహాన్‌లను మాత్రమే సమర్థించే జంగినాయక్ మరియు భగన్య నాయక్‌లతో ప్రారంభమైన గబంజారాల బ్రతుకు జీవన ప్రయాణం అదే వంశానికి చెందిన సూర్య నాయక్ వరకూ విస్తరించి, ఎన్నో గుణపాఠాలను నేర్చుకుంటూ సాగింది.

మనిషి నిరంతరాన్వేషి. జీవన పోరాటంలో భాగంగా అనేక సత్యాలు ఆకళింపు చేసుకుంటూ ఉంటాడు. తనకు అర్థమైనంత వరకూ నేర్చుకున్న కొత్త విషయాలనుతనకు కావలసినదైనందిన అవసరాలను తీర్చుకుంటానికి వాడుకుంటూ ఉంటాడు. తన మనుగడకు కావలసిన వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటూ భావతరాలకు పూలబాటలు వేసే ప్రయత్నంలో మునిగిపోతుంటాడు. ఈ పరంపరలో నిస్వార్థంతో ఉండేవాడు తనవారి కోసం తను నమ్మిని సిద్ధాంతాల కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడడు. ఈ మాటలకు ఒక చక్కని ఉదాహరణ పంతలు భుక్యా కరమ్ తోట్ మరియు ఆయన కొడుకు మీటుభుక్యా కరమ్ తోట్. తన తండ్రి ఆశయాల్ని ప్రతి పనిలో ప్రతిఫలింపచేస్తూనే తన సామర్థ్యాన్ని మరియు వ్యక్తిత్వాన్ని ప్రశ్నించే సందర్భంలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు మీటు భుక్యా కరమ్ తోట్. రాజస్థాన్‌లోని బంకారగఢ్

నుంచి వంద కిలోమీటర్ల దూరంలోని సంకెబాక్రి తండాలో నివసిస్తున్న మీటుభుక్యా ప్రశంసించదగిన సామర్థ్యంతో రాథోడ్లను వ్యతిరేకించే భంగి, జంగిలాంటి కరడుకట్టిన ఛాందసులను కూడా తనవైపుకు తిప్పుకునేలా చేశఅదు. అంతేకాదు మీటుభుక్యాకు సాక్షాత్తు తన కూతురు లచ్మిని ఇచ్చి పెళ్ళిచేశాడు భంగి.

ఢిల్లీ సుల్తాను ఔరంగజేబు పరిపాలిస్తున్న కాలం అది. 'ఢిల్లీలో ఉన్న పెద్ద వ్యాపారస్థుడు లక్కిసా బంజార దగ్గరున్న ఎడ్లు సగం ఢిల్లీని ఆక్రమించేటంతగా ఉ న్నాయి. లక్కిసా ఢిల్లీ బాద్‌షాకు అత్యంత ఆత్మీయుడుగా ఉండేవాడు. అయితే చాలామంది బంజారాలు ముస్లీముల హింసను భరించలేక చెల్లాచెదరైపోయారు. ఢిల్లీ సుల్తానులకు బంజారాలు దక్షిణ ప్రాంతాలకు దారి చూపించడానికి, వారి సైనికులకు ఆహార వ్యవస్థల ఏర్పాటు చేయడానికి ఎంతో అవసరం. ఆ కారణంగా సుల్లానుకు పెద్ద వ్యాపారస్థుడైన లక్కిసా బంజార, భీమజి బహద్దూరు, లక్క వడత్యా, భంగి-జంగి సోదరులు అత్యంత ముఖ్యంగా కావలసి వచ్చారు'.

ఆసిఫ్‌ఖాన్ వంటి సామ్రాజ్యవాదులు దక్షిణ ప్రాంతానికి రాజ్యాన్ని విస్తరించాలనే ఆశతో సాహస ప్రయాణం మొదలుపెట్టి, నిజమైన వీరుడైన మీటుభుక్యా కరమ్ తోట్ సహాయంతో హైదరాబాద్‌లో తన సంస్థానాన్ని సుస్థాపితం చేశఅదు. ఆసిఫ్ ఖాన్ అల్లుడు లతీఫ్ ఖాన్ మళ్ళీ ముందుకు రావాలని, తన మావను చంపి , హైదరాబాద్‌కు బాద్‌షా కావాలని కనిన కలల్ని త ప్రాణాలను లెక్కచేయకుండా మ్ము చేసి, చివరకు వీరస్వర్గం పొందాడు మీటుభుక్యా కరమ్ తోట్.

అప్పటి వరకూ, ఉన్న ఎద్దులతో వ్యాపారం చేస్తూ, అడవిలోని ఫలసాయాన్ని అమ్మి, సాయంత్రం కాసుకున్న సారాయి త్రాగి, మాంసాన్ని తింటూ, హాయిగా జీవనం సాగించారు బంజారాలు. ఆనాటి కాలంలో సమాజంలో వేళ్ళూనికొని ఉ న్న సతీసహగమనం అనే మూఢాచారాన్ని పాటిస్తూనే, దానిలో కూడా భక్తి విశ్వాసాలను చూసిన బంజారాలు నిజంగానే పొగడదగినవారు. ఒక ప్రక్కన ముస్లీం పాలకుల నుండి తమ స్త్రీలను రక్షించుకుంటూ, మరొక ప్రక్కన కాయకష్టం చేస్తూ జీవనం సాగించారు బంజారాలు. కానీ తెల్లవాడి రాకతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. 'మన దేశంలో వ్యాపారం కోసం కాలు పెట్టివారు ఇక్కడే ఉండాలనే అభిప్రాయంతో వచ్చినట్టు తెలుస్తోంది. వామనుడు బలిచక్రవర్తిని మూడవపాదం పెట్టడానికి స్థలం అడిగినట్టే తెల్లవాళ్లు వ్యాపారం పేరిట బలిని వామనుడు తొక్కినట్లు వీళ్లు బెంగాల్‌ను తమ స్వాధీనంలోకి తీసుకుని పాలించడం ప్రారంభించారు'. నేల తల్లిని నమ్ముకుని, కొండగుట్టల చుట్టూ ఎండనకా, వాననకా

తిరిగి జీవన పోరాటం చేస్తున్న బంజారాలకు బ్రిటిష్‌వారి రాక బ్రతుకును ఛిద్రం చేసింది. తెల్లవాడి మీద తిరగబే క్రమంలో ఎంతోమంది బంఝారాలు అసువులు బాశారు. ఈ పరంపరలోనే సోమ్లు, చోక్ల, మంగ్ల్యామ, చాప్ల వంటి బంజారా వీరులు ప్రాణాలను కోల్పోయారు. ధనసింగ్‌లాంటి వారు కొద్దో గొప్పో నిలబడగలిగినా వారికి కూడా అస్థిత్వం లేకుండా చేశఅరు తెల్లవాళ్ళక సహాయం చేసే మనవాళ్ళు.

భగత్ సింగ్, రాజగురువు, సుఖదేవ మొదలైన యువకులను ఉరితీయడంతో భారతస్వాతంత్ర్య పోరాటం విశ్వరూపం దాల్చింది. ఒక ప్రక్కన కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో నివసిస్తున్న గౌడ, కరణాల అకృత్యాలు మరియు మరొక ప్రక్క రజాకార్ల ఆగడాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ పరంపరలో ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ తన జాతి మనుగడకోసం మహాత్మా గాంధి శాంతి పోరాటం వైపుకు నడిచి కూడ్లిగి అందానప్ప వంటివారి మార్గాన్ని అనుసరించాడు. అంతర్గత కుమ్ములాటలతో, స్వార్థబుద్ధితో తమ జాతి వినాశనాన్ని కూడా లెక్కచేయకుండా కొందరు స్వార్థపరులు పన్నిన పన్నాగంలో చిక్కుకొని తమజాతి అస్థిత్వాన్నే ప్రశ్నించే స్థాయికి చేరుకున్న తరుణంలో చివరికి భగన్య నాయక్ కుమారుడు సూర్యనాయక్ ఎంతో కొంత విద్యను ఆకళింపు చేసుకొని, బ్రతుకుతెరువుకు చిన్న ఉద్యోగంలో చేరాడు,. కమ్యూనికేషన్ విప్లవం ప్రారంభమైన రోజుల్లో సూర్యనాయక్ మొదటి తరానికి చెందిన అత్యంత అధికంగా చదువుకున్న విద్యావంతుడు.

రచయిత డా. శాంత నాయక్‌గారు ఈ నవలలో త్రిపాత్రనూ కళ్ళకు కట్టినట్టు చూపిస్తూనే , ఒకనాటి సమాజపు లోతుల్లోకి పాఠకుడిని తొంగిచూసేలా చేశఅరు. వివిధ చారిత్రక నేపథ్యాలను వివరిస్తూనే సమసమాజవ్యవస్థలో తమ జాతి ఔనత్యాన్ని చాటి చెప్పారు అనడం సత్యదూరం కాదు. ఆయా సందర్భాల్లో సమాజపోకడలను వివరిస్తూనే బాధ్యతకల సగటు మనిషి చేయవసిన కర్తవ్యాన్ని కూడా ఉపదేశించారు. కొన్ని కొన్ని సందర్భాలలో తన అభిప్రాయాన్ని వాస్తవక దృకృథంతో చెప్పడానికి వెనుకాడలేదు రచయిత డా. శాంతనాయక్. 'అనుభవం మనిషిని గట్టిపరుస్తుంది. మీ అభిప్రాయాలను బలపరుస్తుందని అనడానికి సూర్యనాయక్ జీవితమే ఒక ఉదాహరణ. ఎన్ని ఉలి దెబ్బలు తిన్నాడు. ఈ పాడు సమాజంలో మంచివాడుగా, నిజాయితీపరుడుగా ఉండటం ఎంత అపాయమో అతనికి విశ్వవిద్యాలయంలో ఉన్న రోజులలో, ఆకాశవాణిలో పనిచేస్తున్న సమయంలో తెలుసుకున్నాడు. కాకా పట్టేవారికి, చంచాగిరి చేసేవారికి,

తార్పుడుగాళ్లకు, బ్యాగులు మోసేవారికి, ఇక్కడి నుంచి ఫోన్‌లో రికార్డు చేసుకునిపోయి చూపించేవారికి మాత్రమే అన్నీ సాధ్యం. అలాంటివారిదే ప్రపంచం. సత్యాని-నిజాయితీకి విలువ లేదు...' రచయితను రంగరించిన అనువాదకులు శ్రీ రంగనాథ రామచంద్రరావుగారు చక్కని భాషను ఆయా సందర్భాలలో ప్రయోగించి, ఇది అనువాదం కాదు అనే సత్యాన్ని నిరూపించారు.

ఇటువంటి మరెన్నో రచనలు డా. శాంత నాయక్ గారి కలం నుండి జాలువారాలని ఆశిస్తూ...

ఢిల్లీ — మీ శ్రేయోభిలాషి

ది. 02.10. 2021 — డా.కె. శ్రీనివాసరావు

అంకితం

మాతృ హృదయపు
మమత కలిగిన అందరికి

1. సాహస ప్రయాణం

అడవిలో అల్లకల్లోలం చెలరేగింది. ఆ చప్పుడుకు అడవి జంతువులు అదిరిపడ్డాయి. పదివేల కోడెలు వీపుమీద మోసుకున్న మూటలతోపాటు దిక్కుతోచనట్టు, గాలితో పోటీపడుతూ వేగంగా పరుగులుతీశాయి. ఆ సంఘటనకు జంగినాయక్, భగన్యనాయక్‌లు గాభరాపడ్డారు. శత్రవులు ఎవరైనా దాడిచేశారేమోనని ఒక్క క్షణం అనుమానపడ్డారు. అయితే ఢిల్లీ సుల్తాన్ ఔరంగజేబుకు వ్యతిరేకంగా యుద్ధం చేయగల శక్తివంతులు భరతఖండంలోనే లేనప్పుడు; అంతేకాకుండా యముడినే సవాలు చేయగలిగే మరణాన్ని శాసించే ఆసిఫ్ అలిఖాన్‌లాంటి వీరుడు దక్షిణ భారత ప్రాంతాన్ని లొంగదీసుకోవటానికి బయలుదేరిన సందర్భంలో అతని ఎదుట నిలబడగలిగే గుండె ధైర్యం ఏ రాజుకు ఉంటుంది? అయితే ధాన్యం మూటలను మోసుకున్న పదివేల పశువులు దిక్కు తోచనట్టు పరుగుతీయటం మాత్రం నిజం! ఆ పశువుల వెనుక గుర్రంమీద వస్తున్న జంగినాయక్‌కు కోడెలు ఎందుకో బెదిరాయనే వార్త కేళుభగత్ చేరవేశాడు. ఆ వంశపు కోడెలు బెదరటం అసాధ్యం. ఆ దట్టమైన కారడవిలో ఓ పెద్దపులి గర్జనకు బెదరాలి లేదా ఎవరైనా శత్రువులు దాడి చేసివుండాలి. జంగికి ఏమి చేయాలో తోచక సోదరుడి కోసం చూశాడు. అతని సోదరుడు భగన్యనాయక్ ఆసిఫ్‌ఖాన్‌తో ఏదో మాట్లాడుతూ కొద్ది దూరంలో వస్తున్నాడు. తన సోదరుడికి తప్పనిసరిగా వార్త చేరవేయవలసి వచ్చింది. భగన్యనాయక్ ఆసిఫ్‌ఖాన్‌సాహెబ్ నుంచి వీడ్కోలు తీసుకుని, కోడెలు వేగంగా పరుగుతీస్తున్న వైపుకు వచ్చాడు. గుర్రం దిగి "హేయ్... హేయ్" అంటూ వాటిని ఆపడం కోసం విఫల ప్రయత్నం చేశాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. హఠాత్తుగా కొవ్వుపట్టిన

కోడె ఒకటి భంగి (భగన్యనాయక్) వైపు దూసుకొచ్చింది. ఇక కొమ్ములతో పొట్టచీల్చి పైకి లేపుతుందని అనుకున్నారు. అంతలో మీటుభుక్యా కరమతోట్ భంగిని అవలీలగా రెండు చేతులతో పైకెత్తి పక్కన నిలబెట్టి, మీదికి వచ్చిన కోడె కొమ్మును పట్టుకుని మెలితిప్పి నేలకు దొర్లించాడు. అంతే కాదు. కోడెలకన్నా వేగంగా ముందుకు పరుగెత్తి పరుగులు తీస్తున్న కోడెలను ఆపటంలో విజయం సాధించాడు.

భంగికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఎందుకంటే, అతను ఢిల్లీ సుల్తాను హుకూం మేరకు దక్షిణం వైపు బయలుదేరి రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి రెండువందల మైళ్ల దూరంలోని బంజారగఢ్‌కు వెళ్లాడు. అక్కడ వయసు కుర్రవాళ్ల ఓ దండును ఏర్పరచటం కోసం యువకులను ఎంపిక చేయటానికి సిద్ధమయ్యాడు. అప్పుడు అతను ఆ దండులో తన జాతి కుర్రవాళ్లను చేర్చుకోవటంలో పక్షపాతం వహించేవాడు. ఒక్క రాథోడ్‌ను కూడా ఎంపిక చేసుకోక చౌహాన్‌లను మాత్రమే ఎంపిక చేసుకునేవాడు. మొదటి నుంచీ వాళ్లనే నమ్ముకుంటూ వచ్చాడు. ఆ సమయంలోనే జూనాగఢ్ నుంచి వలస వచ్చి బంజారగఢ్‌లో స్థిరపడటానికి పంతలు భుక్యా కరమ్‌తోట్ సతమతమవుతున్నాడు. యుక్తవయస్సులో ఉన్న తన కుమారుడు మీటు భుక్యా కరమ్‌తోట్ ఎవరి సైన్యంలోనైనా చేరాలని లేదా బంజారగఢ్‌లోని ధనవంతులైన వ్యాపారులు జంగినాయక్, భగన్యనాయక్ సోదరుల ఆశ్రయంలో వ్యాపారవ్యవహారాలు నేర్చుకోవాలని ఆశించేవాడు. అయితే కేవలం తమ సముదాయం వారినే నమ్ముకున్న సోదరులిద్దరూ ఏ రాథోడ్‌నూ ఉద్యోగంలోకి తీసుకునే ప్రయత్నం చేయలేదు. రాథోడ్ సముదాయంలో దష్టపుష్టంగా ఉన్న పైల్వానుల్లాంటి యువకులు ఉండేవారు. చౌహాన్ సముదాయం మీద ఉన్న దురభిమానంతో జంగి, భంగి గుడ్డివాళ్లయ్యారు. పేదరికపు బాధలు భరించలేని పంతలు భుక్యా కరమ్‌తోట్ వయస్సులో వున్న వందమందిని నేలకూల్చే బలమున్న తన కొడుకు మీటుభుక్యా కరమ్‌తోట్‌తో అవసరమైతే అబద్ధం చెప్పి జంగి, భంగి సోదరుల దగ్గర ఉద్యోగం సంపాదించుకోమని సలహా ఇచ్చాడు. “నాయనా, మనం ఎల్లప్పుడూ సత్యమే చెప్పి బతకలేం. జంగి, భంగి సోదరులతో నువ్వు చౌహానులమని అబద్ధం చెప్పు. ఆ పైన దేవుడు ఉన్నాడు” అని పంతలు నిస్సహాయంగా అన్నాడు. బంజారగఢ్ నుంచి వందకిలో మీటర్ల దూరంలోని సంకెబాక్రి తాండాలో నివసిస్తున్న ఆ కుటుంబం చిన్నాచితకా వ్యాపారం చేస్తూ బతుకుతూ ఉండేది. రాను రాను జీవనం సాగించడం దుర్భరం కావటంతో ముగ్గురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు కలిగిన ఉమ్మడి కుటుంబంతో పంతలు భుక్యా కరమ్‌తోట్ వలస వచ్చాడు. అతని సంతానంలో

అందరిలోకి పెద్దవాడు మీటు. అతని తరువాత పుట్టిన కుబా పుట్టుకతోనే వికలాంగుడు. మూడవవాడు మీటును మించిన బలవంతుడు థావు. తండ్రికి చేదోడుగా ఉంటూ సహాయపడేవాడు. మగపిల్లల తర్వాత పుట్టిన ఇద్దరు కూతుళ్లు అందమైన అమ్మాయిలు. ఆ అమ్మాయిలు పెరిగి పెద్దయి వయసుకు రావటమే తండ్రి విచారానికి పెద్ద కారణమైంది. ఎవరైనా చౌహాన్ సముదాయంలోని కుర్రవాళ్లు అంగీకరిస్తే కూతుళ్లను ఇచ్చి పెళ్లి చేయాలనే ఆలోచనతో పంతలు ఉండేవాడు. అయితే తగిన సంబంధం దొరకని కారణంగా వాళ్లు పెళ్లికాకుండానే ఉండిపోయారు. ఆ అక్కాపగటిపూట బయటికి రాకుండా, రాత్రిపూట మాత్రం ఒకింత బయటి స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవటానికి బయటికి వచ్చేవారు. తమ పాడు తలరాతలకు లోలోపల కుమిలిపోయేవారు. వాళ్లే రూప్లి, పారులు. పగలు ఆడపిల్లలు బయటికి వస్తే ముస్లిం యువకులు ఎత్తుకునిపోయి నిఖా చేసుకునేవారు. ఢిల్లీ సుల్తానుల ఉత్తర్వులే ఇలా ఉన్నప్పుడు ఏ బంజారా అయినా ఏమి చేయగలదు? పంతలు భుక్యా కరమ్‌తోట్ తన కొడుకులను తన ఇద్దరు కూతుళ్ల రక్షణ కోసమే బలంలో ఏనుగులా, పరాక్రమంలో పులిలా సాకాడు. ఆ ఇద్దరు సోదరులు తమ చెల్లెళ్లను ముస్లిములెవరైనా తాకితే వాళ్లయినా శవాలు కావాలి లేదా తామైనా శవాలు కావాలని శపథం చేశారు. అందువల్లనే దీపావళి రోజున చెల్లెళ్లు దీపాలు తీసుకుని తాండ నాయకుడి ఇంటికి వెళుతుండగా దూరం నుంచే వారిని అనుసరిస్తూ పరిస్థితులను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించేవారు.

ఒక దీపావళి రోజున మరియమ్మ దేవత ముందు నత్యం చేస్తున్న అతని చెల్లెలు రూప్లిని ఎత్తుకొని పోవాలని పీరంపుర నుంచి పదిమంది ముస్లిం యువకులు పూర్తిగా సిద్ధమై గుర్రాలపై వచ్చారు. వాళ్లు లంబాడి యువకుల్లా వేషం వేసుకొని వచ్చారు. వాళ్లను చూడగానే మీటుకు అనుమానం కలిగింది. అలాంటి యువకులను చుట్టుపక్కల లంబాడీ తాండాల్లో అతను ఎన్నడూ చూడలేదు. మీటు వెంటనే తమ్ముడు థావుతో "భాయి ఈ యువకులను ఏదైనా తాండాలో చూసావా?" అని అడిగాడు. దానికి జవాబుగా "భయ్యా! నాకు గుర్తున్నంతవరకూ ఇలాంటి ముఖాలను ఏ తాండాలలోనూ చూడలేదు. అంతేకాదు ఈ ముఖాలు బంజారా కుర్రవాళ్లను పోలటం లేదు. ఏదో ప్రమాదం పొంచి ఉన్నట్టుంది. చూద్దాం. నేను కనుక్కుంటాను" అని అతను పదిమంది ఉన్న గుంపువైపు కదిలాడు. తమ వైపు వస్తున్న మీటును చూడగానే వాళ్లకూ అనుమానం వచ్చింది. అయితే వాళ్లు పూర్తిగా సిద్ధమై వచ్చివుండటం వల్ల ధైర్యంగా ఉన్నారు. బంజారా అమ్మాయిలు బయటికి రావడం దీపావళి

రోజున మాత్రమే. అందువల్లనే గత దీపావళిలో బాపు భుక్యా, రాంగూ భుక్యాల ఇద్దరు అమ్మాయిలను ఎత్తుకుపోయారు. ఇప్పుడు వాళ్లు అటు ముస్లిములు కాకుండా, ఇటు బంజారాలు కాకుండా పోయారు. అపహరించబడిన అమ్మాయిలందరూ తమ జీవితాల గురించి జుగుప్స పడుతున్నారు. ఎందుకంటే అలా అపహరించబడిన ఆడవాళ్లంతా పెళ్లయి పిల్లలున్నవారే. వీళ్లను దౌర్జన్యంగా తీసుకునిపోయిన ఆ దుర్మార్గుల హింసలు భరించలేక కొందరు చనిపోయారు.

ఇక బంజారాలలో కొందరు దక్షిణంవైపు వెళుతున్న వ్యాపారులైన బంజారాల వెనక సేవకులుగా వెళ్లిపోయారు. రాజస్థాన్ అంతటా ఉన్న బంజారాలంతా గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని అడవుల్లో చేరుకొని తమ పశువులను మేపుకుంటూ, చిన్నాచితకవ్యాపారాలను చేసుకుంటూ బతకసాగారు. మిగిలిన కొందరు ముస్లీములకు విధేయులుగా బతుకసాగారు. ఢిల్లీలో ఉన్న పెద్ద వ్యాపారస్థుడు లక్కిసా బంజార దగ్గరున్న ఎడ్లు సగం ఢిల్లీని ఆక్రమించేటంతగా ఉన్నాయి. లక్కిసా ఢిల్లీ బాద్‌షాకు అత్యంత ఆత్మీయుడుగా ఉండేవాడు. అయితే చాలామంది బంజారాలు ముస్లీముల హింసను భరించలేక చెల్లాచెదరైపోయారు. ఢిల్లీ సుల్తానులకు బంజారాలు దక్షిణ ప్రాంతాలకు దారి చూపించడానికి, వారి సైనికులకు ఆహార వ్యవస్థల ఏర్పాటు చేయడానికి ఎంతో అవసరం. ఆ కారణంగా సుల్తానుకు పెద్ద వ్యాపారస్థుడైన లక్కిసా బంజార, భీమజి బహద్దూరు, లక్క వడత్యా, భంగి-జంగి సోదరులు అత్యంత ముఖ్యంగా కావలసి వచ్చారు. మీటు భుక్యా చెల్లెలు రూప్లి సౌందర్యం గురించి చుట్టుపక్కల చర్చ కావడంవల్లనే ముస్లిం సముదాయానికి చెందిన పదిమంది ఆమెను అపహరించుకుని పోవటానికి పట్టుబట్టి వచ్చారు. అమ్మాయిలు తమ పాటికి తాము నృత్యం చేస్తూవుంటే, జలీల్, ఖురేషిలు తమ ఎప్పటి ఆటను ప్రారంభించారు. వాళ్లు విసిరిన గాలంలో రూప్లి పడలేదు. పైగా ఆమె సోదరుడు మీటు ఉండటం చూసి వాళ్లకు ఒక్క క్షణం కాళ్లు చేతులు ఆడలేదు. ఏమీ చేయాలో దిక్కుతోచలేదు. అయినా తాము పదిమందిమి ఉన్నామనే ధైర్యంతో అతని మీద దాడి చేశారు.

ఏనుగులా దొరికిన వాటిని దొరికినట్టు ధ్వంసం చేసేలా మీటు ఆ పదిమందిని చేతికి దొరికినవారిని దొరికినట్టు పొడిచిపారేశాడు. అయితే బాద్‌షా సేనాధిపతి జుల్మాన్‌ఖాన్ అనే రాక్షసునికి ఈ విషయం తెలిస్తే, నిప్పుపెట్టి తమ మొత్తం తాండానే కాల్చివేస్తాడని ఊహించిన పంతలు భుక్యా కుటుంబం సంకెబాక్రి తాండాను రాత్రికి రాత్రే వదిలారు. జైపూర్ దగ్గర జంగి, భంగిలు వ్యాపారం రక్షణ నిమిత్తం, తమ

వ్యక్తిగత సైన్యం కోసం యువకులను ఎంపిక చేస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్లారు. ప్రస్తుత పరిస్థితులలో తాము ఏ సముదాయానికి చెందినవారో దాచిపెట్టక వారికి మరోదారి కనిపించలేదు. అందువల్లనే పంతలు భుక్యా కరమ్‌తోట్ అవసరమైయే అబద్ధం చెప్పి జంగి, భంగిల దగ్గర ఉద్యోగంలో చేరుకొమ్మని తన కుమారులిద్దరిని ఒత్తిడి పెట్టాడు. ఆ కారణంగా మీటు సోదరులు చౌహాన్ గోత్రీకులమని అబద్ధం చెప్పి అక్కడ చేరుకున్నారు.

భంగి తాను బతికే ఉన్నాడని నమ్మకం కలగలేదు. వయసులో ఉన్న పదివేలు కోడెలు తన మీదికి దూసుకుని వచ్చి ఎముకలను పొడిపొడి చేసివుండొచ్చని అనుకున్నాడు. అయితే ఆ సయమంలో దేవుడిలాగా వచ్చిన మీటుభుక్యా కరంతోట్ అతన్ని అవలీలగా ఎత్తుకుని పక్కన నిలబెట్టి, వేగంగా పరుగెత్తుతున్న పదివేల ఎద్దులను ఒక్క ఘడియలో నియంత్రించాడు. 'చోరమే తాకత్ ఛ' అని జంగి గొణుక్కున్నాడు. తనను రక్షించినవాడు ఒకవేళ భుక్యా అయివుంటే అతనికి తన ఒక్కగానొక్క కూతురు సోమ్లిని ఇచ్చి పెళ్లి చేసివుండేవాడని మనసులో అనుకున్నాడు. అయితే అతను తమ సముదాయానికి చెందినవాడు కాదని అనుకున్న అతని మనసు బాధతో మూల్గింది.

అప్పటికే చీకటి పడుతుండటం వల్ల భయంకరమైన అడవిలో ప్రవేశించడం సురక్షితం కాదని, అక్కడే అడవిలోనే బస చేయడానికి ఏర్పాట్లు చేయమని ఆసిఫ్ ఖాన్ ఉత్తర్వులు ఇచ్చాడు. అలాగే ఆసిఫ్ ఖాన్ తన ఆప్తమిత్రుడు భంగిని పిలుచుకొని రమ్మని సైనికుడిని పంపాడు. "జనాబ్ భంగినాయక్, హుజూర్ ఆసిఫ్‌ఖాన్ మిమ్మల్ని పిలుచుకుని రమ్మన్నారు" అని సైనికుడు తన కర్తవ్యాన్ని నిర్వహించాడు. భగన్యనాయక్ జరిగిన సంఘటనవల్ల ఏర్పడిన దిగ్భ్రాంతి నుంచి ఇంకా బయటపడలేదు. ఒకవైపు అయితే అతడి నిద్రను పోగొట్టిన ఆ సంఘటనలో మునిగివున్న అతడిని మరోసారి సైనికుడు హెచ్చరించాడు. అధికారపు అత్యున్నత స్థాయిలోవున్న ఆసిఫ్‌ఖాన్‌లాంటి మిత్రుడు, మరోవైపు పెద్ద వ్యాపార వ్యవహారాలు. నాయకుని ఆజ్ఞను మీరలేక, మీటు జ్ఞాపకం నుంచి బయటికి రాలేక కొద్దిసేపు సతమతమయ్యాడు. ఆ సంఘటన జరిగినపుడు అప్పటికే చీకటి పడింది. అందువల్లనే ఆ వ్యక్తి ఆకృతి స్పష్టంగా గోచరించలేదు. మీటు అతడిని అవలీలగా ఎత్తుకోవడం వల్ల నూనూగు మీసాల, మెరిసే కళ్ల అందమైన మగవాడి బలమైనదేహాన్ని గుర్తించాడు. ఆ సమయంలో అతనికి కృతజ్ఞతలు కూడా చెప్పలేని స్థితిలో ఉండిపోయాడు.

ఆసిఫ్‌ఖాన్ ఉదాసీనంగా ఉన్న ప్రతి సాయంత్రం మిత్రులిద్దరూ సురపానం

మత్తులో ప్రాంతీయ విషయాలను చర్చిస్తూ ప్రయాణపు అలసటను తీర్చుకునేవారు. ఆసిఫ్‌ఖాన్ ఒక్కోసారి తాగినమత్తులో బాదుషా దౌర్బల్యాలనంతా భగన్యనాయక్ ముందు చెప్పేవాడు. ఒక్కోసారి ప్రయాణంలో ఆ సంఘటనలు వర్ణిస్తూ దట్టమైన అడవిలో వేలాది మైళ్ల దూరం అధిగమించేవారు. అడవి జంతువులను, ఏనుగులను, విషప్రాణులను లెక్కించకుండా బాదుషా ఆకాంక్షలను తీర్చడానికి ఆసిఫ్‌ఖాన్ చేబట్టిన దండయాత్రలలో భగన్యనాయక్, జంగినాయక్ సోదరులు కూడా సమానంగా పాల్గొన్నారు.

"ఎందుకో ఉదాసీనంగా ఉన్నట్టు దిక్రా హై భగన్యనాయక్. క్యా బాత్ హై" అని ఆసిఫ్‌ఖాన్ అడిగాడు.

భగన్యనాయక్‌కు జరిగిన సంఘటన వివరించే ఆసక్తి లేకపోవటం వల్ల "మనిషన్న తరువాత ఇవన్నీ సహజమే హుజూర్" అని తప్పించుకోవటానికి ప్రయత్నించాడు.

"అరే, ఢిల్లీ సుల్తాను సేనాధిపతి ఆసిఫ్‌ఖాన్‌లాంటి స్నేహితుడు నీకు తోడుగా ఉన్నప్పుడు నిన్ను ఏ విచారం బాధిస్తోంది మిత్రమా ! చెప్పు, ఎవరైనా ఏమైనా అన్నారా? వారి కథ ఇప్పటికిప్పుడే ముగిస్తాను" అన్నాడు కోపంగా.

భగన్యనాయక్‌కు అతని ప్రవర్తన తెలిసివుండటం వల్ల, "ఛ, మీరు నాకు తోడుగా ఉండగా ఈ హిందూస్థాన్‌లో నన్ను ఏదైనా అనే ధైర్యం ఎవరికి వుంటుంది? చెప్పటానికి ఏమీ లేదు. ఎందుకో మనస్సు బాగులేదు" అని ముఖం పక్కకు తిప్పుకుని నిజాన్ని మరుగుపరిచాడు.

"అంతేకదా, నీ ఉదాసీనతను ఇప్పుడే పోగొడతాను" అని చప్పట్లు కొట్టాడు. మరుక్షణం ఓ సైనికుడు లోపలికి తల వంచుకుని వచ్చి, "హుజూర్ ఆజ్ఞ ఏమిటి?" అన్నాడు.

"నర్తకి మున్నీబాయిని హాజారు పరుచు" అన్నాడు ఆసిఫ్‌ఖాన్.

"ఆజ్ఞ హుజూర్" అని సైనికుడు బయటికి నడిచాడు.

సైనికుడు అటు వెళ్లగానే పర్షియా నుంచి తెప్పించిన మద్యాన్ని వెండి లోటాలో పోసి భంగి ముందు పెట్టి, తనూ ఒక లోటాలో పోసుకుని వెండిలోటాను పెదవులకు తాకించి ఒక్క గుటక వేశాడు.

"హుజూర్, లోపలికి రావచ్చా?" మున్నీబాయి బయటి నుంచే అడిగింది.

"ఓ మున్నీబాయి, నీకు ఎవరి అనుమతి అవసరం లేదు. మా తలుపులు సదా నీ సౌందర్యాన్ని, నృత్యాన్ని ఆస్వాదించటానికే తెరిచేవుంటాయి" అన్నాడు

ఆసిఫ్‌ఖాన్.

తన సౌందర్యాన్ని అతను కళ్లతోటే గ్రోలుతుండటం అర్థమై గులాబీలవంటి పెదవులను విప్పార్చి ఒకసారి చిరునవ్వు నవ్విన మున్నీబాయి చూపులతోటే ఆసిఫ్ ఖాన్‌ను గుచ్చసాగింది. రాత్రి చాలాసేపటి వరకు ఆసిఫ్‌ఖాన్ గుడారంలో భంగి, ఆసఫ్‌ఖాన్‌లు మున్నీబాయి నృత్యాన్ని చూస్తూ సరసాలాడసాగారు. అలాగే నిద్రలోకి జారుకున్నారు. మెలుకువ వచ్చేసరికి సూర్యుడు ఎప్పటిలాగే తూర్పున ఉదయించాడు.

భంగిని ఆ సంఘటన వెంటాడుతున్నట్టు అనిపించింది. అయితే ఆ అందమైన యువకుడి ముఖం మాత్రం పదే పదే అతని కళ్ల ముందుకు వచ్చి నిలుచునేది. ఆసిఫ్‌ఖాన్‌తో ఫలహారం తీసుకున్న తరువాత దట్టమైన అడవిని దాటడానికి సైన్యానికి ఉత్తర్వులు ఇచ్చి, తన పశువులమందను చూసుకుని రావడం కోసం ఆసిఫ్ ఖాన్ నుంచి అనుమతి పొంది భంగి అక్కడి నుంచి బయలుదేరాడు. అతని మనసును ఆ యువకుడి ముఖం ఆక్రమించుకుంది.

సాధారణంగా కోడెలమీద బరువులు మోపడం జరుగుతుంది. వందమంది యువకులు విరామం లేకుండా కోడెల శక్తిసామర్థ్యాలను గుర్తించి అందుకు తగినట్టు వాటి వీపులమీద మూటలను మోపుతున్నారు. అప్పటికే బాగా తెల్లవారింది. ఒక వైపు నుంచి పనిచేస్తున్న యువకుల ముఖాలను పరీక్షిస్తూ భంగి నడుస్తున్నాడు. థావు దగ్గరికి రాగానే అనుమానంతో అతనివైపు చూడసాగాడు. అది గమనించి గాభరాపడ్డ థావు భంగి దృష్టి నుంచి తప్పించుకోవాలని కోడెల వెనుక దాక్కోవటానికి ప్రయత్నించాడు.

“ఏయ్, బయటికి రా” అని భంగి అతన్ని పిలిచాడు.

థావుకు తన కథ ముగిసిందని అనిపించింది. భంగికి తాను రాథోడ్ సముదాయానికి చెందినవాడని తెలిసివుండాలి. ముస్లీం దొరలే ఈయన చేతిలో వున్నారు. తనకు ఎలాంటి శిక్ష విధిస్తాడో? తమలాంటి బీదవాళ్లకు విలువ వుంటుందా? తమ గోడును ఎవరు పట్టించుకుంటారని అనుకుంటూనే, “జీ కాకా” అని దగ్గరికి వెళ్లాడు.

“నిన్న సాయంత్రం కోడెలు బెదిరినపుడు...” అని భంగి ఇంకా ఏదో చెప్పబోతుండగానే, “అది నేను కాదు కాకా, మా అన్న మీటు భుక్యా కరమ్‌తోట్” అని కంగారులో నిజం చెప్పి నాలిక్కరుచుకున్నాడు.

ఆ మాటలు వినగానే భంగి కోపం కట్టలు తెచ్చుకుంది. అయినా తన కోపాన్ని నియంత్రించుకుని, “అబద్ధాలు చెప్పి నా దగ్గర పనిలోకి చేరుతారా?”

అంటూ అక్కడి నుంచి పరుగుతీయబోయినవాడి వెంటబడి లాక్కొచ్చాడు. "కాకా అది..." థావుకు తన తప్పు అర్థంకాగానే, దాన్ని ఎలా సరిదిద్దుకోవాలా దేవుడా అని మనస్సులోనే గింజుకున్నాడు.

'ఈ భగన్యనాయక్ జాతి వదిలాడు తప్ప, జాతికుర్రవాళ్లను కాకుండా భుక్యాలను పనిలోకి తీసుకోడు. ఈ వెధవలు తనను ఎలా ఏమార్చారు' అని ఆలోచిస్తూ , "ఎవరక్కడ?" అని కేకవేశాడు.

అదే సమయంలో మీటుభుక్యా కరమ్‌తోట్ వచ్చి ఆయన ఎదుట నిలబడ్డాడు. అదే దృఢకాయుడు, పదివేల కోడెల నుంచి తనను కాపాడినవాడు, జరగబోయే నష్టాన్ని తప్పించినవాడు.

అతడినే చూస్తూ, "ఓ నువ్వేనా మీటుభుక్యా కరమ్‌తోట్." అన్నాడు భంగి.

తన అనుమానం నిజమైనందుకు సంతోషం కలిగింది. అయితే తాను నమ్ముకుంటూ వచ్చిన నియమాలను తోసిపుచ్చటం ఎందుకో సమంజసంగా తోచలేదు.

"చూడూ, నా తమ్ముడు జంగి చాలా కోపిష్టి. అతనికి నిజం తెలిస్తే నీ తల తీయిస్తాడు..." అన్నాడు.

ఒక్క క్షణం అక్కడ మౌనం రాజ్యమేలింది.

"మామసా, ముందుగా ఒక నిజం చెబుతాను. అది విన్న తరువాత మీరే మీ ఖడ్గంతో నా తలను నరకండి" అని అన్నాడు.

మీటు మహాబలశాలి అయినప్పటికీ పరిస్థితుల ఒత్తిడికి అతను నిస్సహాయుడయ్యాడని భంగికి అర్థమైంది. అయినా మూర్ఖుడైన తన తమ్ముడు జంగి ముందు వెనుకలు ఆలోచించడు. అదృష్టవశాత్తు రాథోడ్ తెగకు చెందిన ఈ శూరులు తన చేతికి చిక్కారని మనసులోనే సంతోషపడుతూ–

"చెప్పు, నీ ఇబ్బందులు ఏమిటి?" అని అతని వైపు చూశాడు.

మీటు మౌనాన్ని ఛేదిస్తూ మాటలు ప్రారంభించాడు–"పోయిన దీపావళి మా పాలిట భయంకరంగా మారింది. బంజారాగఢ్ నుంచి ముసల్మాను యువకులు వచ్చి మా అమ్మాయిలను ఎత్తుకుని పోయారు. ఆ విషయం మీకు తెలిసే వుంటుంది. ఈసారి దీపావళి రోజున నా చెల్లెలు రూప్లిని అపహరించటానికి మరియమ్మ గుడి దగ్గర పదిమంది ముసల్మాను యువకుల మాటువేశారు. వారి నుంచి నా చెల్లెలిని రక్షించటం అన్నగా నా కర్తవ్యం..." మీటు మాట్లాడలేక ఒక్క క్షణం ఆగాడు.

భంగి స్తబ్దమయ్యాడు. "ఊఁ తరువాత..." కుతూహలం ఆపుకోలేకపోయాడు.

"ఆ తరువాత ఏముంది? ఆ పదిమంది తలలు నరికి బంజారాగఢ్ రహదారి పక్కన పూడ్చిపెట్టాను. కానీ బాద్‌షా సేనాధిపతి జుల్మాన్‌ఖాన్‌కి విషయం తెలిస్తే ప్రాణాలతో వదలడని అర్థమైంది. బంజారాగఢ్‌లోని సంకెబాక్రి తాండను రాత్రికి రాత్రే వదిలి బయలుదేరాం. అదే సమయంలో దక్షిణం వైపు దండయాత్రకు వెళ్లడానికి మీరు యువకులను ఎంపిక చేస్తున్నారని తెలిసి అక్కడికి వచ్చాం.అయితే అక్కడ మీరు కేవలం చౌహాన్ సముదాయానికి చెందిన యువకులనే ఎంపిక చేస్తుండటం కనిపించింది. దాంతో మా రాథోడ్ కులాన్ని దాచిపెట్టి, చౌహానులమని అబద్ధం చెప్పి మీ దండులో చేరుకున్నాం. మేము చేసింది తప్పయితే ముందుగా మా తలలు నరికి, అటుతరువాత ఇక్కడే గుడారంలో ఉన్న మా తల్లితండ్రులు, మా చెల్లెళ్లను చంపండి" అని మీటు దుఃఖంతో అన్నాడు.

"ఓహో, ఆ వీరుడివి నువ్వా? ఈ వార్త నా వరకూ వచ్చింది. నీ శౌర్యాన్ని పొగడటానికి నా దగ్గర మాటలు లేవు. నువ్వు మా ఆడవాళ్ల మానప్రాణాలు కాపాడిన వీరుడివి. అయినా ఈ నిజాన్ని నా ముందు చెప్పినట్టు ఇతరుల ముందు కూడా చెబుతావా? ఎందుకంటే మనం బతుకుతున్నదే ముస్లీం దొరల పాలనలో. అలాంటప్పుడు..." అంటూ భంగి ఆలోచనలో పడ్డాడు.

కొన్ని నిముషాలు మౌనంగా గడిచాయి.

"మామసా! ఎందుకు మౌనంగా ఉన్నారు? మీకు ఇబ్బంది కలిగేటట్టయితే మేము బంజారాగఢ్‌లోని సంక్రెబాక్రి తాండకు తిరిగి వెళ్లిపోతాం" అని మీటుభుక్యా స్పష్టంగా అన్నాడు.

"ఈ భంగి ఒకసారి మాట ఇస్తే ఆ మాట తప్పడు. ప్రాణాలైనా ఇస్తాను కానీ మాట తప్పను. అందులోనూ నువ్వు మా జనాంగం కోసం పోరాడినవాడివి" అని తన అంతరంగంలోని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

"మామసా, ఈ మాట ఎవరికీ ..." అని థావు అభ్యర్థించాడు.

"మళ్లీ అదే ప్రశ్న. మీరిద్దరూ రెండు విలువైన రత్నాలు. మొత్తం విషయాన్ని మా తమ్ముడు జంగినాయక్‌కు చెబుతాను. అతను మీ కృత్యాన్ని క్షమించేవరకు మీరు ఎవరో అతనికి తెలియకూడదు" అని అతను గుర్రమెక్కి తన గుడారం వైపు పరుగెత్తించాడు.

సోదరులిద్దరూ తమకు కలగబోయే ఆపదను ఇంట్లో తెలపటానికి నిర్ణయించుకుని తమ గుడారం వైపు వేగంగా కదిలారు.

పంతలు భుక్యా కరమ్‌తోట్ తాను వేటాడి తెచ్చిన కుందేలు మాంసాన్ని

చారు కోసం సిద్ధం చేస్తున్నాడు. రాజుగారి సైనికుల నుంచి సారాయి ఇప్పించుకుని రావటానికి తన పెద్దకొడుకు మీటును పంపాలని మనసులో అనుకున్నాడు. అదే సమయంలో ఇద్దరు సోదరులు లోపలికి రావటం కనిపించింది. పంతలు భుక్యా సంతోషంతో "బేటా, నేను నీ గురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు. "ఏం విషయం బాబా, ఏం కావాలి?" అని మీటు గంభీరమయ్యాడు. "అంత ముఖ్యమైన విషయం కాదు బేటా, కుందేలు కొట్టి తెచ్చాను. దీంతోపాటు ఒక ముంత సారాయి వుంటే..." అని రాగం తీశాడు. మీటు తల్లి సామ్కి "రోజంతా ఆ పశువులతో పెనుగులాడి అలసి వచ్చాడు. మళ్లీ ఇప్పుడు ఆ హరామి సైనికుల దగ్గర పళ్లికిలిస్తూ, వాళ్ల అవమానాలను సహిస్తూ, ఎక్కడి నుంచి సారాయి తెస్తాడు. ఉన్నది తిని ఊరికే వుండు..." అని అంది. ఆసిఫ్ఖాన్ సైనికులు అత్యంత క్రూరులు. వారు బెదురుతున్నది కేవలం జంగి-భంగిలకు మాత్రమే. అయితే జంగి-భంగిల దగ్గర పనిచేసే వారికి చిల్లిగవ్వంత విలువ ఇచ్చేవారు కాదు. వాళ్లు కేవలం గులాములు అనే ఆ సైనికులు భావించేవారు. తండ్రి అడగటం ఆలస్యం మీటు, తల్లి మాటల్ని పట్టించుకోకుండా కొద్ది దూరంలో ఉన్న సైనికుల గుడారం వైపు బయలుదేరాడు. మీటు పెద్దపెద్ద అంగలువేస్తూ బయలుదేరాడు. హఠాత్తుగా తనను ఎవరో అనుసరిస్తున్నట్టు అనిపించి వెనుతిరిగి చూశాడు. ఎవరూ కనిపించలేదు. మళ్లీ ముందుకు అడుగులు వేశాడు. ఎవరో అమ్మాయి కాలిగజ్జెల సవ్వడి వినిపించింది. ఎవరో సైనికుల దగ్గరికి వెళు తుండవచ్చని తన పాటికి తాను వేగంగా నడవసాగాడు. నెమ్మదిగా గజ్జెల సవ్వడి దూరమైంది. అతను గుడారం దగ్గరికి చేరుకున్నాడు. మీటు దేహదారుఢ్యం చూసి సైన్యంలోని కొందరు ముస్లిం యువకులు స్నేహితులయ్యారు. వాళ్లల్లో జలాలుద్దీన్ ఒకడు. అతను ఉన్న గుడారం దగ్గరికి వెళ్లి, "జలాల్ భాయి, ఒక ముంత సారాయి దొరుకుతుందా?" అని అడిగాడు. మీటుపట్ల అభిమానం వున్న జలాల్, "అరే, మీకు నక్కో బోల్నేకో హెూతాక్యా, తీసుకో, ఒక ముంత చాలా? ఇంకొకటి కావాలా..." అన్నాడు. "వద్దు భాయ్, ఇంతే చాలు" అని అతనికి ధన్యవాదాలు చెప్పి ముంత తీసుకుని తిరిగి తమ గుడారం వైపు బయలుదేరాడు. మళ్లీ అదే గజ్జె సవ్వడి. ఎవరో అల్లరిపిల్ల చిలిపి చేష్టలు చేస్తుండవచ్చని భావించి వేగంగా నడిచాడు.

పంతలు భుక్యా వేయించిన కుందేలు మాంసం ముక్కలను చూస్తూ, సారాయి రుచిని గుర్తుచేసుకుంటూ నోటిలో ఊరుతున్న లాలాజలాన్ని ఆపుకోలేక ఉమ్మేస్తూ మీటు కోసం ఎదురుచూస్తున్నాడు. సారాముంతతో వచ్చిన కొడుకును చూడగానే "నాకు తెలుసు నీవు వెళితే ఖాళీ చేతులతో రావని" అని మాటలతో మునగచెట్టు

ఎక్కించడానికి చూశాడు. పెనం మీద గోధుమ రొట్టెలు కాల్చుతున్న సామ్కి భర్త మాటలు విని అతనివైపు చూసింది. వెంటనే అతను, "అప్పుడు ఏమో అన్నట్టున్నావు. కొడుకు అలసి వచ్చాడు. ఇప్పుడు ఎక్కడికి పంపిస్తున్నావని అన్నావు..." అని వెక్కిరించాడు. "నేనేమీ సారాయి అడగటం లేదు" అని సామ్కి లేని కోపంతోటే జవాబిచ్చింది. "భాయీజాన్, అమ్మ ముఖం చూడు, నాన్న ఆమెను వదిలి సారాయి తాగేస్తాడని లోలోపల ఎలా గింజుకుంటోందో?" అని రూప్లి మీటుతో అంది. "రూప్లి , నువ్వు వెళ్ళి రొట్టెలు కాల్చు. అమ్మను సారాయి తాగడానికి నాన్న దగ్గరికి పంపుతాను" అని తల్లి మనస్సు గ్రహించి అన్నాడు మీటు. "అలాగే దాదా" అని రూప్లి వెళ్ళి పొయ్యి ముందు కూర్చుంది. సామ్కి, పంతలు చిన్నమట్టిముంతలో సారాయి పోసుకుని ముందుగా నేలమీద ఒక బొట్టు రాల్చి, తర్వాత నాలుగు దిక్కులకు ఒక్కో బొట్టు రాల్చి, సారాయి తాగిన తరువాత, మాంసపు ముక్కల మీద ఉప్పు, కారం చల్లుకుని నోట పెట్టుకున్నారు. దూరంలో కూర్చుని, తల్లితండ్రులిద్దరూ తాగటంలో మునిగివుండటం చూసి మీటు నవ్వసాగాడు. "రేపు నువ్వు పెళ్లిచేసుకున్న తర్వాత నీ భార్యతోనూ ఇలాగే ప్రవర్తిస్థావు, నాకు తెలియదా?" అని థావు వెక్కిరించాడు. 'నోరు' మూసుకో. పెద్దవాళ్లనే గౌరవం లేదా నీవు?" అని ఉట్టిట్టి కోపంతో చేతిలోని కర్రముక్కను తమ్ముడి మీద విసిరాడు మీటు.

అన్నదమ్ములిద్దరు వాదించుకుంటుండగా భగన్యనాయక్ సేవకుడు మోళ చౌహాన్ ఎక్కిన గుర్రం గుడారం ముందుకొచ్చి నిలబడటం తెలియలేదు. గుర్రం దిగిన మోళ, తన యజమానికి కాబోయే అల్లుడైన వీరుడికి గౌరసూచకంగా వారి పద్ధతిలో , "హే రామ్ రామ్" అని అన్నాడు. మీటు క్షణంపాటు కలవరపడినవాడిలా, 'హే రామ్ రామ్ , మోళూ మామా, ఏమిటి విషయం? ఈ సమయంలో వచ్చావు?" అని ఒక్క ఊపిరిలో అడిగాడు. మీటు అబద్ధం చెప్పి ఉద్యోగం సంపాదించుకోవటంలో మోళు చేతివాటమూ ఉండటం వల్ల అతన్ని ప్రేమగా మామా అని మీటు పిలిచేవాడు. "ఆఁ రావాలి కదా, మా యజమాని ప్రాణాలు కాపాడిన బలశాలివి. బంజారా కులం కోసం ఒంటరిగా పోరాడి మన తోబుట్టువుల మానప్రాణాలు కాపాడిన వీరుడికి ఇప్పుడు మరో ప్రమాదం ఎదురుచూస్తోంది" అని గంభీరంగా అన్నాడు. పంతలుకు తాగిన సారాయి మత్తు సర్రున సగం దిగిపోయింది. "అయ్యో దేవుడా, ఏమైంది? అలాంటి విషయం ఏమైనా బాద్‌షాకు తెలిసిందా? అయ్యో, నా కొడుకు శిరచ్ఛేదనం జరిగిపోతుందా?" అని గగ్గోలు పెట్టసాగాడు. అతనికి పరిస్థితి గంభీరంగా మారుతున్నట్టు అనిపించింది. "అయ్యా పంతలు భుక్యా, ఎందుకలా విచారిస్తున్నావు?

నేను కూడా నిజమైన బంజారానే. మీరు అదృష్టవంతులు. మీ కొడుకు గొప్పవాడవుతాడు" అని ముఖం బిగింపును సడలించి నవ్వాడు. "మోళ ఒక్కక్షణం ప్రాణాలు తోడేశావుకదా?" అంటూ మీటు నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు. "అరే, అందరూ చూస్తూ నిలబడ్డారుకదా, బేటీ రూప్లి మిఠాయి తీసుకునిరామ్మా. ముందు మోళ నోరు తీపుచేయాలి. ఏదో శుభవార్త తెచ్చాడు" అని కూతురిని పంతలు పురమాయించాడు. రూప్లి లోపలి నుంచి మిఠాయిలు తెచ్చి "ఇదిగో తీసుకోండి మిఠాయి" అని ముఖం దాచుకుని చేయి ముందుకు చాపింది. ఆ అపరిచితుడిని చూడాలనే కోరిక మనసులో ఉన్నప్పటికీ సంప్రదాయానికి కట్టుబడి ముసుగులో ముఖం దాచుకుంది. మోళకూ రూప్లిని చూడాలనే కోరిక కలిగింది. 'ఓహ్! ఈమేనా రూప్లి? ఈమె కోసమేనా బహాద్దూర్ నా అల్లుడు పదిమంది ముస్లిమ్ యువకులను బలితీసుకున్నాడు' అనుకుంటూ ఓరకంట చూశాడు. ఆమె ముసుగు జరిపి ఒకసారి అతనివైపు ఓరగా చూసింది. "ఇప్పుడు ఎక్కువగా మాట్లాడే సమయం లేదు. మీ నాన్నను వెంటబెట్టుకుని వెంటనే బయలుదేరు. యజమాని ఎదురుచూస్తున్నారు. పైగా జంగినాయక్ నిన్ను చూడాలని తన మునివేళ్ల మీద నిలబడివున్నారు" అని అక్కడి పరిస్థితి వివరించాడు. "అది సరే మామా, నువ్వు మొదటిసారి మా ఇంటికి వచ్చావు. మా సంప్రదాయం ప్రకారం ఒక రొట్టె అయినా తిని పోవాలి" అని థావు ఒత్తిడి పెట్టాడు. "నేను తింటూ ఇక్కడ కూర్చుంటే యజమాని నా చర్మం వలుస్తాడు. ఇప్పుడు రాకపోకలు మొదలయ్యాయి కదా, మళ్లీ వస్తానులే" అని గుర్రమెక్కి బయలుదేరుతూ, తన వెంబడి తెచ్చిన మరో గుర్రంమీద తండ్రి కొడుకులను రమ్మని చెప్పి అక్కడి నుంచి కదిలాడు.

జంగి, భంగిల ఇంట్లో ఎక్కడలేని సంబరం. అతను జరిగిన కథను రసవత్తరంగా వివరించి మీటు భుక్యా కరమ్‌తోట్‌ను ప్రతి ఒక్కరూ ఇప్పుడే చూడాలనే కుతూహలాన్ని వాళ్లలో రేకెత్తించాడు. భంగి తల్లి సాకిడోక్రి అయితే తన మనుమరాలిని పెళ్లిచేసుకునేవాడని తెలిసిన క్షణం నుంచి తాను కళ్లుమూసేలోగా మునిమనుమల్ని చూసేతీరాలనే నిర్ణయానికి వచ్చేసింది. కాబోయే అల్లుడి స్వాగతానికి ఇంటిల్లిపాది మునివేళ్లపై నిలబడ్డారు. భగన్యనాయక్ పెద్దకూతురు లచ్మి అయితే మీటును ఎప్పుడెప్పుడు చూద్దామా అని కలలు కనసాగింది. తనకు ఇష్టమైన గాగరో, దావణి తొడుక్కుని, అద్దాల రవిక ధరించి, చక్కగా పెళ్లికూతురిలా తయారైంది. జంగి కూతురు రామి మీటుకు ఒక తమ్ముడు ఉన్నాడని తెలిసినప్పటి నుంచి కేవలం అతని గురించే కలలు కనసాగింది. జంగి-భంగి సోదరులు పంతలు భుక్యా

బీదవాడైనప్పటికీ అతను గొప్పవాడని భావించారు. దానికి కారణం పంతలు దగ్గర ఎవరికీ సాటిరాని, వెలకట్టలేని మీటు, థావులనే రెండు వజ్రాలు ఉన్నాయి. అందువల్ల అతనికి ఎలాంటి ఇబ్బంది కలగని రీతిలో ప్రవర్తించాలని తన సేవకులందరికి ఉత్తర్వులు ఇచ్చారు.

మీటు భుక్యా కరమ్‌తోట్ ఉన్నట్టుండి వచ్చిన పిలుపుకు కలవరపడ్డాడు. పంతలుకు ఏమి చేయాలో దిక్కుతోచక క్షణకాలం మౌనం వహించాడు. సామ్కికి కాళ్లుచేతులు ఆడనట్టయ్యాయి. "అన్నా, ఉండు..." అని రూప్లి పెట్టెలో మడిచి పెట్టిన మంచి దుస్తులు తీసి అన్నకు ఇచ్చింది. అతను తయారుకావడానికి సహకరించింది. దిష్టి తీసి పంపింది. అప్పటికే పంతలు భుక్యా తాగిన సారాయి మత్తు పూర్తిగా దిగిపోయింది. మోళ తన యజమానులకు కబురు అందించటం వల్ల ఆ ఇంటివాళ్లందరూ బాగా తయారై వీరి రాకకోసం ఎదురుచూస్తున్నారు. వీళ్లు వెళ్లగానే ఇంటివాళ్లందరూ ఎదురొచ్చి స్వాగతం పలికారు. "ఆజో మీటు, లోపలికి రా" అని భంగి పిలిచాడు. కానీ మీటు భంగి తల్లి సాకిడోక్రికి "నానీ ప్రణామ్" అని అంటూ ఆమె పాదాలకు నమస్కరించిన తరువాత, భంగి భార్యకు, అతని తమ్ముడికి, భంగి కాళ్లకు వంగి నమస్కరించిన తరువాత లోపల కాలుపెట్టాడు.

"రండి, రండి, పంతలు భుక్యా కరమ్‌తోట్‌గారు" అంటూ జంగి అతడిని కౌగిలించుకుని స్వాగతం పలికాడు. అందరూ గుడారం లోపలికి పోయిన తర్వాత పెళ్లిమాటలు ప్రారంభం అవుతుండగా నలుగురు చిన్నపిల్లలు వచ్చి, "మీటు మామా! లోపలికి రండి" అని పిలిచారు. గుడారం చాలా పెద్దది. మీటుకు తన కులసంప్ర దాయాలు బాగా తెలిసివుండటం వల్ల, "వద్దు, ఇక్కడ కూర్చుందాం. ఇంతకీ మీ పేర్లు చెప్పండి" అంటూ వారిని తన పక్కనే కూర్చోబెట్టుకుని అడిగాడు. "సోమ్లా చౌహాన్ కొర్రా" అన్నాడు ఒక పిల్లవాడు. "వాహ్, నీ పేరు చాలా బాగుంది" అని చెప్పి ఆ కుర్రవాడి దృష్టి మరోవైపు మరల్చాడు. తుంటరి కుర్రవాళ్ల ఆ గుంపుకు మీటు ఎందుకు, ఎవరి కోసం వచ్చాడో తెలుసు. అందువల్ల అతడిని అల్లరి పెట్టసాగారు. సంప్రదాయం ప్రకారం మంచి సారాయితో నిండిన మట్టిముంతలు, చిట్టిముంతలు వచ్చాయి. పంతలు విషయాన్ని అర్థం చేసుకుని, "భంగిసా ఇదంతా..." అని సంకోచించాడు. "చూడు, పంతలు భుక్యా, ఇక్కడ బీదవాడు, ధనవంతుడు అనే తేడాలు బిల్‌కుల్ లేవు. ఇంటికి వచ్చిన అతిథులకు సారాయి ఇచ్చి స్వాగతం చెప్పనివాడిని బంజారా అంటారా? ఎవరక్కడా, హుక్కా తీసుకుని రండి?" అన్నాడు. మళ్లీ "మోళా, మీటును పిల్చుకుని వెళ్లి పక్కగదిలో కూర్చోబెట్టు. అలాగే కల్లు,

సళోహి(కాల్చిన గొర్రె చెవులు), కళ్జో (కాలేయం) తీసుకునిరా" అని అన్నాడు. పంతలు భుక్యా సందేహించసాగాడు. "అరే, చెప్పి ఎంతసేపైంది, ఎవరైనా హుక్కా తీసుకుని రండి" అని జంగి మళ్లీ గుర్తు చేశాడు. భంగి, జంగి సోదరులు హుక్కాను వెలిగించి పంతలుకు ఇచ్చారు. అతను ఒకసారి బలంగా పీల్చి, దాన్ని భంగికి అందించాడు. "ఏం చేసేది పంతులుసా. ఇంత పెద్ద వ్యాపారం. మగపిల్లలు ఇంకా చిన్నవాళ్లు. పెద్దకూతురు లచ్మి..." అని క్షణం మౌనం వహించాడు. మళ్లీ "సారాయి తీసుకోండి" అని ముంతను ముందుకు చాపాడు. వాళ్లు తాగడం ప్రారంభించడానికి ముందు తమ పెద్దల భాగాన్ని నేలపై రాల్చి, రెండు చుక్కలు నలుదిక్కులకు చినుకరించి, కడుపులోకి దించసాగారు. మాటలు మొదలయ్యాయి. "ఎవరక్కడ?" అని జంగి కేక వేశాడు. ఒక సేవకుడు వచ్చి యజమాని ముందు వంగి నిలుచున్నాడు. "చెప్పి ఎంత సేపైంది. ఇంటికి వచ్చిన వియ్యంకులు మీరు తెచ్చేవరకు ఎదురుచూస్తూ వుండాలా? వచ్చినవాళ్లు ఎవరనే జ్ఞానమే మీకు లేదు" అని గద్దించాడు. పెద్ద కంచంలో గొర్రె మాంసం, కల్లు, కాల్చిన గొర్రె చెవులు, ముక్కలు నిండుగా పెట్టి పంపటం జరిగింది. పంతలు భుక్యా సంకోచిస్తూనే ఒక్కొక్క ముక్కను నోట వేసుకోసాగాడు. భంగి మరొక ముంత సారాయి వంచడానికి ముందుకొచ్చాడు. "నాకు చాలు, ఇంటి దగ్గర ఒక ముంత సారాయి తాగాను" అని పంతలు సంకోచంగా అన్నాడు. "అయ్యో, అది ఎప్పుడో దిగిపోయివుంటుంది. ఒక్క ముంత తీసుకోవాలి. ఇది మీ ఇల్లే అనుకోండి" అని జంగి ఒత్తిడి పెట్టాడు. భంగి మత్తు పెరుగుతుండగా అసలు విషయం ఎత్తాడు,"ఇప్పుడు మీ పరిస్థితులు బాగా లేవని నాకు తెలుసు. మీ దగ్గర ఏమీ లేదని తెలుసు. అయితే ఇద్దరు శూరులైన కొడుకుల్ని కన్నారు. వాళ్లే మీ గొప్ప సంపద. అయ్యా, నేను తాగి చెప్పటం లేదు. నా కూతురు లచ్మిని మీ ఇంటి కోడలుగా చేసుకొమ్మని కోరుతున్నాను" అని పంతలు జవాబు కోసం ఎదురు చూశాడు. పంతలు ఒక్కక్షణం నివ్వెరపోయాడు. ఏమని జవాబివ్వాలో తోచలేదు. "అయ్యా, మీరు బాద్‌షా సైన్యానికి ఆహారం సమకూర్చే ఆగర్భ శ్రీమంతులు. మీ చేతికింద పనిచేసే సేవకులం మేము. మీకూ మాకూ..." అని ఉన్న నిజాన్ని తెలియజేశాడు పంతలు. అతను తాగినా దారి తప్పలేదు. వాస్తవాన్నే తెలిపాడు. "అవును, పదివేల కోడెల వ్యాపారవ్యవహారాలు ఇప్పటికిప్పుడే మీటు భుక్యా కరమ్‌తోట్‌కు చెందుతాయి. ఇది నా అన్న కూతురుకు ఇచ్చే చిన్న కానుక" అని ముందు వెనుకలు ఆలోచించకుండా జంగినాయక్ అన్నాడు. తమ్ముడి నిర్ణయం విని భంగి క్షణం ఆశ్చర్యపోయినా సర్దుకున్నాడు. "తాగి చెప్పటం లేదు పంతలుగారు.

మా తమ్ముడు ఒక మాట చెప్పిన తర్వాత ఇక చెప్పేదేమీ లేదు. పదివేల కోడెలు మీవే. అయితే నా పెద్దకూతురు లచ్మిని మీ పెద్దకుమారుడు మీటుకు, మా తమ్ముని కూతురు సావిని మీ చిన్నకుమారుడు థావుకు చేసుకోవాలి" అని మనసులోని మాటను బయటపెట్టాడు. పెళ్లివయసుకు వచ్చిన కూతురు రూప్లి గురించి ఎప్పుడూ ఆలోచిస్తుండే పంతలు భూక్యా పేదరికం నుంచి బయటపడటానికి, బాద్‌షా సేనాధిపతి జుల్మాన్‌ఖాన్ నుంచి తప్పించుకోవటానికి ఇదొక్కటే దారి అని అనిపించటంతో వెంటనే 'ఊc' అన్నాడు. "అభినందనలు. ఎవరక్కడ? మిఠాయిలతో నోళ్లు తీపు చేయండి" అన్నాడు భగన్యనాయక్. అతను సంతోషంతో మరో ముంత సారాయి ఖాళీచేశాడు. మిఠాయిలు పంచుతుండగా పెళ్లిమాటలు ముగిశాయని మీటు అనుకున్నాడు. అయితే తండ్రి నిర్ణయం అతనికి సమంజసంగా తోచలేదు. వయసొచ్చిన కూతురు ఇంట్లో ఉండగా తను పెళ్లి చేసుకోవడం ఎంతవరకు సబబు. ఇలా ఏవేవో ఆలోచించసాగాడు. కాబోయే మనుమరాలి భర్తకు సాకిడోక్రి కానుకగా బంగారు గొలుసు ఇచ్చింది. "నానీ, ఇదంతా ఏమిటి?" అన్నాడు మీటు. "అరే, వీరకుమారా, ఇదేమీ గొప్పకాదు. నా మనుమరాలికి వెంటనే ఒక బిడ్డను ఇచ్చెయ్. అప్పుడు చూడు, నేను నీకేమి ఇస్తానో" అంది సాకిడోక్రి.

అప్పుడే మునిమనుమడి గురించి కలలు కంటున్న ఆమెను చూసి మీటు భుక్యా కరమ్‌తోట్ ఆశ్చర్యపోయాడు.

జంగి కూతురు మేలిముసుగు వేసుకునే, గుమ్మంలోకి వచ్చి భోజనాలు సిద్ధంగా ఉన్నాయి. రావాలంట" అని పిలిచింది. పోనీలే, ఆమె చెల్లెలైనా ఎలా వుందో? ముక్కు వంకరగా ఉందో, మెల్లకన్ను ఉందో ఎవరికి తెలుసు? భలే సమస్య వచ్చి పడిందే? పెళ్లి జరిగి, ఊరేగింపు తీసి, శోభనం రాత్రి మేలిముసుగు జరిపి ఆమె ముఖం చూడాలి. అప్పటిదాకా చూడటానికి లేదు. ఇది ఎలాంటి శిక్ష? అని లోలోపల అతను పరితపించడం గమనించిన సావి మెల్లగా, "భేనెవిసా(బావగారూ) మీరు విచారించకండి. అక్క చాలా అందంగా వుంటుంది" అని అతడి ప్రతిస్పందన కోసం ఎదురుచూసింది. బహుశా అతను తన తమ్ముడి గురించి ఏమైనా చెబుతాడని ఆశపడింది. అది మీటుభుక్యా అర్థం చేసుకున్నాడు. అయితే మాట్లాడకుండా మౌనం వహించాడు. ఆమె ఎదురుచూసింది. తాగుతున్న తండ్రి, పెదనాన్న పైకి లేచి భోజనాల గదివైపు బయలుదేరేవరకూ చూసి, నిరాశతో అక్కడ నుంచి వెళ్లబోయింది. "నువ్వు ఏమీ విచారించకు. నా తమ్ముడు నా కన్నా బాగుంటాడు" అన్నాడు మీటు. ఆమె నవ్వి సిగ్గుపడుతూ లోపలికి పరుగెత్తింది.

ఒకే పంక్తిలో అందరూ భోజనాలకు కూర్చున్నారు. పంతలు సంకోచంతోనే భోజనం చేయసాగాడు. మీటుకు అత్త, అత్తింటివారూ వంటకాలన్నీ చక్కగా వడ్డిస్తున్నారు. బలమైన శరీరసౌష్ఠవం యువకుడు. చిగురు మీసాల అందగాడు. ధైర్యశాలి. మహాబలశాలి. బుద్ధిమంతుడని అందరూ గమనించారు. అతడు బాగా భోజనం చేయాలని ఆడవాళ్లందరూ పదే పదే కంచం ఖాళీ అవుతున్నట్టల్లా వడ్డిస్తూనే ఉన్నారు. మిగతా వాళ్లంతా భోజనాలు ముగించి లేచారు. మీటుకు కడుపు నిండిపోయింది. కాబోయే భార్య ముఖం ఒకసారైనా చూడాలనే కోరిక మాత్రం మనసులోంచి పోలేదు. అయినా నోరు తెరిచి అడగలేకపోయాడు. కనీసం మరదలు సావి అయిన తన బాధ అర్థం చేసుకోకూడదా అని మనసులో అనుకుంటూ పైకి లేచి చేయి కడుక్కోవడానికి వెళ్లాడు. 'బెనవి' అని సావి పిలిచింది. గబుక్కున తిరగటంతో లచ్మి ముసుగు జారింది. మీటు విస్మయంతో మూగవాడై ఆమె సౌందర్యాన్ని చూస్తూ నిలుచుండిపోయాడు. బయటి నుంచి ఎవరో పిలవటంతో మీటు ఇష్టంలేని మనస్సుతో చేయి కడుక్కున్నాడు. ఆమె ఇచ్చిన చేతిరుమాలుతో చేతులు తుడుచుకుని, దాన్ని తిరిగి ఇవ్వకుండా దాచుకుని బయటికి నడిచాడు.

"బాగా రాత్రయింది. మా అయిదుమంది గుర్రపు సవారులు మిమ్మల్ని వదలటానికి ఇంటివరకు వస్తారు" అన్నాడు జంగి. "మామసా, సైనికులు ఎందుకిప్పుడు?" అని మీటు మెల్లగా అన్నాడు. "నీ శౌర్యం మీద అనుమానం లేదు. అయినా మిమ్మల్ని వదిలివస్తారు" అని దృఢంగా అన్నాడు. కారణం ఆసిఫ్‌ఖాన్ సైనికులు పొరబాటున రాత్రిపూట వస్తున్న వాళ్లను శత్రువులు అనుకుని మీటు కుటుంబాన్ని ఇబ్బంది పెడతారేమోనని జంగినాయక్ ఆలోచన.

ఇక్కడ ఇంట్లో మీటు భుక్యా తల్లి సామ్కి, చెల్లెలు రూప్లి, తమ్ముడు థావు వెళ్లినవాళ్లు ఇంతసేపయినా ఎందుకు రాలేదని కలవరపడుతూ ఎదురుచూస్తూరు. సామ్కికి అక్కడ ఏం జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలం. థావు నిలుచున్నచోట నిలబడలేకపోయాడు. మీటు పెళ్లి జరిగిపోతే తన దారి సుగమమవుతుంది. చెల్లెలు రూప్లికి పెళ్లిచేసి, ఇద్దరూ...అతని బుర్రలో ఇలా ఆలోచనలు కదులుతున్నాయి. మహాబలశాలి అయిన తన అన్నను పెళ్లి చేసుకునే అదృష్టవంతురాలు చూడటానికి ఎలా వుంటుందోనని ఏవేవో ఆలోచనలతో రూప్లి తల్లిని ఆట పట్టించసాగింది. "ఊం ఏమిటమ్మా? కోడలు వస్తుందని కలలు కంటున్నావా? వస్తుంది, నీకు మనుమల్ని ఇస్తుంది. అంతగా ఆలోచించకమ్మా" అని వెక్కిరించింది. "ఎందుకే, నీ పెళ్లి చేయకుండా మీ అన్న పెళ్లి చేసుకుంటున్నాడని అంటున్నావా? ఇక్కడ చాలామంది

చౌహాన్ కుర్రవాళ్లు ఉన్నారు. వాళ్లల్లో ఒకడిని చూసి నీకూ ముడివేయిస్తాడులే మీ అన్న" అంది సామ్కి కూతురును ఆటపట్టిస్తూ. "పోమ్మా, నువ్వూనూ. నాకు మిమ్మల్ని ఇంత తొందరగా వదిలి పెళ్లిచేసుకుని వెళ్లిపోవాలని లేదు. అన్న పెళ్లి, అన్న పిల్లల్ని చూసిన తరువాత ..." తన కోరికను వ్యక్తం చేసింది. "రూప్లి, నీది పిచ్చి కోరిక. ఇంట్లో వయసొచ్చిన చెల్లెల్ని పెట్టుకుని మీ అన్న పెళ్లి చేసుకుంటాడని అనుకున్నావా? పిచ్చిపిల్లా, నువ్వంటే మీ అన్నకు పంచప్రాణాలు. కావాలంటే చూడు, నీ పెళ్లి చేసిన తర్వాతే తను పెళ్లి చేసుకుంటాడు" అని థావు ఖచ్చితంగా చెప్పాడు. ఎందుకంటే అతను మీటు మనసును బాగా అర్థం చేసుకున్నవాడు. తన సోదరుడు మీటు చెల్లెలి కోసం, తన కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా వుంటాడు. "ఇలాంటి అన్నయ్య దొరకాలంటే ఏడేడు జన్మల్లో నేను పుణ్యం చేసుకుని వుంటాను. ఏ జన్మ ఋణాను బంధమో మనది. పునర్జన్మ అంటూ వుంటే అతడే నాకు అన్నగా పుట్టాలని దేవుడిని వేడుకుంటాను థావుఅన్నా" అని భావోద్వేగంతో అంది రూప్లి. ఏదో చప్పుడు కావటంతో అందరూ మౌనం వహించారు. తండ్రి, సోదరుడు వచ్చినట్లున్నారు. థావు వారికి దారి చూపడానికి కాగడ పట్టుకుని బయటికి నడిచాడు.

మోళ ఒక పటాలానికి నేతృత్వం వహిస్తున్నాడు. భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగగలిగే శూరుడు. మీటు భుక్యా చెల్లెలు రూప్లిని చేసుకోవాలనే కోరిక అతని మనసులో ఉంది.

తమ వెంబడి వచ్చిన మోళను "రండి లోపలికి" అని మీటుభుక్యా సాదరంగా ఆహ్వానించాడు.

"అర్ధరాత్రి దాటింది. మళ్లీ ఎప్పుడైనా వస్తాను" వాళ్లను వదలడానికి వచ్చిన మోళ వెనుతిరిగాడు.

"అలాగే" అని మోళ చౌహాన్ గుర్రాన్ని ప్రేమగా చరిచి మీటు లోపలికి నడిచాడు.

థావు, సామ్కి, రూప్లిలు విషయం తెలుసుకోవటానికి మునివేళ్ళమీద నుంచున్నట్టు ఆత్రంగా చూస్తున్నారు. "అన్నా, వదినను చూశావా? ఎలా ఉంది?" అని రూప్లి కుతూహలం ఆపుకోలేక అడిగింది. "ఊఁ! ఎందుకంత కుతూహలం?" అని ఆమెకు జవాబు ఇస్తున్నంతలో, తల్లి సామ్కి "వాళ్లు గొప్ప శ్రీమంతులని విన్నాను. మనకు-వాళ్ళకు ఎలా కుదురుతుంది..." అని అనుమానం వెలిబుచ్చింది. "అబ్బే, వాళ్లు శ్రీమంతులైనా కొంచెం కూడా గర్వం, పొగురు, అహంకారం లేదు. మేము ఏమీ మాట్లాడక ముందే వాళ్లు పదివేల పశువుల యజమాన్యాన్ని నీ ఇద్దరు

కొడుకులకు ఇచ్చి పెళ్లి చేయడానికి సిద్ధమయ్యారు" అని పంతలు భుక్యా భార్య సందేహాన్ని దూరం చేశాడు. "ఓరిదేవుడా, పదివేల పశువుల వ్యవహారమా ...నిజమేనా?" అని సామ్కి నోరువెళ్లబెట్టింది. భర్త చెప్పిన విషయాన్ని దృఢపరుచుకోవడానికి మీటును అడిగింది. "అవునమ్మా, జంగినాయక్ మామా అక్కడే చెప్పేశాడు" అని మీటు చెప్పాడు.

రాత్రి చాలా పొద్దుపోయివుండటంతో అందరూ నిద్రపోవటానికి కదిలారు. చెల్లెలు రూప్లి ముఖం చిన్నబోయి ఉండటం గమనించిన మీటు, "నా చెల్లెలు రూప్లి వివాహం జరిగిన తరువాతే మేమిద్దరం పెళ్లి చేసుకుంటాం" అని ఆమెకు వినిపించేలా బిగ్గరగా అన్నాడు. "నా పెళ్లికి తొందరేమి లేదు. ముందు మీ ఇద్దరి పెళ్లిళ్లు జరిగి, వదినలు ఇంటికి వచ్చిన తరువాతే నేను పెళ్లిచేసుకుంటాను" అని రూపి బిగ్గరగా చెప్పింది.

ఉదయకిరణాలు వ్యాపిస్తుండగా మోళ చౌహాన్ హాజరయ్యాడు. ఇప్పుడు తన వ్యక్తిగత విషయంగా వచ్చాడు. మీటులాంటి శూరుడు, బుద్ధిమంతుడి కుటుంబంతో సంబంధం కలుపుకోవడం ద్వారా భవిష్యత్ తరాలైనా తనలా జీవించకుండా బానిసత్వాన్ని వదిలి బతకవచ్చనే నమ్మకంతో వచ్చాడు. అతడు వచ్చినట్టు తెలియగానే మీటు వెంటనే లేచి బయటికి వచ్చి అతన్ని గౌరవంగా లోపలికి తీసుకెళ్ళాడు.

"ఏమిటి విషయం మోళ. ఇంత పొద్దున్నే వచ్చావు?" అని అడిగాడు మీటు.

ఒక్క క్షణం మోళకు ఏమని జవాబివ్వాలో తోచలేదు.

తడబడుతూ "ఏమీ లేదు. ఇదే దారిలో వెళుతూ ఇక్కడికి వచ్చాను" అని ఏదో సాకు చెప్పాడు.

మీటు కొంత ఊహించాడు. అతనికి మోళ మనసు అర్థమైంది. మోళ చౌహాన్ చూడటానికి అందంగా ఉంటాడు. అతను జంగి-భంగి దండులో పనిచేస్తున్నాడు. తనుకూడా నిన్నటివరకు పనివాడే. అదృష్టం వరించింది. తెల్లవారేసరికి పదివేల పశువులకు యజమాని అయ్యాడు. అయితే ఈ అదృష్టం అందరి జీవితాల్లోనూ రావడం అసాధ్యం. అందువల్ల ఆ విషయం గురించి ఏమీ ఆలోచించలేదు. ఇంటివారు ఏమంటారోనని ఆలోచిస్తుండగానే పంతలు భుక్యా, "అరే మోళా ! రా కూర్చో. నీ గురించి విన్నాను. ఇంతకీ నీ గోత్రం ఏమిటి?" అని ఎలాంటి సంకోచం లేకుండా అడిగేశాడు. దానికి మోళ, "మా జాతిలో కొర్రా అనే వర్గం ఉంది మామా" అన్నాడు. "నా తల్లిది కూడా అదే గోత్రం" వెంటనే అన్నాడు

పంతులు భుక్యా సంతోషంగా. దాంతో మోళ వారికి మరింత ఆత్మీయంగా అనిపించాడు. సంబంధాల ఉండను విప్పుతూ పోతే ఎక్కడో ఒకచోట ఇద్దరూ సంబంధీకులు కావటంలో అనుమానమే లేదు. రూప్లి రొట్టెలు తట్టుతూవుంటే, సామ్కి రొట్టెల్లో తినటానికి కూర చేస్తోంది.

సామాన్యంగా వేకువనే రొట్టెలు తిన్న తరువాత మీటు, థావులు జంగి-భంగిల సేవకు హాజరయ్యేవారు. అక్కడ కోడెలపై మోపాల్సిన బరువైన సంచుల, సైనికుల ఆహారసామగ్రుల లెక్కలు చూస్తూ చీకటి పడేటంతవరకూ అక్కడే వుండిపోయేవారు. మధ్యాహ్నపు రోట్టెలు కూడా అక్కడే తిని వచ్చేవారు.

ఈ రోజు మోళ కూడా రోట్టె తినడానికి వాళ్లతోపాటు కూర్చున్నాడు. వేడివేడి రొట్టెలు, మిరపకాయలు, ఎండు చేపలతో ఆహారం రుచిగా ఉండటంతో మోళ రూప్లి తల్లిని తెగపొగుడుతూ కడుపునిండా తిన్నాడు.

ఉదయమే కొలువుకు హాజరైనపుడు పనివాతావరణంలో మార్పులు ఏర్పడ్డాయి. జంగి చాలా రోజులుగా మీటు కదలికలు గమనిస్తున్నాడు. అతని తెలివితేటలు మెచ్చుకున్నాడు. ఇప్పుడు అదే తెలివైనవాడు తమ ఇంటి అల్లుడు కాబోతుండటం పట్ల గర్వంగా అనిపించింది. నూటా ఎనభైమంది యువకులను ఒక్కచోట చేర్చాడు.

"అందరూ నా మాటల్ని జాగ్రత్తగా వినండి. విషయం ఏమిటంటే మీకు ఒక కొత్త ముఖియా (నాయకుడు) వస్తున్నాడు. అతడిని మీరు ఇంతకు ముందే చూశారు. అతని శకిసామర్థ్యాలు కూడా మీరంతా కళ్లారా చూశారు. తొందరలోనే అతను మాకు బంధువు కాబోతున్నాడు. ఇప్పుడు అతను మనకున్న లక్ష కోడెల్లో పదివేల కోడెలకు యజమాని కూడా. అతనే మీటు భుక్యా కరమ్‌తోట్" అన్నాడు.

ఆ మాటలు వినగానే చౌహాన్ కుర్రవాళ్లు నివ్వెరపోయారు. ఏమిటి మీటు భుక్యా వర్గం వాడా? అని అనుకున్నారు. అతని పట్ల అసూయపడసాగారు. అయితే మీటు ఎలాంటి ధైర్యశాలియో, యోధుడో తెలుసు. పదిమంది ముస్లిమ్ యువకులను అరక్షణంలో ఓడించి తలలు తెంచినవాడు. వందమందితో పోరాడి వారిని నేలకరిపించడంలో అనుమానం లేదు. అయినా ఇప్పుడు తమ యజమాని కూతురును పెళ్లిచేసుకుని తమమీద అధికారం చలాయిస్తాడనే భయం చాలామందిని వేధించసాగింది. అందరూ తమలో తాము గుసగుసగా మాట్లాడుకోసాగారు. ఏమైనప్పటికీ ఇలాంటి వీరుడు తమతోపాటు ఉన్నాడని, అతను ఏదో ఒకరోజున తమకు ఉత్తమ నాయకుడు కాగలడని స్వయంగా చౌహాన్ యువకులు మాట్లాడుకోసాగారు.

మీటుభుక్యా మాత్రం ఎలాంటి గర్వం లేకుండా, "మిత్రులారా, జంగి మామ చెప్పింది నిజం. అయితే నేను అధికార దర్పంతో మీరు తక్కువని, నేను గొప్ప అని ఎన్నడూ భావించను. గతంలో నేను కూడా వారి సేవకుడిని. ఇప్పుడు అల్లుడినైనా కూడా వారి గౌరవానికి మచ్చ తెచ్చేటటువంటి పని చేయను. మీకు మాత్రం నేను మీ పాత మిత్రుడు మీటూనే. జంగిమామ, భంగిమామలు నాలాంటి సామాన్యుడిని అల్లుడిగా సీకరించటం వారి గొప్ప గుణాన్ని చాటుతుంది. నా శరీరంలో చివరి ఊపిరి ఉన్నంతవరకూ వారికి విధేయంగా ఉంటాను. వారిని వదలను. ఎలాంటి ఆపదవచ్చినా మీ వెంట నిలబడుతానని భవానీమాత మీద ప్రమాణం చేసి చెబుతున్నాను" అన్నాడు.

ఆ మాటలకు అతనంటే గిట్టనివాళ్ళు కూడా తమకు తెలియకుండానే రెండు చేతులు కలిపి చప్పట్లు కొట్టారు.

జంగి కిందికి దిగి అతడిని కౌగిలించుకుని "నిన్ను కన్న తల్లితండ్రులు ధన్యులు. వయస్సుకు మించిన మాటలు. శక్తికి మించిన ధైర్యం. నువ్వు మా ఇంటి అల్లుడివని రొమ్ము విరుచుకుని గర్వంతో చెబుతాను. నువ్వు ఒక అసాధారణమైన మనిషివి" అని జంగినాయక్ గద్గదికమయ్యాడు.

ఆసిఫ్‌ఖాన్ సైనికులు జంగినాయక్‌ను వెతుక్కుంటూ వచ్చారు.

"ఏమిటి విషయం?" అని అడిగాడు జంగినాయక్.

"హుజూర్, ప్రభువులు ఇప్పటికిప్పుడే తమను పిల్చుకుని రమ్మని పంపారు" అని విషయం తెలిపారు.

"సరే పదండి. ఏదో ముఖ్యమైన విషయం ఉండొచ్చు" అని జంగినాయక్ వారి వెనుకే బయలుదేరాడు.

ఆసిఫ్‌ఖాన్ జంగినాయక్ రాక కోసమే ఎదురుచూస్తున్నారు. "రండి జంగి భాయ్, మీకు స్వాగతం. రండి కూర్చోండి" అంటూ ఆసనాన్ని చూపాడు. "హుజూర్! చెప్పండి. ఏమిటి విషయం? ఎందుకో ప్రభువులు విచారంగా కనిపిస్తున్నారు. ఎవరైనా శత్రువులు..." అని జంగినాయక్ అనుమానాన్ని వ్యక్తపరిచాడు. "అలాంటిదేమీ లేదు జంగినాయక్. అయితే అడవినుంచి ఏదో పులివచ్చి మన గొర్రెలను, మేకలను చంపి ఎత్తుకునిపోతోందని, సైనికులను తీవ్రంగా గాయపరుస్తోందని సమాచారంవచ్చింది. మీకు తెలిసిన పులిని వేటాడే వీరుడు వుంటే ..." అని మాటలను మధ్యలోనే ఆపాడు. "పులిని వేటాడే వీరుడు..." జంగి నాయక్ ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడు. "లేరా, ఎవరూ లేకపోతే మేమే స్వయంగా

వెళతాం" అని ఆసిఫ్‌ఖాన్ అన్నాడు. పులి సైనికుల ఆహారం కోసం తెచ్చిన గొర్రెలను, మేకలను గాయపరిచి ఒక్కొక్కదాన్ని ఎత్తుకునిపోయి తినేస్తోంది. ఇదిలాగే కొనసాగితే ఎలా అనే విచారం ఆసిఫ్‌ఖాన్‌ను వేధించసాగింది. వాళ్ల మాట్లాడుతుండగా చాయ్ పానీయాలను స్వయంగా ఆసిఫ్‌ఖాన్ పెద్దకూతురు షెహనాజ్‌బీ అందించింది. "అరే, షెహనాజ్ బేటా! ఎలా పెరిగిపోయిందికదా" అని జంగినాయక్ ఆనందాన్ని వెలిబుచ్చాడు. "ఆఁ ఎదిగి పెళ్లికి నుంచుంది. ఇక నిఖా చేయాలి. అయితే మేము ఢిల్లీకి తిరిగి వెళ్లగలమా? లేదా ఈ దుర్గమమైన అడవిలోనే ఏదైనా అడవి జంతువులకు బలవుతామా? అనే భయం మమ్మల్ని వేధిస్తోంది" అని ఆసిఫ్‌ఖాన్ విచారం వ్యక్తం చేశాడు. "ఖాన్, సాహెబ్‌గారు ఈ జంగి-భంగిలు బ్రతికి ఉన్నంతవరకు మిమ్మల్ని ఏ జంతువూ ఏమీ చేయలేదు. తాము నిశ్చింతగా ఉండండి. మరో రెండు రోజులలో పులిని వేటాడి తెచ్చి, మీ గుడారం ముందు దాన్ని వేలాడదీయడం జరుగుతుంది" అని మాట యిచ్చి జంగినాయక్ గుడారం నుంచి బయటికి వచ్చాడు. 'ఈ పనికి మీటు భుక్యా ఒక్కడే సమర్థుడు. ఇలాంటి ఎన్ని పులులనైనా నేలకూల్చగలిగే మగపులి అతను. అయితే ఇలాంటి సందర్భంలో అతడిని పంపటం ఎంతవరకు సబబు?' అని ఆలోచిస్తూ తిరిగి వచ్చాడు. అదే సమయంలో సోదరుడు భగన్యనాయక్ కోడెల ఒళ్ళు నిమిరి వాటిని మేయడానికి అడవికి తీసుకెళ్లమని సేవకులను ఆదేశిస్తున్నాడు. తిరిగి వచ్చిన తమ్ముడి ముఖంలోని విచారాన్ని భగన్య నాయక్ గమనించకపోలేదు. "ఏమిటి విషయం, ఆసిఫ్‌ఖాన్ పిలిచారట" అని అడిగాడు. "ఏదో ఒక పులి అడవి నుంచి అర్ధరాత్రిళ్లు వచ్చి సైనికులను గాయపరిచి, గొర్రెలను, మేకలను ఎత్తుకునిపోతోందట. దాని వేధింపులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయట. దాన్ని ముగించమని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే..." మాటలాపాడు జంగినాయక్. "అయితే ఏమిటి, మన కుర్రవాళ్లు పులిని వేటాడలేరని అనుమానమా?" అన్నాడు భగన్యనాయక్. "అదికాదన్నయ్యా, అందరూ పులిని వేటాడగలరా? పులిని వేటాడటానికి పులినే పంపాలి. ఆ పులి మన అల్లుడు మీటుభుక్యా. ఎందుకో నాకు సంకోచంగా ఉంది" అని తన సంకోచాన్ని వ్యక్తపరిచాడు జంగినాయక్. "అరే చోటూ, ఇంత చిన్న విషయానికి ఇంత కలవరపడితే ఎలా? నీకు మీటు మీద నమ్మకం ఉందికదా? అతను ఇలాంటి పది పులులు వచ్చినా ఎదుర్కోగలడనే నమ్మకం, ధైర్యం నాకుంది. విచారించకు. అల్లుడిగారికి కబురుపెట్టు" అన్నాడు భగన్యనాయక్. కబురు అందుకున్న మీటు రాగానే ఇద్దరి కాళ్లకు నమస్కరించి నిలుచున్నాడు. భగన్యనాయక్ పులివల్ల ఆసిఫ్‌ఖాన్‌కు కలుగుతున్న ఇబ్బందుల

గురించి వివరించాడు. "అంతేనా? మీరు ఆందోళన చెందకండి. నాకు తోడుగా మోళ చౌహాన్, గోపు కొర్ర, రామ్ సబావట్, సూర్యవద్య వీరితోపాటు మరో నలుగురిని పంపండి. రెండు రోజుల్లో పులి కాళ్లు కట్టివేసి మీ దగ్గరికి తీసుకొస్తాం" అని మాట ఇచ్చాడు. జంగి-భంగి సోదరులు వేటకు వెళ్లడానికి మీటుకు అనుమతిచ్చి తమ గుడారాలవైపు నెమ్మదిగా నడిచారు.

పులిలాంటి అనేక జంతువులను వేటాడటంలో నిపుణుడైన పంతలు భుక్యా తన కొడుకును అడవిలోకి పంపడానికి వెనుకాడసాగాడు. కొడుకును పక్కనే కూర్చోబెట్టుకుని పులి అడుగుల గురించి, దాని కదలికల గురించి, దాని ప్రవర్తన గురించి, అది మనిషి జాడను పసిగట్టి, మనిషి మీద చేసే దాడి గురించి, దాన్ని ఎదుర్కొని దాన్ని చంపే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో క్షుణ్ణంగా కొడుకుకు బోధించాడు. ఎన్నో జాగ్రత్తలు, మెలుకువలు కొడుకు తలలో నింపిన తరువాత అతడి శక్తిసామర్థ్యాల మీద సంపూర్ణమైన నమ్మకంతో అడవిలోకి వెళ్లడటానికి అనుమతి ఇచ్చాడు.

మీటు తన బృందంతో పూర్తిగా సిద్ధమై, చీకటి పడటం కోసం ఎదురుచూసి, పులి ఎటువైపు సంచరిస్తూవుందో కొంత సమాచారం సేకరించి అటువైపు బయలుదేరాడు.

మీటుకు తన చెల్లెలు రూప్లిని మనస్సులో ఆరాధిస్తున్న మోళ చౌహాన్ స్వభావంతో పరిచయం కలగసాగింది. తల్లితండ్రులను రాజస్థాన్ తాండలలో వదిలి వచ్చిన చౌహాన్ యువకులను మీటు దగ్గరి బంధువుల్లా చూసుకునేవాడు. అదే విశ్వాసంతో వాళ్లంతా మీటు కోసం ప్రాణాలివ్వడానికి కూడా సిద్ధంగా వుండేవారు. బృందంలో ఉన్న ఏ ఒక్కరికి మైమరిచినా పులికో, ఇంకేదైనా జంతువుకో లేదా విషసర్పాలకో బలి అవుతామనే భయం. ఎవరికీ ఏ ఆపద కలగకుండా పులిని ప్రాణాలతో లేదా చంపి అయినా తీసుకుని వెళ్లాలని మీటు మనసులో దృఢంగా అనుకున్నాడు. ఆ రాత్రి చీకట్లో పులి ఏ వైపు నుంచి దాడి చేస్తుందో, మృత్యువై ఎక్కడ దాక్కుని కూర్చుందో ఎవరికి తెలియదు. తమ వెంట తెచ్చిన మేకను ఒక చెట్టు కాండానికి కట్టి, కొద్ది దూరంలో ఒక మంచె మీద కాచుకుని కూర్చున్నారు. జింకలు, దుప్పి, కుందేళ్లు చీకట్లో ఒకవైపు నుంచి మరొక వైపు పరుగెత్తుతున్నాయి. పాపం మృత్యువు వాటి మీద పులి, చిరుత, కొండ చిలువ, తోడేలు రూపంతో ఎప్పుడు దూకుతుందో అనే భయంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని పైకి నిర్భయంగా ఉన్నట్టు అవి నటిస్తున్నాయి అనిపించింది. రాత్రి భయానకత అడవి అంతటా

వ్యాపించింది. ఒకరి తరువాత ఒకరు వంతులవారిగా మేలుకుని వుండాలని నిర్ణయించుకున్నారు. మేక ఆర్తనాదాల కోసం కాచుకుని కూర్చున్నారు. అయితే విషాదమేమిటంటే కట్టివేసిన మేకను పులి కరిచిపట్టుకుని పోయింది. మీటు వంతు వచ్చి నిద్రనుంచి లేచి చూస్తే మేక కనిపించలేదు.

మీటును అనుమానం వేధించసాగింది. ఇది పులి కృత్యమో లేదా వేరే ఏ జంతువు కృత్యమో అర్థం కాలేదు. మోళను మేల్కొలిపి మేక అదృశ్యం గురించి చెప్పాడు. “ఇది పులి కృత్యమా లేదా...” అని అతనూ అనుమానం వెలిబుచ్చాడు. “నాకన్నా ముందు మెలుకువగా ఉండి కాపలా కాసిన వ్యక్తిని లేపండి” అన్నాడు. అతడిని అడిగితే అది ఎప్పుడు తప్పించుకునిపోయిందో తనకూ తెలియదన్నాడు. అందరూ తమ కాగడలను వెలిగించి మేకను, పులిని వెతకడానికి బయలుదేరారు. కేవలం ఒక్క గంటలోపే ఇదంతా జరగడం వల్ల మేకను తీసుకుని వెళ్లిన జంతువు ఎక్కువ దూరం పోయివుండదని మీటు అభిప్రాయం. పులికోసం అన్వేషణ కొనసాగింది. ఒక దిక్కులో ఏదో చిన్న అలికిడి వినిపించగానే అందరూ అటువైపు పరుగెత్తారు. అక్కడ ఒక పొదలో మేక చచ్చిపడివుంది. దాన్ని చంపిన జంతువు మాత్రం కనిపించలేదు. కాగడా వెలుతురులో సూక్ష్మంగా పరిశీలిస్తూ పొదల్లో పులి అడుగుజాడల కోసం వెతకసాగారు.

ఒక పొదలో పులి కదలికలు కనిపించాయి. కళ్లు చిట్లించుకుని చూస్తే పులి కూర్చుని వుంది. మేకను చంపిన పులి అదే అయివుండొచ్చనుకున్నారు. చప్పుడు చేయకుండా అందరూ ఒక చేతిలో తల్వారులు, మరో చేత్తో కాగడా పట్టుకుని ఆ పొదను చుట్టుముట్టారు. అందరూ కేవలం సైగలతోటే సూచనలు ఇచ్చుకుంటున్నారు. ఏ ఒక్కరూ మాట్లాడే ప్రయత్నం చేయలేదు. సజీవంగా పట్టుకుందామని మోళకు మీటు సైగ చేశాడు. అయితే పులి భారీగా ఉందని, దాన్ని లొంగదీయటం కష్టమని మోళ సైగలతోనే జవాబు ఇచ్చాడు. కాగడల వెలుతురు దాని కళ్లల్లో ప్రతిఫలించటం ఆలస్యం పులి భయంకరంగా గర్జిస్తూ వారిపైకి ఎగిరింది. అదే సమయం కోసం ఎదురుచూస్తున్న మీటు భుక్యా ఒక్కసారిగా తన ‘వేట’ మీద పెద్దపులి ఎగిరినట్టు ఎగిరాడు. అరక్షణంలో దాన్ని గాయపరిచి నేలకూల్చాడు. ఆర్భాటంతో కూడిన వారిద్దరి పోరాటాన్ని చూసి కొందరు నిలుచున్నచోటే గజగజా వణకసాగారు. మోళ చౌహాన్ మీటుకు సహాయంగా నిలబడి పులికాళ్లను బలంగా తాళ్లతో కట్టివేసి, పులిని మోసుకుని బయలుదేరమని నలుగురు బలిష్ఠమైన యువకులకు ఉత్తర్వులు ఇచ్చాడు. పులి గోళ్ళతో మీటు ముఖంమీద ఛాతీమీద గాయపరిచింది. అక్కడే

దొరికే ఔషధగుణాలున్న ఆకులను తెంచి, రసం పిండుకుని గాయాలకు పూసుకుని మీటు గుర్రం ఎక్కాడు. పులిని మోసుకుని మిగతావారు అతన్ని అనుసరించారు.

ఈ వార్త ముందుగానే జంగి-భంగి సోదరులకు చేరింది. మీటు భుక్యా పులిని సజీవంగా పట్టి తెస్తున్నాడని సోదరులిద్దరూ అల్లుడికి స్వాగతం పలకడానికి ముందుకొచ్చారు. లచ్మికైతే పులిని పట్టితెస్తున్న వీరుడు త్వరలో తన భర్త కాబోతున్నాడని తలుచుకుని పులకించింది. ఆమె కూడా పులిని, పులిలాంటి భర్తను చూడటానికి జనం వెంట నడిచింది. పులిని పట్టుకున్న వార్త ఆసిఫ్‌ఖాన్‌కు చేరటం ఆలస్యం అతను పులిని సజీవంగా పట్టి తెస్తున్న వీరుడిని వెంటనే చూడాలనే కోరికను జంగి-భంగిలకు తెలియజేశాడు. దట్టమైన అడవి నుంచి వచ్చిన దారినే తిరిగి వస్తుండగా పట్టుబడిన పులి చేస్తున్న గర్జనలకు జంగి-భంగిల కోడెలు బెదిరి చెల్లాచెదురవుతున్నాయి. వేటకు వెళ్లిన వాళ్లనంతా ఆర్భాటంగా ఆహ్వానిస్తూ వారి ఇంట్లో వైభవమైన భోజనాల ఏర్పాట్లు చేయడం జరిగింది. పులిని మోసుకున్న బృందం ఆసిఫ్‌ఖాన్ గుడారం వైపు కదిలింది.

"మాకు ఈ కుర్రవాడు పులిని పట్టుకుంటాడని పూర్తిగా నమ్మకం ఉండింది" అని అంటున్నప్పుడు భగన్యనాయక్ గుండె సంతోషంతో, గర్వంతో పొంగిపోయింది.

ఆ మాటకు తలూపుతూ, "అతను సామాన్యుడు కాదన్నా, అసమాన్యుడు" అన్నాడు జంగి.

మీటును చూడగానే "ఖాన్‌సాహెబ్‌గారి ఇబ్బందులు తొలగించావు నాయనా, ఆయన మమ్మల్ని పూర్తిగా నమ్ముకున్నాడు. అందువల్లనే ఆయన సైనికులకు బదులుగా మాకు ఈ కార్యాన్ని అప్పగించాడు. మా నమ్మకాన్ని కాపాడావు. నువ్వు మన బంజారా వీరుడని చెప్పుకోవడానికి నేను గర్వపడుతున్నాను" అని భగన్యనాయక్ భావోద్వేగంతో అన్నాడు.

ఆ మాటలకు మీటుకు ఎలా స్పందించాలో తోచక వినమ్రంగా తలవంచుకుని నిలబడ్డాడు.

ఆసిఫ్‌ఖాన్ అత్యంత ప్రసన్నుడయ్యాడు. ఓ బంజారా యువకుడు ప్రాణభయం లేకుండా పులిలాంటి బలిష్ఠమైన, క్రూరమైన జంతువును ప్రాణాలతో పట్టుకోవడమంటే సామాన్యమైన విషయం కాదు. వాయిద్యాల సమేతంగా మీటును ఆహ్వానించడానికి ఆసిఫ్‌ఖాన్ ముందుకొచ్చాడు. ఊరేగింపు గుడారానికి సుమారు దూరంలో ఉండగానే ఖాన్‌సాహెబ్ గౌరవపూర్వకంగా పులిని ఓడించిన 'పులి'ని చూడటానికి ముందుకు వచ్చాడు.

"అరే మెరే షేర్ ! జంగి-భంగిల నమ్మకమైన మనిషి పులిని పట్టుకున్నట్టు తెలిసి మాకు బహుత్ ఖుషి అయ్యింది. నువ్వు సామాన్యుడివి కావు" ఖాన్‌సాహెబ్ చాలా సంతోషంతో అన్నాడు.

"హుజూర్, ఇతనే నా అల్లుడు మీటు భుక్యా కరమ్‌తోట్. ఆ పులికన్నా బలశాలి" అని గర్వంగా చెప్పిన భంగి నాలిక్కరుచుకున్నాడు. ఎక్కడ ఆసిఫ్‌ఖాన్ మీటును సైన్యంలో చేర్చుకుంటాడోనని భయపడ్డాడు. అయితే ఆసిఫ్‌ఖాన్ తన ఖడ్గాన్ని బహుమతిగా ఇచ్చి గౌరవించాడు. అంతేకాదు మీటును తన వ్యక్తిగత చర్చల బృందంలో గౌరవనీయమైన స్థానాన్ని ఇచ్చాడు. అలాంటి స్థానం లభించటానికి జంగి-భంగి సోదరులకు చాలా సంవత్సరాలు పట్టింది. తరువాత ఆసిఫ్‌ఖాన్ తన మెడలోని ముత్యాల హారాన్ని తీసి స్వయంగా మీటు మెడలో వేశాడు. ఆ సాయంత్రం ఆయన ఇంట్లో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. పంతలు భూక్యా కుటుంబాన్ని, జంగి-భంగి సోదరుల కుటుంబాన్ని విందుకు ఆహ్వానించడం జరిగింది.

కొడుకు సాహసం గురించి విన్న పంతలు భుక్యా, సామ్కిలు కొడుకును చూడటానికి పరితపించసాగారు. థావు, రూప్లిలు సోదరుని విజయాన్ని చూడటానికి బయలుదేరారు. ఎక్కడో పేదరికంలో మగ్గుతున్న భుక్యా పరివారం ఇప్పుడు రాచమర్యాదలు పొందుతోంది. సైన్యంలోని ప్రముఖులు ఆ రాత్రి విందుకు హాజరయ్యారు. బురఖాలో ఉన్న ఆసిఫ్‌ఖాన్ కూతురు అతిథులలో ఆడవారిని సాదరంగా లోపలికి ఆహ్వానించింది. పులిని సజీవంగా పట్టిన వీరుడి వివాహం తన తండ్రి ఆప్తమిత్రులైన భగన్యనాయక్ కూతురుతో జరగబోతుందని తెలిసి సంతోషపడింది. అందుకు కారణం లచ్మి ఆమెకు చిన్ననాటి స్నేహితురాలు.

మీటు గౌరవార్థం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న భగన్యనాయక్, "హుజూర్, రాబోయే శుక్రవారం మీటు, నా కూతురు లచ్మిల నిశ్చితార్థం పెట్టుకున్నాం. సైన్యం కొంతకాలం ఇక్కడే ఉంటుందా? లేదా ముందుకు సాగుతుందా?" అని అనుమానంగా అడిగాడు.

"లేదు, మౌసమ్ బాగా లేదు. ఇంకొక నెల రోజులు ఇక్కడే ఉండవలసి రావచ్చు" అని ఆసిఫ్‌ఖాన్ స్పష్టంగా చెప్పాడు.

దక్షిణంలో వేసవి తాపానికి, చలికి, వర్షానికి సర్దుకోవడానికి వారికి కొన్నిరోజులు పట్టాయి. అందువల్ల దక్షిణాది పరిసరాలు, వాతావరణంలోని హెచ్చుతగ్గుల అధ్యయనం జరిగింది. ఆ కారణంగా ఉత్తర భారతంలోని వైపరీత్యం దక్షిణమంతటా వ్యాపించింది. సైన్యం మధ్యప్రదేశ్ సరిహద్దులను దాటి దక్షిణాది

సరిహద్దుల్లోకి కాలుపెట్టింది. దుర్గమమైన దారి, దట్టమైన అడవి, ఆసిఫ్‌ఖాన్‌కు పెద్దసవాలుగా పరిణమించింది. ఎందుకంటే అతను ఎన్నడూ ఈ విధమైన దీర్ఘ ప్రయాణాలు చేయలేదు. బాద్‌షా ఔరంగజేబు హుకుమ్‌ను నిరాకరించలేక భార్యాపిల్లల సమేతంగా జంగి-భంగి సోదరుల సహాయంతో దక్షిణం వైపు బయలుదేరాడు. దక్షిణ దిశలోని దారులలో బంజారాలు సంచరించి ఒక మార్గపు నకలు తయారుచేయటం వల్ల జంగి-భంగి నాయక్‌లకు ఇబ్బందులు కలగలేదు. ఆసిఫ్‌ఖాన్‌కు మాత్రం ఈ ఇద్దరు సోదరులను బలంగా నమ్మవలసిన సన్నివేశం ఏర్పడింది. కొండలను గుట్టలను సునాయసంగా దాటడంలో బంజారాలు ఎక్కువగా కష్టపడేవారుకాదు. అయితే ఆసిఫ్ ఖాన్ సైన్యం కొంత ప్రయాసపడవలసి వచ్చింది.

పగటి వెలుతురు కరిగి చీకటి పడేలోగా శుక్రవారం వచ్చేసింది. భగన్యనాయక్ అతని చిన్నతమ్ముడు ఇద్దరూ పంతలు భుక్యాకు కబురు పంపి శుక్రవారం మాట్లాడుకుని, నిశ్చితార్థం ముగించుకుని వెళ్లమని చెప్పటంతో వీళ్లు గురువారమే వారి ఒక్కగానొక్క కూతురు రూప్లి నిశ్చితార్థాన్ని నెరవేర్చారు. మోళ చౌహాన్ తల్లితండ్రులుగా భగన్యనాయక్ నిలబడి ఆ కార్యక్రమాన్ని నిర్వహించాడు. ఎందుకంటే శుక్రవారం జరగబోయే వేడుకలో మోళ సంతోషంగా అన్ని బాధ్యతలు చూసుకోవలసి ఉంది.

నిశ్చితార్థానికి మీటు స్నేహితులతోపాటు, ఆసిఫ్‌ఖాన్ కుటుంబం రావడం మరొక విశేషం. సాయంత్రం ఆరుగంటలకంతా బంధువులందరు జంగి-భంగి గుడారం దగ్గర కలిశారు. అడవిలోని ఈత చెట్లనుంచి, తాటిచెట్ల నుంచి దించిన కల్లు ముంతలు, స్వయంగా వారే తయారుచేసిన భట్టిసారాకు కరువు లేకపపోవటంతో కావలసినంత తాగడానికి అవకాశం దొరికింది. వచ్చిన అతిథులు రెండుమూడు ముంతలు తాగి కార్యక్రమానికి సిద్ధమయ్యారు. సమావేశమైన బంధువర్గం ముందు తాంబూలాలు ఇచ్చిపుచ్చుకునే శాస్త్రం ముగించి ఒకటిన్నర నెలలో మంచి ముహూర్తాన్ని చూసి, పెళ్లి జరిపించడానికి నిర్ణయించుకున్నారు.

ఆ నెలన్నరలో మోళ చౌహాన్, రూప్లిల వివాహం జరిగిపోయింది. సామాన్యంగా నెలంతటా జరగాల్సిన పెళ్లి అనివార్య కారణాల వల్ల పదిహేను రోజుల్లోనే ముగిసిపోయింది. మీటు పెళ్లి సమయానికి రూప్లి పుట్టింటికి వచ్చింది. అన్న పెళ్లికి పుట్టింట్లో ఉన్నట్టుంటుందనే ఆలోచనతో ఇంటికి వచ్చింది. సైన్యం మకాం పెట్టిన స్థలం నుంచి పదిమైళ్ల దూరంలో ఉన్న పెద్దపట్టణం నుంచి పెళ్లికొడుకుకు కండువా, తెల్లటి పంచలు, కొత్త చెప్పులు, పెళ్లికూతురుకు రవిక, చీరలు, కొత్త చెప్పులు కొనటం జరిగింది. అనుకున్న మాట ప్రకారం అమ్మాయి ఇంటివారు

ఎంత ధనవంతులైనా కుర్రవాడి ఇంటివాళ్లు అమ్మాయి ఇంటివారికి వియర్‌హోట్ (పెళ్లి సంత) చేయించాల్సి ఉంటుంది. మీటు భుక్యా తండ్రి పంతలు భుక్యా ఆ కార్యాన్ని జంగి, భంగి ఇంటివారికి తన శక్త్యానుసారం జరిపించాడు.

ఆ రోజు సాయంత్రం మీటు భుక్యా కరమ్‌తోట్‌ను పెళ్లికొడుకును చేశారు. ఇంట్లో కొన్ని కార్యక్రమాలు ముగిసిన తరువాత, బయట పందిరి వేసి, దాని మధ్యన కంబళి పరిచి, మధ్యలో ఒక పెద్ద కర్రను నిలిపి మండోవడో (పెళ్లి మంటపం) నిలపటం జరిగింది. వరుడు బయటికి వచ్చినపుడు బెల్లం పానకం కలపడం జరిగింది. అయిదు కంచు చెంబులలో నింపుకుని దేవుడికి నైవేద్యం పెట్టిన తరువాత మొదట తాండా ముఖ్యులైన తాండనాయకుడికి, కారభారికి, డావో లేని కారణంగా చౌహాన్‌లలో ఒకరిని నాయకుడిగా నియమించి అతనికి మొదటి 'ఘోట' (పెళ్లికొడుకును చేసినపుడు ఇచ్చే బెల్లం పానకం) ఇవ్వడం జరిగింది. తరువాత కారభారి, డావో, సమస్త చౌహాన్ వర్గం వారినే నియమించి పెళ్లికొడుకు వైపు నుంచి ఇప్పించడం జరిగింది. సంబంధీకులు, వియ్యంకులు అతని చిన్న చెల్లెలు పారు బాధ్యతను పంతలు భుక్యా బంధువుల మీద వదిలి వచ్చారు. ఇప్పుడు వాళ్లెవరూ పెళ్లిలో లేరనే ఒక కొరత వేధిస్తోంది. అయితే పెళ్లి జరుగవలసివుండటం వల్ల దాని గురించి ఎక్కువగా ఆలోచించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. బంజారగఢ్ నుంచి వేలాది మైళ్ళ దూరంలో ఉన్నారు. బహుశా తిరిగి వెళ్లలేనంత దూరం రావడం జరిగింది. ఏ నరపురుగూ కూడా ఈ వైపు నుంచి ఆ వైపుకు సులభంగా వెళ్లడానికి సాధ్యంకాని దారి అది.

చౌహాన్ కుర్రవాళ్లు బెల్లం పానకాన్ని అంత సులభంగా తీసుకోవటానికి సిద్ధంగా లేరు.

వాళ్లల్లో పెద్దవాడు, మీటును వంగిన భంగిమలో నిలబెట్టాడు.

కొంతసేపటి తరువాత పంతలు భుక్యా, "అరే చాలు, చాలాసేపు అయ్యింది. ఇంత సేపు వంగి నిలుచున్నది చాలు" అన్నాడు.

"మామా, నువ్వు ఊరుకో. మా అమ్మాయిని ఏలుకోవడానికి అతని నడుములో ఎంత శక్తి ఉందో చూద్దాం" అని చౌహాన్ కుర్రవాళ్లు సమర్థించుకున్నారు.

మీటు భుక్యా చూసినంత వరకు చూసి అతని చేతికి చెంబు ఇచ్చి యథాస్థానానికి వచ్చాడు. "ఏయ్ మోసం... మోసం. .. కుర్రవాడు ఓడిపోయాడు" అని వెక్కిరించారు.

మీటు బావ మోళ లేరియా (పెళ్లికొడుకు సహాయకుడు) కావటం వల్ల అతడి రక్షణకు పోయాడు. "ఇక చాల్లేండి. మీరే గెలిచారు. చీకటి పడుతోంది. ఈ

రోజుటి కార్యక్రమాలు ముగించాలికదా! పదండి, పెళ్లికొడుకును బయటికి తీసుకునిపోదాం. ఇంకా పెళ్లికొడుకు కత్తి ఇవ్వాలి" అని ఒత్తిడి పెట్టాడు. "నువ్వు అల్లుడివైపు మాట్లాడుతున్నావు. ఆకువక్కలు ఇవ్వాలి" అని తమ మనవిని ముందు పెట్టారు. "అలాగే, నేనే ఇస్తాను, రండి" అని ముందు జరగబోయే కార్యానికి అందరిని లేపాడు.

అమ్మాయి చీరలు, రవికలు, వంకీలు, ముక్కెర... అన్నిటినీ ఒక దుప్పట్లో వేసి గంటు కట్టి మోళ ఎత్తుకున్నాడు. మీటు భుక్యా మెడలో బంగారు గొలుసు, చేతివేళ్లకు వంకీ ఉంగరం పెట్టుకుని, చేతిలో కత్తిని పట్టుకున్నాడు. మోళ మాత్రం మీటు వెనుక బంజారాల పెళ్లిలో ఉపయోగించే కోత్లిని (సంచిని) పట్టుకునే తిరుగుతున్నాడు. చేతిలో కత్తిని పట్టుకున్న మీటు బయటికి వచ్చి, మిత్రుడు చౌహాన్ చేతికి కత్తి ఇచ్చి కాస్త పక్కకు పోబోయాడు. అది చూసి పెళ్లికి వచ్చిన ఓ వృద్ధుడు, "నాయనా, ఈ కత్తి గొప్పదనం నీకు తెలుసా?" అని అడిగాడు.

నిజానికి దానికి వందేళ్ల చరిత్ర ఉంది. ఆ విషయం మీటుకు తెలియదు.

"లేదు మామా, నిజంగా నాకు తెలియదు" అని మీటు నిజాయితీగా ఒప్పుకున్నాడు.

"అయ్యో దేవుడా, దీని గొప్పదనం నీకు తెలియదా? చెప్తాను విను, పూర్వం పృథ్వీరాజ్ చౌహాన్ అనే రాజు ఉండేవాడు. అతను రాజకుమారి సంయుక్తను ప్రేమించాడు. ఆమె కూడా అతడిని అంతే గాఢంగా ప్రేమించింది" అంటూ ఒక్క క్షణం ఆగాడు.

"ఊఁ తరువాత" అన్నాడు మీటు కుతూహలంగా.

"తరువాత ఏమిటి, ఆమె ఇంటివారికీ, ఈయన ఇంటివారికీ సరిపడేది కాదు. ఇద్దరూ రాజపుత్రులే. అయితే ఒకరిని చూస్తే మరొకరికి పాము ముంగిసను చూసినట్టే. సంయుక్తకు మరొకరితో వివాహం నిశ్చయించారు. ఆ కారణంగా పృథ్వీరాజ్‌కు ఆహ్వాన పత్రిక పోలేదు. అయితే పృథ్వీరాజ్ ఊరకే వదిలేవాడా? మారువేషంలో పెళ్లికి వెళ్ళాడు. సంయుక్త పెళ్లిలో పాల్గొన్నాడు. సప్తపదిలోని ఆరుసార్లు అగ్ని చుట్టూ తిరిగి ఏడవ ప్రదక్షిణ ఆరంభించాల్సిన సమయంలో ఆమెను ఎత్తుకుని పరారీ అయ్యాడు. పెళ్లికొడుకు నిసహాయంగా నోరు వెళ్లబెట్టాడు. ఆ రోజు నుంచే బంజారులు పెళ్లి చేసుకోవాలంటే వారి స్వయంరక్షణకు ఈ కత్తిని పట్టుకోవడం ఆచారంగా మారింది" అన్నాడు వృద్ధుడు.

"ఓ అవునా, నా కత్తిని ఇవ్వండి" అని అంటూ మీటు తన కత్తిని తిరిగి

తీసుకున్నాడు.

"ఏదైనా వదిలేయవచ్చు. కానీ ఈ కత్తిని మాత్రం వదలకు" అని వృద్ధుడు సలహా ఇచ్చాడు.

పెళ్లికొడుకు వచ్చేసరికి చీకటి పడింది. గుడారం దగ్గర ఎక్కువగా అమ్మాయిలే ఉన్నారు. వాళ్ల అల్లరి నుంచి ఎలాగో తప్పించుకున్నాడు. లేకపోతే అమ్మాయిలు అతడిని బాగా ఆటపట్టించేవారు. గుడారానికి నేరుగా వెళ్లి భోజనం కార్యక్రమం ముగియగానే మీటును లోపలికి ఆహ్వానించారు. సాంప్రదాయం ప్రకారం నెల రోజులపాటు అతడిని అక్కడే ఉంచుకుంటారు. మిగిలినవారిలో కొంత మంది అక్కడే ఆగిపోతే, చాలామంది మరుసటి రోజు ఉదయం వెనుతిరిగారు. భగన్యనాయక్ అత్యంత ధనవంతుడు కావటంతో పెళ్లికార్యాన్ని నెలరోజులపాటు వైభవంగా నిర్వహించాడు.

సైన్యం దక్షిణ సరిహద్దు భాగానికి వచ్చినపుడు అనేక సమస్యలు, అడ్డంకులు ఎదురయ్యాయి. వాటన్నిటినీ ఆసిఫ్‌ఖాన్ తెలివిగా ఎదుర్కొన్నాడు. అతనితోపాటు జంగి-భంగిలు, వారి అల్లుడు మీటుభుక్యా కూడా ఉన్నారు. ముఖ్యమైన అనేక బాధ్యతలను మీటు, థావుల మీద వదిలి వాళ్లు అధిక సమయం ఆసిఫ్‌ఖాన్‌తో గడపసాగారు. సైన్యానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలలో భాగం వహించేవారు. దక్షిణాదిన మరాఠాలు బలవంతులు. విజయనగరరాజులు కూడా అదేస్థాయిలో అడ్డంకులు సృష్టించేవారు. ఆసిఫ్‌ఖాన్‌కు దక్షిణాదిమీద అంత సులభంగా విజయం లభించలేదు. మహారాష్ట్ర సరిహద్దును చేరుతుండగానే పోరాటం తీవ్రమైంది. చిన్నచిన్న సైన్యపటాలాలుగా మరాఠులు ఆసిఫ్‌ఖాన్ మీద విరుచుకుపడ్డారు.

మీటుభుక్యా కరమ్‌తోట్ అత్యంత సమర్థవంతంగా వ్యవహారాలు నిర్వహించసాగాడు. అతనికి సరైన సహాయసహకారాలు అతని సోదరుడు థావు, బావ మోళ ఇచ్చేవారు. సైన్యానికి కావలసిన ఆహారాన్ని, వంట సరుకులను అప్పటికప్పుడే అతను ఆసిఫ్‌ఖాన్ హుకుం మేరకు దగ్గర్లోని పెద్దపెద్ద నగరాల నుంచి మోయించుకుని వచ్చేవాడు. ఒక్కోసారి ఆసిఫ్‌ఖాన్‌తో నేరుగా సంప్రదించాల్సి వచ్చినపుడు అతని గుడారంలోకి వెళ్లేవాడు. ప్రతిరోజు ఇంటికి కావలసిన సరుకులనుకూడా వేయటానికి మీటుకు ఉత్తర్వులు ఇవ్వాలని షెహనాజ్ తండ్రికి చెప్పింది. మరుసటి రోజు మీటు ఆసిఫ్‌ఖాన్‌ను కలవటానికి వెళ్లినపుడు మీటుకు ఆయన విషయం చెప్పడం మరవలేదు. "చూడు మీటు, నీకు మరొక బాధ్యత అప్పగిస్తున్నాను. రేపటి నుంచి ఇంటికి కావలసిన వస్తువులన్నీ నువ్వే తెచ్చివేయాలి"

అన్నాడు. "అలాగే ప్రభు" అని మీటు సమాధానం ఇచ్చాడు. అప్పటి నుంచి రోజూ అతనే ఇంటికి కావలసిన సరుకులు చేరవేసేవాడు.

ఆసిఫ్‌ఖాన్ ఇంకా నిద్రనుంచి లేవలేదు. రాత్రి చాలాసేపటి వరకూ సైన్యం ప్రయాణించవలసిన మార్గం గురించి మీటు తన మామ భగన్యనాయక్ దగ్గర చర్చించేవాడు. ఆసిఫ్‌ఖాన్ నిద్ర లేచేసరికి అన్ని యథావిధిగా జరిగిపోయేవి. ఆయన కూతురి పెళ్లి బాధ్యతను కూడా మీటు భుక్యాకే అప్పగించాడు. తనకు అప్పగించిన బాధ్యతను మీటు భుక్యా సమర్థవంతంగా నిర్వహించాడు.

ఆసిఫ్‌ఖాన్ కూతురి నిఖా జరిగిపోయింది. ఆమె కన్నా కాస్త వయస్సులో పెద్దవాడైన లతీఫ్‌ఖాన్‌తో ఆమె వివాహం జరిగింది. ఆ రాత్రి విందు భోజనాల బాధ్యత కూడా మీటునే వహించాడు. లతీఫ్‌ఖాన్ ఇరవైనాలుగు గంటలూ సైన్యపటాలం ముందు వరుసలో ఉండేవాడు.

మీటు సంతోషానికి హద్దులే లేకుండా పోయింది. కారణం అతను ఇప్పుడు తండ్రి అయ్యాడు. లచ్మి ఆరోగ్యంగావున్న మగబిడ్డకు జన్మయిచ్చింది. వాళ్ల గుడారం నుంచి కంచు కంచం వాయించి మగబిడ్డ పుట్టిన సంతోషాన్ని ప్రకటించడం జరిగింది. పంతలుభుక్యా దాదా అయ్యాడు. సామ్కి డోక్రి దాది అయ్యింది. భగన్యనాయక్ నానా అయ్యాడు. మీటుభుక్యా కరమ్‌తోట్ తండ్రయ్యాడు. అన్ని గుడారాలకు ఈ వార్త చేరింది. పంతలుభుక్యా చేతికి అందిన బెల్లంసంచి నుంచి బెల్లం పంచడానికి ఒక వైపు నుంచి మనుషులను పంపితే, జంగి-భంగిలు సంచుల కొద్ది బెల్లం మిఠాయిలను, డబ్బులను పంచసాగారు. మొత్తం సైన్యానికి మిఠాయిలు పంచడం జరిగింది. ఆసిఫ్‌ఖాన్ పరివారానికి మిఠాయిల బుట్టను తీసుకుని మీటు జంగి-భంగిలతోపాటు బయలుదేరాడు. "ఆఁ జంగి-భంగి దోనో నానాబన్‌గయే... బదాయి" అంటూ ఆసిఫ్‌ఖాన్ వాళ్లిద్దరికి అభినందనలు తెలిపాడు. "మీటుకా పైర్ అబ్ జమీన్‌పర్ నహీ.... ఇప్పుడు బాప్ అయిపోయాడు" అంటూ అతన్ని మనసారా అభినందించాడు.

ఖాన్ సాహెబ్ గుడారం నుంచి కాస్త తొందరగానే తమ గుడారం వైపు మీటు బయలుదేరాడు.

మీటు మామ భగన్యనాయక్ తన వ్యక్తిగత సైన్యంతో పూర్వాభిముఖంగా బయలుదేరాడు. ఖాన్‌సాహెబ్‌కు ముందుకు పోయినట్టల్లా అడవి మధ్యలో కొన్ని ప్రదేశాలు మకాం పెట్టడానికి ఆయనకు అనుకూలంగా కనిపించాయి. అక్కడే విడిదిచేసి అక్కడి ప్రజలను విచారణకు గురిచేయడం జరిగింది. అందువల్ల అనేక

విషయాలు సంగ్రహించిన ఖాన్‌సాహెబ్ దక్షిణం ఇక తన చేతికి చిక్కినట్టేనని భావించాడు. విజయనగరం, హొయ్సళ, హైదారాబాద్, కేరళ, తంజావూరు ఇలా అన్నీ ప్రాంతాలపై ఆక్రమణకు ఉన్న అవకాశాలపై తీవ్రంగా ఆలోచించసాగాడు.

తిరిగి బయలుదేరిన భగన్యనాయక్ దట్టమైన అడవిలో దారి తప్పి అరణ్యం మధ్యభాగంలో ప్రవేశించటంవల్ల రాత్రంతా అక్కడే దిక్కుతోచనట్టు తన సహచరులతోపాటు సంచరించసాగాడు. అడవిలో దొరికిన కొన్ని పళ్లను తిని,ఆ రాత్రి అక్కడే గడపటానికి నిర్ణయించుకున్న భగన్య నాయక్ కొండకు ఆనుకుని నిలబడ్డ పెద్ద బండకింద మకాం పెట్టడానికి ఏర్పాట్లు చేయమని సైనికులకు సూచించాడు. నాలుగు అడుగులు బండ వైపు వేశాడు. అయితే బండచాటున ఆహారం కోసం పొంచి కూర్చున్న పులి హఠాత్తుగా అతని మీదికి దూకింది. "రక్షించండి" అంటూ కేకలు వేశాడు. గుడారం వేయడానికి సిద్ధమవుతున్న సైనికులు వెంటనే అతని దగ్గరికి పరుగున వచ్చారు. అప్పటికే పులి అతన్ని తీవ్రంగా గాయపరిచింది. సైనికులు తమ దగ్గరున్న బరిసెలతో పులిని బెదిరించి తరిమారు. "మనిషి రక్తం రుచి చూసిన పులి మనల్ని బతకనివ్వదు. పదండి" అంటూ గాయపడ్డ భగన్యనాయక్ గాయానికి బట్టలుచుట్టి గుర్రం మీద కూర్చోబెట్టుకుని అక్కడి నుంచి సరక్షితమైన ప్రదేశాన్ని అన్వేషిస్తూ బయలుదేరారు. ప్రయాణించవలసిన దూరం అధికంగా ఉండటం వల్ల గుర్రాల వేగాన్ని పెంచారు. వారు గుడారాల దగ్గరికి వచ్చేసరికి తెల్లవారింది. విషయం తెలిసిన మీటు, థావు భగన్యనాయక్ దగ్గరికి పరుగుతీశారు. పులి చేసిన గాయం లోతుగా ఉంది. మెడ కింద, భుజం మీద బలంగానే దాడి చేసింది. భగన్యనాయక్ గాయాల నుంచి రక్తం అధికంగా కారటం వల్ల అతను బాగా నీరసంగా ఉన్నాడు. ఖాన్‌సాహెబ్ సైన్యం వెంట రాజవైద్యుడు వెళ్లి ఉండటంతో, వీళ్లు తమకు తెలిసిన ఆకుపసరులతోనే వైద్యం చేసి గాయానికి కట్టుకట్టారు. పులి జరిపిన దాడి గురించి ఖాన్‌సాహెబ్‌గారికి వార్త చేరవేసి, పులి గురించి జాగ్రత వహించాలని కబురు అందించారు. అయితే చాలావరకు ఆయన ఇప్పటికే వెనుతిరిగి ఉండొచ్చు. ఒకసారి మనిషి రక్తాన్ని రుచి చూసిన పులి మళ్లీ దాడి చేయటం కచ్చితమని తెలిసిన మీటు, భగన్యనాయక్‌కు మెలకువ వచ్చిన తరువాత తానే బయలుదేరాలని నిర్ణయించుకున్నాడు. సాధ్యమైతే తన మామను గాయపరిచిన పులిని చంపో లేదా బంధించో తెచ్చి మామకు సమర్పించాలనే ఆలోచన అతనిది. ఈ విషయం చెప్పి బయలుదేరితే గాభరా పడుతారేమోనని, అదే అడవిలో ఆ పులి నుంచి ఖాన్‌సాహెబ్‌గారికి ప్రాణాపాయం ఉండొచ్చని చెప్పి

చెల్లెలి భర్త మోళతోపాటు దృఢకాయులైన యువకులతో అడవిలోకి బయలుదేరాడు.

పులి ఉన్న బండ దగ్గరికి వచ్చేసరికి చీకటి కమ్ముకునివుంది.

"ఎవరూ కంగారు పడకండి. ఆ పులి వేటకు వెళ్లివుంటుంది. లేదా ఇక్కడే ఎక్కడో దాక్కుని ఉంటుంది" అని మీటు హెచ్చరించాడు. దాంతో సైనికులందరూ అందరూ ఒళ్లంతా కళ్లు చేసుకుని కాపలా కాయసాగారు. దట్టమైన అడవిలో చలికి రాత్రి రంగులు మారుస్తోంది. ఘడియకొక ప్రమాదం ఎదురుపడుతోంది. మీటు వాటినంతా అధిగమించి నిలబడ్డాడు. అతనికి అనుమానంకలిగింది. ఖాన్‌సాహెబ్ బయలుదేరివుంటే వచ్చేదారిలో ఎదురయ్యేవారు. ఆయన బయలుదేరినా, ఆయన చుట్టూ పెద్ద సైన్యపు పటాలం ఉండటంవల్ల ఆయనకు ఎలాంటి ప్రమాదం లేదని అనుకున్నాడు. ఖాన్‌సాహెబ్‌గారు ఈ మార్గంలో వచ్చేలోపు ఆయనకు ఆశ్చర్యకరమైన వార్తను అందించాలనే తపన మీటుది. అయితే ఆ పాడుమృగాన్ని ఎలా వెతకాలి? అతని ఆలోచనలన్నీ చీకట్లో ప్రకాశవంతంగా మెరిసిన పులికళ్లను చూడగానే ఎగిరిపోయి బుర్ర మొత్తం శూన్యమైంది. పులిమీద ఎలా దాడి చేయాలని అతను, అతని మీదికి ఎలా దూకి, మెడను పట్టి రక్తం పీల్చాలని పులి ఎదురుచూస్తున్నట్టుగా ఉంది. ఎవరు ఎవరికి బలవుతారో బతికినవారు మాత్రమే చెప్పగలరు. పులి హఠాత్తుగా గర్జించి మీటు మీదికి ఎగిరింది. మీటు తనవారిని హెచ్చరిస్తూ పులి మీదికి లంఘిస్తూ దాని గొంతులో కత్తిని దింపాడు. అదే సమయంలో అతనితోపాటు వచ్చిన దృఢకాయులు హఠాత్తుగా దాడి చేసిన ఆ మృగం నుంచి తప్పించుకుంటూ తమ చేతుల్లోని కత్తులు, ఈటెలు, బల్లేలతో దాని నోటి మీద, పొట్ట మీద ఏకకాలంలో దాడిచేశారు. దాని కథ ముగిసింది. అది ప్రాణాలొదలటానికి మునుపు చేసిన గర్జనలు మూల్గులు వినిపిస్తూనే ఉన్నాయి. వీళ్లు దాన్ని వదిలి, ఎండిన కట్టెపుల్లలను పోగు చేసి, మంట వేసి, ఆ వెలుతురులో తాము తెచ్చుకున్న ఆహారాన్ని తినటానికి సిద్ధమయ్యారు. మీటు నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు. ఖాన్‌సాహెభ్‌గారు ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా ఈ దారిలో రావచ్చనే నమ్మకం అతనికి కలిగింది. రాత్రి అక్కడే విడిది చేసి విశ్రాంతి తీసుకోవాలని ఆలోచించాడు. ఖాన్‌సాహెబ్‌గారికి ఎలాంటి ప్రమాదం కలగకూడదని అతని అభిప్రాయం.

దక్షిణానికి పంతలు భుక్యా బయలుదేరినపుడు మీటు, థావులు కాకుండా మిగిలిన పిల్లలు కూబ, పారులను అక్కడే వదిలి వచ్చాడు. ముస్లిమ్ పాలనా వేడి తగ్గిన తర్వాత, పెద్ద కూతురు రూప్లి వివాహం జరిగిపోయిన తర్వాత, రాజస్థాన్‌లోని సంక్రెబాక్రికి తిరిగి వెళ్లిపోవాలని అతని ఆలోచన. కొడుకులు కష్టపడి, పనులు

చేసి, కొంత సొమ్ము సంపాదిస్తే, దాన్ని దాంతో మునుముందు ఏదైనా చిన్న వ్యాపారం చేసుకోవచ్చునే అభిప్రాయంతో వచ్చాడు. అయితే వచ్చిన తర్వాత అక్కడ కూబ, అతని చెల్లెలు పారు ఎలా ఉన్నారో అనే విచారం వారిని వేధించింది. పంతుభుక్యా కరమ్‌తోట్, అతని భార్య సామ్కిబాయి అనేక రాత్రులు పిల్లల చింతలోనే గడిపారు. ఇప్పుడు ఇక్కడ కొడుకులను అదృష్టం వరించింది. వాళ్లకు ఒక దారి ఏర్పడింది. వాళ్లు ఒక స్థాయికి వచ్చారు. ఇద్దరు కుమారుల పెళ్లిళ్లు అయిపోయాయి. కూతురు రూప్లి వివాహమూ అయిపోయింది. అందరరూ సంతోషంగా ఉన్నారు. అయితే అక్కడ? పరిస్థితిని ఊహించలేకపోయారు. దాంతో దంపతులిద్దరూ వెళ్లి పెద్దకొడుకు మీటు భుక్యా దగ్గర తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

"బేటా మీటూ, మనం ఇటు వైపు వచ్చి చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. సంక్రెబాక్రి తాండ విషయాలు ఏమీ తెలియటం లేదు. అక్కడ మీ చెల్లెలి పరిస్థితి ఏమైందో ఆ భవానీ మాతకే తెలియాలి" అని పంతలు భుక్యా దుఃఖంతో మాట్లాడలేక మౌనం వహించాడు. అంతులేని దూరాలను అతిక్రమించి, ఎక్కడో ఒకచోట సంతానోత్పత్తిని చేసి, కన్న సంతానాన్ని పెంచి, తమ స్వస్థలాలకు తిరిగి వస్తారని తాండాలోని పెద్దలు మాట్లాడుకోవడం విన్నారు. అయితే ఈ దుర్గమ అరణ్య మార్గంలో ముందుకు సాగటమే తప్ప వెనక్కు వెళ్లటం అసాధ్యమని అనించింది. సామ్కి కొంగులో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడవసాగింది. ఉన్నట్టుండి తాండాను గుర్తుచేసిన తల్లితండ్రులను ఓదార్చుతుండగా, తాను పుట్టిపెరిగిన, ఆడిపాడిన, సంతోషంగా గడిపిన క్షణాలు కళ్లముందు కదిలినట్టయి మీటు కూడా భావోద్వేగానికి లోనయ్యాడు.

తాండలోని కుర్రవాళ్లకు మీటు అంటే ఏదో ఆకర్షణ. అతని ప్రవర్తన, మాటలు, పద్ధతులు, ధైర్యం, సన్నివేశాలను ఎదుర్కొనే చాకచక్యం వల్ల మొత్తం తాండ కుర్రవాళ్లందరికి అతను ఆరాధ్య నాయకుడయ్యాడు. మరొకవైపు మొఘలుల దర్పం, ముస్లీముల ప్రాబల్యం. జీవితం దుర్భరమైంది. అదొక భయంకరమైన స్వప్నంగా వారిని వెంటాడేది. అయినా చిన్నాచితకా పనులు చేస్తూ జీవనం సాగించటం కోసం తండ్రి కొడుకులు చిల్లర కాసులు సంపాదించేవారు. ఇలా ఎప్పటివరకు జీవనం సాగించాలా అనే భయం వాళ్లను వేధిస్తూనే ఉంది. అదే తాండలోని కొంత మంది యాభై, వంద పశువులు కలిగిన మందను పెట్టుకుని వ్యాపారం చేస్తుండేవారు. ఢిల్లీ, రాజస్థాన్‌లోని ఇతర ప్రాంతాలు, ఉత్తరప్రదేశ్, పంజాబ్‌వరకూ వాళ్లు ప్రయాణించి, సుగంధద్రవ్యాలు, కిరాణా సరుకులు అమ్మి

సంవత్సరానికి ఒకసారి సం[క్రైబా[క్రికి తిరిగి వచ్చేవారు. మళ్లీ దీపావళి ముగించుకుని బయలుదేరితే హెూలి పండుగకు తిరిగొచ్చేవారు. అలాంటి ఒక చిన్న వ్యాపారం చేయడానికి మీటుకు కానీ, అతని తం[డికి కానీ తగి ఆర్థికస్తోమత లేదు. ఆ కారణంగా అక్కడే వాళ్లు చిన్నాచితకా పనులు చేసుకుంటూ పగటి కలలు కనకుండా బతుకు సాగించారు.

ఇప్పుడు హఠాత్తుగా తల్లిదం[డులు సం[క్రైబా[క్రి తాండకు వెళతామనటంతో మీటుకు దిక్కుతోచనట్టయ్యింది.

అదే సమయంలో భగన్య నాయక్ భార్యతో అక్కడికి వచ్చాడు.

"మీటు బేటా, మీ మామగారు వచ్చారు" అని అతని తల్లి చెప్పటంతో మీటు సం[క్రైబా[క్రి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు.

వెంటనే బయటికి వచ్చి–

"మీరెందుకు [శమ తీసుకున్నారు మామసా. చెప్పి పంపితే నేనే వచ్చేవాణ్ణి కదా!" అన్నాడు మీటు ఆయన పరిస్థితి [గహించి.

"జమాయిసా, కూతురి ఇంటికి రావడానికి ఇదొక అవకాశం. కబురు పంపితే మీరు వచ్చేవాళ్లు. అయితే ఇలా రావడం మాకు సంతోషం కలిగించే విషయం" అన్నాడు భగన్యనాయక్.

"రండి...రండి... లోపలికి రండి" అని లోపలికి పిల్చుకునిపోయారు. వారితో సంబంధం కలిసిన తరువాత వీరి ఆర్థికస్థితి, వీరి జీవిత విధానం కూడా మారింది. జలపాన్ తరువాత భోజనాల ఏర్పాట్లు జరగసాగాయి.

"మేము కాసేపు తమతో కాలం గడపటానికి వచ్చాం. రండి, కూర్చోండి. ఆc...హాయిగా, ఎలాంటి సంకోచం వద్దు". భగన్యనాయక్‌కు నిజంగానే ఈ జీవిత [ప్రయాణంలోని కష్టాలు,బాధలు, ఇబ్బందులు, అనేక రీతుల అనుభవాలు, తర్వాత అభివృద్ధి, అంతులేని ఐశ్వర్యం సంపాదించటం...ఇప్పుడు వీటిపై ఎందుకో ఆసక్తి పోయింది. విరక్తి కలిగింది. కొంతకాలంగా మనసులో తన జన్మస్థలం పదేపదే పిలుస్తున్నట్టు అనిపించింది. దాంతో అతను తిరిగి బంజారాగఢకు వెళ్లిపోవాలనే నిర్ణయానికి వచ్చాడు. అయితే తిరిగి వెళ్లడం అంత సులభం కాదని అతనికి తెలుసు. అయినా వెళ్లాల్సిన అవసరం ఉండటం వల్ల తన తమ్ముడు జంగినాయక్‌తోపాటు మీటు మీద సమస్త బాధ్యతలు మోపి వెళ్లటానికి నిశ్చయించుకుని ఆ విషయాన్నే చెప్పటానికే వచ్చాడు. "జమాయిసా, తమతో అవసరంగా ఒక విషయం మాట్లడవలసి ఉంది" అని లేచి బయటికి నడిచాడు. మీటు మామగారి వెంబడి బయటికి

నడిచాడు. "మా వయస్సు దాటింది. పులి దాడిచేసిన రోజు నుంచి ఎందుకో ఒక విధమైన భయం వేధిస్తోంది" అని ఒక క్షణం మౌనంగా ఉండిపోయాడు. మీటు ఆయన మాటలు వింటూ మౌనంగా అడుగులు వేస్తున్నాడు. "అది కాదు మామగారు. అంత కంగారు ఎందుకు? నేనున్నానుకదా!" అని చెప్పబోయాడు. "అయితే జమాయిసా, బంజారగఢ్ వదిలి చాలా ఏళ్లు గడిచిపోయాయి. ఇంటి జ్ఞాపకాలు తీవ్రంగా వేధిస్తున్నాయి. అక్కడ మా తల్లితండ్రుల పరిస్థితి ఎలావుందో? అసలు బతికి ఉన్నారో లేదో? ఈ వ్యాపార వ్యవహారాలతో విసిగిపోయాను. ఇక ఇది చాలించాలని అనుకుంటున్నాను" అని ఆయన తన దృఢనిర్ణయాన్ని బయటపెట్టాడు.

"తాము వెళ్లిపోతే మా పరిస్థితి?" మీటు తన లోపలి భయాన్ని వ్యక్తం చేశాడు.

"మీరు ధైర్యవంతులు. మీ చిన్నమామ జంగినాయక్‌తో కలిసి వ్యాపార బాధ్యతలు మీరు మోసుకోవాలని మా కోరిక. మేము రేపు బంజారగఢ్‌కు చిన్న పటాలంతో బయదేరుతాం" అని అన్నాడు.

మీటు తల్లితండ్రులు కూడా సంక్రెబాక్రికి వెళ్లాలనే అభిప్రాయాన్ని అంతకు ముందు మీటు దగ్గర వ్యక్తపరిచారు.

ఆ విషయం మీటుకు జ్ఞాపకం వచ్చింది.

"తాము ఇలా హఠాత్తుగా బయలుదేరితే మేము మీ ఎడబాటును భరించడం ఎలా?" అని వాళ్ల ప్రయత్నాన్ని ఆపటానికి ప్రయత్నించాడు.

"బేటా, మా శరీరపరిస్థితి మాకు సహకరించడం లేదు. ఎప్పుడు ఏమవుతుందోననే భయం వేధిస్తోంది. చనిపోయేలోపు మా మాతృభూమికి తిరిగి వెళ్లాలన్నది మా కల. యుద్ధం ముగిసి ఆసిఫ్‌ఖాన్‌గారు దక్షిణంలో పాలన చేబట్టిన తరువాత, మీరూ తిరిగి వచ్చేయవచ్చు" అని ధైర్యం చెప్పాడు.

"సరే, మీరు నిర్ణయించుకున్న తరువాత అలాగే కానివ్వండి. అయితే నాదొక విన్నపం. తమతోపాటు మా తల్లితండ్రులు రావచ్చా?" అని జవాబు కోసం ఎదురుచూశాడు.

"అది మరీ మంచిది" అని ఆయన వెంటనే తన సమ్మతి తెలిపాడు.

తరువాత ఇద్దరూ తమ గుడారానికి తిరిగొచ్చేసరికి సారాముంతలు సిద్ధంగా ఉన్నాయి. అపురూపంగా వచ్చిన వియ్యంకులను పంతలు భుక్యా కుటుంబసభ్యులు అత్యంత గౌరవంగా చూసుకున్నారు. ఆ రోజు చేస్తున్న చివరి భోజనం వారి మనసులో ఏదో భయాన్ని కలిగిస్తోంది. అయితే ఆ విషయాన్ని భగన్యానాయక్

వ్యక్తం చేయలేదు. కూతురితో, మనుమడు దేసు భుక్యా కరమ్‌తోట్‌తో చాలాసేపు కాలం గడిపాడు. తాము బంజారాగఢకు తిరిగివెళ్లే ప్రయత్నంలో ఉన్నామని కూతురుకు చెబితే ఆమె కంగారు పడుతుందని మౌనం వహించాడు. అయితే చెప్పకుండా వెళ్లటం అసాధ్యమని ఆయనకు తెలుసు. విషయం చెబితే కూతురి ప్రతిస్పందన ఎలా వుంటుందో అంచనా వేయలేకపోయాడు. చివరికి గొంతు పెగుల్చుకుని–

"లచ్మిబేటీ, రేపు నేను, మీ అమ్మ, మీ అత్తామామలు రాజస్థాన్‌కు తిరిగి వెళుతున్నాం" అని అంటూ ఆమె ముఖం చూశారు.

తాను విన్నదేమిటో ఆమెకు ఒక్క క్షణం అర్థం కాలేదు. అర్థమైన తర్వాత–

"బాబాసా, తాము ఏమి చెబుతున్నారు?" అంది కళ్లల్లోంచి బొటబొటా కన్నీళ్లు రాలుతుండగా.

"పరిస్థితులు అలా ఉన్నాయి బేటీ. ఎందుకో బంజారాగఢ్‌లోని మీ నానమ్మ, తాతయ్యల జ్ఞాపకాలు వేధిస్తున్నాయి. అయినా ఇక్కడ చిన్నాన్న ఉంటాడుకదా !" అని ఓదార్చసాగాడు.

ఆమె పుట్టినప్పటి నుంచి కన్నవాళ్లకు దూరమవ్వటం ఇదే మొదటిసారి. అంతేకాదు, ఇక వాళ్లు వెళితే బహుశా మళ్లీ వాళ్లను కలవటం అసాధ్యమని ఆమెకు అనిపించింది. రాబోయే రోజులు ఎలా ఉంటాయో ఎవరికి తెలుసని అనుకుంది.

"అయినా బాబాసా, మీరు ఇలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉండాల్సింది" అని గద్గదిక కంఠంతో అంది.

"మేము వెళ్లడం తప్పదు బేటీ. అయినా పులిలాంటి భర్త, పులిపిల్లలాంటి కొడుకు దేసుభుక్యా కరమ్‌తోట్‌లు ఉన్నారుకదా. ఇంకేమి కావాలి బేటీ. ఖాన్‌సాహెబ్‌గారు దక్షిణంలో యుద్ధం ముగించి, సామ్రాట్టు కాగానే మీరుకూడా తిరిగి వచ్చేయండి" అని ఆమె మనస్సులోని దుఃఖాన్ని తగ్గించే ప్రయత్నం చేశాడు.

అయితే వాస్తవం ఆమె ఊహించలేనిది కాదు. పైగా తండ్రి నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం ఆమెకు లేదు. తల్లితండ్రుల ఎడబాటునే భరించలేని ఆమె, తల్లితండ్రులకన్నా ఎక్కువగా ప్రేమించే అత్తామామలు కూడా వారి వెంబడి బయలుదేరుతున్నారని తెలిసి భరించలేకపోయింది. 'అయ్యో దేవుడా, ఇక ముందు మాకు ఎవరు దిక్కు?' అని మనసులోనే భగవంతుడికి మొరపెట్టుకుంది. భోజనాలు ముగించి, వేకువనే బయలుదేరవలసి ఉన్నందువల్ల, వియ్యంకులనూ సిద్ధంగా వుండమని చెప్పి తమ గుడారానికి భగన్యానాయక్ దంపతులు మరలారు.

కూతురి మనసులోని కల్లోల్లాన్ని గ్రహించిన భగన్యనాయక్, అతని భార్య లోలోపలే గుండెలు అవిసేలా రోదించసాగారు. అయితే బయటికి మాత్రం ఏమీ జరగలేదన్నట్టు నటించసాగారు. లచ్మికి మాత్రం ఎవరో హృదయాన్ని కోసి ముక్కలు ముక్కలు చేసిన అనుభవం కలగసాగింది. విసుగు, ఒంటరితనం, భయం ఒకదాని తరువాత ఒకటి తోసుకుని రాసాగాయి. తండ్రి నిర్ణయం పిడిగుపాటులా అనిపించింది. రాత్రంతా నిద్రరాక పక్కమీద దొర్లసాగింది. భర్తకు చెప్పలేని పరిస్థితి, ఇంత తొందరగా తాను తల్లితండ్రులకు దూరమై అనాథ అవుతుందని అనుకోలేదు. తాను కూడా సంక్రైబాక్రికి తల్లితండ్రులతోపాటు వెళ్లాలనే ఆలోచన మనసులో మెదిలింది. అదే విషయాన్ని భర్తకు చెప్పాలని అతని వైపు తిరిగింది. అయితే అప్పటికే అతను నిద్రలోకి జారుకుని వుండటం కనిపించింది.

వేకువజామునే భగన్యనాయక్, అతని పరివారం, పంతలు భుక్యా కరమ్‌తోట్, అతని భార్య బయలుదేరడానికి సిద్ధమయ్యారు. ఆసిఫ్‌ఖాన్ స్వయంగా వారికి వీడ్కోలు చెప్పడానికి రాబోతున్నాడు. లచ్మి దుఃఖాన్ని ఆపుకోలేకపోతోంది. అత్త సామ్కిని కౌగిలించుకుని ఆమె 'యాతియే తారబిన కింవ్‌రూయెయా ఆహియా'(అమ్మా, నిన్ను వదిలి నేను ఉండలేను) అంది. మీటు, థావు, రూప్లి, ఆమె భర్త దుఃఖంతో వెక్కివెక్కి ఏడవసాగారు. సామ్కి కూతురును, పిల్లలందరిని కౌగిలించుకుని ముద్దాడింది. ఆసిఫ్‌ఖాన్ సాహెబ్‌గారు ఎంత వేగంగా వచ్చారో అంతే వేగంగా వీడ్కోలు చెప్పి తమ చిన్న పటాలంతో వెళ్లిపోయారు. నిజానికి ఆయన భగన్యనాయక్ ఎడబాటును భరించలేకపోతున్నారు. ఎక్కువసేపు అక్కడ ఉంటే ఎక్కడ తానూ పిల్లవాడిలా ఏడ్చేస్తాడేమోననే అనుమానంతో వెంటనే వెళ్లిపోయారు. మళ్లీ జీవితంలో కనిపిస్తారో లేదోనని లచ్మి, మీటులు తమ తల్లితండ్రుల రూపాలను తమ మనస్సులో భద్రపరుచుకోసాగారు. పరిస్థితి ఏ అవస్థకు చేరుస్తుందో ఏ ఒక్కరికీ అర్థం కాలేదు. బయలుదేరినవారు సురక్షితంగా గమ్యం చేరుతారా అనే అనుమానం ఒకవైపు వేధిస్తోంది. ఇక్కడివాళ్లు తిరిగి వెళతారో లేదోననే భయం వాళ్లను నలిబిలిచేసింది.

ఆసిఫ్‌ఖాన్‌గారు హడావుడిగానే తమ గుడారానికి మరలిపోయారు. ఆయన ఒక్కగానొక్క కూతురుకు పురిటి నొప్పులు కనిపించాయన్న వార్త వచ్చింది. ఆయన తాను బయలుదేరుతూ మీటును కూడా తమతోపాటు పిల్చుకునిపోయారు. ఇష్టంలేని మనస్సుతోటే, తల్లితండ్రులకు మనస్ఫూర్తిగా వీడ్కోలు కూడా చెప్పలేక మీటు ఖాన్‌సాహెబ్‌గారి వెంట బయలుదేరాడు. వీళ్లు అక్కడ చేరేసరికే దాసీలు, ఆయాలు, మంత్రసానులు పరిస్థితిని చక్కగా నిర్వహించడం వల్ల పండంటి మగబిడ్డను షెహనాజ్

ప్రసవించింది. అప్పటికే 'మహరాజ్ బదాయి హెూ' అనే సందేశం వచ్చింది. జంగినాయక్ ఆసిఫ్ ఖాన్‌కు అభినందనలు తెలిపాడు. "తాము నానా అయ్యారు మహాప్రభు" అని అన్నాడు. దానికి సమాధానంగా "మీరు నాకంటే ముందే నానా అయ్యారు" అని ఖాన్‌సాహెబ్ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మీటు ముందుకు వచ్చి, "లతీఫ్‌ఖాన్ వచ్చారు" అని తెలిపాడు.

"ఆవో లతీఫ్.. బేటీ బదాయి మీకు" అని ఖాన్‌సాహెబ్ అల్లుడికి అభినందనలు తెలిపారు.

లతీఫ్ ఆనందంతో సిగ్గపడుతూ ధన్యవాదాలు తెలిపాడు.

ఆసిఫ్‌ఖాన్, ఆయన శ్రీమతి షెహనాజ్ ఉన్న గుడారంలోకి వెళ్ళారు. వాళ్ళతోపాటు జంగినాయక్ కూడా వెళ్లాడు. మీటు బయటే నిలుచున్నాడు. అది చూసి ఖాన్‌సాహెబ్ అతడిని లోపలికి పిలిచాడు. అది చూసి లతీఫ్ ముఖం మాడిపోయింది. తన మామ మీటుకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వడం అతనికి ఎందుకో నచ్చలేదు.

బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో అందరూ ఆనందంగా ఊపిరి పీల్చుకున్నారు.

"బదాయిహెూ షెహనాజ్‌బేటీ" అని ఆసిఫ్‌ఖాన్ కూతురికి శుభాశీస్సులు తెలిపారు.

"అబ్బాజాన్, తమకు అభినందనలు. మీరు నానా అయ్యారు" అంది.

అందరూ అభినందనలు తెలిపి బయటికి వచ్చారు.

మీటు కూడా అభినందనలు తెలిపి బయటికి వచ్చి కొద్దిదూరంలో నుంచున్నాడు.

మీటు భార్య లచ్మికి ఆమె చిన్ననాటి స్నేహితురాలు.

కొద్దిసేపటి తరువాత ఆసిఫ్‌ఖాన్ నుంచి మీటుకు పిలుపు వచ్చింది.

అతను వెళ్లేసరికి జంగినాయక్‌తో సుదీర్ఘమైన చర్చలో ఉన్న ఆసిఫ్‌ఖాన్ "దక్షిణ ప్రాంతాన్ని ఆక్రమించడానికి ఇప్పటివరకు సాధ్యంకాకపోవడంతో బాద్‌షాగారు అసంతృప్తిగా ఉన్నారు. సందేశం పంపారు. వీలైనంత తొందరగా మనం దక్షిణ ప్రాంతాన్ని ఆక్రమించాల్సిందే" అని ఆసిఫ్‌ఖాన్ తన చివరి నిర్ణయాన్ని తెలిపారు. దక్షిణ ప్రాంతంలో ఎవరు బలంగా ఉన్నారో కనుక్కుని వారి మీద యుద్ధానికి పోవటమో లేదా వాళ్ల నుంచి కప్పం తీసుకోవటమో ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నారు. మీటుకు సైన్యానికి ఆహారంతోపాటు సమయానికి ఆయుధాలను సమకూర్చే బాధ్యతను, యుద్ధంలో ముందు వరుసలో జరగవలసిన కార్యకలాపాల

గురించి ఎక్కువ జాగ్రత్త వహించే బాధ్యతలను అప్పగించడం జరిగింది.

తన తెలివివల్ల, చాకచక్యం వల్ల ఆంధ్ర సరిహద్దులోకి ప్రవేశించి చిన్నస్థాయి పాలెగాళ్లమీద, అడవిలో నివసిస్తున్న అడవిజనం మీద తమ విజయాన్ని సాధిస్తూ, హైదరాబాద్ పట్టణంలో ప్రవేశించి, అక్కడి నుంచే ఇతర ప్రాంతాలను పాలించాలనే ప్రయత్నం ఆసిఫ్‌ఖాన్‌ది. హైదరాబాద్‌లో కోటను నిర్మించాలనే ప్రణాళిక వేసుకున్నారు. ఆయన వెంబడి ఆహారసామాగ్రిని తీసుకొస్తూ, శత్రువుల కదలికలను గమనిస్తూ సమాచారాన్ని అందజేస్తూ ముందుకు దూసుకుపోయిన మీటు సాహసం వల్లనే ఆసిఫ్‌ఖాన్‌కు విజయం దక్కింది. యుద్ధపు తీవ్రత వల్ల దూరంలో ఉన్న భార్యాపిల్లల విషయమే తెలియకుండాపోయింది. కొంతమంది సైనికులు వార్తను అందుకోవటానికి వున్నప్పటికీ మీటు భుక్యా కరమ్‌తోట్ గుప్తకార్యాచరణలో ఉండటం వల్ల అతనికి ఏ సమాచారం సరిగ్గా చేరటం లేదు. దొరికిన కొద్దిపాటి సమయంలో ఇంటి విషయాలు తెలుసుకునే కుతూహలం వల్ల తమ్ముడు థావును వెతుకుతూ వెళ్లాడు.

అతని రాకకోసమే ఎదురుచూస్తున్న థావు, “భీయా (భయ్యా)” అని పిలిచాడు.

అతని ముఖాన్ని చూసిన మీటు, “ఏమైంది, ఎందుకు ముఖం ఇంత నీరసంగా పెట్టుకున్నావు?” అని ఒక్క ఊపిరిలో అడిగాడు.

“ఏం లేదు, అది...” థావుకు నోటమాటలు రాలేదు.

“ఎందుకు నీ నోట మాటలు రావడం లేదు. అక్కడ లచ్మి, బిడ్డ, నీ భార్య, చెల్లెలు రూప్లి అంతా బాగున్నారు కదా ?” అని ఉద్వేగంతో అడిగాడు.

“అందరూ ఆరోగ్యంగా ఉన్నారు. అయితే...” అతను దుఃఖంతో మాటలు కొనసాగించలేకపోయాడు.

“ఏమైందో చెప్పు. ఎవరికి ఏమైంది?” అని గట్టిగా అరిచాడు. “రూప్లి భర్త మోళ యుద్ధంలో చిక్కుకుని చనిపోయాడు” అని చెప్పాడు కన్నీళ్ళు కారుస్తూ.

ఒక్క క్షణం కాలం స్తంభించినట్టయ్యింది. చెల్లెలిభర్త అనటంకన్నా స్నేహితుడిగానే అతను ఆత్మీయుడయ్యాడు. ఇంత చిన్న వయసులో చెల్లెలు వితంతువు కావటాన్ని మీటు భరించలేకపోయాడు. ఒక్కసారిగా జీవితమంటేనే విరక్తి కలిగింది. ఏదీ వద్దనిపించింది. తన విజయంలో సంతోషపడే కొందరిలో మోళ ఒకడు.

“ఇదంతా ఎలా జరిగింది?” అని బాధపడుతూ అడిగాడు.

“ఒక రోజు ఎద్దులను తోలుకుంటూ వాటి వెనుకే బయలుదేరిన మనవారి వెంటపడిన శత్రువులు మోళ, దాము, హేమ్లు, పీకా మొదలైనవారిని చంపి ఆహారధాన్యాలతోపాటు ఎద్దులను తోలుకునిపోయారట. బహుశా వాళ్లకు మనం

ఢిల్లీ సుల్తాను సైనికులని అనుమానం వచ్చిండొచ్చు" థావు దుఃఖం ఆపుకోలేక వెక్కివెక్కి ఏడవసాగాడు.

మీటుకు చాలా బాధ, సంకటం కలిగింది. ఎందుకు ఈ బతుకు ఇంత తొందరగా ముగిసిపోతుంది? అంతా సవ్వంగా జరిగిపోతూ ఉండింది. బాల్యంలో వచ్చిన కష్టాలు, నష్టాలు గడిచిన తరువాత యవ్వనంలో తమ స్వయంకృషివల్ల జంగి, భంగిలాంటి ఆగర్భశ్రీమంతులతో బంధుత్వం వల్ల ఇకముందు మంచిరోజులు వచ్చాయని అనుకుంటున్నాప్పుడు మిత్రుడు, మార్గదర్శకుడు, వ్యాపారవ్యవహారాల్లో భాగస్థుడైన తన బావ మోళనాయక్‌కు ఇలా జరగటంతో నిర్లిప్తుడయ్యాడు. చెల్లెలికి ఈ విషయం ఎలా చెప్పాలనే ఆలోచన ఎడతెగకుండా అతన్ని వేధించసాగింది. అతని కలవరం అర్థం చేసుకున్న థావు సంక్రెబాక్రిలో నివసిస్తున్న మరో సోదరుని మరణాన్ని రహస్యంగా పెట్టాడు. చెబితే మీటు పూర్తిగా కుంగిపోతాడేమోనని భయపడ్డాడు.

సోదరుల వేదన తారాస్థాయికి చేరుకున్న సమయంలోనే ఆసిఫ్‌ఖాన్ పంపిన ఓ సైనికుడు మీటు కోసం వచ్చాడు. ఖాన్‌సాహెబ్ ఎక్కడున్నా పిల్చుకుని రమ్మని చెప్పారని కబురు అందించాడు. సోదరులిద్దరూ గుర్రాలనెక్కి బయలుదేరారు. ఖాన్‌సాహెబ్‌గారు అంత అత్యవసరంగా పిలిపించడానికి కారణం ఏమైవుండొచ్చునోననే అనుమానం అతడిని ఆక్రమించుకుంది. ఆంధ్ర లేదా కర్ణాటక సరిహద్దుల వైపు నుంచి దాడి జరిగిందా? అనే అనుమానమూ కలిగింది. వెళ్లవలసిన దూరం మరింత దూరమైనట్టు అనిపించింది. సగంరోజులో దాటగలిగే దారిని అతిక్రమించడానికి ఒక రోజంతా పట్టింది. గుర్రపు వేగాన్ని మరింతగా పెంచాడు మీటు. ఖాన్‌సాహెబ్‌గారు తీవ్రమైన దుఃఖంలో ఉన్నారు. బాలింతరాలైన కూతురు ఏదో జబ్బుకు గురై కన్నబిడ్డను వదిలి పరలోకానికి వెళ్లింది.

ఆమె శవాన్ని వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని ఖాన్‌సాహెబ్‌గారు ఉత్తర్వులు ఇవ్వటం ఆలస్యం మీటు తాము మకాం వేసిన వేలాది కోసుల దూరంలోని మధ్య భారత ప్రాంతం వైపు యువకుల పటాలంతో బయలుదేరాడు. రాత్రీపగలూ అనకుండా, తామే నిర్మించిన అడవి మార్గం గుండా పటాలం సాగింది. అక్కడక్కడ అతనికి వలస పోతున్న బంజారాలు కనిపించారు. అందులో కొందరు వ్యాపార నిమిత్తం వచ్చివుంటే, చాలామంది సుల్తానుకు బెదిరి ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని పారిపోయివచ్చారు. మీటు, ఇతర బంజారాలు తమ ఎద్దులకు, ఖాన్‌సాహెబ్‌గారి కాల్బలగానికి, గజబలగానికి, గుర్రపు రౌతుల ప్రయాణానికి అనుకూలంగా వుండేలా

ఏర్పరిచిన గుర్తులు వారికి సహాయపడ్డాయి. దారిమధ్యలో కనిపించిన కొందరికి తమ సంప్రదాయం ప్రకారం 'రామ రామి' చెప్పి ముందుకు సాగారు.

మీటు మనసులో తన భార్య స్నేహితురైలాన షెహనాజ్ మరణ విచారం కమ్ముకుంది. ఆమెను ఈ పరిస్థితుల్లో చూస్తాడని అతను అనుకోలేదు. ఈ వార్త తెలిసి తన భార్య లచ్మి ఎంతగా తల్లడిల్లిపోతుందోనని అతను ఆందోళన చెందాడు. అలాగే తల్లిలేని బిడ్డను తలుచుకుని బాధపడ్డాడు.

వాళ్లు అంతకుముందు మకాం పెట్టిన గుడారాల దగ్గరికి వచ్చేసరికి పరిస్థితి మరింత విషమించినట్టు అనిపించింది. అక్కడి నుంచి జనాన్ని, తమ కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించడం అనివార్యమైంది. మీటు సైన్యపటాలంతో ఖాన్‌సాహెబ్‌గారు విడిది చేసిన గుడారానికి వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. పహారా కాస్తున్న సైనికులకు తమ రహస్యభాషలో 'గుర్తులు' చెప్పిన తరువాత మీటును లోపలికి పంపడం జరిగింది. ఖాన్‌సాహెబ్ కూతురి శవం వచ్చిందని తెలిసి అందరూ కుమిలిపోయారు. షెహనాజ్ బిడ్డ ఎవరో దాసి చేతుల్లో ఉంది. దెబ్బ మీద దెబ్బ పడటంతో ఖాన్‌సాహెబ్‌గారు బాగా కుంగిపోయాడు.

మీటు సలాం చేసి అక్కడి నుంచి బయటికి వచ్చాడు.

అయినా ధైర్యం తెచ్చుకుని సైనికులను సిద్ధంగా ఉండమని చెప్పి తన గుడారం వైపు బయలుదేరాడు.

లచ్మి, కొడుకు దేశ్యాకరమ్‌తోట్ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. అతన్ని చూసి లచ్మి నమ్మలేకపోయింది. అతని పరిస్థితికి తల్లడిల్లిపోయింది. అక్కడ అంతా గోప్యంగానే జరుగుతున్నాయి. మోళ చనిపోయిన విషయం మాట్లాడుతూ ఉండగా సంక్రైబాక్రిలోని తన మరొక సోదరుడి మరణం గురించి ప్రస్తావన వచ్చింది.

మీటు హృదయం మీద బలమైన దెబ్బపడినట్టు అనిపించింది. అయినా బతకవలసిన అనివార్యతను అర్థం చేసుకోవడం వల్ల మనస్సును గట్టిపరుచుకుని కుంగిపోయిన చెల్లెలి ఇంటికి తమ సంప్రదాయం ప్రకారం ఒక ముంత సారాయితో వెళ్లి ఆమెను పలకరించాడు. ఒక భాగం గొర్రెమాంసం తీసుకునిపోవాలి. అయితే అది సమయం కాకపోవటం వల్ల రూప్లి, ఆమె కూతురు సోమ్లిని చూసుకుని, షెహనాజ్ మరణవార్తనూ చేరవేశాడు. అంతేకాకుండా వీలైనంత తొందరగా ఈ గుడారాలన్నిటిని హైదరాబాద్‌కు తరలించవలసిన అవసరం గురించి చెప్పి అందరినీ సిద్ధం కావలసిందని హెచ్చరించాడు.

షెహనాజ్ ప్రశాంతంగా పడుకున్నట్టుంది. శవం అప్పటికే ఉబ్బిపోవటం

వల్ల శవం చెడిపోకుండా ఏవో పసరులు పూసి, సంచిలో జాగ్రత్తగా పెట్టి, సంచిని కుట్టి తీసుకుని వెళ్లాలని నిర్ణయించుకుని అదే విధంగా సిద్ధం చేశారు. అనుకున్న ప్రకారం వేకువనే బయలుదేరారు. రోజుకు రెండు గంటలు మాత్రమే విశ్రాంతి తీసుకుని రాత్రీపగలు ప్రయాణం చేయటంవల్ల ఒక వారంలో హైదరాబాద్ చేరారు.

ఖాన్‌సాహెబ్‌గారు దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు.

జంగి భుజం మీద తలపెట్టి బిగ్గరగా రోదించసాగారు.

"ప్రభూ, తమరే ధైర్యం కోల్పోతే ఇక మా గతేమిటి? షైహనాజ్ బేటీ చిన్నప్పటి నుంచి తెలిసిన పిల్ల. నన్ను చూడగానే చాచా అని నోరారా పిలిచేది. ఇప్పుడు..." అని అంటుండగా దుఃఖంతో జంగి గొంతు పూడుకుపోయింది. ఇద్దరూ ఒకరినొకరు పట్టుకుని రోదించసాగారు. ఆ దృశ్యం చూసిన ప్రతిఒక్కరూ బిగ్గరగా రోదించసాగారు.

సంప్రదాయం ప్రకారం స్నానం చేయించి, శవాన్ని అలంకరించి, కోటకు ఎడమ వైపున ఖననం చేయడం జరిగింది.

కూతురి మరణంతో ఖాన్‌సాహెబ్‌గారు అత్యంత మనోవ్యథకు గురయ్యారు. మరింతగా తాగుడుకు అలవాటు పడ్డారు. ఆయన కుమారుడైన మురాద్ వయసుకు వచ్చివుండటంతో ఇక కుమారుణ్ణి అధికారానికి తెచ్చి తాము నివృత్తులు కావాలనే అభిప్రాయాన్ని జంగి ముందు వెలిబుచ్చారు.

హైదరాబాద్‌ను స్వాధీనం చేసుకున్న తరువాత దక్షిణం పూర్తిగా దొరికినట్టయినా, మైసూరు, కోయమత్తూరు, శ్రీరంగపట్టణం మొదలైన ప్రాంతాల సామంతులు లొంగలేదు. పూనాలో మరాఠాల ప్రాబల్యం పెరిగింది. ఈ మధ్యలో ఖాన్‌సాహెబ్‌గారి ఆరోగ్యం క్షీణించింది. కూతురి మరణం, మనుమడి చింత, అల్లుడి దుష్టప్రవర్తనకు విసిగిపోయిన ఖాన్‌సాహెబ్‌గారు ఢిల్లీ సుల్తాను నుంచి పిలుపు వస్తే వెళ్లిపోవాలనే అభిప్రాయంతో ఉండగా మరొక రూపంలో ఊహించని ప్రమాదం వచ్చిపడింది. దక్షిణంలో సంగ్రహించిన సంపదను రవాణా చేయడం కోసం సుల్తాను ప్రత్యేక బలగాలను పంపారు. దాంతో ఖాన్‌సాహెబ్‌గారు పూర్తిగా కుంగిపోయారు. మొత్తం ఖజానాను పంపితే ఇక్కడి పాలనా ఎలా? సైనికులకు భోజన సౌకర్యాలకు ఏం చేయాలి? వాళ్ల సంసారాలు ఎలా జీవించాలి? ప్రజలకు కావలసిన సౌకర్యాలు ఎలా సమకూర్చాలి? మొదలైన అనేక రకాల ఆలోచనలు ఆయన్ను కమ్ముకుని నలిబిలిచేశాయి. అయితే తప్పనిసరిగా ఉన్నదంతా పంపించాల్సి వచ్చింది. ఢిల్లీనుంచి ప్రత్యేక బలగాలతోపాటు ఖజానాను తీసుకుని పోవటానికి నమ్మకస్థులైన మనుషులు కావాలి. ఆయన దృష్టిలో మొదట జంగి నాయక్, తరువాత

మీటు కదిలారు. అయితే వాళ్లిద్దరూ అత్యంత నమ్మకస్థులు, ఆప్తులు. వాళ్ళను పంపితే తనకు రక్షణగా ఎవరుంటారనే సందిగ్ధంతో సతమతమయ్యారు. చివరికి జంగినాయక్‌ను పంపాలనే నిర్ణయం తీసుకున్నారు. మీటు అత్యంత బలశాలి, ధైర్యవంతుడు. తనకూ, తన కొడుకుకూ, తన మనుమడికి అంగరక్షకుడిగా వుండగల అర్హత అతనికి వుండటం వల్ల అతనికి బదులుగా జంగిని ఢిల్లీకి పంపే ఏర్పాట్లు జరిగాయి.

జంగికూ తిరిగి తన స్వస్థలానికి వెళ్లిపోవాలనే కోరిక. ఆ కారణంగా తన కూతురితో ఉన్న అనుబంధాన్ని తెంచుకుని వెళ్లవలసిన పరిస్థితి. దాంతో ఏమీ చేయలేక సంపాదించిన సొమ్మునంతా తీసుకుని, తమ దగ్గర మిగిలివున్న ఎనభైవేల ఎద్దులలో సగం మీటుకు, సగం తన అల్లుడు థావుకు అప్పజెప్పి ఢిల్లీకి వెళ్ళిపోయాడు. సుల్తానుగారి సంపదను వారికి చేరవేసిన తరువాత తమ స్వస్థలానికి వెళ్లిపోవాలనే ఆలోచన ఆయనది. అదే విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు.

బంజారాగఢకు బయలుదేరాల్సిన క్షణం వచ్చినప్పుడు అందరూ దుఃఖాన్ని ఆపుకోలేక రోదించసాగారు.

ఖాన్‌సాహెబ్‌గారి కళ్లల్లోంచి కన్నీళ్లు ప్రవహించసాగాయి.

దాదాపు పదిహేను సంవత్సరాలు ఒకే కుటుంబంలా బతికినవారు. అన్నదమ్ముల్లా బతికినవారు. ఇప్పుడు విడిపోవాల్సి వచ్చింది.

"జా మేరే భాయి, క్షేమంగా వెళ్లు" అని ఖాన్‌సాహెబ్‌గారు దుఃఖంతో మాట్లాడలేక మౌనం వహించారు.

"హుజూర్, మిమ్మల్ని వదిలి వెళ్ళాలంటే..." జంగినాయక్ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

తరువాత మాటలకు అర్థమే లేదని కుటుంబ సభ్యులందరిని పిలిచి కూతురుకు, అన్న కూతురుకు వీడ్కోలు చెప్పి బయలుదేరుతూ మీటు దగ్గరికి వచ్చి "జమాయిసా, థావు, అతని భార్యాపిల్లల బాధ్యత నీ మీద పెట్టి వెళుతున్నాను. మీరు తెలివైనవారు. బుద్ధివంతులు. కుటుంబ సభ్యులను మంచిదారిలో నడపగలరనే నమ్మకం నాకుంది" అని మీటు చేతులు పట్టుకుని అన్నాడు.

థావుకు నిజంగా ఏదో పోగొట్టుకున్నట్టు అనిపించసాగింది. అతని తల్లితండ్రులు రాజస్థాన్‌కు వెళ్లినపుడు కూడా అతనికి ఇలా అనిపించలేదు. "అదికాదు, మేము కూడా మన ప్రాంతానికి వచ్చేద్దామని..." అని థావు అన్నాడు.

"జమాయిసా, బంజారాగఢ ఇప్పుడు బంజారాగఢలా లేదు. ఎన్నో ఏళ్ల

నుంచి ఆ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో కరువుతో జనం బాధలు పడుతున్నారు. దాంతో మనవాళ్లు చాలామంది ఇటువైపు వలస వచ్చారు. అలాంటప్పుడు మీరు అక్కడికి వెళ్లాలనుకోవటం ఏమిటి? అంతేకాకుండా ఖాన్‌సాహెబ్‌గారు మీ అన్న మీది నమ్మకంతోటే నన్ను పంపుతున్నారు. ఇంత పెద్ద వ్యాపార వ్యవహారాలను మిమ్మల్ని నమ్మి మేము వదిలి వెళుతున్నాం" పరిస్థితిని అర్థమయ్యేలా చెప్పటానికి ప్రయత్నించాడు.

"బంధువులంతా వేలాది కోసుల దూరంలో ఉన్నప్పుడు మేమిద్దరమే..." మీటు తన మాటలు పూర్తిచేయలేకపోయాడు.

"జమాయిసా, మీరింకా చిన్నవాళ్లు. వయసులో ఉన్నవాళ్లు. చక్కగా వ్యాపారం చేసుకోండి. కొంత సొమ్ము కూడబెట్టుకోండి. పిల్లల్ని చక్కగా పెంచి, పెద్దచేసి, వారికి బాధ్యతలు అప్పగించి...ఆ తరువాత మన ప్రాంతానికి రావచ్చు. మన ఊళ్ళు ఉండనే ఉన్నాయి" అని జీవితాన్ని నిర్మించుకునే తీరును చెప్పాడు. తప్పనిసరిగా వాళ్లు అంగీకరించవలసి వచ్చింది. భవిష్యత్తులో పరిస్థితులు ఏ విధంగా మారుతాయో ఎవరు చెప్పగలరు? ఇప్పుడు ఖాన్‌సాహెబ్‌గారు బతికివున్నారు. అంతా సవ్యంగా సాగిపోతోంది. రేపు ఆయనకు ఏమైనా అయితే, అధికారం ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. అప్పుడు తమ పరిస్థితి ఏమిటనే భయం వాళ్లకు మనసులో ఉంది.

జంగినాయక్ వెళుతుండటం, మరెన్నడూ ఆయనను చూడలేమనే బాధ వారిని వేధించింది. అయితే వీడ్కోలు తప్పనిసరైంది. స్వయంగా ఖాన్‌సాహెబ్‌గారు అతని ఎడబాటును భరించలేకపోయారు. అయితే సాగనంపక తప్పలేదు.

జంగినాయక్ భారమైన అడుగులతో వచ్చి, "అల్విదా ఖాన్‌సాహెబ్‌గారు, వచ్చే జన్మలోనూ మేము మీ స్నేహితులుగా పుట్టడానికే ఇష్టపడుతున్నాం. మన ఈ స్నేహాన్ని చరిత్ర గుర్తుపెట్టుకుంటుంది" అని అన్నారు.

ఖాన్‌సాహెబ్ అతన్ని బిగువుగా కౌగిలించుకుని, "అల్విదా మేరే దోస్త్. మన దోస్తీని చరిత్ర మరవకుండా మేము శాసనం రాయిస్తాం. మీ ప్రయాణం సుఖంగా సాగనీ" అని అన్నారు.

ఆయన ముఖంలోనూ దుఃఖం గూడుకట్టుకుని ఉంది.

జంగినాయక్ ఖాన్‌సాహెబ్‌గారి దగ్గర వీడ్కోలు తీసుకుని సైనికులతోపాటు గుర్రాల మీద ఎక్కి తమ గుడారానికి బయలుదేరారు.

అక్కడ జంగి, జంగి భార్య తమ కూతురికి, భగన్యానాయక్ కూతురికి, వాళ్ల పిల్లలకు వీడ్కోలు చెప్పి బయలుదేరడానికి సిద్ధమయ్యారు. బయలుదేరడానికి ముందు

తాము సంపాదించిన సంపదనంతా తమవెంట తీసుకుని తమ స్వస్థలానికి బయలుదేరారు. సుమారు ఇరవై ఏళ్లపాటు వ్యాపారంలో జంగి, భంగి సోదరులు మూడుతరాలు తిన్నా తరగనంత ఆస్తి సంపాదించారు. అయితే మీటు, థావులు ఎటువంటి నేపథ్యం లేనివాళ్లు. వాళ్లు సయంకృషితో పైకి రావలసినవాళ్లు. మామలు ఎంత ఇచ్చినా వాళ్లు తమంతట తాము సంపాదించినదే తమ ఆస్తి. మీటు తన దగ్గరున్న బంగారం, వెండి వరహాలను తన మామ స్వస్థలానికి బయలుదేరేటప్పుడు తన తల్లితండ్రులకు చేర్చమని ఆయన చేతికి ఇచ్చాడు. ఇప్పుడు ఆ సోదరులు మళ్లీ కొత్తగా వ్యాపారం ప్రారంభించి, పరిచయాలు పెంచుకుని తమ వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకోవలసి ఉంది.

జంగి వెళ్లిపోయిన తరువాత ఖాన్‌సాహెబ్‌గారు మరింత కుంగిపోయారు. కాలం దొర్లిపోతున్నట్టే ఆయనకు వయసు దాటిపోయింది. ఆయన తన కుమారుడిని మీటుకు అప్పగించి అతడిని మంచి వీరుడిగా తీర్చిదిద్దమన్నారు. ఆ కుర్రవాడు అప్పటికే వయసుకు వచ్చాడు. మీటు అతనికి తన 'తాలీంఖానా'లో తర్ఫీదు ఇచ్చేవాడు. తన కుమారుడిని సింహాసం ఎక్కించాలన్నది ఖాన్‌సాహెబ్ కోరిక. అయితే ఆయన అల్లుడు లతీఫ్‌ఖాన్ ఆ సింహాసనం మీద కన్నువేసి కూర్చున్నాడు. ఆ కారణంగా ఆసిఫ్‌ఖాన్ కుమారుడు మురాద్‌కు సింహాసనం సులభంగా దక్కేలా లేదు. లతీఫ్‌ఖాన్‌కు యుద్ధంలో అనుభవముంది. సైన్యంతో ఎలా మెలగాలో అతనికి తెలుసు. కుట్రలు, కుతంత్రాలు తెలిసినవాడు.

లతీఫ్‌ఖాన్ మీటు పట్ల అసూయ, ద్వేషాలతో రగిలిపోయేవాడు. అందుకు ముఖ్య కారణం మీటు ఆసిఫ్‌ఖాన్ కుమారుడికి అంగరక్షకుడిగా ఉండటం. తనకంటే మామాగారికి మీటు పట్ల నమ్మకం, అభిమానం ఉండటం. అంతఃపురంలోనూ అతను రావడానికి అనుమతి ఉండటం. ఈ కారణాల వల్ల లతీఫ్‌ఖాన్ మీటు పట్ల అంతులేని ద్వేషాన్ని పెంచుకున్నాడు. మీటు ఉన్నంతవరకూ అతను ఆసిఫ్‌ఖాన్ కుమారుడికి తప్ప సింహాసనం దక్కటంలో తనకు సహాయపడడని అనుకున్నాడు. దాంతో మీటును అడ్డు తొలగించుకోవాలని సమయం కోసం ఎదురుచూడసాగాడు.

అదే సమయంలో హైదరాబాద్‌లో ఒక కోట నిర్మించే ప్రణాళిక సిద్ధమైంది. మీటు తన కుటుంబాన్ని హైదరాబాద్‌కు తీసుకుని రావాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఖాన్‌సాహెబ్‌గారు తమ సైన్యంలోని ఒక చిన్నపటాలాన్ని ఇచ్చి కుటుంబాలను హైదరాబాద్‌కు తీసుకుని రావడానికి థావును పంపమని ఉత్తర్వులు ఇచ్చారు. ఎందుకంటే రోజురోజుకు మారుతున్న పరిస్థితులు ఆయన్ను కలవరపరిచాయి. ఏ

క్షణంలో ఏమవుతుందో అనే భయం ఆయనలో చోటు చేసుకుంది. బాద్‌షా అనుమతిస్తే తాను ఢిల్లీకి వెళ్లిపోయేవాడని మధనపడ్డారు. అందువల్ల మీటును దూరంగా పంపడానికి ఆయన సిద్ధంగా లేడు.

ఆ రోజే థావు తన కుటుంబాన్ని, తన సోదరుడి కుటుంబాన్ని పిల్చుకుని రావడానికి హైదరాబాద్‌కు బయలుదేరాడు.

ఇటు లతీఫ్‌ఖాన్ అంతఃపురంలోని తన మనషుల ద్వారా అందుకున్న సమాచారాన్ని సరిగ్గా ఉపయోగించుకుని ఖాన్‌సాహెబ్‌ను దెబ్బకొట్టాలని నిర్ణయించుకున్నాడు. ఈ ఖాన్‌సాహెబ్‌కు ఉన్నదొకటే బలం ! అది మీటు భుక్యా కరమ్‌తోట్ అని లతీఫ్‌ఖాన్‌కు తెలుసు. పైగా మీటు తెలివైనవాడని, యుద్ధకళను తెలిసినవాడని, మహాబలవంతుడని, కత్తి యుద్ధంలో సాటిలేనివాడని, అతన్ని నేరుగా ఓడించడం అసాధ్యమని గ్రహించిన లతీఫ్‌ఖాన్ అతన్ని వెనుకనుంచి దెబ్బకొట్టాలనే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు.

తన వ్యక్తిగత గుంపును రహస్యంగా పిలిపించిన లతీఫ్‌ఖాన్ "దేకో, మీటు చాలా ప్రమాదకారి. రేపు నేను సింహాసనం ఎక్కాలంటే మీటు బతికి ఉండకూడదు. అతను చావాలి" అని తన నిర్ణయాన్ని వ్యక్తపరిచాడు. అప్పుడే మీటు హత్యకు ప్రణాళిక సిద్ధమైంది.

ఈ రహస్య కార్యాచరణను అమలుపరచడానికి లతీఫ్‌ఖాన్ బయటి నుంచి కొంతమంది కిరాయి హంతకులకు ఈ కార్యాన్ని అప్పగించాడు. దానివల్ల రహస్యం రహస్యంగానే వుంటుందని అతని ఆలోచన. పైగా వాళ్లు కచ్చితంగా ఆ కార్యాన్ని నిర్వహిస్తారనే నమ్మకం. ఆ నమ్మకంతో లతీఫ్‌ఖాన్ కాళ్లమీద కాళ్ళు వేసుకుని ధైర్యంగా కూర్చున్నాడు.

ఆసిఫ్‌ఖాన్ మీటును అంగరక్షకుడిగా నిలుపుకున్నందువల్ల మీటు ఆసిఫ్‌ఖాన్ ఉత్తర్వుల మీద తన సోదరుడు థావును చిన్నపటాలంతోపాటు పంపాడు. లతీఫ్‌ఖాన్ మీటూనే వెళ్లాడనుకుని అతడిని చంపించటానికి మనుషులను పంపించాడు. థావు సైన్యపటాలం హైదరాబాద్ సరిహద్దును దాటిన తరువాత దాడిచేయాలని నిర్ణయించుకున్న లతీఫ్‌ఖాన్ పంపిన మనుషులు వాళ్ల మీద దాడి చేశారు.

థావు తన సోదరుడు మీటు అంతటి సమర్థుడు కాకపోయినా అత్యంత ధైర్యశాలి. బలవంతుడు. వీరుడు. వీళ్ల చిన్న పటాలమే లతీఫ్ పంపిన ముసుగు మనుషుల గుంపును వీరోచితంగా ఎదుర్కొంది. కొద్ది నిముషాల్లోనే థావు సైన్యం వాళ్లను తీవ్రంగా గాయపరిచి తరిమికొట్టింది.

గాయపడ్డ ఒక ముసుగుధారిని అవలీలగా ఒక గుర్రం మీద వేసుకుని కొద్ది దూరం సాగిన తరువాత అతన్ని దింపి అతని చేత నిజం చెప్పించటానికి థావు ప్రయత్నించాడు.

థావు వెంట ఉన్న పటాలంలో ఎక్కువగా బంజారా యువకులే ఉన్నారు. వాళ్లలో తెలివితేటలు, తెగింపు, యుద్ధకౌశల్యం ఎక్కుగా ఉండటం వల్ల మీటు అనేక సందర్భాలలో ఖాన్‌సాహెబ్‌గారికి తోడ్పడ్డాడు. ఆ కారణంగానూ మీటు ఆయనకు ఆత్మీయుడయ్యాడు.

ఆ ముసుగుధారి ఎంతగా హింసించినా నోరు విప్పలేదు.

"ఎవరు నువ్వు? ఎవరి తరఫున వచ్చిన మనిషివి నువ్వు?" కత్తి మొనతో అతని గుండెలో గుచ్చుతూ అడిగాడు థావు.

"మాలూమ్ నహీ" అని అతని పళ్లబిగువున అన్నాడు.

"నువ్వు నిజం చెబితే నీ ప్రాణాలు దక్కుతాయి. ఎక్కడికైనా దూరంగా వెళ్లి బతకవచ్చు. లేకపోతే ఇక్కడే నిన్ను చంపేస్తాం" అని బెదిరించినా అతను నోరు విప్పలేదు.

థావు ఆలోచనలో పడ్డాడు.

తాము వచ్చిన పని గుర్తు చేసుకున్నాడు.

తాము వెళ్లి కుటుంబాలను తీసుకుని మళ్లీ వెనుతిరగాలి. సమయం వ్యర్థం చేయడం తగదని అనుకున్నాడు. త్వరగా అతని చేత నిజం కక్కించవలసి ఉంది. అయితే ఎంత ప్రయత్నించినా ఆ వ్యక్తి నోరు విప్పలేదు.

చివరికి "లాభం లేదు. వీడు చెప్పడు, వీడి తల తీయడమే" అని థావు కత్తి నిలువునా పైకెత్తాడు.

అప్పుడు ఆ వ్యక్తి "వద్దు...చంపకండి...నిజం చెబుతాను... మీటును చంపడానికి మమ్మల్ని ..." అని అంటుండగానే ఎక్కడి నుంచో ఓ పిడిబాకు వచ్చి అతడి ఎదను చీలుస్తూ గుండెలో దిగింది.

అతను మాటలు పూర్తి చేయకుండానే నేలకొరిగాడు.

"ఎవరు...ఎవరక్కడ... ఇతని మీదికి కత్తి విసిరినవారు ఎవరు?" అంటూ నలువైపులా చూశాడు. అయితే ఆ దట్టమైన చెట్లపొదల్లో ఎవరూ కనిపించలేదు.

'సోదరుడి ప్రాణాలకు ముప్పు ఉంది' అని థావుకు అర్థమైంది. భయంతో ఒక్క క్షణం వణికాడు. మళ్లీ అంతలోనే అన్న ధైర్యసాహసాలు గుర్తుకు తెచ్చుకుని కుదుటపడ్డాడు. తన సోదరుడిని చంపాలనుకుంటున్నది ఎవరు? నిజానికి మీటు

ఎవరితోనూ శత్రుత్వం పెంచుకున్నవాడు కాదు. అందరితోనూ మర్యాదగా మసలుకున్న వ్యక్తి. స్నేహశీలి. అలాంటప్పుడు ఎవరు ఈ కుట్రకు కారకులు? ఎందుకు? దీనికి కారణమేమి? ఇలాంటి రకరకాల అనుమానాలతో, ఆలోచనలతో గుర్రపు వేగాన్ని మరింత పెంచాడు.

"హుజూర్, తాము ఏదో ఆలోచనలో ఉన్నట్టున్నారు?" అన్నాడు జాంప అనే సైనికుడు.

ఇతరుల ముందు చెప్పవలసిన విషయం కాదనుకుని–

"ఏం లేదు జాంప" అని తడబడుతూ అన్నాడు.

"నాకు తెలుసు మీరు ఎందుకిలా అంటున్నారో?" అని అతని ముఖం చూశాడు.

"ఎందుకు?" అని థావు అడిగాడు.

అతనేదైనా తమ రాక గురించి సమాచారం ఇచ్చాడా అని అనుకున్నాడు. మరుక్షణం మీటు అంటే ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తి తమకు వ్యతిరేకంగా కుట్ర చేసే మనిషి కాదని కచ్చితపరుచుకుని ప్రయాణాన్ని ముందుకు సాగించాడు. రెండున్నర రోజుల నిరంతర ప్రయాణం తరువాత వాళ్లు తమ గుడారాలను చేరుకున్నారు.

ఒక రోజు అక్కడే ఉండి, మరుసటి రోజు తిరుగు ప్రయాణమవ్వాలని నిర్ణయించుకున్నారు. తిరిగి వెళ్లేటప్పుడు కూడా మళ్లీ తమ మీద దాడి జరగవచ్చని థావు ఊహించాడు. ఇప్పుడు అతని మీద గొప్ప బాధ్యత ఉంది. అతని భార్యా కొడుకులతోపాటు, సోదరుడి భార్య లచ్మి, ఆమె కుమారుడు దేశ్యా కరమ్‌తోట్‌ను సురక్షితంగా తన అన్నకు అప్పగించాలి. అంతేకాకుండా ఇరవై వేల కోడెలు ఇక్కడే ఉన్నాయి. వాటిని హైదరాబాద్‌కు తరలించాలి.

❖❖❖

2. మళ్లీ ముందుకు

మరుసటి రోజు సాయంత్రం బిడారం బయలుదేరింది. కోడెల సమేతంగా బయలుదేరడం వల్ల, పిల్లాజెల్లా ఉండటం వల్ల ప్రయాణం నెమ్మదిగా సాగింది. దేసుకరమ్‌తోట్, థావు కొడుకు లచ్మ కరమ్‌తోట్‌లు బాగా పెరిగి పెద్దవారయ్యారు. "కాకాసా, నేను గుర్రపు స్వారీ చేస్తాను" అన్నాడు. "అరే బేటా, మునుముందు ఈ బాధ్యతలన్నీ మీరిద్దరే మోయాలికదా, కానివ్వండి" అన్నాడు. దేసుకరమ్‌తోట్ జాతి గుర్రాన్ని తన తండ్రిలా పరుగెత్తించసాగాడు. థావుకు ఆపుకోలేని ఆశ్చర్యం కలిగింది. తన అన్నను వీడు మించిపోతాడనే నమ్మకం అతనికి కలిగింది. తన కొడుకు కూడా ఇదే విధంగా తయారైతే తన జీవితం సార్థకమవుతుందని అనుకున్నాడు. పొద్దువాలి చీకటి పడుతున్నట్టే నీళ్లు లభించే ప్రాంతంలో తాత్కాలికంగా గుడారాలను వేసుకోవటం జరిగింది. "వదినా, మీరేమీ విచారించకండి. దేసు ఇప్పుడు పెద్దవాడయ్యాడు. అన్నలా వాడు ముందు ముందు పెద్దవ్యాపారి అవుతాడు" అని లచ్మికి చెప్పాడు. "దేవర్ సా, తల్లి సాతభవానిమాత దయవల్ల మీరన్నట్టే జరగాలి. ఇదంతా మీ తర్ఫీదు ఫలితమే. మీరు అంత శ్రద్ధగా, జాగ్రత్తగా వాణ్ణి పెంచుతున్నారు. ఇకపై వాడికి మీరే దిక్కు" అంది. థావు ఆమె మాటలకు నిర్ఘాంతపోయాడు. ఆమె నోరుజారి అన్నదో, ఇలా జరుగుతుందనే దూరదృష్టితో అన్నదో ఊహించలేకపోయాడు. ఒక్కక్షణం థావు విచలితుడయ్యాడు. 'లేదు, అన్నకు...' అని గొణిగాడు. "దేవర్‌సా, ఏమైంది? ఎందుకిలా మీలో మీరే గొణుక్కుంటున్నారు?" అని గట్టిగా అడిగింది. "అబ్బే, ఏమిలేదు, ఏదో పాడుకల" అని థావు మాట మార్చాడు. తరువాత జాంప దగ్గరికి వెళ్లాడు. అతని మనసులో ఏదో అనుమానం తీవ్రంగా వేధిస్తోంది. తన

అన్న శత్రువులు ఎవరు? ఖాన్‌సాహెబ్ అంటే గిట్టనివాళ్ళు ఉన్నారా? వాళ్లే అన్నను చంపాలనుకున్నారా? ఎందుకు? ఆలోచిస్తూ వుంటే కడుపులో ఒక విధమైన సంకటం, కసివిసి. ఏమీ చేయలేని నిస్సహాయత. కోసుల దూరంలో ఉన్న అన్న. ఇప్పటికిప్పుడు అన్నను చేరుకోలేని పరిస్థితి. ఏమీ చేయలేని నిస్సహాయత. ఎంత తక్కువ అనుకున్నా వారం, పదిరోజులైనా ప్రయాణం చేయాలి. పరిస్థితి గురించి ఆలోచిస్తుంటే అన్నను చేరుకునేలోపే తనకు పిచ్చిపడుతుందేమోనని థావు కలవరపడ్డాడు. 'అన్నా... అన్నా... ఎందుకిలా అయ్యిందన్నా...' అని మనస్సు లోలోపలే రోదించాడు. జంపా థావు పడుతున్న బాధను మౌనంగా చూడసాగాడు. "హుజూర్, ఎందుకిలా బాధపడుతున్నారు?" అని అడిగాడు. "ఎందుకో భయంగా వుంది. అన్నగారికి ఏమైందో అర్థం కావటం లేదు" బొంగురు పోయిన గొంతుతో అన్నాడు. తానొక్కడే వెళ్లి చూద్దామంటే పిల్లల, ఆడవాళ్ల, తమను నమ్ముకున్నవాళ్ల పెద్ద గుంపే తన వెనుక ఉంది. సరే, జరగాల్సింది జరుగుతుంది, అందరినీ కాపాడేందుకు ఆ దేవత ఉందని అనుకుంటూ మరింత వేగాన్ని పెంచమని హెచ్చరించాడు. హైదరాబాద్ చేరటానికి మరో నాలుగురోజులు ఉందనగా తన అన్నకు నమ్మకస్థుడైన సామ్యానాయక్ మారువేషంలో వచ్చి థావును రహస్యంగా కలిశాడు. "హుజూర్, మీరు హైదరాబాద్‌కు రాకూడదని, వెంటనే ఈ మార్గాన్ని వదలి, ముందు కనిపించే కర్ణాటక వైపు వెళ్లి ఎక్కడైనా దాక్కోవాలని అన్నగారి ఆజ్ఞ" అన్నాడు. "అన్నగారు ఎక్కడ?" అని కంగారుగా థావు అడిగాడు. "ఆయన గురించి ఆలోచించకండి. ఆయన బతికేవున్నారు. ఏదో ఒక రోజున వచ్చి మిమ్మల్ని కలుస్తారు. మిమ్మల్ని వెతుకుతూ ఒక సైన్యపటాలం బయలుదేరింది. మీరు ప్రమాదంలో ఉన్నారు" అని వార్త అందించి అరక్షణంలో మాయమయ్యాడు. థావుతల మొద్దుబారిపోయింది. కొంతసేపటి వరకు అయోమయంలో మునిగాడు. తర్వాత తేరుకుని వదిన దగ్గరికి వెళ్లి ఆమెతో రహస్యంగా, "బోడిసా (వదినా) మీతో ఒకమాట చెప్పాలి" అన్నాడు. లచ్మి గాభరాపడింది. "చెప్పండి దేవర్‌సా" అంది. ఆయన అన్న పంపిన రహస్యవార్తను, దాన్ని నమ్మాలో వద్దో అర్థంకాని అయోమయాన్ని, ఇదేమైనా శత్రువుల కుట్ర కావచ్చనే అనుమానాన్ని వ్యక్తపరిచాడు. లచ్మి కొద్దిసేపు ఆలోచించి వెంటనే మొత్తం సైన్యాన్ని, కోడెలను, తమ పరివారాన్ని కర్ణాటక వైపు మరలించమని ఆదేశించింది.

థావు వెంటపడిన లతీఫ్‌ఖాన్ సైనికులు తిరిగొచ్చి లతీఫ్‌ఖాన్‌కు తాము పొందిన ఓటమి గురించి తెలిపారు. 'వాడు అత్యంత బలశాలి' అని అనుకుంటూ ఖాన్‌సాహెబ్ కోట నుంచి బయటికి వస్తున్న లతీఫ్‌ఖాన్‌కు అదే సమయంలో మీటు

భుక్యా గుర్రమెక్కి వేగంగా బయలుదేరటం కంటపడింది. అది చూసి లతీఫ్‌ఖాన్ నివ్వెరపోయాడు. 'అరే, ఇతను ఇక్కడ వున్నాడంటే తన సైనికులు పోరాడింది ఇతని తమ్ముడు థావుతో కావచ్చు. ఈ రోజు మీటు కథ ముగించాలి' అని అనుకుంటూ స్వయంగా మీటును పట్టుకోవడానికి ఇరవైమంది దృఢకాయులైన సైనికులతో అతన్ని వెంబడించసాగాడు.

లతీఫ్‌ఖాన్‌కు తనపట్ల అసూయాద్వేషాలు ఉన్నాయని మీటు ఎప్పుడో గ్రహించాడు. అందుకే జాగ్రత్తగానే ఉన్నాడు. అయితే అతను ఇంత తొందరగా తనను వేటాడటానికి ప్రయత్నిస్తాడని అనుకోలేదు. వెంటనే తాను వెళుతున్న దిశను మార్చాడు. అయితే లతీఫ్‌ఖాన్ గ్రద్దకళ్ళు అతని జాడను పసికట్టడంలో విజయం సాధించాయి.

"అరే మీటు ఎక్కడికి పోతావ్? ఈ లతీఫ్‌ఖాన్ నుంచి తప్పించుకోవటం అంత సులభం కాదు" అని అంటూ మీటు మీద దూకాడు.

హఠాత్తుగా వచ్చి పడిన శత్రుసైనికులను చూసి ఒక్క క్షణం వెనుకాడినా ధైర్యం కోల్పోకుండా మీటు పోరాడాడు. నిజానికి అతను మానసికంగా ఆ పోరాటానికి సిద్ధంగా లేడు. అయితే వెనుకడుగు వేయటానికి లేదు. కత్తిపట్టుకుని ముందుకు దూకాడు. లతీఫ్‌ఖాన్ మీటును చంపటానికి అన్ని రకాల వ్యూహాలను సిద్ధం చేసుకుని వచ్చాడు. ఈ రోజు ఎలాగైనా మీటుకథ ముగించే ఇతర వ్యవహారాలు చూడాలనుకున్నాడు. ఆ పోరాటంలో మీటుభుక్యా పద్దెనిమిది మంది సైనికులను బలిగొన్నాడు. ఆ పోరాటంలో అతను కాస్త అలసిపోయాడు. అది గమనించిన లతీఫ్‌ఖాన్ తన మనుషులతో ఒక్కసారిగా మీటు మీద విరుచుకుపడ్డాడు. మీటు శరీరం మీద కత్తులు వీరవిహారం చేశాయి.

మీటు నేలకూలిపోయాడు.

అతని శరీరం చుట్టూ రక్తం మడుగుకట్టింది.

లతీఫ్‌ఖాన్ ఆదేశంతో సైనికులు మీటు శవాన్ని తీసుకెళ్లి కోటకు దగ్గర్లో పడేశారు.

ఈ విషయం ఆసిఫ్‌ఖాన్‌కు తెలియాలని, అది తెలిసి ఆయన భావోద్రేకంతో బలహీనుడవుతాడని, అప్పుడు ఆయన్ను కూడా బెదిరించి లొంగదీసుకోవాలని ఆలోచించాడు. అతను ఊహించినట్టే జరిగింది. అయితే లతీఫ్‌ఖాన్ ఊహించనిది ఒకటుంది. నిజానికి అప్పటికింకా మీటు చనిపోలేదు. కొన ఊపిరితో ఉన్నాడు. ఒంటినిండా కత్తిపోట్లవల్ల విపరీతమైన రక్తస్రావం కావటంతో ఎటువంటి కదలికలు

లేకుండా పడివున్నాడు. అది చూసి లతీఫ్, లతీఫ్ సైనికులు అతను చనిపోయాడని భావించి అతన్ని శరీరాన్ని కోటకు దగ్గర్లో పారవేసి అక్కడి నుంచి తప్పుకున్నారు.

ఒంటి నిండా గాయాలతో శరీరం నుజ్జునుజ్జు అయినా ఒకే ఒక సందేశాన్ని తన సోదరుడికి అందించాలని మీటు ప్రాణాలు బిగపట్టుకుని వేచివున్నాడు. దాహంతో, అధిక రక్తస్రావంతో, చావుబతుకుల మధ్య పెనుగులాడుతున్న అతని పరిస్థితి చూసి అతని గూఢచారులు సామాన్య ప్రజలలో కలిసిపోయి పరుగున వచ్చారు. వారిలో ఒకడైన సామ్యానాయక్ దాహం తీర్చడానికన్నట్టు నీళ్లు తీసుకుని వెళ్లాడు. మీటు అతికష్టంతో, "మనవాళ్ల ప్రాణాలకు ప్రమాదం పొంచివుంది. లతీఫ్‌ఖాన్ సైనికులు వాళ్లను వెతుకుతున్నారు. తొందరగా వెళ్లి తప్పించుకోమని చెప్పు. నేనింక బతకను. చనిపోతున్నాను. అయితే ఈ విషయం మాత్రం మనవాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియకూడదు. నా కుమారుడు దేసుకు మంచి సంబంధం చూసి వివాహం జరిపించమని చెప్పు" అని అత్యంత ప్రయాసతో చివరి సందేశాన్ని తెలిపి మీటు చివరిశాస్వ పీల్చాడు.

మీటు మరణవార్త విని ఖాన్‌సాహెబ్‌గారు విచలితులయ్యారు. అంగరక్షకుడిగా తనను, తన కుమారుడిని, సింహాసనాన్ని కాపాడుకుంటూ వస్తున్న మీటు మరణంతో ఆయన కుంగిపోయారు. కొద్దిసేపటి వరకు మీటు హత్యలో ఎవరి చేతివాటముందో అర్థంకాక ఆలోచనలోపడ్డారు. తరువాత ఇందులో ఎవరి ప్రమేయం ఉందో ఊహించారు. మీటు భుక్యా కరమ్‌తోట్ అనే మహావీరుడి శవాన్ని ఖాన్‌సాహెబ్‌గారు స్వయంగా బంజారా సంప్రదాయం ప్రకారమే చితిపేర్చి దహనసంస్కారాలు నిర్వహించారు. మీటు భార్యాపిల్లలు, అతని సోదరుడు థావు, అతని భార్యపిల్లలు ఏమయ్యారో ఆయనకు తెలియలేదు.

అదే రోజు లతీఫ్‌ఖాన్ తన మొదటి విజయాన్ని సాధించి సింహాసనానికి తాను దగ్గరయ్యాడని సంబరపడిపోయాడు. ఆ ఆనందంతో మితిమీరి తాగి, నోరుజారి ఖాన్‌సాహెబ్‌కు అండగా ఉన్న బంజారాలను ఆయనకు ఎలా దూరం చేశాడో మద్యం మత్తులో బయటికి కక్కాడు. అది తన ప్రాణాల మీదికి వస్తుందని అతను ఊహించలేదు. మీటు మరణానికి కారకులెవరో తెలుసుకోవాలని ఖాన్‌సాహబ్ నియమించిన చారులు వెంటనే ఆ విషయాన్ని ఆయనకు తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే ఖాన్‌సాహెబ్‌గారు తాగిన మత్తులో తూగుతున్న లతీఫ్‌ఖాన్‌ను అల్లుడని కనికరం కూడా చూపకుండా చంపేశాడు.

రాత్రీపగలూ విశ్రాంతి లేకుండా లచ్మి నేతృత్వంలో థావుసైనికులు ఆడవాళ్లను,

పిల్లలను, మిగతా జనాన్ని, కోడెలను దూరంగా తీసుకునిపోయారు. ఇప్పుడు లచ్మి భర్త గురించి చింతించసాగింది. ఆమె తన తండ్రి భగన్యనాయక్ నుంచి పొందిన తెలివితేటలను ఇక్కడ ప్రయోగించింది.

ప్రమాదం ఉందని తెలిసినపుడు భావోద్వేగానికి గురై చేతులు కట్టుకుని కూర్చుంటే మొండెం మీద రుండం ఉండదు. బుద్ధిమంతుడైనవాడు ముందు సురక్షితమైన స్థలాన్ని చూసుకోవాలి. తర్వాత ఏడవటం, తపించటం ఉండనే వుంటుంది. పులిలాంటి తన భర్త పరిస్థితిని తలుచుకుని లచ్మి లోలోపలే కుమిలిపోయింది. అయితే అది బయటికి కనిపించకుండా, ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది. మనోవ్యథతో రోజు రోజుకూ కృశించిపోసాగింది. "వదినా, నువ్వే ఇలా కుంగిపోతే మేము ఏమైపోతామో ఆలోచించండి" అన్నాడు థావు ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని. "థావూ ఆయనే లేకపోయాక నేను..." అంది వెక్కుతూ. "వదినా, అన్నకు ఏమీ కాలేదు. అతను పులి, భగభగమనే నిప్పుముద్ద అని మీకు తెలుసు. మీరు అనవసరంగా బాధపడుతున్నారు" అంటూ ఓదార్చడానికి ప్రయత్నించాడు. ఆమెకు మాట్లాడలేదు. ఆమె కంటిచివర నుంచి కన్నీటిబిందువు రాలడానికి తపిస్తోంది. దాన్ని ఆమె అదిమిపెట్టే ప్రయత్నం చేస్తుండటం థావుకు కనిపించింది.

హఠాత్తుగా ఆమె "దేసుభుక్యా కరమ్‌తోట్ ఇప్పుడు పెద్దవాడయ్యాడు" అంది.

ఆమె మనస్సుకు నచ్చేలా మాట్లాడి ఆమెను ప్రాపంచిక ప్రపంచంలోకి తీసుకుని రావడానికి థావు ప్రయత్నించాడు.

"అవును వదినా" అన్నాడు థావు.

"మీటు భుక్యా కరమ్‌తోట్ వంశాన్ని నా కొడుకు నిలబెడుతాడు" అంది.

ఆమె స్వరంలోని దృఢత్వాన్ని, నమ్మకాన్ని థావు గుర్తించాడు.

"బతుకు సార్థకతకు ఇలాంటి ప్రోత్సాహకరమైన మాటలే కావాలి. ఇప్పుడు మనకు ఏ నేల లేదు. అన్నయ్య ఎందుకు హైదరాబాద్ నుంచి దూరంగా వెళ్లమన్నాడో ఆ మనిషి చెప్పలేదు. మనం తిరిగి రాజస్థాన్ వెళ్లటం కలలోని మాట. మనం ఇక్కడే ప్రయాణం చేసే దారిలోనే శవాలైపోతామేమోనని భయం వేస్తోంది వదినా" అని అన్నాడు.

ఆతని గొంతులోని భయాన్ని గురించి, "అరే, థావూ, అందరూ ఏదో ఒక రోజున చావాల్సిందే. అయితే సార్థకమైన బతుకును బతికి ఒకరు మరొకరికి భారం కాకుండా చావటమే నిజమైన బతుకు. మన అదృష్టంలో ఈ నేల అన్నం తినే ఋణం రాసివుంది. ఊ ం కానీ ఏది వచ్చినా అనుభవిద్దాం" అని తన దృఢ

నిర్ణయాన్ని వ్యక్తపరిచింది.

దాంతో అందరూ ఆంధ్ర–కర్ణాటక సరిహద్దుల్లో గుడారాలు వేసుకున్నారు.

ఇప్పుడు థావు దేసుభుక్యా కరమ్‌తోట్‌ను వ్యాపారంలోకి దించాడు. కాలం గడుస్తున్నట్టల్లా థావు తన కుమారుడు లచ్మభుక్యా కరమ్‌తోట్‌ను కూడా వ్యాపారంలో దించాలని అనుకున్నాడు. ఈ అభిప్రాయాన్ని వదిన దగ్గర ప్రస్తావించినపుడు ఆమె చాలా సంతోషంతో సోదరులిద్దరూ కలిసి వ్యాపారం చేయటానికి అనుమతి ఇచ్చింది. దేసుభుక్యా కరమ్‌తోట్, రూప్లి కూతురు సోమి ఇద్దరూ మంచి జంటగా కనిపించటంతో లచ్మి తన మరదలు రూప్లి ముందు ఈ ప్రస్తావన ఉంచింది. రూప్లికి వెంటనే అన్న మీటు గుర్తొచ్చాడు. తన మానప్రాణ రక్షణ కోసం, తను పుట్టిపెరిగిన పరిసరాలనే త్యాగం చేసిన మీటు అన్నయ్య కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉండే ఆమె తన కూతురును ఇవ్వడం గొప్పగా అనిపించలేదు. అది తన అదృష్టంగా భావించింది.

"బోజాయి (వదినా) నీ కుమారుడికి వెయ్యిమంది తమ పిల్లలను ఇవ్వడానికి సిద్ధమవుతారు. అయితే బంధుత్వాల కోసం త్యాగంచేసే నీ మాటను నేను కాదంటానా? నా ఈ ప్రాణం అన్నయ్య పెట్టిన భిక్ష. ఈ జీవితం నువ్వు పెట్టిన భిక్ష. సోమ్లి నా కూతురు కాదు. అది నీ కూతురు" అని రూప్లి భావోద్వేగంతో కంటతడి పెట్టింది.

బంజారుల పద్ధతి ప్రకారం 'వాత్‌బోలె' చేయించడం జరిగింది. అలాగే 'అట్మురసాంజేర' పెళ్ళికి ముహూర్తం చూడటమూ జరిగింది. 'పాన్‌పేరువ' కార్యం ముగిసిన తరువాత సంబంధం నిశ్చయమైంది.

ఒకే ఇంట్లో పుట్టి పెరిగినప్పటికీ సోమ్లి ఇప్పుడు మేలిముసుగులో తన ముఖాన్ని దాచుకోసాగింది. ఇప్పుడు ఆమెకు 'కుంవారి కాంచళి' రవిక తొడిగించారు. ఒకటిరెండు నెలల తర్వాత లచ్మి 'గోళపేర శాస్త్రం' ముగించింది. అక్కడితో పెళ్లిసంబంధం నూటికి తొంభై శాతం ఖరారైనట్టే. పిల్ల అదే ఇంటికి చెందినప్పటికీ సంప్రదాయాన్ని వదలుకోవడం సాధ్యమా? థావు ముందు నిలబడి వచ్చిన బంధువుల కంతా ఆంధ్ర–కర్ణాటక సరిహద్దుల్లో గుడారాలు వేయించాడు. పెళ్లికి అందరూ పక్కనున్న పేటకు వెళ్లి పెళ్లిసామాన్లు తెచ్చారు. పెళ్లికొడుకుకు ఎర్రటి శాలువా, అంగి, పంచె, అమాయికి కొత్త బట్టలు, చెప్పులు కొన్నారు. 'బాండోజి' అయిన తరువాత 'గోటార' బెల్లం పానకం ఇవ్వడం జరిగింది. అది జరిగిన తరువాత అబ్బాయివైపు వాళ్లు అమ్మాయికి, 'గోటార' చేయించారు? లచ్మి కొడుకుకు ఎండుకొబ్బరి, ఉత్తుత్తులు, శోభనానికి అవసరమైన సామానులు జాపత్రి, జాజికాయ, బెల్లం కొన్నది. పెళ్లి తర్వాతి సన్నివేశాలను ఎదుర్కునేందుకు అతనికి శక్తి కావాలని పదిహేను

రోజుల ముందునుంచే కొడుకును సిద్ధం చేసింది. తల్లి చెప్పిన ప్రకారం ప్రతిరోజు ఉదయం కొబ్బరి, ఎండు కర్జూరాలను దంచి, నెయ్యిబెల్లం కలిపి కట్టిన ఉండలను తిని, నాలుగు నాటుకోళ్ల పచ్చిగుడ్లను పగులగొట్టి తాగి, ఒక కంచెం మసాలా చారు తాగేవాడు దేసుభుక్యా కరమ్‌తోట్. అన్నలా తమ్ముడు లచ్మభుక్యా కరమ్‌తోట్ కూడా పెద్దమ్మ పెట్టింది తిని తనూ బలంగా తయారవుతున్నాడు. అతని పెద్దమ్మ లచ్మికి దేసు–లచ్మలలో బేధం లేదు. ఇద్దరూ తన కడుపున పుట్టినట్టే భావించేది. వాళ్లిద్దరిని మీటు–థావులు అనుకునేది. లచ్మ ఒక సంవత్సరం చిన్నవాడైనందువల్ల తగిన అమ్మాయి దొరికితే అదే ముహూర్తానికి అతని పెళ్లికూడా చేయాలనే ఆలోచన థావుకు ఉంది. అతని వ్యాపారాలలోనే ఉన్న డావో బద్య కూతురును లచ్మకు తెచ్చుకోవాలనే అభిప్రాయంతో డావో బద్యాను సంప్రదించాడు. అతను అంగీకరించటంతో ఆకులు పంచే కార్యక్రమం కూడా ముగించారు. దాంతో మరొకసారి పెళ్లిసంతకు అందరినీ తీసుకునిపోవలసి వచ్చింది. వాళ్లందరికీ సారాయి తాగించి, మాంసపు భోజనాలు పెట్టించినపుడు వాళ్ల సంప్రదాయం ప్రకారం భోజనం చేసిన వాళ్లందరూ మత్తు దిగేవరకూ థావును పొగిడారు.

పెళ్లిరోజు దగ్గరవుతుండగా లచ్మికి భర్త మీటు జ్ఞాపకాలు పదేపదే రాసాగాయి. అతను బతికున్నాడో లేదా చనిపోయాడో చెప్పేవారే లేకుండా పోయారు. ఆమె తండ్రి, తల్లి, చిన్నమ్మ, చిన్నాన్న, బంధువులంతా చాలా దూరంలో ఉన్నారు. ఇప్పుడు ఏది చేసినా తన స్వయంశక్తితో చేయాలి. ఒకప్పుడు ఖాన్‌సాహేబ్‌గారి అండలో, వారితోపాటు ఉన్నవారి పరిస్థితి ఉన్నట్టుండి బతకడం కోసం అడవులు పట్టుకుని తిరగవలసి వచ్చింది. ఖాన్‌సాహేబ్‌గారు మీటు పట్ల చాలా గౌరవం చూపించేవారు. ఆయన మీటు గురించి ఆలోచించలేదా? మీటు ఎక్కడున్నాడో ఆయనకు తెలియదా? తెలిసినా తమకు కబురు పెట్టలేదా? అంతా చిక్కుముడిలా అనిపించింది.

థావు తనకు వార్త అందించిన ముసుగుమనిషి కోసం చాలా వెతికాడు. అతను మళ్లీ ఎప్పుడు ఆ సరిహద్దులో కనిపించనే లేదు. ఎవరో ఢిల్లీ సుల్తాను ఔరంగజేబు అస్తమించిన వార్త తెచ్చారు. ఆయన తరువాత అధికారానికి వచ్చినవారు ఆయనంతటి బలవంతులు కాకపోవటంతో చిన్నాచితకా రాజ్యాల రాజులందరూ తాము స్వతంత్రులమని ప్రకటించుకున్నారు. ఆసిఫ్‌ఖాన్ కుమారుని విచారంలో మునిగారు. ఆయనకొడుకు మురాద్ ఆయన స్థానంలో పట్టాభిషిక్తుడయ్యాడు. అయితే అతని మామకు చెందిన కొందరు బంటులు లతీఫ్‌ఖాన్ కుమారుడిని

సింహాసనం మీద కూర్చోబెట్టే ప్రణాళిక వేశారు. లోలోపల కుట్రలు జరగతున్నాయనే వార్త అందింది.

మీటు బతికివుండే అవకాశాలు తక్కువ అనే సత్యం థావు ఒక్కనికే తెలుసు. ఒకవేళ అతను బతికివుంటే భార్యపిల్లల కోసమైనా తప్పకుండా వచ్చేవాడు. సోదరుడు లేని జీవితం ఒక్కొక్కసారి థావుకు జుగుప్స కలిగించేది. ఏనుగు అంతటిన బలశాలి, గొప్ప తెలివితేటలు కలవాడు ఇంత త్వరగా, ఇంత నికృష్ఠమైన బలయ్యాడంటే అతనికి నమ్మకం కలగలేదు. అయితే మోసానికి గురికానివాడెవడు? థావు గుట్టుగా దుఃఖిస్తూ, తనను తాను ఓదార్చుకుంటూ మౌనం వహించేవాడు.

అట్లతిద్ది తరువాత దేసు,లచ్మల సాడితాణ (పెళ్లికొడుకులను) చేశారు. ఒకరు దేసు,లచ్మలకు మామ వరుస వ్యక్తి లేరియాగా (పెళ్లికొడుకు సహాయకుడిగా, తోడి పెళ్లికొడుకు) కూర్చున్నాడు. సోదరులిద్దరికి 'గురూరదాగ్' ఇవ్వడం జరిగింది. గుడారం ముందు కర్ర నిలిపి, పందిరి బిగించడం జరిగింది. అక్కడే పానకం కలపడం జరిగింది. గుడారంలో ఉన్న ఆడవాళ్లందరూ ఒక్కచోట చేరారు. పెళ్లిపాటలు పాడసాగారు. పెళ్లికొడుకులిద్దరిని బయటికి తీసుకుని రావడం జరిగింది. చిన్న వయసులోనే భర్త ఎడబాటు దుఃఖాన్ని భరించిన లచ్మికి ఇప్పుడు తన కొడుకు దేసు పెద్దవాడై, పెళ్లి తరువాత భార్య కారణంగా తనకు దూరమవుతాడేమోననే అనుమానం మనసులో మెదిలింది. దుఃఖాన్ని ఆపుకోలేక కొంగులోపల ముఖం దాచుకుని కొడుకు మెడ చుట్టూ చేతులు వేసి, "లడేలా పులేడార్, తారయాడి ఎదునియారెమాయి ఎకలి వేగిచ మోతన తనమత బోరరే ఆ హించోతారెగెనిపోరే రాజెమ సెజ భూలరీతి బాపు ఆ హింయా" అని రోదించసాగింది. ఎన్నో సంవత్సరాల నుంచి ఆమె గుండెలో మడుగు కట్టిన దుఃఖం కట్టలు తెంచుకుని కన్నీటి సాగరమై ప్రవహించింది. ఆమె చెల్లెలు జంగి కూతురు "బాయి, ఊరుకోండి. నేను లేనా, మిమ్మల్ని వదిలి ఏనాడైనా వేరుగా ఉన్నామా? మామ లేకపోతే ఏమైంది? ఇప్పుడు పులిలాంటి కొడుకు ఉన్నాడు. ఎందుకు విచారిస్తావు? ఊరుకో" లచ్మిని ఓదార్చింది. అయితే తల్లి దుఃఖం చూసి దేసుకూ చాలా దుఃఖం కలిగింది. అతనికి బుద్ధితెలిసినప్పటి నుంచి తండ్రిని చూడనే లేదు. తండ్రి గురించి అడిగినప్పుడంతా తల్లి ఏదో జవాబు చెప్పి అతన్ని ఊరుకోబెట్టేది. బహుశా ఆమె దుఃఖానికి ఇదే ముఖ్యమైన కారణమని అతనికి అర్థమైంది.

ఇంటి ముందు జరగవలసిన కార్యక్రమాలు ముగిసిన తరువాత అమ్మాయి

ఇంటికి వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఒకే గుడారంలో పెళ్లి జరగవలసి ఉండటం వల్ల లచ్మనాయక్ తన మామ గుడారానికి వెళితే, దేసు ఇక్కడే వుండిపోయాడు. అతడి అత్త అక్కడే ఉండటం వల్ల అతను తరువాత జరగాల్సిన కార్యక్రమాలను తమ గుడారంలోనే ముగించాల్సి వచ్చింది. అమ్మాయిలలో రెండు గుంపులు ఏర్పడి, వెతడూను (పెళ్లికొడుకును) పాటలతో చక్కగా తిట్టారు. ఒక గుంపు కొద్దిసేపట్లో లచ్మనాయక్, గుజరి జోడి దగ్గరికి పోయి అదే విధంగా పాటల్లోనే తిడుతూ అర్ధరాత్రి సమయానికి తమ గుడారాలకు తిరిగొచ్చారు. నెలపాటు చేయాల్సిన పెళ్లికావటం వల్ల ఇద్దరు అల్లుళ్లను ఇంట్లోకి తెచ్చుకునే శాస్త్రం ముగించిచారు. ప్రతి శాస్త్రానికీ డబ్బులు, సారాయి సమర్పణ మామూలే.

నెల చివరిరోజున థావు పక్కనే గొర్రెల మంద పెట్టుకున్న కురువ పరదేశి దగ్గర రెండు మంచి జాతి పొట్టేళ్లను ఒకటి దేసు 'గోట్' కోసం, మరొకటి తన కుమారుడు లచ్మ 'గోట్' కోసం కొన్నాడు. అలాగే రెండు కేసుల సారాయి తెప్పించాడు. మంచి మసాలా వేసి ఒకే రోజున రెండు గొర్రెల మాంసపు వంట సిద్ధం చేయించాడు. సారాయి పంచిన తరువాత: 'తాంగడి' (అప్పగింతలు) అనుమతి లభించింది. దేసు 'తాంగడి' అదే గుడారంలోంచి అదే గుడారానికి వస్తే, లచ్మది బయటి నుంచి రావటం జరిగింది. రాత్రి మళ్లీ తిట్లపాటలు పునరావర్తనమయ్యాయి. అమ్మాయివైపు జనం దేసుభుక్యా కరమతోట్‌ను ఇష్టమొచ్చినట్టు వెక్కిరించసాగారు. "తాండేమ ఛోరియె చెనిరె లాల్ సంయాజి. ఫెటియా ఓడ ఓడ సుతియ మేలాళి, ఊంచరె ఓణీర ధగడి ఆయి ఊటోయమేలాళి, వేతుడుర యాడిఛె ఢిలడచకాళి". దేసు వీధిలోని అమ్మాయిలు మళ్లీ 'నవలేరియాడిఛె ఢిలడ చకాళి' అంటూ వెక్కిరించారు.

పాటలు తిట్ల రూపందాల్చి తారాస్థాయికి చేరింది. అర్ధరాత్రి పన్నెండు గంటలైంది. మహంకాళి గుడిముందు నుంచి పక్క వీధిలో ఉన్న అతని గుడారానికి ఊరేగింపుగా బయలుదేరింది. అతని చిన్నాన్న థావు ఊరేగింపు బృందాలకు విందు భోజనాలు ఏర్పాటు చేశాడు. ఒక వారం వరకూ వచ్చిన అతిథులు భోజనాల రుచికి ఇంటికి తిరిగి వెళ్లడానికి మనసొప్పక అక్కడే ఉండిదామనుకున్నారు. అయితే వెళ్లడం అనివార్యమైంది.

ఆంధ్ర సరిహద్దు వెంబడి వ్యాపారాల్లో మునిగిన చాలామంది బంజారాలు ఒక్కొక్కరుగా పరిచయమవ్వసాగారు. దేసు తన తండ్రిలా తెలివైనవాడు. ధైర్యశాలి. శక్తివంతుడు. వ్యాపారం చేస్తూనే తన తండ్రి మీటు భుక్యా కరమ్‌తోట్ గురించి

ఏదైనా జాడ తెలుస్తుందేమోనని కుతూహలంతో సూక్ష్మంగా గమనించసాగాడు. అయితే అతని గురించి ఎలాంటి ఆచూకి దొరకక నిరాశతో తిరిగొచ్చేవాడు. అతన్ని చూడగానే లచ్మి అనేక ప్రశ్నలు వేసేది. ఆమె అడిగే ప్రశ్నలకు ఆశాజనకమైన జవాబులు ఇచ్చి తండ్రి ఎక్కడో ఉన్నాడనే భ్రమను సృష్టించి లచ్మికి క్షణంపాటు సుఖాన్ని ఇచ్చేవాడు. "ఏమిటో నాయనా, మనసుకు ఉల్లాసం కలిగేలా అబద్ధం చెప్పి, అరచేతిలో దూరంలో ఉన్న చంద్రున్ని చూపిస్తున్నావా? అయితే ఖాన్‌సాహెబ్‌కు అత్యంత ఆత్మీయంగా ఉన్న నీ తండ్రి ఇలా మన నుంచి ఎందుకు దూరంగా ఉన్నారో ఆ సత్యాన్ని ఎవరూ చెప్పటం లేదు" అని తన గుండెలో గూడుకట్టుకున్న దుఃఖాన్ని బయటపెట్టింది లచ్మి. "యాడి (అమ్మా), నువ్వేమీ దిగులు చెందకు. వ్యాపారంలో నాలుగు దిక్కుల నుంచి వచ్చే వ్యాపారులు వచ్చి నన్ను కలుస్తారు. వారందరికి ఇప్పటికే విషయం చెప్పాను. నాన్న తప్పకుండా దొరుకుతారు" అని ఆమె మనసును తేలికపరచడానికి అన్నాడు.

దేసు, అతని తమ్ముడు లచ్మ ఇద్దరూ ఒక్క ప్రాంతాన్ని కూడా వదలకుండా వ్యాపారం చేస్తూ బయలుదేరినపుడు బంజారాలు తమ జనాంగంలో అవతరించిన బాల సేవాలాల్ గురించి మాట్లాడుకోవడం విన్నారు. దేసుకు అతన్ని కలవాలనే తపన పెరిగింది. సేవాదాస్, సేవాలాల్‌గా మారి సేవాభాయి అయ్యారు. చుట్టుపక్కలున్న బంజారాలు అతని పట్ల అపారమైన భక్తిశ్రద్ధలు చూపించేవారు. ఆంధ్ర సరిహద్దులో లేదా కర్ణాటక సరిహద్దులో జన్మించిన సేవాదాస్ దైవికశక్తి కలవారు. సరళ సజ్జనులు, న్యాయనిష్టాగరిష్ఠులు. అందువల్ల ప్రతిఒక్కరూ ఆయనను గౌరవించేవారు. అతని వెనుక ఒక ఆడదేవత ఉందని చాలామంది బంజారాలు మాట్లాడుకునేవాళ్లు. మరియమ్మ అతడిని ఒకే స్థలంలో ఉండనివ్వదని జనం నమ్మేవారు.

హైదరాబాద్‌కు వ్యాపారం నిమిత్తం వచ్చిన దేసు, లచ్మల గుంపు హైదరాబాద్ సమీపంలోని కారాడవి మధ్యలో చిన్న కొండపక్కన విడిది చేసింది. ఆ సమయంలో సబ్దర్ జంగ్ గుప్తచారులు ఈ సమాచారాన్ని తమ ప్రభువుకు అందించారు. అడవిలో మకాం పెట్టిన వీళ్లను శత్రువుల గూడచారులనే అనుమానంతో నిజాములు 'కౌన్ హై ఏ లోగ్?" అని అడిగాడు. "హుజూర్, రంగురంగుల దుస్తులు వేసుకున్నారు. పాటలు పాడుతున్నారు. భక్తిగా భజనలు చేస్తున్నారు. గొర్రెలు కోసుకుని వండుకుని తింటున్నారు" అని సైనికులు వివరాలు అందించారు. "అలాగైతే వాళ్లకు మన ప్రసాదం ఇవ్వండి" అని విషపూరితమైన లడ్డులను పంపే ఏర్పాటు చేశారు. గుర్రాల

మీద వచ్చిన నిజామ్‌గారి సైనికులను చూసి సేవాలాల్ అందరినీ జాగ్రత్తగా ఉండమని చెప్పాడు. సైనికులు గుర్రాల మీది నుంచి దిగి పెద్దపెద్ద తాంబాణాలలో లడ్లు పెట్టుకుని ఆయన దగ్గరికి వచ్చారు. "అవి ఏమిటి?" అని సేవాలాల్ అడిగారు. "వీటిని మా మహారాజు పంపారు. మీ కోసం. తినండి" అన్నారు సైనికులు. సేవాలాల్ ఒక ఘడియ మౌనంగా ఉన్నాడు. తరువాత తనవారి వైపు చూసి 'ఊం' అని తీసుకోవటానికి అనుమతి ఇచ్చారు. వాళ్లంతా ఆ పెద్దపెద్ద లడ్డులను సైనికుల దగ్గరి నుంచి తీసుకుని అందరికి పంచడానికి సిద్ధమయ్యారు. వెంటనే సేవాలాల్, "శాంతించండి. ఎవరూ తినకండి" అన్నారు. లేచి ఒక్కొక్క తాంబాణాన్ని చేత్తో తాకి, "ఊం ఇప్పుడు తినండి" అన్నారు. భక్తులు తమకు వచ్చిన లడ్డులు తిని, తమపాటికి తాము ఆనందంతో పాటలు పాడుతూ, భక్తిపారవశ్యంతో నృత్యం చేయసాగారు. సైనికులు ఆశ్చర్యంగా ఇదంతా చూసి, జరిగిన విషయాన్ని చెప్పడానికి వెనుతిరిగి వెళ్లారు. వాళ్లను చూడగానే, "ఏమైంది, వాళ్ల పీడ వదిలింది కదా?" అన్నారు. "నహీ హుజూర్, అందరూ తాంబాణాలు తీసుకున్నారు. అంతలో ఒక వ్యక్తి ఆగమని చెప్పాడు". నవాబుకు ఆశ్చర్యం వేసింది. "ఊం తరువాత" అన్నాడు. "అతను ఒక్క క్షణం ఆగి, అన్నీ తాంబాణాలను ముట్టిన తరువాత లడ్డులను తినడానికి అనుమతి ఇచ్చాడు". "ఊ బాద్‌మే క్యా హువా?" నవాబు కుతూహలంతో అడిగారు. "తరువాత హుజూర్ ! లడ్లు తిన్న తరువాత అందరూ సంతోషంతో పాటలు పాడారు. భజనలు చేశారు. నృత్యం చేశారు" అని చెప్పారు. నవాబు ఆశ్చర్యంగా, "ఆ వంటవాళ్లను పిలువండి" అని ఉత్తర్వులు ఇచ్చాడు. వంటవాడొచ్చి తాను నిజంగానే విషం కలిపానని ప్రమాణం చేశాడు. "ఏమిటి చమత్కారం? విషం కలిపిన లడ్లు తిన్న ఆ జనం చావలేదంటే ఆ మనిషి సామాన్యుడు కాదు" అని ఆలోచించసాగారు. అదే సమయంలో మంత్రి, "జనాబ్, ఎవరైనా జాదూగర్ ఉండొచ్చు" అన్నాడు. వెంటనే నవాబు, "మూసాఖాన్, నీకు బుర్ర పనిచేయటం లేదు. లడ్డులోని విషాన్ని జాదూగర్ కనిపెట్టగలడా?" అని మండిపడ్డారు. అతను వెంటనే "క్షమించండి హుజూర్" అని వేడుకున్నాడు. "సరే, ఆ సాధుపురుషుడిని చూడటానికి నవాబుగారు వస్తున్నారని కబురుపంపండి" అన్నారు. "జీ హుజూర్" అని వంగి సలాం చేస్తూ మూసాఖాన్ బయటికి వచ్చి బంజారా హిల్ వైపు బయలుదేరాడు.

అక్కడ సేవాలాల్ ధ్యానంలో ఉన్నారు.

సైన్యపు పటాలాన్ని చూసి సేవాలాల్ తల్లి ధార్మిణియాడి, తండ్రి భీమా

నాయక్‌లు గాభరా పడ్డారు.

మూసాఖాన్ గుర్రాన్ని వారి ముందు నిలిపాడు. సేవాలాల్ సోదరులు హేమ, చామలు "హుజూర్! మా వల్ల ఏదైనా పొరబాటు జరిగిందా?" అని అడిగారు.

గుర్రం దిగిన మూసాఖాన్ తెల్లటి ధోవతి , తెల్లటి అంగీ తొడుక్కుని ధ్యానంలో ఉన్న సేవాలాల్‌కు సాష్టాంగ నమస్కారం చేశాడు.

సేవాలాల్ చిరునవ్వుతో కళ్లు తెరిచి, "మంత్రి మూసాఖాన్‌గారు, ఏం చేస్తున్నారు? పైకి లేవండి. మీ నుంచి ఎలాంటి అపచారం జరగలేదు. అంతా మనుషుల అనుమానమే కదా! నవాబుగారి శత్రువులు మేము గూఢచారులమై ఉండొచ్చనే అనుమానంతో లడ్లలో విషం కలపటంలో తప్పులేదు" అన్నారు.

ఆ మాటలకు మూసాఖాన్‌కు దిక్కుతోచనట్టయ్యింది.

"మహారాజ్, నవాబ్‌సాబ్ ఆప్‌సే మిల్నా చాహతే హై. ముందుగా మీకు సమాచారం ఇవ్వమని చెప్పారు" అని తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు.

"అరే, ఆయన ఎందుకొస్తున్నారు. ఆజ్ఞాపిస్తే స్వయంగా మేమే వచ్చి ఆయన్ను కలిసేవాళ్ళం కదా!" అని సేవాలాల్ అన్నారు.

"నహీ మహారాజ్, మీ మహత్మ్యానికి ప్రసన్నులై నవాబుగారు తామే స్వయంగా కలవాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కొద్దిసేపట్లో వారు రావచ్చు" అన్నాడు.

నవాబు తాను ఘోరమైన తప్పు చేశాడని బాధపడసాగారు. ఒక గొప్ప కాలజ్ఞానిని చంపే కుట్ర చేశాడు కదా, అల్లా తనను క్షమించడని విచారిస్తూ అక్కడికి చేరుకున్నారు. వెంటనే గుర్రం దిగి, "మమ్మల్ని క్షమించండి సాధుమహారాజ్. తాము దివ్యజ్ఞానులని తెలియక సామాన్య నవాబునైన నేను మిమ్మల్ని అనుమానించాను. నేనే అవమానితున్ని అయ్యాను" అని పరితపించసాగారు. "నవాబ్ సాహెబ్, మనిషి అన్న తరువాత ఇదంతా సహజమే. తమ స్థానంలో నేనున్నా అలాగే చేసేవాడిని. మీరు అంతగా మనసు నొచ్చుకోకండి" అని ఆయన మనసును తేలికపరచటానికి సేవాలాల్ అన్నారు.

"సాధుమహారాజ్, తాము మా రాజభవనానికి వచ్చి మా అతిథ్యాన్ని స్వీకరించాలని కోరుతున్నాను" అని ఆహ్వానించారు. సేవాలాల్‌కు ఆ దేవి ఏమని ఆదేశించిందో, "పదండి నవాబ్ సాహెబ్" అన్నారు.

అటు తరువాత తన గుర్రమెక్కి నవాబ్‌గారి వెంట బయలుదేరిన ఈ

మహిమాన్విత పురుషుడిని చూసి బంజారాలు పాటలు కట్టి పాడసాగారు.

దేసు బంజారాల గురువైన సేవాలాల్‌ను కలవడానికి ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

హైదరాబాద్ వైపు తమ వ్యాపారాన్ని పూర్తిగా నిలిపివేసిన థావుకు ఇప్పుడు తప్పనిసరిగా వంద కోడెలమీద ధాన్యం మూటలు మోపి పంపాల్సిన అవసరం వచ్చింది. అతనికి ఏం చేయాలో తోచలేదు. వదిన దగ్గరికి వెళ్ళి విషయం తెలిపాడు. “వదినా, నాకూ ఈ వ్యవహారం ఇష్టం లేదు. అయితే మంచి అవకాశం. ఏం చేయాలో అర్థంకావటం లేదు” అని తన కలవరాన్ని ఆమె ముందు పెట్టాడు.

“దేవ్‌సా, వ్యాపారానికి మన కోడెలను పంపటం తప్పదా?” అని లచ్మి అడిగింది. “అవునమ్మా, మళ్ళీ అటువైపు మన వ్యాపారాన్ని ప్రారంభించటానికి ఇది గొప్ప అవకాశం. లాభం కూడా బాగా ఉంటుంది. ఈ మధ్యన ఇంత పెద్ద వ్యాపారం జరగలేదు” అన్నాడు.

“సరే, ఎవరిని పంపాలని అనుకుంటున్నారు?” అనడిగింది.

“నేనే స్వయంగా లచ్మతోపాటు వెళతాను. దేసు ఇక్కడి వ్యాపారాన్ని చూసుకుంటాడు. పైగా మీ అందరి రక్షణ చూసుకుంటాడు” అని తన నిర్ణయాన్ని తెలిపాడు.

అయితే లచ్మికి ఎందుకో ఈ వ్యాపారం వద్దనిపించింది. ఒకటి దూరప్రయాణం. మరొకటి ఎవరైనా కుట్రచేసి ప్రాణాలకు ప్రమాదం తెస్తే ఏమిటి గతి? అని అనుకుంది. అయితే మనసులోని అనుమానాన్ని బయట పెట్టకుండా, “మీకు ఎలా మంచిదనిపిస్తే అలాగే చేయండి. అయితే జాగ్రత్త. ఎవరినీ నమ్మకండి. దూరప్రయాణం. పైగా ఈ మధ్యన దొంగతనాలు ఎక్కువయ్యాయని విన్నాను” అని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

తమ పరిస్థితుల ప్రభావం వల్ల దేవ్‌సా ఈ వ్యాపారం చేయటానికి, వంద కోడెలను పంపటానికి ఈ నిర్ణయం తీసుకున్నాడని లచ్మి గ్రహించింది. ఈ మధ్యన వ్యాపారంలో హెచ్చుతగ్గులు కలిగి భారీ నష్టం వచ్చింది. కాలికి, నోటికి ఏదో జబ్బు చేసి తీవ్రంగా బాధలుపడిన వేలాది ఎద్దులు హఠాత్తుగా చనిపోయాయి. వయసు మళ్లిన ముసలి ఎద్దులు నుంచున్న చోటే కూలిపోయి ప్రాణాలు వదిలాయి. ఇక అంతా వదిలేసుకుని బంజారాగఢకు తిరిగివెళ్ళిన వారినుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఇక్కడి నుంచి అక్కడికి వార్త చేరవేయటమూ అసాధ్యమైన విషయం. బహుశా తాతయ్య, నానమ్మలు చనిపోయివుండొచ్చు, వాళ్లు అలా

వుండొచ్చు, ఇలా వుండొచ్చు అని ఊహించుకుంటూ ఇద్దరు అక్కాచెల్లెళ్లు గుర్తుచేసుకుని కుమిలిపోవడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిలో వున్నారు. అంతఃపురంలాంటి తమ ఇంటిని వదిలినపుడు వాళ్లకు ఏడెనిమిదేళ్లు. ఇప్పుడు యాభై ఏళ్లు. అప్పటికే చూడకూడనివి చూశారు. వినకూడనివి విన్నారు. తిరిగి వెళ్ళే అవకాశాలు పూర్తిగా మూసుకుపోయాయి.

థావు బలమైన కోడెలను ఎంపిక చేశాడు. పదిగుర్రాల మీద పదిమందిని తన పెద్దకుమారుడు లచ్మకు సహాయకులుగా, రక్షకులుగా నియమించాడు. వంద కోడెలపై ధాన్యాల మూటలను మోపి హైదరాబాద్ వైపు ప్రయాణమయ్యాడు. ఇంటివారికి ఇది ఇష్టం లేదు. అయితే వచ్చిన అకాశాన్ని వదులుకుని చేతులు ముడుచుకుని కూర్చోవటం సాధ్యం కాదు. ఒకటిన్నర నెలలో తిరిగి రావచ్చనే నమ్మకం వారిది.

లచ్మికి ఎందుకో అసంతృప్తి, కలవరం. దేసు అప్పటికే వ్యాపారం నిమిత్తం మరోవైపు చాలా దూరం పోయాడు. ఈసారి అతని వెంబడి థావు వెళ్లాడు. అలా వెళ్లినపుడంతా థావు దేసుకు ఎన్నో విషయాలు చెప్పేవాడు. ఎన్నో బుద్ధిమాటలూ చెప్పేవాడు. ఆ రోజు కూడా మాటల మధ్యలో–

"చూడు దేసు, జీవితంలో ఎప్పుడూ వెనక్కి చూడకూడదు. శక్తికన్నా యుక్తిని ఉపయోగించాలి. మన ఎదుటవున్న శత్రువు శక్తిని అంచనా వేయలేనప్పుడు నేనే శక్తివంతుడిని అని బలంగా నమ్మి శత్రువు మీద దాడిచేస్తే అతను ఎంత శక్తివంతుడైనప్పటికీ ఒక్క క్షణం తబ్బిబ్బవుతాడు. ఆ సమయాన్ని వాడుకుని, అదును చూసి అతన్ని ముగించాలి" అని అన్నాడు. అలా అంటుండగా అతని గొంతు బొంగురు పోయింది. దుఃఖంతో మాటలు బయటికి రాలేదు.

దేసు చిన్నాన్నవైపు చూశాడు. అతడి కళ్లల్లో ఎన్నో ప్రశ్నలు.

"నాయనా దేసు. ఇదంతా నేను మీ నాన్న దగ్గరి నుంచి నేర్చుకున్నాను. ఎప్పుడూ మీ నాన్నకు అంటే నా సోదరుడికి నీడలా బతికాను. అయితే ఈ విధివిలాసం చూడు. అతడిని మా నుంచి దూరం చేసింది" ఆ మాటలు అంటుండగా ఎన్నాళ్ల నుంచో అణచిపెట్టుకున్న కన్నీళ్లు కళ్లనుంచి ధారాపాతంగా ప్రవహించసాగాయి.

"కాకా, నాన్న గురించి ఇంతగా ప్రేమాభిమానాలను, గౌరవాన్ని పెట్టుకున్న మీరు ఎందుకు నాన్నను వెతకలేదు?" అని అడిగాడు.

ఎన్నో ఏళ్ల నుంచి మనసును వేధిస్తున్న అవ్యక్తమైన ప్రశ్నకు జవాబు కోసం ఎదురుచూశాడు.

"అదంతా ముగిసిన కథ నాయనా! ఇప్పుడు దాన్ని తలుచుకుని ప్రయోజనం లేదు" అని మాట మార్చడానికి చూశాడు.

"ఆయన బతికున్నాడా?" మరో ప్రశ్న దేసు నోటి నుంచి వెలువడింది.

థావు ఏమని జవాబు ఇవ్వాలో అర్థంకాని సందిగ్ధంలో పడ్డాడు.

"నాయనా అది..." మాటలు బయటకి రాలేదు.

"ఎందుకు మా నుంచి నిజాన్ని దాచిపెట్టారు. ఆయన బతికి ఉన్నట్లయితే ఆయన ఎక్కడున్నారో చెప్పండి. ఏ ప్రాంతంలో ఉన్నారు. ఆయన్ను నేనే వెళ్లి తీసుకొస్తాను" అని దేసు ఆవేశంగా అన్నాడు.

"దేసు బేటా, నువ్వు అచ్చం మీ నాన్నలా ఉన్నావు. ఆయనలా పట్టుదల కలవాడివి. శక్తివంతుడివి. అయితే ఆ నాటి పరిస్థితికి ఈ నాటి పరిస్థితికి చాలా వ్యత్యాసం ఉంది నాయనా. ఖాన్‌సాహెబ్‌గారు తమ దగ్గరివాళ్లను దూరంగా పెట్టి నమ్మకస్థులైన మమ్మల్ని దగ్గర పెట్టుకున్నారు. అయితే అదొక దురదృష్టకరమైన సన్నివేశం. ఖాన్‌సాహెబ్‌గారి అమ్మాయి మీ నాన్న శక్తిసామర్థ్యాలను మెచ్చుకుంది. అతడిని అందరి ముందు అభినందించింది. అది ఆమె భర్త లతీఫ్‌ఖాన్‌కు తెలిసింది. ఖాన్‌సాహెబ్ అధికారాన్ని తాను పొందటానికి ఆయనకు అంగరక్షకుడిగా ఉన్న మీ నాన్నను మోసంతో దారుణంగా హత్య చేశాడు" ఆ మాట చెబుతున్నప్పుడు థావుకు దుఃఖం పొంగుకు వచ్చింది. దేసు గుర్రం మీదనే కూలిపోయాడు.

కొద్దిసేపు విశ్రాంతి కోసం చెట్టునీడలో పటాలాన్ని ఆపారు. దేసును ఓదార్చి, అతడిని కొంతమంది నమ్మకస్థులతో వెనక్కి పంపాలని నిర్ణయించుకున్నాడు.

"నాయనా, ఎన్నడూ జీవితంలో నిరాశ చెంది పరిస్థితుల నుంచి పారిపోకు. మన జీవితమే ఒక పోరాటం. మనం దూరప్రాంతం నుంచి వచ్చిన వాళ్లం. కాస్త మైమరిచి విశ్రమించినా పెద్ద ప్రమాదం ముంచుకొస్తుంది. జాగ్రత్తలు పాటిస్తే మనకు మంచిది. నేను ఇప్పుడు నీకు చెప్పిన మీ తండ్రి హత్య నిజాన్ని ఎన్నడూ మీ తల్లిగారికి చెప్పవద్దు. చెప్పిన క్షణమే ఆమె ప్రాణత్యాగం చేస్తుంది. చిన్నమ్మపట్ల, మిగిలిన నీ తమ్ముళ్లపట్ల, చెల్లెళ్లపట్ల జాగ్రత్త వహించు. ఇప్పుడు మొత్తం మన కరమ్‌తోట్ వంశం బాధ్యత నీపై ఉంది. దాన్ని నిర్వహించు" అన్నాడు థావు.

ఇలా చాలాసేపటి వరకు థావు తన మనసులో ఏమేమి చెప్పాలనుకున్నాడో చెబుతూ వుండిపోయాడు. దేసుభుక్యా కరమ్‌తోట్ తన చిన్నాన్న ఎందుకిలా చెబుతున్నాడో అర్థం చేసుకునేలోపు వాళ్లు దూరంగా పోయారు. వాళ్లు నుంచున్న స్థలానికి మనస్సులోనే నమస్కరించాడు. ఎన్నిరకాల దుర్ఘటనలు సంభవించినప్పటికీ

వాటినన్నిటినీ భరిస్తూ బండరాయిలా కష్టాలకు తనను తాను ఒడ్డుకుని నవ్వుతూనే బాధ్యతలను మోస్తున్న తన చిన్నాన్నపట్ల దేసుకు గర్వంగా అనిపించింది.

దేసు మిగిలిన చిన్నాచితకా వ్యాపరం చేసి లాభం గడించసాగాడు.

చాలామంది అటువైపు నుంచి వ్యాపారం చేయటానికి వచ్చిపోతుండం వల్ల వ్యాపారంలో హెచ్చుతగ్గులు కలగసాగాయి. అతను దూరవ్యాపారాలను అంగీకరించేవాడు కాదు. ఒక్క రోజు ప్రయాణం చేయవలసి వస్తే తన మనుషులను పంపేవాడు. కర్ణాటక సరిహద్దులోని జనంతో పరిచయాలు పెట్టుకున్నాడు.

ఇంట్లో థావుకూతురు గోమి పెళ్ళి వయసుకు వచ్చింది. ఆమెకు పెళ్ళి చేయాలి. అతని రెండో కొడుకు తోత్యా దేసుతో కలిసి వ్యాపారం చేస్తున్నాడు. దేసుకు ఇంటి బాధ్యత తెలియాలని థావు కోరిక. లచ్మకన్నా దేసు బుద్ధిమంతుడు. అన్నిటిలోనూ తెలివైనవాడు.అంతేకాదు సూక్ష్మమతికూడా. ఇప్పుడు అతనొక పక్కా వ్యాపారిగా పరిణమించాడు. చుట్టుపక్కలంతా అతని వ్యాపారం గురించే మాట్లాడుకుంటున్నారు. ఇది చాలామంది బంజారాలలో ఈర్ష్యను కలిగించింది. దాంతో ఎలాగైనా అతని వ్యాపారాన్ని దెబ్బతీయాలని లోలోపల కుట్రలు చేయసాగారు. అయితే అతని తెలివితేటల ముందు అవి నెరవేరలేదు. దేసుకు హైదరాబాద్‌కు వ్యాపార నిమిత్తం వెళ్లిన చిన్నాన్న థావు గురించి ఆలోచన తీవ్రంగా వేధించింది.

హైదరాబాద్ ప్రవేశించిన థావుకు ఒక ప్రమాదం ఎదురుచూస్తోంది. గుర్రాల మీద బయలుదేరిన ఒక సైనికుల గుంపు కనిపించింది. అది చూసి లచ్మ ఏదో అనబోయాడు. థావు చప్పున అతని నోరు మూసి, 'గట్టిగా మాట్లాడకు. వాళ్లకు మనం ఇక్కడ ఉన్నట్టు తెలిసిపోతుంది. మన ప్రాణాలకు ప్రమాదం' అన్నాడు. చప్పుడు చేయకుండా ముందుకు సాగారు. వాళ్లు ధాన్యాన్ని చేర్చవలసిన స్థలానికి వచ్చారు. అప్పటికే చీకటి పడింది. అడవిలో గుడారాలు వేసుకుని మకాం పెట్టడానికి సిద్ధమయ్యారు. సరుకుల కొనుగోలు సొమ్ము మరుసటి రోజు ఇస్తానని చెప్పిన ఆసామి జాడలేకుండా పోయాడు. థావుకు ఏమి చేయాలో పాలుపోలేదు. దారి ఖర్చులు, అతని వెనుక వచ్చిన కూలీలకు ఇవ్వాల్సిన కూలీ డబ్బులు, అన్ని తలమీద పడే బరువులా అనిపించింది. ఆ ధనవంతుడు సాయంత్రం కనిపించాడు. అతను హైద్రాబాద్ ఉర్దూలో మాట్లాడుతున్నాడు. థావుకు కొద్దోగొప్పో హిందీ వస్తుండటం వల్ల ఎలాగో మాటలు కొనసాగించాడు. అతను చెప్పినదానికన్నా తక్కువ ఇవ్వడానికి వచ్చాడు. "లేదు స్వామి, మాకు ఇప్పటికే ఖర్చులు పదిరెట్లు పెరిగాయి" అన్నాడు

థావు. "చూడండి, నేను ఇచ్చేది ఇంతే. కావాలంటే తీసుకోండి. లేకపోతే పోండి" అని అతను కరాకండిగా చెప్పాడు. థావు కంగారు పడ్డాడు. ఎందుకో సమస్యలన్నీ ఒకేసారి తలమీదికి వస్తున్నాయో అర్థం కాలేదు. "అలా చేయకండి హుజూర్, నేను నాశనం అయిపోతాను" అని థావు వేడుకున్నాడు. ఆ ఆసామి పట్టించుకోలేదు. లచ్మకు కోపం వచ్చింది. "మా సొమ్ము మాకిస్తావా? లేదా?" అన్నాడు. "ఏం చేస్తావ్? ఇవ్వను. పో" అని ఇవ్వడానికి తెచ్చిన డబ్బు సంచిని నడుంలో దోపుకుని వెళ్లబోయాడు. "నవాబ్ పాస్ దేదేంగె, జావో" అన్నాడు. థావుకు తల పాడైపోయింది. అతని చేతిలోని డబ్బుసంచిని లాక్కుని "ఇప్పుడు వెళ్లి నవాబ్‌కు చెప్పండి" అని గుడారాలు ఎత్తేసి, వెంటనే అక్కడి నుంచి బయలుదేరారు. చీకటి పడుతుండగా అడవిదారి గుండా తిరిగి వెళ్లిపోవాలని ఆలోచించారు. ఈ విషయం లతీఫ్ ఖాన్‌కు తెలిస్తే ప్రమాదమని, కోడెలను ఒక వైపు తోలుకునిపొమ్మని, లచ్మతో వచ్చిన మార్గం వెంబడి ముందుగానే పోయి పరారవ్వాలని అనుకున్నాడు థావు. అయితే ఆ వ్యాపారి అప్పటికే నవాబు సైనికులకు తప్పుడు ఫిర్యాదు చేయడం వల్ల థావు కోసం అన్వేషణ మొదలైంది. ఆ కారణంగా అతను తప్పించుకునే అవకాశాలు తగ్గిపోయాయి. అయినా మొండి ధైర్యంతో తప్పించుకుని పోవాలని ముందుకు సాగిపోయాడు. నాకాబందీ చేసిన సైనికులు మోసం చేసి పారిపోతున్న బంజారా వ్యాపారిని పట్టుకోవడం కోసం ప్రత్యేకమైన ఆసక్తి చూపించారు. హైద్రాబాద్ దాటడం కాస్త కష్టమైంది. ఏంతో ప్రయాసతో సరిహద్దును దాటి, కోడెల రాకకోసం ఎదురు చూస్తుండగా ఒక పహారా కాసే సైనికుడు దగ్గరికి వచ్చాడు. వాళ్ల పరిస్థితిని గమనించి అనుమానంతో కూతవేటు దూరంలో ఉన్న సైనిక పటాలాన్ని పిలిపించాడు. వాళ్లు థావును, లచ్మను చుట్టుముట్టారు. అదే సమయానికి కోడెలు తోసుకుంటూ వచ్చాయి. సైనికులకు, థావుగుంపుకు మధ్య ఒక చిన్న యుద్ధమే జరిగింది. బంజారాలు యుద్ధకళను తమ ఆత్మరక్షణ కోసం నేర్చుకోవడం వల్ల వాళ్ళు కూడా సైనికులతో బాగానే పోరాడారు. సైనికపటాలాన్ని చిత్తుచేసి ఇక అక్కడి నుంచి తప్పించుకుని పోవాలనుకున్న సమయంలో మరొక సైనికపటాలం వచ్చి చుట్టుముట్టింది. దాంతో ప్రాణాలు దక్కే అవకాశం లేకుండా పోయింది. "థావు దేకోర మరేరోన జీవెరో తమార హాతెమ అఫణ్ ఇరగతో మరగె చారవాళదేన దాంజామ" అంటూ గోరబోలిలో ఉత్సాహం నింపాడు. ఈ భాష సైనికులకు అర్థం కాలేదు. దగ్గరికి వచ్చేంతవరకు మౌనంగా ఉన్న థావు వాళ్ళు దగ్గరికి రాగానే వాళ్ల మీద మెరుపుదాడి చేశాడు. సైనికులు ఈ బంజారాలు లొంగిపోయారని

అనుకున్న శత్రుసైనికులు ఉన్నట్టుండి జరిగిన దాడి వల్ల అయోమయంలో పడ్డారు. చాలా సేపు పోరాటం జరిగింది. బంజారాలు ఇక తాము గెలవలేమని అర్థమయ్యాక ఒక్కొక్కరు తప్పించుకుని పారిపోసాగారు. కోడెలన్నీ చెదరిపోయాయి. థావు చాలా తీవ్రంగా గాయపడ్డాడు. అతని కుమారుడిపై కూడా ప్రాణాంతమైన దాడి జరిగింది. ఈ విషయం దేసుకు అందించాలి. అతని దగ్గరున్న బంగారు నాణేలు ఎలాగైనా దేసకు చేర్చటానికి లచ్మ బతికివుండటం అనివార్యం. సైనికులు చుట్టుముట్టినా, "బేటా, నువ్వు పారిపో, ముందుదారిలో మనవాళ్లు కనిపిస్తారు. మీ జీవితానికి ఈ సొమ్ము ఉపయోగపడుతుంది. జాగ్రత్తగా దీన్ని మీ అన్నకు చేర్చు" అని అన్నాడు. లచ్మ వరహాలతో తప్పించుకుని తన గుర్రంమీద అక్కడి నుంచి జారుకున్నాడు. థావు నేలకూలి ప్రాణాలు వదిలాడు. దూరం నుంచే తండ్రి మరణానికి లచ్మ సాక్షి అయ్యాడు. గుర్రం దగ్గరికి పరుగెత్తాడు. అతని మీద కూడా తీవ్రంగా దాడి జరగడం వల్ల తీవ్రమైన గాయాలు అయ్యాయి. గాయాల నుంచి రక్తం కారుతోంది. తన దగ్గరున్న బట్టను గాయాలకు చుట్టుకుని గుర్రం మీద అడ్డంగా వాలిపోయాడు.

లచ్మ కళ్లు తెరిచినప్పుడు అతని గుంపు అతనికి సేవ చేస్తోంది. వాళ్లను చూసి కాస్త కుదుటపడ్డాడు. గాయానికి అడవి నుంచి తెచ్చిన ఆకులు నూరి ఆ పసరు కట్టారు. అయితే గాయాలు విషపూరితం కావటం వల్ల అతనికి జ్వరం వచ్చింది. "ఇలాగే కూర్చుంటే మనం స్థావరం చేరటం సాధ్యం కాదు. పదండి" అని లచ్మ ఉత్తర్వులు ఇచ్చాడు. కనిపించిన కోడెలను ఒక్కచోట చేర్చి ఇంటికి బయలుదేరారు. అత్యంత ప్రయాసతో హైదరాబాదుకు పోయినవారు థావు కథ విని కుమిలిపోయారు. ఆ వ్యాపారి మోసం చేశాడు. చిన్నాన్నకు ఎందుకు ఈ సత్యం అర్థం కాలేదని దేసు పరితపించాడు. లచ్మ తాను తెచ్చిన బంగారు నాణేలను దేసు చేతికిచ్చి నేలకూలిపోయాడు. అది చూసి, దేసు "ఏమైంది?" అని అరిచాడు. అతని దేహం చల్లబడసాగింది. లచ్మ భార్య పరుగున వచ్చి "ఏమైంది మీకు, ఒకసారి నన్ను చూడండి.... నన్ను చూడండి..." అని రోదించసాగింది.

వ్యాపారం నుంచి తిరిగి వచ్చిన తరువాత గుజాలతో అతనికి శోభన కార్యక్రమం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎందుకంటే పెళ్లిసమయానికి ఆమె ఇంకా ఋతుమతి కాలేదు. దేసుకు దిక్కుతోచనట్టయ్యింది. కత్తి మొనలు శరీరాన్ని చీల్చటం వల్ల ఆ గాయాలకు వెంటనే చికిత్స అందకపోవటంతో మొత్తం దేహం విషపూరితమైంది. తల్లి తొడమీద తల పెట్టి పడుకుని అలాగే ప్రాణాలు వదిలాడు. భర్త రాకకోసమే ఎదురుచూస్తున్న గుజాల భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు

తలెత్తింది. ఇది కరమ్‌తోట్ ఇంటికే సవాలై కూర్చుంది. దేసు చిన్నమ్మతో లచ్మ తమ్ముడితో మారుమనువు చేద్దామని అన్నాడు. ఆమె స్త్రీ బాధను అర్థం చేసుకుని అందుకు ఒప్పుకుంది. అయితే ఇంటికి పెద్దదైన అతని తల్లి నిర్ణయమే అంతిమ నిర్ణయం. రేపు చరిత్రలో తమ కులం గురించి జనం మాట్లాడుకోకూడదు. అప్పటికే గుడారాలలో జనం గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. లచ్మ పోరాటంలో వీరమరణం పొందివుండటంతో అతని భార్య 'సతి' కావటం సమంజసమని అందరికీ అనిపించింది. ఈ అభిప్రాయాలు లచ్మిని చేరాయి. లచ్మికి ఎవరో తన హృదయాన్నే తన నుంచి పెరిగి విసరివేసినట్టయ్యింది. దేసు మాట్లాడలేకపోయాడు. చనిపోయిన కొడుకు గురించి దుఃఖం ఒక వైపున వుంటే స్త్రీగా ప్రాణంతో ఉన్న ఒక ఆడపిల్లను బలియివ్వడమనే ఆలోచనతో కలిగిన దుఃఖాన్ని భరించలేక ఏడవసాగింది. "లాడేలా బాపూరె, తారజభాయి అపణారె ఆంగణో సూనో కరగొరె". అక్కడ గుమిగూడిన వారి కళ్లలోంచి కన్నీరు ప్రవహిస్తోంది. గుజాల నిర్లిప్తంగా భర్త శవం పక్కనే కూర్చునివుంది. థావుచిన్నాన్న సైనికులతో పోరాడి చనిపోయినా చిన్నమ్మను ఎందుకు సతి చేయలేదనే ప్రశ్న దేసును వేధించసాగింది. ఇప్పుడు జీవితం పట్ల వందలాది కలలు కంటున్న గుజాల సతిగా తమ్ముని చితి ఎక్కడాన్ని ఎలా చూడటం? హింసగా అనిపించింది. శవాన్ని ఎక్కువసేపు ఉంచడం కుదరదన్నది అందరికీ తెలిసిన విషయమే. గుడారంలోని బంజారాలందరికి తెలిసిన విషయమే. గుడారాలలోని బంజారాలందరూ ఒక చోట సమావేశమయ్యారు. దేసు తనను వేధిస్తున్న ప్రశ్నను అడిగాడు. "మా చిన్నమ్మ కూడా ఇప్పుడు వితంతువు. ఆమె ఎందుకు సతికాలేదు?" అని ప్రశ్నించాడు దేసు. "మీ చిన్నాన్న థావుశవాన్ని ఆ శత్రుసైనికులు తీసుకొని పోయారు. ఆ శవం మనకు దొరికివుంటే అతని శవంతోపాటు మీ చిన్నమ్మ కూడా చితి ఎక్కవలసి వచ్చేది" అని పెద్దవాడైన మోట్ల అన్నాడు. "అది కాదు. ఇప్పుడు నా తమ్ముడు తోత్య పెళ్లి వయసుకి వచ్చాడు. అతనికి ఎందుకు 'గుగరి' వేయించకూడదు?" అని గుజా ప్రాణాల్ని నిలిపే ప్రయత్నం చేశాడు. "తమ్ముడా, నువ్వింకా చిన్నవాడివి. మన సాంప్రదాయం, రీతి రివాజులు నీకు తెలియవు. మీ తమ్ముడు లచ్మ ఒకవేళ ఏదైనా జబ్బు వల్లనో లేదా ఏదైనా జంతువుకో బలయివుంటే నీవు అన్నట్టు చేసి ఉండవచ్చు. అయితే అతను శత్రువులతో పోరాడి వీరస్వర్గం పొందాడు. అందుకే 'సతి ఆచరణ' జరగాల్సిందే" అని నందు బాణోత్ కరాకండిగా పుల్ల విరిచినట్టు చెప్పాడు. గుజాల అతని మనవరాలు. అయినా ముసలివాడు ఆమెకు ప్రాణదానం ఇవ్వడానికి అడ్డుపడ్డాడు. దేసు అందరిని ఎదిరించలేక వివశు

డయ్యాడు. అతని తల్లి లోలోపల రోదించసాగింది. కొడుకు మరణంతో చిన్నమ్మ దుఃఖంతో పడుకునివుంది. కులపెద్దల తీర్మానమే అంతిమ కావటంవల్ల, గుజా సతి కావాల్సి వచ్చింది. అయితే దేసు అంత సులభంగా ఓటమిని ఒప్పుకోవడానికి తయారుగా లేడు. కులపెద్దలకు ఆశ చూపించి తన వైపు న్యాయం చెప్పడానికి ఒత్తిడి పెట్టాడు. నిర్ణీత సమయానికి అన్నీ ముగించవలసి వుంది. ఎందుకంటే లచ్మ చనిపోయి అప్పటికే ఒకటిన్నర రోజు గడిచింది. గుజా తల్లిదండ్రులు, ఆమె సోదరుడు అందరూ ఆమెను రక్షించుకోవడానికి తపించసాగారు. దేసు వ్యతిరేలకు వార్త అందగానే, వందలాది బంజారాలు వాళ్ళ గుడారాన్ని చుట్టుముట్టి ఇక్కడ నివసిస్తున్నా బంజారులందరిని కులం నుంచి బహిష్కరిస్తామని బెదిరించారు. అప్పుడప్పుడే నాయకుడైన దేసును, డావో, కారభారిని పంచాయతీ పిలిపించారు. "కాంయి భా, నాయకజ హైయ్ కరతో క్యాం కరన. ఊ ఆద్మి లడతాణిన షాహిద్ ఓచ. ఓరబోడి ఓరలార. అగ్నిపర బేసన స్వర్గర బాగలతోయి కాడియకాయికో. నిశాణ మాటీర ఆత్మ భటకేన లాగజాయ" (ఏమయ్యా, ఈ గుడారాల నాయకుడైనా నీవే ఇలా చేస్తే ఎలా? ఆ మనిషి పోరాడి వీరమరణం పొందాడు. అతని భార్య అతనితోపాటు చితి ఎక్కకపోతే అతని ఆత్మ ఇక్కడే తిరుగుతూ ఉంటుంది. స్వర్గం దొరకదు) అని సాణుభుక్యా వాదించాడు. అతని మాటలను సమర్థిస్తూ రామావత, ఖోలా, హరావత, మేఘావత, తెగలవారంతా ఒక్క గొంతుకతో సమర్థించారు. దేసు ఓటమిని అంగీకరించి పదమూడేళ్ళ పవిత్రురాలైన గుజాల చితిని ఎక్కడానికి అంగీకరించాడు. అయితే అతని మనసుకు చాలా బాధ కలిగింది. అమాయకురాలైన గుజాల నీటిలా పవిత్రురాలు. అలాంటి ఆమెను చేతులారా మృత్యుహస్తాలకు అప్పగించడం భరించలేనంత బాధను కలిగించింది. చిన్నమ్మ పైకి లేవలేదు. భర్త, కొడుకు, ఇప్పుడు కోడలిని పోగొట్టుకుంటున్న ఆమె, "బాపు మన్నిబి మార బేటార జతాన ఆగనేపర చడాదో బా మ బచూ న" (అయ్యా, నా కొడుకుతోపాటు నాకు నిప్పుపెట్టండి. నేను బ్రతకను) అని బాధగా చెప్పింది. "కాకి, ఇలా మాట్లాడకూడదు. మమ్మల్ని అనాథలుగా చేసి వెళ్లాలని అనుకొన్నారా? నేను ఏనాడైనా మీకు, అమ్మకు మధ్య తేడా చూపించానా? మనిషి జన్మ ఒకే ఒకసారి దొరుకుతుంది" అని అనుభవం లేకపోయినా ఓదార్చాడు. లచ్మి నిర్లిప్తంగా వుండిపోయింది. భర్తను పోగొట్టుకొని ఇరవై సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ రోజు నుంచి మనసులో చెలరేగే భావాలను చంపుకుని బతికింది. ఆమె ఏమీ మాట్లాడలేదు. గుజాలనే చూస్తూ కన్నీరు కార్చసాగింది. గుజాలకు దుఃఖమూ కలగటం లేదు. చనిపోతున్నాననే భయమూ

కలగటం లేదు. భర్త శవంతోపాటు సజీవంగా చితిని ఎక్కటానికి ధైర్యాన్ని తెచ్చుకుంటోంది. అతని తల్లి భరించలేక "ఘోలెడియా, ఆ హింయా, తారనసీబెమ, కాంయిలకగీయె ఆ హింయా, యాడి తోన, నానకి ఉమరేమ మేలదింవూ కరన కళౌకోనియాడి" (బిడ్డా, నీ నుదుటి రాతలో ఏమి రాసి ఉందో తెలియదు. సగం వయసులోనే పోగొట్టుకుంటామని తెలియలేదు) అని బోరున ఏడ్చింది. ఏ ఒక్కరు దానివల్ల విచలితులు కాలేదు. ఆమెను భర్త శవంతోపాటు చివరి స్నానం చేయించి, పద్రేరఫేటియా, కాంచళి ఛాంటీయ (వధువు ఇవ్వవలసిన ధారచీర, రవిక, తల మీద వేసుకునే మేలిముసుగు) దుస్తులు తొడిగించి, పెళ్లికూతురిలా అలంకరించి, పూలమాలవేసి ఒకే చితిలో ఇద్దరికి నిప్పు పెట్టే ఏర్పాటు చేయడం జరిగింది

సతిని చూడటానికి ఈగల్లా చుట్టుపక్కల నుంచి వ్యాపారానికి వచ్చిన బంజారాలు ఆమె అంతిమ దర్శనానికి ఆగమించారు. ఢాలియా తప్పెట తీసుకొని జజ్జనకర జజ్జనకర అని వాయిస్తున్నాడు. లచ్మ శవాన్ని జనం ఘడియ ఘడియకు భుజాలు మార్చి మోసుకుని పోతున్నారు. చావును ఎదిరించే ధైర్యం గుజాలకు కలగాలని జనం జయజయధ్వనులు చేస్తూ ఉత్సాహం నింపసాగారు. జన సమూహం మధ్య గుజాల అంతిమయాత్ర సాగింది. సజీవంగా నిప్పుల్లోకి దూకి ప్రాణం వదలటాన్ని తలుచుకుంటే ఆమె హృదయం ఆర్ద్రమవుతోంది. ఆమె తీవ్రమైన దుఃఖంతో, ఆలోచించి ఆలోచించి మూర్ఛపోయింది. చితిమీద లచ్మ శవాన్ని పడుకోబెట్టి పూజావిధి విధానాలను ఆచరించిన తర్వాత, అతని అన్న దేసు, తమ్ముడు తోత్య తలకొరివి పెట్టారు. ఎండిన కట్టె పుల్లలు నిప్పుల ఎర్రటి నాలుకను చాపినపుడు మూర్ఛపోయిన గుజాలను నడిపిస్తూ, సంతోషంతోనే చితిని ఎక్కుతోదన్నట్టు భుక్యా తెగవారు అవలీలగా ఎత్తి నిప్పుల్లోకి తోశారు. చితిమంటల వేడికి తాళలేక ఒక్కసారిగా "యాడి ఎ బా " (అమ్మా!నాన్నా!) అంటూ ఆకాశాన్ని తాకేలా ఛీత్కారాల నడుమ దహించుకునిపోయి 'మహాసతి' అయింది.

మంచులా జనం కరిగిపోయారు. ఆ రోజు నుంచి మూడు రోజులకు 'దాడో' (మూడు రోజుల శాస్త్రం) చేస్తున్నట్టు కారభారి చాటాడు. మట్టికి వచ్చిన వారంతా 'దాడో' రోజున రావాల్సిందే. వచ్చిన జనమంతా రేగుపళ్ల చెట్టును వెతకటానికి బయలుదేరారు. అడవిలో కావాల్సినన్ని చెట్లు కనిపించటంతో ఒక పెద్ద కొమ్మను నరికి తీసుకుని వచ్చారు. జనం ఒక్కో ఆకును తుంచుకొని, పళ్ళతో కొరికి, ఉమ్మి, చెరువులో కాళ్లుచేతులు కడుక్కునేవారు కాళ్లుచేతులు కడుక్కున్నారు. స్నానం చేయాలనుకునేవారు బట్టలన్నీ నీళ్లలో తడిపి, రాత్రయినా లెక్కపెట్టకుండా స్నానం

చేసుకుని తమ గుడారాల వైపు నడిచారు. దూరంలోని గుడారాలవారు ఇంటి ముందు 'హాతెపర పాణీలేన' (చేతులపై నీళ్లు) వేయించుకుని రెండుమూడు రోజుల నుంచి ఇంట్లో పోయ్యి మండని కారణంగా పక్కనున్న గుడారం వాళ్లు తెచ్చిచ్చిన రొట్టె, చట్నినే ఒక్కొక్క ముక్క తిని బయలుదేరారు. ఇప్పుడు అంతటా నిశ్శబ్దం కమ్ముకుంది.

చాలా సేపటి వరకూ దేసు తన తల్లి, చిన్నమ్మల పక్కనే కూర్చుని వాళ్లను ఓదార్చుతున్నాడు. వాళ్లల్లో ధైర్యం నింపుతున్నాడు. బాగా కలిగిన ఉమ్మడి కుటుంబంలో సుఖంగా పెరిగిన అక్కాచెల్లెళ్లిద్దరూ ఇలాంటి రోజు వస్తుందని కలలోనూ, మనసులోనూ అనుకోలేదు. ఎందుకో లచ్మికి తండ్రి, చిన్నాన్నలు గుర్తుకువచ్చారు. జంగి-భంగి నాయక్‌ల ముద్దుల కూతురు లచ్మి వాళ్లింటికి మహాలక్ష్మి అయింది. ఆమె పుట్టినరోజే ఢిల్లీ నుంచి భగన్యానాయక్‌కు పిలుపు వచ్చింది. పెద్ద వ్యాపార ఒప్పందం జరిగింది. వేలాది వరహాలను బయానాగా ఢిల్లీ బాదుషా ఔరంగజేబు ఇచ్చి గౌరవించాడు. ఆ సంతోషాన్ని భగననాయక్ మొత్తం బంజారగఢలోనే సంబరంగా ఆచరించాడు. అలాగే ఆసిఫ్‌ఖాన్ వెనుక లక్ష ఎద్దులతో బయలుదేరాడు.

లచ్మి ఆలోచనలో పడింది. తాను ఎలా పెరిగిందో, ఎలా పులిని వేటాడి, దాన్ని ప్రాణాలతో కట్టి మోసుకొచ్చిన మీటు భుక్యా కరమ్‌తోట్‌తో వివాహం జరిగిందో గుర్తు చేసుకుంది. సంవత్సరానికి భర్తలాంటి బలశాలియైన కుమారుడు దేసు పుట్టాడు. తర్వాత ఆసిఫ్‌ఖాన్ హైదరాబాద్‌కి తరలిపోయినపుడు వాళ్ల దురదృష్టకరమైన రోజులు మొదలయ్యాయి. భర్త బతికేవున్నాడో లేదా చచ్చిపోయాడో కూడా తెలియకుండానే భర్త జ్ఞాపకాలలోనే యాభైయవ గడిని దాటింది. ఇప్పుడు తమ్ముడిలా తన ముందు తిరుగుతున్న థావు మరణం పిడుగుపాటులా వచ్చిపడింది. అతని వెనకే కుమారుడు లచ్మమరణం, కోడలు గుజాల సతికావడం. ఈ సంఘటనలవల్ల ఆమె తల చిట్లిపోతున్నట్టు అనుభవం కాసాగింది. దేసు ఆమె మనసును తేలికపరిచే ప్రయత్నం చేయసాగాడు. అనివార్యంగా తల్లిని నిద్ర పొమ్మంటూ, "యా దస్సేక సింది పీలెన సోజో నితో మాతేర నస్సేసె ఫూట్ జాయ" (అమ్మా, కాస్త సారా తాగి నిద్రపో. లేకపోతే తలలోని నరాలు చిట్లిపోతాయి) అని కుండలోని సారాయిని పోసి ఇద్దరికీ బలవంతం చేసి తాగించి పడుకోబెట్టాడు.

తెల్లవారేసరికి దుఃఖం కాస్త తగ్గింది. ఈ జీవితం తూర్పున పుట్టి, పశ్చిమాన మునిగే సూర్యుడిలా ఎన్ని రోజులు బ్రతకాలని రాసిపెట్టివుందో అన్ని రోజుల వరకూ బతికి చివరికి ఒక రోజున భూమాత గర్భాన్ని చేరాలి. దేసు సూర్యుణ్ణి

తదేకంగా చూడసాగాడు. దేసును ఒక ప్రశ్న వేధిస్తోంది. శవ సంస్కారానికి వెళ్లిన వారంతా తిరిగి వచ్చేటప్పుడు రేగుపళ్ల చెట్టు ఆకును ఎందుకు ముట్టి పళ్లతో కొరికారు? అడిగితే ఎవరైనా ఏమైనా అనుకుంటారని ఆ రాత్రి గడిపాడు. మరుసటి రోజు పక్కనున్న గుడారంలో కూర్చున్న కేమ్యాభగత్‌ను అడిగాడు. "మోటాపు, మట్టిన జాన్ మర్దాన బాళదేన హెూటో ఆయేజన్న బోరేరో పాలో ఖసేనఛిపె" (పెదనాన్న శవసంస్కారం చేసి వచ్చేటప్పుడు రేగు చెట్టు ఆకులను ఎందుకు ముట్టారు) అని అడిగాడు. "ఓ అదా, రా కూర్చో చెప్తాను" అని పక్కనున్న ఈత చాపను పరిచాడు. దేసు కూర్చున్నాడు. "నాయనా, మన జనం ఇలా సమయం కాని సమయంలో, దూరదేశాల నుంచి వలస వచ్చిన పక్షుల్లా ఊరు నుంచి ఊరికి సంచరించేవారు. అడవి అనకుండా, ఊరు అనకుండా తిరుగుతూ వ్యాపారం చేసి బతికినవారు. ఈ దట్టమైన కారడవిలో తిరిగేటప్పుడు సహజంగానే క్రూరజంతువుల భయం ఉండనే ఉంటుంది. అయితే మనవారికి వాటికన్నా ఎక్కువగా కంటికి కనిపించని ఆత్మపై ఎంతో నమ్మకం. అందుకే శవసంస్కారం చేసి తిరిగి వస్తున్నప్పుడు రేగుచెట్టు ఆకును తాకితే ఆత్మలు తమ వెంట రావని నమ్ముతారు. ఈ పద్ధతి ఎప్పటినుంచి కొనసాగుతూ వచ్చింది" అని వివరంగా చెప్పాడు. "ఓ అలాగా, విషయం తెలిసింది. రేపు తెల్లవారేసరికి దినకర్మలు చేయాలి. వస్తాను" అని బయలుదేరాడు. ఇలాంటి అనేక ప్రశ్నలకు అతని దగ్గర సమాధానాలు లేవు. జీవితానుభవాలు పెరుగుతున్నకొద్దీ అన్నీ తెలుస్తాయని తనకు తానే సంతృప్తి చెందాడు.

గుజాసత్తి మహిమ అన్నట్టు వందలాదిమంది దినకర్మకు చేరుకున్నారు. తన ఇంటి గౌరవానికి లోపం రాకూడదని మొదటిరోజు నుంచే ఒక పల్లం గోధుమలు విసరమని చెప్పాడు. ఐదారు మణుగుల బెల్లం తెప్పించాడు. పదిమంది యువకులు చుర్మోచూరలు(గోధుమ రొట్టె కాల్చి బెల్లం కలిపి చేసిన ఉండలు) గుడారాల నుంచి కొద్ది దూరంలో గాడిపొయ్యిలు సిద్ధంచేసి ఉదయం నుంచే వంట తయారీలో పడ్డారు. వచ్చిన బంధువుల విందుకు సాకిన పోట్టేలును కోయటం జరిగింది. ఊరికొక నాయకుడు గవ్వలకాసులు ఇచ్చి భాగం రాయించారు, పొద్దు వాలుతుండగానే థాలియా డప్పు వాయించి "చూర్మో తినడానికి అందరూ రావాలంటప్పా" అని చాటాడు.

మనుషుల గుంపు కొద్ది దూరంలోనే గోధుమచుర్మో చేస్తున్న స్థలానికి బయలుదేరారు. అక్కడక్కడే చోటు చేసుకుని కూర్చున్న తర్వాత రామేర్‌ఘరోర్ ఖబర్ (దేవలోకపు వార్త) తీసుకురావడానికి వెళ్ళాడు. గుజాసతి అన్న ధామణి, పక్కనున్న

డేరా లోని ఒళతోత్యా, దూరం నుంచి వచ్చిన ఖధవణోలాల్య (కుంటి)లచ్మ, అతని భార్య మహాసతి గుజాలను చితికెక్కించిన స్థలం నుంచి బూడిద తెచ్చి నేలను, చిమ్మి, పేడతో అలికి, సమతట్టం చేసి, పాలు నీళ్లు పెట్టి వచ్చింది. ఒక్కొక్కరే వచ్చి హుక్కా పీల్చి తిరిగివెళ్లి చూస్తే ఎలాంటి గుర్తులు కనిపించలేదు. పాలు నీళ్లు విరిగి పోలేదు. 'కత్త ఆయేన జా, భగవానేర ఘరేన పూచగ" (ఎక్కడి నుంచో వచ్చారు. భగవంతుని ఇల్లు చేరుకున్నారు) అన్నాడు ఒళతోత్యా. ఇదే విషయాన్ని చుట్టూ చేరిన జనం ముందు పునరుచ్చరించి తాము చూసింది వివరించారు. "అలాగైతే మా తల్లి 'గుజాసత్తి' అయ్యింది. ఇకపై కరమ్‌తోట్ వంశానికి 'ఆదిదేవి'గా కరమ్‌తోట్ వంశాన్ని అభివృద్ధి చేస్తుంది మా తల్లి" అని సభలో కూర్చున్న పాగా చుట్టిన మీసాల ముసలివాడు భవిష్యత్తు చెప్పాడు. అందరూ "వచ్చింది వచ్చింది" అన్న తర్వాత పక్కనున్న గుడారపు బదియా నాయక్ పైకి లేచి "కోయితోయిసీక్‌దోని పచ" (ఎవరైనా దుఃఖితులకు ఓదార్పుగా నాలుగు మాటలు చెప్పండి) అని అన్ని దిక్కుల వైపు మెడతిప్పి చూశాడు. "నువ్వే చెప్పు బదియా నాయక్. ఎంతైనా నువ్వు నాయకుడివి" అని సభికులు అన్నారు. "అలాకాదు ఊర్ల నుంచి పండితులు, తెలివైనవాళ్లు వచ్చారు. వారి పద్ధతులను మనం తెలుసుకోవాలి. అన్నట్టు మన సోమ్లుజ చెబుతాడు. అనుభవజ్ఞుడు. నాలుగు వైపులా తిరిగినవాడు. మన బంజారా సమాజంలో గొప్పపేరు ఉన్నవాడు" అనగానే అతని మీద బాధ్యత మోపి కూర్చున్నాడు బదియా నాయక్. ముసలివాడు తయారుగా ఉన్నట్టు కనిపిస్తున్నాడు. "ఊఁ వినండి, ఇక్కడ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన బంజారాలు ఉన్నారు. ఈరోజు దుఃఖంలో ఉన్న మన దేసుభుక్యా కరమ్‌తోట్ మనకు పరాయివాడు కాదు. మనవాడే. మన కులస్థుడే. అతని ఇంట్లో మరణం సంభవించింది. అందువల్ల అతని కుటుంబమంతా దుఃఖంలో ఉంది. దేసు, తోత్యా, మహాతల్లి గుజాసత్తి తండ్రి పీరునాయక్, తమ్ముడు ధామణి, వినండప్పా, ఈరోజు ఎవరు భూమి మీద శాశ్వతం కాదు. వాళ్ల రుణం తీరింది. ముందుగానే వెళ్లిపోయారు. మనం కాస్త నిదానంగా వెళతాం. అంతే. వాళ్లు భూమి రుణం తీర్చుకొని దేవుడి పాదాలను చేరుకున్నారు. ఈ భూమ్మీద వాళ్ల రుణానుబంధం ఇంతే ఉంది. తమ్ముడు దేసు, నీ చిన్నమ్మ భర్తను, కొడుకును, కోడల్ని పోగొట్టుకుంది. ఇప్పుడు ఒక తమ్ముడు ఉన్నాడు. ఒక చెల్లెలు ఉంది. ఇంతకు ముందు మీ చిన్నాన్న ఉండేవాడు. ఎలాగో కాలం గడిచిపోయింది. ఇప్పుడు బాధ్యతంతా నీ భుజాల మీద పడింది. లచ్మ తల్లి ఇప్పుడు నీ తల్లి. వాళ్లనంతా చాలా జాగ్రత్తగా నువ్వే చూసుకోవాలి. బంధువులు

పిల్లలను పోగొట్టుకున్నారు. వాళ్లతో సంబంధం పోగొట్టుకోకూడదు. ఇదంతా ఇక్కడ చేరిన సభికుల తరఫున చెబుతున్నాను. చెప్పినట్లు పాటిస్తావని అనుకుంటూ మాటలు ముగిస్తున్నాను" అని కూర్చున్నాడు. "ఊఁ అందరికీ చుర్మో పంచండి" అని పెద్దవాడైన శక్ర్యనాయక్ ఉత్తర్వులు ఇచ్చాడు. దానికోసమే ఎదురు చూస్తున్నా వయసు కుర్రవాళ్ల గుంపు అక్కడంతా తిరుగుతూ చుర్మో పంచారు. అందరూ తిన్న తర్వాత అక్కడే ప్రవహిస్తున్న ఏటి నీటిలో కాళ్లుచేతులు కడుక్కుని, సాయంత్రానికి ముందే 'లోజి' చేయడానికి సిద్ధమయ్యారు. (లోజి అంటే కుండ సారాయి, కాల్చిన మాంసపు ముక్కలను చనిపోయిన వాళ్ల ఇంటివాళ్లకి ఇవ్వటం) దేసు, తోత్యాలు ముంగిట్లో కూర్చున్నారు. ఒక ముక్క కాల్చిన కలేజా, కానాబాజ్ (కాల్చిన చెవులు) వారి చేతికిచ్చి ముంత సారాయిని ఇచ్చి ఓదార్చి భోజనానికి బయలుదేరారు. దూరం నుంచి వచ్చిన నాయకులను కూర్చోబెట్టి గొర్రెమాంసం మూలగలు ఇచ్చి వారికి మర్యాద చేయడం జరిగింది. జనం మాంసపు భోజనం చేసి రాత్రి ఉండకూడదని చెప్పి చీకటి పడుతుండగానే గుర్రమెక్కి కొందరు, కాలినడకన కొందరు, ఎడ్లబండి మీద కొందరు బయలుదేరారు. అదే డేరావాళ్లు ఒకచోటచేరి వారి కులానికి సంబంధించిన భజన చేయడానికి కంచు పళ్లాలను, నగారా, జేగంటలు తెచ్చి చనిపోయినవారి డేరా ముందు జాగరణ చేయడానికి సిద్ధమయ్యారు. గుడారం ఒక మూలలో లచ్మకు ఇష్టమైన వంట చేసి నీళ్లచెంబుతోపాటు బుట్టకింద పెట్టడం జరిగింది. అలాగే గుజాలకు ఇష్టమైన పదార్థాలనుకూడా చేసి బుట్టకింద మూసిపెట్టారు. చనిపోయినవారి ఆత్మలు వచ్చి వాటిని తాకితే ప్రేతాలు అవుతాయని, ముట్టకపోతే దేవుడు వాళ్లను తన దగ్గరికి పిలుచుకున్నాడని బంజారాల నమ్మకం. ఈ విషయాన్ని లచ్మి తన కొడుకు దేసుకు చెప్పింది.

"హేంకె మారుచు యాడి గుజా తోన అజో అజో నియ
బేటేర హరదేమ సూతేరర సపనేమ దేఖ గుజ హేడాగిద్దళు

(కేకలుపెట్టి పిలిచే తల్లిగుజా నీవు రామ్మా, రా, కూర్చున్నవాడి జ్ఞాపకాల్లో, పడుకున్నవాడి కలలో రావాలి)

చుట్టుపక్కల ఉన్న ప్రజలకు గుజాల 'గుజాసత్తి'గా ఆరాధ్య దైవమైంది.

ఆకు, వక్కలు, పొగాకు, మధ్య మధ్యన హుక్కా, నీళ్లు సరఫరా అవుతూనే ఉన్నాయి. జనం మాత్రం సారా తాగుతూ, పాటలు పాడుతూ జాగరణ చేస్తున్నారు.

ఉదయం వాళ్ల మామూలు వాళ్లకు ఇచ్చి పంపాడు దేసు.

ఎప్పుడూ భుజానికి భుజం ఇచ్చి తన ఎన్నో సమస్యలకు పరిష్కారం

చూపుతున్న లచ్మను పోగొట్టుకొని దేసు ఒంటరితనం అనుభవించసాగాడు. తోత్యా ఇంకా చిన్నవాడు. అయినా పరిస్థితులకు అర్థం చేసుకున్నాడు. అతడికి దేసు మనసు తేలిక పరచడం అవసరం అనిపించింది.

"అన్నా, నేను చిన్నవాడిని. అయినా నీ మనసులోని బాధను అర్థం చేసుకోగలను. ఇప్పుడు మా అందరికీ నువ్వే దిక్కు. మాకు మాత్రమే కాదు. మన వంశం అభివృద్ధి చెందాలంటే నువ్వు గతాన్నంతా మరిచిపోవాలి. నేను నీ వెంబడి సదా ఉంటాను" అని భరోసా ఇస్తున్నట్టు మాట్లాడాడు.

చిన్నవయసులోనే సంసారపు బాధ్యతను మోసుకుని, చుట్టూ కేవలం శత్రువులే నిండి ఉన్నప్పుడు నెగ్గుకురావడం చాలా కష్టం. అయితే శత్రువులను దేసు మాటల్లోనే ఓడించేవాడు. ఈ కష్టాలన్నిటి మధ్య గుజాసత్తి అతనికి వరం ఇచ్చింది. సోమ్లీకి మూడు నెలల గర్భిణి కోరికలు ప్రారంభమయ్యాయి. ఈ విషయం ముందుగా లచ్మికి తెలియగానే "నా తల్లీ, గుజాసత్తి ఇప్పటికైనా కళ్లు తెరిచావు. మా వంశం మొలకను నా కోడలు కడుపులో వేశావు. నీవు గొప్ప దయామయివి" అని అంటూ సంతోషంతో ఆమె తన లోపలి దుఃఖాన్ని మరిచింది. ఆమెతోపాటు మంచం పట్టిన ఆమె చెల్లెలుకూడా లేచి సంబరంగా తిరగసాగింది. చాలా సంవత్సరాల నుంచి దేసుకు పిల్లలు కాకపోవడం వల్ల ఆ కుటుంబం చాలా విచారంలో ఉంది. ఇప్పుడు రూప్లి చింత దూరమైంది. ఇన్నేళ్లు కూతురు గొడ్రాలుగా పిలవబడుతుందా అని బాధపడుతూ ఉండేది. మరో ఆరునెలలవరకూ సోమ్లి కడుపులో పెరుగుతున్న బిడ్డ పెరుగుదలను వర్ణిస్తూ కాలం గడపాలి. "నువ్వు ఏమైనా చెప్పు రూప్లి. నా కోడలి ముఖలక్షణాలు చూస్తే మగపిల్లవాడే పుడతాడని అనిపిస్తుంది. మన కరమ్‌తోట్ వంశోద్ధారకుడు వస్తున్నాడు. వాడు అచ్చం వాడి తాతలా శూరుడు, వీరుడు అవుతాడు" అంటూ మొదటిసారి భర్తను అందరి ముందు లచ్మి పొగిడింది. "వదినా, ఒక్కబిడ్డే చాలా? ముందుగా సౌందర్యవతియైన లక్ష్మీదేవి పుట్టాలి. తర్వాత గొప్పవీరుడైన కొడుకు పుట్టాలని నా కోరిక" అని తన అభిప్రాయం వ్యక్తపరిచింది. ఆమె చెల్లెలు మధ్యలో తలదూర్చి "లేదు ముందుగా వంశం అభివృద్ధి చేసేవాడు పుట్టాలి, ఊరుకో అక్కా" అంది. వీళ్ళ జగడాన్ని బయటి నుంచి వస్తూ విన్న దేసు "ఎవరికి వంశోద్ధారకుడు? ఈ రోజు అమ్మ, చిన్నమ్మలు ఇంత సంతోషంగా కనిపిస్తున్నారు. ఏదైనా వింత జరిగిందా?" అని వాళ్ల ముఖం చూశాడు. లచ్మి అతని చెవి పిండి "చేయకూడనిదంత చేసి ఏమీ తెలియనివాడిలా నాటకం ఆడుతున్నావా?" అని చిరుకోపంగా అంది. తల్లి పొడుపు కథలాంటి మాటలు అర్థం కాకపోవడంతో

చిన్నమ్మ దగ్గరికి వెళ్లి ఆమె ఒడిలో పసిపిల్లవాడిలా పడుకొని "చూడు చిన్నమ్మ, అమ్మ ఏదో ఒకమాట చెప్పి నన్ను వెక్కిరిస్తుంది" అన్నాడు. ఆమె విషయం చెబుతుందని అతని భావన. లచ్మి సైగచేసి ఆమెను చెప్పకుండా చేసింది. "ఏమిటో నాయనా, నీ..." అని నోటికి వచ్చిన మాటను మింగేసింది. "అత్తా, నీవైనా చెప్పకూడదా?" అని ఆమె వైపు చూశాడు. "వదినా, తమాషాలు చాలు. పిల్లవాడికి కుతూహలం. పాపం, చెప్పేయండి" అని అంది."అది ఏ విషయమైనా, నేను పుట్టి ఇంత పెద్దవాడైనప్పటికీ మీరు ముగ్గురు ఇంత సంతోషంగా ఉండటం చూడలేదు. ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. తల్లీ గుజాసత్తి! ఈ కుటుంబాన్ని ఇలాగే ఉండేలా చేయమ్మా" అన్నాడు. అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. "అరే మెరేలాడ్, ఇది ఏడ్చే సందర్భం కాదు. నువ్వు తండ్రివి కాబోతున్నావు" అంటూ అతన్ని గట్టిగా కౌగిలించుకుంది లచ్మి. ఒక్క క్షణం నివ్వెరపోయి, అంతలో ఏదో అర్థమైనట్టు, "దేవుడా! మమ్మల్ని కరుణించావా" అని సంతోషంతో ఒక్కసారిగా తల్లిని పైకెత్తి కిందికి దించాడు."అమ్మా, చిన్నమ్మా, అత్తా, సోమ్లి ఎక్కడుంది?" అని భార్య కోసం గదిలోకి పరుగెత్తాడు. వెనుక నుంచి "జాగ్రత్త" అని లచ్మి అరిచింది.

నెలలు దొర్లడమే అర్థం కాలేదు. తొమ్మిది నెలలు నిండగానేగానే నొప్పులు ప్రారంభమయ్యాయి. దేసు గుజాసత్తికి జోడుకాయలు కొట్టాడు. తన ఇంటి దేవుళ్లందరికి ముడుపులు కట్టాడు. మగవాళ్లంతా గుడారం ముందు గుమిగూడారు. అయితే దేసుభుక్యా కరమ్‌తోట్ మాత్రం కూర్చున్నచోట కూర్చోలేక నిలబడ్డ చోట నిలువలేక కాలుగాలిన పిల్లలా తిరగసాగాడు. అనేక సందర్భాల్లో బిడ్డకు జన్మనివ్వగానే తల్లి చనిపోయే అవకాశాలు ఉన్నాయి. అందుకే గుడారంలోని అన్ని రకాల నైపుణ్యాలు కలిగిన మంత్రసానులను పిలిపించాడు. "నాయనా, ఎందుకు ఇంత కలవరపడుతున్నావు? నీ భార్య చాలా బలమైన బిడ్డకు జన్మనిస్తుంది. ఎందుకు గాభరా పడుతున్నావు?" అని పెద్దవాడైనా సోమ్లాడొకర దేసు భుక్యాకు ధైర్యం చెప్పడానికి ప్రయత్నించాడు. అయితే అతని అసహనం పెరుగుతూ పోయిందే తప్ప తగ్గలేదు. లోపల సోమ్లి పురిటి నొప్పులతో కేకలు పెడుతోంది. 'యా మరగీయె' (అమ్మ చచ్చాను) అని అరుస్తోంది. ఆమె తల్లి రూప్లి, "పిచ్చిదానా, అలా అనకూడదు. బాధను దిగమింగి ఒక్కసారి బలంగా ఊపిరి తీసుకో" అని ఓదార్చడానికి ప్రయత్నిస్తోంది. ప్రతి ఒక్కరి ముఖంలోనూ కలవరం తొంగిచూస్తోంది. తోత్యా నాయక్, గోమ్లి అన్న వెనక వెనకనే తిరుగుతూ అతన్ని ఓదార్చడానికి తపిస్తున్నారు. "అన్నా, లోపల పెద్దమ్మ, నానమ్మ, అత్త అందరూ ఉన్నారు. ఎందుకింత కంగారు పడుతున్నావ్?

ఊరుకో వదినకు ఏమీ కాదు” అని తోత్య నోటినుంచి మాట వస్తుండగానే బిడ్డ ఏడుపు వినిపించింది. లోపలి నుంచి అతని అత్త ‘చోరా’ (మగబిడ్డ) అనగానే కంచు పళ్లాన్ని కొట్టి మోగిస్తూ తోత్యా, కాణు, హనమి, చోక్ల, బాణు గుడారం చుట్టూ తిరిగి బహిరంగంగా ప్రకటించసాగారు. దేసు సంతృప్తిగా ఒక మూలలో కూర్చున్నాడు. అక్కడికి వచ్చిన యజమానుల దండు “చేసేది చేసి ఎలా మూగమొద్దులా కూర్చున్నాడో చూడండి” అని ఒకడు తమాషా చేశాడు. “ఒరేయ్ తమ్ముడూ, తండ్రి అయిన సంతోషం. సారాయి తెప్పించు” అన్నాడు. “అంతే చాలా?” అన్నాడు దేసు. జనం కంగారుపడ్డారు. తీపి పంచుతున్న తోత్యాను పిలిచాడు. “వెళ్లి ఒక కేసు తీసుకొనిరా. తృప్తిగా తాగండి. సాయంత్రం ఆ కురువ కెంచకు చెప్పి ఒక మంచి పొట్టేలును తెచ్చి, దాన్ని కోయించి చారు, మాంసం చేయించు” అన్నాడు. కుర్రవాళ్లు అరక్షణంలో పెద్దలకు ఇవ్వడానికి సారాయి తెచ్చారు. కెంచ గొర్రెల మంద దగ్గరికి వెళ్లి పొట్టేలు తెచ్చారు. దాన్ని కోసి చారు, మాంసం వండించారు. గుడారం అంతటా పండుగ వాతావరణం ఏర్పడింది. ఆడ, మగ అంతా తాగి, తిని దేసు భుక్యా ఉదారత గురించి మాట్లాడుకుంటూ బయలుదేరారు.

కొడుకు పుట్టిన సంతోషంతో దేసు వ్యాపారాన్ని మరింత విస్తరించాడు. గుజాసత్తికి ‘ఒళంగ’ (ప్రార్థన) చేయించాడు. కాయ కొట్టించి, అగరవత్తులు వెలిగించి, ఆమె మొక్కు తీర్చాడు. దేసు ఏమి చేయాలనుకున్నా గుజాసత్తి పేరు తలుచుకునే చేసేవాడు. రూప్లి, లచ్మి, ఆమె పిల్లలైన తోత్య, గోమ్లి అత్యంత సంతోషంతో వున్నారు. ఇప్పుడు దేసు ఒక్కడే ఆ కుటుంబాన్ని సాకే అర్హత ఉన్న యజమాని అయ్యాడు. పద్దెనిమిదేళ్లకే మొత్తం వ్యాపారం, ఇల్లు, సంసారపు బాధ్యతలు అతని భుజాలమీద పడ్డాయి. చిన్నాన్న థావు, అతని కుమారుడు లచ్మ చనిపోయిన తర్వాత ఒంటరి అయ్యాడు. అయినా గుండెధైర్యం ఉన్నవాడు తొందరలోనే కోలుకున్నాడు. లచ్మి మనవడు సోమవారం పుట్టినందుకు సోమ్లు భుక్యా కరమ్‌తోట్ అని పెడదామని చెప్పింది. అదే పేరును నామకరణం రోజున పెట్టాలని అందరూ నిర్ణయించుకున్నారు. హోలీ ఆచరణ సమీపంలో ఉండటం వల్ల ‘ఘూండ్’ (వెతకడం) కార్యక్రమాన్ని నిర్వహించానికి దేసు పూనుకున్నాడు. “అదిసరే, ముందు ‘ఘూండ్’కు తయారుకండి” అని దేసు చెప్పాడు. యువకుల గుంపు హోలి పండుగలో మాత్రమే ప్రత్యేకంగా వాళ్లు వేసే కోలాటం ‘లేంగి’ని నెల ముందు నుంచే ఆరంభించారు. ఆడవాళ్లు, యువతులు అప్పుడప్పుడు నృత్యం చేయడానికి వచ్చేవారు. దీనివల్ల మగవాళ్ల ‘లేంగి’ నృత్యానికి మరింత రంగు, ఉత్సాహం వచ్చేది. యువకులను

వదిన వరుసవాళ్లు కావాలనే వేధించడం వాడుక. పీత్లు నాయక్ భార్య సోన్కి ఆమె మరిది బద్యా నాయక్‌ను కళ్లతోనే తినివేసేలా చూసేది. నృత్యం చేసేవాళ్లు ఒకవైపు ఉంటే, ఆమె దృష్టి ఇంకో వైపు ఉండేది. "ఎందుకు సోన్కి, ఇలా ఎందుకు?" అని వృద్ధురాలు సావిబాయి అడిగింది. దాంతో జనానికి అనుమానం వస్తుందని అర్థమై సోన్కి కాస్త జాగ్రత్తపడింది. అయితే అతన్ని వదలకూడదని గట్టిగా అనుకుంది.

మరుసటి రోజు ఉదయమ్లే హెూలీ ధూండ్ ఉండటం వల్ల దేసు, సోమ్లి, కుటుంబ సభ్యులు అందరూ గుడారాన్ని చక్కగా అలంకరించి, గుడారం ముందు ఒక పందిరి వేశారు. వచ్చిన జనం కూర్చోడానికి ఏర్పాటు చేశారు. హెూలీ ధూండ్‌లో భాగం వహించేవారి ఖర్చు, వాళ్లు తెచ్చే గొర్రె ఖర్చును దేసునే భరించాలి. అతను ఆ బాధ్యతను నెరవేర్చాడు. "చూడండి, ఆచరణలో ఏమీ తక్కువకూడదు. నా కొడుకు సోమ్లు 'ధూండ్' జనం మనస్సులో నిలిచిపోయేలా ఉండాలి. ధూమ్ ధామ్ చేయండి. ఖర్చు ఎంతైనా నేను భరిస్తాను. తాగేవాళ్లు తాగండి, తినేవాళ్లు తినండి. అయితే గుడారం లోని వారందరూ కలిసి చేయండి" అని దేసు సంతోషంతో అన్నాడు. "నీ కొడుకు విషయలో తక్కువ చేస్తామా? నీవు ఎలాంటి మనిషివో మాకు తెలుసు. నువ్వేమి విచారించకు. మా మీద భారం వేసి నిశ్చింతగా ఉండు. మా తల్లి గుజాసత్తికి పూలు, పళ్ళు పెట్టండి" అని తాగిన మత్తులో తిందగ అన్నాడు.

రాత్రంతా మంటలు వేసుకొని 'లేంగి' వేసేవారు, నృత్యం చేసేవారు చేస్తూనే ఉన్నారు. ఎవరికైతే సారాయి మత్తు దిగిందో వాళ్లు, "అయ్యో ఎంత చలిగా వుంది" అని అంటూ మళ్లీ ఒక ముంత సారాయి తాగి 'లేంగి'లో చేరుకుంటున్నారు. పీత్లు భార్య సోన్లీ, బద్యాలు ఇద్దరూ జనం కళ్లు తప్పించి ఎప్పుడు అడవి చేరుకున్నారో మొత్తానికి తప్పించుకున్నారు. హెూలి కామదహనానికి జనం కట్టెలు దొంగిలించాల్సినంతగా దొంగిలించారు. మిగిలింది అడవి నుంచి తీసుకురావడానికి వెళ్లినప్పుడు, వీళ్లిద్దరి గుసగుసలు విని దెయ్యాలేమోనని భయపడ్డారు. "ఏయ్, ఎవరిది?" అని ఒకడు అడిగాడు. ఎవరో వచ్చినట్టు ఉన్నారు. ఇక తన మర్యాద పోవటం కచ్చితం అనుకుని బద్యా ఆమెను చెట్టు తొర్రలో దాచి, బయటకు వచ్చి "మీముందే కట్టెలు ఏరడానికి వచ్చానుకదా, మీరు చూడలేదా?" అని అన్నాడు. నిజం తెలిసినప్పటికీ, హెూలీ పండగ ముందు గొడవ చేయకూడదని, తమ మర్యాదను తామే పోగొట్టుకోవడం సరికాదని "పదరా, దరిద్రుడా, ఏమి చేస్తున్నావో..." అని గొణుగుతూ ఆ స్థలం నుంచి కదిలారు. అతన్ని తమ వెంటే తీసుకునిపోయారు. ఎందుకంటే ఈ పనికిమాలిన కృత్యం గుడారంలోని మనుషలకు తెలిస్తే ఇద్దరిని

నరికి ముక్కలు చేస్తారనే వాస్తవం అందరికీ తెలుసు.

వేకువనే కామదహనం జరిగింది. ఆ రోజంతా దేసు కుమారుడు సోమ్లును వెతకడమే 'ఢూండ్' కార్యక్రమం. వెలుతురు వస్తుండగానే జనం సారాయి తాగారు. కోలాటం వేస్తూ, 'హెూళియాయి, హెూళియాయి రామదండ ఘూటీసె పేటియామ ఫాలదండ (హెూలి వచ్చింది కోలుకోలే, చిరిగిన చీరకట్టినామె వేయి కర్ర) అంటూ కేవలం అవాచ్య శబ్దాలను వాడుతూ వదిన అయినటువంటి వాళ్లను కౌగిలించుకుంటూ 'భో' అనడం వాడుక. వదిన, మరిది తువ్వాలుని లాక్కుని దాచిపెట్టి ఆమెకు సారాయి తాగించేవరకు దాన్ని తిరిగి ఇవ్వదు. సాయంత్రం అవుతుండగానే రంగులతో ఆడుకుంటారు. సాయంత్రం మాంసం భాగాలు పంచడంతో హెూలీ ముగిసేది.

ఆరు నెలల బిడ్డ సోమ్లూను పక్కనున్న గుడారంలో దాచిపెట్టారు. హెూలీ కోలాటం వేసే గేరయా, గేరణిలు పిల్లాడిని వెతకాలి. (హెూలీ నృత్యం చేసే స్త్రీ, పురుషులను గేరయా, గేరిణిలని అంటారు) వాళ్లు పిల్లాడిని వెతికి పిల్లవాడి గురించి పాటలు పాడి అతనికి శుభం కోరాలి. సోమ్లుభుక్యాను వెతుకుతూ రెండు మూడు గుడారాలు తిరుగుతూ పాటలు పాడారు గేరియా, గేరణిలు. పిల్లవాడు ఏదో సమయంలో తప్పకుండా ఏడుస్తాడు. అప్పుడు తమ చేతికి చిక్కుతాడని వాళ్ళు ఎదురు చూడసాగారు. వారి ఊహ నిజమైంది. సోమ్లు భుక్యా ఏడవటం వినిపించగానే అక్కడికి పోయి అతని గురించి పాటలు కట్టి పాడి, పిల్లవాడి తండ్రి దేసుభుక్యా కరమ్‌తోట్‌ను హెూలీ మామూలు అడిగారు. దేసుకు చాలా సంతోషం కలిగింది. భార్యాభర్తలిద్దరూ కొడుకు భవిష్యత్తు కోసం, అతని అభివృద్ధి కోసం, శుభాన్ని కోరిన గేరియా, గేరణిలకు తృప్తి కలిగేలా కానుకలు ఇచ్చారు. పక్కనున్న గుడారంలో దాచిపెట్టిన సోమ్లును వెతికిన తర్వాత 'ఢూండ్' ముగిసింది.

దేసు బాధ్యతలు రోజురోజుకు పెరగసాగాయి. ఇంట్లో ముగ్గురు వితంతువులు. పెళ్లికావలసిన చెల్లెలు గోమ్లి, ఆమె అన్న తోత్యా. వాళ్ల పెళ్ళిప్రయత్నాలు మొదలుపెట్టాడు. తమలాగే వ్యాపార నిమిత్తం వలస వచ్చి వారి గుడారాల నుంచి యాభై కోసుల దూరంలో ఉన్నా కొర్రా కుటుంబంలోని రణసోతన కూతురును తోత్యాకు తెచ్చుకోవాలని, అలాగే గోమ్లిని అక్కడే ఉన్న సబావుట్ తెగలోని దాండూ నాయక్ కుమారునికి ఇవ్వాలని మాట్లాడుకుని వచ్చారు. 'గోళాపేరూరు' (తీపు పంచే కార్యక్రమం) కూడా జరిగిపోయింది. దీపావళి ముందు రోజున పెళ్లిచేసుకుంటామని దేసు మాటయిచ్చి వచ్చాడు. రోజురోజుకు వ్యాపారంలో

పెరుగుతున్న పైపోటీ అతడిని అధైర్య పరుస్తోంది. అయినా ధైర్యం కోలోకుండా లాభాలు గడిస్తూ వచ్చాడు. అయితే ఎన్నడూ హైదరాబాద్ వైపు ప్రయాణం చేయకుండా అతని తల్లి మాట తీసుకుంది. దానికి అతనూ అంగీకరించాడు. ఆంధ్ర సరిహద్దులు ప్రవేశించనేకూడదని కూడా ఆమె చెప్పింది. అయితే ప్రవేశించవలసిన పరిస్థితి ఒకసారి వచ్చింది. హైదరాబాద్ రాజు చనిపోయిన తర్వాత **నిజాం దర్బార్** వచ్చిన తర్వాత, అన్యాయం, ఆక్రమణలు పెరగసాగాయి. అయితే వ్యాపారం చేసి బ్రతకవలసిన అనివార్యత ఉండటం వల్ల దేసు ప్రయాణం చేయవలసి వచ్చింది. ఒక పెద్ద వ్యాపారికి అతని దగ్గర ఉన్న ఉప్పును కర్ణాటకకు సాగించడానికి సుమారు వెయ్యి ఎద్దులు అవసరమయ్యాయి. దేసు దగ్గర ఇప్పుడు మిగిలినవి కేవలం ఏడెనిమిది వందల ఎద్దులు. ఒకప్పుడు అతని తాతకు లక్షకు పైగా ఎద్దులు ఉండేవని కథలు చెప్పడం జరిగేది. ఇద్దరు ముగ్గురిని చేర్చుకొని ఉప్పును తరలించే పనిలో నిమగ్నమయ్యాడు. అతని మనుషులు ఎద్దులను తోలుకొని ఇటు వైపు దొరికిన మరొక వ్యాపారాన్ని ఉపయోగించుకొని, అటువైపు నుంచి అనుకూలమయ్యేలా చేసుకున్నారు. ఒక వారం ఇటు వైపు నుంచి నడిచిన ఎద్దులకు దారి మధ్యలో విశ్రాంతినిచ్చి గమ్యాన్ని చేరేసరికి అర్ధరాత్రి. వ్యాపారి చెప్పిన స్థలంలో తెచ్చిన సరుకులను దించి మరొక వ్యాపార ఒప్పందం ప్రకారం సరుకులను ఎద్దులపై ఎక్కించుకోవడానికి మధ్యాహ్నం పన్నెండు గంటలకు వెళ్లాలని అనుకున్నంతలో నిజాం సైన్యం వచ్చిందని అందరూ అక్కడక్కడే దాక్కున్నారు. మనుషులు దాక్కున్నారు అయితే ఎద్దులకు ఏం తెలుసు? గుర్రాల అడ్డంగా వచ్చిన ఎద్దుల వల్ల కోపగించుకున్న సైనికుడు "ఎయ్ కహా మరగయారె, హఠావ్ సామ్నేసె" అని అరిచాడు. "ఏయ్ బసవ" అని దేసు స్వయంగా ఎద్దులను దారి నుంచి పక్కకు తొలగించడానికి ముందుకొచ్చాడు. దేసును చూసిన సైనికుడు అతన్ని పట్టుకునిపోయి యువరాజు ముందు నిలిపారు. "ఎవరు నువ్వు?" అని అడిగాడు. "యువరాజా, నేను ఒక చిన్న వ్యాపారిని. బతుకు తెరువు కోసం ఎద్దుల మీద సరుకులను అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి చేరవేస్తుంటాను హుజూర్" అని వినయంగా చెప్పాడు దేసు.

"చూడూ, ఇటువైపు రాకూడదు. ఇంకొకసారి ఇటువైపు వచ్చావంటే ప్రాణాలతో వదలను" అని గంభీరంగా అన్నాడు యువరాజు. ఎద్దులను తోలుకుంటూ చిన్న వ్యాపారం చేసుకునే దేసును చూసి ఎందుకో యువరాజు తన దగ్గరున్న నాణేల సంచిని దేసు వైపు విసిరి, "మళ్లీ ఇటువైపు నువ్వు కనిపించకూడదు" అని

హెచ్చరిస్తూ గుర్రాన్ని ముందుకు నడిపాడు. అయితే దేసు ఆ సంచిని తిరిగి యువరాజుకు ఇవ్వడానికి చేయి ముందుకు చాపబోయాడు. యువరాజు వెంట వచ్చిన సైనికుల్లో ఒకడు, "ఇచ్చింది తిరిగి ఇచ్చేంతవాడివా నువ్వు? పో ఇక్కడి నుంచి" అని బెదిరించాడు. యువరాజుకు సలాం చేసి, 'గొప్పవాళ్లతో సహవాసం నిప్పుతో చెలగాటం. ముందు ఇక్కడి నుంచి క్షేమంగా వెళితే చాలురా దేవుడా' అని అక్కడి నుంచి పక్కకు వచ్చి, తన గుర్రమెక్కి తన మనుషులతో ఎద్దులను వెనక్కి తిప్పని చెప్పాడు. వెంటనే గుర్రాన్ని, ఎద్దులను వేగంగా పరిగెత్తించసాగాడు. అప్పటికే అతని వ్యాపారం సజావుగా సాగింది. దించవలసిన సరుకులు దించి, డబ్బు తీసుకున్నాడు. అలాగే అక్కడ ఎక్కించుకోవలసిన ఉప్పుమూటలు ఎక్కించుకొని వాళ్ల దగ్గర నుంచి డబ్బులు తీసుకొని భద్రంగా దాచుకున్నాడు. దారిలో దొంగల దాడులు విపరీతంగా ఉండటం వల్ల డబ్బు వ్యవహారం కఠినమైనదని తెలుసు. అయినా అతనికి ఇది అనివార్యం. యువరాజు ఇచ్చిన నాణేల సంచిని గుర్రపుజీను అరలో జాగ్రత్తగా పెట్టాడు. మొదట స్వాభిమానంతో తీసుకోకూడదని అనుకున్నాడు. అయినా తీసుకున్నాడు. దాన్ని విప్పి చూడాలని కోరికకూడా కలగలేదు. ఆ నాణేలు అతని సమస్యలన్నీ పరిష్కరించవచ్చు. అయినప్పటికీ వాటిపట్ల అతనికి ఆసక్తి కలగలేదు. ఇక ఆంధ్ర సరిహద్దుకు దగ్గరదగ్గరగా వచ్చేశాడు. ఉన్నట్టుండి దొంగల గుంపు ఒకటి వాళ్ల మీద దాడిచేసింది. దేసు ధైర్యం కోల్పోక తన మనుషులను ఉత్సాహపరిచి దొంగల మీద ఎదురుతిరిగాడు. కత్తి తీసుకుని నలుగురిని గాయపరిచాడు. ఒక గుంపు మీద తిరగబడ్డాడు. వారి వెనుక మరొక గుంపు ఉందని ఊహించలేకపోయారు. రెండుగుంపులు కలిసి వీరిమీద తీవ్రంగా దాడిచేసి ఉప్పుమూటలను చెల్లాచెదురుచేసింది. దోపిడి దొంగలు దేసును బంధించారు. "నాణేలు ఎక్కడున్నాయో చెప్పు" అని ఒక లావాటి దొంగ బెదిరించాడు. "ఏ నాణేలు? ఇప్పుడు యజమానులకు సరుకు చేరితేనే డబ్బులు వస్తాయి" అని దేసు ధైర్యంగా సమాధానమిచ్చాడు. "రేయ్, అలా మంచి మాటలతో అడిగితే డబ్బులు రావు. నాలుగు పీకితే అవే వస్తాయి" అని నాయకుడు అనగానే దేసుకు ఒక్క క్షణం దిక్కు తోచలేదు. ఈ వైపు నుంచి నలుగురు అటువైపు నుంచి నలుగురు అతని చుట్టుముట్టి గాయపరచసాగారు. "యాడి, మరగోయా" (అమ్మా, చచ్చాను) అని బిగ్గరగా అరిచాడు. దూరంలో యువరాజు సైనికులు తమ వైపు వస్తుండటం చూసి, "హుజూర్" అని దేసు అరిచాడు. ఒక సైనికుడు ఇది చూసి ఏదో జరుగుతుందని ఊహించి, యువరాజుకు తెలిపాడు. యువరాజు గుర్రం వేగంగా దేసు వైపు వచ్చింది.

దొంగలకు ఇక తమ ప్రాణాలు పోతాయని పరిగెత్తడానికి ప్రయత్నించారు. యువరాజు వేగం ముందు వాళ్లు తప్పించుకోలేకపోయారు. అరక్షణంలోనే వాళ్లందర్నీ యువరాజు, సైనికులు పట్టుకున్నారు. "ఎవరి అధికారం అనుకున్నారు. నా ముందు మీ ఆటలు సాగవు. ప్రాణాలు తీస్తాను. ముందు మీరు పాడుచేసిందంతా బాగు చేయండి. ఆ ఎద్దుల మీది నుంచి కిందికి తోసిన మూటల్ని ఎత్తి వాటిమీద పెట్టండి" అని వారి చేతనే మూటలన్నీ ఎద్దుల మీద పెట్టించాడు. దేసుకు కృతజ్ఞతతో నోట మాటపెగల్లేదు. చేతులు జోడించాడు. యువరాజుకు ధన్యవాదాలు చెప్పి అక్కడి నుంచి బయలుదేరి సరిహద్దు దాటాడు.

తన గుడారం చేరుకునేసరికి వర్షానికి, సుడిగాలికి గుడారాల పరిస్థితి పాడైపోయింది. కొడుకు ఇంకా రాలేదనే చింతతో ప్రాణాలు పిడికిట్లో పట్టుకొని ఉన్న తల్లి లచ్మి గుజాసత్తిని ప్రార్థిస్తూ దేసు తిరిగివచ్చేవరకు ప్రాణంలో ప్రాణం లేనట్టుగా ఉంది. బయటి భయంకరమైన వాతావరణపు అవగాహన అంతగా లచ్మి మీద పరిణామం కలిగించలేదు. అతన్ని చూసిన క్షణమే "బేటా, దూరపు ప్రయాణాలు మానేయ్. అంతా పోగొట్టుకున్నాను. మీ నాన్నను, మీ చిన్నాన్నను, మీ తమ్ముడు లచ్మను" అని భావోద్వేగంతో అంది. "అమ్మా, నేను తిరిగొచ్చేశాను కదా!" అని అన్నాడు. అయితే అక్కడ జరిగిన సంఘటనల గురించి ఆమెకు ఏమీ చెప్పలేదు. ఉన్న ఒక్కగానొక బిడ్డకు ఏమైనా జరిగితే అనే భయం ఆమెను వేధించసాగింది. "అమ్మా, నువ్వు కంగారుపడకు. నీ బాధ ఏమిటో నాకు తెలుసు. ఇకపై నీకు చెప్పకుండా ఎక్కడికి వెళ్ళను" అని ఆమె ఒడిలో తల పెట్టి చిన్నబిడ్డలా పడుకున్నాడు. "నా తండ్రీ, నువ్వు ఎన్నడూ పెద్దవాడివి కాకుండా వుండాల్సింది. ఇలాగే ఎప్పుడూ నా తొడమీద కూర్చుని ఆడుకునే పిల్లవాడిగా వుంటే..." అని గుండె లోపలి నుంచి మాటలు బయటకు వచ్చాయి. "అమ్మా, ఇప్పుడు మాత్రం నేను ఎంత పెద్దవాడయ్యాను? ప్రపంచానికి నేను ఎంత పెద్దవాడినైనా, నీకు మాత్రం పసిబిడ్డనే" అని ఓదార్చడానికి ప్రయత్నించాడు. తల్లిపేగు దేన్నైనా అతి తొందరగానే మరిచి బిడ్డ అభివృద్ధికి, శ్రేయస్సుకు, అతని తుంటరితనానికి, అన్నిటి పట్ల బాధ్యత వహించే ఓర్పును పొందుతుందనటానికి సాక్ష్యం లచ్మి.

దేసుభుక్యా బాధ్యతలు పెరగసాగాయి. చెల్లెలి పెళ్లి, తమ్ముడి పెళ్లి, తన సంసారం వీటన్నిటి బాధ్యలు అతని మీదనే ఉన్నాయి. వ్యాపారం డోలాయమాన స్థితిలో ఉంది. ఒక్కోసారి వ్యాపారం వదిలి వేరే ఏదైనా చేద్దామని ఆలోచించేవాడు. అయితే ఏమి చేయాలో స్ఫురించలేదు. వీటన్నిటి మధ్య తన జీవితాన్ని తీర్చిదిద్దుకునే

ప్రయత్నంలో నిమగ్నమయ్యాడు. దీపావళి సాయంత్రం గోమ్లి పెళ్లికూతురిగా వరుని ఇంటికి వస్తే, తోత్యా పెళ్లికొడుకై అమ్మాయి గుడారం చేరాడు. దేసు ఇరువురి వివాహాలను అత్యంత వైభవంగా చేశాడు. తండ్రి లేకపోయినప్పటికీ అన్న సంసారం బాధ్యతను మోసుకొని కష్టపడుతుండటం చూసి తోత్యా ఎంతో సంకటపడ్డాడు. అత్తవారింటికి వెళ్లటానికి ముందు గోమ్లి దేసుభుక్యా మెడ కరచుకొని రోదించింది. బాల్యం నుంచి అతనితోనే ఆడుకుని, సంసారంలోని ఒడిదుడుకులను చూసింది. దేసుభుక్యా పెదనాన్న కొడుకైనా సొంత తోడబుట్టినవాడిలా తనను సాకాడు. కూతురుకు వీడుకోలు చెప్పేటప్పుడు కూతురి ఎడబాటును భరించలేక ఆమె తల్లి మూర్ఛపోయింది. తన చిన్నమ్మను కూడా తల్లిలాగే ప్రేమించినవాడు దేసు. అతను వెంటనే పరిగెత్తుకెళ్లి నీళ్లు తెచ్చి, తాగించి, ఆమెను సమాధానపరిచాడు.

దేసుభుక్యా హైదరాబాద్ వైపు వ్యాపారాలు చేయకూడదనుకున్నా, అనేక అవకాశాలు అటువైపునుంచి రాసాగాయి. ఈసారి అతను పనివాళ్ల మీద భారం మోపి పంపాలని నిర్ణయించుకున్నాడు. ఆ వ్యాపారంలో ముందుగానే డబ్బులు ఇవ్వడానికి ఒప్పుకుంటేనే, ఆ మాటకు వ్యాపారి బద్ధుడైతేనే దేసు తన కోడెలను, ఎద్దులను అటువైపు పంపాలనుకున్నాడు. దక్షిణంవైపు వ్యాపారం చేస్తూ తన అస్తిత్వాన్ని స్థిరపరుచుకోవడానికి ప్రయత్నించాడు. ఏడాదికి ఒక్కరన్నట్టుగా ఏడెనిమిది మందిని కన్నాడు. పెద్దవాడు సోమ్లభుక్యా, రెండవవాడు మంగ్ల్యా భుక్యా, మూడవది భీమణి, నాలుగవది ఫక్కీరి, అయిదవవాడు చాప్లభుక్యా, ఆరవవాడు చోక్లా, గుడారమంతా పిల్లాపీచుతో నిండిపోయింది. దేసుకు వీళ్లందర్నీ సాకటం పెద్ద సవాలుగా మారింది. వయసు దాటిన తల్లి, చిన్నమ్మలు అప్పటికే మంచం పట్టారు.

ఈ రంపంతా నాకెందుకని తోత్యా వంద కోడెలను తోలుకొని అక్కడి నుంచి కొద్దిదూరంలోనే ఒక కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఈ విషయం దేసు చిన్నమ్మను బాగా గాయపరిచింది. చిన్నమ్మకు తన కొడుకు తోత్యభుక్యా దేసు నుంచి దూరంగా పోయి సొంతంగా వ్యాపారం చేయడం ఇష్టం లేదు. అతను తన భార్యాబిడ్డల్ని వెంటబెట్టుకునిపోయినా తల్లిని పిలవలేదు. ఆమె వెళ్లలేదు. జీవితమంతా సొంత తోడబుట్టిన అక్కలా ఉన్న లచ్మి వదిలి వెళ్లిపోవడం అసాధ్యం అనిపించింది. అందువల్ల తన కొడుకు బయటికి పోయినా అతనితోపాటు వెళ్లడానికి ఆమె మనసు అంగీకరించలేదు

దేసుభుక్యా పెద్దకొడుకు సోమ్లభుక్యా ఇప్పుడు పెద్దవాడయ్యాడు. ఇద్దరు నానమ్మలు అతన్ని ముద్దుగా పెంచారు. లచ్మికి అతని పెళ్లి చూడాలని,

మునిమనువళ్లను ఎత్తుకొని ఆడించాలనే కోరికను కొడుకు దేసు ముందు వుంచింది. "నాయనా, నేను చనిపోయేలోపు మునిమనుమలను ఆడించాలని అనుకుంటున్నాను. ఎంత కష్టమైనా సరే, సోమ్లా పెండ్లి చేయి" అంది. దేసు భూక్యా మాట్లాడలేదు. తల్లి కోరిక నెరవేర్చడానికి అమ్మాయిని వెతికే పనిలో నిమగ్నమయ్యాడు.

తోత్య మామ కాళుకు తన అల్లుడు సంపదంతా అతని పెదనాన్న కుమారుడు దేసుకు వదిలి రావటం సమంజసంగా అనిపించలేదు. దాంతో తోత్యను పిలిచి అతన్ని రెచ్చగొడుతున్నట్టు, "అది కాదయ్యా అల్లుడు. నీవు చేసింది సరైనదేనా? మొత్తం వ్యాపారం మీ అన్న చేతిలో ఉంది. వెయ్యి ఎద్దులు, కోడెలు ఉన్నాయి. న్యాయంగా నీకు రావాల్సినవి అయిదు వందలు. ఇక బంగారం, వెండి నాణ్యాలు మణుగులకొద్దీ ఇంట్లో ఉన్నప్పుడు కేవలం నూరుఎద్దులను తోలుకొచ్చి వేరు పడ్డావుకదా! నా కూతురును, మనవళ్లను రేపు భిక్షం అడుక్కోవడానికి పంపాలని అనుకుంటున్నావా?" అని అల్లుడి ప్రతిస్పందన కోసం ఎదురుచూశాడు. పిల్లనిచ్చిన మామ మాటలకు తోత్య కలవరపడ్డాడు. కొద్దిసేపు అయోమయంలో పడ్డాడు. నేనేదో భార్య మాటలు విని ఇంటి నుంచి బయటికొస్తే ఇతనేమో పూర్తిగా సంబంధం తెంచుకొమ్మంటున్నాడని అతను గాభరా పడ్డాడు. ఏమి చేయాలో తోచక, "ఆ విషయాన్ని తర్వాత చూసుకుందాంలే మామా. ఇప్పుడు ఎందుకు తల పాడుచేసుకోవడం?" అని మెల్లగా మాట మార్చడానికి ప్రయత్నించాడు. అయితే కాళ స్నేహితుడు, దేసుకు బద్ధశత్రువైన సాణువిసాళవత, "ఊఁ, నువ్వు తర్వాత చూస్తూవుండు, అతను నీ సొమ్మునంతా వాడుకుని, ఎనిమిది రెట్లు పెంచుకుంటాడు. తర్వాత నీకు ఇవ్వకుండా ఎగ్గొడతాడు. అప్పుడు నువ్వు బికారి అవుతావు. ఏం మనిషివయ్యా? ఇది సరైన సమయం. వెళ్లి 'ఏక్ మార్ దో తుకడా' అన్నట్టు మాట్లాడు. మిగిలింది తర్వాత చూద్దాం" అని రెచ్చగొట్టడంతో తోత్య మనసు పూర్తిగా అదుపు తప్పింది. అతనికి తాను అనుకున్నది సరైనదో లేదా మామ, మామ స్నేహితుడు చెబుతున్నది సరైనదో అర్థం కాలేదు. వారిద్దరి నుంచి తప్పించుకునే దారికోసం ఆలోచిస్తుండగానే మరొకసారి కాళు రెచ్చగొట్టాడు. మీ తాతగార్లయిన జంగి-భంగిలు మహారాజుకు చాలా దగ్గరివారు. వాళ్లు మణుగులకొద్దీ బంగారం ఇచ్చారు. నీవు ఇలాగే వదిలేస్తే మీ అన్న అంతా దోచేస్తాడు. జాగ్రత్త!" అని సాణువిసళావత తోత్య వైపు చూశాడు. ఇద్దరు చేరి అతని బుర్రలో అనుమానబీజం నాటారు. తోత్య ఆలోచనలో పడ్డాడు. ఒకవేళ తాను ఏమైనా అలా చేస్తే పెద్దమ్మ, తన తల్లి ఏమనుకుంటారు? తన సోదరుడు దేసు తనను వేరుగా, పరాయివాడిగా

ఎన్నడూ చూడలేదు. తోత్య ఆలోచనలో పడటం గమనించిన సాణువిసళవత్, ఇనుము వేడిగా ఉన్నప్పుడే దెబ్బకొట్టాలని, "ఏమిటి ఆలోచిస్తున్నావ్? రేపు ఉదయమే పంచాయతీకి అందరిని పిలిచి, మీ అన్నను పిలిపించు. ఇంతకు అతను నీకు తొడపుట్టినవాడుకాదుకదా! పెదనాన్న కొడుకు" అని అంటూ ఉండగానే తోత్య కోపం నెత్తికెక్కింది. "మామా, మీ పని మీరు చూసుకోండి. మా ఇంటి విషయాల్లో ఇలా తలదూర్చి మాట్లాడడం సరికాదు" అన్నాడు. "అలాగా, నా కూతురును నేను పిల్చుకునిపోతాను. నా కూతురును నీకు ఇచ్చి పెళ్లి చేసింది నీ ముఖం చూసి కాదు. మీ ఇంటి ఆసిపాస్తులు చూసి. నువ్వు నీ అన్నకు గులాములాగా మాట్లాడితే నా కూతురును ఎప్పటికీ నీ దగ్గరికి పంపను" అని వెళ్ళిపోయాడు. నిండు గర్భిణి అయిన సేవ్లి మాటలు విని, నమ్మి వంద కోడెలను తోలుకుని వచ్చినపుడు కూడా అన్న నోటినుంచి ఒక్కమాట రాలేదు. ఇప్పుడు ఏం చేయాలో తోచక, చేసిన స్వయంకృతాపరాధానికి పశ్చాత్తాప పడసాగాడు.

తోత్య ఒక్కడే గుడారంలో ఉన్నాడు. సాయంత్రం కాగానే సారాయి తాగడం, ఎవరెవరినో తిట్టడం, ఇతరులపై జగడాలకు వెళ్లడం చేయసాగాడు. జనం చూసేంత వరకు చూశారు. భరించడానికి సాధ్యం కానప్పుడు నాలుగు దెబ్బలు వేశారు. ఎలాగో ఈ విషయం తెలుసుకున్న దేసు కలవరపడి తమ్ముడి కోసం వచ్చాడు. ఆ సమయంలో తోత్య మాట్లాడేస్థితిలో లేడు. అతని కంటే ముందుగానే అక్కడికి కాళ్య బాణోత్, సాణు విసళావత్‌లు వచ్చారు. దేసును చూడగానే, "వచ్చావా? చచ్చాడో, బతికాడో చూడటానికి వచ్చివుండాలి. అంతా నీ వల్లనే జరిగింది. అతని భాగానికి రావలసింది ఇచ్చివుంటే, ఈరోజు నా అల్లుడికి ఈ పరిస్థితి వచ్చేది కాదు" అని కాళ్య బాణోత్ కటువుగా మాట్లాడాడు. దేసు అతనితో మాటలేమిటి అని మౌనంగా వహించాడు. అయితే సాణు విసళావత్ "అతనికి పెద్దలు సంపాదించి పెట్టిపోయిన సంపద చూసుకుని పొగరుపడుతున్నాడు. గుడారంలో బంగారు వరహాలు కుళ్లిపోతున్నాయి. అందుకే ఇలా చేస్తున్నాడు. మాలా ఎవరి సహాయం లేకుండా అభివృద్ధిలోకి వచ్చివుంటేఅప్పుడు తెలిసేది" అని ఏదేదో అసందర్భంగా మాట్లాడసాగాడు. దేసు విన్నంతవరకు విని, "ఏయ్, నువ్వెవరు మా మధ్యన మాట్లాడటానికి? ఆయన మా వియ్యంకుడు. మాట్లాడే హక్కు ఉంది. అడుగుతాడు. నీకేం పనిరా?" అని అతని మీదికి పోయాడు. "అతను నా స్నేహితుడు. అతను అబద్ధం చెప్పడం లేదు. అతను చెప్పింది నిజమే. నువ్వు అంత మర్యాదస్థుడివైతే ఇవ్వాల్సింది ఇచ్చేవాడివి. ఆహా, వచ్చేశాడు పెద్దమనిషి" అని కావాలనే కాళ్య

రెచ్చగొట్టాడు. ఇప్పుడు దేసును రెచ్చగొట్టి, గొడవ చేసి, ఎలాగైనా అన్నాదమ్ములను విడగొట్టాలన్నదే వారి కుట్ర. దేసు అంతా గమనించాడు. అయితే ఇప్పుడు మౌనంగా వీళ్ల అంటున్నవన్నీ వింటే, భయపడ్డాడని రేపు మనిషిమీదికి వచ్చి పడతారు. "ఎవరు పెద్ద మనిషి? ఎవరికి మర్యాద లేదు. భాగం అడగవలసింది అతను. అడగనీ, అతను అడిగిన తర్వాత చూద్దాం. నువ్వెవరు? కూతురునిచ్చిన మామ. అంతే కదా. అంతలోనే ఉండు. హద్దు దాటావా చంపేస్తాను. జాగ్రత్త" అని గట్టిగానే అన్నాడు. అయితే తన వెనుక విళాసవత్ సపోర్ట్ ఉండటం వల్ల కాళ ఊరుకోలేదు. "ఏం చేస్తావు? హద్దు దాటాను. ఏమిప్పుడు? కొడతావా? కొట్టరా మొగోడా, మీ నాన్నకు పుట్టినవాడైతే, నువ్వు కరమ్‌తోట్ కులపువాడైతే నన్ను ముట్టుకో" అని సవాలుచేస్తూ అతని మీదికి వెళ్లాడు. వేడిరక్తపు దేసు వెంటనే గూబగుయ్యిమనిపించాడు. కాళ్య బాణోత్ కళ్లల్లో చీకట్లు కమ్ముకున్నాయి. గిరగిరమని మూడు చుట్లు తిరిగి, "యా మరగోయె' (అమ్మా చచ్చాను) అని నేలకూలాడు. విసళావత్ ఒక్క ఘడియ ఆలోచించాడు. అక్కడే ఉన్న తన శిష్యులకు 'దేసును కొట్టండి' అన్నట్టు సైగచేశాడు. వాళ్లు వెంనే దేసు మీదపడ్డారు. దేసు ఒక్కొక్కరిని చితకబాది తరిమేశాడు. కాళ్యబాణోత్ గొడవను అంతటితో ఆపకుండా చెవి నుంచి రక్తం కారడాన్ని సాకుగా చూపించి, "నన్ను చంపేస్తున్నాడప్పా. మా అల్లుడికి న్యాయం చేయండని అడిగినందుకు నన్ను కొడుతున్నాడు. అయ్యో రండప్పా, నన్ను హత్య చేయటమే కాకుండా, సాఱు విసళావత్‌ను చంపేస్తున్నాడు" అని బిగ్గరగా అరుస్తూ ఏడవసాగాడు.

సరిగ్గా అదే సమయానికి తాగి గొడవ చేస్తూ జనాన్ని ఇష్టమొచ్చినట్టు తిడుతున్న తోత్యను వీధిలోని జనం మక్కెలిరిగేలా తన్నారు. అతను ఎలాగో జనం నుంచి తప్పించుకుని పారిపోయి ఇంటికి వచ్చాడు.

జనం కొట్టిన దెబ్బలకు తోత్య ఒళ్లు హూనమైపోయింది. దేసు విసళావత్ జనాన్ని తరిమి కొడుతుండటం చూసి, అతని మామ మాటలు మార్చి కట్టుకథ కల్పించి అతనికి చెప్పాడు. "చూశావా, ఎలా కొట్టాడో, నిన్ను చంపడానికి జనాన్ని పంపినవాడు అతనే. నువ్వు చూస్తే నీ ఆస్తిని అతనే అనుభవించనీ అని పెద్దమనిషిలా చెబుతున్నావ్. ఎందుకయ్యా, ఇలా చేశావని అడిగినందుకు నన్ను కొట్టాడు. నా స్నేహితుణ్ణి కూడా కొట్టాడు" అని ఏడవసాగాడు. తాగినమత్తులో ఉన్న తోత్య మామ చెప్పిన మాటలు నమ్మి, "ఏయ్ వాళ్ళను వదులు. వాళ్ళను చంపేస్తావా? నన్ను కొట్టించిందే చాలు. నువ్వు ఇంత చేసిన తరువాత ఇంకా నీకు నా భాగం

వదలటంలో అర్థంలేదు" అని దేసుకు వ్యతిరేకంగా మాట్లాడాడు. దేసుకు మొదట్లో అతని మాటలు అర్థం కాలేదు. "ఏయ్ తోత్యా, నేను నిన్ను కొట్టించానా?ఎవరు చెప్పారురా ఈ మాటలు. చెప్పు" అని అతని భుజం పట్టుకుని ఊపాడు. అతను మాట్లాడలేదు. "ఇలా ఊరుకుంటే నేను వదలను. గుజాసత్తి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నీకు ఏనా కొడుకు చెప్పాడో వాడి పేరు చెప్పు. వాడు అది రుజువు చేయాలి. తర్వాత నువ్వు ఏమి చెబుతావో అది చేయడానికి సిద్ధమని నేను మాట ఇస్తున్నాను. నీకు ఎవరు చెప్పారో చెప్పు" అని కోపంతో అన్నాడు. ఇప్పుడు తాను చిక్కుల్లో చిక్కుకున్నట్టు తోత్యకు అర్థమైంది. తానన్నది అబద్ధమైతే దేసు చర్మం వలిచేస్తాడు. దాంతో అబద్ధాన్ని నిజం చేయడానికి ఒక అబద్ధం చెప్పాడు

"ఎవరో ఎందుకు చెప్పాలి? నాకు అర్థంకాదా? ఇప్పుడు ఎవరు చెప్పారన్నది ముఖ్యం కాదు. నా భాగం నాకు ఇవ్వు. అంతే" అని స్థిరంగా అన్నాడు. కాళ్యకు చెవినొప్పి మాయమైంది. "ఇదయ్యా మగతనపు మాటంటే. రేపు కులపంచాయతీ పెట్టించి, అక్కడ మాట్లాడదాం" అని కాళ్య, విసళావత వెనుకే జారుకున్నాడు.

స్వయంగా నాయకడైన దేసు తన తమ్ముడు పిలిచిన న్యాయపంచాయతీలో ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉండిపోయాడు. స్వయంగా అతనే వందలాది మందికి బుద్ధి చెప్పేవాడు. ఇప్పుడు తన ఇంటి సమస్య కావటంతో దేసు కారభారి, డావోల మీద పంచాయితీ బాధ్యత పెట్టాడు. న్యాయం కోసం చుట్టూ ఉన్న గుడారాల నుంచి జనం దేసు దగ్గరికి రావడం కారభారికి, డావోకు తెలుసు. ఎప్పుడూ నిష్టూరంగా సత్యమే మాట్లాడే దేసుభుక్యాను ఇబ్బందిలో ఇరికించటానికి ఇదే సమయమని భావించి కారభారీ, డావోలు తోత్య నుంచి డబ్బులు తీసుకున్నారు. మంచంపట్టిన లచ్మి తన కులపుతీగ ఒకటి ఇలా తెగిపోతుండటం చూస్తూ భరించలేక బాధపడుతూ, పంచాయితీ పెద్దల నిర్ణయం ఏమిటో తెలుసుకోవాలని అతికష్టం మీద చెల్లెలితోపాటు వచ్చి కూర్చుంది. ఆమె మనసు పడుతున్న సంకటాన్ని వెలిబుచ్చలేక సతమతమవుతోంది. నాయకుడి స్థానంలో ఉన్న కారభారి, "చూడండి మీరంతా పెద్దలు. ఇక్కడ కలిశారు. ఇందులో మన గుడారాల గుంపు నాయకుడైన దేసుభుక్యా కరమ్‌తోట్ స్వయంగా ఫిర్యాదుదారులలో ఒకడు కావడం వల్ల అతని స్థానాన్ని అలాగే వదిలి కారభారినైన నేను, డావోలు తీసుకునే నిర్ణయమే చివరి నిర్ణయం!" అని అందరికీ విషయాన్ని స్పష్టం చేశాడు. ప్రజలకు ఇందులో ఏదో కుట్ర జరుగుతోందని అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఈ మనుషుల చేతికి నిర్ణయాధికారం దొరికితే ఏదో అన్యాయం జరుగుతుందని అందరూ

మాట్లాడుకోసాగారు. తోత్య లేచి తన ఫిర్యాదు చెప్పాడు. "నాకు నా భాగం ఎద్దులు, ఇంట్లో ఉన్న బంగారు వరహాలు, వెండి నాణ్యాల్లో భాగం కావాలి" అని మూలకుపోయి కూర్చున్నాడు. అతని తల్లికి ఒళ్ళు మండిపోయింది. ఏ రోజు గొంతెత్తి మాట్లాడని ఆమె పైకి లేచి "రేయ్ దరిద్రుడా! వాటన్నిటినీ నువ్వు ఎక్కడ సంపాదించి పెట్టావురా? ఏం వ్యాపారం చేశావురా? పో, గుడారంలోకి పోయి ఏమైనా పెట్టివుంటే తీసుకుని రా! ఎన్ని సంవత్సరాలు కష్టపడి సంపాదించావు? ఏ ఏ వ్యాపారాలు చేశావు? వాడు దేవుడు రా! తండ్రిని పోగొట్టుకొని చిన్నవయసు నుంచే ఇంటి బాధ్యతను మోసుకొని మనందరినీ సాకుతున్న దేవుడురా. అతనికి వ్యతిరేకంగా ఇలా చేస్తున్న నీవేమి బాగుపడతావ్‌రా? సర్వనాశనం అవుతావ్. నా తల్లి గుజాసత్తిలో నిజం ఉంటే నిన్ను చూసుకుంటుంది. నా కడుపు రగిలించడానికి ఎందుకు పుట్టావో?" అని బాధ భరించలేక రోదించగింది. దేసు ఆమెనలా చూసి భరించలేకపోయాడు. "మాసి, (చిన్నమ్మా) ఇప్పుడు ఏమైందని ఇలా బాధపడుతున్నావ్? వాడు మాట్లాడుతున్నది నిజమే. ఆ దేవుడు అతనికి బాధ్యత మోసుకునే బుద్ధి ఇచ్చాడుకదా! ఊరుకో. ఎన్ని రోజులు నేనే ఇదంతా మోసుకోవాలి? అతనికి కూడా వ్యాపారం అంటే ఏమిటో తెలియలి. ధైర్యం తెచ్చుకో. నీ కళ్లల్లో కన్నీళ్లు నేను చూడలేను. ఏ రోజు నీకు ఈ స్థితి రాకూడదు" అని గద్గదికంగా అన్నాడు.

తోత్యభుక్యా కరమ్‌తోట్ సమానంగా ఎద్దులను పంచుకున్నాడు. కొద్దో గొప్పో నాణేలను పొంది ఉత్సాహంతో వ్యాపారం ప్రారంభించాడు. అయితే అతను మామ కాళ్య బాణోతు, అతని స్నేహితుడు సాణు విసళావత్ చేతుల్లో కీలుబొమ్మలా మారాడు. అతని భార్య మొదట ఒక ఆడపిల్లను, తర్వాత వరుసగా ఐదారు మంది ఆడపిల్లలకు జన్మయిచ్చి అలిసిపోయింది. కరమ్‌తోట్ కుటుంబం రెండు భాగాలుగా విడిపోవడానికి సాక్ష్యంగా నిలిచిన అతని తల్లి, పెద్దమ్మ అతని గురించి ఆలోచించడం మానివేశారు. వాళ్లకు దేసుభుక్యానే ముఖ్యమయ్యాడు. ఎందుకంటే న్యాయాన్ని పాటించేవాడు, 'అయ్యా' అంటూ సహాయం కోసం వచ్చినవారికి అండగా నిలిచేవాడు. అతనిలో దయాగుణం మెండుగా ఉంది.

అక్కాచెల్లెల్లిద్దరూ సోమ్లభుక్యా పెళ్లికోసం ఎదురుచూడసాగారు. పదికోసుల దూరంలోని హైదరాబాద్ సరిహద్దు ప్రాంతంలోని రంగ్యా విసళావత్ కూతురు జానకిని చూసి, మాట్లాడి, సంబంధాన్ని నిశ్చయించుకుని వచ్చాడు.

దేసు తల్లి లచ్మి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. సంసారం పెద్దదై, వ్యాపారం తగ్గుతూ ఉండటం వల్ల దేసు మనస్సు అశాంతికి గురైంది. తోత్య

బయటకు పోయిన తర్వాత వ్యాపారానికి ఉపయోగిస్తున్న ఎద్దుల సంఖ్య తగ్గింది. దాంతో భారీవ్యాపారాలు కుదరకుండా పోయాయి. అక్కడే చిన్నాచితక వ్యాపారాలు చేసుకుంటూ జీవనపోరాటం చేయసాగాడు. అతని అత్త రూప్లి, జీవితాంతం తమను కాపాడుకుంటూ వచ్చిన తన వదిన లచ్మికి ఏమీ కాకూడదని గుజాసత్తికి మొక్కుకున్నారు. సేవాలాల్ మహారాజ్‌ను వేడుకున్నారు. లచ్మి మాత్రం, "అయ్యో, ఎందుకిలా భయపడతారు? నేను అంత తొందరగా చావను. నా తల్లి గుజాసత్తి అనుగ్రహం నా మీద ఉంది. నా మనమడు సోమ్లా పెళ్లిచేసి, అతని పిల్లలను ఆడించాలి" అని కళ్ల నుంచి కారుతున్న కన్నీళ్లను చీర కొంగుతో తుడుచుకోవటానికి ప్రయత్నించింది. "వదినా,నీకు ఏమీకాదు. ఎందుకిలా గాభరాపడతావు.మేమంతా ఉన్నాం. ఊరుకో" అని రూప్లి ధైర్యం నింపింది. ముగ్గురు వితంతువులు పనిపాటలు లేకుండా దేసు సంపాదించింది తింటూ వ్యర్థంగా కాలం గడుపుతున్నామేమో అనే అపరాధ భావనతో ఒకరికి తెలియకుండా ఒకరు లోలోపలే కుమిలిపోయేవారు.

కొడుకు పెళ్లి అత్యంత సరళంగానే దేసు చేశాడు. అమ్మాయి తండ్రి రంగ్యా విసళావత్ కూడా రాజస్థాన్ సరిహద్దు నుంచే వ్యాపారానికి వచ్చినవాడు. అతని తాత గొప్ప శ్రీమంతుడు. అయితే రాజకీయపు మార్పులవల్ల, వ్యాపారంలోని ఒడిదుకులవల్ల ఆ కుటుంబ పరిస్థితి దిగజారిపోయింది. దాంతో ఆ కుటుంబం ఇక్కడికి వలస వచ్చి కష్టపడి జీవితాన్ని నిర్మించుకున్నారు. ఇప్పుడు ఏదో విధంగా ఆ కుటుంబం తిండికి బట్టకు కొరత లేకుండా బతుకుతోంది. అందువల్ల దేసుభుక్యా ఈ సంబంధాన్ని అంగీకరించి పెళ్లిజరిపించాడు. సోమ్లభుక్యా, జానకిల పెళ్లికార్యక్రమాలు ముగిసి, ఊరేగింపు తీసిన తర్వాత గుజాసత్తికి ప్రార్థనలు జరిపి ఎండుకొబ్బరి-నైవేద్యం పెట్టి, ముక్కలు కోసి, అందరికీ పంచిన తర్వాత అంతా ముగిసింది. దేసు తల్లి కోరిక తీర్చిన సంతోషాన్ని అత్తతో పంచుకున్నాడు. లచ్మి ముఖంలో సంతోషం కనిపించింది. ఇంటి వాళ్లకందరికి పట్టరాని సంతోషం కలిగింది.

సోమ్లా, మంగ్యాలు తండ్రికి సహాయంగా వ్యాపారానికి నిలబడ్డ తర్వాత పరిస్థితి కాస్త కుదుటపడింది. దేసుకు సోమ్లాకన్నా చిన్నవాడైన మంగ్యా మీద ఎక్కువ నమ్మకం ఉంది. అయితే లెక్కచార విషయంలో, ధైర్యంలో అతని చివరి కొడుకు చోక్లభుక్యా కరమ్‌తోట్ అందరినీ మించేలా కనిపించేవాడు. చాప్ల మాత్రం పిచ్చిపిచ్చిగా ఉంటూ భోజనం చేసి, చెప్పిన పని చేసేవాడు. అమ్మాయిలు ఒకరి తర్వాత ఒకరు పెళ్లికి ఎదిగి నుంచున్నారు. ఇంట్లోని ప్రతి ఒక్కరూ ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యేవారు. అందువల్ల దేసుభుక్యా మీది ఒత్తిడి తగ్గింది. అయితే వ్యాపారంలో

ఉన్న పోటీని కొందరు వ్యక్తిగతంగా తీసుకొని అతని మీద పగ సాధించసాగారు. దెబ్బలు తిని వినికిడి పోగొట్టుకున్న కాళ్య బాణోత్, తన అల్లుడి పతనానికి కారణం కావడమే కాకుండా అల్లుడిని అప్పుడప్పుడు రెచ్చగొట్టేవాడు. దేసుతో సమానంగా సంపద తీసుకునిపోయిన తోత్య మొదట్లో ఉత్సాహంగానే వ్యాపారం చేశాడు. అయితే ఒక పెద్దవ్యాపార నిమిత్తం వెళ్లిన తోత్య సొమ్ము తీసుకుని వస్తుండగా మధ్యదారిలో దోపిడిదొంగలు అడ్డుపడి, సొమ్మంతా లాక్కొని మాయమయ్యారు. పైగా ఆ వేసవిలోనే అతని ఎద్దులకు, కోడెలకు కాళ్లకు, నోటికి రోగాలు వచ్చి బలహీనమై చచ్చిపోయాయి. మరికొన్ని ఉపయోగానికి రాకుండా పోయాయి. తోత్యభుక్యా తాను చేసిన పనికి పశ్చాత్తాపపడసాగాడు.

దేసుభుక్యా కరమ్‌తోట్ తన తెలివితేటలు ఉపయోగించి, కోడెలను ఎర్రటి మట్టిలో పరిగెత్తించి, వాటికి సరైన పద్ధతిలో చికిత్సలు చేసి, జాగ్రత్తగా చూసుకుని బాగు చేసుకున్నాడు. కొన్ని మరీ వదలి పోవటం గమనించి, వాటిని అమ్మి కొత్త కోడెలను కొనుక్కున్నాడు. అతని ఈ అభివృద్ధిని చూసి తోత్య సంతోషపడ్డాడు. అయితే అతన్ని వెనకనుంచి ఆడిస్తున్న అతని మామ, అతని స్నేహితుడు ఏదో విధంగా దేసుకు మనశ్శాంతి లేకుండా చేయాల్సిందేననే ప్రయత్నంలో ఉన్నారు. వాళ్లు తోత్యకు చాడీలు చెబుతూ, "చూడు, నీకు మోసం చేసి మీ నాన్న సంపాదించిన ఆస్తిని మీ అన్న దోచుకొనిపోయాడు. నీవు మాత్రం మా మాట వినకుండా పనికిరానివాడిలా పడివున్నావు" అని అతని కోపాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు కాళ్య. "మీరు తెలిసి మాట్లాడుతారో, తెలియకుండా మాట్లాడతారో అర్థంకావటం లేదు. నిజానికి మా అన్న బుద్ధిమంతుడు. అతనికి వ్యాపారం తెలుసు. మీలా అతనిది నక్కబుద్ధికాదు. ఇంకొకసారి అతని విషయం నా ముందు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడండి" అని తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతూ అన్నాడు. అతన్ని ఎలాగైనా దారితప్పించాలన్న ఉద్దేశంతో ఆ ఇద్దరు అక్కడితో వదలకుండా "అయ్యో, మూర్ఖుడా, నీవు ఈ రోజు ఈ స్థితికి రావడానికి అతనే కారణం. నీ వ్యాపారం పాడవడానికి అతనే కారణం. నీ సంసారం వీధిపాలు కావడానికీ అతనే కారణం" అంటూ అతని మనసులో విషబీజాలు నాటడానికి ప్రయత్నించి సఫలమయ్యారు. అతన్ని మానసికంగా రెచ్చగొట్టి, దేసు భుక్యాతో గొడవ పడటానికి సిద్ధంచేశారు. తోత్య పీకలదాకా తాగి నేరుగా అన్న ఇంటికొచ్చి జగడానికి నిలబడ్డాడు.

తోత్య హింస రోజురోజుకు పెరగసాగింది. దేసు అతని స్వభావాన్ని దగ్గర నుంచి చూసినవాడు కావడంవల్ల ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

అయితే వయసొచ్చిన అతని నలుగురు కొడుకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఎన్ని రోజులు భరిస్తారు? చోక్ల నానమ్మ ఎదుట తోత్యకు వ్యతిరేకంగా మాట్లాడాడు. "అరే, అతను మీ చిన్నాన్నరా! చెప్పుడు మాటలు విని ఏమీ తెలియకుండా మాట్లాడుతాడు. భరించాలి. మీరు ఒకే రక్తం పంచుకుని పెరిగినవాళ్లు. ఎన్నడూ ఇలా ఆలోచించకు. మీ నాన్న ఇన్ని రోజుల నుంచి అతను తిడుతున్నప్పటికీ ఎన్నడూ నా ముందుకు వచ్చి మాట్లాడలేదు. వెళ్లు. నా ముఖం చూడు" అని అతనిలో ద్వేషం పెరగటానికి ముందే ఆమె చిదిమేసింది. అయితే తోత్య తల్లికి చాలా బాధ కలిగింది. "అక్కా, ఎంత కాలం నా కొడుకును కొంగులో దాచుకొని కాపాడుతావు. నా కడుపులో ఇంత నీచుడు ఎలా పుట్టాడా అని అనుకుంటున్నాను. నా భర్త రాముడి వెనుక బయలుదేరిన లక్ష్మణుడిలా సదా అన్నను సేవిస్తూ జీవించాడు. అలాగే చనిపోయాడు. ఈ పనికిమాలినవాడు ఎప్పుడు మనల్ని ప్రశాంతంగా జీవించడానికి వదులుతాడో?" అని సావి కొంగుతో కన్నీరు తుడుచుకోసాగింది.

"ఏయ్ సావి, పిచ్చిదానా? తోత్య నా కొడుకు. ఏ రోజైనా నేను తేడా చూపించనా? దేసు ఏమైనా అన్నాడా? వాడు మన రక్తం, ఈరోజు ఎవరో మాటలు విని ఇలా ప్రవర్తిస్తున్నాడు. బుద్ధి వచ్చిన తర్వాత బాగవుతాడులే. నువ్వు ఎందుకు బాధపడతావు" అని ఓదార్చింది లచ్మి. "ఎప్పుడు బాగుపడతాడు? ఆఁ...ఎప్పుడు? నేను చనిపోయిన తర్వాతనా? ఎలాంటి పాపాత్ముడు పుట్టాడోకదా? ఆయన చనిపోయిన రోజునే చితి ఎక్కింటే బాగుండేది. ఈరోజు ఈ దినాన్ని చూడకుండా ఉండేదాన్ని" అంటూ నిజంగానే ఆమె చాలా బాధపడింది. సావిని ఎలా ఓదార్చాలో అర్థంకాక లచ్మి సతమతమవ్వసాగింది.

తోత్యకు తాగించి తాగించి దేసుకు బద్ధశత్రువుగా చేశారు కాళ్య, సాణులు. అతను వద్దనుకున్నా అతని కుటుంబాన్నంతా ద్వేషించేలా చేశారు. జగడానికి ఒకరోజు నిర్ణయించి, వ్యాపారంలో దెబ్బతీయడానికి కాకపోయినా అతన్ని శారీరకంగా హింసించాలని కాళ్య, సాణుల కుట్రపన్నారు. అందులోనూ దేసు లొంగడని తెలిసినప్పటికీ ఒక ప్రయత్నం ఎందుకు చేయకూడదని ఈసారి బాగా సిద్ధమయ్యారు. అంతేకాకుండా కొంతమందికి బాగా తాగించి, తినిపించి పిలుచుకొని వచ్చారు.

ఆ సమయంలో దేసు సోమ్లు భార్య జానకికి కాన్పు నొప్పులు కనిపించటంతో కంగారుగా ఉన్నాడు. గుడారం లోపల ముగ్గురు అనుభవజ్ఞులైన మంత్రసానులు వుండటంతో కాస్త సమాధానంతోనే బయట వేపచెట్టుకట్ట మీద కూర్చున్నాడు. తోత్య తాగి వచ్చి, "ఏ దేసు, నాకు మోసం చేసావు, నీవు బాగుపడవురా, పనికిమాలిన

ఎద్దులను నాకు ఇచ్చి, మంచివాటిని నువ్వు పెట్టుకున్నావు. వెండి నాణేలను నాకు ఇచ్చి బంగారం నువ్వు పెట్టుకున్నావు. ఎవరి బాబువవి. చెప్పరా బోడినాయాలా" అని మెడ పట్టుకున్నాడు. ఒంటిమీద పడ్డాడు. తోత్య తాగినాడని గ్రహించి ఓపికగా, "ఒరే తమ్ముడు, ఇంట్లో నా కోడలు ప్రసవ వేదనతో బాధపడుతోంది. వెళ్లు తమ్ముడు. రేపు ఉదయం లెక్కాచారం చేద్దాం" అని అంటుండగానే ఐదారు మంది కర్రలు పట్టుకుని అతని మీద దాడి చేశారు. గుడారానికి అటు ఇటు కూర్చోని ఉన్న చోక్ల, మంగ్ల్యా, చాప్లలు పరిగెత్తుకుంటూ వచ్చి, చేతికి దొరికింది తీసుకొని ఎదురు దాడికి దిగారు. తాగిన మత్తులో ఉన్న తోత్యను ఎవరు కొట్టారో, దెబ్బ సరిగ్గా తల మీద పడి మూర్ఛపోయాడు. దేసు, అతని పిల్లలకు చీకట్లో తోత్యను ఎవరు కొట్టారో అర్థంకాలేదు. తోత్యను ఎత్తుకుని అతనితోపాటు వచ్చిన వాళ్లు పారిపోయారు. అయితే తోత్య వెనుక ఆ సమయంలో ఎవరో ఉన్నట్టు తెలుసు.

అదే సమయంలో సోమ్లు భార్య మగబిడ్డకు జన్మనిచ్చింది. సంతోషాన్ని నలుగురితో పంచుకోవటానికి దేసు, అతని పిల్లలు అక్కడి నుంచి వెళ్లారు.

తమ ఇంట్లో ఓ కొత్త అతిథి వచ్చిన సంతోషంలో దేసు తోత్య గురించి, అతని వెంట వచ్చిన మనుషుల గురించి ఆలోచించడం మానేశాడు. అయితే మరుసటి ఉదయం తెలవారుతుండగానే అతని చేతిల్లో ఆడి, పాడి, అతని ముందూ వెనకా తిరుగుతూ ఉండేవాడు హత్య చేయబడ్డాడు. తాగి ఊగుతున్న తోత్య ఒంటి మీద స్పృహ లేదు. ఎవరు కొట్టారో ఎవరికీ తెలియదు. గొడవ ప్రారంభమైనపు అతను నోరు చేసుకున్నాడు. దేసు కొడుకులు పరిగెత్తుకుంటూ వచ్చారు. గొడవ జరిగింది. అదే సందర్భాన్ని ఉపయోగించుకొని ఎవరో తోత్య తలమీద దుడ్డుకర్రతో బాది గాయపరిచారు. నేలకూలిన అయితన్ని వెంటనే మోసుకుని అక్కడి నుంచి పరుగుతీశారు. తీవ్రరక్తస్రావంవల్ల తోత్య ఉదయానికంతా శవమయ్యాడు. జనం దృష్టిలో దేసు, అతని కొడుకులు హత్య చేశారు. అయితే దాని వెనుక కుట్ర చేసిన వ్యక్తులు తెల్లవారకముందే గుడారం వదిలి పారిపోయారు. సావి నిర్లిప్తంగా మారింది. తన కొడుకు తోత్యకన్నా ఎక్కువగా ఆమె దేసును ప్రేమించేది. తోత్య ఇల్లు వదిలి వెళ్లిపోయినప్పుడే అన్ని వాస్తవాలు గ్రహించింది. అందువల్ల దేసు తన కొడుకును చంపాడని ఆమె మనసుకు అనిపించలేదు. అయితే ఆమె అక్క లచ్మి తన కుటుంబ సభ్యులు ఇలా కొట్టుకుని చావడం భరించలేకపోయింది. అతడి శవాన్ని తన గుడారానికి దేసు తరలించాడు. 'పెద్దమ్మ... పెద్దమ్మ' అని కొంగు పట్టుకొని సొంత తల్లి దగ్గర పోకుండా పిల్లి పాలకోసం కాళ్ల దగ్గర తిరుగుతున్నట్టు తిరుగుతుండే

తోత్య ఇలా మౌనంగా పడుకునివుండటం చూడలేకపోయింది. "ఎందుకురా నాయనా తోత్య, ఎందుకు ఇంతసేపు పడుకున్నావురా? లే, మీ నాన్న థావు వచ్చాడు, పెద్దనాన్న వచ్చాడు, అన్న వచ్చాడు, లేవరా నాయనా, నా బంగారు" అని దుఃఖం ఆపుకోలేక ఏడవసాగింది. ఆమె దుఃఖాన్ని చూడలేక తండా జనం బోరుమని ఏడవసాగారు. దేసు ఎక్కడో మూలలో తాను చేయని తప్పుకు మౌనంగా తల వంచుకుని కూర్చున్నాడు. ఏమి చేయాలో తోచక నలిగిపోసాగాడు. హైదరాబాద్ నవాబుకు విషయం తెలిస్తే దేసును, అతని కుమారులను ఉరితీయడం ఖాయం. లేదా స్థానిక చిత్రదుర్గ నాయకులకు తెలిసినా దేసుకు, అతని కొడుకులకు ప్రమాదమని తెలిసిన తాండజనం విషయాన్ని బయటకి రాకుండా తొక్కిపెట్టే ప్రయత్నం చేశారు.

కొడుకు ఎంత దుష్టుడైనప్పటికీ తల్లిపేగు తన కంటిముందు ఉన్నాడుకదా అని సంతోషంతో ఉన్న సావికి కొడుకు ఇక లేడని నమ్మటం చాలా కష్టమైంది. ఆమె వంశం ఇలా నిర్వంశం కావటం ఊహించలేక పోయింది. "అయ్యో దేవుడా, ఈ దుర్ఘటనను చూడటానికి ఎందుకు బతికించావు తండ్రీ. నా వంశం నిర్వంశమైంది. ఎవరిని అడగాలి? ఎవరికి చెప్పాలి" అని రోదించసాగింది. ఆమె దుఃఖానికి అంతులేకుండా పోయింది. అతను తమను వదిలి వెళ్లిపోయినప్పుడే ఆమెకు అనుమానం కలిగింది. తన కొడుకును పిల్లనిచ్చిన మామనే తోత్యను తమకు వ్యతిరేకంగా రెచ్చగొడుతన్నాడని అర్థమైంది. అందువల్ల కొడుకు గురించి ఆలోచించడం మానివేసింది. తోత్యకు పిల్లలు పుట్టినపుడు కూడా వచ్చి తమకు చెప్పలేదు.

తోత్య భార్య చౌలి ఒక కొడుకును, కూతురును తీసుకొని భర్త శవం దగ్గరికి వచ్చి ఏడవసాగింది. ఆమెకు ఒక్కదానికే అన్ని నిజాలు తెలుసు. అందువల్లనే బలవంతంగా ఆమెను ఆపిన సాణా, అతని మనుషుల నుంచి తప్పించుకుని పారిపోయి వచ్చింది. స్వయంగా తండ్రి తన అల్లుడిని హత్య చేసేటంత నీచమైన స్థాయికి దిగజారుతాడని ఆమె అనుకోలేదు. తనున్న పరిస్థితిని అర్థంచేసుకున్న చౌలి, అక్కడే ఉంటే తనకు, తన పిల్లలకు ప్రమాదం అని గ్రహించి వచ్చేసింది. తన అత్త సావికి తన మీద కోపం ఉందని చౌలికి తెలుసు. తన భర్తచావుకు తానే కారణమని కూడా వారు అనుకునివుండొచ్చు. అయితే అస్తిత్వమే లేని ఆమె ఏమీ చేయగలదు? ఎవరో చేసిన కుట్రకు ఇంకెవరో బలిపశువయ్యారు. చౌలి నిజాలు చెప్పేస్తుందేమోనని భయపడ్డ సాణా, కాళ్యలు ఎలాగైనా ఆమెను, ఆమె బిడ్డలను హత్య చేయాలని కుట్రపన్నారు. అయితే దేసు తెలివితేటల్ని వారు ఊహించలేదు. చౌలిని ముందుకొదిలి ఆట ఆడే ప్రణాళికను అతను వేసుకున్నాడు. తోత్య మరణానికి

దేసు కారణమని కొందరు అనుకున్నారు. అలాగే నమ్మనీ అని అతను మౌనంగా ఉండిపోయాడు. గుడారంలోని వారందరికీ నిజం తెలుసు. అందువల్లనే అందరూ కలిసికట్టుగా విషయం బయటకు రాకుండా, హైదరాబాద్‌కు లేదా స్థానిక అధికారులకు విషయం తెలిసి రాద్ధాంతం చేయడానికి ముందే కట్టెలు తెచ్చి శవదహనానికి ఏర్పాట్లుచేశారు. తోత్య రెండేళ్ల కొడుకు రేఖ్యాభుక్యా కరమ్‌తోట్ తండ్రి చితికి నిప్పు పెట్టాడు. లచ్మి, సావిలకు తోత్య చనిపోయిన దుఃఖంకన్నా, వంశం అభివృద్ధి చెందడానికి తోత్య కొడుకు రేఖ్యా, కూతుళ్లు వుండటం సంతోషం కలిగించింది. నానమ్మలతో పిల్లలు ఆడుకోసాగారు. చౌలి పిల్లలతోపాటు ఇక్కడే ఉండసాగింది. అయితే కాళ్య బాణోత్ "నా కూతురును పంపకపోతే నేను హైదరాబాదు నవాబుకు ఫిర్యాదు చేస్తాను" అన్నాడు. దేసు సౌమ్యంగా, సంయమనంతో "చూడు మామ, నీ కూతురు మా కోడలు. ఆమె అక్కడ ఉన్న ఒకటే. ఇక్కడ ఉన్న ఒకటే. ఆమె తన ఇష్టంతో వచ్చేటట్లయితే పిలుచుకొనిపో. మాకేమీ అభ్యంతరం లేదు. అయితే మా వంశపు మొలకలు వున్నాయికదా, అవి మాకు సంబంధించినవి. వాళ్లమీద చేయివేస్తే ఒక్కొక్కరి తల తీస్తాను" అని కరాఖండిగా చెప్పాడు. "ఎలా పెట్టుకుంటారో నేనూ చూస్తాను" అని భుజం మీదున్న తువ్వాలు తీసి విసురుగా దులిపి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఆరు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

దేసుకు అన్నీ అయోమయంగా ఉన్నాయి. తోత్య ఈ లోకాన్ని వదిలిపెట్టి ఆరేడు సంవత్సరాలు గడిచాయి. అతనికి పిల్లలు పుట్టిన విషయం కూడా తమకు తెలియకుండా కాళ్యబాణోత్ జాగ్రత్త పడ్డాడు. ఎందుకు ఆ మనిషి మనసు నిండా విషాన్ని నింపుకుని ఉన్నాడోనని దేసు ఒక్క క్షణం విచలితుడయ్యాడు. సొంత కూతురు, అల్లుడు, మనవడు, మనవరాళ్లు అనే ఆలోచన లేకుండా అందరినీ చంపటానికి పూనుకున్నాడు. అతని నీచత్వాన్ని తలుచుకున్నకొద్దీ దేసుకు అసహ్యం వేసింది. అయితే తన తమ్ముడిని కాళుబాణోత్, సాఖాలు బలి తీసుకున్నారనే విషయం లోలోపల అతన్ని నలిపివేస్తోంది. అది అతనిలో పగను పెంచింది. పగతీర్చుకోవడానికి సరైన సమయం కోసం ఎదురుచూడసాగాడు.

ఇల్లంతా సందడి చేస్తూ మనవళ్లు ఇద్దరు నానమ్మలలో సంతోషాన్ని కలిగించారు. చాలా సంవత్సరాల నుంచి అనారోగ్యం క్షీణిస్తున్న లచ్మి ఉన్నట్టుండి మంచం పట్టింది. "యా, ఎ, బా" (అమ్మ, నాన్న) అనే రెండు మాటలు పదే పదే ఆమె నోటి నుంచి వచ్చేవి. "సోమ్లా, మీ నాన్నను..." మాటలు పూర్తిగా ఆమె

నోటి నుంచి బయటికి రాలేకపోయాయి. ఏదో వ్యాపారం పనిమీద యాభై మైళ్ల దూరంలోని పట్టణానికి గుర్రంమీద పోయిన దేసుకు విషయం తెలపటానికి చోక్లతోపాటు ఇద్దరు మనుషులను పంపారు.

ఒకే చోటే పుట్టి పెరిగి ఇప్పుడు ఒక్కతే పోయిన లచ్మి ముందు కూర్చోని సావి చావుతో సరదాగా పోట్లాటకు దిగింది. 'కలిసి ఆడుకుని, పాడుకుని, పెళ్లి చేసుకొని, సంసారం చేసి, అంతా ముగించిన తర్వాత, ఇప్పుడు ఆమె ఒక్కదాన్నే తీసుకొనిపోతున్నావా? నీ ఈ అన్యాయాన్ని నేను అస్సలూ సహించను' అని అంటూ ఉంది. ఆమె కూడా ఏ క్షణంలోనైనా ప్రాణాలు వదలడానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది. అక్కతోపాటు రాజస్థాన్ నుంచి ప్రారంభించిన తన ప్రయాణాన్ని ఆమెతోపాటు ముగించడానికి నిర్ణయించుకున్నట్టుంది.

కొడుకు ముఖం ఒకసారి కళ్లల్లో నింపుకొని, రెండుచుక్కలు నీళ్లు తాగి, ప్రాణాలు వదలడానికి లచ్మి ఎదురుచూస్తోంది. 'ప్రాణం' జడమైన దేహాన్ని వదిలి వెళ్లడానికి సిద్ధంగా లేదు. ఊపిరిలో ప్రాణం లబ్‌డబ్ అంటూ ఆడుతోంది. ఆమెతోపాటు ప్రాణాలు వదలడానికి ఎదురుచూస్తున్న సావి తన గొంతులో గుటుకునీళ్లు వదలడానికి తన సంతానం లేదని గుర్తుచేసుకోవటంతో తీవ్రమైన దుఃఖం కలిగింది. కొడుకు తోత్య హత్య జరిగిన తర్వాత దేసు, సోమ్లు, చోక్లలలో ఎవరో ఒకరు నాలుగు ముద్దలు చేత్తో తినిపించినప్పుడు మాత్రమే ఆమె తినేది.

చుట్టుపక్కల ఉన్న గుడారాల జనం దేసు గుడారం ముందు చేరారు. మంచి వయస్సులో ఉన్నప్పుడే భర్తను పోగొట్టుకున్నా కొడుకు కోసం, కుటుంబం కోసం బతికింది లచ్మి. కొద్దిరోజులు థావు ఆశ్రయంలో ఉన్నప్పటికీ, భర్త బ్రతికి వున్నాడని, తప్పకుండా తిరిగివస్తాడనే నమ్మకంతో ప్రాణం బిగపట్టుకుని వుండేది. మరిది థావు ఘర్షణలో చనిపోయినప్పుడు, వంశంలో మిగిలివున్న వారికోసం బతుకు భారంగా ఈడ్చింది. జీవితంలోని ఒడిదుడుకులను చూసింది. ఆమెతోపాటు ఆమెచెల్లెలు సావికూడా సబాధలను అనుభవించింది. భర్త చావు, ఉన్న ఒకేఒక కొడుకు తోత్య, అతని హత్య... వీటన్నిటితో సావి పూర్తిగా కృంగి కృశించిపోయింది. రెండు సార్థకమైన జీవుల సుఖమైన మరణయాత్రకు తమ ఆచారవ్యవహారాల ప్రకారం నగారా, కంచుపళ్లెంతో దేవుడి ప్రార్థన కోసం ముందుకు వచ్చారు. చుట్టూ ఉన్న గుడారాల జనానికి దేసు తల్లి ఏ నిమిషంలోనైనా దేవుడి పాదాలు చేరవచ్చనే వార్తను చేర్చడానికి నాయకుడైన దేసు లేని కారణంగా, ఆ గుడారం కారబభారి, డావోలు పూనుకుని జనాన్ని నాలుగు వైపులా తరిమారు. రాత్రంతా **'వాజ',**

ఆడవాళ్లు ఒకవైపు పాడుతున్నారు. సోమ్లు భార్య భీమణి, మంగ్యా భార్య ఫక్కీరి అక్కడ చేరిన జనానికి చాయ్ కాచి ఇస్తున్నారు. చాప్ల, చోక్లలు నానమ్మల పక్కన కూర్చుని ఈగలు ముఖాల మీద కూర్చోకుండా చూసుకుంటున్నారు.

లచ్మి కనుమూసినపుడు ఎనభై సంవత్సరాలు. తండ్రి, చిన్నాన్నలు వ్యాపారం చేస్తూ పశ్చిమం నుంచి దక్షిణానికి బయలుదేరి వచ్చారు. జీవితంలోని సంఘర్షణను చాలా దగ్గరి నుంచి చూసిందామె. ఉరుము,మెరుపులు ఒకవైపు ఉంటే; భయంకరమైన సుడిగాలి, అడవి చిచ్చు మరొక వైపు. వాటితోపాటు భయంకరమైన జబ్బులు.వాటి నుంచి తప్పించుకొని బతకడమంటే యమధర్మరాజు చేతుల నుంచి తప్పించుకున్నట్టే. ఎవరి నుదుటిరాత గట్టిగా ఉందో వాళ్లు బతికిపోయారు. ఎవరి తలరాత తుడుచుకుపోతుందో వాళ్లు వెళ్ళిపోయారు. ఇది జనం నమ్మిన సత్యం. ఢిల్లీ బాదుషా హుకుంలా దక్షిణానికి వచ్చిన ఖాన్‌సాహెబ్‌గారి గుడారంలో పెరిగిన లచ్మి సమస్త జీవసంబంధమైన చింతలు వదిలి పరలోకానికి వెళ్లటానికి సిద్ధమైంది.

దేసుకు ఈ విషయం తెలిసినప్పుడు అతని కాలికింద నేల కుంగిపోయిన అనుభవం కలిగింది. అతని అస్తిత్వపు చివరిలంకె తెగిపోవటం అతను భరించలేకపోయాడు. అయితే ఇది అనివార్యం కూడా. అతనికి తల్లిమీద ఉన్న ప్రేమ ఆ ఆలోచనకు చోటు కల్పించింది.కానీ ప్రకృతి నియమాన్ని ఉల్లంఘించడానికి ఎవరికీ సాధ్యం కాదు. దేసు గుర్రం వేగంగా పరిగెడుతోంది. తల్లి చివరి క్షణాల్లో ఆమె పక్కన లేనుకదా అనే అపరాధ భావన అతన్ని వేధిస్తోంది. ఆమె చివరి మాటలు వినే అదృష్టం లేకపోవటంతో దుఃఖం పొంగుకు వచ్చింది.

అతను చేరేసరికి ఆకాశంలో వెండిచుక్క వచ్చింది. ఇంటిముందు గుర్రాన్ని వదిలేసి, “ఎయా, తాయి కాంయికేగియే మన్న” (అమ్మ, నాకు ఏమీ చెప్పకుండా పోయావా?) అంటూ గుండె లోపల అణచిపెట్టుకున్న దుఃఖాన్నంతా బయటపెట్టాడు. లచ్మి పెద్ద ప్రాణం వెళ్లిపోయింది. చిన్న ప్రాణం ఎక్కడో అటకాయించటంతో ఊపిరి తీసుకోవడానికి తపిస్తున్నప్పుడే దేసు వచ్చాడు. దేసు వచ్చినట్టు గ్రహించినట్టు భారంగా కళ్లు తెరిచింది. అతని ముఖాన్ని గుర్తించేటంత స్పృహ లేదు. చుట్టూ చేరిన జనం అతని చేత నాలుగు చుక్కల నీళ్లు తల్లి లచ్మిబాయి నోట వేయించారు. ఆ నీళ్లు గొంతులో దిగుతుండగానే కళ్లు నిస్తేజమై కళ్లలోని వెలుతురు కరిగి మాయమై వేకువజాము సూర్యుడి లేత కిరణాల్లో లీనమైంది.

తల్లి, తల్లిలాగే ప్రేమతో పెంచి పెద్దచేసిన ఆమె చిన్నమ్మ సావిని మరచిన దేసుకు ఉన్నట్టుండి గుర్తొచ్చి “కాకి...” అని అరిచాడు. గుడారం మరో మూలలో

సద్దులేకుండా ఆమె చిరమౌనంలోకి జారిపోయింది. “అయ్యో నువ్వు కూడా ఇలాగే వదిలి వెళ్లిపోయావా?” అని బిగ్గరగా ఏడవసాగాడు. మొత్తం గుడారం అంతటా ఏడుపులతో నిండిపోయింది. చుట్టుపక్కల ఉన్న డేరాల నుంచి బంధువులు, పెద్దలు, దగ్గరివారు అందరూ వచ్చారని ఖచ్చిత పరచుకొని, వాళ్లను దహనానికి అవసరమైన కట్టెలను తీసుకుని రావటానికి గొడ్డలి, కత్తి ఇచ్చి కొంతమంది యువకులను పంపారు.

అటువైపు రెండు పాడెలను తయారవుతున్నట్టే ఇద్దరికీ చివరి స్నానం చేయించి పడ్రేర ఫెటియా, కాంచళి, ఛాంటియా తొడిగించారు. (ధారచీర, రవిక, ధావణీ). ఇద్దరు తల్లులు ఒకేసారి చావులోనూ కలిసిపోయారు. జీవితాంతం తప్పొప్పులు, న్యాయాన్యాయాలు, మంచిచెడులను తెలియజేస్తున్న, దారిచూపిస్తున్న ఇద్దరూ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవటం దేసును కలచివేసింది. భరించడానికి అతని మనస్సు సిద్ధం కాలేదు. ఇద్దరి పాడెలకు భుజం ఇచ్చి వచ్చాడు. రెండు చితుల మీద పడుకోబెట్టిన తర్వాత వాళ్ల చితులకు అతనే నిప్పు అంటించాడు. చితి మంటలు జ్వాలగా మారి కాల్చుతున్నప్పుడు పొడువైన కర్రతో ఇద్దరి తలలకు ‘టీచో’ (తలను శాస్త్రీయంగా కట్టెతో ముట్టడం) ఇచ్చే శాస్త్రం పూర్తిచేశాడు. సోమ్లు, చొక్లలు ముందు నిలబడి అన్ని కార్యక్రమాలను ముగించారు.

❖❖❖

3. తెల్లవాడి రాక

దేసు తల్లిని పోగొట్టుకొని అనాథ అయ్యాడు. ఇప్పుడు జగత్తుతో అతనొక్కడే పోరాడవలసి ఉంది. ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే మొదట తల్లిని అడిగేవాడు. తర్వాత చిన్నమ్మను అడిగేవాడు. వాళ్లు ఊఁ అంటేనే ముందుకు సాగేవాడు. ఒకవేళ వాళ్లు వద్దంటే వాళ్లకు అర్థమయ్యేలా నచ్చజెప్పి, అందులోని సాధకబాధకాలను వివరించిన తర్వాత వాళ్లూ ఒప్పుకోవలసి వచ్చేది. ఇప్పుడు అన్నీ అతని తలమీద పడటంతో భారం అనిపించసాగింది. ఇంటి నిండా పిల్లలు, పెళ్లి కావలసిన నలుగురైదుగురు వయసులో ఉన్నవారు, బాధ్యత పెరిగింది. వ్యాపార వ్యవహారాలలో కొరత ఉంది. అతని మనుషులకు పనిలేకుండా పోయింది. వాళ్లకు కూలీ ఇవ్వటం కష్టమైంది. అప్పుడే ఢిల్లీ సుల్తాను దగ్గర వ్యాపారం కోసం తెల్లవాళ్లు వచ్చారు 'ఏమి వ్యాపారం చేస్తారని' సుల్తాను అడిగారట.అదేదో ఇంగ్లీషు భాషలో All Business (అన్ని వ్యాపారాలు) అన్నారట. 'పెట్టుబడి ఉందా?' అని మళ్లీ ఆయనే ప్రశ్నించినప్పుడు, 'మాదేమీ ఉండదు. మీ సరుకు కొంటాం. మీకే అమ్ముతాం. వచ్చిన లాభంలో మీకు భాగం ఇస్తాం' అన్నారట. తర్వాత తెల్లవారు ఏదో విధంగా భారతదేశంలో అడుగుపెట్టారు.

1600 సంవత్సరంలో ఆ జనం భారత దేశంలో ప్రవేశించారు. వార్తలప్రకారం ఢిల్లీ వైపు నుంచి వ్యాపారానికి వచ్చేటటువంటి జనం దక్షిణంవైపు వ్యాపించారు. తెల్లవాళ్లు చాలా బుద్ధిమంతులు. మన దేశంలో వ్యాపారం పేరిట కాలుపెట్టినవారు. ఇక్కడే ఉండాలనే అభిప్రాయంతో వచ్చినట్టు తెలుస్తోంది. వామనుడు బలిచక్రవర్తిని మూడవ పాదం పెట్టడానికి స్థలం అడిగినట్టే తెల్లవాళ్లు వ్యాపారంపేరిట ప్రవేశించి బలిని వామనుడు తొక్కినట్టు వీళ్లు బెంగాల్‌ను తమ స్వాధీనంలోకి తీసుకొని పాలించడం ప్రారంభించారు.

పరివర్తన గాలి మెల్లగా వీచసాగింది. తెల్లవాళ్లు వ్యాపారంలో చాలా

ముందున్నారు. వాళ్లు లాభానికి ఎవరినైనా వాడుకుని చివరికి వారి గొంతు కోసేటటువంటి మనుషులు. భారతదేశం భూమార్గమంతటా చాలా మంది బంజారాలు సంచరించి సందులుగొందులు వదలకుండా వ్యాపారాలు చేశారు. వాళ్లకు వివిధ ప్రాంతాలకు వెళ్లవలసిన మార్గాలు తెలిసి ఉండటంతో బంజారాలను తెల్లవాళ్లు పనుల్లో పెట్టుకున్నారు. ఢిల్లీలో లక్కిసా బంజారా ఢిల్లీసుల్తాన్ పాలనా సమయంలో లక్ష ఎద్దులతో వ్యాపారాన్ని ప్రారంభించాడు. అతని వ్యాపారం చూసిన బాదుషా ఢిల్లీ జమీనులోని సగం స్థలాన్ని అతని పేరిట రాసిచ్చాడు. వ్యాపారంలో అతను ఉచ్ఛస్థితిలో వున్నప్పుడే బాద్‌షాకు సిక్కుల గురు గోవిందసింగ్‌కు మధ్య జరిగిన యుద్ధంలో బాద్‌షా గోవింద్‌సింగ్‌ను చంపి అతని దహన సంస్కారం చెయ్యడానికి వీలుకాకుండా అతని పార్థివ దేహాన్ని దొరకకుండా చేయాలనే ఆలోచనలో ఉన్నాడు. విషయం ఎలాగో లక్కిసా బంజారాకు తెలిసింది. పత్తి నిండిన చక్రాల బండ్లు చాందిని చౌక్ నుంచి దుమ్ము లేపుతూ పరిగెత్తాయి. అక్కడ ఎగిసిన ఎర్రటి దూళి మొత్తం ఢిల్లీని కమ్ముకుంది. బంజారా చావడి పూర్తిగా కనిపించకుండా పోయింది. ఈ సమయం కోసం ఎదురుచూస్తున్న లక్కిసా ఎక్కిన గుర్రం ఎద్దుల బండ్ల నడుమ దూరింది. ఔరంగజేబుకు వ్యక్తిగత వ్యాపారి అయినప్పటికీ లెక్కచేయకుండా, గురు గోవింద్ సింగ్ కళేబరాన్ని పత్తి నింపిన బండిలో వేసుకుని, గోవింద్‌సింగ్ రుండము-మొండములను తీసుకుని గుర్రం మీద దౌడు తీశాడు. సైనికులు వెంటబడటంతో ఢిల్లీ బంజారా చావడి ప్రదేశంలో ఉన్న తన ఇంట్లో పిల్లాజెల్లా ఉన్నప్పటికీ లెక్కించకుండా గురుగోవిందసింగ్ అంత్యక్రియల కోసం ఇంటికి నిప్పు పెట్టాడు. దాంతో లక్కిసా బంజారా బాద్‌షా కోపానికి గురయ్యాడు. అటుతర్వాత అతని వ్యాపార వ్యవహారాలు అంతగా ముందుకు సాగలేదు. అయితే సిక్కులకు బంజారాలతో ప్రత్యేకమైన బాంధవ్యం పెరిగింది. లక్కిసా బంజారా జమీను క్రమంగా ఢిల్లీ సుల్తాను వశమైంది. అటు తరువాత వచ్చిన తెల్లవాళ్లు ఆ స్థలాన్ని సొంతం చేసుకున్నారు.

కలకత్తా నవాబ్ మీర్ జాఫర్ ఫిర్యాదు మేరకు డూప్లె అనే వ్యక్తి బ్రిటిష్ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు భారత్‌లో ఉన్న బ్రిటీషర్లకు నాయకుడయ్యాడు. తర్వాత భారతీయుల చరిత్రను తెలుసుకొని ఒక అధ్యయనం చేశాడు. అంతేకాదు ఇక్కడి కులవ్యవస్థను సరిగ్గా అర్థం చేసుకున్న బ్రిటిషులు విభజించి పాలించాలనే నీతితో ఉత్తరం నుంచి దక్షిణం వరకు చాపకింది నీరులా కదులుతూ ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టు రాజ్యాలను, సామ్రాజ్యాలను కబళిస్తూ భారతదేశంలో బ్రిటిష్

ఆధిపత్యాన్ని స్థాపించడానికి పూనుకున్నారు. భారత్ అంతగా పరిచయం లేని కారణంగా వారికి దారి చూపించడానికి జనం కావాలి. అప్పుడు వాళ్లు ఉపయోగించుకున్నది బంజారాలనే.

కొన్ని సందర్భాల్లో బంజారాలకు బ్రిటీషర్లకు మధ్య గొడవలు జరిగాయి. గుజరాత్, రాజస్థాన్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన బ్రిటీషర్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి నేతృత్వం వహించిన గురుగోవింద్ బంజారా, మీనా, ఇంకా అనేక ఆదివాసీలను ఒక చోట చేర్చి పోరాటాన్ని ప్రారంభించారు. "చూడండి మనం ఈ నేల మూలవాసులం. ఈ నేల మన తల్లి. ఈ మట్టితో మన భావనలు కలిసిపోయాయి. ఈ అడవి, కొండలు, కోనలూ అన్నీ మనవి. అయితే నిన్నమొన్న వచ్చిన ఈ తెల్లవాళ్లు మన మీదే అధికారం చేయడానికి ప్రయత్నించడం సరైనది కాదు". ఆదివాసీల దండు తమ అస్తిత్వం కోసం పోరాటాన్ని ప్రారంభించింది. "తాము అనుమతిస్తే తెల్లవాళ్లను వాపస్ పంపటం పెద్దపని కాదు. ఇప్పుడే వాళ్లను..." మీనా రోషాన్ని ప్రదర్శించాడు. గోవింద బంజారా ఇలాంటి అనేకమంది వేడి రక్తపు యువకులను ఒకచోట చేర్చాడు. సరైయిన రోజున, సరైన సమయం కోసం ఎదురు చూడసాగాడు. బ్రిటిషులు అడవిని ఆశ్రయించుకుని బతుకుతున్న అనేకమందిని హింసించడం ప్రారంభించారు. ఆదివాసీలను అనవసరంగా గూఢచారులుగా భావించి చిత్రహింసకు గురిచేయసాగారు. అనేకమంది ఆదివాసీలను నిర్దయగా హత్యచేశారు. దీనివల్ల ఇతర ఆదివాసులలో భయం పుట్టించి, బ్రిటిషులను ప్రభువులుగా అంగీకరించేలా చేసే తంత్రం ఇది. వీటన్నిటినీ గమనించిన వీర గోవిందసా బంజారా పోరాటాన్ని ఆరంభించాడు. ఎక్కడ కనిపిస్తే అక్కడే తెల్లవాళ్లను ముగించే ప్రణాళిక వేసుకున్నాడు.

బ్రిటిషులు బంజారాల హింసను భరించలేక సుసజ్జితులైన ఒక పటాలాన్ని పోరాట ప్రదేశానికి పంపించారు. అడవిలోపల దాక్కొని యుద్ధం చేసే ఆదివాసీల దగ్గర కేవలం కత్తులు, గొడ్డళ్లు మొదలైన ఆయుధాలు ఉన్నాయి. అంతేకాకుండా వాళ్లు సీదాసాదా మనుషులు. సూటిగా దాడి చేసేవారు. అయితే చురుకుగా వున్న తెల్లవాళ్లు సుసజ్జిత అస్త్రశాస్త్రాలను పొందివుండటమే కాకుండా, యుద్ధ కౌశల్యాన్ని తెలిసినవారు. గోవింద బంజారా ఆదివాసి సైన్యంతో పోరాటానికి దిగారు. దట్టమైన అడవిలో బ్రిటిషులు అడగుపెట్టడం కష్టమైంది. గోవింద బంజారా శత్రుసైనికులు ఎలా దాడిచేస్తారో అధ్యయనం చేశారు. వాళ్ల గుంపులోని ఒక ఆదివాసిని పట్టుకొని ఆశ చూపించి తమ ప్రణాళికను మార్చుకున్నారు. ఆ సైన్యానికి సేనాధిపతి అయినా

బ్రిటిష్ కెప్టెన్ బ్లేర్ "వాళ్లను నాశనం చేయండి" అని ఆజ్ఞాపించాడు.

గోవింద బంజారా ఆదివాసీలతో, "వీరులారా! ఇది మన మాతృభూమి అస్తిత్వపు ప్రశ్న. మనల్ని ఈ జనం వదలరు. మన మనుగడ కోసం పోరాడక తప్పదు. మనం గెలిస్తే ఈ దేశం తెల్లవాళ్ల నుంచి విముక్తి పొందుతుంది. ఒకవేళ మనం ఓడిపోతే వారి ప్రాబల్యం ఈ దేశంలో మరింతగా పెరుగుతుంది. అందువల్ల మీలో చివరి ఊపిరి ఉన్నంత వరకు పోరాడండి. జై బోలో భారత్ మాతాకీ! ఆదివాసి దేవికీ!" అని వాళ్లల్లో ఉత్సాహాన్ని రగిలించాడు.

ఆదివాసి యోధులలో ఆవేశం నిప్పులా ఎగిసింది. చెట్లుచేమలను, ముళ్లతీగలను లెక్కపెట్టకుండా తెల్లవాళ్ల తలలు నరకడానికి ముందుకు దూకారు. దురదృష్టం ఏమిటంటే గోవింద బంజారా వాళ్ల కుతంత్రాన్ని గుర్తించలేదు. వీళ్లు దాక్కున ప్రదేశం చుట్టూ తెల్లవాళ్లు నిలబడి తుపాకితో గుండ్లు పేల్చసాగారు. అయినా ధైర్యం కోల్పోని ఆదివాసి సైనికులు తప్పించుకొని దొరికిన తెల్లవాళ్ల తలలను నరికారు. అయితే తెల్లవాళ్ల ఆధునిక ఆయుధాలు, యుద్ధకౌశల్యం ఎదుట పాతకాలపు యుద్ధరీతులు ఓడిపోయాయి. నిప్పుకు కాలిపోయి చుట్టూ రాలిన ఎర్ర చీమల్లా ఆదివాసీలు పొదలలో పడ్డారు. గోవిందా బంజారా కూడా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. బ్రిటిష్ బలగాల శక్తిసామర్థ్యాల ముందు ఏమి చేయడానికి కుదరదని అనేక చిన్నచిన్న పాలెగాళ్లు, పెద్ద పెద్ద రాజపుత్ర రాజులు, ఢిల్లీ సుల్తాను కూడా లొంగిపోయాడు. గోవింద బంజారా ఓడిపోయినప్పటికీ ఆ పోరాటంలో బ్రిటిషులకు చాలా నష్టం కలిగింది. దాంతో బంజారా అనగానే బ్రిటిషులు మండిపడసాగారు. ఎలాగైనా వీళ్ల వ్యాపారాన్ని సర్వనాశనం చేయాలన్నది వారి ఉద్దేశం. అందుకోసమే కొంతమందిని వాళ్ల కదలికను గమనించడానికి నియమించారు. అంతే కాకుండా వాళ్లు చేసే వ్యాపార వ్యవహారాలు, వారి అస్తిత్వపు మూలాన్ని వెదకసాగారు.

అక్కడ వీచిన గాలి దక్షిణాన కూడా తాకింది. గోవింద బంజారా ఓటమి తర్వాత 1860లో బ్రిటిషులు అటవీ చట్టాన్ని జారీ చేశారు. దాని ప్రకారం అడవిని ఆశ్రయించిన అనేక తెగల ఆదివాసీలను అడవి నుంచి బయటికి తరిమే ప్రయత్నం చేశారు. 1860లో చట్ట ప్రకారం అడవి ప్రభుత్వపు సొత్తు అయింది. అక్కడ దొరికే అన్ని సంపదలు ప్రభుత్వానికి చెందాయి. అందువల్ల పశువులను మేతకోసం అడవుల్లో తీసుకునివెళ్లటాన్ని నిషేధించారు. పేదఆదివాసీలు తేనె, దుంపలు, బంక, కట్టెలు, కస్తూరి, పళ్లు, కాయలు ఉపయోగించుకుంటూ బతికినవారిని అడవి నుంచే

బహిష్కరించడం వలన పూర్తిగా అడవిని అవలంబించిన బంజారాల కష్టాలు ఏమని చెప్పాలి? బంజారుల పశువులు, వ్యాపారాలకు వాడుతున్న ఎద్దులు అడవిలో మేతమేస్తూ ఉండేవి. వాటిని నిషేధించడం జరిగింది. రేగుపళ్లు, కవళ పళ్లు, విస్తర్లు కుట్టడానికి ఉపయోగించే మోదుగ ఆకులను కోసి వాటిని అమ్ముకుని జీవితాన్ని సాగిస్తున్న అత్యంత బీదవారి జీవితాలు నరకం అయ్యాయి. అడవి దారిగుండా ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి ప్రయాణం చేయడం ఆగిపోయింది. ఈ ప్రతికూల స్థితి నుంచి బంజారాలు తత్తరించిపోయారు. అది చాలదన్నట్టు కాస్త చట్టాన్ని ఉల్లంఘించారో లేదో వాళ్లను పట్టుకొని నోటిఫైడ్ జనాంగమని నుదుట పట్టికట్టి నేరస్థుల సముదాయానికి చేర్చి వారిమీద ఆ చట్టాన్ని బలవంతంగా మోపడం జరిగింది.

అప్పట్లో దక్షిణంలో బలిష్టంగా ఉన్నది శ్రీరంగపట్టణం మాత్రమే. హైదర్ అలీ మైసూరు సంస్థానంకు లొంగకుండా స్వతంత్రంగా శ్రీరంగ పట్టణంలో తన రాజ్యాన్ని స్థాపించడమే కాకుండా చుట్టుపక్కల ఉన్న పాలెగాళ్లను, సామ్రాజ్యాధి పతులను ఓడించి శ్రీరంగపట్టణాన్ని బలిష్టమైన శక్తిగా రూపొందించడానికి పూనుకున్నాడు. దక్షిణం వైపు బయలుదేరిన తెల్లవారికి శ్రీరంగపట్టణం అడ్డుగోడలా కనిపించింది. వారి దృష్టి కూడా ఆ గోడను పడద్రోసే వైపు మళ్లింది. హైదర్ ఆలీకి ధాన్యపుగింజలను సరఫరా చేస్తున్నా బంజారాల మీద బ్రిటిష్‌వారి ఆగడాలు తగ్గలేదు. మొదట్లో ముస్లిముల హింస, తర్వాత బ్రిటిషు దుష్టపాలన వల్ల విసిగిపోయిన బంజారాలు దక్షిణంవైపు వలసపోయారు వాళ్లంతా ఒక స్థలానికి వచ్చి చేరారు.

అది కొప్పళకు చెందిన 'బహద్దూర్ బండ' అనే ప్రదేశం. బ్రిటిషులు 'నేరస్థుల తెగ'గా పేరు పెట్టి అడవిలో ప్రవేశం నిషేధించడం కాకుండా, చట్టాన్ని తీవ్రతరం చేసి బంజారాలు ఎక్కడ ఉన్నప్పటికీ వాళ్లు పిలిచినప్పుడు వాళ్లు వచ్చి హాజరు కావాలని నిబంధన పెట్టారు. అంతేకాకుండా వారానికి ఒకసారి వేలిముద్రవేసే నెపంగా పిలిపించి హింసించసాగారు. ఈ హింసలన్నిటికి వ్యతిరేకంగా ప్రతిఘటించడానికి సుమారు 24, 25 గుడారాల నాయకులు సభను ఏర్పాటు చేయటం జరిగింది. దక్షిణానికి వచ్చే ప్రతి బంజారాకు 'బహద్దూర్ బండ' ఒక రహదారి అయింది. బ్రిటిషువారి హింసలు భరించలేని బంజారాలు సమస్య పరిష్కారానికి మార్గోపాయాన్ని కనిపెట్టే సభ అనే ఆ జనం భావించారు. చారిత్రికంగా ఈ సభ చాలా గొప్పది. సాంస్కృతికంగా చాలా ముఖ్యమైనది. 'భుక్యా', 'జాత్' అనే రెండు తెగల నాయకులు ఇక్కడ చేరారు. సభకు వచ్చిన వారిని ఉద్దేశించి దేసుభుక్యా

కరమ్‌తోట్ మాట్లాడుతూ, "హ రామ రామ రామ పంచ పంచాయితి రాజ జోజేర సభా, పచేర్‌లాక్, బన్ పచారె సవాలాక్ సగళ సభా ఆనంద చ కాయిబా" (ఇక్కడ సమావేశమైన మీ అందరికీ శూభాశయాలు. భోజరాజు సభలో గొప్ప జనం చేరినట్టు ఇక్కడ చేరిన మీ అందరికి స్వాగతం. అందరు సౌఖ్యంగా ఉన్నారా?) అని అందరిని ఉద్దేశించి అన్నాడు. "ఆనంద్ వా బాపూ, ఆనంద వా" (బాగున్నామయ్యా బాగున్నాం)అని సభలోంచి కేకలు వినిపించాయి. మరొక నాయకుడు, "మనకు వచ్చిన ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి, పరిష్కారం కనుక్కోవడం మన మొదటి ప్రాధాన్యత కావాలి" అన్నాడు. బ్రిటిష్‌వారి నుంచి కలుగుతున్న తలనొప్పికి నివారణోపాయం కనుక్కునే కోణంలో మాట్లాడాడు. మూడ్ తెగకు చెందిన వృద్ధనాయకుడు ఒకడు లేచి "ఈ తెల్లజనం పీడన అంత సులభంగా మనల్ని వదిలేలా కనిపించడం లేదు. గొప్పగొప్ప సామ్రాజ్యాలనే ధ్వంసం చేసి మొత్తం మన దేశాన్ని కబళించడానికి వచ్చిన వీళ్లనుంచి మనం తప్పించుకోవడం అసాధ్యం" అని అనుమానాన్ని వ్యక్తపరిచాడు. వడ్త్యా నాయకుడొకడు లేచి "అలాగైతే దీనికి పరిష్కారమే లేదా?" అని ప్రశ్నించాడు. కొర్రా తెగ నాయకుడు "చూడండి, బయటనుంచి వచ్చిన మన శత్రువులు చాలా తెలివైనవాళ్లు. మనకన్నా అన్ని విషయాల్లో చాలా ముందున్నారు. మనం వారితో ఒప్పందం చేసుకుని ఎందుకు ప్రశాంతంగా బ్రతకకూడదు?" అని ఒక సూచనను వారి ముందు పెట్టాడు. చాలామంది నాయకులు ఒక్క గొంతుకతో "ఛీ... ఛీ...అది అసాధ్యం. ఆ కొడుకులకు మనమెందుకు గులాములు కావాలి? వద్దు" అని అరిచారు. చాలా బుద్ధిమంతుడిలా లేచి నిలబడ్డ వడ్త్యానాయకుడు, "ఇప్పుడేం చేద్దాం?" అని కూర్చున్నాడు. అక్కడ చేరిన జనం గొల్లుమని నవ్వారు.

బంజారాలు ఏర్పాటు చేసిన ఈ సభ గురించి బ్రిటిష్‌వారికి అనుమానం వచ్చింది. బ్రిటిష్‌వారి బుర్రలు పనిచేశాయి. వీళ్లు సభ పెట్టి, జనాన్ని రెచ్చగొట్టి తమకు వ్యతిరేకంగా ప్రతిఘటించే ప్రయత్నాలు చేయకూడదనే ముందు జాగ్రత్తతో 'బహద్దూర్ బండ' సభను పరిశీలించడానికి వచ్చారు. సభకు ఆహ్వానం అన్నట్టు రంగులు తెచ్చిన నాయకులు తెల్లవారి ప్రవేశానికి సరిగ్గా హోలీ పండుగను ఆచరించసాగారు. అప్పటికే 'బహద్దూర్ బండ'లో అనేక విషయాలు చర్చించబడ్డాయి. ముఖ్యంగా బంజారాల శత్రువులు బ్రిటిషులు. భారత్‌లోని అన్ని ప్రాంతాలలో వారికి రాజాశ్రయం దొరికేది. ఎందుకంటే వారి చిన్నచిన్నఅభ్యర్థనలను రాజులు తీర్చేవారు. దక్షిణంలో ప్రబలంగా పెరుగుతున్న హైదర్ అలీకి బంజారాలు సహాయం

చేస్తున్న విషయం తెలిసి బ్రిటిషులు బంజారాలను మరింత తీవ్రంగా హింసకు గురిచేశారు. అయితే బహద్దూర్ బండలో జరిగిన 24 గుడారాల నాయకులు సభ చారిత్రకంగా అత్యంత ముఖ్యమైనది. అది బంజారాల భవిష్యత్తు ప్రణాళికను నిర్ణయించింది.

దేసుభుక్యా కరమ్‌తోట్ విచలితుడయ్యాడు. రోజురోజుకు మారుతున్న పరిస్థితి అతని ఆలోచననే తలకిందులు చేసింది. ఒక్కొక్కసారి వ్యాపారానికి పోయిన ఎద్దులను తెల్లవాళ్లు జప్తిచేసి కొట్టేవారు. వ్యాపారం వదిలిపెట్టాలో లేదా కొనసాగించాలో ఏది అర్థం కాకుండాపోయింది. సోమ్లు భుక్యా కరమ్‌తోట్, చోక్ల భుక్యా కరమ్‌తోట్, ఇద్దరు తండ్రి మనసులో జరుగుతున్న అల్లకల్లోలాన్ని అంచనా వేయసాగారు. “నాన్న మీ బాధ అర్థమవుతోంది. సంసారం పెద్దదయింది. ఆదాయం తగ్గిపోయింది. మేమంతా వ్యాపారంతోపాటు చిన్నచిన్న ఉద్యోగాలు ప్రారంభిస్తాం” అని చోక్ల అన్నాడు. అతని మనసులో ఏముందో తెలుసుకునే కుతూహలం దేసుకు కలిగింది. “ఏమి ఉద్యోగం చేస్తావు నాయనా?”అని అడిగాడు. “నేను సారాయి భట్టి వేయాలని ఆలోచిస్తున్నాను” అని తండ్రి ముఖం చూశాడు. దేసు ముఖం వాడిపోయింది. “అది కాదురా. ఇది బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకం కదా? ఎందుకు అనవసరంగా సమస్యలు కొనితెచ్చుకుంటావు?” అన్నాడు. “నువ్వు ఏమీ ఆలోచించకు. ఆ సేవాబాయ్ ఎలా చేస్తే అలా జరగనీ” అని చోక్ల తన నిర్ణయాన్ని తెలియజేసి వెళ్లిపోయాడు. సోమ్లు అతన్ని ఆపటానికి ప్రయత్నించాడు. “ఊఁ పోనీలే” అని దేసు సైగ చేశాడు. సోమ్లా తాను కట్టెల వ్యాపారం, బొగ్గుల వ్యాపారం చేయాలని ఆలోచించాడు. పిల్లలను వారు స్వయంగా నిర్ణయం తీసుకోవడానికి వదిలి, మౌనంగా పరివర్తనా సుడిగాలిని గమనించసాగాడు. అదే సమయంలో చుట్టుపక్కలున్న అనేక గుడారాల మీద బ్రిటిష్ సైనికులు దాడి చేసి, గుడారాలను ధ్వంసం చేసి జనాలను తరిమికొట్టారు. ఏమి చేయాలో తోచక దేసు దగ్గరికి వాళ్లంతా పరిగెత్తుకొచ్చారు. దేసు కూడా బ్రిటిషువారి నుంచి అనేకసార్లు ఇబ్బందులు అనుభవించాడు. “ఈ తెల్లవాళ్ల హింస భరించలేకపోతున్నాం. వ్యాపారం వద్దు. ఏమీ వద్దు. చల్లగా ఇంటిలో ఉండడమే మంచిదని అనిపిస్తుంది” అని విషాదంగా అన్నాడు. “అది కాదు నాయకా, మీరే ఇలాగంటే మా గతి ఏమిటి? మన ముందరి జీవితం ఏమిటి? పిల్లల భవిష్యత్తు ఏమిటి?” అని జనం తమ విచారం వ్యక్తపరిచారు. “మన దగ్గర ఉన్నది ఒకే మార్గం” అని గంభీరంగా అన్నాడు. “అది ఏమిటంటే ఒకటి, మనం ఏ దిక్కు నుంచి వచ్చామో, అదే దిక్కులో వెళ్లి బతుకు తెరువు వెతుక్కోవడం. ఇక్కడ వర్షాలు

లేవు, అడవులు లేవు, గడ్డి లేదు, జనం బతుకే దుర్భరంగా మారింది. అక్కడి జనంలా కూలీ నాలీ చేసుకుని, పొలాలలో కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటూ జీవితాన్ని సాగించవచ్చు. కొంతమంది అవును ఇది సరైనదని అంగీకరించి వెళ్ళిపోయారు. ఇంకా కొంతమందికి ఏమీ అర్థంకాక "అది కాదు నాయకా, మాదగ్గర ఏమీ లేదు. అదేమో సామెత అంటారు కదా! 'చేతిలో డబ్బులు లేవు, ఒంట్లో ఆరోగ్యం లేదు' అని. అలా అయ్యింది మా జీవితం" అని అయోమయంగా దేసు ముఖం చూశారు. "అదికాదయ్యా, మన పరిస్థితి ఎలా వుందంటే కొత్త నీటి వెంబడి పారే నదిలోని చేపల మాదిరి మనమంతా కొత్త జగత్తు వైపు సాగుతున్నాం. ఇప్పుడు తిరిగి మనం వెనక్కు వెళ్లటం కుదరదు. ఎందుకంటే తెల్లవాళ్ల ప్రభుత్వం. అడవిలో కాలుపెడితే తలతీస్తారు. అడవిలో ప్రవేశిస్తే ఆడవాళ్ల సమేతంగా మనల్ని తెలియని ఏదో జైల్లో వేసి, తాళం వేసి మన జీవితాలను నరకం చేస్తారు. ఇక్కడికి వచ్చాం. ఇక్కడే చావాలి" అంటూ ఒక స్పష్టమైన చిత్రాన్ని వాళ్ళ ముందు పెట్టాడు. "ఓహో నీవు చెప్పేది నిజమే అన్నా. మేము వస్తాను" అని అమాయకులైన ఆ జనం పరిస్థితులను అర్థం చేసుకుని వెళ్లిపోయారు. బయటి శత్రువు, లోపలి శత్రువు ఇద్దరి నుంచి వాళ్లకు పెద్ద ప్రమాదమే పొంచి ఉంది.

గుడారం మీద తెల్లవాళ్ళు దాడి చేసి ఆడవాళ్ళను, పిల్లలను తరిమారు. దేసుకు కాళ్ల కింది నేల నోరు తెరుచుకున్నట్టయింది. సోమ్లు, చోక్ల, మంగ్ల్యా, చాప్ల అందరినీ లాక్కుపోయి జైల్లో వేశారు. వారందరినీ విడిపించడానికి అతను పోరాటం జరపాలి. గుడారం అంతటా ఆకలితో కేకలు పెట్టే మనవళ్లు. వ్యాపారం ఆగిపోయి చాలా రోజులయ్యాయి. ఉన్నదాంట్లోనే రొట్టెనో, గంజో తాగి కాలం గడుపుతున్న కుటుంబ సభ్యుల బాధలు చెప్పలేం. సోమ్లు కొడుకు ధనసింగ్ ఆడుకునే వయసు పిల్లవాడు. తెల్లవాళ్లు పిల్లవాడని కూడా కనికరం చూపకుండా ఆ పిల్లవాడిని కొట్టి పోయారు. దేసుకు పేగులు చురుక్కుమన్నాయి. తాను ఏడిస్తే ఇంటివాళ్లు భరించలేరని తన కోపాన్ని, దుఃఖాన్ని తనలోనే దాచుకున్నాడు. అప్పటికప్పుడే తన వ్యాపారానికి అప్పుగా నాణేలు ఇస్తున్న హిరెనంది పరసప్ప దగ్గరికి పోయాడు. తనకు వచ్చిన కష్టాన్ని చెప్పుకొంటే ఆయన సహాయం చేస్తాడనుకున్నాడు. "ఏమయ్యా నాయకా, ఇటువైపు వచ్చావ్? ఏమిటి సమాచారం? తెల్లవాళ్ల పీడ మితిమీరింది. ఏదో వ్యాపారం చేసుకునేవాళ్లం. ఇప్పుడు ముక్కాలు భాగం ఆ కొడుకులకు ఇవ్వాలి. ఊఁ నీ కథ ఏమిటప్పా?" అని అడిగాడు. దేసుకు అప్పటికే వయసు దాటింది. మారుతున్న పరిస్థితులతో పోరాడటానికి శక్తిలేకుండా పోయింది. కళ్లనుంచి నీళ్లు కారుతున్నాయి.

మాటలే బయటికి రాలేకపోయాయి. ఎంతైనా దేసు భుక్యాను చాలా దగ్గర నుంచి చూసినవాడు పరసప్ప. ఇతను మా మనిషి అని అతనికి అనిపించింది. ఎప్పుడూ ధైర్యంతో, సత్యనిష్టను పాలించే దేసు ఇలా ఆడవాళ్ల మాదిరి ఏడుస్తూ ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు పరసప్ప. "నాయకా, ఛ, ఏమైంది? నేనున్నాను. చెప్పు. నిన్ను చూసి ధైర్యం నేర్చుకున్నవాడిని. ఈ దట్టమైన అరణ్యంలో భయం లేకుండా ప్రయాణం చేసి నా సామాను సరంజామాను హైదరాబాద్ వరకు సాగించినవాడివి. నీవే ఇలా ఏడిస్తే మా మా గతి ఏమిటో చెప్పు?" అని అతన్ని ఓదార్చాడు. "ఏమి చెప్పను స్వామి. తెల్లవాళ్లు మా గుడారాలను ధ్వంసం చేసి, ఆడవాళ్లను, పిల్లలను కొట్టి, మా నలుగురి కొడుకులను పట్టుకొనిపోయారు" అని దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చాడు. పరసప్ప ముఖం వాడిపోయింది. "అది కాదు, నిన్న మొన్న వచ్చిన ఈ లంజా కొడుకులు ఎంత హింసలు పెడుతున్నారు కదా" అని ఒక ఘడియ ఆలోచించాడు. అతనికి ఏమి స్ఫురించిందో "పదా, గుర్రం ఎక్కు" అంటూ గుర్రమెక్కి కొప్పళ సరిహద్దులో మకాం పెట్టిన తెల్లవాళ్ల అధికారి దగ్గరికి పిలుచుకుపోయాడు.

సోమ్లు, చోప్ల, మంగ్యా, చాప్లలే కాకుండా గుడారాలలోని చాలామంది బంజారాలను ఖైదీలుగా బంధించడం జరిగింది. వారికి తిండి పెట్టకుండా, నీళ్లివ్వకుండా కట్టెలు కొట్టడానికి నియమించారు. పరసప్పను చూడగానే, "పరసప్పా, వాట్ పరసప్ప?" అని బ్రిటిష్ అధికారి రాబర్ట్ మసలిన్ అడిగాడు. పరసప్ప కన్నడలోనే ఏమేమో విషయం చెప్పాడు అయితే అతనికి అదంతా అర్థం కాలేదు. రాబర్ట్ మసలిన్ కన్నడ–ఇంగ్లీష్ మాట్లాడుతున్న బట్లర్‌ను పిలిచి "ఏమిటి విషయం మిస్టర్ బట్లర్. వై దె హావ్ కమ్" అని అడిగాడు. "మై లార్డ్, దే హావ్ సమ్ ప్రాబ్లమ్స్" అతను తన ఇంగ్లీషు పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ మొత్తం సారాంశాన్ని ఇంగ్లీషులో వివరించాడు. ఆ అధికారికి ఏమీ అర్థం అయిందో, ఇతను అతనికి ఏమని కమ్యూనికేట్ చేశాడో పరసప్పకు, దేసుకు ఏమీ అర్థం కాలేదు. అయితే అధికారి మాత్రం చోక్లా, మంగ్యాలను వదలడానికి ఒప్పుకున్నాడు. దేసు భుక్యా ఆ నిర్ణయానికి కుంగిపోయాడు. సోమ్లు, చోక్ల ఇద్దరే తన వంశపు పరంపరను ముందుకు కొనసాగించగలరనే నమ్మకం ఉండేది. అయితే వారు జైల్లో కుళ్లిపోయే పరిస్థితి వచ్చింది. వాళ్ల భవిష్యత్తు గురించి మనసులో భయం ఏర్పడింది. పరసప్ప ఓదార్చాడు. "చూడు దేసు, ఈ జనం మనల్ని పాలించడానికి వచ్చారు. అది నిజం. అయితే

వారికి మన సంపద మీద కన్నుంది. నీవు ఏమి చింత చేయకు. ఇంట్లో బంగారు నాణేలు ఏమైనా ఉంటే తీసుకొని రా. అవి చూస్తే నోరు మూసుకుంటాడు" అని మర్మాన్ని చెప్పాడు. "అయ్యో స్వామీ, మా దగ్గర ఆ బంగారు నాణేలు ఉంటే ఎందుకిలా కష్టపడతాం. గుడారంలో మనవళ్లు ఉపవాసంతో చస్తున్నారు? అలాంటప్పుడు బంగారు నాణేలు ఎక్కడి నుంచి వస్తాయో చెప్పండి. తెల్లవాళ్లు వచ్చినప్పటినుంచి మా ఎద్దులకు మేయడానికి గడ్డి లేక పోవడటంతో సాయిబులకు వాటిని అమ్మేశాం. భట్టిసారాయి చేయబోతే అడవి నుంచి తరిమేశారు. ఆడవాళ్లు అడవి నుంచి పళ్లో, కాయలో తెస్తారు. అలాగే గింజలు తీసుకొస్తారు" అని చాలా కాలంగా మనసును నలిబిలి చేస్తున్న ఆలోచనలను బయటపెట్టాడు.

గుడారానికి వచ్చేసరికి అర్ధరాత్రి అయింది. చలికి పిల్లలు ముడుచుకొని పడుకున్నారు. తమ వంశాన్ని నిలబెట్టడానికి ఉన్న ఏకైక వారసుడు సోమ్లా కుమారుడు ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ మీద తన శాలువా తీసి కప్పాడు. తన ఇద్దరు పిల్లలు బ్రిటిషర్ల దగ్గర గులాములుగా పనిచేస్తున్నారు. అది గుర్తుతెచ్చుకొని దేసు దుఃఖించసాగాడు. తెల్లవాళ్ల హింసలు రోజురోజుకు పెరగసాగాయి. దేసుకు మసకచీకటిలోనే లేచి అడవి నుంచి కట్టెలు దొంగతనం చేయడం అనివార్యమైంది. సోమ్లి అతనితోపాటు అడవి వెళ్ళి, అడవినుంచి కలిమిపళ్లు, అడవి చెట్ల బంక, రేగుపళ్లు, రకరకాల పండ్లను తెంచుకొని వచ్చి పక్కనున్న పల్లెలకు పోయి అమ్మేది. ఇక దేసు తలమీద బరువైన కట్టెల మోపుతో నాలుగైదు మైళ్ల దూరము నడవడం అనివార్యమైంది. నెత్తికి భారమైనప్పుడు భుజాలమీద, భుజాలకు భారమైనప్పుడు నెత్తి మీదకు మార్చుకుంటూ రెండణాలకు ఒక మోపు ప్రకారం అమ్మి, వచ్చిన డబ్బులతో సంత చేసుకుని, ఒక అణా ఇచ్చి భార్యాభర్తలిద్దరూ ఈతకల్లు తాగి బయలుదేరేవారు. "ఎలాంటి రోజు వచ్చిందికదా, గుడారంలో పిల్లలతో, మనవళ్లతో హాయిగా కాలం గడపాల్సిన నువ్వ ..అయ్యో...ఆ గుజాసత్తి ఇంకా ఎలాంటి రోజులను చూపిస్తుందో ఆ దేవుడికే తెలుసు" అని భార్య కష్టాన్ని చూడలేక అన్నాడు. "నువ్వు ఎందుకు బాధపడతావు. పరిస్థితికి తగినట్టు బ్రతకాలి. ఇది ఇంకా ఇలాగే ఉండదు. మనముందరి రోజులు ఎలా ఉంటాయో ఎవరికి తెలుసు?" అని ఓదార్చుతున్నట్టు చెప్పింది. "అయినా మన ఇంటి ఆడవాళ్లు ఇంతకు మునుపు ఎపుడూ కష్టపడలేదు. ఈ ఫిరంగి జనం వచ్చిన తర్వాత మన పరిస్థితులు మారాయి. మన ఆర్థికపరిస్థితి తలకిందులైంది. గతంలో ముస్లిం రాజులకు ధాన్యపుగింజలు సరఫరా చేస్తూ ప్రశాంతంగా బతికినవాళ్లం. ఇప్పుడు ఈ బ్రిటీషర్లకు గులాములు

కావటం అంటే ఏమిటి?" అని పరిస్థితుల వైపరీత్యాన్ని వివరించటానికి ప్రయత్నం చేశాడు. సోమ్లికి ఏమీ అర్థం కాలేదు. గుడారంలో జబ్బుపడి పడుకొనివున్న ఆమె తల్లి రూప్లి గురించే ఆమె ఆలోచిస్తోంది. ఇప్పుడో అప్పుడో అనే పరిస్థితిలో ఉన్న ఆమెకు సోమ్లి దగ్గరలో ఉండాలి. అందువల్ల తల్లి పరిస్థితిపట్ల అనుమానం వేధించింది. ఎందుకో ఆమెకు అసంతృప్తిగా అనిపించింది. కలవరంగా అనిపించింది. కడుపులో సంకటంగా అనిపించింది. అయితే భర్త ఎదుట ఆ విషయాన్ని చెప్పలేక లోలోపల దిగమింగుకుని తొందర తొందరగా అడిగిన ధరకే మిగిలిన పళ్ళను, కట్టెలను అమ్మడానికి శ్రీమంతుల వీధిలోకి వెళ్ళింది. "కట్టెలమ్మా... కట్టెలు" అని కట్టెల మోపును మోసుకొని కేకలు పెడుతున్న భర్త దగ్గరికి వెళ్ళింది. భర్త అవస్థ చూసి పేగులు చురుక్కుమన్నాయి. గుర్రం మీద కూర్చొని పనిమనుషులకు ఉత్తర్వులు ఇచ్చే సరదారు ఈరోజు వీధివీధి తిరిగి కట్టెలు అమ్ముతున్నాడన్న నిజాన్ని భరించలేక నోటికి కొంగు అడ్డంపెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది. "ఎవరూ కట్టెలు అడగటం లేదు" అని నిరాశతో భార్య ముఖం చూశాడు. "మీరేమి బాధపడకండి. కాసేపు ఆ మోపును నా తలమీద పెట్టండి" అంటూ ముందుకుపోయి మోపును తన తలమీదికి ఎత్తుకుంది. "కట్టెలు, కావాలేమమ్మా" అంటూ ఒకట్రెండు సార్లు అరిచింది. ఎవరు పిలవలేదు. ముందుకు నడిచింది. అంతలో "ఏయ్, మోపు ఎంతకి ఇస్తావ్?" అని ఎవరో అడగటం వినిపించింది. సోమ్లి వెనక ఉన్న దేసు, "ఎనిమిదణాలు ఇవ్వండి స్వామి" అన్నాడు. "దానికి ఎనిమిదణాలు ఎందుకురా? ఐదణాలు ఇస్తాను, వేసి పో" అని అన్నాడు. తప్పనిసరి పరిస్థితి."అలాగే తీసుకోండి" అని చూపించిన స్థలంలో మోపు దింపింది. "ఏయ్, ఇంకోసారి వచ్చేటప్పుడు ఒక్కదానివే రా, ఎక్కువ డబ్బులు ఇస్తాను" అని కన్నుగీటాడు. తండ్రి వయసున్న ముసలివాడు అలా అనేసరికి సోమ్లి ఒక నిముషం భిత్తరపోయింది. వెంటనే తేరుకుని, "నీ నోట నా సాడు. మర్యాద లేనివాడా!" అని డబ్బులు కూడా తీసుకోకుండా ముందుకు పరుగెత్తింది. తర్వాత భర్తకు అర్థమైతే గొడవ అవుతుందని జరిగినది మనసులో దాచుకుని తిరిగివెళ్లి డబ్బులు ఇప్పించుకుని వచ్చి భర్తను కలుసుకుంది.

గుడారంలో 98 ఏళ్ల రూప్లి ఉన్న ఒక్కగానొక కూతురు ముఖం చూసి కనుమూయడానికి ఎదురుచూస్తోంది. ప్రాణం ఇప్పుడోఅప్పుడో అన్నట్టు కొట్టుకుంటోంది. సోమ్లా భార్య భీమణి, "ఎవరైనా కొంత దూరం పోయి అత్తామామలు వస్తున్నారేమో చూడండి? ముసలిదాని ప్రాణం ఎప్పుడు పోతుందో? వెళ్లండి" అని బతిమిలాడింది. ఒకరిద్దరు పరుగెత్తారు. ధనసింగ్ అప్పటికే పెద్దవాడయ్యాడు.

"అమ్మా, నేనుపోయి చూడనా? నానమ్మ చాలా బాధపడుతూ ఉంది" అని తల్లిని అడిగాడు. "ఈ కారడవిలో ఎక్కడికి పోతావు నాయనా? ఉరుకో. ఇంకేమి వచ్చేస్తారు" అని నచ్చజెప్పి ఆపింది. రూప్లికి తన తల్లి సాకిన అన్నకొడుకు మరియు అల్లుడు దేశును చూడాలనే చివరి కోరిక. తన కన్నపేగు ముఖాన్ని కంటినిండా నింపుకొని నేలతల్లి ఋణం తీర్చుకోవాలని కోరిక. అది నెరవేరుతుందో లేదో అనే భయం కూడా ఒకవైపు మనసులో గూడు కట్టుకొనివుంది. ఎక్కడో దూర ప్రయాణం చేస్తున్న అనుభవం. మొత్తం ప్రపంచాన్ని చీకటి ఆవరించింది. ఒక్కతే అపరిచిత జగత్తులోకి ప్రవేశిస్తున్నట్లు ఉండగానే "యా, ఎయా, యాడి" (అమ్మా, నాన్నా, అవ్వ) అని కీచు కంఠంతో ఎవరో పిలిచినట్టు అయింది. అయితే ఎవరో గుర్తుపట్టడానికి సాధ్యం కాలేదు. భూమిమీది జీవితాన్ని అనుభవించింది. కృశించిన దేహం నుంచి సంబంధాన్ని తెంచుకుని మరొక కొత్తపుట్టుక కోసం ఆత్మ తపిస్తోంది. ఎవరో తన నిశ్చలమైన దేహాన్ని కదిలించి ఏడుస్తున్నట్టు అనిపించింది. రూప్లి ఎంత దూరం ప్రయాణం చేసిందంటే, మరే జన్మలో కూడా తిరిగి రానంత దూరం ప్రయాణం చేసింది.

సోమ్లి దుఃఖం ఆపుకోలేక రోదించసాగింది. "నాయకణ యాడియే, తార రాజేమ సెజ భూలన బెటితియాడి, అబకేన యసడి కేతాణిన బలావూ యాడి. కెరముండాగ మారి దలేరి వాతెకేన భూలజావూ యాడి ఆ హింయా" (నాయకుడి తల్లివి, నువ్వు ఉన్నావని అన్నీ మరిచి కూర్చున్నాను. ఇప్పుడు ఎవరిని అమ్మా అని పిలవాలి, ఎవరి ముందు నా మనసులోని మాటను చెప్పి తేలికపడాలి). ఆమె ఏడుపు విని గుడారంలోని ఆడవాళ్లు, మగవాళ్లు అందరూ రోదించసాగారు. తన తల్లి చనిపోయిన తర్వాత నిశ్చలమైన ఆమె దేహం మీదపడి ఏడుస్తోంది. దేసుభుక్యా అత్త మరణంతో కాస్త విచలితుడైనప్పటికీ పరిస్థితికి తట్టుకుని నిలబడే శక్తిని పెంచుకొని ఉండటం వల్ల దేసు బాధను దిగమింగుకుని శవసంస్కారానికి సిద్ధం చేశాడు. అతని పెద్ద కొడుకు సోమ్లా, చోక్లలు లేకుండా అంత్యక్రియలు జరిగిపోయాయి. రూప్లి మాలిమికి ఎక్కువగా అలవాటైన పిల్లవాడు ధనసింగ్ "నాని... నాని" అంటూ బిగ్గరగా ఏడవసాగాడు. 'మీ నానమ్మ మరెన్నడూ తిరిగిరాని దూరపు లోకాలకు వెళ్లిపోయింది నాయనా. ఏడవకు" అని ఓదార్చింది. అయితే అది వాడి ప్రశ్నకు సమాధానం కాదు. సోమ్లికి ఒంటరి అయినట్టు అనిపించసాగింది. తల్లి ఉన్నప్పుడు సంబంధపు స్పందన ఉండేది. తల్లితోపాటు అన్ని సంబంధాలు తెగిపోయాయి. ఈ బంధాలకు తల్లి చివరి లంకె. అంతేకాకుండా దేసుభుక్యా కరమ్‌తోట్ సొంత

మామ కొడుకు కావటంవల్ల, అందరికన్నా ఎక్కువగా ప్రేమిస్తుండటం వల్ల సోమ్లికి ఇంకా జీవించాలని అనిపించింది. రూప్లి అస్తిత్వం ఇప్పుడు అర్థమయింది. జీవిత పోరాటంలో ఎక్కువ సమయం రూప్లితో గడపటానికి సాధ్యం కానందుకు దేసుకు దుఃఖం తన్నుకొచ్చింది.

బ్రిటిషవారి హింసలు ఎక్కువ కావడంతో బంజారాల బతుకు తమ నేలను పోగొట్టుకుంది. ఒకప్పుడు గుడారాల ముందు ఆవుల, ఎద్దుల మందలు ఊహించలేనంతగా ఉండేవి. ఇప్పుడతింటి ముంగిలిని పేడతో అలకటానికి ఇతరుల దిబ్బలనుంచి దొంగలించే స్థాయికి వచ్చింది. ఒకప్పుడు చుట్టుపక్కల పల్లెల నుంచి జనం పేడ కోసం వీళ్ల గుడారాల ముందు చాతక పక్షుల్లా ఎదురుచూసేవారు. ఇప్పుడు గుడారాల వైపు కనీసం తొంగికూడా చూడటం లేదు. అప్పట్లో పశువుల దండులకు స్థలం చాలేదికాదు. జనం కూర్చోవటానికి , నుంచోవటానికి కూడా స్థలం ఉండేదికాదు. అలాంటిది ఇప్పుడు ఇంటి ముందు స్థలం బోసిపోయినట్టుగా అంతా ఖాళీ... ఈరోజు తమ దగ్గర ఏమీ లేకపోవటంతో ఖాళీగా కూర్చోవలసి వచ్చిందని జనం తపించసాగారు. ప్రజల మనసులో భయం చోటు చేసుకుంది. దేసుభుక్యాకు అన్ని దారులు మూసుకుపోయినట్టు అనిపించింది. ఇద్దరు కొడుకులు వేరే అడవిలో ప్రవేశించారనే సాకుచూపి జైల్లో వేశారు. చుట్టుపక్కలున్న గుడారాల బంజారాలు 'బహద్దూర్ బండ' సమావేశం తర్వాత జాగ్రత్తపడ్డారు. ముంబై నుంచి వచ్చిన పెద్ద వ్యాపారులు శ్రీరంగపట్టణం హైదరాలీకి సరుకులను సరఫరా చేసేవారు. అతని మరణానంతరమూ అతని కుమారుడు టిప్పు కాలంలోనూ కొనసాగించారు. దీన్ని భరించలేని బ్రిటిష్‌వాళ్లు వాళ్లను తీవ్రంగా హింసించసాగారు.

ఇరవైనాలుగు గుడారాల నాయకులు ఏర్పాటు చేసిన సభ ప్రతిఫలం అన్నట్టు బహద్దూర్ బండలో బంజారాలు అందరూ కలిసి, బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి ఒక ప్రణాళిక రూపొందించుకున్నారు. తూర్పులో ఉన్న గుడారాల నుంచి భీమానాయక్ నేతృత్వం వహించి సుమారు వెయ్యిమంది బంజారాలను సంఘటిత పరిచాడు. పశ్చిమం నుంచి రేఖ్యానాయక్ రెండు వేలమంది బంజారాలను సంఘటిత పరిస్తే; ఉత్తరం నుంచి దేసుభుక్యా కరమ్‌తోట్ అత్యధికంగా మూడు వేలమంది బంజారాలకు నేతృత్వం వహించాడు. దక్షిణం నుంచి వెయ్యిమంది బంజారాలను పోగుచేసుకుని టిప్పుసుల్తాన్ సైన్యం సుబేదార్ భీమానాయక్ బయలుదేరాడు. మొదట హెూలీ ఆచరణ జరిగిన స్థలంలో మరొకసారి హెూలీ సాకు చూపించి బంజారాలు మొదటిసారిగా కర్ణాటకలో వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

"మా ప్రాంతానికి వచ్చి మా వ్యాపారాన్ని పాడుచేయడమే కాకుండా మా పశు సంపద నాశనానికి కారణమైన తెల్లవారిని ఎన్నిరోజులు భరించగలం?" అని భీమానాయక్ రోషాన్ని వ్యక్తపరిచాడు. "అడవులు కొండలు మావి, మా సంపద. ఈ తెల్లవాళ్లు, బోడిముండా కొడుకులు ఎప్పుడు చెట్లునాటి పెంచారు? ఈ అడవి తమదంటూ మనల్ని మన అడవిలోపల ప్రవేశించకుండా నిషేధించారు. నా ఇద్దరు కొడుకులను చెరసాలలో వేశారు. ఎంతవరకు వాళ్ల దౌర్జన్యాన్ని భరించాలి?" అని దేసు తన బాధను చెప్పుకున్నాడు. "నిజానికి వారు ఇక్కడి వాళ్లు కాదు. మనం ఈ దేశ మూలవాసులం. ఇక్కడ ఏమున్నా దానిమీద మనకు హక్కు ఉంది. మనల్ని ఆపటానికి వీళ్లెవరు? నదిలోకి దిగటానికి పడవవాడి అనుమతి కావాలా?" భీమానాయక్ గర్జించాడు. "బహద్దూర్ బండ రహదారులు, దాక్కొనే స్థావరాలు మనకు మాత్రమే తెలుసు. ఈ స్థలం నుంచి వారి మీద దాడి చేస్తే వాళ్లు తెలుసుకోలేరు. వాళ్లను అణచడానికి ఇదే సరైన స్థలం" అని రేఖ్యా నాయక్ వివరించాడు. బ్రిటీషువారి అనేక ప్రణాళికలను అక్కడినుంచి విఫలం చేయడానికి పరిశ్రమించి విజయం సాధించారు. వాళ్లు పన్నులు సంగ్రహించి ఇంగ్లాండ్‌కి పంపించడానికి ముందే ఆ సొమ్మును లూటీ చేయడం జరిగింది. బంజారాల కృత్యంతో మండిపడ్డ క్యాప్టెన్ రాక్‌ఫెలర్ బళ్లారి కమిషనర్ కఛేరీ నుంచి కొప్పళలోని బహద్దూర్ బండమీద దాడిచేసి ట్యాంకులతో, తుపాకులతో బంజారాలను అణచివేయడానికి ఒక ప్రణాళికను రూపొందించారు.

అతని ప్రణాళిక ఎలా ఉందంటే పెట్టిన గురి తప్పకూడదన్నట్టుగా ఉంది. బహద్దూర్ బండతో బాగా పరిచయమున్న కట్టెలమ్మే బంజారాలను కట్టెలు కొనే సాకుచూపి పట్టుకుని రమ్మని బళ్లారి నుంచి అతని సైన్యపటాలం సుబేదారును పంపాడు.

ధామణి, సక్ర్యనాయక్ కట్టెల మోపులతో వస్తూవున్నారు. దారిలో –

"లంబాడి, కట్టెల మోపు ఎంతకిస్తావు?" అని ఒకడు అడిగాడు.

"పన్నెండణాలన్నా" అని ధామణి నాయక్ అన్నాడు.

"ఆఁ మరి ఆ మోపు?" మరొకడు అడిగాడు.

"అది పెద్దమోపు. కావాలంటే ఒక రూపాయకు ఇస్తాం" ధామణి సక్ర్యనాయక్ తరఫున మాట్లాడాడు.

"సరే, డబ్బులిస్తాం. ఎత్తుకొని మా వెంట రండి" అని ముందుకు నడిచాడు.

గిరాకీ దొరికినందుకు ధామణి, సక్ర్య సంతోషంతో వారి వెనుకే

బయలుదేరారు. బరువు చాలా ఎక్కువగా ఉండటం వల్ల భరిస్తూనే నడవసాగారు. "ఇంకా కొంత దూరం" అని ఊరు నుంచి దూరం వచ్చిన తర్వాత అక్కడ ఐదారు మంది సైనికులు హఠాత్తుగా వచ్చి, "కొడకుల్లారా! బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తారా, మీరు ఎంతవాళ్లురా?" అంటూ ఇద్దరిని చేతులు పెడరెక్కలు విరిచికట్టి తీసుకొనిపోయారు. "ఏయ్ వదలండి. మేము తిరుగుబాటు చేసేవాళ్లం కాదు. ఏదో కడుపు తిప్పలకు కట్టెలు అమ్ముకుని బతికేవాళ్లం" అని రకరకాలుగా వేడుకున్నారు. అయితే దయలేని సైనికులు వారి మాటలు వినకుండా రాక్ ఫెలర్ దగ్గరికి తీసుకునిపోయారు. రాక్‌ఫెలర్ సైనికులకు ఇనాములు ఇచ్చాడు. తర్వాత ఇద్దరినీ విచారణకు గురిచేశాడు. "చెప్పండి, మీ నాయకుడు ఎవరు?" అని సక్ర్యను అడిగాడు. "తెలియదు యజమాని. మేము కట్టెలు అమ్ముకొని బతికేవాళ్లం" అన్నాడు. రాక్ ఫెలర్ కొరడాతో చర్మం ఊడేలా కొట్టాడు. "అయ్యో చచ్చానయ్యా, చచ్చాను, ఎవరైనా కాపాడండి"అంటూ నీరసపడి కూర్చున్న చోటే మూర్ఛపోయాడు. రాక్‌ఫెలర్ అత్యంత క్రూరుడు. సక్ర్యను వదిలి ధామణిని పట్టుకున్నాడు. "చెప్పు, ఎవరు విప్లవకారులు? వాళ్ల నాయకుడెవరు? ఎక్కడున్నారు?" అని అడిగాడు. ధామణికి తల తిరిగినట్లయింది. క్రౌర్యంతో నిండిన అతని ముఖాన్ని చూసి అక్కడే ఉచ్చ పోసుకున్నాడు. వాళ్లు అమాయకులని తెలిసినప్పటికీ రాక్‌ఫెలర్ భారతీయుల గుండెల్లో వణుకు పుట్టించాలని అత్యంత క్రూరమైన శిక్షలను విధించేవాడు. ఇద్దరి ఒంటిమీది నుంచి ఒక పొరచర్మం ఊడిపోయింది. 'కూడు, నీళ్లు లేకుండా ఎలాగో బతుకీడుస్తున్న ఈ బీదవాళ్ళకు ఇలా విధమైన శిక్షలు విధించడం ఎంతవరకు సమంజసం?' అని అడిగే గొంతులు లేవు. సరైన సమాచారం దొరకక, "మీరు ఎలాంటి వాళ్ళను తెచ్చారుకదా ! యూజెలెస్, వెళ్లి ఇతరులను పట్టుకునిరండి" అన్నాడు. సైనికులు తలలు ఊపి బయటకు వెళ్ళబోయారు. కెప్టెన్ రాక్ ఫెలర్, "యూ బ్లడీ ఇండియన్ రండి. వీళ్ళను తీసుకునిపోయి బంజారాల గుడారాల ముందు ఉరి వేయండి" అని ఉత్తర్వులు ఇచ్చాడు. సైనికులు కాస్త అయోమయానికి గురయ్యారు. అకారణంగా ఈ ఇద్దరు చనిపోతున్నారు కదా! అని బాధపడ్డారు. అయితే యజమాని చెప్పినట్టే చేయాలి. సక్ర్యా, ధామణిలను లాక్కొని వెళ్ళి లంబాడి జనాల గుడారాలు ఉండే చోట పెద్దచెట్లకు ఇద్దరినీ ఉరివేసి బ్రిటిష్ జెండాను ఎగురవేశారు. 'తెల్లవాళ్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే వారికి ఇదే గతి' అని రాసిన ఒక ఫలకాన్ని ఉంచారు.

రెండు శవాలు సక్ర్యా, ధామణిలవని వారి బంధువుల చేత గుర్తించబడి,

బహుద్దూర్ బండ విప్లవ నాయకులకు బ్రిటిషుల కృత్యం తెలపడం జరిగింది. "మనల్ని ఎదుర్కొనే ధైర్యం లేక అమాయకులను పట్టుకొని ఉరివేసి మన జనంలో భయం పుట్టించడానికి ప్రయత్నించారు" అని భీమానాయక్ కోపాన్ని వ్యక్తపరిచాడు. "ఇలా చేతులు కట్టుకుని కూర్చుంటే కుదరదు. ఇది మనం దాక్కునే చోటు. మనం ఇక్కడ ఉన్నామని బ్రిటీషర్లకు తెలియటానికి ముందే, వారి ఖజానా లూటీ చేసి కెప్టెన్ రాక్‌ఫెలర్‌కు బుద్ధిచెప్పాలి. ఆ పని ఈరోజు రాత్రే జరగాలి" అని దేసు భుక్యా తన ఆలోచనను ముందు పెట్టాడు. ఇతర నాయకులకు అది సమంజసం అనిపించింది. "చేతుల కట్టుకుని కూర్చుంటే గుడారంలోని జనాన్ని ఇలా ఒక్కొక్కరిని చంపేస్తారు. మనమంతా ఒకే నిర్ణయంతో మన జనాంగం గురువు సేవాలాల్‌ను తలచుకుని ముందుకుసాగాలి. ఏమంటారు?" అని భీమానాయక్ అన్నాడు. అక్కడ చేరిన వేలాదిమంది బంజారాలు "జై సేవాలాల్" అని నినాదాలు చేశారు.

బహద్దూర్ బండా నుంచి రాత్రి చీకట్లోనే కొప్పుళ, కొప్పుళ నుంచి పగటి సమయంలో ఏవో పనులు చేస్తున్నట్టు నాటకం ఆడటం, తర్వాత కెప్టెన్ రాక్ ఫెలర్‌ను బంధించి, అలాగే జైలులో ఉన్న బంజారా యువకులను విడుదల చేయించడం వారి ప్రణాళికలోని అంశాలు. ఒక్కొక్కరే పనిచేస్తున్నట్టు పనుల కోసం అడుగుతున్నట్టు బ్రిటిష్ తరపున ఉన్న జనాల్ని గుర్తుపెట్టుకున్నారు. రాత్రి చీకటి పడుతున్నట్టే కొప్పుళ, బళ్లారి రెండు వైపులా దాడి చేశారు. రాక్‌ఫెలర్ హఠాత్తుగా జరిగిన దాడికి కంగారుపడ్డాడు. అయినా ధైర్యంకోల్పోక తన సైనికులను వుత్సాహపరిచి తూటాలు పేల్చమని ఆజ్ఞాపించాడు. ముసుగుధారులు తమ చేతిలోని తల్వారులు, కత్తులు, గొడ్డళ్లు తీసుకుని సైనికులు మీద దాడి చేశారు. దొరికినది లూటీ చేసి పరారయ్యారు. వెళ్లేటప్పుడు జైలు తాళాలను పగులగొట్టి అందరిని విడిపించుకునిపోయారు. రాక్‌ఫెల్లర్ ఎలాగో బంజారాల నుంచి తప్పించుకున్నాడు. "ఓహ్! ఈ జనం మన కంపెనీ ప్రభుత్వాన్ని అవమానించారు. వీళ్లను దెబ్బ కొట్టాలి. ఎలా?" అని ఆలోచనలో పడ్డాడు. తన పక్కనున్న ఎవరో పనికిమాలిన సైనికుడు అడిగాడు. అతను ఏమీ అర్థంకానివాడిలా రాక్‌ఫెలర్ ముఖం చూశాడు. మరింత అవమానం కలిగినట్టయింది. హైదరాబాద్ కేంద్ర కచేరీకి విషయం తెలపటానికి ట్రంకాల్ చేశాడు. "హలో మిస్టర్ బ్రౌన్, దేరిజ్ ఎ ప్రాబ్లం బై బంజారా, దే అట్యాక్డ్ మీ, ఆన్ లాస్ట్ నైట్ సార్" అని భయపడుతూనే మాట్లాడాడు. "యూ ఫూల్, హౌ యూ స్పేర్ దెమ్, కిల్ దెమ్ ఆల్. ఇట్ ఇస్ మై ఆర్డర్", కేంద్ర కచేరి ముఖ్యుడైన మిస్టర్ బ్రౌన్ కెప్టెన్ మీద మండిపడ్డాడు. ఫోను ఆగిపోయింది.

కెప్టెన్ రాక్‌ఫెలర్‌కు పెద్ద చింత పట్టుకుంది. బంజారాల ఈ తిరుగుబాటును అణచడానికి అతను చేసిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయి.

జైలు నుంచి విడుదలయిన చోక్ల, సోమ్లాలను పిలుచుకొని దేసుభుక్యా తమ గుడారాల వైపు బయలుదేరాడు. ఈ పోరాటపు తీవ్రపరిణామాన్ని ఊహించలేక–

"బేటా సోమ్లా, నువ్వు మీ అమ్మను, పిల్లలనంతా పిలుచుకొని ఈ ఆంధ్ర సరిహద్దులు దాటి కర్ణాటకలోపలికి పోయి ఏదో ఒకచోట నివసించండి. ఇంకా ఈ సంచార జీవితాన్ని సాగించటం కష్టం. మనం మన ఊర్లకు తిరిగి వెళ్లలేం. రాజస్థాన్లో ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. అక్కడ మనదంటూ ఏమీ లేదు. మన వారంటూ ఎవరూ లేరు. పో నాయనా, ఆడవాళ్లందరిని, పిల్లలను జాగ్రత్తగా ఈ సరిహద్దు నుంచి దాటించి, ఎక్కడైనా ఒకింత జమీన్ కొనుక్కో. మన వంశాన్ని అభివృద్ధి చెయ్యి నాయనా" అని గద్గదికంగా అన్నాడు.

"మీరు లేకుండా నేను ఏమి చేయగలను? ఇప్పుడు మీకు వయసు దాటింది. నాకు ఒకటి తెలిస్తే మరొకటి తెలియదు" అని అయోమయంలో అన్నాడు సోమ్లా.

"ఎందుకు, చోక్ల నీకు తోడుగా ఉంటాడుకదా. మిగిలిన ఇద్దరినీ బాగా చూసుకో నాయనా. వారికి ఒకటి తెలిస్తే ఇంకోటి తెలియదు. అన్నీ నువ్వే చూసుకోవాలి." అని కంట తడిపెడుతూ అన్నాడు.

"నాన్నా, ఈ వయసులో నిన్ను ఒక్కడినే వదిలి కొత్త బతుకు ప్రారంభించడానికి మేమంతా ఎలా పోవాలి? నేనైతే నీతోపాటు ఉంటాను. వాళ్లంతా వెళ్లనీ" అని పట్టుపట్టాడు చోక్ల.

"చూడు నాయనా, నువ్వు ఇంకా జీవితాన్ని చూడవలసినవాడివి. నేను ఈ రోజో రేపో చనిపోయి చరిత్రలో చేరబోతున్న ముసలి చెట్టును. అయితే ఈ ఫిరంగి జనానికి బుద్ధిచెప్పి, ఈ దేశం నుంచి తరిమి మీరు మంచి జీవితాన్ని బ్రతికేలా చేయడానికి వెళుతున్నాను. ఇలా మొండిపట్టు పట్టకు" అని దేసు చోక్లకు నచ్చుజెప్పడానికి ప్రయత్నించాడు.

అయితే చోక్ల ఏమీ వినే పరిస్థితిలో లేడు. బ్రిటిష్‌వారి జైలులో అనుభవించిన కష్టాలు పగరూపంలో అతని వేధిస్తున్నాయి. ఏదో విధంగా వారిని హింసించాలని, ప్రతీకారం తీర్చుకోవాలనే కోరిక అతడిది. ఇది సరైన సందర్భం అనుకుని "నువ్వు ఇలా నన్ను ఆపకు. నేనూ ఒక చేయి చూసుకుంటాను" అని కోపంగా అన్నాడు చోక్ల. అతను పట్టినపట్టు వదలని అర్థంకావడంతో ఏమి జరగాలో అదే జరుగుతుందని సామాను సరంజామాలు సర్దుకుని వలసపోయే కార్యక్రమానికి పూనుకున్నాడు

దేసు.

దేసు తన చిన్నాన్న కొడుకు తోత్య వితంతువైన భార్య సాంకి, అతని కొడుకు దేవ్ల కోసం తీవ్రంగా ఆలోచించాడు. తండ్రి భుజానికి భుజమిచ్చి ఎక్కడో చెదరి చెల్లాచెదురు కావలసిన సంసారాన్ని నిలబెట్టినవారు మీటు, థావులు. తండ్రి మీటు భుక్యా కరమ్‌తోట్ నిగూఢరీతిలో కనిపించకుండా పోయినప్పుడు అమ్మను, తనను చూసుకున్నవాడు థావు కాకా. అతని వంశపు ఒకే ఒక మొలక తోత్య ఇలా చేస్తాడని ఊహించలేదు. అతను వంశం ఉద్ధరించే దేవ్లకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే భయం గుండెలో గూడు కట్టింది. "నాయనా సోమ్లా, చూడు మీ థావు తాత వంశపుమొలక ఆ దేవ్ల భుక్యా కరమ్‌తోట్, నా చిన్నాన్న తోత్య మనుమడు. అతన్ని భవిష్యత్తులో మంచి మనిషిగా రూపొందించే బాధ్యత నీది. అదే అర్ధరాత్రి నిశ్శబ్దంగా జాడ తెలియనివ్వకుండా పశ్చిమానికి బయలుదేరండి. ఈ ప్రాంతపు సరిహద్దు దాటి, ముందు వచ్చే కన్నడభాష మాట్లాడే ప్రాంతంలోకి చేరుకుని, కష్టపడి ఒక ఇల్లు కట్టుకో నాయనా. ఇప్పుడు స్థిరపడటం అవసరం. నేనేమైనా ప్రాణాలతో బ్రతికి ఉంటే తిరిగి వస్తాను" అన్నారు. ఎవరైనా వింటారని బిగ్గరగా ఏడవలేక దుఃఖాన్ని దిగమింగుకుని సోమ్లా తండ్రిని సాగనంపాడు.

గుడారాలు ఖాళీచేసి చాలామంది బంజారాలు రాత్రికి రాత్రే వలసపోయారు. వాళ్ళలో సబావుట్ గాంగ్య, కర్రా కమల్యా, విసళావత చోక్ల, ఖోలార దకణ్య, కేళూత లింబ్యా, మూడై మర్రా నాయక్, పాళూతేర పోమ్య, ఖేవతేర భీమ, రామవతేర లసణూ, కిమావతేర పాత్లోరామ, మేఘావతేర హండేర, బాణోత థావు, దేవసోత దేమ, గోఘ్యర మంజ్య మొదలైనవారి కుటుంబంలోని ఆడవాళ్ళు, పిల్లలు బయలుదేరితే, బ్రిటిష్‌కు వ్యతిరేకంగా పోరాడటానికి కొంతమంది అక్కడే వుండిపోయారు. "బ్రతికి ఉంటే కచ్చితంగా మీరు ఎక్కడ ఉన్నా వచ్చి కలుస్తాం. చనిపోతే మా శవాలు దొరకవు. ఏదో ఒక రోజున దినకర్మలు చేసి దీపావళికి ఒకసారి ధభకార (హవనం) చేయండి చాలు" అని వలసపోయే వాళ్ళందరికి ఈ మాటలను చెప్పి వాళ్లలో ధైర్యం నింపి సాగనంపారు. కుటుంబ సభ్యులు వీళ్లను వదిలి వెళ్లడానికి మనసు లేకపోయినప్పటికీ, దేశం కోసం వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఏడ్చి, పిలిచే సమయం కాదని తెలిసిన ఆ జనం సరిగ్గా అర్ధరాత్రి సమయంలో అక్కడి నుంచి బయలుదేరారు. బ్రిటిషులు నమ్మటానికి గుడారాలన్నీ ఖాళీగానే వదిలి పెట్టి వెళ్ళారు.

బహద్దూర్ బండ బ్రిటీషర్లకు నిజమైన సవాల్‌గా మారింది. రాక్ ఫెలర్

కెప్టెన్ పైశాచిక కృత్యానికి వందలాది బంజారాలు బలయ్యారు. కొందరైతే భయపడి సరిహద్దు దాటి దూరంగా పారిపోయారు. ఈసారి బంజారాల మట్టుపెట్టడానికి సైన్యం సిద్ధమైంది. నలుగురు నాయకులు రహస్యంగా కలవటం రాక్‌ఫెలర్ ఎలాగో కనిపెట్టాడు. సైన్యపటాలాలను 'బహద్దూర్ బండ' ప్రాంతాన్ని నాలుగు వైపుల నుంచి ఒక్కసారిగా ముట్టడించే ప్రణాళిక రూపొందించబడింది. అయితే టిప్పు సైన్యంలోని అంగరక్షకుల దళంలో పనిచేస్తున్న భీమానాయక్‌కు పిలుపు రావడంతో అతను తిరిగి వెళ్లిపోయాడు. టిప్పు మొండితనానికి అందరూ ఐక్యమయ్యే వ్యవస్థను రచించి మరాఠాలు, హైదరాబాద్ నిజాములతో కలిసి బ్రిటిష్‌ల నాలుగో ఆంగ్లో-మైసూర్ యుద్ధాన్ని చాటిన నేపథ్యంలో స్వామిభక్తి కలిగిన భీమానాయక్ బంజారాల చిన్న పటాలంతో బహద్దూరు బండ తిరుగుబాటు నుంచి బయటనే ఉండిపోవలసిన అనివార్యత ఏర్పడింది. దేసు మీద మరింత బాధ్యత పడింది. దాంతో దేసు ప్రతి ఒక్కరిలోనూ గుండె ధైర్యాన్ని నింప సాగాడు. "బంజారా బంధువుల్లారా, మనమంతా బయటి నుంచి వచ్చిన మన శత్రువులైన బ్రిటిష్‌లను తరిమికొడితే, మన అడవి, మన వ్యాపారం, అరణ్య సంపద, మనకు చెందాల్సిన ప్రతిదీ మనకు దొరుకుతుంది. లేకపోతే దేవుడే మనల్ని కాడాలి" అని దేసు భుక్యా అంటుండగానే, వెనకనుంచి తుపాకులు పేల్చిన శబ్దం వినిపించింది. గుండు వచ్చి అతని గుండెలో దూరింది. "హే భగవాన్" అంటూ అతను నేలకూలాడు. జనం జరుగుతున్నదేమిటో గ్రహించడానికి ముందే ఐదుశవాలు నేలకు దొర్లాయి. కిందపడినవారిని వదిలి బండల మధ్య చేరుకున్న బంజారాలు తెల్లవాళ్ల కోసం ఎదురుచూడసాగారు. అయితే తెలివైన రాక్ ఫెలర్ తన సైనికులకు బంజారాల దుస్తులు తొలగించి యుద్ధం చేయమని చెప్పటం వల్ల నిజమైన బంజారాలకు తమవారు ఎవరో, శత్రువులెవరో గుర్తించడం కష్టమైంది. తమ వారని భావించి బయటకు వచ్చిన వారి మీదంతా తూటాలు పేల్చ సాగారు. ఉన్నంతలోనే కాస్త బుద్ధిమంతుడైన దేసు భుక్యా గాయపడి నేలకూలి యమయాతన అనుభవిస్తున్నాడు. అతన్ని చోక్ల ఎత్తుకుని అడవిలోకి శత్రువుల కంటపడకుడా తీసుకెళ్లాడు. "నువు నా వెంట రావద్దని చెప్పానుకదా తండ్రీ" అని దేసుభుక్యా దుఃఖితుడయ్యాడు. "నువ్వు మనవారితోపాటు వెళ్లిపోలేదా?" అని ఆశ్చర్యంతో అడిగాడు. మళ్లీ "ఎందుకు వచ్చావు నాయనా ఈ మోసగాళ్ల మధ్యలో" అని అంటుండగా నాలుక మొద్దు బారింది. ఎదను ఛేదించిన గుండును బయటకు తీయటం అంత సులభంకాదు. "నాన్నా, మాట్లాడు, నీకు ఏమీ కాదు. ఎందుకు ఇలా మౌనంగా ఉన్నావు. మాట్లాడు" అని చోక్ల అతన్ని మేల్కొలపడానికి

తపించాడు. దేసు మాటల్ని కూడదీసుకుని, “నాయనా, నేను బ్రతకను, పిచ్చి ప్రయత్నాలు వదిలేయ్. ఇక్కడే ఎక్కడైనా కట్టెలు దొరికితే నా శరీరాన్ని దానిమీద పెట్టి దహనం చెయ్. నా దేహాన్ని తీసుకువెళ్లే పిచ్చి సాహసానికి పూనుకోవద్దు. అలా ఏమైనా చేస్తే, వాళ్లు నిన్ను పట్టుకుంటే ఈ తెల్లవాళ్లు మన మొత్తం వంశాన్ని నాశనం చేస్తారు. నీవు తప్పించుకుని పారిపో” అని అతని తొడమీదనే ప్రాణం వదిలాడు. చోక్ల కుంగిపోయాడు “నాన్నా, ఏం చేయను నాన్నా” అని అయోమయంలో కంగారు పడ్డాడు. ఒక ఘడియపాటు చురుగ్గా ఆలోచించాడు. అక్కడే ఉన్న కట్టెపుల్లలను ఏరుకొని, ఎండిన చెట్టు కొమ్మలను తెచ్చి చితిగా పేర్చి సున్నితంగా శవాన్ని చితిపైకి ఎక్కించి ఎండుగడ్డి తెచ్చి శవం మీద పరిచి చితికి నిప్పు అంటించాడు.

బాల్యం నుంచి తండ్రి చేస్తున్న ప్రతి ఒక్క కార్యక్రమాన్ని దగ్గర నుంచి చూశాడు చోక్ల. వ్యాపారపు చివరిఘట్టంలో తండ్రి పడుతున్న బాధను గమనించాడు. పెద్ద సంసారాన్ని, పని మనుషులను నిభాయించడానికి పెనుగులాడుతూ ఉన్న విధానం అతనిలో ఆశ్చర్యాన్ని కలిగించేది. ఒక్కోసారి ఖిన్నుడై భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ దుఃఖించడం చూశాడు. అలాంటి ఒక ధీరునికి ఇలాంటి చావు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. “తండ్రి పరంపర లంకెలను తొలగించి సంబంధాలను తెంచుకొని శాశ్వతంగా చిరమౌనంలోకి జారిపోయాడు. నీకు అక్కడైనా ప్రశాంతత దొరకాలి. నీ మీద గుండు పేల్చిన వారిలో కొందరినైనా బలి తీసుకోకపోతే నేను నీ కొడుకునే కాను” అని శపథం చేశాడు. బంజారా దుస్తుల్లో ఉన్న ఒక సైనికుడు బందూకు పట్టుకుని తన వైపు రావడం గమనించిన చోక్ల బండరాయి మీది నుంచి అతని మీదికి దూకి చేతిలో ఉన్న ఖడ్గంతో శత్రువుతల నరికాడు. ఎవరెవరి చేతిలో బందూకులు ఉన్నాయో వాళ్లందర్నీ చంపుతూ పోయాడు. అయితే తెల్లమూతి జనం కనిపించడంలేదుకదా అని గొణుక్కున్నాడు. బహుశా ఆ గొణుక్కోవటం విన్న తెల్లవాడు యముడిలా అతని ముందు ప్రత్యక్షమయ్యాడు. ఆజానుబాహుడైన ఆ వ్యక్తిని చూసిన చోక్లకు రామాయణం, మహాభారతంలోని రాక్షసులు గుర్తుకొచ్చారు. అతని ఖడ్గం రక్తసిక్తమై ఉండటం చూసి గుండు పేల్చాడు. అది అతని భుజాన్ని తాకి రక్తం చివ్వుమని చిమ్మింది. తాను చావటం కచ్చితం, ఈ ఎర్రమూతి కోతిని చంపాల్సిందే” అని చోక్ల పరుగెత్తాడు. ‘జై సేవాలాల్’ అంటూ అతని పొట్టలో ఖడ్గాన్ని దించి, అతన్ని నేలకూల్చుతుండగా వెనక నుంచి ఒకడు గుండు పేల్చి చోక్లను నేలకూల్చాడు.

చివరిసారిగా తండ్రిని కళ్లముందుకు తెచ్చుకుని "నాన్నా, కొందరినే చంపాను. నన్ను క్షమించు" అంటూ చివరి శ్వాసపీల్చాడు.

బహద్దూర్ బండలో బంజారాలు ఓడిపోయి చెల్లాచెదురయ్యారు. బ్రిటిషర్ల కుట్రలు–కుతంత్రాల ముందు, మోసంతో కూడిన యుద్ధ కౌశల్యం ఎదుట ఎవరు గెలవగలరు?

ఈ సంఘటన తర్వాత బంజారాల బతుకు మరింత దుర్భరమైంది. దొరికిన వారిని దొరికినట్లే విప్లవకారులని, అపరాధములని ఊరకూరకే జైలుకు పంపించడం జరిగింది. కొద్దోగొప్పో ప్రమాణంలో జరుగుతున్న వ్యాపారం పూర్తిగా ఆగిపోయింది. వందలాది బంజారాలు బహుద్దూరు బండ మార్గంలోనే శవాలయ్యారు. వాళ్లలో చోక్ల కూడా ఒకడు. బ్రిటిష్‌ల వేర్లు ఈ నేలలో లోతుగా దిగాయి. ఇప్పుడు వారికి చెప్పగలిగేవారుకానీ, అడగగలిగేవారుకానీ ఎవరూ లేకుండా పోయారు. ప్రజల నుంచి ఎక్కువగా జరిమానాలు, పన్నులు వసూలు చేయడమే వారి ఉద్యోగమైంది. బహుద్దూరు బండ తిరుగుబాటు తర్వాత బంజారాలు తమ సహజ స్వభావాన్ని గ్రహించి, ఉన్న ప్రదేశంలోని గుడారాలను పెరికేసి, శాశ్వతంగా నివాసాలను నిర్మించుకోసాగారు. చిన్నాచితకా వ్యాపారాలు అసాధ్యమని గ్రహించిన తర్వాత కొందరు వ్యవసాయం వైపు వెళితే కొందరు కూలీలు చేసుకుంటూ, మరికొందరు బ్రిటిష్‌వారి వెనుక కూలీగా సామాను సాగించడానికి వెళ్లసాగారు.

ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని తన కుటుంబ సభ్యులను, ఇతర బంజారాలను వెంటబెట్టుకుని సోమ్లా భుక్యా కరమ్‌తోట్ కర్ణాటక సరిహద్దుల్లో ప్రవేశించాడు. వారితోపాటు వచ్చిన బంజారాలు అక్కడి నుంచి మొళకాల్మూరు దగ్గర పానగల్ ప్రదేశం నుంచి ముందుకు మూడు కిలోమీటర్ల దూరానికి వచ్చి కొండ వెనుక ప్రదేశం చూసి అక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకోవడానికి నిర్ణయించుకున్నాడు. చుట్టూ రాతికొండలు. ఎత్తైన చెట్లు. మధ్యన పూర్తిగా బయలు ప్రదేశం. మనిషెత్తుకు పెరిగిన గడ్డి, దట్టమైన పొదలు, కలిమి, రేగు, రకరకాల పళ్ల చెట్లతో సమృద్ధిగా ఉన్న ఆ స్థలాన్ని చూసి నివసించడానికి ఇది తగినదని సోమ్లా తన ఇద్దరు సోదరులైన మంగ్యా, చాప్లలతో కలిసి గుడారాలకు బదులుగా గుడిసెలు నిర్మించడానికి పూనుకున్నాడు. గడ్డి, పొడవైన కర్రలు, పెద్ద చెట్టును నరికి వాటి దుంగలతో గుడిసెలను నిర్మించసాగారు. రాతి బండలు, బండల కొండలు ఉన్న ఈ ప్రదేశంలో చిరుతలు, పులులు, ఎలుగుబంట్లు మొదలైన అడవిజంతువులు ఎక్కువగా ఉ

ంటాయని వారి ఉద్దేశం. అయినా సోమ్లా ఎందుకు ఇక్కడికి వచ్చి ఇక్కడ తండా కట్టడానికి కారణం ఏ ఒక్కరికీ అర్థం కాలేదు. అయితే చొంచ పక్కీక నాయక్, పీళు హనుమ అడిగారు, "అది కాదు నాయకా, ఎందుకు ఇక్కడ తండా నిర్మాణానికి పూనుకున్నావో మా బుర్రకు ఎక్కడం లేదు. చెప్పు నాయకా" అని అతని జవాబు కోసం ఎదురుచూశారు. సోమ్లా మాట్లాడలేదు. పీళుహనుమా బంకలాంటి మనిషి. ఒక పట్టాన వదిలిపెట్టేవాడు కాదు. "అది కాదు, ఈ బండలు, అడవి, చిరుతలు లేని ప్రదేశంలో ఉండటానికి అవకాశం లేదా? చెప్పు నాయకా, మా మనసుకు నెమ్మది ఉంటుంది" అని సూటిగా అడిగాడు. "ఒరేయ్ మూర్ఖుడా, అందుకోసమే ఇక్కడ నిర్మిస్తున్నాను. అడవి నుంచి బయటికి పోయావంటే మనల్ని బ్రతకనిస్తారా? తెల్లవాళ్ళు మనల్ని వేటాడి చంపేస్తారు. అడవిలోపలి జంతువులు ఒక్కసారి వేటాడి ప్రాణాలు తీసి కడుపు నింపుకుంటే మళ్లీ ఆకలి అయ్యేవరకు మౌనంగా ఉంటాయి. బయటి మనుషులు ప్రతిరోజూ చంపుతారు. ఏది కావాలో మీరే ఆలోచించండి. గుడిసెలు కట్టుకోవాలని అనుకున్నవాళ్లు కట్టుకోండి. ఎవరికి భయం వేస్తుందో, మీకు ఎక్కడ అనుకూలమో అక్కడికి పోయి మీరూ ఒక కొత్తతండాను నిర్మించుకోండి" అని చెప్పి మౌనం వహించాడు. కొంతమంది గొణుక్కుంటూ ఊరకయ్యారు. మరికొంతమంది అర్థంకాకుండా మౌనంగా వుండిపోయారు. అయితే కొత్త తండా నిర్మించే పనులలో అందరూ సంతోషంతో పాల్గొన్నారు.

చూస్తూ చూస్తూ ఉండగానే యాభై కుటుంబాల యాభై గుడిసెలు లేచి నిలుచున్నాయి. సోమ్లా ఒక పెద్ద గుడిసెను నిర్మించుకున్నాడు. అతని తమ్ముడు మంగ్యా చూరుకు ఆనించుకుని మరొక గుడిసె వేసుకున్నాడు. చాప్ల మంగ్యా దగ్గరే ఉండటం వల్ల అతను గుడిసె వేసుకుని గొడవకు పోలేదు. రేఖ్యా, కాళి, వారి తల్లి చౌలిల కోసం సోమ్లా గుడిసెను కట్టించి ఇచ్చాడు.

సంవత్సరం గిర్రున తిరిగిపోయింది.

ఇప్పుడు మొత్తం కరమ్‌తోట్ కుటుంబానికి పెద్దతల అంటే సోమ్లి. ఎప్పుడూ దేసు ఆలోచనలోనే కాలం గడపసాగింది. ఒక్కో సారి, "నాయనా సోమ్లా, మీ నాన్న దూరమై సంవత్సరం అయింది. ఎక్కడున్నాడో తెలుసుకోవడం లేదు. బ్రతికి ఉన్నాడా చనిపోయాడో తెలుసుకో నాయనా. ఏమిటి నీ హర్కత్. నీ తండ్రితోపాటు నీ తమ్ముడు చోక్ల ఉన్నాడు. ఆ దరిద్రుడు మనల్ని వెతికే ప్రయత్నం చేయకూడదా" అని చెప్పి సోమ్లా ప్రతిస్పందించక పోవడంతో కంటి నుండి కారుతున్న కన్నీళ్లను తుడుచుకుని మౌనంగా కూర్చునేది. అయితే విషాదం ఏమిటంటే తండ్రి రక్షణకు

పోయిన చోక్ల చనిపోయాడని వారికి తెలియదు. బ్రిటిష్‌వారి తూటాకు బలియైన తండ్రి మరణానికి ప్రతికారంగా కొందరు తెల్లవారిని చంపి, చివరికి వారి తూటాకు బలై చనిపోయాడనే సత్యం అతనితోపాటు ఏ మట్టిలోనో సమాధి అయిపోయింది. తల్లి మాటలు విని వెతికే ప్రయత్నం చేయడానికి సోమ్లకు ధైర్యం లేకపోయింది. అందుకు అవసరమైన డబ్బుకూడా లేకపోవడంతో మనసుకు బాధ కలిగినా మౌనంగా ఉండిపోయేవాడు. పొరబాటున తెల్లవాళ్లు కంటపడితే కట్టుకున్న గుడిసెలు నేలమట్టం కావటం కచ్చితం. అయినా ఎలాగో రాత్రి సమయంలో ఈ బంజారాలు పక్కనున్న పానగల్లు, రాంపుర, మోళకాల్మూరు, చళ్లకెరెలకు వెళ్లి అడవిలో దొరికే బంక, కుంకుడుకాయలు, కలిమి, రేగువంటి రకరకాల పళ్లు, ఎండిన కట్టెపుల్లలు తీసుకొచ్చి అమ్మి జీవనం సాగించసాగారు.

పానగల్ నుంచి రాతిబెల్లం తెచ్చి అడవి లోయల్లో నీటి వసతులు ఉండే చోట భట్టిసారాయి తయారు చేయడం ప్రారంభించారు. ప్రతి చెట్టు బెరడును వలిచి, వారాల పొడుగునా కుళ్లిపోవటానికి పాతిపెట్టిన బెల్లం తీసి, పొయ్యిమీది మట్టికుండలో వేసి, పైన మరొక కుండ మూసి ఆవిరి బయటికి రావడానికి గొట్టంలా వదిలి, చుట్టూ మట్టి మెత్తి, పొయ్యికి మంట పెడితే, నీళ్లు వేడెక్కి మరుగుతున్నట్టే ఆవిరిగొట్టం ద్వారా వచ్చి సేకరించబడిందే భట్టి సారాయి. యాభై గుడిసెలున్న ఆ తాండను 'దేసునాయక్ తాండ' అని పిలవడానికి తండా రాయబారి, డావో అభిప్రాయాన్ని అడిగి అలాగే పిలవసాగారు. సోమ్లా భుక్యా కరమ్‌తోట్ ఇంటిలో ఎక్కువ మంది వుండటం వల్ల అయిదారు చోట్ల భట్టి వేయించాడు. రోజుకు పది కుండల భట్టి సారాయి దిగేది. దాన్ని రామపురానికి, పానగల్లుకు తీసుకుపోయి రాత్రికి రాత్రే అమ్మేసి తిరిగి వచ్చేవాడు. సోమ్లా ఐదారుమంది పనివాళ్లని కూడా పెట్టుకున్నాడు. ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ తండ్రి నుంచి ఒక్కొక్క పనిని తెలుసుకునే ప్రయత్నం చేయసాగాడు. అతని నానమ్మ బాధ–ఉదాసీనతల మధ్య భవిష్యత్తు జీవితాన్ని తీర్చిదిద్దుకునే మనవడి కోసం తన బాధనంతా మరిచింది .

దట్టమైన కారడవిలో కేవలం బండరాళ్లే. వాటి సందులలోని గుహలోపల చిరుతలు, ఎలుగుబంట్లు చాలా ఉండటం వల్ల తాండాలోని చాలామంది జాగ్రత్తగానే తమ పనులు చేసుకునేవారు. జనం గుంపులు గుంపులుగా తిరగడం అలవాటు చేసుకున్నారు. అడవిలోపల సంచరించిన అనుభవం ఉన్నవాళ్లను కూడా ఒక్కొక్కసారి అడవి జంతువులు దెబ్బతీసేవి. భట్టి మరగడానికి వదిలి, భోజనం చేయడానికి వచ్చి వేపచెట్టు పక్కన కూర్చుని, తెచ్చుకున్న చద్దిమూట విప్పి డకణ్యానాయక్

హడావుడిగా భోజనం చేసి తిరిగి వెళ్ళాడు. వెళ్లేటప్పుడు తన దగ్గరున్న గొడ్డలిని మరిచాడు. వెనుకనుంచి ఒక ఎలుగుబంటి వచ్చి అతన్ని పట్టుకుంది. "అమ్మో చచ్చాను" అని అరుస్తూ, ఎలాగో దాన్నుంచి విడిపించుకొని పరిగెత్తాడు. అయితే ఆడఎలుగుబంటి అతని వెంట పడి, అతని మీద పడి, అతన్ని ఎత్తుకొని గుహలాంటి స్థలానికి తీసుకొనిపోయింది. అతని కాలి చర్మాన్నంతా ఒలిచి, అతను నేలమీద కాలు పెట్టలేనట్టుగా చేసింది. దకణ్యక నాయక్ మెలకువ వచ్చి చూస్తే ఆయాసం. ఆడఎలుగుబంటి అతన్ని తన ఆధీనంలో పెట్టుకుంది. కాలు నేలమీద పెడితే యమయాతన. ఆ పరిస్థితిలో బయటకు రావడం ఎలా? "ఎవరైనా కాపాడండి" అని అరిచాడు. ఎలుగుబంటి ఒక్కసారి ఉరిమింది. దకణ్యానాయక్ నోరు మూసుకున్నాడు. భోజనం, నీళ్లులేక శక్తిహీనమైన దేహం. ఎలాగైనా దీని చేతుల్లోంచి తప్పించుకోవాలి" అని లోలోపల అనుకున్నాడు. ఎలుగుబంటి బయటకు వెళ్లడం ఆలస్యం రాళ్లసందులో నుంచి బయటకు వచ్చి కాళ్లకు తామరాకులు కట్టుకొని రక్తం కారుతున్నా భరిస్తూ పరుగుతీశాడు.

దూరంలో భట్టి పెట్టినవారు కంటపడగానే కీచుకంఠంతో "అయ్యో, కాపాడండి" అని అరిచి మూర్ఛపోయాడు. కోమ్లనాయక్ అతని పక్కనే భట్టి వేసిన కాణు, హనుమ డోగ్రి, కేక వినిపించిన వైపు పరిగెత్తారు. ఎలుగుబంటి మనిషిని మీద నిలబడి ఉండటం చూసి భయపడిపోయారు. ఎలుగుబంటి కాళ్ల కింద వున్నది ఎవరని సోమ్లా ఆలోచించాడు. "ఎయ్ కాణు, భట్టి దగ్గరికి పోయి కాలుతున్న రెండు కట్టెలను తీసుకొని రాపో" అని అన్నాడు. ఉపాయంతో ప్రమాదంలో ఉన్న మనిషిని ఎలా తప్పించాలని ఆలోచించాడు. కాణు ఒక్కఊపిరితో పరుగెత్తినవాడు మండుతున్న కట్టెలను నిప్పుల సమేతంగా తీసుకొని వచ్చాడు. నిప్పును చూసిన ఎలుగుబంటి అక్కడి నుంచి పారిపోయింది. దకణ్య నాయక్ దగ్గరికి పోయిన నలుగురు, గాయపడినవాడు తమ తాండకు చెందిన దకణ్య అని తెలియటంతో అవలీలగా ఎత్తుకొని భట్టి దగ్గరికి పరుగెత్తారు. అయితే ఆడ ఎలుగుబంటి అంత సులభంగా దకణ్యను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. అతన్ని తిరిగి తీసుకొనిపోవడానికి తపించింది. సోమ్లు దాన్ని గమనించి "అరేయ్, ఎలుగుబంటి మళ్లీ వచ్చిందిరా, ఎవరైనా దాని జుట్టుకు నిప్పు పెట్టండి, కాలిపోనీ" అని అన్నాడు. మళ్లీ అది జనం మీద దాడి చేయడాన్ని కచ్చితపరుచుకునే చెప్పాడు. కాణు చేతిలో వెలుగుతున్న నిప్పు కాగడా పట్టుకొని, "ఏయ్ నీ అవ్వ, దకణ్య నాయక్‌తో సంసారం చేసింది చాల్లేదా, పో అటు" అని కసిరాడు. ఎలుగుబంటి

పారిపోయింది.

డకణ్యా నాయక్‌ను కాపాడిన సోమ్లా అతన్ని అవలీలగా ఎత్తుకొని ఊళ్లోకి వెళ్లాడు. అతని భార్య తింటున్న కూడు వదిలి ఏడుపు ప్రారంభించింది. సేవాబాయి, మరియమ్మ గుడి దగ్గర అతన్ని దించాడు సోమ్లా. అది చూసి జనం గుమిగూడారు. "ఏమైందంట?" అని ఒకడు అడిగాడు. "ఏమో డకణ్యా దొరికినాడంట" అన్నాడొకడు. మరొకడు "ఎలా?" కోలాహలం ఎక్కువైంది. డకణ్యా బట్టలు చిరిగిపోయి వున్నాయి. ఎలుగుబంటి కాళ్లు చేతులు నాకి, చర్మాన్ని వలిచేసింది. "అయ్యో పాపం, అతడు బ్రతకడమే గొప్ప విషయం" అని ఎవరో అంటున్నారు. అంతలో, "పక్కకు జరగండి. గాలి ఆడనివ్వండి. అసలే భయంతో చస్తున్నాడు" అని వయస్సుదాటిన సేవ్యానాయక్ తన అనుభవంతో చెప్పాడు. జనం దూరంగా జరిగి నుంచున్నాక, గాయాలకు పసరులు పూసిన ముసలివాడు, జనాన్ని చెదరగొట్టడానికి, "వెళ్లండ్రా, ఇక్కడ కోతులేమైన గంతులేస్తున్నాయా? బతుకు తెరువు చూసుకోండి. గాలి తగలనీ, గాభరపడ్డాడు. రేపటికి తేరుకుంటాడు". అన్నాడు. సరేనని సగం మంది వెళ్లిపోయారు. మిగిలిన వాళ్లు అక్కడే అరుగుమీద ముడ్డిమోపి కూర్చున్నారు. అవిఇవి మాటలు ప్రారంభించారు. అయితే ఎలుగుబంటి ఆక్రమణకు లంబాడీలు భయపడ్డారు. చేతిలో కత్తి, జేబులో అగ్గిపెట్టెలు పెట్టుకునే తిరగాలని ప్రతి ఒక్కరికీ తెలిపారు. అలాగే ఎవరూ ఒంటరిగా తిరగకూడదని హెచ్చరించారు. దుర్గమ ప్రదేశంలో తాండను నిర్మించిన సోమ్లా గుండె ధైర్యాన్ని మెచ్చుకున్న బంజారాలు, తాండను సురక్షితంగా కాపాడటం తమ కర్తవ్యం అని భావించారు. సారాయి తాగడానికి చుట్టుపక్కల ఊర్లో నుంచి కన్నడ మాట్లాడే కోరికోక్ (కన్నడ జనం) వచ్చేవారు. కాలం మారుతున్నట్టే మనుషుల మనసులు మారసాగాయి. దొంగతనంగా కాచిన సారాయి తాగడం ఎక్కువై, ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. సారాయి తయారు చేస్తూనే తాగి పడుకుంటున్నా యంక, కాళ్య, పీరులు ఇంటికి రావడమే రెండు మూడు రోజులకు ఒకసారి. కాళ్య భార్య పీరి గుడిసెకు మోళకాల్మూరు జమీందారు మల్లప్పగౌడ కొడుకు సిద్దేశి సారా తాగే సాకుతో వచ్చిపోతున్నాడు. డబ్బు దర్పంతో, కాళ్య భార్య పీకితో చనువు పెంచుకున్నాడు."ఏ లమాణి " అని ఏక వచనంతో పిలుస్తున్నాడు. మితిమీరిన చనువు చూపుతున్నాడు. అతని వెనుక నాయకుల తిప్ప, చెలవాది చెన్న, ఉప్పార మంజ్యలు పీకలదాకా తాగి ఆమె చేతులను, ఒంటిని తాకేవారు. "ఏయ్, ఏమైందప్ప మీకు" అని ఆమె కన్నడలో మాట్లాడే ప్రయత్నం చేసేది. అతను ఆమెను భార్యను పిలిచినట్టు పిలవడం ఇరుగుపొరుగు వారికి నచ్చలేదు. సిద్దేశి స్నేహితులు ఒక

కొత్తపురుగును అతని తలలో వదిలారు. మొదట్లో ఆమె అడిగినంత డబ్బులు ఇచ్చేవాడు. తర్వాత రాత్రిళ్లు కోడిచారు, రొట్టె చేయించుకుని తిని, ఒకట్రెండుసార్లు ఆమె ఇంట్లో ఉండిపోయాడు. దాంతో పీరిపేరు తాండాలోని ఇంటింటా మారుమ్రోగింది. పేదవాళ్ల వార్తలకు రెక్కలు వచ్చేస్తాయి. అయితే ధనవంతుల ఇంట్లో ఏమి జరిగినా ఎవరి చెవిన పడవు. యవ్వనపు వేడి, దొంగ సారాయి, కాచడం, తాగడం అంతే జీవితం అనుకుంటే చాలా? ఇంట్లో వయసులో ఉన్న భార్య ఉందనే విషయం గమనించవద్దా? చూసింది, ఒంట్లో వేడి పెరిగింది. చల్లబరిచేవాడి కోసం ఎదురుచూసింది. లంబాడి మనిషి దొరకక సిద్దేశితో పడుకుంది.

తాండా క్రమం తప్పేలోపు ఏదైనా చేయాలని సోమ్లా భుక్యా అనుకున్నాడు. మార్పు కోరుకునే జనంకూడా కొట్లాడటం కుదరదని మౌనం వహించాడు. ఇంతకీ పీరీ, సిద్దేశీలు పడుకున్నది ఎవరూ చూడలేదు. అంతా ఊహలే. బీదవాళ్ల మీద అందరి దృష్టి ఉంటుంది. పేదరికపు బాధలు భరించలేక అడ్డదారులు తొక్కుతారనే వదంతులు ఎక్కువ. పరిస్థితులు ఇలా ఉన్నప్పుడు నేనేమి ఏమి చేయగలనని మౌనం వహించాడు. అయితే డావో, కారభారి విషయం తెలిసి, దీనికి ఏదో ఒక పరిష్కారం కనుక్కోవాలని, కళ్లారా చూసినవాడిని సాక్ష్యం చెప్పటానికి పిల్చుకుని వచ్చారు. డావో దకణ్య నాయక్, "తండా నాయకుడివి. నీవే మౌనంగా ఉంటే, రేపు తాండా క్రమం తప్పి నాశనమై పోతుంది" అన్నాడు. డావో చెప్పింది కారభారి ఊసరవెల్లికి కంచె సాక్ష్యం అన్నట్టు తల ఊపాడు. సోమ్లాభుక్యాకు అన్నీ తెలుసు. అయితే విషయం బయటపడకూడదని మౌనం వహించాడు. దీనివల్ల కలిగే పరిణామాలు ఎలా ఉంటుందో ఎవరు ఆలోచించలేదని సోమ్లాభుక్యా విచారించసాగాడు. మొళకాల్మూరు జమీందారు బ్రిటిషుల మనిషి. బంజారాలు ఇక్కడ నివసిస్తున్నారని తెలిస్తే వాళ్లు సైన్యసమేతంగా వస్తారనే భయం. దీన్నే తమ బలహీనతగా భావించి సిద్దేశి, మంజ్యలు తాండలో గొడవ చేయడానికి పూనుకున్నారు. ఈ విషయాన్ని ఇలాగే వదిలేస్తే తాండాలోని ఆడవాళ్లందరిని, పిల్లలను ఈ వెధవలు వేధిస్తారు. 'కాయి కరేరో కారభారి' (ఏం చేద్దాం కారభారి) అని కంకాళి వైపు చూశాడు. అతను ఏమి చెప్పగలడు? "ఏమో మామా, నువ్వు తెలివైనవాడివి. నువ్వే ఏదో ఒక దారి చూపించాలి" అని తలపాడుచేసుకోవడానికి పోలేదు. అయితే దకణ్య నాయక్ మాత్రం, "దీనికొక పరిష్కారం చూడాల్సిందే నాయకా. లేకపోతే మన ఆడవాళ్ళు, పిల్లలు వీధిపాలవుతారు" అని కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు. "ఆవేశం మంచిది కాదు. నెమ్మదిగా ఆలోచించాలి. ఎందుకంటే ఇప్పుడు పరిస్థితులు మనకు

అనుకూలంగా లేవు. తెల్లవాళ్లకు మనం ఇక్కడ ఉన్నామని తెలిస్తే మన పిల్లల్ని, ఆడవాళ్లని, అందరిని చంపేస్తారు" అని సోమ్లా కరాఖండిగా అన్నాడు. "మనం చేయకూడనిది ఏమి చేశాం? మనల్ని చంపడానికి" అని కంకాళి అడిగాడు. "చూడు తెల్లవాళ్లు దేశంలోకి వచ్చారు. మన జనమే వారికి దారులు చూపించారు. దారి చూపించినవాడు మనకు కంటకం కావచ్చనే భయం" అన్నాడు సోమ్లా. అతని మాటలు అర్థమయ్యాయో లేదో, కంకాళి 'ఊఁ' అని తలూపి, ఆకువక్కలు తీసుకొని వేసుకోసాగాడు. సోమ్లా తలలో వందలాది ఆలోచనలు ఎగిసిపడుతున్నాయి.

కొండ మలుపులోకి వస్తున్నట్లే సిద్దేశి, అతని మిత్రుల గుర్రాలని నిర్ధారించుకున్న నలుగురు వికారంగా కేకలు వేస్తూ వారివైపు రాళ్లు విసరసాగారు. కొండ మలుపులోంచి ఆ సాయంత్రం ఎవరు ఆ రాళ్లు విషిరారో అర్థంకాక అయోమయంలో పడ్డారు. "అన్నా, ఏమిటన్నా ఇది?" అని మంజ్య అడిగాడు. "అదే నాకూ అర్థం కావడం లేదు" అని సిద్దేశి తలగోక్కున్నాడు.ఏదో విధంగా పీకిని కలవాలనే కోరికతో అతను వచ్చాడు. అయితే అకస్మాత్తుగా ఇలా ఈ దారిమధ్యన జరుగుతున్న సంఘటనకు గాభరాపడ్డాడు. "రేయ్, పిచ్చి నా కొడకల్లారా, ఆలోచించండ్రా, ఇప్పుడు ఏం చేద్దాం?" అని గద్దించాడు. "అదే అన్నా, మాకూ అర్థం కావడం లేదు. ఉన్నట్టుండి రాళ్లు పడటమేమిటి? ఏ బ్రహ్మ రాక్షసో లేదా దెయ్యమో లేదా భూత ప్రేతాలో లేచి వచ్చాయా?' అని మంజ్య అనుమానపడ్డాడు. ఊరికి తిరిగి వెళ్లటం తప్ప మరోదారి కనిపించలేదు. సిద్దేశికి మాత్రం పీకీని చూడకుండా వెళ్లడానికి మనసురాక సతమతమవ్వసాగాడు. అయితే రాళ్లు పడటం ఎక్కువై ప్రాణాలకు ప్రమాదమైతే ఎలాగా అని ఆలోచించాడు. "అరేయ్ లంజా కొడకల్లారా, తట్టుకోలేక పోతున్నాను. ఏదైనా దారి చూపండ్రా. మీకు తినిపించి, తాగించి నా వెనక తిరగడానికి పెట్టుకున్నది ఎందుకు? దండగ తిండి తింటూ, పనికిరానివారిలా ఇలా ఉండడానికి కాదు. బుర్ర ఉపయోగించండి" అని అంటూ ఉండగానే ఎక్కడి నుంచో రంయ్‌మంటూ దూసుకొచ్చిన రాయి సిద్దేశి తలకు తగిలింది. "అయ్యో, అమ్మ, చచ్చాను" అంటూ నేలమీద కూలబడ్డాడు. "అన్నా... అన్నా" అంటూ తల పగిలి కారుతున్న రక్తాన్ని అడ్డుకోవడానికి తువ్వాలుతో బిగించికట్టాడు మంజ్య. "రేయ్, వెధవా, అన్నకు ఊపిరి ఆడుతుందో లేదో చూడు" అని చలవాది చెన్న అన్నాడు. "ఒరేయ్ వెర్రినాయాలా, అన్న మూర్ఛపోయిన సమయంలో తమాషాలు చేస్తావా? రా, పట్టుకో, ఎత్తుకొని పోదాం" అని అతన్ని ఎత్తుకొని అక్కడినుంచి మరొక చోటుకు తీసుకొనిపోయి, తువ్వాలు కొసను నీళ్లలో అద్ది తెచ్చి సిద్దేశి

ముఖాన్ని తుడిచారు. కొద్దిసేపటికి కుదుటపడ్డ సిద్దేశి 'పీకి' అని అరిచాడు. "చూడంఁడ్రా, తలపగిలి రక్తం కారుతున్నా 'పీకీ' అని అంటున్నాడు లంజా కొడుకు. ఆడవాళ్లంటే ప్రాణాలు వదులుతాడు ఈ పాడు గౌడ. ఇంట్లో బొమ్మలాంటి భార్య ఉన్నా ఇదేమీ పాడు అలవాటో" అని చలవాది చెన్న గొణుక్కున్నాడు. "చాల్లేరా లంజా కొడకా! అన్నకు ప్రేమ కావాల్నంట. నీకు అర్థంకాదా?" అని అన్నాడు మంజ్య. "అది కాదన్నా, అందుకు నన్ను ఏం చేయమంటావో చెప్పు. కొండమీది కోతిని తెమ్మన్నా తెస్తాను. తీసుకురానా?" అన్నాడు చలవాది చెన్న. "నా అన్నం తిని, నా సారాయి తాగి పిచ్చివాగుడు వాగుతున్నాడు నా కొడుకు" అని సిద్దేశి కోపంతో అన్నాడు

రాళ్లు విసిరి విసిరి పిచ్చి కోతుల్లా తండా కుర్రవాళ్లు పారిపోయారు. జరిగినది తండా నాయకుడు సోమ్లా ముందు ఒక్కటీ వదలకుండా చెప్పారు. సోమ్లా ఒక గడియసేపు మౌనంగా ఉండి "మీరేమీ కంగారు పడకండి. ఇదంతా మామూలే. అయితే ఇక్కడ జరిగింది ఎవరూ ఎక్కడా చెప్పకండి. రేపుఒకటి పోయి మరొకటి జరగవచ్చు" అని హెచ్చరించాడు 'అయితే ఈ ఘటన ఇంకా ఏ విరాట్ స్వరూపం తీసుకుంటుందో' అనే భయం మనసులో వుండనే ఉంది. అంతేకాకుండా బంజారాలు అంటేనే తెల్లవాళ్లు మండిపడతారు. అలాంటప్పుడు ఈ మూడుకాసుల ఆడవాళ్లు చేసే పనికి మనమంతా బలిపశువులు కావాల్సి వచ్చిందని అనుకుంటూ తన వ్యాపారం వైపు నడిచాడు. తండ్రికి తగ్గ కొడుకులా ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ బాధ్యతనంతా చక్కగా నిర్వహించసాగాడు. ఎవరికి తెలియకుండా అడవిలో భూమి తీసుకొని చదును చేశాడు. ధనసింగ్ గొప్పగా కలగన్నాడు. సంచార జీవితానికి ముగింపు పలకాలనే పట్టుదల అతనిది. ఈ భట్టీ సారాయి వ్యాపారం చాలా రోజుల వరకు సాగదని కూడా అతను ఊహించాడు. అతని కుటుంబం పెరిగింది. చనిపోయిన అతని చిన్నాన్న పిల్లలు, చిన్నమ్మలు, మరొక తాతకు సంబంధించిన మనవళ్లందరికీ అతనిమీద నమ్మకం ఉంది. అతనికి పెళ్లివయసు వచ్చిందని అతని నానమ్మ సోమ్లీకి అర్థమైంది. కొడుకు సోమ్లాను పిలిచి, "నేను చనిపోయేలోపు నా మునిమనవళ్ళ ముఖాలు చూపించు. వాళ్లను చూసి చచ్చిపోతాను. మీ నాన్న బతికివున్నాడో, చనిపోయాడో తెలియలేదు. నీ తమ్ముడి కబురు నీవు తెలుసుకునే ప్రయత్నం చేయలేదు" అని కొంగులో ముఖం దాచుకుని ఏడవసాగింది. "అమ్మా, ప్రతికూల పరిస్థితుల్లో ఏమీ చేయలేక చేతులు కట్టివేసినట్టుగా ఉంది. నీవు ఇలా మనసు కష్టపెట్టకోకు. నేను కావాలని ఏమీ చేయటం లేదు. బయట తెల్లవాళ్లు

మనవాళ్లను వెతికి వెతికి చంపుతున్నారు. ఆ వయసులో నాన్నకు పోరాటం అవసరం లేదు. అతని వెనుక గొప్ప వీరుడన్నట్టు ఈ చోక్ల వెళ్లాడు. ఇప్పుడు వాళ్లిద్దరూ ఎక్కడ ఉన్నారో ఆ దేవుడికే తెలుసు!" అని ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు

కారభారి కూతురు సీత్కిని ధనసింగ్‌కు తెచ్చుకోవాలని ఇంటివాళ్ళు మాట్లాడుకుని కబురు పెట్టారు. ఆ మాట విని కంకాళి మునివేళ్ల మీద నిలబడ్డాడు. ముందూ వెనకా చూడకుండా ఈ సంబంధానికి అంగీకరించాడు. ఆకులు పంచే శాస్త్రం ముగించి, దీపావళి మరుసటి రోజున పెళ్లి జరిపించాలని నిర్ణయించారు. అప్పుడప్పుడే సీత్కి ఋతుమతి అయింది. ఆ తండా నాయకుడి సంబంధం దొరకడం గౌరవం అనుకొన్నాడు కారభారి. అంతేకాకుండా కరతోట్ తెగవారు గొప్ప పేరున్నవారు. తమ అస్తిత్వపు ప్రశ్న కూడా వచ్చింది. అందువల్ల అల్పసంఖ్యలోని ఝురప్లా కులానికి చెందిన కారభారి కంకాళి ఊఁ అని అనాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ధనసింగ్ వ్యాపారం చేస్తున్నాడు. బాగా సంపాదించే కుర్రవాడు. అతని తాత, చిన్నాన్న బ్రిటిష్‌వారి తూటాలకు ఆహుతై చెల్లాచెదురైన మొత్తం కుటుంబం బాధ్యతను స్వయంగా అతనే మోసుకున్నాడు. అందువల్లనే దక్షిణంలో ఉన్న సమతల ప్రదేశంలో రాత్రీపగలూ అనకుండా అడవిచెట్లను, పెద్దపెద్ద పొదలను, ముళ్లచెట్లను తన మనుషులతో కలిసి తొలగించి, నూరు ఎకరాలు స్థలాన్ని చదును చేశాడు. తెల్లవాళ్లకి తెలిస్తే శ్రమ బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని తెలుసు. అయితే తాండను నిర్మించాల్సిన అవసరం వుంది. తన పెద్దలు తమ మూలస్థానమైన రాజస్థాన్‌ను వదిలి నాలుగు తరాలు గడిచాయి. అంటే దాదాపు ఒక శతాబ్దం గడిచింది. అక్కడున్న జమీను, ఇల్లు, బంధువులు అన్నిటినీ, అందరినీ క్రమంగా మరిచిపోయారు. ప్రస్తుతం ప్రతికూల పరిస్థితుల్లో దేసునాయక్ తాండాలోనే నివసించడం మంచిదని అనుకొన్నాడు ధనసింగ్. ఎందుకంటే ఒక అడవి నడుమ, మైదానం చుట్టూ పెద్దకొండలు, పశువులకు కావలసినంత మేత, జనానికి సారాయి తయారు చేసుకోవటానికి అనుకూలంగా ఉన్న రహస్య స్థలాలు ఉన్న ప్రదేశమది. ఈ ఉద్దేశంతో దేసు నాయక్ తాండనే తమ శాశ్వతమైన స్థిరనివాసం చేసుకోవాలనే తన కలను నిజం చేయాలన్నట్టు చాలా మంది యువకులు అతని జమీను చుట్టపక్కల్లో తాము కొంత జమీను తీసుకున్నారు.

సిద్దేశి అవస్థను చూసిన జమిందార్ మండిపడ్డాడు. చలవాది చెన్నను, ఉప్పార మంజ్యను పట్టుకుని, "కూయంద్రా, దొంగ నా కొడకల్లారా! నా కొడుక్కు ఏమైంది? చుట్టూ కోసుదూరంలో ఈ మల్లప్పగౌడ విషయం పేరు వింటే జనం ఉ

చ్చపోసుకుంటారు. అలాంటప్పుడు నా కొడుకును కొట్టడానికి ఎవరికీ ఇంత ధైర్యం వచ్చింది?" అని చెప్పు తీసుకుని వాళ్లను కొట్టసాగాడు. ఏమీ చెప్పడానికి నోరు రాక, ఆ లంబాడి తాండలో ఉన్న దయ్యం" అని అసందర్భంగా ఏమేమో వాగాడు మంజ్య. మల్లప్పగౌడ ఒక్కక్షణం నివ్వెరపోయాడు. తర్వాత "సరే నేను కనుక్కుంటాను. ఇంకొకసారి అటువైపు వెళ్లకండి" అని విషయం పూర్తిగా తెలుసుకోవడానికి మనిషిని పంపాడు. తెల్లవాళ్ల సేవ చేసుకుంటూ మల్లప్ప బాగా సంపాదించుకున్నాడు. అయితే తన కొడుకు చేయకూడని పని ఏదైనా చేస్తే అని ఆలోచనలో పడ్డాడు. ఆడవాళ్ల విషయంలో వీడు తనను మించినవాడని కొడుకు ప్రతాపాన్ని గుర్తుచేసుకున్నాడు. తూర్పుదిక్కులో ఎవరు ఉన్నారు? అటువైపు కొండలుగుట్టలు, అడవి తప్ప ఊర్లు లేవు. అయితే చాలా రోజుల నుంచి జనం బంజారాలు వచ్చి దుర్గమమైన అడవిలో నివాసం ఉన్నారని, మంచి భట్టిసారాయి దొరుకుతుందని మాట్లాడుకుంటున్నారు. వీడు లంబాడి ఆడవాళ్లను తగులుకున్నాడా? ఆ జనం నమ్మితే ప్రాణం ఇస్తారు. ద్రోహం చేస్తే ప్రాణాలు తీస్తారు. ఈ లంజా కొడుకు వాళ్ల ఆడవాళ్ల దగ్గరికి పోయాడా? అనే ఆలోచనలు మల్లప్పగౌడను కమ్ముకున్నాయి. విషయం తెలుసుకోవటానికి పోయినవాడు తిరిగొచ్చాడు, "ధనీ, ఎవరో పీకే అనే లంబాడీ ఆడదానితో చిన్నయజమానికి సంబంధం ఉందట" అని అన్నాడు. ఆ మాటలు వినగానే, "ఇక చాలు, ముందు నువ్వు ఇక్కడి నుంచి పో" అన్నాడు మల్లప్ప. హైదరాబాద్ నిజాము సైనికులకే లొంగని జనం మనకు భయెపడుతారా? అని మనసులో అనుకున్నాడు మల్లప్ప.

మల్లప్ప గౌడ తన బాల్యంలో జరిగిన సంఘటనను గుర్తుచేసుకుని అక్కడే కూర్చున్న కడెమని రామ, హొదిమని శ్రీశైలంలకు కథను చెప్పడం ప్రారంభించాడు. ఈ లంబాడీలు చాలా గట్టివాళ్ళు. అంతేకాదు చాలా ధైర్యవంతులు కూడా. నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. మా తాత కాలంలో మా వూరి దగ్గర్లోనే వ్యాపారం చేసుకోవడానికి ఈ బంజారాలు వచ్చారు. ఆ సమయంలో నిజాం సేనాధిపతికి బ్రాహ్మణులకు సరిపోయేదికాదు. మొత్తం బ్రాహ్మణులు మా ఊరు పక్కన ఉన్న బంజారా గుడారాలకు వచ్చి దాక్కున్నారు. ఆ విషయం తెలుసుకుని గుడారాలను సైనికులు చుట్టుముట్టారు. "చూడండి బంజారాలకు మాకు ఎలాంటి దుష్మనీ లేదు. మీ గుడారంలో ఉన్న బ్రాహ్మణులను, ఆడవాళ్లను మాకు అప్పగించండి" అన్నారు సైనికులు. అయితే ఒక బంజారా నాయకుడు తన మీసాలను మెలివేసి "మీరు మగవాళ్లు అయితే లోపలికి వచ్చి చూసుకొని పో లేదా వచ్చిన దారిని

వెళ్ళిపో" అని సవాల్ చేశాడు. 'ఇప్పుడు వదిలివేస్తున్నాం. మళ్లీ తిరిగి వస్తాం. అప్పుడు ఉంది మీ కథ' అని బెదిరించి వెళ్లిపోయారు. తర్వాత వాళ్లు తిరిగి రానేలేదు. ఇలాంటి జనం వీళ్లు. అలాంటి వాళ్ల సహవాసానికి ఎందుకు వెళ్లాడు ఈ నా కొడుకు?" అని మల్లప్ప తన కథను ముగించాడు. అదే సమయానికి సరిగ్గా బళ్ళారి కేంద్రం కచేరీలో ఉన్న బ్రిటీష్ కమిషనర్ కెప్టెన్ కౌలు రాంపురం గుండా ప్రయాణం చేస్తూ మల్లప్పగౌడ ఇంట్లో టిఫిన్‌చేసి వెళ్తానని కబురు పంపించాడు. దఫేదార్ హసనుసాబ్ కబురు తెచ్చాడు. "ఎలాంటి పరిస్థితి వచ్చిందికదా సాయిబు" అని మల్లన్న విచారంతో అన్నాడు. 'యజమానీ, మీరు పెద్దవాళ్లు. తమకు ఎలాంటి సమసలున్నాయో మాలాంటి సామాన్యులకు ఏం తెలుస్తుంది? ఎలాగూ కౌలు సాహెబ్ వస్తున్నారు కదా! వారినే అడగండి" అని తెలియని విషయం ప్రస్తావించడం ఎందుకని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అయితే కౌల్ సాహెబ్ సాయంత్రం సమయానికి వచ్చాడు. అతని వెనకే ఒక చిన్న సైనికపటాలం ఉంది. మల్లప్ప నివాసంలోనే వారికి బస ఏర్పాటు చేశారు. గొర్రె, కోళ్లు, చేపలు ఏమి కావాలో అవన్నీ ఆయన కోసం వండి సిద్ధం చేశారు. "ఊఁ మల్లన్నా, ఇక్కడ దొంగ సారాయి దొరకదా?" అని కెప్టెన్ కౌల్ అడిగాడు. ఉందంటే ఒక ఇబ్బంది, లేదని అంటే మరొక రకమైన ఇబ్బంది. 'హుజూర్' అని రాగం తీశాడు. "పరవాలేదులే. మేమే చూసుకుంటాం. నీవు తల పాడుచేసుకోకు" అని అతన్ని పొగడక, తెగడక మౌనంగా ఉండిపోయాడు. అది చూసి మల్లప్పకు దిగులు పట్టుకుంది. ఎవరైనా తనకు వ్యతిరేకంగా చాడీలు చెప్పారేమోనని అనుకున్నాడు. "దేవుడా, ఎలాంటి పరిస్థితి తెచ్చావుకదప్పా. ఈ లంజకొడుకులు సూటిగా ఆలోచిస్తారో, వక్రంగా ఆలోచిస్తారో, ఒక్కొక్కసారి ఒక్కో రకంగా ఉంటారు. ఈరోజు ఈ స్థితి నుంచి తప్పించు తండ్రి" అని ఇంటి దేవతను ప్రార్థించాడు. క్యాప్టెన్ కౌల్ రాత్రి వేటకోసం అడవి లోపలకి వెళ్లే ఆలోచనతో అందుకు కావలసిన ఏర్పాట్లను చేయమని మల్లప్పకు చెప్పాడు. అడవిలో జంతువులు ఉన్నాయా లేదా మనుషులు ఉన్నారా?" అని అడిగాడు కౌల్. "లేదు హుజూర్, మనుషులు ఎక్కడ ఉంటారు? కేవలం జంతువులే ఉన్నాయి" అన్నాడు మల్లప్ప. ఒకవేళ వీళ్లు బంజారాల గుడిసెలు చూస్తే తన తల తెగిపోతుందికదా అని ఆలోచించి, కెప్టెన్ కౌల్ వెళ్లే దిశను తప్పించే ప్రయత్నం చేశాడు. "హుజూర్ అటు వైపు జంతువులు తక్కువ. ఇటు వైపు వెళదామని పశ్చిమానికి బదులు తూర్పుకు పిలుచుకొని పోయాడు. కెప్టెన్ కౌల్‌కు అడవిలో బంజారాలు దాక్కున్నారన్న

సమాచారం వచ్చింది. అయితే మల్లప్ప చెప్పాడని అటువైపు వెళ్లడం మాని ఇటువైపు వెళ్లాడు. రాత్రి జింకలు గుంపులు గుంపులుగా వచ్చాయని కౌలుకు అనిపించింది. అయితే ఒక్క కుందేలు కూడా దొరకని పరిస్థితి వచ్చింది. అయినా పట్టువదలకుండా ముందుకు పోయాడు. "మల్లప్పా, ఇంత దట్టమైన అడవిలో ఒక్క జంతువు లేదంటే ఏమిటి?' అని అడిగాడు. "హుజూర్, లేవు అంటే లేవనే అర్థం" అని ఏమీ చెప్పలేని సందిగ్ధస్థితిలో ఉండిపోయాడు. మల్లప్ప గుర్రంమీద కూర్చున్న చోటే నిద్రమత్తుతో ఊగసాగాడు. కెప్టెన్ కౌల్ మాత్రం వేటాడే మంచి హుషారుతో నిద్రని కూడా మరిచిపోయాడు. "మల్లప్ప, వై ఆర్ యు స్లీపింగ్" అని గద్దించాడు. "పొరపాటైంది హుజూర్, నిద్ర వచ్చింది" అని నిస్సహాయతతో చెప్పాడు. "సైనికులారా! మీరు ఇక్కడే రెస్ట్ తీసుకోండి, నేను ముందుకు పోతాను" అని నలుగురైదుగురు సైనికులతో ఆయన ముందుకు పోయాడు.

ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ పెళ్లి ఏర్పాట్లు వైభవంగా జరిగాయి. కారభారి కూడా తన చేతనయినంతగా ఖర్చు చేశాడు. సోమ్లా, భీమణిలకు కొడుకుపెళ్లి పెద్ద పండుగలాగా కనిపిస్తే, ధనసింగ్ నానమ్మ సోమ్లీకి తన వంశపు మొలకను అభివృద్ధి చేయబోయే మనవడు, మునిమనవడిని చూసే చావాలనే కోరిక. బ్రిటిషువారి భయాల మధ్య హడావుడిగా పెళ్లి జరిపించి చేతులు కడుక్కున్నారు. ప్రతిక్షణం వారికి భయంకరంగా గడిచింది. బ్రిటిషులు ఏ వైపు నుంచి దూసుకొని వస్తారో అనటం ఒకటైతే; మరొక వైపు హోండి గుడియా (ముంత సారాయి) కోసం బయటి ఊరికి పోయినవారిని ఎక్కడ గుర్తుపడతారో అనే భయం. తొందర తొందరగా గుంజను పాతి, నలుగురికి బెల్లం పానకం పంచే శాస్త్రం ముగించారు. ఆకులు, బీడీలు పంచారు. పెళ్లికొడుకు అమ్మాయి ఇంటి ముందు హాజరయ్యాడు. కెప్టెన్ కౌల్ మొళకాల్మూరులో మకాంపెట్టి బంజారాల కదలికలను గమనిస్తుండటం, పేటకు వెళ్లిన ఎవరి నుంచో విషయం తెలుసుకున్న సోమ్లా అమ్మాయిల డోలీలను నిలిపాడు. నాయకుడు, డావో పంచాంగం చదవటానికి కూర్చుంటే, కుర్రవాడు సింగం పులి జింక రూపంలో కనిపించగానే తీపు పంచి పెళ్లికి సిద్ధంచేశారు. ఇద్దరి స్నానాలు ముగిసిన తర్వాత సంక్రి నాయక్, నౌసొదాన్ మొదలుపెట్టాడు. అందరిని తిట్టి పురోహితుడిలా మంత్రాలు చెప్పసాగాడు. పొర సొదాన, భూమి సొదాన, నిప్పుకు ఎండు గడ్డి, సాంబ్రాణి పోయడం సొకసొధాన కారభారి, అతని భార్య కూడా రాత్రి హూంహూం అనసాగారు. అతని అవతారం మందికి నవ్వు వచ్చేలా ఉంది. పంచె, పాత అంగి, తలకొక పనికిరాని టోపీ, దానితోపాటు మామిడి

ఆకులు లేదా వేపమండలు కట్టి చూసేవారికి నవ్వు వచ్చేలా ఉన్న ఇంటి మీద నిలబెట్టిన వెదురు బొమ్మలా కనిపిస్తున్న ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్, సీత్కీబాయిల పెళ్లి ముగిసే తీరే అందరిని అలరించింది. గప్‌చుప్‌గా ధనసింగ్ పెళ్లి ఊరేగింపు వచ్చి ఇల్లు చేరుకుంది. అతని నానమ్మకు ఎక్కడలేని సంతోషం. సోమ్లీ మనవడి మెడ చుట్టూ చేతులు వేసి కౌగిలించుకుని, ఎన్నో సంవత్సరాల నుంచి గుండెలో వ్యక్తపరచకుండా ఉండిపోయిన భావాలను పంచుకుంది. ధనసింగ్ నానమ్మ చెబుతున్న ప్రతి ఒక్కమాటను అర్థంచేసుకుని దుఃఖం పొంగి రావడంతో బిగ్గరగానే ఏడవసాగాడు. తలుపులకు బిళ్ల కొట్టి లోపలికి తీసుకువెళ్లే శాస్త్రం ఉండటంవల్ల బలవంతంగా వారిని విడిపించడం జరిగింది. నానమ్మ మళ్లీ కుళ్లికుళ్లి ఏడవసాగింది. ధనసింగ్ ముఖం తుడుచుకుని శాస్త్రానికి సిద్ధమై వచ్చాడు.

రాగి బిళ్లను తలుపు గడపకు మేకుతో కొట్టిన తర్వాత ఇద్దరిని లోపలికి తీసుకునిపోయి, తీపిమిఠాయిలు తినిపించారు. వచ్చినవారికి ఉపచారాలు చేసిన తర్వాత రెండు మూడు రోజుల నుంచి నిద్రలేకుండా అలిపోయినవాళ్లు , అక్కడికక్కడే జాగా చూసుకుని ముడుచుకుని పడుకున్నారు. ఇంటి లోపలి కొత్త ఈతచాపలు, గోనెపట్టాలు వచ్చినవారికి సరిపోయాయి. వధూవరులు కూడా ఒక మూలలో పడుకున్నారు. మొత్తం తాండకు తాండనే మౌనంగా ఉంది. పహారా కాసేవారు ఎక్కడా వెలుతురు లేకుండా దీపాలు ఆర్పి, చెట్టెక్కి కూర్చున్నారు. కొద్ది దూరంలోనే జనం మాట్లాడుకుంటున్న సద్దు వినిపించి తమ జంతువుల ధ్వనులతో ఎప్పటిలాగే ఒకరికొకరు హెచ్చరిక చేసుకున్నారు. ఆ తాండా నాయకుడు మాత్రం భయం లేదన్నట్టు సూచనా ధ్వనిని వెలువడించాడు. ఐదారు మైళ్ల దూరంలో ఉన్న గుంపు కూడా ప్రజలు ఉన్న ప్రాంతాన్ని ప్రవేశిస్తే; వాళ్లు తాండా వైపు వస్తున్నారో లేదా మరో వైపు వెళుతున్నారో స్పష్టంగా లేదనే సందేశాన్ని రవాణా చేశారు. రాత్రి రెండు తాండాలు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని పహారా కాస్తున్నాయి.కెప్టెన్ కౌలుకు మొదటిరోజున అనుమానం వచ్చినందువల్ల తన ప్రయాణాన్ని వాయిదా వేసి మల్లప్ప ఇంట్లోనే బస చేసి, పశ్చిమానికి వేటాడే అభిప్రాయాన్ని వ్యక్త పరిచాడు. మల్లప్ప నిస్సహాయుడయ్యాడు. బ్రిటిష్ అధికారి చెబితే అదే చట్టం. మరుసటి రోజు రాత్రి యధావిధిగా కెప్టెన్ బయలుదేరుతానని అనగానే అతని సహచరుడు, భారతీయుడైన పటేల్ రుద్రగౌడ, అతని వంటవాడైనా చాందసాబ్‌లకు ఉన్న వాస్తవాన్ని వివరంగా చెప్పాడు. చాంద్ సాబ్, రాత్రి కెప్టెన్ తాగే బ్లాక్‌హక్స్ అనే మద్యం ప్రమాణాన్ని అతనికి తెలియకుండా 20% పెంచాడు. పటేల్ రుద్రగౌడ ఏమీ జరగకుండా

తాను చూసుకుంటానని మాట ఇచ్చాడు.

కౌలు బయలుదేరేటప్పుడు పూర్తిగా తయారీ బయలుదేరాడు. అయితే మార్గమధ్యంలోనే నిద్ర ముంచుకుని రావడంతో; పైగా రుద్రగౌడ కూడా "యువర్ హైనెస్, తమకు ఏదైనా అనీజిగా ఉందా" అని అడిగాడు. "నో, ఐ యామ్ ఆల్ రైట్" అని గుర్రాన్ని వెనక్కు తిప్పాడు. చాంద్ సాబ్, మల్లన్నలకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది. పాపం లంబాడీలు ఎవరి జోలికి వెళ్లకుండా అడవుల్లో వుంటూ కలిమి పళ్లు, కట్టెలు, బంక, భట్టిసారాయి అమ్ముకుని వాళ్ల బతుకు వాళు బతుకుతున్నారు. అడవి వీళ్ల బాబు స్థలమన్నట్టు ఆ అమాయకులను అక్కడ వుండనీయకుండా పట్టుకుని జైల్లోవేస్తారనే ఆలోచన ఆయన మనసులో మెదిలింది.

పహారా కాస్తున్న వాల్యా విసళావత్ జాగ్రత్తగానే వాళ్లు అడవి నుంచి దాటిపోవటం, గుర్రమెక్కి వారి వెనుకేపోయి నిర్ధారించుకున్నాడు. లేకపోయివుంటే ఇక్కడ తాండలో పడుకున్నవారి మీద దాడి చేసి మొత్తం తాండానే ధ్వంసం చేసేవారు. బ్రిటిషుల క్రూరత్వం రుద్రగౌడకు తెలుసు. అందువల్లనే కెప్టెన్ కౌల్‌ను దిశ తప్పించాడు. 'ఎవరైతే ఏమిటి? మన జనం బతికిపోయారు' దగ్గరి నుంచి గమనించిన వాల్యా అన్నాడు. మొత్తానికి పెద్ద ప్రమాదం తప్పింది. వాళ్ల కంట పడివుంటే జైల్లో వేసేవారు. లేదా గుళ్లు పేల్చి చంపేసేవారని వాల్యా తన తర్కాన్ని బయటపెట్టాడు. నాయకుడు సోమ్లకు జరిగిన సంఘటనను వివరించాడు. సోమ్ల ఎలాంటి ప్రతిస్పందనను చూపించలేదు. కారభారికి "ఇలాగైతే మన బతుకులు కష్టాల్లో వుందప్పా" అని డావో అన్నాడు. అతను మొదటే పిరికి స్వభావం ఉన్నవాడు. "అది కాదు, మనమందరం వెళ్లి మేము కేవలం లంబాడీలం. ఇక్కడే అడవిలో నివసిస్తున్నామని చెప్పేద్దాం" బ్రిటిషులు తన పెద్దనాన్న కొడుకులు అన్నట్టుంది అతని మాటలు. అందరి మనసుల్లోనూ భయం గూడుకట్టుకుని ఉంది. దాదాపు నూటాయాబై రెండు వందల గుడిసె కట్టుకున్న లంబాడీలకు ఈ విధంగా వలసలు పోవటం విసుగొచ్చింది. పశువులను మేపుకుంటూ, భట్టి సారాయి, అడవి పళ్లు, కట్టెలు అమ్మి జీవితం సాగించవచ్చన్న నమ్మకంతో బతుకును రూపొందించుకునే కలను కన్నారు. అయితే నూటా ఎనిమిది విఘ్నాలు ఎదురై బతుకే ఒక సవాలైంది. ఒక వైపు అరణ్య చట్టం జారీ చేసిన తెల్లవాళ్లు. అడవిలో వాళ్లు తప్ప ఇతరులు ఎవ్వరూ ప్రవేశించకూడదని నిషేధాన్ని విధించి, అడవిలోంచి పెద్ద చెట్లను నరికి ఓడలు నిర్మించి, భారత్‌లోని సంపదను లూటీ చేసి తరలించడానికి ప్రణాళికలు వేస్తున్నారు. ఒక వైపు అడవినంతా సర్వనాశనం చేస్తున్నారు. మరొక వైపు ఇనాముల కోసం

పొగడి, ఇతరులపై చాడీలు చెప్పి, వాళ్లను ఇతరులకు వ్యతిరేకంగా తయారుచేసిన వ్యక్తుల నుంచి తప్పించుకోవాలి.

ఇలాంటి సందిగ్ధ పరిస్థితిలో సోమ్లు ఆలోచనలతో నలిగిపోయాడు. అతని కొడుకు ధనసింగ్, అతని తమ్ముడు రామసింగ్‌లు దేసునాయక్ తండా బాధ్యతలను మోయటానికి సిద్ధంగా ఉన్నారు. వారి కరమ్‌తోట్ వంశము పెరిగి పెద్దయి యాభై ఇండ్లు అయ్యాయి. వారంతా ఒకే స్థలంలో గుడిసెలను కట్టుకొని పశువుల పాలు, వెన్న,పేడా అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. అలాగే ఐశ్వర్యపు ఆలోచన కూడా లేకుండా ఆ పూటకు కడుపుకు ఇంత తిండి, తాగడానికి ఒకింత సారాయి ఉంటే రేపటి ఆలోచన లేకుండా జీవితాన్ని సాగించేవారు. సోమ్లా తోత్య కొడుకు రేఖ్యా పిల్లల బాధ్యతను, అతని చెల్లెలి పిల్లల బాధ్యతను మోసుకున్నాడు. తోత్య తాత కూడా తమ తాతకు తోడబుట్టినవాడనే భావనను ఏ రోజు పోగొట్టుకోలేదు. రేఖ్యాకొడుకు బద్యా నాయక్, కూతురు రేవణి బాధ్యతలను అతను చాలా సంతోషంగానే స్వీకరించటం రేఖ్యా ఎన్నడూ మరువలేదు. సోమ్లాకు అన్ని పనులలోనూ సహాయంగా ఉన్నా పెద్ద కొడుకు ధనసింగ్ 'తాంగడి' వచ్చినప్పుడు రేఖ్యా స్వయంగా ముందు నిలిచి సాయంత్రపు భోజనాలు ఏర్పాట్లు చేశాడు. ఎందుకంటే అతని కొడుకు బద్యా పెళ్లి, కూతురు రేవణి పెళ్లిని స్వయంగా సోమ్లా నిలబడి చేయించాడు. వాళ్లిద్దరూ దాదాపు ఒకే విధమైన మనస్థితిని కలిగివున్నారు. అందువల్లనే మొత్తం తాండాలో వారి జోలికి ఎవరూ వచ్చేవారు కాదు.

ప్రస్తుతం వచ్చిపడిన ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి ఏదో విధంగా హానగల కరణం శేషప్పభట్టుగారి కాళ్లు చేతులు పట్టుకుని లేదా ఆయన అడిగినంత డబ్బు ఇచ్చి, తాండా జమీను, స్థలాన్ని ప్రభుత్వ ఖాతాలో చేర్చటం ఒక్కటే మార్గంగా కనిపించింది. శేషప్ప భట్టు మల్లప్ప మాటను మాత్రమే వినేవారు. మల్లప్ప తాండా జనం మీద కోపంగా ఉన్నాడు. అతని కొడుకును ఎవరో కావాలనే కొట్టి, భయపెట్టారని అతని అనుమానం. తండ్రి ఎదురుగా కొడుకు మాట్లాడడం సరికాదని ధనసింగ్, తన తలలో మెదులుతున్న ఆలోచనను సభలో చెప్పలేదు. అయినా దాన్ని అదిమిపెట్టి ప్రయోజనం లేదని అనుకుని ఒకడితో గుట్టుగా చెప్పాడు. సమస్యను నిండు సభలో చర్చించాలి. లేకపోతే ఊరు మిగలదని ప్రతి ఒక్కరికి తెలిసిన వాస్తవమే. 'సభ అనుమతి ఇస్తే ఒక విషయం ఉంది, చెప్పమంటే చెప్తాను' అని చెందియా నాయక్ నిలబడ్డాడు. నాయకుడు, కారభారి ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. సోమ్లా ఏ మూల నుంచైనా మంచి సలహా వస్తే బాగుంటుందని ఎదురు చూస్తున్నాడు."అలాగే

చెప్పు చంద్రయ్య. ఏమో చెప్పాలని అనుకున్నావుకదా!" అని అన్నాడు. జనం మౌనం వహించారు."నాయక్, ఇప్పుడు మన ముందున్నది ఒకే ఒక దారి, దాన్ని వదిలితే ముందు గతిలేదు. మనమందరం స్వయంగా వెళ్లి మల్లప్ప కాళ్లు పట్టుకొని మా తాండాను రక్షించండి యజమాని అని వేడుకుందాం" అని అన్నాడు.

ఎవరు మాట్లాడలేదు, ఏమి చేయాలా ఎవరికీ అర్థం కాలేదు. ధనసింగ్, చందియామామ చెప్పింది సరిగ్గా ఉంది. అవసరమైనప్పుడు గాడిద కాళ్లను పట్టుకోమంటారు. మనం మల్లప్ప దగ్గరికి వెళ్లి ఎందుకు అడగకూడదు? ఇలాగే వదిలేస్తే తండా ఏ క్షణంలోనైనా ధ్వంసం కావచ్చు" అని తండా నాయకుల ముఖం చూశాడు. "నువ్వు చెబుతున్నది వాస్తవమే. అయితే..." అతని మామ నసిగాడు. "అయితే గీయితే ఏమీలేదు. ఈ స్థలంలో మనం నివాసం ఉండాలంటే షావుకారు కాళ్లు పట్టుకోవలసిందే." అన్నాడు.

"మా తాండా మొదట్నించి ఇక్కడే ఉండేదని రాయించాలి. ఇది మన అందరి జీవితపు ప్రశ్న" అని ధనసింగ్ గట్టిగానే చెప్పాడు. అతను తండ్రి ఏమంటాడోనని అటువైపు చూశాడు. అతని తండ్రి గంభీరంగానే ఆలోచిస్తున్నాడు. సోమ్లా నాయక్‌కు కొడుకు చెబుతున్నది సమంజసంగా తోచింది. అలా చేయకపోతే తాండాను రక్షించలేమని అర్థమైంది. కారభారి, తావూ, సోమ్లా ఇంకా ఐదారు మంది పెద్దలు షావుకారు దగ్గరకు వెళ్లి తమ బాధను చెప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. రెండుమూడు గుర్రాల మీద బయలుదేరడానికి సిద్ధమయ్యారు. షావుకారు మల్లప్ప బంజారాలతో పరిచయం ఉన్నవాడే. వాళ్ల గురించి అతనికి తెలిసివుండటం వల్ల సోమ్లా నాయక్ అపరిచితుడు అనిపించలేదు. సోమ్లాభుక్యా కరమ్‌తోట్ కొంత మంది కన్నడిగులతో పరిచయం ఉండటంవల్ల కన్నడ భాష వస్తుంది. అతను ముందుగా గుర్రం దిగి, తలపాగా తీసి నమస్కారం చేశాడు. "నమస్కారమండి షావుగారు. మేము బంజారాలం. ఇక్కడ ఒక కోసు దూరంలోని దేసుతండాలో ఉన్నాం. ఏదో పరదేశస్థులం. దేశాంతరం వచ్చాం. మీలాంటి దాతలు ఆశ్రయం ఇస్తే మేము బతికిపోతాం" అని నివేదించుకున్నాడు. మల్లప్ప గంభీరంగా కూర్చుని ఉన్నాడు. ఈ కోతి వెధవలు తెల్లవాళ్లకు అన్నదమ్ముల్లా ఉన్నారు కదా. వీళ్లే ఇలా ఉంటే వీళ్ల ఆడవాళ్లు..." అని లోలోపల గొణగడం వల్ల. "నాయక్, నీ పేరు ఏమిటి?" అని మళ్లీ అడిగాడు. "ఆ మనిషి ఏం అడుగుతున్నాడు?" తావూ అడిగాడు. "సోమ్లా భుక్య" యజమాని" అని దీనంగా అన్నాడు. మళ్లీ "ఇప్పుడు ఈ తెల్లవాళ్ల హింస భరించలేకపోతున్నాం. ఆపైన కరణం చాలా తంటాలమారి మనిషని

అనుమానపడ్డాడు సోమ్లా. ఒక చిన్నగుడ్డసంచిలోంచి నిజాం కాలంనాటి ఐదారు బంగారు నాణేలను తీసి, ఆయన ముందు పెట్టి "మేము పేదవాళ్లం. ఏదో మా తాతలు నాలుగు కాసులు దాచిపెట్టారు. ఇప్పుడు మా బతుకుతెరువుకు బండపడింది. ఒకప్పుడు ఉన్నదంతా ఇప్పుడు లేకుండా పోయింది. ఏం చేయాలో చెప్పండి? మాలాంటి పరదేశస్థుల బతుకే అంత" అని కడుపులోని సంకటమంతా వెళ్లబోసుకున్నాడు. ఐదు బంగారు కాసులను చూసిన మల్లప్ప నిజాయితీ కోల్పోయాడు. "మీలాంటి అనాథల కోసమైతే నాదొక కండిషన్. ఏమంటావ్?" అని ముసలి మల్లప్ప అనగానే సోమ్లా కాళ్లకింద భూమి కుంగినట్టయింది. సోమ్లాకు మల్లప్ప మాట వినకతప్పదు. బ్రిటిష్‌వారి నుంచి తప్పించుకోవడానికి ఉన్నదొకటే దారి. అందరూ అయోమయంలో పడ్డారు.

"కాంయిబికేరోచ మన్నితో కూగి కోరికోరూరి వాతేజ్ కళేని భా మన్నతో" (ఆ మనిషి ఏమో అంటున్నాడుకదా? అతని మాటలు అర్థం కావడం లేదు) అని తాండా పెద్దమనిషి జగన్థా భగత్ అన్నాడు.

అతని మాటలకు ప్రతిస్పందించడం అవసరమనిపించింది. అయితే మల్లప్ప కండీషన్ ఏమైవుండొచ్చని అందరూ ఆలోచనలో పడ్డారు. ఆలోచిస్తున్న కొద్దీ వాళ్ల ముఖాలు నల్లబడ్డాయి. అయినా అడగక తప్పలేదు. "ఊఁ, చెప్పండి, మీ కండిషన్ ఏమిటో?" అని అతని ముఖం చూశాడు సోమ్లా. "నేను ఎప్పుడైనా మీ తాండకు రావచ్చు. అక్కడ నేను ఏమి అడిగినా లేదనకూడదు" అని తండా జనం ముఖాలు చూశాడు. వాళ్ల ముఖాలు నల్లబడ్డాయి. అయినా తప్పలేదు. "దానికేమండి స్వామి, అది మీ తాండానే. మీరు ఎప్పుడైనా రావచ్చు" అని సోమ్లాకు చెప్పక తప్పలేదు. కన్నడ తెలిసిన కారభారి, 'తాంయివాత దేనా కొ నాయకతు' (ఏం మాట ఇచ్చావు నాయకా) అని సోమ్లాను అడిగారు. "కారభారి, ఇప్పుడు ఈ విషయం ఆలోచించకండి, ఊరక ఉండండి" అని మల్లప్ప ప్రతిస్పందన కోసం ఎదురుచూశాడు. ఒక్కొక్క సవరన్ తూకమున్న నాణేలు మల్లప్పను సందిగ్ధంలోకి తోశాయి. "ఊఁ పదండి, మీ అదృష్టపరీక్షకూడా జరుగుతుంది" అని లోపలకి పొయాడు. అతని తిజోరి వున్న చీకటిగదిలోకి బుడ్డిదీపం పట్టుకుని వెళ్లాడు. సోమ్లా నాయక్ ఇచ్చిన నాలుగు బంగారు నాణేలున్న సంచిని విప్పి నాణేలను తీసుకుని మీదున్న గుర్తును పరీక్షించాడు. గుర్తు సరిగ్గానే ఉంది. ఒకసారి తిజోరిలోని సొమ్మును లెక్కచూసుకోవాలని అనిపించింది. అంతలోనే 'వద్దు, బయట లంబాడీలు ఎదురుచూస్తున్నారు. ఎలాగూ అమావాస్య దగ్గరికి వచ్చింది. అప్పుడు పూజచేసి నాణేలు లెక్కపెట్టాలికదా!' అని

సమాధానపడి సంచిని మళ్లీ బిగించాడు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎవడి చేత కూడా విప్పడానికి కాకూడదు. వెండి నాణేలగంటును విప్పి పది వెండి నాణేలను తీసుకుని మళ్లీ గంటుకట్టి, తిజోరిలో పెట్టి భద్రంగా తాళం వేసి, పడిందని నిర్ధారించుకుని హడావుడిగా బయటికి నడిచాడు. అందరూ ఎదురుచూస్తున్నారు.వాళ్లందరి భవిష్యత్తు అతని చేతిలో ఉంది.

పట్టు వస్త్రాలు కట్టుకున్న కరణం షావుకారుకు వ్యతిరేకంగా ఒక్క మాట ఎత్తలేదు.కప్పం వసూలు చేసే బాధ్యతను బ్రిటిషులు మల్లప్పకు ఇచ్చారు. మల్లప్ప ఇచ్చిన వెండి నాణేలను కరణం శేషప్ప ఆనందంగా లెక్కపెట్టాడు. పైగా తాను భూమి కబ్జాచేసుకోవటం షావుకారికి తెలుసు. కాబట్టి మల్లప్ప చెప్పింది చేయాల్సిందే.

సేవకులను పిలిచి, చెప్పులు వేసుకుని షావుకారు బయలుదేరేటప్పుడు, అతని మనిషి మాదర నింగ గుర్రం తెచ్చి అతని ముందు నిలిపాడు. షావుకారు గుర్రమెక్కి ముందుకు పోతుండగా, వెనుక నాయకుడు సోమ్లా, అతని గుంపు బయలుదేరింది. మోళకాల్మూరు, హానగల్ వరకు రెండు మైళ్లు యజమాని వెనుక మాదర లింగ పరిగెత్తుకుంటూ వచ్చాడు. వాళ్లు హానగల్‌లోని పెద్ద మేడ ఇంటిముందు నిలబడగానే, నింగా గుర్రాన్ని తీసుకుని దానికి నీళ్లు తాగించడానికి తోలుకొని పోయాడు. కరణం శేషభట్టు షావుకారు చూడగానే లోపలి నుంచి పరుగెత్తుకు వచ్చాడు. "రండి షావుకారు రండి, నాకు చెప్పి ఉంటే నేనే..." అని తన వినయాన్ని చూపించాడు. 'లేదు కరణం. పని అలాంటిది. నేనే రావలసి వచ్చింది" అన్నాడు. "ఎందుకు తెల్లవాళ్ళ కంపెనీ మనుషులు ప్రభుత్వ కప్పం వసూలు చేయడానికి వచ్చారా? ఉత్తర్వులు ఏమైనా ఇచ్చారా?" అని కలవరం వ్యక్తపరిచాడు. "అలాంటిదేమీ లేదు. ఇది ఒక కొత్త నమూనా సమస్య. అది చెప్తాను, మీరు కాస్త లోపలికి పదండి" అని అతని అనుమతి కోసం ఎదురు చూడకుండా లోపలికి నడిచాడు."అంతటి సమస్య ఏమొచ్చింది?" అని కరణం అనుమానిస్తూనే లోపలికి నడిచాడు. ఆయన తలలో వందలాది ప్రశ్నలు కదలసాగాయి.

మల్లప్పకు కరణం ఒప్పుకోకపోతే నాలుగు బంగారు కాసులు వాపస్ పోతాయికదా అనే భయం ఒకవైపు ఉంటే, మరోవైపు లంబాడీ తాండకు వెళ్లటం, భట్టిసారాయి తాగడం, లంబాడీల పనిచేసినందుకు తన ఋణానికి బద్ధులై తాను అడిగింది ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ఈ జనం సేవ తప్పిపోతుందనే భయం వేధించసాగింది. అయినా కరణంగారి కొన్ని పాత తప్పులను తన చేతిలో ఉన్నాయి. దాన్ని అడ్డంగా పెట్టుకుని కరణం చేత కావలసిన కార్యం చేయించుకోగలిగే

ధైర్యం షావుకారుకు ఉంది. అందువల్ల అతను ఎక్కువగా తలపాడు చేసుకోలేదు. "షావుకారుగారు, బీద వాళ్ల ఇంటికి వచ్చారు. చాయ్ తాగుతారా? పానకం చేయించమంటారా?" అని శేషప్ప మొహమాటంగా అడిగాడు. అయితే షావుకారు అతని ఆహ్వానాన్ని స్పష్టంగానే తిరస్కరించారు. "కరణంగారు, మన ఊరు నుంచి పశ్చిమంలో హానగల్ నుంచి ఒక మైలు దూరంలో ఒక కొండగుట్ట కింద లంబాడి తండా ఉంది" అని సోమ్లాను చూశాడు."అదే యజమాని దేసు నాయక్‌తాండ" అని సోమ్లా మౌనం వహించాడు."లేదే, ఏ తాండా లేదు" అని శేషప్ప అన్నాడు. షావుకారు వినపించుకోకుండా "కరణం, అక్కడికి చాలా సంవత్సరాల కిందటే లంబాడీలు వచ్చి నివాసం ఉన్నారు, గుడిసెలు వేసుకున్నారు. పశువులను మేపుతున్నారు. వ్యవసాయం చేస్తున్నారు. నా దగ్గర చాలా వెనుకటి సమాచారం వుంది. ఇప్పుడు దాన్ని ప్రభుత్వ ఖాతాలోకి తీసుకొని నమోదు చేస్తే కంపెనీ ప్రభుత్వం ఈ దురదృష్టవంతులైన పరదేశస్థులను హింసించడం ఆపుతుంది" అని గంభీరంగా అన్నాడు. "కంపెనీ ప్రభుత్వానికి ఇప్పటికే హానగల్లు మొళకల్మూరు చుట్టుపక్కలున్న స్థలాల అంగుళం అంగుళం సమాచారం ఉంది. ఇప్పుడు మనమేమైనా తప్పుగా నమోదుచేస్తే మనకే ప్రమాదం షావుకారుగారు" అని శేషప్ప అని అన్నాడు. "అలాగా, ఇప్పటికే మీరు కంపెనీ ప్రభుత్వానికి వందలాది రూపాయలు మోసం చేశారు. ఆ విషయం కంపెనీ ప్రభుత్వానికి తెలుసా? తెలియకపోతే..." అని మల్లప్ప షావుకారు ఒక బాణం వదిలారు. శేషప్ప ముఖం నల్లబడింది. "అది పాత లెక్క. ప్రభుత్వ ఖజానా నింపడానికి కంపెనీ ప్రభుత్వం నాకు అనుమతి ఇచ్చింది" అని శేషప్ప మెల్లగా జారుకోవడానికి ప్రయత్నించాడు. "అవును ఐదు ఎకరాల భూమి ఉన్న శేషప్పకు ఇప్పుడు యాభైఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని ఇనాము ఇచ్చినట్టు నమోదు అయింది" నిర్మొహమాటంగా రెండవ తప్పు బయట పెట్టారు. "షావుకారుగారు ఇప్పుడు తాండా ఉన్న స్థలాన్ని నమోదు చేసి కంపెనీ ప్రభుత్వం దాఖలాల్లో ఉన్నట్లు చూపించాలి. అంతే కదా. మీరు తొందరపడకండి. మీరు వెళ్లండి. నేను చేస్తాను" అని ఏదో చెప్పబోయాడు. అయితే తాను అక్కడి నుంచి వెళ్లిపోతే పని జరగదని గ్రహించి, "ఈ పని ఇప్పుడే నా సమక్షంలోనే జరగాలి. అయినా నీవేమి ఊరికనే చేయనక్కర్లేదు" అని అయిదు వెండి నాణేల సంచి తీసి శేషప్ప వైపు విసిరాడు. "ఇప్పుడు దీని అవసరం ఏముంది షావుకారుగారు?" అని శేషప్ప చేతులు నలుపుకున్నారు. "కరణం, జరగవలసిన పనికి ఇవ్వవలసిన గౌరవం ఇచ్చి తీరాలి. మీకు ఖర్చులుంటాయి" అని మల్లప్ప నాటకీయంగా

జవాబిచ్చాడు.

శేషప్ప పాతదస్తావేజులను తీసుకొని రావడానికి లోపలికి పోయాడు. "తెల్లవాళ్లు వీళ్లనే నమ్ముతారు. మాలాంటి, మీలాంటి వారిని కాదు. ఈ జనం ఏమి చెప్పినా దానికి ఊఁ అంటారు. దాన్నే చేయడానికి ఈ తెల్లవాళ్లు పూనుకుంటారు. మనం ఏమైనా చెప్పడానికి పోతే, యు టెల్ కరణం అంటారు. వారికి అంత ప్రాముఖ్యత ఇస్తారు. మన జనసంఖ్య ఎక్కువగా ఉన్నా లాభం లేదు. మనం వ్యతిరేకించకుండా ఉండటానికి మనల్ని పెట్టుకున్నారు" అని మల్లప్ప బ్రిటిష్‌వాళ్ల మీదున్న కోపాన్ని బయటపెట్టాడు. ఆయన గురించి తెల్లవాళ్లకు చాడీలు చెప్పే శేషప్పను పెట్టుకున్నందుకు అతని చేత ఎలా పని చేయించుకోవాలో షావుకారు నేర్చుకున్నాడు. శేషప్ప దస్తావేజులు తయారు చేయడం ప్రారంభించాడు. అక్షరాలు కూడబలుక్కుని కన్నడ చదివే మల్లప్ప షావుకారు కరణంగారి హళెకన్నడ అక్షరాలు అర్థం కాలేదు. అయినా మల్లప్ప పట్టువదలకుండా "1901 ఈ క్రమసంఖ్యలో" అని మొదలుపెట్టి తప్పుగా చదవడం ప్రారంభించాడు. శేషప్ప మొత్తం దస్తావేజులను పాలరాయిమీద చెక్కిన శాసనంలా రాసి, ముగించి, చదివి వినిపించడం ప్రారంభించాడు–

'దేసునాయక్ తండా ' ఇప్పటికి సుమారు 40 సంవత్సరాల వెనుక పానగల్ పార్క్ నుంచి దాదాపు రెండున్నర మైళ్ళదూరంలో రాతికొండల మధ్య దట్టమైన అరణ్యంలో నిర్మించబడింది'–అని దస్తావేజుల్లో నమోదయింది. తన దగ్గరున్న పాతసీలు తీసి ఆ పత్రాలమీద ముద్రవేశాడు. అప్పుడు బతికి ఉన్న కరణం శేషప్ప తండ్రి నరసింహభట్టు కరణంగారి సంతకాన్ని తానే చేసి, పాత తేదీని నమోదు చేసి ఎర్రటి దస్తావేజును వస్త్రంలో యథాతథంగా కట్టి పాతపెట్టెలో భద్రపరిచి తాళం వేశాడు. బయటున్న సోమ్లాభుక్యా కరమ్‌తోట్, కారభారి కంకాళి నాయక్, డావో డకణ్యానాయక్, జగన్యాపూజారి, వాడ్య, వాలయ, తోతు, సత్త్య మొదలైనవారు నిశ్చింతగా నిట్టూర్పు విడిచారు. "షావుకారుగారు, మీరు చేసిన ఈ సహాయం చాలా గొప్పది.మీ సహాయాన్ని జీవితంలో ఎన్నడూ మరువం. సదా మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటాం" అని సోమ్లా నాయక్ అన్నాడు. అందరూ గుర్రాలెక్కి తండా వైపు కదిలారు. తాండా జనం నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు. "మొత్తానికి ఒక ప్రమాదం తప్పింది" అని సోమ్లా అన్నాడు. "పిల్లలను, ఆడవారిని, వయస్సు దాటిన ముసలివారిని తీసుకొని ఎక్కడికని మనం వలస పోగలం. ఏదో ఒకటి చేసి మమ్మల్ని ఈ కష్టం నుంచి దాటించారు" అని జగన్యా పూజారి తన మనసులోని

మాటను బయటపెట్టాడు. అందరూ అవునన్నట్టు తలూపారు.

అప్పటికే పొద్దువాలింది. మసక చీకట్లు కమ్ముకున్నాయి. ఆ చీకట్లో బలమైన ఒక దుప్పి లేత ఆకులను తింటుండటంచూసిన డావో దకణ్యానాయక్ "హణ్ణి చర్రిచ నాయక, ఆజ తొ పోటోజ ఎకోవేజాచ" (జింక మేస్తోంది నాయకా, పెద్ద వేటనే అవుతుంది) అన్నాడు. సోమ్లా గుర్రం నిలిపి, సూక్ష్మంగా గమనిస్తూ కొద్ది దూరంలో నుంచున్నాడు. "ఒట్టి చేతులతో ఎలా వేటాడుతారు? గాలిలో చేతులాడించి ఒళ్లు నొప్పులు తెచ్చుకోకండి. పదండి" అని సోమ్లా అన్నాడు. "అయ్యా, ప్రయత్నం చేయడంలో తప్పేముంది? మీరు ఊరుకోండి. నేనున్నాను" అన్నాడు కారభారి. పూజారికి ఏమేమో చెప్పాడు. వారి నడుములో ఉన్న చురకత్తులను తీసుకుని, పొడవైన కర్రల చివరలను పదునుగా చేసుకుని, దాన్ని చుట్టుముట్టి పట్టుకుని కట్టివేయాలనే ప్రణాళికను రూపొందించుకున్నారు. ఇలాంటి ఎన్నో జంతువులను ఒట్టి చేతులతో వేటాడాడు జగన్యాపూజారి. "చూడండ్రా, అది చప్పుడు వింటే నాలుగడుగులు పైకెగురుతుంది. అది ఎగురుతుండగానే మనమూ ఎగిరి దాని పొట్టలో పొడిచి, నేల కూల్చాలి" అని తన ప్రణాళికను చెప్పాడు. "ఊఁ, మొదట గుర్రాలను నాయకుడి దగ్గర వదిలి, ఒక్కొక్కరు అడుగుల చెప్పుడు కాకుండా నడవండి" అని డావో పిల్లిలా దొంగ అడుగులు వేశాడు.

నాలుగు అడుగుల దూరం నుంచి చుట్టుముట్టిన విచిత్రమైన ప్రాణులను చూసి గాభరాపడ్డ ఆ దుప్పి చుట్టూ కంగారుగా చూసి, ఒక్కసారిగా పైకెగిరింది.

పూజారి చెప్పినట్టు ఒకేసారి దాంతో పాటు ఎగిరిన డావో, కారభారి, పూజారి, దావ్య సరిగ్గా దాని పొట్టలో చూపుగా చెక్కిన కర్రలతో పొడిచి, దాంతోపాటు నేలమీద పడి, అది లేచేలోపే మళ్లీ దాడిచేసి గాయపరిచారు. మరణాంతకమైన దాడి వల్ల తప్పించుకునే ఉపాయం కనిపించక దుప్పి నేలకొరిగింది. నాయకుడు కంగారుగా చూస్తూ నిలబడ్డాడు. "నాయకా, మీ తాత కథలు వినీ వినీ మేము వేటాడటం నేర్చుకున్నాం. నీవు ఉన్నావు ఎందుకు?..." అని గెలిచిన ఉత్సాహంతో జగన్యాపూజారి అన్నాడు. "పరవాలేదులే పూజారి మామ, అప్పుడు వయసులో వున్నారు. చిన్న కుర్రవాళ్లు దుప్పి వెనుక పరుగెత్తి శభాష్ అనిపించుకున్నారు. నువ్వు కూడా సామాన్యమైనవాడివి కావు" అంటూ అతన్ని అభినందించాడు నాయకుడు. "మా పూజారప్ప గురి అంటే గురి" అని కారభారి మెచ్చుకుంటూ అన్నాడు. "రేయ్ తమ్ముల్లారా ! మనం ఎంత వాళ్లంరా. మన తాండా నాయకుడు ఉన్నాడు కదా సోమ్లా భుక్యా కరమ్‌తోట్. అతని తాత వేటాడడంలో సాటిలేని వాడు. హుజూర్

ఆసిఫ్ ఖాన్ సాహెబ్‌ను పులిబారినుంచి తప్పించి, దానితో స్వయంగా పోరాడి చంపి వేయటాన్ని మా తాత మా చిన్నప్పుడు కథగా చెప్పేవాడు. ఆ కథను విని నేను వేటాడటం నేర్చుకున్నాను" అంటూ మీటుభుక్యా కరమ్‌తోట్ కథను వివరంగా చెప్పాడు. "అవునవును, మేము 'మీటు నానా' కథలను చాలా విన్నాం. ఆయనలా పులి జాడ కనిపెట్టి చంపే మగవాడు ఈ ప్రపంచంలోనే లేడు" అని అన్నాడు.

బలవంతంగానే దుప్పిని సోమ్లానాయక్ నాయక్ గుర్రం మీద అడ్డంగా వేశారు. సోమ్లా కూర్చుని సవారి చేయడానికి చోటు వదిలి, తమ తమ గుర్రాలు ఎక్కి తండా వైపు ప్రయాణమయ్యారు. సూర్యుడు కొండనీడలోకి పూర్తిగా మునిగిపోయాడు. వీళ్లను చూసి తాండా జనం పరుగుపరుగున వచ్చి చుట్టూ కమ్ముకున్నారు. సోమ్లా గుడిసె పక్కనున్న పశువుల కొట్టం లోపలికి వెళ్లడం ఆలస్యం జనం కత్తులు, బాకులు, చురకత్తులు తీసుకొని దుప్పిని ముక్కలుగా కోయడానికి సిద్ధమయ్యారు. డప్పు కొట్టే రాము మొదలు సోనార్ చిన్యా, డాడి జగన్‌లు ఒక్కొక్కరికి భాగాలు చేయసాగాడు. తండా నాయకుడు సోమ్లా కోసం ఒక పెద్ద తలేలాలో మాంసం, డావోకొక భాగం, కారభారికొక భాగం పంచిన తర్వాత తాండా లోని ఇతర నాయకులకు సోమ్లానే పంపించాడు. కులపద్ధతి ప్రకారం భట్టీల నుంచి సారాయి తెప్పించి ఒక్కొక్క ముంతను ఒక్కొక్క ఇంటికి పంపించి, బంజారాలు మాత్రమే చేసే ప్రత్యేకమైన 'సళోయి' (గొర్రె పొట్ట లోపలిభాగాలతో చేసిన) వంటకాన్ని చేసి అందరికి ఆకులలో పంచడం జరిగింది. పంపకాల్లో స్వయంగా తానే నిలబడి హెచ్చుతగ్గులు కాకుండా జాగ్రత్త వహించినందువల్ల ఎలాంటి గొడవలు జరగలేదు.

ధనసింగ్‌భుక్యా కరమ్‌తోట్ దాదాపు అన్ని రకాల వ్యవహారాలను నేర్చుకున్నాడు. వలస పాలన సందర్భంలో అస్వతంత్రులైన తన వంశస్థుల బతుకులను పునఃస్థాపించాలనే ఆలోచనలో ఉన్నాడు. భట్టిసారాయి గొప్పగా లాభాలను తెచ్చిపెట్టే వ్యాపారం కాదు. దొంగతనంగా అడవి నుంచి ఎండిన కట్టెలను సేకరించి మోసుకొచ్చే అమ్మటం ఇప్పుడు మరింత ప్రమాదంగా మారింది. ఆత్మగౌరవంతో బతుకును సాగించడం ఎలాగా అని ఆలోచించసాగాడు. తనకు పరిచయమున్న హానగల్ హుసేని, మూలింటి ఈగ, రాచోడి ఏరాలతో కలిసి విషయాన్ని చర్చించాలని గుర్రాన్ని బయటికి తెస్తుండగా దూరం నుంచి వస్తున్న గుర్రపు డెక్కల చప్పుడు విన్నాడు. 'కూహూ' అని కేక పెట్టాడు. అరక్షణంలోనే బ్రిటిష్ అధికారి ఇటు వైపు వస్తున్నట్టు మునుసూచన ఇచ్చాడు. ముప్ఫయి ఇళ్లవాళ్లకు పరుగున వెళ్లి సిద్ధంగా వుండాలని చెప్పాడు. పిల్లలు చేతికి దొరికిన సామాన్లు మాత్రమే తీసుకొమ్మన్నాడు.

కాపలాదారులు 'కూహూ' అన్నప్పుడు చివరి ఇంట్లో ఉన్న ధనసింగ్ తిరిగి అదే ధ్వనిలో 'కూహూ' అన్నాడు. బ్రిటిషుల తెల్లవాళ్ల సైన్యం అక్కడికి చేరుకుంది. అయితే తాండా ఉన్న మార్గంలోకి రాకుండా మరోదిశలో దట్టమైన అడవిలోకి వారు ప్రవేశించగానే కాపలాదారుడు 'రహస్య ధ్వనితో' ఆ వార్త తెలియజేశాడు. ధనసింగ్ కాస్త కుదుటపడి తమ ఈ అవస్థకు జాలిపడ్డాడు. 'ఎందుకు తమ నేలలోనే తమకు నిలువ నీడ లేకుండా పోయింది? బతకడానికి బయటి నుంచి వచ్చిన పరాయివాడి అనుమతి పొందాలి?' అనే ఆలోచన వేధించసాగింది. ఈ తెల్ల వెధవలు రాకముందు మనది ఎలాంటి వ్యాపారం? వాళ్ల కారణంగా తమకు ఈ చెడ్డరోజులు వచ్చాయి. ధనసింగ్ ఆలోచనలకు అంతు లేకుండా పోయింది. వీటికి జవాబులు వెతకటానికి పూనుకున్నాడు. అందుకోసం బయలుదేరిన వాడికి మళ్లీ బ్రిటిషులు అడ్డురావటం విసుగు తెప్పించింది.

షావుకారు మల్లప్ప అధికారికంగానే తాండాకు రాసాగాడు. అతని కొడుకు గతంలోఒకసారి భయపడినవాడు ఇప్పుడు పులిలా బహిరంగంగానే రాకపోకలు సాగిస్తున్నాడు. ముసలి మల్లప్పకూడా ఎరుపు లంగాల లంబాడి అమ్మాయిలను చూసి జొల్లుకార్చసాగాడు. సోమ్లా కుటుంబం పెద్దది. ఉన్న కుటుంబాలలో ఇరవై అయిదు కుటుంబాలు కరమ్‌తోట్‌లవే అని తెలిసి వాళ్ల గొడవలకు పోతే తనను కొట్టి, కాళ్లుచేతులు విరిచి కడతారని తెలిసి, వాళ్లనొదిలి, అత్యంత బీదవాడైన బద్యాబద్యా ఇంటిలో ఋతుమతులైన ఇద్దరు అమ్మాయిలు ఉండటం గమనించి, "ఏమిరా నాయక్, నేను ఎవరో తెలుసా?" అని అడిగాడు. "ఎవరు?" అన్నాడు బుద్యా. "రేయ్ ఏమంటున్నాడురా ఈ లంబాడి. నా గురించి వాడికి కొంచెం చెప్పు" తన వెంట వచ్చిన తండాకు చెందిన బుద్నాను అడిగాడు."ఏయ్‌మొచాపు కాయి హైంకెచ్చితు. ఈ తొ మోటో, సావ్కార హోవరాతడక ఆద్మీ జ ఎర్‌ఫాయిఅవచ్. అపంతాండో బచాట కొ ఈజ మరాజ హోవబాపు ఈజ్" (ఏయ్ పెదనాన్న ఏమిటలా అంటున్నావు? ఈయన పెద్దషావుకారు. తెల్లవాళ్లు ఈయన దగ్గరికి వస్తారు. మన తండాను కాపాడిన మహారాజు) "హోవాక బేటె" అని అన్నవాడు తన హుక్కాకు తంబాకు నింపి వెలిగించి, గుప్పు గుప్పుమంటూ పీల్చసాగాడు. "ఏంరా చెప్పావా? వాడు ఏమి ప్రతిస్పందించడం లేదు" అని షావుకారు అడిగాడు. "మీ గురించి గొప్పగా చెప్పాను. ఈ జనానికి మీ తాకత్తు ఏమిటో తెలియదండి" అని అతను మాట మార్చాడు. "ఏం చేయమంటావు నన్ను?" అన్నాడు షావుకారు. "నేను చెప్పినట్టు చేయండి. ఈ ముసలివాడికి తాగడానికి నాలుగు పైసలు

విసిరేయండి, తర్వాత చూడండి" ముసలివాడి బీదతనం నుంచి లాభం పొందడానికి దారిచూపాడు బుద్నా. మల్లప్ప ముందు వెనుక చూడకుండా జేబులోంచి రెండు వెండి నాణేలు తీసి,"ఏయ్ నాయకా, తీసుకో మజా చేసుకో" అని అతని వైపు విసిరాడు. వెండి నాణేలను చూడగానే ముసలివాడికి ఏమిచేయాలో తోచలేదు. హుక్కా వదిలి నాణేలను తీసుకున్నాడు."రండి షావుకారుగారు రండి" అని పిలిచి "బేటి చంద్రా షావుకారేన తాయి చాంవదేక మ హ చాలా జానవుచ" అని అన్నవాడు బయటికి నడిచాడు. బొమ్మలాంటి పదిహేనేళ్ల చంద్రి బయటికి రాగానే షావుకారు మల్లప్ప గుండె చప్పుడు ఆగిపోయినట్టయింది. అతని రెండవ మనమరాలు అనసూయలాగా ఉంది. అయితే సిగ్గులేని షావుకారు చంద్రికకు వెండి నాణేల ఆశ చూపించాడు.

బుద్నాలాంటి బాడకోవ్‌లు తండాలోని అమ్మాయిలను తార్చడానికి ప్రయత్నిస్తుండటం తెలిసి ధనసింగ్ చాలా బాధపడ్డాడు. ఈ జనం ఎలా బాగుపడతారని రాత్రీపగలూ ఆలోచనతో తల పట్టుకున్నాడు. ఏదో విధంగా ఈ జనాన్ని కష్టపడి సంపాదించడానికి పంపాలి. ఈ విషయంగా చర్చించడానికి పీర్యా, మంగ్ల్యా, దావులను కూర్చోబెట్టుకున్నాడు. "తండా జనం చెడుదారి పట్టారు. సోమరి వెధవలు కష్టపడి సంపాదించకుండా ఉన్నారు" అని సూక్ష్మంగా ఈ విషయాన్ని బయటపెట్టాడు ధనసింగ్. అలాంటి సమయం కోసమే ఎదురుచూస్తున్న దావు "రేపు మన భార్యలు కూడా ఇలా అయిపోతారేమోనని భయంగా ఉంది. ఊరి జనం సమయం కాని సమయంలో గుడిసెల్లో దూరుతున్నారు. అంతేకాదు ఎవడో ఇచ్చిన డబ్బుతో పొగరు చూపిస్తున్నారు" అన్నాడు. అతని అనుమానం సహజంగానే ఉంది. దీనికి ఏమి పరిష్కారం? జనాల్ని పనిలో పెట్టడం ఒక్కటే దారి. 'మనమెందుకు వ్యవసాయం చేయకూడదు?' అని ధనసింగ్ తనకు తోచిన సలహాను అందరి ముందుపెట్టాడు. "మన తల్లిదండ్రులు వ్యవసాయం చేయలేదు. ఈ అడవి లోపల వ్యవసాయ భూమిని ఎక్కడి నుంచి తెస్తావు?" అని మంగ్ల్యా వ్యంగ్యంగా అన్నాడు. "మీరంతా ఇలా అంటారని నాకు తెలుసు. మన ముందున్న లక్ష్యం ఒకటే. తాండాను ఎలాగైనా రక్షించాలని. నాకు ఒక ఉపాయం తోచింది" అని అన్నాడు. "అదేదో మాకూ చెప్పు" అన్నాడు శుక్ర కుతూహలం ఆపుకోలేక. 'ఇప్పుడే చెబితే మీరు తండా అంతటా టాం టాం కొడతారు. నా ప్రణాళికను పాడుచేస్తారు. సమయం వచ్చేంతవరకు మనసులో దాచుకోండి" అని అందరూ నోళ్లు మూయించాడు. అయితే తాండాలో సాగుతున్న అక్రమ సంబంధాలను ఆపడమే కాకుండా తాగి

చస్తున్న మగవాళ్ళను ఆ వ్యసనం నుంచితప్పించి, మళ్లీ బాధ్యతగల మనుషులుగా మార్చడం చాలా అవసరం. మల్లప్ప, అతని కొడుకు సిద్దేశి, అతని వెనుకవున్న మనుషులు తాండలో ప్రవేశించకుండా చేయడం ఎలా అన్న ఆలోచనే ధనసింగ్‌ను నలిబిలి చేస్తోంది.

ఒకవైపు బ్రిటిష్‌లు తండాలోకి ప్రవేశించి అడవి మధ్య ఉండటానికి ఎవరు అధికారం ఇచ్చారని తరిమివేస్తారేమోననే అభద్రతాభావం వేధించసాగింది. ఆ కొడుకులు మాటెత్తితే బందూకు-రక్తపాతం అంటారు. సోమ్లా మారుతున్న పరిస్థితులను చూసి నివ్వెరపోయాడు. వారి ప్రవర్తన ఏమై ఉండొచ్చో అతనికి అర్థం కాకుండా పోయింది. "మనవారి ముందరి భవిష్యత్తు ఏమిటి? అని ఆలోచిస్తే ఎందుకో భయం కలుగుతోంది" అని తన బంధువు కారభారితో అన్నాడు. "ఏమో ఆ దేవునిదయ ఉంటే మన జనం ఏదో విధంగా బదికిపోతారు లే" అని కారభారి ఓదార్చాడు. అయితే తలమీద వేలాడుతున్న కత్తి అలాగే ఉందని అతనికీ అనిపించక పోలేదు. దేసునాయక్ తండా జనానికి భయం వేయడం నిజమే.ఎప్పుడు ఏమవుతుందోననే భయం ఒకవైపు వుంటే తమ తాండాలోకి పనికిమాలిన వెధవలు ప్రవేశించి తమ భార్యా పిల్లలను వేధిస్తున్నారనే ఆందోళన మరొక వైపు ఉంది.

ధనసింగ్ భార్యకి కాన్పు నొప్పులు కనిపించడంతో అతని నానమ్మ సోమ్లి సంతోషంతో పొంగిపోయింది. తన కరమ్‌తోట్ వంశపు మొలకొకటి మళ్లీ భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగించింది. సోమ్లా, కారభారిలు కూడా సంతోషపడ్డారు. మొత్తం తండా అంతట అదొక పెద్దవార్తగా మారింది. ధనసింగ్ మాత్రం షావుకారు మల్లప్పను ఎలాగైనా బుద్నా కూతురు చంద్రి సహాయంతో పట్టుకొని తాండాలో అతన్నోక ఆట ఆడించాలని నిర్ణయించుకుని, చంద్రికకు ముందే విషయం తెలిపి వల వేయడానికి సిద్ధమయ్యాడు. ఈసారి షావుకారు అనుచరుడు బుద్నాకూ బుద్ధి చెప్పాలనుకున్నారు. షావుకారు చంద్రిక ఏకాంతంలో ఉన్న సమయాన్ని కనిపెట్టడానికి అల్లరి కుర్రవాళ్ళు నియమించాడు. అతని భార్య మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం కంచు పళ్లాన్ని వాయించి తండా అంతటా ప్రకటించడం విని ధనసింగ్ కుర్రాళ్ళతో, "జాగ్రత్తరా, ఈరోజు మృగం తప్పించుకోకూడదు. ఒకవేళ అలా జరిగితే మన తాండా మిగలదు" అని చెప్పి ఇంటికి వెళ్ళాడు.

సీత్కి బిడ్డను కని, బాగా అలసిపోయి నిద్రపోతూ ఉంది. బిడ్డను స్నానానికి తీసుకునిపోయారు. హడావుడిగా గుడిసెలోకి ప్రవేశించడానికి ధనసింగ్ తపించాడు.

"ఈ దొంగ అవసరం చూడండి. అదేమిట్రా చేసేదంతా చేసి ఇప్పుడు సిగ్గు

పడుతున్నావా? బయట నుంచి వచ్చావు. చెప్పులకు, కాళ్లకు గాలి ధూళి అంటుకొని ఉంటుంది. బాలింత దగ్గరికి వెళ్లకు. ఆమెకు స్నానం చేయించిన తరువాత, నువ్వు కూడా స్నానం చేసుకుని లోపలికి రా" అని సోమ్లి బయటికి తరిమింది.

"దాదిమా, ఇదేమి అన్యాయం?" అని గొణుగుతూ, తిరిగి కొండమలుపులో ఉన్న నీటిగుంట దగ్గరికి వెళ్లాడు. మంగ్యా అతని గుర్రానికి అడ్డంగా పరిగెత్తుకుంటూ రావడాన్ని గమనించి గుర్రాన్ని నిలిపాడు. "ఏమైంది? ఏదో నిధి దొరికినట్లు ఎందుకిలా పరిగెత్తుకుంటూ వస్తున్నావ్?" అని అడిగాడు. "నిధి కాదు అంతకంటే పెద్దది. ఊఁ ..." అని సైగ చేశాడు. అతన్ని వెనక కూర్చోబెట్టుకుని బుద్యా ఇంటి వైపు బయలుదేరాడు. ఎప్పటిలాగే షావుకారు చంద్ర దగ్గర ఏమీ చేయలేక పోయినప్పనా తన తీట తీర్చుకోవడానికి కోసం చుట్టుపక్కల ఎవరూ లేకపోవడం నిర్ధారించుకొని చంద్రి గుడిసెలో దూరాడు.

చుట్టూ ఉన్న గుడిసెల్లో ఉన్న ధనసింగ్ అనుచరులు, షావుకారు చంద్రి గుడిసె లోపలికి వెళ్లేంతవరకు కాచుకొని, ధనసింగుకు వార్త చేరవేశారు. బుద్యానాయక్ విసళావత్ సామ్యానాయక్ ఇంట్లో విశ్రాంతిగా ముంతలకొద్దీ సారాయి తాగి హుక్కా పీల్చుతున్నాడు. షావుకారును ఒకటి రెండు గంటలు బయటికి రాడు, అప్పటిదాకా ఇక్కడే మకాం పెట్టవచ్చని అనుకున్నాడు. అతన్ని ఇంకా ఎక్కువగా తాపించి మత్తులో ముంచడానికి కాళు, ధేనులు పూనుకున్నారు.

చంద్రిక యవ్వనానికి పూర్తిగా గులాం అయిపోయిన షావుకారు మల్లప్ప, "చంద్రి, అబ్బా ఎంత ఎర్రగా ఉన్నావే? మీ లంబాడి ఆడవాళ్లు బాగా ఎర్రగా రసాలతో నిండిన మామిడి పండులా ఉంటారు. చూస్తే తింటూనే ఉండాలని అనిపిస్తుంది. అందులో నీవు స్వర్గం నుంచి భూమికి వచ్చిన అప్సరసలా ఉంటావు" అన్నాడు. నిజానికి అతని కొడుకుకు పిల్లలు పుట్టివుంటే చంద్రి అంతా మనుమరాలు ఉండేది. అయితే డబ్బు మదం, అధికారపు మత్తు నిస్సహాయులను వేధించటానికి ప్రేరేపిస్తుంది. అతను జేబులోంచి అయిదు వెండి నాణ్యాలు తీసి ఆమె వైపు విసిరాడు. దగ్గరికి రమ్మన్నట్టు సైగ చేశాడు. అడవి మధ్యన పెరిగిన అడవిమల్లెలా ఉన్న చంద్రికి ధనసింగ్ ఏమి చెయాయ్యలో అప్పటికే సూచించాడు. దాంతో ఆమె, "అయ్యో ఎందుకింత తొందర యజమాని, ఈరోజు మీకు చాలా ప్రత్యేకమైన రోజు. ముందు మందు తాగండి" అని మళ్లీ నాలుగు ముంతల సారాయి, అతని ఒంటి మీద బట్టలు అంతా విప్పింది. అతని మెడలో ఉన్న బంగారు చైనులు, వేళ్లకున్న ఉంగరాలు, అన్నీ తీసింది. పూర్తిగా కామంతో కళ్లు మూసుకుపోయిన

మల్లప్ప ఆమె ఆమెను కౌగిలించుకొని ఆమె ఒంటి మీది బట్టలను తొలగించటానికి దుశ్శాసనుడిలా ఆవేశంతో ప్రయత్నించసాగాడు. సరిగ్గా అదే సమయానికి ధనసింగ్, అతని మనుషులు హఠాత్తుగా లోపలికి దూరారు. వాళ్లను అక్కడ చూసిన మల్లప్ప షావుకారుకు తాగినదంతా సర్రున దిగిపోయింది. చాలా అవమానంగా అనిపించింది. "ఏం షావుకారు, మీరు చేస్తున్నది సరైనదేనా? మేము ఆత్మాభిమానంతో బతుకు తెరువు వెతుక్కుంటూ వచ్చినవాళ్లం. జీవితంలో అన్నీ పోగొట్టుకుని మీలాంటి శ్రీమంతుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వచ్చింది తప్ప, మేము ఎవరికీ తక్కువైన వాళ్లం కాదు. మీరు బ్రిటిష్‌వాళ్లకు గులాంగిరి చేయకపోతే మీరు మా స్థానంలో ఉండేవారు. మేము మీ స్థానంలో ఉండేవాళ్లంః అయితే తెల్లవాళ్ల దయాదాక్షిణ్యాలపై బ్రతకకూడదనే అడవిలో కాలం గడుపుతూ ఉన్నాం" అన్నాడు. షావుకారుకు చెమటలు పట్టాయి. "ఏయ్ ధనసింగ్, నీకేం కావాలి? ఇలా మర్యాద తీయకు" అన్నాడు. కాళ్లకిందినేల కుంగినట్టయింది. మొళకాల్మూరు, హోనగల్, రాంపురం, చళ్లెకెరె, కె.బి..క్రాస్ జనం షావుకారును చూస్తే తల వంచుకుని వెళతారు. అతని ముత్తాత కాలంనుంచీ అనుభవిస్తూ వచ్చిన అధికారం, సంపద, దర్పం హఠాత్తుగా అరక్షణంలో మట్టిపాలు చేసాడు ఈ లంబాడివాడని లోలోపల మండిపడ్డాడు. అయితే సమయం తనది కానప్పుడు గాడిద కాలు పట్టుకోవాలి అనుకొని, "నీకూ నీ తాండాకు ఏమి కావాలో అడుగు. ఆ కరణంకు చెప్పి మీ తాండా చాలాకాలం క్రితం నుంచే ఇక్కడ ఉందని దస్తావేజులు చేయించాను కదా!" అని నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. "మీరు పెద్దవారు, మాలాంటి బీదల పరిస్థితులను అర్థం చేసుకుంటారని మిమ్మల్ని మాత్రమే మర్యాదగా బయటివరకు సాగనంపుతాం, అయితే ఈ బుద్యానాయక్‌ను మాత్రం ఊరికే వదలం" అని షావుకారును బయటికి దాటించారు. తరువాత బుద్యానాయక్‌ను పట్టుకొని బట్టలు విప్పి ముళ్ళ చెట్టుకు కట్టి బెల్లపు నీరు పోశారు."అమ్మాయిలను తార్చుతావేమిట్రా కొడకా?" అని ఆ దారిన వచ్చేవాళ్ళు పోయేవాళ్లంతా అతని ముఖం మీద కాండ్రించి ఉమ్మి పోతున్నారు.

వార్త లోలోపలే నిప్పులా మండసాగింది. మల్లప్ప తన తప్పు ఒప్పుకుని సరిదిద్దుకోవడానికి తపిస్తే, అతని వెనుక వున్న అనుచరులు ఏవేవో వంద అబద్ధాలు చెప్పి అతని బుర్ర పాడుచేయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో రాంపురం జరిగిన భారీ దొంగతనం గురించి విచారణకు వచ్చిన పోలీసులు షావుకారి ఇంట్లోనే మకాం పెట్టారు. బాలింతరాలికి వేడి చేసే సరుకుల కోసం

సరుకుల కోసం సోమ్లా భుక్యా, అతని తల్లి హడావుడిగా సరుకులు కొనుక్కుని, పొద్దు మునిగేలోపు తండా చేరుకోవాలనే అభిప్రాయంతో వెనుతిరిగారు. అయితే బ్రిటిష్ సైనికుడొకడు వీళ్లను బంజారాలుగా గుర్తించి, "బంజారాలు వెళుతున్నారు. బహుశా వీళ్లే దొంగతనం చేసివుండాలి" అని అనడం ఆలస్యం కొందరు పోలీసులు వాళ్ల వెంటపడ్డారు. సోమ్లా తన తల్లిని గుర్రం మీద కూర్చోపెట్టుకుని తాండా వైపు కాకుండా వ్యతిరేకమైన దిశలో గుర్రాన్ని పరిగెత్తించాడు. తాండావైపు వెళితే వందలాది మంది తెల్లవాళ్ల చేతుల్లో బలవుతారనే ఆలోచన అతనిది. "నాయనా! మనం చనిపోయినా పరవాలేదు. తాండలో ఉన్న పిల్లాపాపలకు ఏమీ కాకూడదు. తాండాకు వెళ్లేదారి ఈ తెల్లకోతులకు తెలియకూడదు. సేవాలాల్ ఏలా అనుకుంటే అలా జరుగుతుంది" అని అతని మనసులోని గుర్తించినట్టు అంది. తెల్లవారికన్నా వేగంగా గుర్రాన్ని పరుగులు తీయించి అడవిలోకి ప్రవేశించడమే ఆలస్యం ఇరుకైన దారి గుండా వాళ్లకు దూరంగా పోయి తల్లీకొడుకులు ఇద్దరూ దాక్కున్నారు. అయితే పోలీసులు, సైనికులు కలిసి వెతుకుతుండటం వల్ల వీళ్లు తప్పించుకొని పారిపోయే అవకాశాలు తక్కువయ్యాయి. "అమ్మ మనం చనిపోవడం ఖచ్చితం. వీళ్లలో కనీసం ఐదారుమందిని చంపాల్సిందే. లేకపోతే మనల్ని పట్టుకుని తండా గురించి అడిగి హింసిస్తారు" అన్నాడు. తరువాత ఒక్కసారిగా బెబ్బులిలా తానున్న చోటు నుంచి బయటికి దూకి ఇద్దరిమీద తలలు తెంచాడు. ఇద్దరు సైనికులు లేకపోవడం గమనించిన పోలీసులు అనుమానపడ్డారు. కటిక చీకటి ఆవరిస్తుండం వల్ల మనుషుల ఆకృతులు స్పష్టంగా కనపడటం లేదు. తాను చంపిన ఇద్దరు సైనికుల బందూకులు తనకు పేల్చడం వచ్చివుంటే అందరినీ చంపేసేవాడు. అదే కత్తితో మరో ఇద్దరి మీద దాడి చేశాడు. "ఇక్కడ, ఇక్కడ, అయ్యో చంపేశాడు" అని సైనికుల చీత్కారం విని జాగ్రత్తపడిన సైనికులు వాళ్లవైపు తూటాలు పేల్చారు. అప్పటికే అతని చేతిలో ఉన్న కత్తితో మరో ముగ్గురి ఎదలు చీల్చి నేలకూలాడు సోమ్లాభుక్యా కరమ్‌తోట్. కొడుకు అవస్థను చూసిన తల్లి ఇక తను వీళ్లు పట్టుకుని చిత్రహింస పెట్టి చంపుతారని నిర్ధారించుకొని, నేలకూలిన కొడుకు చేతిలోని కత్తి తీసుకుని సివంగిలా కొడుకు మీద తుపాకి పేల్చిన ఎర్రమూతి వాడిమీదికి దూకిస అతని గొంతులో కత్తిని దింపి బయటికి లాగింది. చివ్వున రక్తం చిమ్మింది. కెప్టెన్ మైకేల్ మీద ముసలిది చేసినదాడికి పోలీసులు నివ్వెరపోతూనే తుపాకులు పేల్చారు.

తెల్లవాళ్ల రక్తం కళ్లారా చూసిన తల్లి కొడుకులు తాండాకు ఎలాంటి ఎప్రమాదం రాకూడదని సేవాలాల్‌ను తలుచుకుంటూ ప్రాణాలు వదిలారు.

అర్ధరాత్రి అయినా మోళకాల్మూరు నుంచి తిరిగిరాని తండ్రి, నానమ్మల గురించి ధనసింగ్ చింతాక్రాంతుడయ్యాడు. ప్రమాదపు సూచనను అనుమానించాడు. శవాలను వెతుక్కుంటూ లంబాడీలు తప్పకుండా వస్తారని అంచనా వేసిన బ్రిటిష్ దఫేదారు మిస్టర్ జాన్ హెరాల్డ్ కెప్టెన్ మైకేల్ విషాదకరమైన మరణం గురించి, అదేవిధంగా ఆరేడుమంది సైనికులు చనిపోయిన వార్తను సాహెబ్ తెలియజేసి, పోలీసుల శవాలను బళ్లారికి తరలించాడు. తల్లికొడుకుల శవాలను కుక్కలు నక్కలు తినటానికి వదిలి దూరంలో కూర్చుని వారి వైపు బంధువులు తప్పకుండా వస్తారని రాత్రీపగలూ ఎదురుచూడసాగారు. అడవిలో రహస్యంగా సంచరించిన ధనసింగ్ అనుచరులు ఆకాశంలో గద్దలు గిరికీలు కొడుతుండటం చూసి అనుమానించారు. సోమ్లాభుక్యా, అతని తల్లి ఖచ్చితంగా అదేస్థలంలో చనిపోయివుండొచ్చని ఊహించారు. రాత్రి చీకటి పడుతున్నట్టే చెట్టు నుంచి చెట్టు మీదికి దూకుతూ నిశ్శబ్దంగా ఎవరున్నారు, ఎందుకిలా అయిందని ఆలోచనలో పడ్డారు. కొందరు పోలీసులు పొదల్లో దాక్కొని ఉండటం చూశారు. పోలీసులకు కొద్ది దూరంలో సోమ్లాభుక్యా, అతని శవాలు పడివుండటం చూసి, హడావుడిగా వార్త ధనసింగ్‌కు చేరవేశారు.

శవాలు వారం నుంచి కుళ్లి, పురుగులు, చీమలు, గద్దలు, నక్కలు కమ్ముకున్నాయి. చుట్టూ కాపలా. ఎలాగైనా శవసంస్కారాలు చేయాల్సిందే. అయితే బలవంతులైన బ్రిటీష్‌లకు వ్యతిరేకంగా పోరాడటం అసాధ్యం. శవాలు మాయమైతే అడవి అంతా వెతకటం మొదలుపెడతారు. ధనసింగ్‌కు దిక్కుతోచలేదు. ఒకవేళ షావుకారు మల్లప్ప సహాయం చేస్తాడేమోనని అతని దగ్గరికి మామను పంపాడు. వీళ్ల మీద కోపం మండిపడుతున్న మల్లప్ప చెడామడా తిట్టి అవమానించి పంపాడు. విషయం విని మరింత నిరాశ చెందిన ధనసింగ్ స్వయంగా తానే కరణం దగ్గరికి పోయి తాండానమోదు గురించి మాట్లాడి, అతన్నుంచి ఏదైనా సహాయం దొరుకుతుందేమోనని కరణం ఇంటికి వెళ్లాడు. "అయ్యా" అని అరిచి గుమ్మంలోనే కాచుకుని నిల్చున్నాడు. లోపలినుంచి ఎలాంటి జవాబు రాలేదు. ఈసారి బిగ్గరగా పిలిచాడు. తలుపులు తెరిచే సూచనలు కనిపించలేదు. వీధిలో తిరుగుతున్నవారు అనుమానంతో చూస్తూ ముందుకుపోయారు. అక్కడ అప్పటికే పోలీసుల, సైనికుల, వేధింపులు పెరిగాయి. ఏమి చేయాలో తోచక మరొకసారి గట్టిగా తలుపు తట్టాడు. "ఎవఁ్రా అది? సమయంకాని సమయంలో రావటానికి ఇదేమైన ధర్మసత్రం అనుకున్నారా?" అని వచ్చి తలుపు తెరిచి ధనసింగ్‌ను చూసి "ఎవఁ్రా నువ్వు?" అని అడిగాడు. "నేను స్వామి ధనసింగ్‌ను. దేసుతాండాకు చెందినవాడిని. అదే

మా నాన్న సోమ్లానాయక్ తమకు, షావుకారుకు బంగారు నాణ్యాలు ఇచ్చి తాండను మీ దస్తావేజుల్లో నమోదు చేయించుకున్నారు" అని అన్నాడు. "ఏ తాండా? దేసు నాయక్ లేదు, పీసునాయక్ లేదు. నేను ఏ తాండా గురించి దస్తావేజులోనూ నమోదు చేయలేదు" అని కుక్కను కసిరినట్టు కసిరాడు కరణం శేషప్ప భట్టు.

"అయ్యా, దూరప్రాంతం నుంచి బతుకు–చావుల మధ్య పోరాడుతూ ఈ ప్రదేశానికి వచ్చాం. మేము కూడా ఈ నేల బిడ్డలమే. ఏదో పరిస్థితుల ఒత్తిళ్లకు చిక్కి మా బతుకులు చితికిపోయాయి. తాము చదువుకున్నవారు. పండితులు. మీరే ఇలా అంటే ఎలా? ఇప్పుడు మీరే మాకు దారి చూపించాలి" అంటూ ధనసింగ్ ఆయన కాళ్లకు నమస్కారం చేశాడు. "ఛీ...ఛీ...పశువులు. మైల చేసేశారు. దూరం..., అసహ్యం, ప్రారబ్ధం...చూడరా నాయకా, ఎవరు బలవంతులో వాళ్ల వెనుక వుండటం తెలివైన పని. ఇప్పుడు నువ్వు నిస్సహాయుడివి. చేతకానివాడివి. నువ్వు పోరాడితే ప్రయోజనమేమి? తెల్లవాళ్ల శత్రువులు మాకు శత్రువులే. ఊరకే సమయం వ్యర్థం చేయకుండా వెళ్లు" అని తన నిర్ణయాన్ని కరాఖండిగా చెప్పాడు. ధనసింగ్ నిరాశతో కుంగిపోయాడు. ఇప్పుడు అతని ముందు ఉన్నది అతని తండ్రి, నానమ్మ శవాల చింతకాదు. ఎలాగైనా దేసునాయక్ తాండను ప్రభుత్వ దస్తావేజులలో నమోదు చేసి బ్రిటిషుల నుంచి మునుముందు జరగబోయే అనాహుతాన్ని తప్పించటం. లేదా దానికి పర్యాయమైన మరొక ఉపాయాన్ని వెదకటం. "అయ్యా, దస్తావేజుల్లో నమోదు చేయటం అబద్ధమా?" అని చివరిసారిగా అడిగాడు. ఏది నిజమో, ఏది అబద్ధమో అంతా అతనికే తెలుసు. మల్లప్పకు బంగారు నాణేలు ఇవ్వటం గురించి శేషప్పను వెళ్లి అడిగేసరికి, "ఏయ్, వాడ్ని తోసి, తలుపులు మూయండ్రా" అని పనిమనుషులకు చెప్పాడు కరణం శేషప్ప.

ఒంట్లోని రక్తం మరిగిపోయింది. నోటి వచ్చిన మాటలు తాండలోని పిల్లలను, ఆడవాళ్లలను గుర్తుచేసుకుని కరిగిపోయాయి. ధనసింగ్ ఓడిపోయినా, ధైర్యం కోల్పోలేదు. "ముందుగా మా నాన్న, నానమ్మల శవాలకు నిప్పు పెడదాం" అని తన వెంబడి ఉన్న పీర్యా, దావు, మంగ్ల్యా, సక్ర్యలకు చెప్పాడు. "అదికాదు, ఈ లంజకొడుకులలకు ఆ మాత్రం బుద్ధి ఉండక్కర్లేదా? ఇక్కడే ఎక్కడో తండా జనం వుండొచ్చని వెతకటం మాని, శవాన్ని కాపలా కాస్తు కూర్చున్నారు" ఫిక్యా బ్రిటిషువారి మూర్ఖత్వాన్ని ఎత్తి చూపాడు. "ఆ నా కొడుకులు లంబాడీలు ఇక్కడికే వస్తారు, మనమెందుకు వెళ్లాలని అనుకున్నారు. అయితే మనం పోము. కానీ శవాన్ని కాల్చగలమని వాళ్లకు చూపించాలి. ఏ సైనికుడికి హాని జరగకూడదు. మన పని

జరిగిపోవాలి" అని మంగ్యా తన నిర్ణయాన్ని చెప్పాడు. ధనసింగ్ తలలో ఏవేవో ఆలోచనలు చెలరేగుతున్నాయి. "ఒరే ధావు, నువ్వు, బద్యాలు ఎటువైపున ఎంతెంతమంది సైనికులు ఉన్నారో దగ్గరికిపోయి ఈ ఆకులను రెండు చేతులతో నులిమి చిన్నగా పొగపెట్టండి. వాళ్లు ఆ పొగను వాసన చూసిన వెంటనే మూర్ఛపోతారు. తర్వాత పని నేను చూసుకుంటాను" అని ధనసింగ్ అందరి చేతుల్లో కారడవిలో దొరికిన స్పృహ తప్పించే ఆకులను ఇచ్చి, "జాగ్రత్తరా, నులిమేటప్పుడు ముఖానికి గుడ్డ చుట్టుకోండి. మీరు వాసన పీలిస్తే, అక్కడే పడుకుంటారు" అని హెచ్చరించాడు. ధనసింగ్ ఇచ్చిన ఆకులను చేతిలో పట్టుకుని దిక్కుకొకరు పోయినవారు చెట్ల చాటున దాక్కుని, ఆకులను నులిమి, చిన్నగా పొగపెట్టి, సైనికులను స్పృహ తప్పించారు. వెంటనే అడవి పక్షిలా సద్దు చేశారు. అది వినగానే ధనసింగ్ తన వారితో అక్కడికి వచ్చాడు. అక్కడే ఉన్న కర్రముక్కలను తెచ్చి కుళ్లిపోయిన శవాల మీద పేర్చి తమతోపాటు తెచ్చిన శుద్ధమైన భట్టిసారాయిని చితిమీద పోసి నిప్పు అంటించి, తన వాళ్లను వెంబెట్టుకుని అక్కడి నుంచి మాయమయ్యాడు.

❖❖❖

4. బతుకు తెరువు కోసం

కెప్టెన్ కౌల్‌కు బుర్ర పాడైపోయింది. ఇంతమంది సైనికులు కాపలా వున్నప్పటికీ శవాలకు నిప్పు ఎలా అంటుకుంది? "మిస్టర్ కరణం, అక్కడ బ్లాక్ మ్యాజిక్ ఏమైనా ప్రాక్టీస్ చేస్తున్నారా? లేకపోతే ఆ బంజారాల శవాలకు నిప్పు ఎలా అంటుకుంటుంది?" అని అశ్చర్యంగా అడిగాడు. కరణం ఏదో చెప్పాలని నోరు తెరిచాడు. అంతలో మల్లప్ప షావుకారు, "అదేమి మాయనో, ఆ అడవిలో ఏదైనా దెయ్యం..." అని ఏదేదో పురాణాం చెప్పడం మొదలుపెట్టాడు. కౌల్ దొర కోపంగా "వాట్ నాన్‌సెన్స్ మల్లప్ప. శవాన్ని తగలబెట్టడానికి దెయ్యం వస్తుందా? అదెలా సాధ్యం? టెల్ మి" అని అతడినోరు మూయించాడు. కరణానికి కడుపులో తిప్పినట్టయ్యింది. ఏదో చెప్పాలని మాటల కోసం వెదికాడు. "ఓ.కే. మేము చూసుకుంటాం. మీరు వెళ్లొచ్చు" అని వాళ్లను పంపాడు. బతికిపోయామని అనుకుంటూ ఇద్దరూ పంచెలు గట్టిగా పట్టుకుని బయటికి పరుగెత్తారు.

"కరణం, ఇప్పుడేమో తప్పించుకున్నాం. రేపు ఏమవుతుందో తెలియదు. ఏదో విధంగా ఆ తండా ను ఖాళీ చేయించాలి. లేదా దస్తావేజుల్లో చూపించాలి" అని తన ఆలోచనను బయటపెట్టాడు. ఇదే సరైన సమయమని, "అదికాదు షావుకారుగారు, మీరు బంగారునాణేలు తీసుకుని నాకు మాత్రం వెండినాణేలు ఇచ్చారుకదా, ఇది న్యాయమా ? పైగా దస్తావేజులో పాత తారీఖులు చూపించమని అంటున్నారే ఇది న్యాయమా?" అని కరణం నిష్ఠూరంగా అన్నాడు. "నేను లంబాడీల దగ్గర బంగారం నాణేలు తీసుకున్నానని ఏ నా కొడుకు చెప్పాడు? ఆ కొడుకును చెప్పుతో కొడతాను" అని కోపంగా అన్నాడు. "ఏనా కొడుకా? స్వయంగా ఆ

లంబాడి చెప్పాడు. అతను నీ చరిత్రను పొగిడాడు" అని షావుకారు ముఖం చూశాడు. "తమాషాకు అన్నానయ్యా. వాళ్లు ఇచ్చింది రెండు మూడు వరహాలే. నీకు అర్థంకాదని నా దగ్గరే పెట్టుకున్నాను. నీకూ ఇద్దామనే అనుకున్నాను. అయినా నీవు ఇంత అనుమానిస్తావని నాకు తెలియదు" అని గొణుక్కుంటున్నట్టు అన్నాడు. "ఏమన్నారు?" కరణం సరిగ్గా వినిపించక పోవటంతో మళ్లీ అడిగాడు. "ఏమీ లేదు. ఏదో పొరబాటైంది. ఇస్తానులే. ముందు ఏదో ఒకటి చెయ్యి" అని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

తండా పేరిట దస్తావేజు చేయించడానికి ముందుకొచ్చిన గౌడ మల్లప్ప, కరణం శేషప్పలు రాత్రికి రాత్రి ధనసింగ్ భుక్యా, అతని మనుషుల చేత వందలాది ఎకరాల జమీను దున్ని చదును చేయించాడు. అదీ చాలదన్నట్టు అడవి పక్కనున్న మల్లప్ప జమీను ధనసింగ్‌భుక్యా పేరిట ఇరవై అయిదేళ్ల క్రితం చేయించుకున్నట్టు పత్రం చేయించాడు. బ్రిటిష్ సర్కారును తాము మోసం చేయలేదని ఋజువు చేయడానికి కరణం, గౌడ నేను ముందు, తాను ముందు అంటూ ముందుకొచ్చారు. అయినా కౌల్‌దొర గుర్రమెక్కి తనిఖీకి వస్తారనే భయం వేధించసాగింది. కౌల్ దొరను ఎలా నమ్మించాలి? ఒక వేళ ఆయన తాము మోసం చేశామని గుర్తిస్తే స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్లను ఉరితీసిన చెట్ల పక్కనే తమనూ ఉరివేస్తారని ఇద్దరూ అనుకున్నారు,

ధనసింగ్ తండ్రిని పోగొట్టుకుని అనాథ అయ్యాడు. భీమణి రోజు సాయంత్రం 'దాడ' (మూడో రోజున చేసే కార్యం) చేసి భర్తను గుర్తుచేసుకుని థావరో (ఏడ్వటం) చేసింది. బారోతేరో (పన్నెండో-పదమూడో) రోజువరకూ ఆ ఏడుపును కొనసాగించింది. కరమ్‌తోట్ వంశపు మొలకను కనిన కోడలు సీత్కిని చాలా ప్రేమతో చూసుకుంటున్న అతడి నానమ్మ సోమ్లి కూడా హుతాత్మురాలైంది. భీమణి అనివార్యంగానే మనవడికి పేరు పెట్టడానికి, వారి బంధువు కారభారి ఇంటివారిని పిలిచి హనుమా నాయక్ అని నామకరణం చేసింది. హనుమా నాయక్‌ను పెంచుతూ, వందలాది ఎకరాల జమీను సాగుచేసుకుంటూ తన సోదరులనంతా సరైన రీతిలో నడిపించసాగాడు ధనసింగ్. కాలం గడుస్తున్నట్టల్లా ధనసింగ్ అన్నీ మరవడానికి ప్రయత్నించాడు. చనిపోయిన వారి జ్ఞాపకాలు కేవలం జ్ఞాపకాలు.

అంతే, దానికావల ఏమీ లేదు. లేకపోతే మనిషి బతకడు. పిచ్చివాడు అవుతాడు. మల్లప్పగౌడ ఏదో జబ్బు చేసి చచ్చిపోయాడు. అతని తర్వాత అతని కొడుకు తెప్పర సిద్ధగౌడ పదవికి వచ్చాడు. అతని సహచరులు నాయకర తిప్ప,

చెలవాది చెన్నబసవ, ఉప్పార మంజ్యా, వీరి ఆగడాలు ఎక్కువయ్యాయి. బ్రిటిషులు దూరంలో ఉండి కప్పం వసూలును గౌడకో, కరణానికో, తళవారుకో అప్పగించేవారు. వీళ్లు కప్పం వసూలు సాకుతో చేయకూడని పనులు చేసేవారు. కరణం శేషప్పకు పక్షవాతం వచ్చింది. ఎడమచెయ్యి పూర్తిగా స్వాధీనం తప్పింది. ముఖం పక్కకు ఒరిగిపోయింది. శేషప్ప భట్టుగారి కొడుకు దత్త కరణమయ్యాడు. కౌల్‌దొర ముంబైకి బదిలీ కావటం వల్ల బ్రిటిషు కార్యకలాపాలకు ఇప్పుడు బళ్ళారి కేంద్రస్థానం అయింది. భారత్ మూలమూలలలో వ్యతిరేకత ఆరంభమైంది. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ మొదలైన యువకులను ఉరితీసిన నేపథ్యంలో గొప్ప పోరాటమే జరిగింది. మహాత్మా శాంతి మంత్రం జపిస్తూ ఉరితీయబడ్డవారి గురించి మాట్లాడకపోవటంతో ప్రజానీకానికి బాధకలిగింది. ఈ వార్తలేవి దేసునాయక్ తండా కు చేరేవి కావు. ఎందుకంటే అక్షర జ్ఞానం లేని నిరక్షరాస్యులే నిండిన ఆ తండా భట్టి సారాయి, అడవిపళ్లు, ఎండిన కట్టెలు తెచ్చి అమ్మడం, వచ్చిన కాసులతో జీవితం గడిచేది. ధన్‌సింగ్ భుక్యాకు అవగాహన పెరిగిన తర్వాత మార్పుకు పూనుకున్నాడు. అతను మొత్తం నూటాయాభై ఎకరాల జమీను చదను చేసుకుని, కరణంతో చక్కుబంది వేయించుకుని చట్టప్రకారం పక్కాగా చేయించుకున్నాడు. అతని చిన్నాన్న తోత్యా పిల్లలు రేఖ్యా, దేవ్లలు కూడా అతని పొలం పక్కనే పది, ఇరవై ఎకరాల జమీనుకు యజమానులయ్యారు.

మార్పుకు అవసరమైన ముందు సూచనలు కనిపించసాగాయి. సుభాష్ చంద్రబోస్, 'మీరు రక్షణ ఇవ్వండి, నేను స్వాతంత్రం ఇస్తాను' అని తీవ్ర పోరాటం ప్రారంభించి జర్మనీ, జపాన్ సహకారం కోసం ఒక ఉన్నతస్థాయి సమావేశానికి హాజరవటానికి బయలుదేరిన సమయంలో విమానప్రమాదంలో చనిపోయారనే వార్త దేశమంతటా వ్యాపించింది. విప్లవకారులకు పెద్ద దెబ్బతగిలినట్టయితే గాంధీవాదులకు సంతోషం కలిగించింది. అప్పటికి అసహకార ఉద్యమంతో బ్రిటిషువారిని శాంతితోనే బయటికి తరమాలనే గాంధీజీగారి కల ఫలించే లక్షణాలు ప్రారంభంలో కనిపించలేదు. అయితే రైతుల మీద, సామాన్య ప్రజలమీద అనవసరంగా పన్నులు విధించడం ఆగలేదు. బ్రిటిష్‌లు ఒకటి చెబితే సిద్దేగౌడ నాలుగు రెట్లు అధికంగా వసూలు చేయసాగాడు. కరణం కొడుకు దత్తకూడా గౌడకన్నా వందరేట్లు ఎక్కువ ఆశపోతు. ఈ పనికిమాలినవాళ్ల వ్యవహారాలు నడుస్తున్నాయే తప్ప బ్రిటిషులు స్వయంగా వచ్చే అవకాశాలు కనిపించలేదు.

ధనసింగ్ తండ్రి చనిపోయిన సంవత్సరం వరకూ చాలా బాధను

అనుభవించాడు. ముఖ్యమైన సమస్య తలెత్తింది. అదేమిటంటే సిద్దేగౌడ పీకి ఇంటికి వస్తున్నప్పుడు అడవిలో దెయ్యాలు బెదిరించడం అబద్ధమని, అదంతా చేసింది ధనసింగ్, అతని సహచరులని తెలిసింది. దాంతో అతను అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. రెండవ సమస్య భూమి ఎక్కువగా ఉన్నప్పటికీ వర్షాలు సరిగ్గా కురవక పెద్దసంసారాన్ని లాక్కుని రావటం కష్టమైంది. ఈ రెండు సమస్యల మధ్య చిక్కుకుని సతమతమవుతున్న సమయంలో అతనికి రెండో కొడుకు పుట్టాడు. అతని తల్లి భీమణి , అతని భార్య సీత్కి పిల్లవాడి పేరు భద్ర భుక్యా కరమ్‌తోట్ అని నామకరణం చేశారు. ధనసింగ్ కష్టాల కాలాన్ని ఎదుర్కొంటూనే ఉన్నాడు. తాండాలో జరుగుతున్న అనేక పాడుపనులను నియంత్రణలోకి తీసుకుని రావాలని భావించినా, చుట్టు పక్కల మంచివాళ్లకన్నా చెడ్డవాళ్లే ఎక్కువయ్యారు. 'ఈ నాకొడుకు వాడబ్బ హక్కు అనుకుంటున్నాడు. తాండా తనదేనని అనుకుంటున్నట్టు ఉన్నాడు' అని సిద్దగౌడ దగ్గర కొందరు పీర్యాదులు చేశారు. ఉన్నవి లేనివి చెప్పి అతని బుర్ర పాడు చేసినవారూ ఉన్నారు. ఈ తలనొప్పులన్నిటి నడుమ సంసార భారాన్ని మోయటానికి ధనసింగ్ సతమతమవుతున్నాడు.

వ్యవస్థతో ముసుగులో గుద్దులాట జరుగుతూనే ఉంది. ఎప్పుడు విస్ఫోటనం చెందుతుందో ఎవరికీ తెలియదు. కట్టెలు అమ్మడం, భట్టిసారా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ, భూమిని దున్నేవారు, వ్యవసాయం చేసుకునేవారు తమ పనులు తాము చేసుకునేవారు. ధనసింగ్ వేకువనే తొలికోడి కూయటానికి ముందే ఇల్లు వదిలితే, మళ్లీ రాత్రి ఇల్లు చేరేవాడు. ఇంటి వాళ్లందరూ పొలాలలో పని చేసేవారు. అవసరం వస్తే భట్టి సారాయి తయారు చేయడంలోనూ చేయూత ఇచ్చేవారు. పరిస్థితి నెమ్మదిగా కుదుటపడసాగింది. సమయానికి మంచి వర్షం కురిసింది. వంద ఎకరాల భూమిని దున్ని, జొన్నలు, సామలు, సజ్జలు, నువ్వులు, వేరుశెనగలు వేశారు. జడివాన వల్ల, చల్లటిగాలి వల్ల శీతల ప్రకృతివారి బాధలు చెప్పనక్కర్లేదు. కారభారి రాత్రంతా నిద్రలేక దగ్గి దగ్గి ముఖమంతా వాచిపోయింది. అతని ఇంటివారు ఇక అతను బ్రతకడమే కష్టమని అనుకొన్నారు. అయితే భట్టి సారాయి, కోడిచారు సేవించటం వల్ల బతికి బయటపడ్డాడు. అయితే శ్రావణమాసంలో వచ్చిన చలిజ్వరం అతన్ని తీసుకొనిపోయే వరకూ శాంతించలేదు. ధనసింగ్‌కు అది మరొక దెబ్బ. అతని తండ్రి తరువాత కుటుంబంలో కానీ, తండా లోకానీ వచ్చిన మంచి చెడులకు, కష్టసుఖాలకు అతని మామ ఆసరా అయ్యాడు. ఆయనపోయిన తర్వాత ధనసింగ్‌కు తాను ఒంటరి అయినట్టు అనిపించింది. అయినా నేలనే లేని ఈ

జనానికి ఆసరా అయిన ధనసింగ్ ధైర్యంగా ఉండవలసి వచ్చింది. హనుమ, భద్ర తరువాత మూడవ కాన్పులో అమ్మాయి దేవ్లి పుట్టింది. అప్పటి నుంచి ధనసింగ్ ప్రతిఅడుగును చాలా జాగ్రత్తగా వేయవలసి వచ్చింది. అతన్ని ఆశ్రయించుకుని ఉన్న వారి సంఖ్య మరింతగా పెరిగింది.

పంట కోతకు వచ్చే సమయానికి కూలీలు పొలాల్లో మంచెల మీద మకాం పెట్టి, రాత్రంతా కాపలా కాస్తూ, పొలంలో జొరబడ్డ జంతువులను బెదిరించసాగారు. చిన్న చిన్న జంతువులు, నక్కలు, తోడేళ్లు, అడవి పందులు బెదిరి పారిపోయేవి. అయితే వారి దురదృష్టానికి అడవి ఏనుగుల గుంపు ఎటు వైపు నుంచి వచ్చిందో కానీ సాయంత్రానికి తండా పొలాలపై దాడిచేసింది. తిన్నది తక్కువ ధ్వంసం చేసిందే ఎక్కువ. విషయం తెలియగానే ధనసింగ్ పదిపదిహేను మందిని వెంటబెట్టుకొని నగారా, తప్పెట వాయిస్తూ, కేకలు పెడుతూ కాగడాలు పట్టుకొని వచ్చి వాటిని తరిమికొట్టే ప్రయత్నం చేశారు. కోతిదూరిన 'వనం నాశనం, ఏనుగులు దూరిన పొలం నాశనం' అన్నట్టు అవి తిరిగిన చోటంతా పంట నాశనమైంది. వాళ్లు కోలుకోవటం కష్టమైనప్పటికీ కోలుకోవటం అనివార్యమైంది.

మిగిలిన కొద్దిపాటి పంటనైనా జాగ్రత్తగా చూసుకుందామని రాత్రీపగలూ కాపలా ఉన్నారు. చిన్న చిన్న జంతువులు సమస్యను సృష్టించసాగాయి. గట్టున ఉన్న పొలాలు, మరీ మధ్యన ఉన్న కొన్ని పొలాలలో పంట నాశనం కాకుండా చేతికి వచ్చేలా కనిపించింది. అయితే నక్కలు, మృగాలు వేరుశనగ వేర్లను లాగేసి ఒట్టి మొక్కలను మిగిల్చాయి. విత్తనాలు, ఎరువులు, పొలం కోసం చేసిన శ్రమ, పంటకోసం ఎదురుచూసిన సమయం అంతా వృథా అని అందరూ చాలా బాధపడ్డారు. దాంతో ఎంత చిన్న జంతువు దొరికినా చంపేద్దామనే స్థితికి వచ్చారు. రాత్రిపూట జింకలను వేటాడి చుట్టూ పక్కల ఊర్లకు దాని మాంసాన్ని తీసుకునిపోయి అమ్మేవారు. ధనసింగ్‌కు వంద ఎకరాలు భూమి ఉన్నప్పటికీ వర్షాలు లేకపోవటం వల్ల అతని సంసారానికి కావలసిన గింజలు దొరికేవి కావు. అసలే అది కారడివి. నేలంతా రాతి దిబ్బలు, పిచ్చి మొక్కలు. కలుపు. కలుపు ఎక్కువగా పెరిగివుండటం వల్ల మొదటి నుంచి జనం కలుపు తీసి, ఛాతీ ఎత్తుకు పెరిగిన గడ్డిని పశువుల కోసం కోసుకునిపోయేవారు. వీళ్లు పరిస్థితి ఇలా ఉంటే, బ్రిటిషులు విలాసంగా గడుపుతున్నారు. వారిని ఆశ్రయించిన నక్కజిత్తుల మనుషులు ధనవంతులయ్యారు. బ్రిటిషులు తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేవారిని వేధించడానికి జనం మీద పన్నులు పెంచుతూనే పోయారు. సిద్ధ ఉరఫ్ సిద్దేగౌడ్, కరణాలు చెప్పిందే

బ్రిటిషులకు వేదవాక్కు. ప్రభుత్వం ఒక పాలు పెంచితే వాళ్లు తమకు కావలసినంతగా పెంచి ప్రజల ప్రాణాలు పిండేవారు. కప్పం అడగటానికి వెళితే, ఇవ్వలేక మగవారు అడవిలోకి పారిపోయి దాక్కునేవారు. అయితే కరణం అతి తెలివైనవాడు. ఏదో ఒక పశువునో, ఈనడానికి సిద్ధంగా ఉన్న ఆవునో తోలుకొని పోయేవాడు. అవి రెండూ లేకపోతే పనిచేయడానికి వచ్చిన అమ్మాయిలను కుదువ పెట్టుకున్న మనుషుల్లా బలవంతంగా లాక్కొని పోయేవాడు. అందులో సిద్దేగౌడకు భాగం ఉండేది. తమ పిల్లలను కాపాడుకోవాలనుకునేవారు ఎవరి కాళ్లో పట్టుకొని అప్పోసొప్పో చేసి రాత్రికి రాత్రి విడిపించుకుని వచ్చేవారు. గౌడ, కరణాల కామపు కళ్లకు వయసు అమ్మాయిలు గురయ్యేవారు.

తండా జనం దొంగ సారాయి, కట్టెలు, కలిమి పళ్లు, బంక మొదలైనవి అమ్మి నాలుగు డబ్బులు సంపాదించి ప్రశాంతంగా బతకవచ్చు. అయితే భట్టి సారాయి దించినప్పుడు సగం వాళ్లే తాగేవారు. ఇక నంచుకోవడానికి కోడి, గొర్రె, చేపలు కావాలి. అలాంటప్పుడు ఎలా బాగుపడతారు? అంతేకాదు హుక్కా, భంగు పీల్చడం మొదలైన దురలవాట్లు ఉన్నాయి. కాళ్ల కింద నీడను చూసి బ్రతికే జనానికి రేపు ఏమవుతుందో, మర్నాడు ఎలావుంటుందో ఏమి తెలుసు? అక్కడే తిని, చొక్కాకు చెయ్యి తుడుచుకుని ఒళ్లు విరుచుకునే జనం రేపటి భవిష్యత్తు గురించి, పిల్లల బతుకుల గురించి ఎన్నడూ ఆలోచించేవారుకాదు. ఉన్నంతలో ఎవరి దగ్గరకు పోకుండా తిండికి, బట్టకు తగినంతగా చేసుకున్నవాడంటే ధనసింగ్ నాయక్ మాత్రమే. అతని ముత్తాతల కాలం నుంచి ఒకే స్థాయిని కాపాడుకుంటూ వచ్చాడు. పెద్దల నుంచి అతనికి సరైన మార్గదర్శకం దొరికింది. చావడానికి ముందు అతని తండ్రి, "చూడు నాయనా! రెండు మాటలు ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకో. ఒకటి-భాంది బుంధి బాటె సికిసాకివాత ఫణదాడరేస (కట్టిన బుత్తి, నేర్పిన మాటలు చాలా రోజులు వుండవు). రెండవది- "తన బలమే బలం". ఈ రెండింటిని బలంగానే నమ్ముకుంటూ వచ్చాడు ధనసింగ్‌భుక్యా కరమ్‌తోట్. అందువల్ల అతను తన సొంత బలం మీదనే అన్ని పనులు చేస్తూ వచ్చాడు. అతని చిన్నాన్న మంగ్యా పిల్లలైన జరప్ల, దేవ్య, బద్యాలు పెదనాన్న సోమ్లా అదుపులోనే ఉండేవారు. అందరూ కలిసి ఉంటున్న ఉమ్మడి కుటుంబం. ముగ్గురు పెళ్లిచేసుకున్నారు. అయినా భార్యాపిల్లలతో కష్టపడకుండా, సోమరిగా తింటూ ఉన్నారు.

దీపావళి, అమావాస్య రోజున 'మాకు బట్టలు తీసుకు రాలేదు','మా పిల్లలకు బట్టలు తేలేదు' అని తాగుతున్న సారాయిని పారబోసి ముగ్గురు బయటికి వచ్చారు.

భీమణికి వాళ్ల తలలో ఏదో జరుగుతోందని అర్థమైంది.

"నాయనా! ఇకపై వాళ్లు మన ఇంట్లో ఉండరు. మనస్సు, మట్టికుండ ఈ రెండు ఒకసారి పగిలిపోతే అతికించడానికి రాదు. వారికి చెందవలసిందేమైనా మంచి మాటలతోనో, ప్రేమతోనే ఇచ్చి దూరంగా పంపడటమే క్షేమం. తోడబుట్టినవారే వెంట ఉండరు. ఇక చిన్నాయన, పెదనాయన పిల్లలు మనవాళ్లవుతారా? పిచ్చివాడా! ఇదొక మహాభారతంలా తయారై తండా జనం ముందు నగుబాట్లు కాకముందే వదిలెయ్ నాయనా. నువ్వు ఒంటరి వాడివి. రేపు ఏదైనా జరగరానిది జరిగితే...." తల్లి పేగు అన్ని రకాలుగా, అన్ని అవకాశాలను, అన్ని కోణాలలో ఆలోచించింది.

అతని విరోధులైన సబావుటి సామి, ఓంకారి, రామావతయంక, మంగ్యా జరప్ల, దేవ్య, బద్యాలను రెచ్చగొట్టారు. "రేయ్ తెలివి తక్కువ దద్దమ్మల్లారా! పొలంలో పని చేయడానికి మీరు తెల్లధోవతి కట్టుకుని, తెల్లటి చొక్కా వేసుకుని, పానగల్లు, మోలాను, దేవదుర్గ, చిత్రకాలదుర్గ, చళకేరిలకు మీరు తిరిగి సంపాదించిందంతా ఎనిమిది రెట్లు చేసి, మిమ్మల్ని మోసం చేసి, చివరికి మీకు వాళ్ల దగ్గర, వీళ్ల దగ్గర అప్పున్నట్టు చూపించి గుర్రమెక్కి వెళ్లిపోతాడు" అని చెవులు కొరికారు. కౌరవుల కులాన్ని నాశనం చేసిన శకుని దుర్యోధనుడికి చెప్పినట్టు చెప్పి వాళ్ల తలలు పాడుచేసారు. స్వామి ఓంకారి, యంక్యా చెప్పిందే వేద వాక్యంగా భావించిన మంగ్యా కొడుకులు "ఒరేయ్, మాకేం రావాలో అది ఇచ్చెయ్" అని కూర్చున్నారు. దీపావళి అమావాస్య కూడా గడవకుండా ఇంటి ముందు కూర్చున్నారు.

ధనసింగ్ ఒంటరిగానే పోరాడవలసి వచ్చింది. అతని సోదర సంబంధీకులు అనేకులు అతని వెనక నీడలా ఉండేవారు. అతని తండ్రి సోమ్లా భుక్యా వారి జీవితాలకు ఒక ఆసరా కల్పించటం వల్ల, అతని కొడుకు మీద అందరూ ప్రాణం పెట్టుకున్నారు. "నువ్వు చెప్పు కాకా, ఆ నా కొడుకుల కాళ్లూచేతులు కట్టి తెచ్చి నీ పాదాల మీద వేస్తాం" అని అతన్ని ఓదార్చసాగారు. ఇలా మితిమీరిన భావోద్వేగంతో ఆలోచించడం సమంజసం కాదని ధనసింగ్‌కు తెలుసు. అతను సంపాదించిన ఆస్తిలో సగం ఇచ్చి తాను సగం తీసుకున్నాడు. "అడవి వైపు పొలం నీకెందుకు? నీవే ఇటు వైపు పొలం తీసుకో" అని ఇరువైపులా వ్యవహారం తెలిసిన జరప్ల అన్నాడు. ధనసింగ్ మాట్లాడలేదు. పంచాయతీ చేరిన వారిలో సోమ్లా వంశం నాశనమై పోవాలని ఆశించేవారే చాలామంది వుండటంవల్ల అతను నోరు మెదపలేదు. అతని తల్లి కళ్లతోనే కొడుకును మౌనంగా ఉండమని సూచించింది. అతని అల్లుడు కారభారి చంద్రనాయక్ లోలోపల అతని అభివృద్ధిని భరించేవాడు కాదు. ఆ

వంశం పాడైపోవాలని ఆశించేవారి గుంపులో ఉన్నావాడు, "పంచాయతీలో జరప్ల తన మనవిని ముందు పెట్టాడు. అతనికి ఇచ్చిన పొలం వద్దంట, నీవు తీసుకున్నదే అతనికి కావాలంట, నువ్వు ఏమంటావు?" అని వయసులో అతనికన్నా పెద్దవాడు కాకపోయినప్పటికీ పంచాయితీలో తానే పెద్దవాడిననే అహంతో మాట్లాడాడు. మరోమార్గం లేక "సరే, నేనే దాన్ని తీసుకుంటాను కారభారిగారు. నా తమ్ముళ్లు ఇప్పుడు నేను తీసుకున్న యాభై ఎకరాలు తీసుకొమ్మనండి" అని తన అంగీకారం సూచించి లేచి వెళ్లిపోయాడు. ఓం కారి,యంక, సామి తమ గెలుపుకు మీసాలు దువ్వారు.

ఏ సమస్యకూ తల పాడు చేసుకోకుండా ధనసింగ్ వందలాది సంవత్సరాల నుంచి నమ్ముకుంటూ వచ్చిన ఒక పరంపరను హఠాత్తుగా జరప్ల, బద్యాలు ముక్కలు ముక్కలు చేశారు. సంబంధ, బాంధవ్యాలకు ఎలాంటి అర్థం లేకుండా ప్రవర్తించారు. తండాలో నాయకుడి పదవి, ఆస్తి చేసుకున్నాడనే పాతపగ ఉండొచ్చు. సోమ్లా వున్నంత వరకు నోరుమెదపని మంగ్ల్యా కొడుకులు, ధనసింగ్ రాత్రీపగలూ కష్టపడి సంపాదించిన వంద ఎకరాలభూమిని చూసి కళ్లు అసూయపడ్డారు. అది వారి నిద్రను పాడు చేసింది. దరిద్రలక్ష్మి కూర్చోనివ్వలేదు. ఇంటిని రెండు భాగాలు చేసేసింది. మారుతున్న పరిస్థితుల ఒత్తిడివల్ల ధనసింగ్ కాస్త కలవరానికి లోనయ్యాడు. ఎందుకు ఇలా అయింది? అని విచారించాడు. అంతా వాళ్లకే వదిలేశాడు. వాళ్లను నమ్మి ఏవేవో ప్రణాళికలు వేసుకున్నాడు. ఆ కలలన్నీ చెదిరిపోయాయి. తల్లితొడమీద తలపెట్టి వలవల ఏడ్చాడు. ఎన్నడూ ధైర్యం కోల్పోని కొడుకు ఈరోజు ఇంత భావోద్వేగంతో ఉండటం చూసి ఆమె దుఃఖితురాలైంది. "జీవితంలో ఇదంతా సహజంరా పిచ్చివాడా! ఈ భూమి మీద రాజ్యం చేస్తూ శాశ్వతంగా ఎవరు పాలించారో చెప్పు. కలలుకన్నవారు ఫలించక ఇలా నీలాగే ఖిన్నులవుతారు. మనం చూసిన వేలాది కలలలోలా భగవంతుని ఇచ్ఛానుసారం ఈడేరేవి ఏవో కొన్ని మాత్రమే. లేకపోతే మనం ఆయనను మరిచి సాక్షాత్ మనమే దేవుళ్లమన్నట్టు ప్రవర్తించేవాళ్లం. మనం కేవలం అల్పమానవులం నాయనా" అని ఓదార్చే ప్రయత్నం చేసింది. క్షణకాలం అతను నొచ్చుకున్నా తండాకు వచ్చిన అనేక సమస్యలను ఎదుర్కోవటానికి రాతివిగ్రహంలా నిలబడేవాడు ఇలా మృదువుగా అయిపోతాడని ఎవరు ఊహించలేదు. "అయినా ఇంత తొందరగా ఈ జనం మోసం చేస్తారని అనుకోలేదు" అని తన అసహనాన్ని, అసంతృప్తిని బయట పెట్టాడు. "ఒరే నాన్నా, కౌరవులు-పాండవులు ఓకే అంతఃపురంలో వుండడం సాధ్యమా? అందరూ సుఖంగా

ఉండివుంటే ఈ కురుక్షేత్ర యుద్ధం ఎలా జరిగేది? ఆ దొంగ అర్జునుడికి కృష్ణుడు చంపే ఆలోచనలను చెప్పకపోయివుంటే కలియుగం వచ్చేదా? అంతా ఆ పరమాత్ముడి ఇచ్ఛ. జరిగిందంతా మన మంచికే అనుకొని నీ పిల్లల భవిష్యత్తు మీద ధ్యాస పెట్టు" అతని చిన్నాన్న మంగ్ల్యాను ఓదార్చాడు.

ఉన్న పెద్దగుడిసె తమకు కావాలని జరప్ల గొడవ పడ్డాడు. ఓంకారి, సామి, యంక్య శనిలా గంటుపడ్డారు. ఏమైనా కానీ ధనసింగ్ అభివృద్ధి కాకూడదని పట్టుబట్టినట్టు ఉన్నారు. ఎవరు ఏమి చేస్తే ఏమిటి? మనిషి నుదుటిరాతలో ఏముందో అలాగే జరుగుతుంది. అయితే దాన్నే నమ్ముకొని అడ్డు అదుపు లేకుండా గుర్రంలా గంతులేస్తే అన్ని పోగొట్టుకోవాల్సి వస్తుందనే అవగాహన ధనసింగ్‌కు ఉండేది. అందువల్లనే అతను తన ప్రతిఅడుగు జాగ్రత్తగానే పెట్టేవాడు. అన్నతమ్ముళ్లు వేరుపడడంతో అతని వ్యతిరేకుల బలం పెరిగింది. అయితే మొత్తం తాండాలో చురుకైన బుద్ధి, తెలివితేటలు, మంచి ఆలోచనలు అతనిలో ఉండటంవల్ల కొందరైనా అతనికి గౌరవం ఇచ్చేవారు. స్వయంగా సిద్దేగౌడ, కరణాలు ధనసింగ్‌ని చూసి భయపడేవారు. ఎందుకంటే బ్రిటిషుల గులాంగిరి చేస్తూ వారి దస్తావేజులను ఇష్టం వచ్చినట్టు రాసి బీదవాళ్ళ ఇల్లు ధ్వంసం చేయడం, గతిలేనివారిని సైతం కొల్లగొట్టడం, వారి రోజువారి కార్యక్రమం. నిరక్షర కుక్షి అయినా ధనసింగ్ తన మాతృభూమిని నాశనం చేస్తున్న తెల్లవారు తమ దేశానికి తిరిగి వెళ్లాలన్నది అతనికి గొప్ప కాంక్ష. వాళ్లు వెళ్లిపోతారని అతనికి చాలా నమ్మకమూ ఉండేది. హొసగల్లో, మొళకాల్మూరులో, రాంపుర చాయ్ దుకాణంలో లింగాయతుల మొన్నప్ప, బోయ అందానప్ప, సాయిబుల బడేఅలీ, గాంధీజీ గురించి మాట్లాడటం విన్నాడు. "లేదయ్యా, నడుముకు ధోవతి బిగించుకున్న గాంధీ ముత్యం. తెల్లవాళ్లను వదలకుండా గంటపడ్డాడు" అని చెన్నప్ప వర్ణించాడు. అక్కడే ఉన్న చెన్నప్పన్న "అది ఎవరో భగత్సింగ్ అట, చంద్రశేఖర్ అజాద్ అంట, ఇంకెవరెవరో అంట, బళ్లారిలో హుద్రప్ప ఇంటికి వెళ్లినపుడు జనం వాళ్ల గురించి మాట్లాడుతూ వుంటే విన్నారు. తెల్లవాళ్ల సభలో బాంబు వేశారంట. వాళ్లు చాలా ధైర్యవంతులయ్యా. అయితే ఈ తెల్లవాళ్ల చేతుల్లో బందూకులుంటాయి. అలాంటప్పుడు వెళ్లి బాంబులు వెయ్యడమంటే చిన్న విషయమా? మొత్తానికి ఆ కుర్రవాళ్లను వదిలి పెడితే దేశం వెంటనే స్వాతంత్ర్యం అవుతుంది చూడు" అని తనకు తెలిసింది అందాని చెప్పాడు. గాంధిజీకి పక్కాఅభిమాని అయినా చెన్నప్పన్నకు అందాని అన్నది సరైనదని అనిపించలేదు.."అయ్యా అందాని, ఏం మాట్లాడుతున్నావ్? అక్కడ ఒక్క రక్తపు బొట్టు చిందకుండా అహింసతోనే గెలవాలని అంటున్న గాంధీ

తాత గురించి నీకేం తెలుసు? ఎవరో కుర్రవాళ్లు. వేడి రక్తపు యువకులు, ఒకే ఒక్క రోజులో ఈ తెల్లవాళ్లను తరుముతారని అంటున్నావు. అది జరగని మాట. అది కాదు, నువ్వు చెప్పేది జరిగేటట్టయితే, ఈ తెల్లజనం వచ్చి ఎన్ని సంవత్సరాలు అయ్యాయి? నా లెక్క ప్రకారం రెండు వందల సంవత్సరాలు అయివుండవా? ఇలా ఎంతమంది వాళ్లముందు ఎగిరివుంటారు? ఆ జనం ఎవరికీ లొంగలేదు. అలాంటప్పుడు నలుగురు కుర్రాళ్లు ఏదో దాడి చేస్తే అయిపోతుందా? మా గాంధీ తాత తన జీవితాన్ని ఈ దేశానికి సమర్పించాడు. అతని మాటలే ఈ జనం వింటారు". గాంధీవాది చెన్నప్ప ఒక పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు. కొద్ది దూరంలో నిలబడి వారి మాటలను తదేక చిత్తంతో వింటున్న ధనసింగ్ తనకూ తెలిసింది చెప్పాలని అనిపించింది. "అయ్యా తాము తెలిసినవారు. నాలుగు మంచి మాటలు చెప్పారు. అయితే నేను మీ అభిప్రాయాన్ని ఒప్పుకోను. మేము ఈ ప్రాంతం వాళ్లమేకదా! మా తాండా జనం అడవి వదిలి జనావాసంలో నివసించడం సాధ్యమా? అయితే తెల్లవాళ్లు మమ్మల్ని అడవినుంచి తరిమేశారు. ఎక్కడైనా ప్రశాంతంగా జీవిద్దామనుకుంటే, సమాజంలో ఎవరు దొంగతనం చేసినా, దోచుకున్నా, మా ఆడవాళ్లను, పిల్లలను వదలకుండా తీసుకువెళ్లి జైలు నింపుతారు. ఇదెక్కడి న్యాయం? గాంధీతాత మాట విని ఈ జనం దేశాన్ని వదిలి వెళ్లిపోతారా? ఆ కుర్రవాళ్లు, అది ఎవరో ఉన్నారుకదా భగత్‌సింగ్, చంద్రశేఖర్‌లు చేసింది సరిగ్గా ఉంది. మా లాంటి యువకులు ఒక్కటై వీళ్లను చుట్టుముడితే వీళ్ల పని ఎంతసేపు?" అని భావోద్వేగంతో మాట్లాడాడు ధనసింగ్. చెన్నప్ప ఏదో చెప్పటానికి నోరు తెరిచాడు. అయితే తెల్లవాళ్ల సైన్యం రాంపురం గుండా వెళుతూ ఉంది. జనం చేస్తున్న పనులను వదిలి అక్కడక్కడే దాక్కున్నారు. చెన్నప్ప, అందాని, ధనసింగ్‌లు మాత్రం నిలుచున్న చోటే నిల్చున్నారు. ఎత్తయిన గుర్రాలు, వాటిమీద ఆజానుబాహులైన తెల్లవాళ్లు, భారతీయుల గుండెల్లో భయం పుట్టించడానికి ఊరిరకూరకే అలా కవాతు చేయడం వాడుక అయింది. సైనికులు కనుమరుగు అవగానే ధనసింగ్ తాండా వైపు బయలుదేరాడు. అయితే అతని మనస్సు మూలలో ఏదో ఒక అనుమానం వేధిస్తోంది.

దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడానికి తీవ్రంగానే పోరాటం ప్రారంభమైంది. భగత్ సింగ్, సుఖదేవ్ మొదలైన వారిని ఉరితీసిన వార్త దేశం మూలమూలలకు విద్యుత్తులా సంచరించింది. ఎవరో మాట్లాడుతూ ఉండటం విన్న ధనసింగ్ కూడా తీవ్రంగా నొచ్చుకుని, ఎన్నడూ సారాయి తాగనివాడు, అతని పాతస్నేహితుడైన పీర్యా, దాము, మంగ్ల్యా, సక్ర నాయక్‌ల ఎదురుగా హుతాత్ములైన

తన వయసువారైనా భగత్, సుఖదేవ్‌లను ఉరితీసిన విషయాన్ని చెప్పాడు. ఎన్నడూ సారాయి ముట్టని ధనసింగ్ ఇలా తాగడం చూసిన స్నేహితులు,"ఒరేయ్ ఏమైంది? మంచినీళ్లు తాగుతున్నట్లు తాగుతున్నావు కదా. ఇంక చాలు" అని ఎంత మొత్తుకున్నా వినకుండా తాగసాగాడు. ఎవరి జాడ కోసమో వచ్చిన సైన్యం అడవి గుండా దేసుతాండా వైపు వచ్చింది. సైన్యం క్యాప్టెన్ లింగ్డో లంబాడి తండా అని తెలిసిన క్షణమే మండిపడ్డాడు. "హూ ఇస్ థిస్ పీపుల్? ఎన్నేళ్ల నుంచి ఉంటున్నారు" అని అడిగాడు. సిద్దేగౌడ్ కరణం ముఖం చూశాడు. కరణం సిద్దేగౌడ ముఖం చూశాడు. "కరణం! ఐ యామ్ ఆస్కింగ్ యూ. చెప్పండి. ఎంత కాలం నుంచి ఈ పీపల్ ఇక్కడ ఉన్నారు?" అని కరుణం వైపు చూశాడు. కరణానికి దిక్కుతోచలేదు. సమస్య నెత్తి మీదికొచ్చి పడింది. నిజం చెబితే విషయమంతా లాగుతాడు. పాత దస్తావేజుల్లో లేవు. కొత్తగా చేర్చినదని తెలిస్తే తమ మెడలకు ఉరిపడటం కచ్చితం అనుకున్నాడు. "సార్! వాళ్లు జస్ట్ కమ్, తండా బిల్డ్ అండ్‌నో పర్మిషన్" అని నోటికొచ్చిన అబద్ధం చెప్పాడు. ధనసింగ్ ఒకసారి అతని ముఖం,తెల్లవారి ముఖాలు చూసి తండా నేపథ్యం గురించే మాట్లాడుతున్నారని గ్రహించి, తమకు రాబోయే ఆపదను గ్రహించాడు. సిద్దేగౌడ్, కరణాల మాటలు విని విచారానికి లోనయ్యాడు. "కరణం, నీవు ఏదైనా పాడుబుద్ధితో పనులు చేసి మా తలలకు ఆపద వచ్చేటట్టు చేస్తే, ఈ తెల్లవాళ్ళు పోయిన తర్వాత ..." అని హెచ్చరించాడు. కెప్టెన్ లింగ్డో సైనికులందరిని హెచ్చరించాడు. "బంజారా మగవాళ్లందరిని లాక్కొనిరండి" అని అరిచాడు. ఆడవాళ్లను, పిల్లలను ముసలి వాళ్లను, చేతగానివాళ్లను తండా లో వదిలి మిగిలినవారు కనిపించకుండా పోయారు. "నో మెయిల్ ఇజ్ ఫౌండ్" అని ఒక భారతీయ సైనికుడు అన్నాడు."వాట్, ఒక్కరు కూడా లేరా? ఎక్కడ ఆ మెయిల్ పురుషులు. కమ్ అండ్ సెర్చ్ దెమ్, సరిగ్గా" అని హెచ్చరించాడు. తాగిన మత్తు దిగింది. అటు ఇటు తిరిగి వాళ్ళు మాట్లాడేది విని ధనసింగ్ తడబడుతూ,"ఐ టెల్, ఐ టెల్ ఈ జాగా తారపేర తార బడబుడేరి కావరె రాతడొ వాందర్, జాగ్ ఛోడాన్ నికలొ సమ్మోర నికాణ" (ఈ స్థలం మీ అబ్బదిరా తెల్లకోతి, వదిలి పోయావా సరే, లేకపోతే). "వాట్ వాట్ లాంగ్వేజ్ హి స్పీకింగ్" ఏమి చెప్పాడని కెప్టెన్ తల గోక్కున్నాడు. "బంజారా భాష యజమాని. లంజా కొడుకు తాగివున్నాడు, ఏమన్నాడో?" సిద్దేగౌడ్ ధనసింగ్ వైపు చూస్తూ అన్నాడు. అతను తిట్టి, సిద్దేగౌడ వైపు నమిలిమింగేటట్టు చూసి, "రేయ్ లంజా కొడుకా, తెల్లకోతులు వ్యతిరేకంగా ఒక్క మాటైనా అన్నావా?" పొంగివస్తున్న కోపాన్ని అణచుకోవడానికి ప్రయత్నించాడు. "వాట్, ఇతను మనమీద

కోపం చూపిస్తాడా? అఫ్టాల్ అడవి మనిషి. బీట్ హిమ్" అని ఆర్డర్ చేశాడు. సైనికులు ధనసింగ్‌ను పట్టుకొని కొట్టసాగారు. వాళ్ల సంఖ్య తక్కువగా ఉండటం గమనించి, అక్కడే దాక్కుని కూర్చున్న బంజారాలు హఠాత్తుగా తెల్లవారి మీద ఆక్రమణ చేశారు. బ్రిటిష్ సైనికులు బందూకులు పేల్చడానికి తుపాకులు ఎత్తడానికి ముందే అందరి రుండాలను వేరు చేశారు బంజారాలు. ధనసింగ్ ఏమి జరుగుతుందో గమనించేలోపే అంతా జరిగిపోయింది. అక్కడ మిగిలినవారు సిద్దేగౌడ, కెప్టెన్ లింగ్డోలు. తమ జనవాంగంపై నీచ భావం పెట్టుకున్న, హింసిస్తున్న ఇద్దరిని హీనంగా చంపాలని జనం ముందుకు వచ్చారు ఆ ఇద్దరూ వందలాది జనం మధ్యచిక్కుకున్నారు.

లింగ్డో "నేను షూట్ చేసి మిమ్మల్ని చంపేస్తాను" అని గర్జించాడు. "నువ్వు ఒక తూటా పేల్చే లోపు మా వాళ్లు నీ గుండెను చీల్చి వేస్తారు" అని ధనసింగ్ జవాబిచ్చాడు. సిద్దేగౌడ్, లింగ్డోలు తమ తాండాకు అన్యాయం చేసినందుకు, చెత్తదిబ్బ దగ్గరున్న చింత చెట్టుకు కట్టివేసి, బెల్లం నీళ్లు వాళ్ల మీద పోసి, రాత్రంతా అక్కడే వదిలారు. తమ తాండా ఇంకా ఇక్కడే ఉంటే తెల్లవాళ్లు బతకనివ్వరని అర్థం చేసుకున్నవారు రాత్రికి రాత్రి తాండాను వదిలేసి, మరో స్థలానికి వెళ్లి నివాసం ఏర్పరచుకోవాలని ప్రణాళిక వేసుకున్నారు. సిద్దాగౌడ్, బ్రిటిష్ జనం హింసలు అనుభవించి అనుభవించి చాలైంది. సిద్దేగౌడ ప్రతిరోజు తండా లోకి దున్నపోతులా ప్రవేశించి ఎవరైనా బలహీనులు ఉంటే వారిని చిత్ర హింసలు పెట్టేవాడు. పన్ను చెల్లించలేని వారికైతే ఈ బతుకే వద్దనే స్థితికి తెచ్చాడు. జనం సరైన సమయం కోసమే ఎదురుచూస్తున్నారు. బ్రిటిషుల క్రూరత్వానికి తన తండ్రి, నానమ్మలు బలైపోవడం అతను ఇంకా మరువలేదు.

వెళ్లడానికి ముందు ఇక్కడ తాండా ఉండేదని తెలియకూడదు. అందుకని తాండా గుర్తులేవి కనిపించకుండా ధ్వంసం చేయాలని ధనసింగ్ నిర్ణయించుకున్నాడు. సామానులను, పిల్లలను, ఆడవాళ్లను, అందరినీ వెంటబెట్టుకుని గుర్రమెక్కి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. "బంజారా బంధువులారా! ఇది చివరిసారిగా మాట్లాడుతున్నాను. మనం బ్రతుకుతామో, మళ్లీ కలుస్తామో తెలియదు. అయితే దేసునాయక్ తాండాలో చాలా సంవత్సరాలు గడిపి ఉండవచ్చు. ఈ జ్ఞాపకాలు, ఈ పోరాటం సదా మన మనసు లోపల అచ్చొత్తినట్టు ఉంటాయి. ఇక మన ముందున్న ప్రపంచం పెద్దది, విశాలంగా ఉంది. ఏమో ఇంత కాలం కలిసి బతికాం. ఏ రుణానుబంధమో ఏమో? ఎటువైపు వెళ్లాలని అనిపిస్తే ఆయా దిక్కులలో వెళ్లి ఇల్లు కట్టుకొని హాయిగా ఉండండి. ఇక్కడ జరిగిన ఈ హత్యాకాండ గురించి

ఒక్క మాట కూడా ఎవరికీ చెప్పకుండా మీ గుండెల్లో సమాధి చేయండి. మీకు సేవాలాల్ మంచి చేయాలి" అన్నాడు.

అతని ఇద్దరు పిల్లలు రెండు బండ్ల మీద, ఇరవై ఎద్దుల వీపుమీద ఎక్కించిన సామానుసరంజామాలతో పాటు రాత్రికి రాత్రి చీకట్లోనే ఎద్దులతో పాటు అందరూ బయలుదేరారు. రాత్రి చీకట్లో ఎద్దులు దారి తప్పకుండా ఒకదానికొకటి తాడుతో ముడివేసి ఒకే దారిలో సాగేలా చేశారు. "ఏ బాపు అన్నిటినీ చక్కగానే నేను, పంపా సరిగ్గా చూస్తే కట్టాం" అన్నారు "మా అమ్మ గుజాసత్తి మనసులో ఏముందో? ఆ సేవాలాల్ ఏ దిక్కు చూపిస్తాడో చూద్దాం. బండినితోలండి. ఏమీ వదిలి రాలేదుకదా?" కదా" కానీ మళ్లీ అడిగాడు. చిన్నవాడైన పంపా నాయక్ ముందుకొచ్చి "అవును బాపు, అన్నిటినీ కట్టాం" అని బండి ఎక్కాడు. దేసునాయక్ తండా వదిలేటప్పుడు మాత్రం అందరి మనసులోనూ దుఃఖంతో నిండిపోయాయి. కొన్ని కుటుంబాలు ఉత్తరానికి బయలుదేరితే, కొన్ని కుటుంబాలు పశ్చిమానికి, కొందరు తమ మనసుకు తోచినట్టు తూర్పువైపు అడవులలో చేరుకుని అక్కడ లంబాడి తండా లు ఉన్నాయేమోనని వెతకసాగాడు. ధనసింగ్ మాత్రం ముందుగానే నిర్ణయించుకున్నట్టు ఎవరో చెప్పినది విని, ఉత్తర దిక్కులో ఒక తాండా ఉండటం నిర్ధారించుకొన్నాడు. గడ్డదహళ్లనో, లేదా గౌడనల్లి. అదే తాండాకు వెళ్లి తమ జనాంగం వారిని చేరుకోవచ్చని అతని అభిప్రాయం. తెల్లవారే సమయానికి వాళ్లు హానగల్ సరిహద్దులు దాటారు. ఎక్కడో కనిపించని అడవిలో రాత్రి కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని ఉదయమే అడవి దారిలో సంచరించసాగాడు. ధన సింగ్ వెనుక ఉన్నవారు కరమ్‌తోట్ వంశానికి చెందిన వారే ముప్పయి అయిదు కుటుంబాలవారు. అందరూ గతంలో ఒకే ఒక కుటుంబంలో ఉన్న తాతలు, చిన్నాన్నల, పెదనాన్నల పిల్లలు, మనవళు ‌‌‌ల. అందువల్ల వాళ్లంతా కలిసి వెళ్లడం అనివార్యమైంది. ప్రతి ఒక్కరికి భయం వేధిస్తోంది. ఎందుకంటే తెల్లవాళ్లను, వారి పాలనాధికారులను చంపి పారిపోతున్నారు. ఏ ఒక్కరైనా వాళ్ల చేతికి చిక్కితే ప్రాణాలు మిగలవనే సత్యం దేసునాయక్ తాండాలోని ప్రతి ఒక్కరికి తెలుసు. అందివల్ల పగలు అడవిలో దాక్కోవటం, రాత్రిళ్లు మాత్రమే ప్రయాణం చేయాలి. బయటి ప్రపంచంలోఏమి జరుగుతుందో ఏ ఒక్కరికీ తెలియదు. గాంధీజీ ఉద్యమం ఏమైందోనని, బయట ఎక్కడో మహాయుద్ధం జరుగుతోందని ధనసింగ్ విన్నాడు. అయితే ఖచ్చితమైన సమాచారం ఇంకా దొరకలేదు. నరపురుగు దొరికితే బయటి విషయం తెలుసుకోవాలని మహా కోరిక అతనిది. ఇంకా ఎంతకాలం మన పిల్లల్ని మా

జనాలను ఈ లంజా కొడుకులకు బలి ఇవ్వాలి? ఇంకా ఎంతకాలం వీళ్లకు భయపడి కట్టుకున్న తాండాలను వదలి వలస పోవాలి? అని అతను ఆవేశభరితుడయ్యాడు. తన సంసారాన్ని ఒకసారి చూసుకున్నాడు. వీళ్ల కోసం తాను బతకాలనుకున్నాడు. అలా నిర్ణయించుకున్నవాడు తనలో ఎగిసిన సుడిగాలికి సంకెళ్లు వేశాడు. తనలోని సంఘర్షణను చెప్పుకోవడానికి తగిన జనం ఎవరూ ఉండలేదు. అతని స్నేహితులంతా వేరు వేరు దిక్కులలో వెళ్లిపోయారు. అతని అల్లుడు కూడా ఏమనుకున్నాడో కొద్దిదూరం వరకు వచ్చినవాడు దిక్కు మార్చి చెప్పాపెట్టకుండా కనుమరుగయ్యారు.

దేసునాయక్ తాండా ఉందన్నది పత్తా లేకుండా మాయమైంది. సిద్దా గౌడ్, చెట్టుకు లింగ్డోలను కట్టివేసింది నిజం. అయితే వాళ్లను విభిన్నంగా చంపడం జరిగింది. ఇద్దరి మీద ప్రజల కోపం, ద్వేషంఎంత ఉందో దానివల్ల తెలుస్తుంది. వాళ్ల బట్టలిప్పి వాళ్లకు గుదద్వారంలో వెన్నె పెట్టడంతో పెట్టడం ద్వారా హత్య చేయడం జరిగింది. ఎవరు? ఏమీ? అనే సత్యం ఎవరికీ తెలియలేదు. కొందరి మాటల ప్రకారం బద్యానాయక్ కంటి ముందే అతని పెద్ద కూతురు సిద్దాగౌడ తండ్రి మల్లప్ప పాడు చేసాడు. రోజూ ముసలివాడి వేధింపులు భరించలేక ఆ అమ్మాయి చావబోయింది. బద్యానాయక్ అది ఎలాగో గమనించి, ఆమెను ఆపి, “ముందు మంచి రోజులు వస్తాయి బిడ్డ అప్పటి వరకు ఓపికపట్టుస” అని ఓదార్చాడు. మల్లప్ప చనిపోయిన తర్వాత అతని కొడుకు సిద్ధా పీతితో కాకుండా ఆమె రెండవ కూతురు మీద కన్ను వేశాడు. లంబాడి ఆడవాళ్లంటే పడి చస్తారు ఈ లంజకొడుకులు. దిక్కులేని మనుషులతో వీళ్ల వ్యవహారం ఇలా ఉంటుంది. అప్పుడప్పుడు ఈ వ్యతిరేకత ఉండనే ఉంది. తన కోపాన్ని ఈ విధంగా తీర్చుకున్నాడని జనం మాట్లాడుకున్నారు. స్థానికులను, అదే విధంగా పాలనాధికారిని చంపి అదే ప్రదేశంలో ప్రశాంతంగా ఉండడానికి సాధ్యంకాదని అర్థం చేసుకొని దేసునాయక్ తండా ను ధ్వంసం చేసి, తమ భూములను వదిలి, తమ కుటుంబాలను కట్టుకొని సామాన్లను ఎక్కించుకొని, ఎంతోమంది తమ భావోద్వేగాలను వదిలి వలస బయలుదేరారు. ఒక శతాబ్దం అంటే పిల్లాటలా? బ్రతుకు తెరువు కోసం పిల్లాజెల్లాతో, ప్రశాంతతను పొందాలని అనుకున్నప్పుడే ఒక పెద్ద ప్రమాదం ఎదురుచూస్తోంది. ఒకవేళ వీళ్లు వాళ్లను చంపకపోతే, వాళ్లు వీళ్లును చంపేస్తారు. శత్రుత్వం దాగుడుమూతల్లో ఎవరో ఒకరు తలను ఇవ్వాల్సిందే కాబట్టి ధనసింగ్ తన ముందు తరాలవారి కోసం, వారి అస్తిత్వం కోసం పోరాడవలసి వచ్చింది. పోరాడి గెలిచినా తన వంద ఎకరాల

చక్కటి భూమిని వదులుకొని వెళ్లటం అనివార్యమైంది. అతను ఎవరిని నమ్మాడో అతనే బాగా మోసం చేశాడు.

ధనసింగ్ వెనక ఉన్న కరమ్‌తోట్ వంశం వారు అడవిలో తప్పిపోయారు. కొండ మలుపుల్లో, అక్కడ అక్కడ చిన్న కాలవలు దాటి తమ పశువులను మేపుతూ ముందుకు వెళుతున్నారు. పగలు ఒక దట్టమైన అడవిలో తలదాచుకోవడం, రాత్రి ప్రయాణం చేయడం ఇలాగే సాగింది. దాదాపు ఒక వారం గడిచినా తప్పిపోయిన వాళ్ల జాడ దొరకలేదు. "దిక్కుదిశ లేకుండా ఎందుకిలా తిరుగుతున్నావ్ నాయనా, మనవాళ్ల మాదిరి ఎక్కడో ఒక చోటికి వెళ్లి, గుడిసె వేసుకొని కూలీనాలీ చేసుకుని బ్రతకడం నేర్చుకోక దారం తెగిన గాలిపటంలా తిరుగుతున్నావు కదా" అని తల్లి భీమణి బుద్ధి చెప్పింది". "ఊఁ రోజులు అంత సులభంగా లేవమ్మా. అడవి నుంచి బయటికి పోతే బ్రిటిషులు, లేదా ఇతరులు ఏమైనా చేస్తారేమోననే భయం. అయితే అడవిలో ఎన్నిరోజులు ఉండటానికి సాధ్యం? ధాన్యం గింజలు ఇతర సరుకులు ముగుస్తూ వచ్చాయి, ఇక ముందు ఏం చేయాలా అనే ఆలోచన" అని నిరాశగా జవాబిచ్చాడు. పశువులను మేపడానికి వెళ్లిన హనుమానాయక్, "బాపు, ఏ బాపు" అని పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. అతను పరిగెత్తి వస్తుండటం చూసి కూర్చున్నవారంతా కత్తులు, గొడ్డలి పట్టుకొని లేచి పొరుగున అతని దగ్గరకు వచ్చారు.' "హనుమా, ఏమిటి విషయం? ఎందుకిలా గాభరాగా పరిగెత్తి వచ్చావు. ఏమి సమాచారం?" అతని ఒళ్లు తడుముతూ అడిగాడు. "అడవిలో మన ఆడవాళ్లు కట్టెలు ఏరటం చూశాను. వాళ్లు ఇక్కడే ఏదో తండా వాళ్లు కావచ్చు" అని పరుగెత్తుకొచ్చిన అలసట తీర్చుసాగాడు. "అంటే మనం ఏదో తండా దగ్గరలో ఉన్నామని తెలుస్తోంది. "జరప్లా రారా" అని తన గుర్రమెక్కి హనుమానాయక్‌ను తన వెంట పిల్చుకునిపోయాడు. చిన్నకొండ మలుపులో ఎండు పుల్లలు ఏరుకుంటున్న స్త్రీలు గుర్రపు సవ్వడులు అక్కడక్కడ దాక్కున్నారు."అమ్మల్లారా, మేము మీ బంజారా మనుషులం. ఎందుకు గాభరాపడుతున్నారు? బయటికి రండి. మేము తెల్లవాళ్లం కాదు. మిమ్మల్ని అడవినుంచి బయటికి తరమడానికి..." ధనసింగ్ బిగ్గరగా అన్నాడు. ఒక్కరొక్కరుగా బయటికి వచ్చారు "ఎవరయ్యా నువ్వు?" అని అడిగారు. మేము ఇలాగే సంచరిస్తూ ఉన్న జనం. మా బంజారా మనుషుల కోసం వెతుకుతూ ఈ అడవి లోపల కూడు లేకుండా చాలా రోజుల నుంచి తిరుగుతున్నాం. ఇప్పుడు మీరు దేవుళ్లు దొరికినట్లుగా దొరికారు. ఇక్కడ పక్కన ఏదైనా తాండా ఉందా?" అని అడిగాడు. "మీరు మారువేషంలో ఉన్న సైనికులు కాదు కదా?" అని ఒక ఆడ

మనిషి అడిగింది. మరొకామె "ముండాకొడుకులు, మా భాషలోనే మాట్లాడి మమ్మల్ని నమ్మించి, మా శీలాలపై చేయి వేస్తారు" అని అనుమానంగా చూస్తూ అంది."ఛీ...ఛీ... అలాంటి నీచులం కాదమ్మా. నా వెంట నా కొడుకు హమనుమా ఉన్నాడు. మేము తెల్లవాళ్ల సైనికులం కాదు. మిమ్మల్ని మోసం చేసి దిక్కు తప్పించడానికి రాలేదు. మాకూ, మా పిల్లలకూ మీరే గతి" అని దీనంగా నివేదించు కున్నాడు. అది విని వయస్సు దాటిన స్త్రీ మనసు కరిగి, "రండి. మీరు మా వాళ్లే, రండి మా తండాకు వెళదాం. మా తండా నాయకుడు బోతనాయక్ చాలా మంచి మనిషి. మనవాళ్లకు రక్షణకోసం స్థలం ఇవ్వకుండా బయటకు పంపడు" అని ఆహ్వానించింది. "జరల్లు, హనుమా , మీరు వెళ్లి మన వాళ్లనంతా తీసుకొని అడవిలోని ఈ స్థలానికి రండి. అంత లోపల వీళ్లు కట్టెలమోపులను కట్టేస్తారు. మన బండి మీద వేసుకొని వెళ్దాం. వాళ్లను తొందరగా రమ్మని చెప్పి పంపిన తర్వాత, తాను విన్నటువంటి గౌడనహట్టి ప్రాంతం ఇదే కావచ్చనే అనుమానం ధనసింగ్‌ను తీవ్రంగా వేధించింది. దాన్ని తీర్చుకోవడానికి, "అక్కా, ఇక్కడ ఎక్కడో గౌడనహట్టి అని తాండా ఉండాలి కదా?" అని అడిగాడు. ఆడవారు కంగారు పడ్డారు. "మీరు" అని ఒక్కసారిగా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. హఠాత్తుగా అతడు చెప్పింది విని మౌనం వహించారు. కళ్లతోనే ఎవరు ఏమి చెప్పకూడదని సైగలు చేసుకున్నారు. వృద్ధురాలైన శాంతిబాయి మాత్రం "మీది ఏ సీమ?" అని అడిగింది. "మాకు ఏ సీమ ఉండటం సాధ్యం? ఇలాగే అడవులు గుట్టలు పట్టుకుని తిరుగుతూ ఉన్నాం. ఈ సంచార జీవితం చాలైపోయింది. ఎక్కడైనా ప్రశాంతత దొరికితే అక్కడే స్థిరపడాలని ఆలోచిస్తున్నాం" అని ధనసింగ్ చెప్పాడు. "అది కాదు బాపూ, ఏదైనా ఒక ఊరు, కులం, గోత్రం ఏదో ఒకటి ఉండాలి కదా. మీరు నిజంగానే బంజారా అయితే మీకొక గోత్రం ఉంటుంది కదా" అని మరొక ఆమె అనుమానంగా అడిగింది. తమ జాతి ఆడవాళ్ల దగ్గర తమ కులగోత్రాలు చెప్పడం అపరాధమని అనిపించలేదు. "అవును నేను కరమ్‌తోట్ భుక్యాకు చెందినవాడిని. ఇక్కడి నుంచి వందమైళ్ల దూరంలో మాదొక తాండా ఉండేది. అయితే దాన్ని తప్పనిసరిగా వదలవలసి వచ్చింది" అని చెప్పి మరింత లోతుగా వాళ్లకు చెప్పకూడదని మౌనం వహించాడు. 'అనుమానంలేదు. ఇతను మన బంజారానే. రెండవ మాట లేదు' అని తమలో తాము మాట్లాడుకొని వారి బీడు వచ్చేంతవరకు నెమ్మదిగా ఎండిన పుల్లలను ఏరుకో సాగారు.

ఆ లంబాడి ఆడవాళ్లు ముప్ఫయి కుటుంబాల ఆడవాళ్లతో చాలా చనువుగా

మాట్లాడుతూ, కబుర్లు చెప్పుకుంటూ తమ ఊరికి పిలుచుకొని పోయారు. ఇక ఊరు ఒక ఫర్లాంగు దూరం ఉన్నప్పుడే వేపచెట్టు చుట్టూ కట్టిన కట్టమీద కూర్చున్న జనం సామాన్లు మోసుకొని వస్తున్న జనాన్ని చూసి లేచి ముందుకు వచ్చారు. ధనసింగ్ గుర్రం దిగి, 'హ రామ్ రామ్ పంచ పంచాయతి రాజబోజేరసభా, పచారే లాక్, అనపచారె సవాలాక్ సబ్ దే ఆనంద్" అని నమస్కారం చేశాడు. తండా నాయకుడు బోతనాయక్, "సగళ్ సబి ఆనంద్ ఆనంద్, అన్నట్టు మీరు ఏ సీమ నుంచి వచ్చారు?" అని అడిగాడు. "తూర్పు దిక్కు నుంచి బయలుదేరాం. మా జనం కనిపించిన చోట మకాం పెట్టాలనే కోరికతో తిరిగి తిరిగి చివరికి తమ ఆశ్రమానికి వచ్చాం. తాము పెద్దమనసు చేస్తే మా అన్నదమ్ములు అందరూ మొత్తం ముప్ఫయి మందిమి ఉన్నాం" అని అన్నాడు. "అదే సేవాలాల్, ఈ భూమి ఆ భగవంతుడు కరుణించింది. ఈ అడవి, ఈ కొండ, ఈ పక్షులు మనవా? అన్ని ఆ సృష్టికర్త ఆనతి ప్రకారం నడుస్తాయి. అతని ఇచ్ఛ, ధర్మము, కర్మంతో బ్రతకడం నేర్చుకోండి" అనే ఉపదేశం చేస్తుండగా, జాప్య అతని ఇద్దరు తమ్ముళ్లు, "ధనసింగ్, మేము ఇక్కడ ఉండం. మేము ముందున్న సీమకు పోతాం" అని ఎవరి జవాబు కోసం ఎదురుచూడకుండా వెళ్లిపోయారు. అతని వెనుక ఐదారు కుటుంబాలు వెళ్లిపోయాయి. మిగిలిన పదిపదిహేను మంది తన కుటుంబ సభ్యులతో, పిల్లలతో బోతనాయక్ వెనుక నాయక్ బయలుదేరారు. పోరంబోకు స్థలం చూసి తండా నాయకుడు అందరికీ కావలసిన స్థలాన్ని చూసుకోమని చెప్పాడు. ధనసింగ్ తన ఇద్దరు కొడుకులతో కావలసిన పెద్ద స్థలాన్ని పట్టుకొని సరిహద్దులు గుర్తించాడు. అతని చిన్నాన్న, పెదనాన్న కొడుకులు వారిపక్కనే స్థలాన్ని పట్టుకున్నారు. గుడిసెలకు, పశువుల కొట్టాలకు కావలసినంత స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. కొత్త స్థలం, కొత్త జనం, సర్దుకోవడానికి కొంత సంఘర్షణ ఏర్పడింది. అయితే తన పిల్లల భవిష్యత్తు, తన వంశాభివృద్ధి కోసం దొరలా జీవించినవాడు, అక్కడి తండా ను, అక్కడి సౌకర్యాలను పూర్తిగా మరచిపోవలసి వచ్చింది. తానే స్వయంగా తాండా నాయకుడి పాలించినవాడు; తాండాలో అన్ని న్యాయాలను పరిష్కరించినవాడు; ముందు నిలబడి పండుగలు చేయించినవాడు; సంప్రదాయాల సమస్యలు వచ్చినప్పుడు సరైన మార్గం మార్గదర్శకం చేసిన ధనసింగ్ ఇప్పుడు గుడేకోటె తండా రీతివాజులకు సర్దుకోవడానికి సతమతమవ్వసాగాడు.

మూలనివాసులు, వలస వచ్చినవారు పర్పరం చేతులు కలిపారు. ధనసింగ్ అందరిని ఓదార్చి బుద్ధి చెబుతూ, "ఒక ఊరి గౌడ మరొక ఊరికి పోతే సామాన్యుడే.

తన ఊరిలో జరిపే అధికారాన్ని మరొక ఊరిలో జరుపుదామి అనుకుంటే నడుములు విరుగుతాయి. మన పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నప్పుడు మనంనోరు మూసుకొని ఉండడం మంచిది. పిల్లాపాపల కోసమైనా తోటలు, పొలాలు చేసుకుందాం. అడవికి పదండి" అఇ అతని చిన్నాన్న కొడుకు శేఖ్యానాయక్‌కు సలహా ఇచ్చాడు. తండా లోపలి పనికిమాలిన రాజకీయాలు ధనసింగ్‌ను నిస్సహాయుడిగా చేసింది. అతని విద్వత్తు, పాండిత్యం, అవగాహనను ఎవరు పట్టించుకోనేలేదు. దాన్ని ప్రదర్శించే సరైన సందర్భం కూడా ఒదిగిరాలేదు. తానే స్వయంగా గడ్డపార, పట్టుకొని అడవిలో తిరిగి, మంచి నేలను గుర్తించి వ్యవసాయం చేయడానికి కొన్నాడు. అతను ఎంపిక చేసుకున్న స్థలాన్ని గుర్తించి గుడెకోట తాండాలోని గజినీనాయక్ అతను చదును చేసిన స్థలాన్ని తన స్థలంలో కలుపుకుని సరిహద్దు మేరకు ముళ్ల చెట్లను తెచ్చి నాటాడు. తమ శ్రమను సునాయసంగా తమ సొంతం చేసుకుంటున్నా గజినీ నాయక్, అతని నలుగురు పిల్లలతో హనుమాన్ గొడవకు దిగాడు. "రేయ్ అడిగేవార్లు చెప్పేవారు నీకు ఎవరు లేరా? మేము శ్రమపడి చదును చేసిన భూమినంతా నీవు స్వాధీనం చేసుకోవడానికి వచ్చావు. మమ్మల్ని ఏమనుకుంటున్నావు? వలస వచ్చిన వారు ఏమీ చేయలేని అనుకుంటున్నావా? మాకు చెందవలసిన భూమిలోని ఒక్క ముక్క నీవు దున్న కూడదు. అలా చేస్తే నా కన్నా చెడ్డవాడు ఎవడూ లేడు" అని హెచ్చరించాడు. రొమ్ములు విరుచుకొని తిరుగుతున్న గజినీనాయక్ పిల్లలకు అతని మాటల తీరుకు మండిపడి, "ఎందుకురా, వలస వచ్చి తండా కట్టుకున్నవారు మా తాతముత్తాతలు. చీమలు పెట్టిన పుట్టలో పాముల దూరుకొన్నట్టు చక్కగా చదును చేసుకున్న నా పొలంలో, మీరంతా స్వాధీనం చేసుకుని మాకే ఎదురు చెబుతారా?" అని అతని మెడ పట్టుకొని గొడవకు దిగాడు. అతని చిన్నాన్నలు వచ్చి, "రేయ్ హనుమా ఊరుకో. మీ నాయన పంచాయితీ పెద్దగా ఉన్నవాడు. అతను పరిష్కరిస్తాడు. నువ్వు ఎందుకు తల పాడుచేసుకుంటావు" అని చెప్పి ఇద్దరిని విడిపించి దూరంగా తోశారు.

విషయం లోలోపలే రగులుతోంది. గజినీ కుమారుల హింస పెరిగింది. ధనసింగ్ చిన్నాన్న కొడుకు రామ్ నాయక్ చదును చేసిన జమీన్ అంతా తమదే అని సరిహద్దు వెంబడి కంచె వేయడానికి వెళ్లారు. రామ ఒక్కడే వ్యతిరేకించడానికి పోయాడు. అతని పట్టుకొని బాగా కొట్టి తాండాకు భయం పుట్టించే కుట్ర జరిపారు. ఈ విషయం ధన సింగ్ చేరింది. అన్నదమ్ములు అందరిని తన గుడిసెకు పిలిచాడు. "ఇలాగైతే తే మనం ఈ ఊర్లో ఉండగలమా? పదండి ముందు జగత్తు విశాలంగా

ఉంది. అందరూ ప్రశాంతంగా ఉందాం" అని ధనసింగ్ సోదర సంబంధీకుడు శేత్కు నాయక్ అన్నాడు. మరొకడు మరొకటి చెప్పి వలస పోవడానికి సిద్ధమయ్యారు. ధనసింగ్ మౌనంగా వింటూ,"రేయ్ మీరు మగవాళ్లు కారా? చేతికి గాజులు తొడుక్కున్నారా? ఈ ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోనూ ఇలాంటి జనం తప్పకుండా వుంటారు. ఎంతకని భయపడతాం? ఎప్పటి వరకు భయపడతాం? మగవాడు ఎలాంటి వ్యతిరేకతనైనా ఎదిరించి జీవితాన్ని రూపొందించుకోవాలి. ఇక్కడ ఎవడో పనికిమాలిన వాడు బెదిరించడని ఈ ఊరు వదిలి ముందుకు పోతే ఇలాంటి జనం అక్కడ ఉండరని గ్యారెంటీ ఏమిటి? ఆ ఊరిలోఏనూ బెదిరిస్తే అక్కడినుంచి మళ్లీ వలస పోవాలి కదా? ఇలా వలస పోతూపోతూ మీరేమో చచ్చిపోతారు. మీ పిల్లల భవిష్యత్తు ఏమిటి? ఊర్లో ఇల్లు లేదు. అడవిలో పొలం లేదు. మరొకరికి గులాంగిరి పనులు చేసుకుంటూ బతకడమే మిగిలింది. ఇక్కడ కనీసం ఆపత్కాలానికి మనం అన్నదమ్ములం అందరం ఉన్నాం. ఐకమత్యంగా ఉన్నాం" అన్నాడు. అందరూ మౌనంగా విన్నారు. గజిని కొడుకుల సమస్య ఒక సవాలుగా నిలిచింది. రామా ఈ సమస్య నుంచి బయటపడడానికి మార్గం కనిపించక, "లేదు మామ, ఈ గజని కొడుకులు తూక, కాణులు చాలా హింసిస్తున్నారని ..." ఇంకా ఏదో చెప్పటానికి నోరు తెరిచాడు.

"అది కాదురా రామ, చూస్తే పైల్వానులా ఉన్నావు. ఒక్కొక్కరిని చీల్చి వేయవచ్చు. అలాంటప్పుడు దెబ్బలు తిని వచ్చావంటే..." అతని బలాన్ని సవాలు చేస్తున్నట్టు ధనసింగ్ అన్నాడు. "ఆ రోజు పరస్థలం, పరసంకటం అని ఊరకయ్యాను కాకా. ఇప్పుడు నా జోలికి వస్తే నడుములు విరగ్గొడతాను. మీరు చెప్పారు కదా సరే" అని తాను చదును చేసిన స్థలానికి కంచె వేయడానికి బయలుదేరాడు. కష్టపడేవారిని అడ్డుపడితే ఎవరు భరించారు. అతను వెళ్లి గజని కొడుకులు వేసిన కంచె పెరికి తాను మళ్లీ వేయసాగాడు. అది చూసి గజనినాయక్ కొడుకులు కాణూ, పీకలు ముందు వెనుక చూడకుండా "మేము వేసిన కంచెను తొలగించి వేరే కంచ వేస్తావా? నీ ఒంట్లో ఎంత పొగరు ఉంది?" అని కాణు చేతిలో కత్తి తీసుకున్నాడు. రామా నాయక్ మీదికి పోయాడు. కత్తి చూసి అతను భయపడుతాడని భావించాడు. అయితే రామ అతను దగ్గరకి వచ్చేంతవరకు ఊరకుండి, గబుక్కున చేయి పట్టుకొని అవలీలగా పైకెత్తి నేలకేసి బాదాడు. "అమ్మ చచ్చాను" అని అతను ఆర్తనాదం చేశాడు. తమ్ముడిని నేలకేసి బాదటం చూసిన పీక, "రేయ్, పరదేశీ నా కొడకా! బుట్టలు మోసుకుని మా ఊరికి వచ్చిన వాడివి మా తమ్ముని కొడతావా?

వస్తున్నాను ఉండు నీ పని చెబుతాను" అని దుడుకర్రను తీసుకుని రామానాయక్ మీదికి దూకాడు. కర్రతో అతని భుజం మీద గట్టిగా కొట్టాడు. రామా నాయక్ కిమ్మనకుండా నిలబడ్డాడు. పీక మరొకసారి కర్ర విసిరాడు. దాన్ని తప్పించుకుని అతని చేతి నుంచి కర్ర లాక్కొని, "దొంగనా కొడకా, నేను, మా నాన్న, మా అన్నదమ్ములు, ఆడవాళ్లు, పిల్లలు కష్టపడి చదను చేసిన జమీను నీదెలా అవుతుంది?" అని ఇష్టమొచ్చినట్టు కొట్టసాగాడు. "అయ్యో ఎవరైనా ఉన్నారా? ఈలంజాకొడుకు నన్ను చంపేస్తాడు. కాపాడండప్పో, కాపాడండి" అని లబలబ నోరు కొట్టుకుంటూ, ఎవరూ రాకపోవడం చచూసిన గజినీ నాయక్ కొడుకు పీక,"రేయ్ తండా కు రారా, అక్కడ చూసుకుంటాను" అని కుంటుతూ, పడుతూ లేస్తూ అక్కడి నుంచి పరిగెత్తారు

సేవాలాల్ గుడిముందు జనం చేరారు. బోతనాయక్ పక్కన కారభారి కమలానాయక్, ఎడమవైపున డావో సేణునాయక్ కూర్చునివున్నారు. ఊరి ప్రముఖులందరూ వచ్చివుండటంతో తండా నాయక్ కారభారికి అనుమతి ఇచ్చాడు. అతను లేచి, "చూడండి, ఇది మనకు 'గోర్' పంచాయతీ. సేవాలాల్ గుడి ముందు చేరిన మనం ఎప్పుడూ సత్యపు బాటలోనే నడుస్తాం. ఇక్కడ ఒకరిని ఒక రకంగా, మరొకరిని మరొక రకంగా చూడం. అదే ప్రథమ కర్తవ్యం. ఫిర్యాదిదారులైన గజిని కొడుకులు తమ ఫిర్యాదును చెప్పవచ్చు" అని కారభారి కూర్చున్నాడు. గజని లేచి "తాండా నాయకా, ఇది మీ తప్పు. ఎక్కడినుంచో నిన్న మొన్న వలస వచ్చిన వారికి ముంద వెనుకలు చూడకుండా తాండాలో చోటిచ్చారు. ఈ దరిద్రపు వెధవలు ఈ తండా కట్టిన మా మీదే దౌర్జన్యం చేయడం భరించలేం" అన్నాడు. ధనసింగ్ లేచి, "తండా నాయకులు, కారభారిగారు, డావొగారు, మూలతా మనమంతా ఏదో ఒక ప్రదేశం వలస వచ్చిన వాళ్లమే. మీరు యాభై ఏళ్ల క్రితం వచ్చి ఈ ఊర్లో స్థిరపడి, తాండా కట్టుకొన్నారు. అది నిజమే. ఒప్పుకుంటాం. మనం దేవుడిని ప్రార్థించేటప్పుడు సేవాలాల్, మరియమ్మలను, లేదా మన పూర్వీకులను పూజించినపుడూ ఏమని విన్నవించుకుంటామో చెప్పండి. 'కీడి మూంగిన సాయి వేణు, జీవ జన గానిన సాయివేణు, వాటేపాటేను సాయి వేణు'. (ఉన్న అరవై కోట్ల జీవాలను కాపాడాలి. సమస్త జీవజంతువులను కాపాడాలి. దారిలో ఏవరికేమైనా కాపాడాలి). అని ప్రార్థించటం కేవలం జీవ జంతువులకు మాత్రమే? ఇది మనుషులకూ, జంతువులకూ అన్వయిస్తుంది. గజని కొడుకుల హింస మితిమీరింది. దాన్ని అణచటం ఈ కరమ్‌తోట్‌లకు సాధ్యమె. ఇది సరైన అవకాశం

దాన్ని ఇతను వదలకూడదు” అని అన్నాడు. తండా నాయకుడు దానికి ప్రతిస్పందిస్తున్నట్టు, “బేష్, విలువైన మాటలు చెప్పావు ధనసింగ్‌నాయక్. ఇంత చిన్న వయస్సులోనే ఇంత గొప్పగా చెప్పడం అంగీకరించవలసిందే. మెచ్చుకోవలసిందే. నువ్వు ఏమంటావు కారభారి?” అని తండా నాయకుడు-గజినీకి సోదర సంబంధి కావలసిన అతని భుజాల మీద న్యాయపు తక్కెడను మోపాడు. మన బంజరాలలో ఎన్నడూ మనం దొంగదెబ్బ తీయం. వీళ్లు మన అన్నదమ్ములు. ఈ ఊర్లో ఉండడానికి అందరికీ హక్కు ఉంది. అంతేకాకుండా ఇంత తెలివితేటలు, జ్ఞానం ఉన్న ధనసింగ్‌నాయక్ మన ఊర్లో వుండాలి” అని తండా నాయక్ పొగరు అణచడానికి ఇదే సరైన సందర్భం అన్నట్టు అతన్ని తక్కువ చేస్తున్నట్టు మాట్లాడాడు. డావో అంతా అర్థం చేసుకున్నాడు. కారభారి, తండా నాయకుడి కులస్థులు ఎక్కువ సంఖ్యలో ఉండి, అల్ప సంఖ్యాకులైన అమగోత్ తెగకు చేరిన డావో కుటుంబం మీద వీళ్లు దౌర్జన్యం చేసేవారు. విసళవత్ తెగకు చెందిన కారభారివైపు వారు కూడా దౌర్జ్యం చేసేవారు. తాండా నాయకుడి, కారభారి హింసకు విసిగిపోయిన అమ్‌గోత్ డావో వారికి పర్యాయంగా ఒకరిని తాండాలో అభివృద్ధి చేయాలని అనుకున్నాడు. అందుకే మధ్యలో కలగజేసుకుని, “నాయకా, మీకు వ్యక్తిగతంగా ఏ సమస్యవున్నా దాన్ని న్యాయపంచాయతీ మధ్యలో తీసుకురాకూడదు. కారభారి నువ్వైనా అంతే. మీ వ్యక్తిగతమైన విషయాలను వదిలి న్యాయపరంగా నిలబడాలి. ఎవరిది తప్పో ఒప్పో చెప్పి సరైన నిర్ణయం తీసుకోవాలి. సరైన తీర్పు చెప్పకపోతే, రేపటి రోజున జనం పంచాయతీ మీద విశ్వాసం కోల్పోతారు. ఒకసారి అలా జరిగితే జనం మరెన్నడూ మన దగ్గరికి రారు” అన్నాడు. అతని మాటలు విని జనం అవునన్నట్టు తలలూపారు.“రామ నాయక, వాస్తవంగా ఏం జరిగిందో చెప్పు” అని కారభారి అప్పటికి దారిలోకి వచ్చి అడిగాడు.“పంచాయితీ పెద్దలారా! మీరు దేవుళ్లు. తమ ఎదుట అబద్ధం చెప్పను. మా జనమంతా రాత్రీపగలూ కష్టపడి ఒక ఐదు ఎకరాల భూమిని చదును చేశాం. అయితే గజనినాయక్ కొడుకులైన పీక నాయక్, కాణు నాయక్‌లు వచ్చి, “రేయ్, ఇది మేము చేసుకున్న పొలం” అని అంటూ దౌర్జన్యం చేసి తామే సరిహద్దు గట్టు, కంచె వేయటానికి ముందుకు వచ్చారు. వీరి గొడవే వద్దని ఈ తాండానే వదిలి పోదామని మా అన్నదమ్ములంతా ఆలోచించాం. ఒక మాట మా చిన్నాన్న ధనసింగ్‌కు తెలిపి బయలుదేరదామని ఆయనకు చెప్పాం. ఆయన మమ్మల్ని తిట్టి ఆపాడు. ఎప్పటిలాగే మేము దున్ని చదును చేసిన పొలంలో పని చేయడానికి

వెళ్లాం. అయితే పీక,కాణులు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. ఎంతకని భరించాలో మీరే చెప్పండి" అని జరిగినదంతా ఒక్క విషయం వదలకుండా చెప్పారు. పీక లేచి, "అబద్ధం, పరదేశి నాకొడుకు, కావాలని మా పేర్లు చెడగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. మేము అలాంటి తప్పు చేయలేదు" అని అబద్ధాలు చెప్పడానికి చూశాడు. "రేయ్, తమ్ముడా పీకా, మనమందరం పరదేశీయులమే. ఇక్కడ ఎవరు గంటు పెట్టలేదు. ఏదో మనం ముందుగా వచ్చి ఇండ్లు కట్టుకున్నందుకు మూలనివాసులయ్యాం. అంతే తప్ప ఇంకేమీ లేదు. పదేపదే జనాలను ఇలా తక్కువ చేసి మాట్లాడటం తప్పు అని నా భావన. తాండా విస్తరించాలి. ఇక్కడికి వచ్చి స్థిరపడిన ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలి. మనం సుఖంగా వుండి మన జాతివాళ్లు ఉపవాసం ఉంటే బాగుంటుందా? అందరూ సమానంగా ఉండాలి. తిండిబట్టకు లోటు లేకుండా ప్రశాంతంగా ఉండాలి. అదే మన బంజారాల ఆశయం. మనలో ఎవరి ఇంటికి పోయినా, ముందుగా భోజనానికి ఆహ్వానిస్తారు. ఇది మన జీవన విధానం. నువ్వు ఇలా బెదిరించడం తప్పు. వారి జమీనును వారు నిర్భయంగా చేసుకొనివ్వండి. మీరు ఏమైనా అందులో తలదూరిస్తే బాగుండదు" అని తండా నాయకుడు మాటలు ముగించాడు.

గజినీ అతని కొడుకులు కారభారి వైపు చూశారు. అతని మాట్లాడకపోవటంతో, సభ నుంచి వెళ్లిపోయారు. ధనసింగ్ తండా నాయకుడికి నమస్కారాలు చెప్పి లేచి ఇంటికి బయలుదేరాడు. డావో అతని వెనుకనే వెళ్లి, "ధనసింగ్ మహారాజ్" అని పిలిచాడు. "డావోగారూ, మీరు ఒకసారి నన్ను పిలిస్తే, నేనే మీ దగ్గరికి వచ్చేవాడిని. మీరు ఎందుకు నా వెనుక వచ్చే శ్రమ తీసుకున్నారు?" ఆయన మీది గౌరవాన్ని వ్యక్తం చేశాడు. "మీరు జ్ఞానవంతులు. అవగాహన ఉన్నవారు. గంభీరంగా విషయాన్ని వ్యక్తం చేయడం మాకు సంతోషాన్ని కలిగించింది. మీలాంటివారు ఈ తాండాలో ఉండటం అవసరం. మీరు అపార్థం చేసుకోకపోతే నాదొక విన్నపం" అని అతని వైపు చూశాడు. "చెప్పండి, ఏమిటి విషయం? తమ గురించి అపార్థం చేసుకునే ప్రశ్నే రాదు" ఆయన మాటలకు సరైన జవాబు ఇచ్చాడు.

"నేను అమ్మగోత్ తెగకు చెందినవాడిని. ఈ తాండాలో మా వాళ్ల మూడు నాలుగు ఇండ్లు ఉన్నాయి. ఈ నాయకుడు రమావత్. వీళ్లు అధిక సంఖ్యలో ఉన్నారు. అందుకే ఊరు అతని వైపు ఉంది. అదే సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల అతని హింస చెప్పలేనిది. ఇక కారభారిది విసళవత్ తెగవాడు. అతని తెగవారు కూడా రమావత్‌లు ఉన్నంత సంఖ్యకు సమానంగా ఉన్నారు. ఈ గజని అదే

ధైర్యంతో మనుషులను బెదిరిస్తాడు. మేము వచ్చిన మొదట్లో మీలాగానే ఆలోచించాం. అయితే ఢిల్లీకి పోయినా డోలుకు ఒకే దెబ్బ అన్నట్టు అన్ని తాండాలలోనూ సమస్యలు ఉన్నాయి. అందువల్ల ఇక్కడే ఉందామని నిర్ణయించుకుని స్థిరపడ్డాం" అని ఎన్నడూ ఎవరి ముందు చెప్పని విషయాలను ఆ రోజు పంచుకున్నాడు. "ఇవన్నీ తాండాలో సర్వసామాన్యమే. ఇకపై మేమంతా మీ వెంటే ఉంటాం. మీరేమి అనుకోకండి" అని ధనసింగ్ నచ్చజెప్పాడు.

ఐదారు నెలలు గడిచినా ఒకరి ఇంటికి వెళ్లకుండా బతుకును తీర్చిదిద్దుకునే కార్యంలో నిమగ్నమైన ధనసింగ్‌కు సమాజంతో కలిపోవడం కూడా అనివార్యమైంది. అతనే డావో సేణునాయక్‌ను హుక్కా తాగడానికి ఇంటికి ఆహ్వానించాలని అనుకున్నాడు. ధనసింగ్ అడగటానికి మునుపే, "తాము అన్యధా భావించకపోతే, మా ఇంటికి వచ్చి, కాస్త జలపానం చేసి, హుక్కా పీల్చవచ్చు కదా" అని డావో ఆహ్వానించాడు. ఊరుకు అటువైపు అంటే దక్షిణం వైపు అతని ఇల్లు ఉంది. ఉత్తరానికి ధనసింగ్ ఇల్లు. ఇలా వెళితే అది చూసిన జనం ఏవేవో కల్పించి రంగులు పులుముతారని ధనసింగ్‌కు తెలిసినప్పటికీ, "పదండి వెళదాం" అని అతని ఆహ్వానాన్ని అంగీకరించి అతని వెనకే నడిచాడు.

చార్‌పాయి అంగణంలో వేసి ఉంది. "రండి దయచేయండి. లోపలికి వచ్చి కూర్చోండి" అని ఆహ్వానించి లోపలికి పోయిన డావో సేణునాయక్ భార్య రుక్కిని పిలుచుకొచ్చి పరిచయం చేశాడు. ఘూంగట్ వేసుకున్న రుక్కి నమస్కారం చేసి, వారి ఇంటివారి విషయమంతా అడిగి తెలుసుకుంది. అతని ఒక్కగానొక్క కూతురు జాన్కిబాయిని "రామ్మా, మామ వచ్చారు" అని పిలిచాడు. ఆమె సిగ్గుతో బయటకు రాలేదు. కొద్దిసేపటి తర్వాత టుకిరియా కొంగులో ముఖం దాచుకుని ధనసింగ్ కాళ్లకు నమస్కారం చేసింది "భగవాన తాడోసిళొ కరియబేటి" (దేవుడు నీకు మంచి చేయాలి బేటి) అని ఆమెను పైకిలేపి ముఖం చూశాడు.

ఇచ్చిన పానకం మధ్యన రెండుసార్లు హుక్కాను పీల్చిన తర్వాత, "తాము అనుమతిస్తే నేను..." అన్నాడు ధనసింగ్.

"మీలాంటివారు మా ఇంటికి రావడం చాలా సంతోషం" అన్నారు భార్యాభర్తలు.

"“తాము సకుటుంబ సమేతంగా మా ఇంటికి రండి. ఎప్పుడు వస్తారో చెప్పి పంపితే అనుకూలంగా ఉంటుంది" అని ధనసింగ్ బయలుదేరాడు.

ఈ తండాలో తన అస్తిత్వాన్ని స్థిరపరుచుకోవటానికి ఇలాంటి వాళ్ల సహవాసం

అవసరం. అలా అనుకున్న ధనసింగ్ అందుకు కావలసిన తయారీకి పూనుకున్నాడు.

ఒక వారం గడిచింది. ఒకరోజు ధనసింగ్ స్వయంగా అతని భార్య సీత్కి ముందు పెద్ద కొడుకు హనుమానాయక్‌కు పెళ్లిచేసే విషయం ప్రస్తావించాడు. ఇంకా పన్నెండు, పదమూడు దగ్గరలో ఉన్న హనుమా నాయక్ పెళ్లికి ధనసింగ్ తల్లి చాలా రోజుల నుంచి వేధిస్తోంది.'కుర్రవాడు వయసుకు వచ్చాడు. ఎక్కడైనా ఒక అమ్మాయిని చూసి పెళ్లి చెయ్యి. నాకు మునిమనళ్ళను ఆడించాలని ఆశ కలుగుతోంది' అని చెప్పటం అతను జ్ఞాపకం చేసుకున్నాడు. "అమ్మాయిని చూశారా?" అని సీత్కి అడిగింది. "ఊఁ అమ్మాయిని చూశాను. అందుకే చెప్తున్నాను. అమ్మాయి బాగుంది. చక్కగా బొమ్మలా ఉంది. హనుమకు సరిజోడి అవుతుంది" అని అన్ని వివరాలు చెప్పి జవాబు కోసం ఎదురు చూశాడు. అసలే సీత్కికి కుతూహలం ఎక్కువ. "ఎవరండి? ఏ తాండా వాళ్లు. ఎప్పుడు వెళ్దాం. మీరు ఈ మధ్యన మన తాండా వదిలి ఎక్కడికి పోలేదు కదా. అమ్మాయి గురించి ఇంత ఖచ్చితంగా చెబుతున్నానంటే.." అని కుతూహలం, అనుమానం ఒక్కసారిగా వ్యక్తపరిచింది. ధనసింగ్ ఒక క్షణం మౌనం వహించాడు. అతని భార్య సీత్కి ఆరాటపడటం చూసి నవ్వసాగాడు."అంత తొందర ఎందుకే నీకు? మొత్తానికి నీవు నానమ్మవై ఆడించడానికి మనవడు కావాలి. సరే ఒక వారం ఆగు. అన్ని తెలుస్తాయి" అని మాట మార్చడానికి చూశాడు. "మీరు ఉన్నారు కదా, నన్ను రెచ్చగొట్టకపోతే తిన్నది ఒంటికి పట్టదు. చెప్తారా లేదా అమ్మకు చెప్పాలా?" అని బెదిరించింది. "అరే చెప్తాను ఉండు. డావో సేఱు నాయక్ అమగోత్ గోత్రీకుడు. అతని కూతురు జాన్కి రెండు నెలల క్రితం ఋతుమతి అయ్యింది. చూడటానికి బొమ్మలా ఉంది. బహుశా వారు మనతో సంబంధం కలుపుకోవడానికి ఇష్టపడుతున్నారని అనిపిస్తోంది. అయితే అతను నోరుతెరచి అడగలేదు. నేను మన ఇంటికి రమ్మని పిలిచాను" అని అన్నాడు. అదే సమయంలో డావో సేఱు నాయక్ తన పెద్ద కొడుకు తింద్గను ధనసింగ్ నాయక్ ఇంటికి పంపాడు.

'ధనసింగ్ మామా! సాయంత్రం అమ్మనాన్నలు మీ ఇంటికి వస్తున్నారు" అని చెప్పి వెళ్లడానికి బయటికి నడిచాడు.

సీత్కికి కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు.

ఆ సంతోషంలో మునిగి వార్త తెచ్చిన తింద్గకు ఉపచారం చేయడమే మరిచి పోయింది. పాపం ఆ అబ్బాయి ఐదారు గుడిసెలు దాటి ఉండాలి.అప్పుడు గుర్తొచ్చి, పంపానాయక్‌ను తరిమింది."ఒరేయ్ నాన్నా, ఇప్పుడే వచ్చి వెళ్లాడు కదా, ఆ

అన్నను పిలుచుకొని రాపో” అన్నది. పంపానాయక్ వెంటనే పరుగు తీశాడు. నాలుగైదు గుడిసెలు దాటిన తింద్గను ఆపి, “మా అమ్మ పిలుస్తోంది రావాలంట” అని అతని దారికి అడ్డంగా నిలబడి చెప్పాడు. తింద్గకు ఏమీ అర్థం కాలేదు. “ఎవరి ఇంటి పిల్లవాడివి నువ్వు” అని స్పష్టం చేసుకోవడానికి అడిగాడు. “ఎవరి ఇల్లు అయితే ఏమి? మా అమ్మ పిలుచుకొనిరా అంది. వచ్చాను. అంతే” అన్నాడు. అతని అమాయకపు మాటలు తింద్గను అయోమయంలోకి నెట్టాయి. ఇంతకీ తాను ధనసింగ్ మామ ఇంటికి వెళ్లాడా లేదా అని ఆలోచించాడు. “అదే మీరు ఇప్పుడే వచ్చారు కదా ఆ ఇంటికి” అన్నాడు పంప. “ఓ ధనసింగ్ మామనా?” అన్నాడు. “అవును ఆయనే. మా అమ్మ ఎందుకో పిలుచుకుని రమ్మని అంది. వచ్చాను రండి” అంటూ చెయ్యి పట్టుకొని లాగుతుండగా వెనకే సీత్కి వచ్చింది. “నాయనా, ఇంటికి వచ్చి జలపాన్ కూడా చేయకుండా వెళ్లిపోతే ఎలా? అందుకే నేనే పిలుచుకుని రమ్మని పంపాను” అని స్పష్టం చేసింది. అయితే తింద్గలోని అనుమానం తొలగలేదు. “అది కాదు, ధనసింగ్‌మామను కలిసి వెంటనే రమ్మన్నారు” అని అన్నాడు. “సరే, జలపాన్ చేసి పోదువులే” అని ఒత్తిడి పెట్టింది. “లేదు మామి. వెంటనే తిరిగి రమ్మని నాన్న చెప్పాడు” అని తప్పించుకోవడానికి ప్రయత్నం చేశాడు. “మొదటిసారి వచ్చినవారు అలాగే వెళ్లిపోతే మంచిది కాదు. అరఘడియ లోపలికి వచ్చి పో” అని చెయ్యి పట్టుకుని లాగడంతో తింద్గ కాదనలేకపోయాడు. సీత్కి నీళ్లలో బెల్లం ముక్క వేసి ఇచ్చింది. సీత్కికి జరుగుతున్నది కలనో, భ్రమనో లేదా వాస్తవమో అర్థం కాలేదు. భర్త చెప్పింది నిజం. వారి మనసులోనూ హనుమానాయక్‌కు తమ కూతుర్ని ఇచ్చి పెళ్లి చేయాలనే కోరిక ఉందని అనిపించింది. తింద్గ వచ్చిపోయిన తర్వాత ఆమెకు మరింత నమ్మకం ఏర్పడింది. దాంతో ఆమెలో కంగారు మొదలైంది. ఎందుకు ఇంకా సాయంత్రం కావడం లేదనే అనుమానంతో, “మీరు చెప్పింది నిజమేనా? వాళ్లు వస్తే వంట చేసి భోజనం పెట్టాలా? లేదా ఒట్టి బెల్లం పానకమా?” అని జవాబు కోసం ఎదురుచూసింది. “అదికాదే, వాళ్లింకా రావటానికి ఐదారు గంటలు అవుతుంది. నువ్వు ఇప్పుడే ఏర్పాట్లకు సిద్ధమయ్యావు కదా. అయినా పద్ధతి ప్రకారం వారు భోజనం చేయరు. వచ్చి కూర్చుని పానకం తాగి వెళ్ళవచ్చు. మంచిది అమ్మను ఒక మాట అడుగు” అని ఆమె అయోమయాన్ని తొలగించాడు. కొడుకులిద్దరినీ పిలుచుకొని అతను అడవిని నరికి చదును చేసిన ఇరవై ఎకరాల పొలాల గట్టుకు మట్టి వేసి ఎత్తుగా చేసి, ముళ్ల చెట్లను నాటి రావడం కోసం భుజం మీద గొడ్డలి, కొడవలి, పారా పెట్టుకొని బయలుదేరాడు.

డావో సేణునాయక్ ఇంటికి రావడానికి ముందే ధనసింగ్ పిల్లలతోపాటు ఇల్లు చేరుకున్నాడు. కాళ్లు కడుక్కొని ఇంటి లోపలికి వెళ్లాడు. అదే సమయంలో డావో, అతని భార్య రుక్కి వచ్చారు. ధనసింగ్ గుమ్మంలోకి వచ్చి, “రండి రండి దయచేసి లోపలికి రండి” అని పిలుచుకొని వెనక పెరట్లో వేసిన చార్‌పాయ్ మీద డావో సేణునాయక్‌ను కూర్చోబెట్టాడు. అతని భార్య రుక్కిని సీత్కి వంటింట్లోకి పిల్చుకునిపోయింది. అక్కడే ఇద్దరూ నేల మీద కూర్చున్నారు. ధనసింగ్ తల్లి వచ్చి డావో సేణునాయక్‌ను పరిచయం చేసుకుని లోపలికి పోయింది. ధనసింగ్ తన కొడుకులను పిలిచి డావోకు పరిచయం చేశాడు. ఒక్కగానొక కూతురు సోమ్లిని కూడా పరిచయం చేశాడు. లోకాభిరామాయణం మాట్లాడుతూ మాటల మధ్యలో డావో సేణునాయక్, “ధనసింగ్ నాయక్ ! మీరు అన్యథా భావించకపోతే మీతో మేము సంబంధం కలుపుకోవచ్చు కదా?” అని సంకోచిస్తూ అన్నాడు. “డావో సేణు నాయక్‌గారు, ఎందుకు సంకోచిస్తున్నారు? నా కొడుకు ఇప్పుడు ప్రాయానికి వచ్చాడు. మీ కూతురు ఋతుమతి అయ్యింది. ‘వాత్ బోలి’ చేసేయండి. ఆకులు శాస్త్రం, గోళ్ (బెల్లం) తినిపించడం, సగాయి అంతా తర్వాత చేస్తే సరిపోతుంది” అని ధనసింగ్ తన అంగీకారాన్ని తెలిపాడు. “చూడండి రుణానుబంధం అన్నది దీనికే. తాండాలో చాలామంది వచ్చి అడిగి పోయారు. అయితే ఎందుకో నా మనసుకు నచ్చలేదు. మీరు ఎక్కడి నుంచో వచ్చారు. మీ మాటల తీరు, సంస్కృతి, సంప్రదాయం నాకు చాలా నచ్చింది. మీరు ఏమి చెప్పినా నేను ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మీ సంబంధం మాకు కావాలి” అని సంతోషంగా తన అంగీకారం తెలిపాడు. ధనసింగ్ హుక్కా వెలిగించి మొదట డావో సేణునాయక్‌కు ఇచ్చి, అతని తర్వాత తనూ ఒక గుక్క పీల్చాడు. మాఘమాసం అయిన తర్వాత ధనసింగ్, డావో సేణు నాయకులు ‘వాత్‌బోలి’ (పెళ్లి మాటలు) జరపడానికి ఒప్పుకున్న తర్వాత వాళ్లకు వీడ్కోలు చెప్పాడు ధనసింగ్. డావో సేణునాయక్ వెనుక, తాండా నాయక్ ఒక జాసూస్ పెడితే, కారభారి ఇద్దరిని పెట్టాడు. వాళ్లంతా ప్రతి దశలోనూ వారికి విషయం చేరవేస్తున్నారు..

ధనసింగ్ తండా నాయకుడికి, కారభారికి తన కొడుకు పెళ్లి విషయం చెప్పి పంపించాడు. కరమ్‌తోట్ వీధిలోని ముప్ఫయి ఇళ్లల్లో పెద్ద సంబరమే ఏర్పడింది.

ప్రతి ఒక్కరు ఇంట్లో తిరుగుతూ పనులు చేస్తున్నారు. రోజు రోజు తన ప్రభావాన్ని పెంచుకుంటున్న ధనసింగ్ మీద తండా నాయకుడికి అనేక అనుమానాలు కలిగాయి.“అదికాదు, నిన్నమొన్న వచ్చినవాడు తాండా అంతటా పేరు

సంపాదించుకున్నాడు. పుట్టినప్పటినుంచి మా తాతలు నాయకులుగా తాండాను పాలించిన విషయం జనం మనసులో నిలిచిపోలేదు కదా!" అని బోతనాయక్ ఎక్కడో ఒకచోట మనసులో వేధిస్తున్న అనుమానాన్ని వ్యక్తపరిచాడు. అతని గోత్రీకుడే అయిన రూప్లనాయక్, "మొత్తం తాండానే నాశనం చేశారు. వితంతువుల గంటును దోచుకున్నారు. ఇంకెందుకు జనం మిమ్మల్ని నమ్ముతారు?" అని గొణిగాడు. "ఏమన్నావ్" అని నాయకుడు కోపంగా అడిగాడు. "కృతజ్ఞత లేని జనం అన్నాను" అని అన్నాడు. "రూపూ, నువ్వు ఒక్కడివే నన్ను అర్థం చేసుకున్నవాడివి. అయినా నాకెందుకో ఈ మనుషులు ఏదో చేస్తున్నారని అనిపిస్తోంది. డావో తన కూతురును ధనసింగ్ కొడుక్కి ఇచ్చి పెళ్లి చేసినంత మాత్రాన తండా మీద అతనికి అధికారం సాధ్యమా?" ఎక్కడో మనసు మూలలో ఉన్న అనుమానం వ్యక్తం చేశాడు. "ఏయ్, నువ్వెందుకు భయపడతావ్? ధనసింగ్ నీ పదవిని లాక్కునే మనిషి కాదు" అని మళ్లీ "ఎవరు ఎప్పుడు ఎలా వుంటారో ఎవరికి తెలుస్తుంది?" అని మొదట అతని పరంగా మాట్లాడినట్లు మాట్లాడి తలలో ఒక అనుమానపు పురుగును వదిలాడు. "ఇప్పుడు ఏం చేయమంటావు? అటు తర్వాత బాధపడకూడదు" అని రూప్ల నాయక్ సలహా అడిగాడు నాయకుడు. "ఉన్న మర్యాదను కాపాడుకో. నువ్వు లేకపోయినా జరగాల్సిన కార్యం జరుగుతుంది" అని అయోమయాన్ని కలిగించి ఓరకంటితో నాయకుడి సందిగ్ధతను చూసి లోలోపలే నవ్వుకుంటూ లేచి వెళ్లిపోయాడు రూప్ల నాయక్. తాము ఇద్దరే ఉన్నప్పుడు ధనసింగ్ గురించి చెడుగా మాట్లాడుకున్న కారభారి, తండా నాయకులు ఇప్పుడు కలిసి అతని ఇంటికి వెళ్లడమెలా అనే సంకోచం మనసులో ఉంది. ధనసింగ్ ఇంటికి వెళ్లడానికి తాండా నాయకుడి వీధిసందులోంచి బయలుదేరిన కారభారి, తాండా నాయకుడు అరుగుమీద కూర్చుని ఉండటం చూసి ముఖం తిప్పుకుని వెనక్కి తిరిగి వెళ్లడానికి ప్రయత్నించాడు. అదే సమయంలో నాయకుడు చూడనే చూశాడు. "ఏయ్ కారభారి, ఎందుకు తిరిగి వెళుతున్నావు? రా ఇద్దరం వెళుతున్నది అదే చోటికే. వెనుక నుంచి పోతే ఏమి? ముందునుంచి పోతే ఏమి? మరో దారినుంచి పోతే ఏమి?" అన్నాడు. కారభారి మారుమాట్లాడకుండా నాయకుడి వెంబడి బయలు దేరాడు.

"ఎక్కడికి బయలుదేరావు నువ్వు?"

"అదే మీరు వెళ్తున్నారు కదా అక్కడికే" తండా నాయక్ సమర్థించుకున్నాడు.

"నేను రాంపుర బయలుదేరాను. మీరు వెళ్తున్నారు అంటే నేను కూడా వస్తాను" అని పెద్ద అబద్ధం చెప్పాడు.

దొంగకొక పిల్లి నెపం. ఈ వెధవ నా కొడుకు నాకు తెలియకుండా ధనసింగ్ ముందు మంచివాడు కావడానికి బయలుదేరాడు. నేను అడిగితే రాంపురానికి అంటాడు. సరే నిజాన్ని ఎన్ని రోజులు దాచిపెట్టగలడు?

"ఛీ...ఛీ... అలాకాదు. పదా, ముందు ధనసింగా నాయక్ ఇంటికి వెళ్దాం. కార్యం జరిగిన తర్వాత వెళితే భోజనం చేయడానికి వచ్చారని జనం అనుకుంటారు. కొంచమైనా మర్యాద వద్దా?" అని నాయకుడు అన్నాడు. ఇద్దరి మనసుల్లోనూ అపరాధ భావన నిండి ఉంది. ఇద్దరూ ఒకరినొకరు తమ దొంగ బుద్ధిని తిట్టుకుంటూ బయలుదేరారు. ధనసింగ్ నాయక్ ఎవరి గొడవకు పోకుండా ప్రజలను తనవైపు ఆకర్షించే వక్తిత్వం కలిగిన వ్యక్తి. సూటి అయిన మాటలు, ప్రజల పరంగా ఆలోచనలు, మందహాసం చేస్తున్న ముఖం. దొంగ వెధవల్లా తంటాలు-తగాదాలు చేయకుండా సమయానికి తగినట్టు సత్యాన్ని ప్రతిపాదించి ప్రజల్లో నమ్మకం కలిగేలా ప్రవర్తించాడు. తానేమో, తన ఇల్లు. పిల్లలు, తన పని అన్నట్టు ఉన్నాడు. ఇరుగుపొరుగున ఉన్న తన సోదర బంధువుల ఇళ్లల్లో ఏమి జరిగినా వారి విషయంలో అనవసరంగా తలదూర్చేవాడుకాదు. ఎందుకంటే అతని తండ్రి అప్పుడప్పుడు ఒక మాట చెప్పేవాడు-'తన బలమే బలం' అని చెప్పిన మాటను గాఢంగా నమ్మాడు. ఇది గూడికోటె తాండాలోని చాలామంది జీర్ణించుకోలేకపోయారు. అడవి నుంచి కాయలు, పూలు, రేగుపళ్ళు, బంక, ఎండు కట్టెలు తెచ్చి అమ్మి, ఆడవాళ్ళు ఏదో విధంగా భర్త, పిల్లల కడుపులు నింపేవారు. మగవాళ్లు భట్టిసారాయి దించి, సగం అమ్మి మిగిలినది తామే తాగి మత్తులో బతుకుతున్నారు. అలాంటి వాతావరణంలో నిజాయితీపరుడైన ఒక వ్యక్తి వస్తే అంతా సరిపోతుందా? తండా జనం మధ్యన అతను అప్రస్తుతమయ్యాడు. అది ఎలాగో భారతదేశంలో జరిగిన స్వాతంత్ర పోరాటాన్ని చాలా దగ్గర నుంచి చూసి, అక్కడక్కడ తెల్లవాళ్లతో పోట్లాడి, చాలామందిని చంపి ఇప్పుడు అజ్ఞాతంలోకి పోయాడు. విషయం ఏమైనప్పటికీ, బ్రిటీషర్లకు కానీ, రాంపురంలోని సిద్దేగౌడ్‌కు కానీ, కరణం ఇంటివారు కానీ, విషయం తెలిస్తే దేసునాయక్ తాండాలో ఉన్న వందలాది లంబాడీల మారణహోమం జరగడం వాస్తవం. అదేమో మరియమ్మ తల్లి, సేవభాయ్‌లు కాపాడారు. ఇప్పుడు అతను నిర్లిప్తంగా మారాడు. ఎవరి గురించి ఏమీ మాట్లాడేవాడు కాదు.

చాలా మంది అక్కడ గుమిగూడారు. తండా నాయకుడికి ప్రజల మధ్యన అగ్రస్థానం. పక్కనే ఉత్సవ విగ్రహంలా కారభారి. డావో సేణు నాయక్ స్వయంగా కూతురు సంబంధం చేస్తుండటం వల్ల తిరుగుతున్నాడు. "తాండా నాయకులు

వచ్చారు కదా. ఇప్పుడు ధారాళంగా చర్చను ముగించి, పాన్‌పెర (తాంబూలాలు ఇచ్చిపుచ్చుకునే శాస్త్రం) ముగించండి. ఇప్పుడు ఆలస్యం చేయవద్దు" సభలో ఉన్న పెద్దవాడు గంగానాయక్ అన్నాడు. కారభారి, తాండా నాయకులకు డావోతో ధనసింగ్ సంబంధం కలుపుకోవడం ఇష్టం లేదు. ఏదైనా జరిగే ఈ సంబంధం తెగిపోతే మంచిదని భావం వాళ్లలో ఉంది. అయితే అలాంటి సన్నివేశం ఏర్పడే ఏ లక్షణాలు కనిపించలేదు. ఇద్దరు ముఖాలు చూసుకుని గడ్డాలు గీరుకోసాగారు. ఇక కారభారి లేచి కసళవత్ (శాస్త్రం) చెప్పి ఇద్దరు వియ్యంకుల కోరికను బహిరంగ పరచాలని చెబుతుండగా, సభ మధ్యలో ఒక మేఘావత్ ఇంటివాడు లేచి నిలబడి, "పెద్దలు అందరూ ఇక్కడే ఉండం మంచిదైంది. ఈ డావో సేణునాయక్ కూతురు జాన్కి నా కొడుకుతో అడవంతా తిరిగి, పళ్లు ఏరుతున్న సందర్భంలో మామ కొడుకు అన్న చనువుతో, పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చింది" అని దూరపు బంధువు వామానాయక్ డావో మీద బురద చల్లాడు. జనంలో గుసగుసలు మొదలయ్యాయి. కారభారి మీసాల చాటున నవ్వసాగాడు. తండా నాయకుడికి చాలా సంతోషం కలిగింది. "అలాగైతే ఈ సంబంధాన్ని తెంచుకోండి. మేఘావత్ దాను నాయకుడి కొడుకు చెన్నానాయక్‌కు ఇచ్చి పెళ్లిచేయండి. అంతా సరిపోతుంది" అన్నాడు. డావో గంభీరంగా కూర్చున్నాడు. ధనసింగ్ విచలితుడు కాలేదు. కారభారి, "సమావేశమైన ప్రజల్లారా, మీరు ఏమంటారు? పరిస్థితి ఇలా ఉంది. మీ నిర్ణయం ఏమిటో చెప్పండి" అని అగ్నికి ఆజ్యం పోయటానికి తపించాడు. తలలేని కొంతమంది, "మొదట కుర్రవాడితో తిరుగుతూ ఉందంటే..." అని ఏమేమో అనుమానాలు వ్యక్తం చేయసాగారు. ఇప్పుడు మౌనంగా ఉండటం సమంజసం కాదని ధనసింగ్, "మేము కట్టెలు కొట్టడానికి, పళ్లు ఏరుకోవడానికి ఇతర ఆడవాళ్లతో కలిసి అడవిలోకి వెళ్లేవాళ్లం. దీని అర్థం వాళ్లకూ మాకూ సంబంధం ఉందనా? ఎంతోమంది ఆడవాళ్లు మా అక్కలు, చెల్లెల్లు, వదినలు, కోడళ్లు, మామ, కూతురూ–ఇలా ఏవేవో సంబంధాల బంధాలు ఉంటాయి. అలాగని ఏవో పిచ్చి కథలు కట్టడం సమంజసమా? ఆడుకునే వయసు పిల్లలు. వాళ్లకేం తెలుసు? ఇలాంటి పుకార్లలో నాకు నమ్మకం లేదు. ఇప్పుడు మనం ఏది నిర్ణయిస్తామో అదే అంతిమ నిర్ణయం" అని కరాఖండిగా చెప్పాడు. అప్పటికే డావో మేఘావత్ దాసు నాయక్ మాటలు విని కుంగిపోయాడు. ఎప్పుడైతే ధనసింగ్ మాట్లాడాడో అతనికి ధైర్యం వచ్చినట్టయ్యింది. "ఒరే దాసు ! కొంపలు కూల్చే వెధవా, నా కూతురు నీ కొడుకును పెళ్లి చేసుకుంటానని అన్నదా? లంబాడి చరిత్రలో ఏ రోజైనా ఇలాంటిది జరిగిందా? జరిగివున్నా అది మన

వంశంలో జరగలేదు. మా అమ్మాయి స్వయంగా భర్తను ఎన్నుకునేటంత పనికిమాలిన కాలం ఇంకా రాలేదు. అలాంటిది ఏమైనా ఉంటే మీ ఇళ్లలోనే లేదా మీ బంధువుల ఇళ్లల్లో జరిగి ఉండవచ్చు. ఇంకొకసారి ఇంత నీచంగా ఆరోపిస్తే, ఇలాంటి నీచమైన నిందలు వేస్తే నిన్నూ, నీ కొడుకునూ నా కూతురి చేత పాత చెప్పుతో కొట్టిస్తాను. గుర్తుంచుకో" అని గట్టిగా హెచ్చరించాడు. దాసు నాయక్, కారభారి అండ చూసుకుని వాగాడు. జనానికి ఇది ఎవరు ఆడిన నాటకమో తెలుసు. అందుకే వాళ్లు తలలు పాడు చేసుకోలేదు. సంబంధం నిశ్చయించి, తాంబూలు ఇచ్చిపుచ్చుకునే శాస్త్రం ముగిసిన తర్వాత నాలుగు ముంతల సారాయి, కోడి, గొర్రెల మాంసం వంటకాలతో విందు భోజనం పెట్టిన ధనసింగ్‌ను పొగుడుతూ తమ తమ ఇళ్లకు పోయారు.

పెళ్లి బట్టలు కొనడానికి రాంపురం వెళ్లడానికి అన్నీ సిద్ధం చేసుకున్నారు. అయితే ధనసింగ్‌ను ఒక చింత పట్టుకుంది. గతంలో తాము చేసిన కార్యాలు బ్రిటీషర్లకు తెలిసి వాళ్లేమైనా వెంటపడితే తమ వంశం నిర్వంశం కావటం నూటికి నూరుపాళ్లు సత్యం అనుకున్నాడు. రాంపురకు బదులుగా చెళ్లకెరె లేదా చిత్రదుర్గ సంతకు వెళ్లడం మంచిదని అనిపించింది. వియ్యంకులకు ఒక మాట చెప్పి పంపాడు. వాళ్లు మారుమాట్లాడకుండా అంగీకరించారు. కారభారి, తాండా నాయకులు మాత్రం అంత దూరం ఎవరు వస్తారు? అది కారడవి దారి. అదికూడా బండిమీద కూర్చుని వెళ్లటం. తర్వాత కాళ్లుచేతులు నొప్పులు పట్టుకుంటే..." అని గొణిగాడు. "వచ్చేవారు రండి" అని చెప్పి సాడి–మోళియా (పెళ్లి బట్టలు, వస్తువులు) తీసుకొని రావడానికి పది బండ్లు సిద్ధమయ్యాయి.

పెద్ద దుకాణంలో అమ్మాయికి వీళ్లు పెట్టవలసినవి ముందుగా ఇప్పించారు. పెళ్లికూతురు అవసరమైన గుగరి, టొప్లి, ఆడికడ్డి, ఒయా, భూరియ, సర్రె,ఖాసడి , రవిక, మేలిముసుగు, చెప్పులు అన్నీ కొన్న తర్వాత; పెళ్లికొడుకుకు పెద్ద అంగీ, పంచె, చెవి పోగులు, చెప్పులు తీసుకుని వియార్‌హాట (పెళ్లి సంత) ముగించి గోటేర్‌హాట (వియ్యంకులతో సంత) అయిన తర్వాత సాయంత్రం సంధ్యా సమయంలో భోజనానికి పిలిస్తే ఎవరు ఒప్పుకోకుండా ఒకేసారి రాత్రి విందు భోజనం వ్యవస్థ ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. పద్ధతి ప్రకారం అప్పుడే వచ్చిన మూడు ఈతకల్లు పెద్ద కుండలను కొని, చిన్న ముంతలలో పోసి ఆడవాళ్లు, మగవాళ్లు ప్రతి ఒక్కరికీ ఇచ్చారు. సొండి రామనాయక్ భార్య పొలి పక్కన ఉన్న బిడ్డ ఏడుస్తోందని, ముంత నుంచి కొన్ని సారాయి చుక్కలను బిడ్డ నోటిలో వేసింది. ఏడుస్తున్న బిడ్డ చప్పున ఏడ్పు ఆపింది. "అది కాదు, ఇప్పటిదాకా కుంయ్యో అంటోంది. ఒక చుక్క

తాకగానే గమ్మున అయిపోయింది చూడు". జనాలకి ఎక్కడ లేని ఆశ్చర్యం. అంతలో చంద్రనాయక్ నోరు తెరిచి "ముందు ముందు పెద్ద తాగుబోతు అవుతాడు చూడండి" అన్నాడు. జనం గొల్లుమని నవ్వారు. వెనకింటి బాబురి నాయక్ భార్య చాలి, "రేయ్, నీ అవ్వ, అసలే తాగుబోతు జాతి మనది. ఆడ, మగ కలిసి తాగుతారు. అలాంటప్పుడు నువ్వు పుట్టుకతోనే తాగే అలవాటు నేర్చుకున్నావ్. ముందు ముందు దానికి కుండ చాలదు. ఆండానే కావలసి వస్తుంది" అంది. స్వామి నాయక్ "అయ్యో ముందు జరగబోయేది ఎవరు చూశారప్పా?" అన్నాడు. "ముందరిది పాడైపోనీ. ఇప్పుడు హాయిగా పడుకో. తలతినకు" అని పొలి స్వామి నాయక్ నోరు మూయించింది.

జనం వినోద ప్రసంగాన్ని ధనసింగ్ గంభీరంగా వింటున్నాడు. ఈ జనం జీవితం ఇంతేనా? ఒళ్లంతా గాయాలు చేసుకొని కట్టెల కొట్టి తెచ్చి అమ్మడం. అమ్మడానికి వెళ్లినపుడు షావుకారు జనంతో "మీ అమ్మ, మీ ఆడవాళ్ళను..." అని అవమానించినప్పుడు కూడా నవ్వుతూనే మోపులు వేసి, తాగి తిని ఆ క్షణంలోనే మర్చిపోతారు. ఈ నిష్కల్మష జీవుల ముందరి భవిష్యత్తు ఏమవుతుంది? తన మనవళ్లనైనా ఈ జనం కన్నా భిన్నంగా పెంచాలని నిర్ణయించుకున్నాడు.

హనుమానాయక్ పెళ్లి చేసిన ధనసింగ్ తన ముందరి అడుగులను స్పష్టంగా నిర్ణయించి పెట్టే అభిప్రాయంతో పనులు ప్రారంభించాడు.

ఇరవైఅయిదు ఎకరాల భూమిని అడవిలో తీసుకోవటం, గుడెకోటె కరణం కిట్టన్న భట్టుకు తెలిసి గొడవ అయింది. కరణం ఆ జమీనును తన పేరిట చేసుకోవాలని కుట్ర జరిపాడు. "ఏ నాయక్, అడవిని ఇలా దున్నేశావు కదా. ఇది ఏమైనా మీ అబ్బ జమీన్ అనుకున్నావా? ఇది బ్రిటిష్ ప్రభుత్వానిది. ఒంటి మీద ధ్యాస వుంచుకో. కంపెనీ సర్కార్‌కు ఈ విషయం తెలిస్తే కాళ్లు చేతులు నరుకుతారు" అని బెదిరించడానికి చూశాడు. "ఏమో స్వామి, తమకున్నట్టు విద్యాబుద్ధులు లేవు. మీలాంటి వారే మాకు బుద్ధిచెప్పాలి. ఏమో నాలుగు గింజలు పండుతాయని తీసుకున్నాం. తాము తలుచుకుంటే..." మాటలు ముగించలేదు. కిట్టప్పకు ఏమనిపించిందో ఏమో, ధనసింగ్ కార్యదక్షుడు అనుకొని మౌనం వెళ్లిపోయాడు. "ఏమి చిన్నాన్నా, అతను ఏమేమో చెప్పాడు. ఏమో చెప్తాడోనని ఊరకే వచ్చాను. ఇది ఏమైనా అతని అబ్బ ఇంటి ఆస్తా?" అతని బంధువు రామానాయక్ కోపగించుకున్నాడు. మరో ఇద్దరు నోటికి వచ్చింది చెప్పి మౌనం వహించారు. ధనసింగ్ మాత్రం విచలితుడు కాకుండా ఏమీ కానట్టు అడుగులు వేశాడు.

ధనసింగ్ కూడ్లిగి వైపు ఎక్కువగా వెళ్ళసాగాడు. కూడ్లిగి అందానప్ప గాంధీజీకి పరమభక్తుడు. అలాగే చిన్న జోగిహళ్లి తాండాలో సక్ర్య నాయక్, దామానాయక్, చోటా భీమానాయక్ మొదలైన బంజారాలు అందానప్ప తాలీంఖానాలోనే తర్ఫీదు పొందినవారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం ఆరంభించినవాళ్లు. పోస్టాఫీస్ పత్రాలను కాల్చివేయడం, పోలీసులను కొట్టటం, స్వాతంత్ర సమరయోధులు అచ్చువేస్తున్న పత్రికలను ప్రజలకు అందించి చైతన్యం కలిగించేటటువంటి పనులు చేస్తుండేవారు. ధనసింగ్ తనకు చేతనైన పనులు చేసేవాడు. అతను పెద్ద విప్లవకారుడనే సత్యం రాతిబండలో దాక్కొని పోయింది. అది శాశ్వతంగానే సమాధి అయిందే తప్ప దానికి ఎలాంటి చరిత్ర ఉండలేదు. అది భారతదేశ విప్లవకారుల పోరాటం చివరి మరియు తీవ్రవాద పోరాటపు రోజులు. సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం, కంపెనీ సర్కారు రెండవ ప్రపంచ యుద్ధంలో దాని మిత్ర పక్షాలన్నీ ఓటమిని అనుభవించినందువల్లనేమో జపాన్ అనే చిన్న దేశం మీద అమెరికా ఆటంబాంబు వేసింది. వేలాది జనం చచ్చిపోయారు. లక్షలాదిమంది గాయపడ్డారు. ప్రకృతే సర్వనాశనం అయిన నేపథ్యంలో జగత్తు తత్తరించిపోవటం నిజం. ప్రభుత్వ పాలకుల గుండెలు వణికాయి. జగదాద్యంతం బ్రిటిషుల కాలనీలో సంచలనం ఏర్పడి కొత్త జగత్తు సృష్టింపబడే సూచనలు కనిపించాయి. ధనసింగ్ జనం మాట్లాడుకోవటం విని, తెలుసుకొని, తాండా జనం ముందు ప్రతి విషయాన్ని చెప్పి వాళ్లల్లో చైతన్యం తీసుకుని రావడానికి ప్రయత్నించాడు. తలతోక అర్థం చేసుకోలేని ఈ జనం ధనసింగ్ చెబుతున్నది నోరు తెరుచుకుని వినేవారు. అతని ఏమి చెప్పాడో, ఏమి అర్థం చేసుకున్నారో మొత్తానికి ఒక చర్చ జరిగేది. అయితే తాండా సమీపంలోని గుడెకోటె కరణం కిట్టప్ప, జమీందారు మల్లప్పగార్ల ప్రభావం తగ్గలేదు. గుడెకోటె పంచాయతీ కట్టమీద మల్లప్ప అతని అనుచరులకు ఒక మాట చెప్పాడు,“ఒరేయ్ పిచ్చివెధవల్లారా! గాంధీతాత పోరాడి సుఖం పొందకుండానే చనిపోయాడు. బ్రిటిష్ దేశం వదిలి పోయిన తర్వాత అధికారం నేరుగా మన చేతికి వస్తుంది. అప్పుడు ఎవరున్నారు అంటే భూపతి సర్దార్ నాకొడుకు, మన గౌడలు తప్ప?” అని ఆవేశభరితుడయ్యాడు. అతనివైపు వాళ్లల్లో ఒకడు లేచి, “అయ్యా, మిగిలిన కులం వాళ్లు చచ్చిపోయారా? మీరు ఇలా అంటున్నారు. మా కరణం కులకర్ణి శాంతప్పగారు లేరా? తండా లో, వీధిలో గొల్లహట్టి బోయవీధిలో జనమేమైనా చచ్చిపోయారా?” అని తనకు తెలిసిన వాదాన్ని ప్రతిపాదించాడు. కులకర్ణి శాంతప్పకు ఏమి చెప్పడానికి తోచలేదు. “రేయ్, రేయ్ బసవన్నా, మేము

ఈ ఊర్లో బాగా ఉండటం నీకు నచ్చినట్టు లేదు. మేము అధికారంలోకి ... ఛీ...ఛీ... గౌడ వెనక నడిచేవాళ్లం మేము" అని తన ప్రాతినిధ్యాన్ని తాత్కాలికంగా అదిమిపట్టాడు. కిట్టప్పను చూసిన మల్లప్ప, "మా బలం ఎంతో మాకు తెలుసు. అధికారం మా చేతికే వస్తుంది. అది ఏమైనాకానీ అధికారాన్ని మేమే నిభాయించాలి. ఇంకా స్వాతంత్ర్యమే రాలేదు. నెహ్రూ స్వాతంత్ర్యం కావాలని కూర్చున్నాడట. ఈ జనం మనసులో 'మండిగె' (కర్ణాటక స్వీటు)మొదలు పెట్టారు" అని తన పాటికి తాను అనుకున్నాడు."ఏమండీ కరణంగారు ఎక్కడున్నారు? ఏవో గొణుక్కుంటున్నారు?". "ఏం మల్లప్పా, అల్పసంఖ్యాకులం. ఏమి గొణుక్కోగలం?" అని పలాయనం చిత్తగించాడు. చర్చ చాలాసేపటి వరకు సాగింది. అన్ని విషయాలు పల్లెలకు చేరాయి. మౌంట్ బ్యాటన్, నెహ్రూ, గాంధీజీగార్ల విషయాలు అన్నిచోట్ల వ్యాపించాయి. అంబేద్కర్‌గారు కులవ్యవస్థ గురించి పోరాటం చేస్తున్నది కేవలం కొంతమందికే తెలుసు. అవి ఎక్కువగా ప్రచారం కాలేదు. కొన్ని పత్రికలను చదివి చెబుతుంటే జనం చుట్టూ కూర్చొని కథలు విన్నట్టు వినేవారు.

ధనసింగ్ నాయక్‌కు తెల్లవాళ్ళు దేశం వదిలి వెళ్లిపోయారు; భారత దేశంలో ఒక కొత్త యుగం ప్రారంభమైందని మాత్రమే తెలుసు. అవగాహన లేని తాండా జనం ఇదివిని ఏమంటారు? ఏమీ తోచక మౌనంగా ఉండేవారు. ఢిల్లీ లోపల జరుగుతున్న సంఘర్షణ ఒకటైతే; రజాకార్ల హింస మరొక సమస్య. హైదరాబాద్ నిజాం మనుషులు పగలు దాడులు చేయసాగారు. సామాన్య ప్రజల జీవితాలు భరించరానిదిగా అయ్యాయి. రజాకార్లు తండా సరిహద్దుల వరకు వచ్చారని వార్త తెలిసిన తండా నాయకుడు, కారభారి బెదిరి తోక ముడుచుకుని అడవిలోకి భార్య పిల్లలను పిలుచుకొని పారిపోయారు. ధనసింగ్, డావోలు మాత్రం భయపడకుండా, "చావటం బ్రతకటం ఒకేసారి. మన కుటుంబం కోసం చనిపోతే స్వార్థానికి రేపు మా మనవళ్లు మా తాత పిరికివాడు, ఎవరికీ చెప్పకుండా, అడగకుండా పారిపోయాడు అనే నింద భరించడం కంటే భార్య ముందు వీరుడిగా పోరాడి పిల్లలకు మాదిరి అవుదాం. పారిపోయినవారు పారిపోనీ. మనం మాత్రం ఇక్కడే ఉందాం. ఏం మొగవాడు వచ్చి మనల్ని తాకుతాడో చూద్దాం" అని ధనసింగ్ అందరిలో ఉత్సాహాన్ని నింపాడు. తాండా నాయకుడు, కారభారి, వారి కొందరు శ్రేయోభిలాషులు రాత్రికి రాత్రి భయపడి పారిపోయారు. అది గుర్తించిన డావో, "చూశారా మనం ఎవరిని నమ్మాలి? ఎవరైతే మన నాయకులో వాళ్లు ఈ రోజున ఎక్కడున్నారు? మన కారభారి పిరికివాడిలా భయపడి పారిపోవడం మాని మనతో చేతులు కలిపివుంటే

మనకు ఈ గతి పట్టేదికాదు" అని తాండా నాయకుడిని దూషించి అతన్ని తొలగించి తన వియ్యంకుడు అయినా ధనసింగును తండా నాయకుడిగా చేసి అధికారపు చుక్కాని పట్టుకునే ఆలోచనలో ఉన్నాడు. రజాకార్లు రాంపురలో చొరబడి లూటీ చేశారు. వారు అప్పేనహళ్లి దుర్గమమైన అడవిలో దూరడానికి బదులు జటింగ రామేశ్వరం వైపు వెళ్లినట్టు వార్త తెలిసింది. అయినా అందరూ తయారుగానే వున్నారు. కారం పొడి, కత్తులు, కొడవళ్లు, దుడ్డుకర్రల రాశి, చెట్ల పైనుంచి రాళ్లు విసిరే గుంపు సిద్ధమైంది. రాత్రి ఊరుచుట్టూ పహారా కాసే బలమైన యువకులను నియమించడం జరిగింది. ధనసింగ్ ఇద్దరు కొడుకులూ గుంపులో చేరుకున్నారు. పదిహేను రోజులు రజాకార్లు రాకపోవడం చూసి-

తాండాలో వాతావరణం తేలికబడింది. వార్త తెలిసిన తండా నాయకుడు బోతనాయక్ రాత్రికి రాత్రి వచ్చి తాండా చేరుకున్నాడు. మరో వైపు నుంచి కారభారి కూడా వచ్చి కలిశాడు.

తాండాలోని దుర్గమ్మ గుడిముందు జనం సమావేశమయ్యారు డావో సేణునాయక్ చాల ముఖ్యమైన భూమికను నిర్వహించాడు. ధనసింగ్ కూడ్లిగికి పోయినవాడు ఏదో విషయంగా రావడం రెండు రోజులు ఆలస్యమైంది. అతను వచ్చిన రోజు చూసుకుని తాండా పంచాయతీని అతనికి తెలియకుండానే ఏర్పాటు చేయడం జరిగింది. ధాలియా వచ్చి ఇంటి ముందు నిలబడి, "బాపూ, తండా లోని దుర్గమ్మ వేపచెట్టు అరుగుమీద జనం పంచాయతీకి కూర్చున్నారు. రావాలంట" ధాలియా బాబురి అన్నాడు.

"ఏమి పంచాయతీ ఇది?""

"నాకు తెలియదు యజమాని. పిలుచుకొని రమ్మని చెప్పారు. వచ్చాను"

తనకు చెప్పిన పని ముగిసిందని ధాలియా వెళ్ళిపోయాడు.

ధనసింగ్ దారిలో ఎదురైన కొందరిని అడిగాడు.

"ఎవరిది పంచాయతీ. ఎవరు పిలిచారు?"

"తెలియదు" అన్నారు.

కాస్త తెలిసిన వాడొకడు అన్నాడు-

"ఎందుకో డావో పిలిచాడట. ఎందుకో తెలియదు"

"ఏమిటి డావోనా?" జవాబు చెప్పకుండా ముందుకు నడిచాడు.

తల పాడుచేసుకుని ఎందుకు ఉండాలి? ఏదైనా సమస్య? అలా ఏమైనా వుంటే తెలిసిపోయేది. పోనిలే, అక్కడికే వెళ్లి చూస్తే తెలుస్తుందని అనుకున్నవాడు

అదే ఆలోచనతో సభకు వెళ్ళాడు.

మొత్తం తాండా జనం అక్కడ సమావేశమయ్యారు. కారభారి ముఖం మీద వస్త్రం కప్పుకొని కూర్చున్నాడు. తాండానాయకుడు అరుగు మూలలో తలమీద చెయ్యి పెట్టుకుని కూర్చున్నాడు. ధనసింగ్‌ను చూసిన ఒకడు, "అన్నగారు వచ్చారు" అన్నాడు. జనం వెనక్కి తిరిగి చూసి, అతని పిలుచుకొని పోవడానికి అతను వస్తున్నా లింగాపురం నాయక్ ఇంటి దగ్గరికి పరిగెత్తారు. ధనసింగ్‌కు కాస్త సంకోచం కలిగింది. "అక్కడే ఉండండి. వస్తున్నాను. మీరు ఎందుకు వస్తారు?" అని అరిచాడు. ఎవరో ఒక తాగుబోతు అనడానికి ముందే ఒకడు "అన్నకు"– అని కేక వేశాడు అక్కడ చేరిన జనం. "జై" అన్నారు.

తాండా నాయకుడికి, కారభారికి అర్థమైపోయింది. ఏదైనా ఎక్కువ తక్కువగా మాట్లాడితే జనం ఒళ్లు హూనం చేస్తారని అర్థమైంది. అందుకే నోరు మెదపకుండా అపరాధుల స్థానంలో కూర్చున్నారు. ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్‌ను అవలీలగా పైకెత్తి జయ జయ ధ్వానాలు చేస్తూ పంచాయితీ కట్ట మీద కూర్చోబెట్టారు. ధనసింగ్ డావో వైపు చూశాడు. అతను గెలిచినట్టు గర్వపడుతున్నాడు. ధన సింగ్ మాటలు వినడానికి జనం ఆత్రుతగా ఉన్నారు. "చూడండి, మీరు ఏ ఉద్దేశంతో సభను ఏర్పాటు చేశారు నాకు తెలియదు. మన ఢాలిమా బాబురి వచ్చి పిలిచాడని వచ్చాను. ఇదంతా ఏమిటో నాకు తెలియదు" సూటిగానే అన్నాడు,

" ఓ... ఇది డావో చేసిన కుట్ర, రేయ్ చేతకానివాడా, ఎందుకు సభ పిలిచావు నీ అభిప్రాయం ఏమిటి?"అని తండా నాయకుడు పైకి లేచి తడబడుతూ అన్నాడు. "ఏయ్, ఎవరయ్యా నువ్వు? రజాకార్లు వచ్చినప్పుడు మమ్మల్ని కాపాడింది డావో, మా నాయకుడు ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్. ఇంతసేపు ఊరికే మూలలో కూర్చున్నావు కదా అలాగే కూర్చో. లేదా లేచి వెళ్ళిపో" అని వెనకింటి దావూ నాయక్ పుల్ల విరిచినట్టు అన్నాడు. "ఏమి గొప్ప రక్షణ ఏర్పాట్లు చేశారు? రజాకారుల తండా అసలు రాలేదంట. మేమున్నా అదే చేసేవాళ్ళం" అని కారభారి బురదలో రాయి విసిరారు. ధర్మానాయక్ తల్లి ఘూలి భాయ్ లేచి, "ఏయ్ కారభారి, అంత ధైర్యం ఉన్నవాళ్లు ఎందుకు తోక ముడుచుకుని పారిపోయారు? వెనుక మాట్లాడేవారు మగవాళ్ళు కాదు. కౌరవ పాండవుల కథలో వస్తాడుకదా బృహన్నల. అలాంటి జనం మీరు" అని తన మనసులోని కోపాన్నంతా ఒక్కసారిగా బయట పెట్టింది. జనం కారభారి మీద ఇక విరుచుకుపడతారు అనేటంతలో ధనసింగ్ లేచి, "అన్నలారా! శాంతించండి. ఇప్పుడు ఏమైంది? కుదుటపడండి. వమొందరి విషయాలు

చూద్దాం" అన్నాడు ధనసింగ్. అన్నిటినీ కూలంకషంగా గమనిస్తున్న బుడ్డా నాయక్ తన అభిప్రాయం కూడా చెప్పడానికి లేచాడు."కారభారి, తాండా నాయక్ మీరు దేనికి యోగ్యులు? మిమ్మల్ని నమ్మి వందలాదిమంది అభిప్రాయానికి విలువ ఇవ్వలేదు. మీ వియ్యంకులు అలాగే ఉన్నారు. ఏదో ధనసింగ్ భుక్యా అని ఒక ధర్మాన్ని పాలించే మనిషి ఉన్నాడు. మన తాండా చేసుకున్న అదృష్టమేమో రజాకార్లు పక్కనున్న పల్లెకు వచ్చారు. అయితే వాళ్ళు మనమీద దాడి చేయలేదు. ఇప్పుడు నన్ను ఒక ప్రశ్న వేధిస్తోంది. మనల్ని రక్షించడానికి చేతకానివారు మాకు నాయకులు ఎలా అవుతారు? ముందు ఈ ప్రశ్నకు జవాబు చెప్పండి. మీ తలమీద పాగా తీసి కింద పెట్టండి" అన్నాడు. జనం బుడ్డా నాయక్ మాటలకు "అవును ఆయన చెప్పింది వాస్తవం" అని బిగ్గరగా కేకలు వేశారు. తండా నాయకుడు ముఖానికి పట్టిన చెమటను తుడుచుకునే నెపంతో తలపై ఉన్న పాగాను విప్పాడు. ఏదో సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. అయితే జనాలకు వాస్తవం తెలిసి వుండటం వల్ల అతని మాటలను తిరస్కరించారు. కారభారి గుండె దడదడ కొట్టుకోసాగింది. జనం లేచి ఎక్కడ కొడతారోనని భయపడ్డాడు. మాటకు మాట పెరిగితే అనాహూతం జరుగుతుంది. దాన్ని తప్పించటానికి ధనసింగ్ లేచి అన్నాడు "ఏదో మనిషికి సహజమైన భయం వల్ల కారభారి, తండా నాయకులు మనల్ని వదిలి పారిపోయారు. దాన్ని పెద్దగా చేసి వాళ్లను పదవి నుంచి తొలగించి, నన్ను నాయకుడిగా చేయడంలో ఏ పురుషార్థమూ లేదు. ఏదో చెడు ఘడియలు,కారభారి, తండా నాయకులు మనసులో ఏమనుకున్నారో ఏమో? అయితే జరిగింది వేరు. ఈ తండాకు నేను నాయకుడు కావడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు. నాయకుడు ఉండగా మరొకరు నాయకుడు కావడం సబబు కాదు" అని కరాకండిగా తిరస్కరించాడు. డావోకు నొచ్చుకున్నాడు. ధనసింగ్ నాయకుడైతే తాను అధికారం చలాయించవచ్చని మనసులో సంతోష పడుతున్నాడు. అయితే అలా జరగలేదు. "మీరు అలా అంటే ఎలా? ప్రజల నమ్మకాలకు మోసం చేసినట్లవుతుంది. నాయకుడికి ఎప్పుడు బహుజనుల పరంగా ఆలోచించే ధైర్యం ఉండాలి. ప్రజలు మీ మీద నమ్మకం పెట్టుకున్నారు. బావా మీరు ఊఁ అనాలి" అన్నాడు.

మొదటిసారి తండా నాయకుడిని నిష్ఠూరంగా మాట్లాడిన డావో, అది చాలదన్నట్టు బోతనాయక్ కులస్థుడైన రామావత్ నరసింహ నాయక్‌ను అప్పటికే తయారుచేశాడు. "డావో చెప్పింది నూటికి నూరుపాళ్లు సత్యం. తాండా నాయకుడు బోత ఆ పదవికి అనర్హుడు. న్యాయ పంచాయతీలో ఎవరైనా ఒక ముంత సారాయి

తాగించి, కోడి చారు ఇస్తే వాళ్ల పరంగానే మాట్లాడతాడు. అంతేకాకుండా మేమంతా ప్రాణాల మీద ఆశ వదులుకొని మనతోండాను కాపాడటానికి పోరాటం చేస్తే ఈ మనిషి రాత్రికి రాత్రి తాండాను ఖాళీ చేసి పోయాడు. ఇతనేం నాయకుడు? నేను చెప్పేది- ఇంతే ధనసింగ్ భుక్యా యోగ్యుడు. అతన్ని తండా నాయకుడిగా చేయండి. బోత నాయకుడిని సరిహద్దు దాటించండి" అని చెప్పి, భుజం మీద టవల్ కింద వేసుకుని కూర్చున్నాడు. ఇది రామావత్ తెగ లోని ఇతరులకు నచ్చలేదు. ఐదారు మంది లేచి "ఎందుకురా కొడకా, కళ్లు నెత్తిమీదికి వచ్చాయా? మా కులాన్ని తక్కువ చేసి మాట్లాడే పొగరు వచ్చిందా నీకు? నీదే కులం? నిన్న మొన్న వచ్చి మకాం పెట్టిన ధనసింగ్ ఏ సీమ నాయకుడు? వంశపారంపర్యంగా తండా బాధ్యతలు మేము చూస్తూ వచ్చాం. మేమే నాయకులం. ఏ నా కొడుకు వస్తాడో రానీ, చూస్తాం" అని నరసింహ నాయక్ మీద పోట్లాటకు లేచాడు. నిజానికి కారభారి ఇతనికి ముందుగానే తినిపించి, తాగించి, సిద్ధం చేసుకొని వచ్చాడు. ఈ సూక్ష్మం గ్రహించిన ధనసింగ్ పరిస్థితిని నియంత్రించడానికి ముందుకు వచ్చాడు. "ఏయ్ దాసు, సీతా బంజారా, గనియా కూర్చోండి. మీరు చెప్పింది సరిగ్గా ఉంది. నరసింహ చెప్పింది సరిగానే ఉంది. ఇప్పుడు విషయం ఏమిటంటే మీ నాయకుడి పదవికి నేను సిద్ధంగా లేను. మీరు ఈ తాండా లో ఉండడానికి చోటిచ్చారు. అందుకు నేను ఋణగ్రస్తుడిని. అయితే ఇప్పుడు మీరు నిషాలో మాట్లాడిన మాటలు తర్వాత ఉండవు. చూడు నిన్న మొన్న వచ్చారనటం సరికాదు. ఏ బంజారా ఈ ప్రాంతీయుడో చెప్పండి? తండ్రికి పుట్టినవాడైతే దీన్ని నిరూపించండి. మనమంతా దేశాంతరం వచ్చినవాళ్ళం. మీరు ముందు వచ్చారు. ఇక్కడ తండా కట్టారు. మేము వేరే ఎకడో ఉన్నాం. ఏమో మా పరిస్థితులు బాగుండలేదు. ఇలా ఇక్కడికి వచ్చాం. అందరూ నా మాటలు వినండి. బోత నాయక్ బుద్ధిఉన్నవాడు. అతన్ని తండా నాయకుడిగా కొనసాగించండి. కష్టాలు వచ్చిన సమయంలో అందరు కలిసి ఐకమత్యంగా పనిచేద్దాం. ఇందులో రెండవ మాట లేదు. ఎవరు ఎవరిని కొట్టడంకానీ,హీనంగా మాట్లాడటం కానీ చేయకండి. నాయకుడిగా అతనే వుంటాడు. ఇందులో ఏ విధమైన ద్వంద్వం లేదు" అని సమాధాన పరిచాడు.'

"ఏయ్, అది చెప్పడానికి నువ్వెవరు? ఇది మా తండా. మేము మాకు ఇష్టమైనట్టు బతుకుతాం. కావలసింది చేస్తాం. ఇష్టం ఉంటే ఉండు. కష్టమైతే ఈక్కడి నుమచి వెళ్లిపో" అన్న దండోరామా తాగిన మత్తులో నేలమీద పడ్డాడు."ఒరేయ్, మీకు ఏమి తెలుసు ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ గురించి. మన జనాంగం మర్యాద

కాపాడటానికి అతడు చేసిన త్యాగం చాలా గొప్పది. మొళకాల్మూరు గౌడ, కరణాలు బ్రిటిష్ అధికారులను చంపి, మన ఆడవాళ్ళను కాపాడిన మహాపురుషుడు అతను. తెల్లవాళ్ల ఆటలు సాగవనడానికి ఈ విషయం చెబుతున్నాను. దేసునాయక్ తండా నాయకుడే ఇతను. ఎప్పుడూ న్యాయానికి, ధర్మానికి పేరుపొందిన వాడు. మన లంబాడీల కోసం ఏమి కావాలన్నా చేయడానికి సిద్ధం. ఇలాంటివాడు మన గుడెకోటె తాండాలో వుండటం మనం చేసుకున్న పుణ్యం" అప్పేనహళ్లి తాండా నాయకుడు పాంకడోత్ సూర్య నాయక్ భావోద్వేగంతో అన్నాడు. అయితే గుడెకోటె తాండా జనం మీద అది ఎంతమాత్రం ప్రభావం చూపించలేదు. పెరటి చెట్లు వైద్యానికి పనికిరాదన్నట్టున్న వారి తిరస్కారాన్ని గమనించిన సూర్య నాయక్ "పాడైపోంద్రా లంజా కొడకల్లారా. ఒక మనిషి విలువ అతను ఉన్నప్పుడే తెలుసుకోవాలి. అది మీకు అర్థం కాదంటే, ఎక్కడైనా పడిచావండి" అని చెప్పి మౌనం వహించాడు. కొంతమంది మాత్రం పాంకడోత్ సూర్య నాయక్ నిజం చెప్పాడని అనుకున్నారు. "ఇతను సామాన్యుడు కాదు. అందరూ భయపడి తాండా వదిలి పారిపోయినప్పుడు, మనలో ధైర్యం నింపి పోరాటానికి సిద్ధం చేసిన ధైర్యవంతుడు. తాండా పగ్గాలు ఇలాంటి వారి చేతికి ఇవ్వాలి" అన్నాడు నడిమి వీధి జాంగడ. అతని అభిప్రాయం సరైనదని నావిచంద్ర, డాల్యార రూప్ల, ధాడి హరిచంద్ర, సోనార నంద్యప్ప, పాతకోళ తంబూర నాయక్, ఖోల్యార లచ్చా నాయక్, సబావటేర్ బాడో భీమావతేర్ ఛత్రా నాయక్, ఝురప్లార్ జాత్యనాయక్, బుణావతేర్ భీమ్యా, గట్టిగా మాట్లాడారు. అయితే రెండు తెగలలోని అధిక సంఖ్యాకులు ఈ అల్ప సంఖ్యాకుల మీద దౌర్జన్యం చేసి, "తాండా నాయకుడు కావడానికి మా తాండావాడై ఉండాలి. బోతా వద్దు. అతను పిరికివాడని అంటున్నారు కదా. అతను, అతని వెనక వెళ్ళినవారిని వదిలి, అతని తమ్ముడు సణ్యా నాయక్ తాండాలోనే ఉన్నాడు కదా! ధనసింగ్ భుక్యా కూడా ఉన్నాడు. అతనికి ఇవ్వండి. అతను రమావత్ ఇంటివాడే." అని శంక్రి నాయక్ ఒత్తిడి పెట్టాడు. వాళ్ళందరి మాటలు విని విసుగుచెందిన ధనసాంగ్, "మీ అందరికీ రామరామ. ఏదో పని గుర్తొచ్చింది వెళ్లి వస్తాను" అని చెప్పి వెనక ఉన్న జనం పిలిచినా విననట్టు వెళ్లిపోయాడు. అతని ముందు "అన్నా! నువ్వు నాయకుడైతే తాండా బాగుపడుతుంది" అని అన్నవారు కూడా మాటలు మార్చారు. పనికిమాలిన వాళ్ళతో తండా నిండివుందని అర్థమై అక్కడ ఉండటం వ్యర్థమని అక్కడి నుంచి కదిలాడు. భారత స్వాతంత్ర విషయం ఏమైనా తెలుస్తుందని అనిపించి, తన గుర్రం ఎక్కి రాంపుర వైపు బయలుదేరాడు.

అతను దేసునాయక్ తండా లో ఉన్నప్పుడు ప్రతిరోజు రాంపురకు పోయి విప్లవకారులు వార్తలను ప్రచురించే పత్రికలను దొంగతనంగా విప్లవకారులకు చేరవేయటం, డబ్బు మరియు భోజనపు ఏర్పాట్లను చేసేవాడు. లింగాయత చెన్నప్పకు ప్రియ శిష్యుడు. అయితే రెండు, మూడు సంవత్సరాల నుంచి ఉన్నట్టుండి అజ్ఞాతవాసంలోకి పోవటం విని చెన్నప్ప చాలా నొచ్చుకున్నాడు. తర్వాత రజాకార్లకు వ్యతిరేకంగా గొంతు ఎత్తినందుకు నడి రోడ్డులోనే ఆయన తల నరికి విసిరేయటం ధనసింగ్ విన్నాడు.

తన గురువు నమస్కారాలు సమర్పించారు. తామంతా కలుస్తున్న తిప్పేరుద్ర చాయ్ దుకాణానికి వెళ్లాడు. దుకాణం యజమాని తిప్పేరుద్ర కాళ్లు చేతులు రజాకార్లు విడిచి విసిరేశారు. కాళ్లు చేతులు స్వాధీనంలో లేక పోవటంతో దేకుతూ వచ్చి తన కథను చెప్పాడు. ధనసింగ్ చాలా బాధపడ్డాడు. రజాకార్ల మీద మండిపడ్డాడు. అయితే అదంతా తమ వల్ల కాని పని, నవాబు మనుషులు బలిష్టులు. వారిని తనలాంటి ఒక సామాన్య మనిషి ఏమి చేయగలదు? తనను తానే ఓదార్చుకున్నాడు.

రాంపూర్ ఎంతగానో మారింది. జనం భారత దేశ స్వాతంత్రం కోసం చాతక పక్షులు ఎదురుచూస్తున్నారు. అదేమిటో పెద్దయుద్ధం జరిగింది. తెల్లవాళ్లకు ఓటమి కలిగినందుకు భారతదేశం వదిలి పెడుతున్నారనే వదంతి వ్యాపించింది. జనచైతన్యం ఎక్కువై అనాహూతాలు సంభవస్తాయన్న భయం తెల్లవాళ్లకు వాళ్లకు ఉండటంవల్ల గాంధీజీ, అంబేద్కర్, నెహ్రూ మొదలైన నాయకులు తీవ్రంగా పోరాటం జరిపిన పరిణామంగా 1947 ఆగస్టు 15వ తారీఖున స్వాతంత్రం లభించే లక్షణాలు కనిపిస్తే, నాయకత్వ ప్రశ్న వచ్చినప్పుడు నెహ్రూ, జిన్నాల మధ్య అధికారపు పోటీ ఏర్పడి భారతాన్ని రెండు భాగాలు చేసిన బ్రిటిషులు తలను కత్తిరించి పాకిస్తాన్ చేశారు. అక్కడినుంచి హిందువులు, సిక్కులు భారతానికి మంచి స్థితిలో రాలేదు. అనేక శవాలు, దుర్దశలో ఆడవాళ్లు, పిల్లలు మోసుకున్న రైలు బోగీలు భారతానికి వస్తే, ఇక్కడి నుంచి ముస్లిముల శవాలను మోసుకున్న రైళ్లు అటు వెళుతున్నాయి. చనిపోయినవారు మాత్రం అమాయకులు. ఈ వార్త ప్రాంతమంతటా వ్యాపించింది. జనం మరిగిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జనం కూలీ నాలీ చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నారు. ధనసింగ్ బుద్ధిమంతుల వెనుక తిరుగుతుండటం వల్ల కొంత జ్ఞానం సంపాదించాడు. అందువల్ల చాలా నొచ్చుకున్నాడు. మారణహోమం జరుగుతున్న ఫోటోలను పత్రికలలో చూసి దుఃఖితుడయ్యాడు. చనిపోయిన వారికి, నిర్గతులకు సాంత్వన చెప్పటం తప్ప ఇంకేముందని మౌనం వహించాడు. గాంధీజీ

పట్టుదల వల్ల ఆగస్టు 15 కి స్వాతంత్రం లభించింది. "ఎవరికీ కనిపించని కటిక చీకటిలో అనుభవించినవారు ఎవరు?" డిల్లీలో ఉన్న కొందరు మౌంట్ బాటన్ చివరి వైస్రాయి, దేశాన్ని వదిలి వెళ్లే తయారీలో ఉన్నాడు. మొదటి హెూమ్ మినిస్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రజాప్రభుత్వాన్ని ఏర్పరిచే గొప్ప బాధ్యత ఎదురైంది. అయిదువందల కన్నా ఎక్కువ ప్రాంతాలను చేర్చి అఖండ భారతాన్ని రూపొందించాలన్నది పటేల్‌గారి కల ఈడేరుతుందా అని అనుమానం వేధించింది. చిన్న రాజులు, మండలాధీశులు, బ్రిటిష్ గులాములు, ప్రభావశాలులు. వారందరికీ రాజరిక ప్రభుత్వాలకు ముగింపు పలికే సమయం వచ్చిందనే అవగాహన కలగజేసి,ఈ వాస్తవాన్ని పరిచయం చేసి, భారత్లో చేర్చే కఠిన మార్గంలో పటేల్‌గారు పెద్ద పెద్ద అంగలు వేస్తూ బయలుదేరారు. జమ్మూ కాశ్మీర్ చేతుల్లోంచి జారిపోయే భయం ఒకవైపున ఉంటే, నిజాములు మేము స్వతంత్ర భారతదేశంలోకి రామని సవాల్ చేశారు. వీళ్లనంతా మన సైన్యం, పోలీసు దళాలను ఉపయోగించి లొంగ దీసుకొనే సాహసం పటేల్‌గారు చేశారు.

ఎక్కడ చూసినా విముక్తిపొందిన సంబరాలు. లంబాడి జనాలను ఒక చోట సమావేశపరిచి దేశం బ్రిటిష్ వారి చేతిలో నుంచి విముక్తి పొందిన సంతోషాన్ని పంచుకున్నాడు. ధాల్యార రూప్ల "అన్నా అలా అంటే ఏమిటి?" అని అడిగాడు. అతని ప్రశ్న సరిగ్గానే ఉంది. తండా లోని వందా, రెండు వందల ఇళ్లల్లో ప్రతి ఒక్కరూ ఒకింత భూమిని వ్యవసాయానికి అనుకూలంగా చేసకుని ఉంటే, ధాల్యార రూప్ల మాత్రం ఏమీ చేసుకోలేదు. అడవిని చదును చేసుకొని భూమిని చేసుకొని ఉండవచ్చు. ఎవరు అతనికి ఈ విషయాన్ని చెప్పలేదు అతను ప్రయత్నించలేదు. అతను ఊరికంతా గులాం. తండాలోని పశువులను మేపుకుని రావాలి. తామడలోని ఇంటివారు ఇచ్చిన అంబలి, రొట్టెను తినాలి. అతనికంటూ ప్రత్యేక అస్తిత్వమే లేదు. ధనసింగ్. తబ్బిబ్బయ్యాడు. క్షణం కుదుటపడి ఏమో చెప్పాడు. అతనికి అర్థం అయిందో కానీ మౌనంగా పశువులు తోలుకుంటూ వెళ్ళిపోయాడు. స్వాతంత్ర్యపు ఆరంభపు రోజులు అంత బాగుండలేదు. మొత్తం దేశం సంపదను కొల్లగొట్టిన తెల్లవాళ్లు మనకేమీ మిగల్చకుండా లూటీ చేసుకొని పోయారు.

వందలాది భాషలు, వందలాది భావనలు, వందలాది వైవిధ్యతల నడుమ నలిగిపోయిన దేశాన్ని ఒక్కటిగా చేయడానికి ఢిల్లీలో నాయకులు పెనుగులాడుతుంటే, జనం తినడానికి తిండి లేక లూటీలు చేయడం, హత్యలు చేయటం ప్రారంభించారు.

మరొకవైపు హిందూ-ముస్లింల గొడవలు, గాంధీజీగారు ఈ మతాల భిన్నతను పోగొట్టడానికి వారి మధ్య నివాసం ఉండసాగారు. దేశం రగులుకొని మండసాగింది. అందులో చలికాచుకునే అనేక ప్రయత్నాలూ జరిగాయి.

ధనసింగ్‌లాంటి అచ్చమైన దేశభక్తుడు. ప్రామాణిక కుటుంబంలోనూ పరిస్థితుల లాభాన్ని పొందే మీర్ సాదిక్ పుట్టుకొచ్చారు. ధనసింగ్ చిన్నాన్న కొడుకు దామ్లు భూక్యా కరమ్‌తోట్ దొంగల గుంపును కట్టుకొని చుటుపక్కలున్న బళ్లారి శ్రీమంతుల ఇండ్లు లూటీ చేయసాగాడు. పోలీసుల వేధింపులు లేవు, సర్కార్ భయం లేదు. దొంగలు ఆడిందే ఆట అనే స్థితి ఏర్పడింది. చెంద, జాఫా, సూర్య,ఉమ్మ, లసణు, తింర్గ వంటి దృఢకాయులే ఆ గుంపులో చేరుకున్నారు. తండా పక్కన గొర్రెలు మేయటానికి వస్తే పండుగ. కురువలు కళ్లపై చెయ్యి పెట్టి రెండు, మూడు గొర్రెపిల్లలను అకస్మాత్తుగా ఎత్తుకొని పొదల వెనుక నిర్దయగానాలుకకు ముల్లు గుచ్చి అది వదరకుండా చేసేవారు. సాయంత్రం గొర్రెల మంద వెళ్లిపోయిన తర్వాత రాత్రికి రాత్రి కోసి, చర్మాన్ని ఒలిచి, ఉప్పు కారం వేసి, ఐదు పది కేజీల సగం కాలిన మాంసాన్ని తిని, ఎముకలను భూమిలో పూడ్చి పెట్టేవారు. కురవలకు తోడేలు కన్నా దామ్లు తీవ్రమైన భయం కలిగించాడు. తాండా చుట్టూ అడవిలో గొర్రెల మంద వచ్చిందంటే నడుస్తూనే రెండు బలమైన గొర్రెలను భుజం మీద మోసుకొని లంబాడీలు నడిచిపోయేవారు. అందుకే కురువ బీరప్ప తాండా అంటే వణికి పోయేవాడు. ఒళ్లంతా కళ్లు చేసుకొని కుక్కలను చుట్టూ పెట్టుకుని కాపలా కాశారు. ఏదైనా ఒకటి మేత మేస్తున్నప్పుడే ఎత్తుకునిపోయేవారు. లేకపోతే పశువులదొడ్డి నుంచి, ఎంత భయంకరమైన కుక్కలు మొరిగినప్పటికీ వాటి కళ్లుగప్పో, లేదా దానికి వాటికి మత్తు కలిగించే వగరు పండు తినిపించి దొంగిలించేవారు.

దామ్లు భుక్యా కరమ్‌తోట్ అయిదవ తరంవాడు. అతని తండ్రి సోమ్లా భుక్యా చిన్నాన్న తోత్య కాలం నుంచీ, ధనసింగ్ కుటుంబం మీద పగసాధిస్తూనే వచ్చారు. అతని తాత దేసుభుక్యా పిల్లలలో పెద్దవాడైన సోమ్లు మాత్రం తమ్ములకు మంచి సంస్కారం ఇచ్చినందుకు కాలం ధనసింగ్ కాలంవరకు మంచిగా ఉన్నారు. తోత్య భుక్యా కరమ్‌తోట్ మనవళ్లలో ఒకడైనా దామ్లు అతని తాత గుణాలలో పుట్టాడు. బాల్యంనుంచే ధనసింగ్‌ను వ్యతిరేకిస్తూ అతని మంచి పనులన్నిటికీ అడ్డుపడుతూ వచ్చేవాడు. వ్యతిరేకించడం, ప్రశ్నించడం అతనేమిటి గొప్ప అన్నట్టు

తిరస్కారంతోనే చూసేవాడు. ధనసింగ్ మాత్రం అతనొక పనికిమాలిన వాడని నిర్లక్ష్యం చేసేవాడు. అతను నిర్లక్ష్యం చేస్తున్నట్టే ఎక్కువగా మాట్లాడసాగాడు.తెల్లవాళ్ల కఠినమైన చట్టం సడిలమవుతున్నట్టే దేశమంతటా అరాజకత్వం ఆవరించింది. అలాంటి సమయం కోసమే దాప్లు భుక్యా ఎదురు చూస్తున్నాడు. అతను ఎవరికి భయపడేవాడు కాదు. గుండె ధైర్యం ఉన్నవాడు. ఆరడుగుల ఎత్తు. ఎర్రగా ఫిరంగి మనిషిలా ఉండేవాడు. అతని వెనుక ఉన్నవారు అంతే బలశాలులు. వారిపని పగలంతా నిద్రపోవడం. రాత్రి చేతికి దొరికింది దొంగలించడం.అంతే. మొదట తాండా పొలాలలో పని చేశారు. జనం, తల్లి, భార్య తిట్టడం మొదలుపెట్టారు. ఆ రోజు నుంచి తండా సహవాసం వదిలిపెట్టాడు. లంబాడీల సహవాసం వద్దని ఊరిజనం జమీనులలో చొరబడేవారు. పంట రాగానే రాత్రికి రాత్రి కోత కోసి ఎత్తుకుని పోయేవారు. ఒక్కసారికి ఒక ఎకరం, అర ఎకరం ధ్వంసం చేసేవారు. కొంతమంది తిట్టుకుని, శాపాలు పెట్టి ఊరక అయిపోయేవారు. కొందరు పంట ఇంటికి తెచ్చే సమయం కోసం ఎదురుచూసి అప్పుడు కోత కోసేవారు.

తండా జనం చాప్ల, చెంద, జాంప, లసను, తింధ్గ, ఉమా, సూర్య పనులకు వెళ్లేవారుకాదు.ప్రతి ఒక్కరికి వారిలోని ప్రత్యేకత విద్య గురించి అవగాహన వుంది. అందువల్ల వారి సహవాసానికి పోకుండా దూరంగా ఉండేవారు. వారిని తిట్టడం, వారితో గొడవపడితే ఇక వారి కథ ముగిసినట్టే. ఇంటి లోపలి నుంచి కోడి, గొర్రె విలువైన వస్తువులు రాత్రికి రాత్రే గాయాబ్ అయ్యేవి. అలాగని చాప్ల, చెంద, జాంప, లసను, తింధ్గ, ఉమా, సూర్యలు అబద్దాలు చెప్పేవారు. వారితో బాగున్నవారికి అర్ధరాత్రి అయినా గొర్రె మాంసం, కోడి మాంసం, మేక మాంసం తీసుకునిపోయి ఇచ్చేవారు. ఒక్కోసారి జొన్న కంకులు దొరికేవి. అందువల్లనే వారి ఇరుగుపొరుగువారు వారి దౌర్జన్యాన్ని భరించేవారు. ఇంకా చిన్నాచితక దొంగతనాలు ఎందుకని పెద్ద దొంగతనం చేయాలని ఒక ప్రణాళిక వేశాడు. కర్ణాటక సరిహద్దు కవతల యాభై మైళ్ళ దూరంలో రాయదుర్గం. అక్కడ తెలుగు శెట్టి ఇంట్లో కన్నం వేయాలనే ప్లాన్ దాప్లు తయారు చేశాడు.చెంద, జాంప, లసను, తింధ్గ అందరూ కలిశారు. ఉత్తరం నుంచి ముగ్గురు, దక్షిణం నుంచి ముగ్గురు రావాలనుకున్నారు. మొదట ఆ ఇంటికి ఎవరు వస్తారో, ఆ ఇంటికి ఎవరు వెళతారో వారం రోజులు అధ్యయనం చేశారు. తర్వాత చాలా దగ్గరి నుంచి గోడ విస్తీర్ణం, ఇంట్లోకి ప్రవేశించటానికి ఉన్న అవకాశాలు బాగా మననం చేసుకొని కన్నం వేయటానికి మంచి సమయం ఏదో గమనించి అమావాస్య చీకటి రాత్రిలో శెట్టి సాయంత్రం

వ్యాపారం ముగించి, రాత్రి పన్నెండు గంటలకు లక్ష్మీపూజకు కూర్చుంటాడు. సుమారు ఒక గంట వరకు పూజలు చేసి, వెండి నాణ్యాలు ఇనుప తిజోరిలో పెట్టి పడుకోవడానికి పోతాడు. ఆ సమయంలో దొంగతనం చెయాలని నిర్ణయించుకున్నారు. అయితే అంత తొందరగా శెట్టి నిద్రపోతాడా? అని అనుమానం వచ్చింది. ఇంటి వెనుక బలంగా ఉన్న గోడను సద్దు లేకుండా కూలగొట్టిన తొమ్మిది మంది స్పృహ తప్పించే బూడిదను వాళ్ల మీద విసిరారు. లోపలికి పోయి అమావాస్య రోజున చేసిన ప్రత్యేకమైన భోజనాన్ని కడుపు నిండాని, మిగిలినది పారవేసి, పాల గిన్నెను ఖాళీ చేశారు. ఇంతలో తిజోరి తాళాన్ని తీసి, వెండి నాణ్యాల సంచిని ఒక తండా బయటికి సాగించింది. వంటింట్లో ఉన్నవారు బంగారు నాణ్యాలను వెతికి, వెండి పాత్రలను ఎత్తుకొని పరారీ అయ్యారు. సమయం తప్పి పడుకున్న శెట్టి గాఢనిద్రలో ఉన్నాడు. దామ్లు, అతని సహచరులు అడవిలో చాలా కోసుల దూరం నడిచి మాయమయ్యారు. అయితే తాండాకు చెందిన ఒక సభ్యుడు ఉదయం ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి అక్కడే ఉండిపోయాడు.

ఉదయం సుమారు ఆరున్నరకు నిద్ర నుంచి మేల్కొన్న శెట్టి భార్య వంటింట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న గిన్నెలను, పాత్రలను, ఎవరో భోజనం చేసి ఖాళీ చేసిన నెయ్యి, పాల గిన్నెలు చూసి గాభరా పడింది. ఏమో జరిగింది ఉండొచ్చని ఊహించడానికి ముందే శెట్టికి ఏమైనా అయివుండొచ్చని దుఃఖంతో శెట్టి భార్య శెట్టి, పిల్లలు పడుకొనివున్న గదిలోకి వెళ్ళింది. ఏదో అనుమానం రావటంతో తిజోరి ఉన్న గదికి ఖచ్చిత పరచుకోవడానికి పరుగుతీసింది. తిజోరిని తెరిచి చూసి, “వెంకటరమణా, ఏమప్పా, అంతా పోయింది. ఏమండీ దొంగ” ఆమె నోటి నుంచి మాటలు రాక భర్త పడుకున్న చోటికి పరిగెత్తింది. “ఏమండీ దొంగ నాణ్యాలు పట్టుకొని పోయాడు.మీరు ఇక్కడ గాఢంగా నిద్ర పోతున్నారు. ఏమండీ” అని బిగ్గరగా అరవడంతో శెట్టికి మెలకువ వచ్చింది. “ఏయ్, ఏమైందే? ఎవరు పోయారు? ఎవరు పోయారే నీ అబ్బనా, నీ యమ్మనా?” అని కోపంతో కళ్లు నులుముకుంటూ అన్నాడు. “వాళ్లెందుకు పోతారు? నీ తిజోరిన తీస్కోని పోయాడు చూడు” ఏడుస్తున్న ఆమె తన తల్లి తండ్రి పోయారా అనగానే సహజంగానే కోపం వచ్చి జాడించింది. “ఏమైందే నా తిజోరికి?” అని ఒంటి మీద బట్టలు ఉన్నాయో లేదో చూసుకోకుండా పరుగెత్తాడు. తిజోరిలోని డబ్బంతా మాయమై ఉండటం గమనించిన శెట్టి గుండెలు బాదుకుని, “పోయాడప్పో నా డబ్బు తీసుకుని పోయాడు. ఏయ్ దొంగ నా కొడకా, ఇదేమి చేశావురా, నీ అబ్బ, ఎవరు నీవు” అంటూ

బయటకి లోపలికి పరిగెత్తి పరిగెత్తి ,"రండి, చూడండి నా డబ్బు పట్టుకొని పోయాడు. చూడండి కొంచెం చూడండి" అని పిచ్చి ఆవేశంతో గుండెలు బాదుకోసాగాడు. శెట్టి ఆక్రందన విని చుట్టుపక్కల జనం జాతరగా వచ్చి కలిశారు. కొందరు 'అయ్యో పాపం, ఇలా జరగకూడదు' అని జాలి చూపిస్తే, ఇంకొందరు అదేమో అంటారు కదా, తాడిని ఎక్కేవాడుంటే, తల తన్నేవాడు ఇంకొకడు ఉంటాడని! మన దగ్గర అ ఒకటికి రెండు అన్నట్టు దోపిడీ చేశాడు. ఎవరో పుణ్యాత్ముడు బాగా బుద్ధి చెప్పాడు అని జనం మాట్లడుకోసాగారు. గుంపు నుంచి సమాచారం సేకరిస్తున్న తింధ్గ మాత్రం దూరం నుంచే జనం ఏమి మాట్లాడుతున్నారు, ఏమి జరుగుతోంది అనే వివరాలు సేకరిస్తున్నారు. ఎవరైనా అనుమానంతో పట్టుకుంటే ప్రాణాలు తీస్తారని తెలి స్రినా, ప్రమాదం మధ్య స్వయంగా తానే చిక్కుకున్నాడు, ఎవరో శెట్టి బంధువు వచ్చి, "ఏమి తమ్ముడు ఏమైంద్రా? ఎవడ్రా వాడు దొంగ నా కొడుకు. నేను వచ్చానుకదా, నువ్వేమీ భయపడవద్దు. దొంగనా కొడుకును నేను చూసుకుంటాను" అని ఓదార్చటానికి ప్రయత్నించాడు. అయితే శెట్టి దివాలా తీసినందుకు అతను లోలోపల సంతోషపడుతున్నాడు. అతని ప్రవర్తన నాటకీయంగా ఉంది. పైకి మాత్రం శెట్టి పట్ల చాలా ఆసక్తిని చూపిస్తున్నట్టు ప్రవర్తిస్తున్నాడు. ఇది అని పెద్దగా చూపిస్తున్నాడు. "ఏయ్, రా రా పోలీసులకు ఈ విషయం తెలుసా? నేను పోలీస్ స్టేషన్‌కు పోయి వాళ్లకి కంప్లైంట్ ఇస్తాను" అని పైకి లేచాడు. "వద్దు అన్నయ్యా వద్దు, దొంగ పారిపోయాడు. పోలీస్‌వాళ్లు ఏం చేస్తారు? నేను చూసుకుంటాను వద్దు" అని అతన్ని పట్టుకుని బలవంతంగా కూర్చోబెట్టాడు. ఒక ఘడియపాటు ఒత్తుకుని వస్తున్న ఉచ్చను తింధ్గ 'పోలీస్' అనే మాట వినగానే అక్కడే పక్కన మనుషులు తిరుగుతున్నా కాలు మడిచి, ఉచ్చ పోసి, మెల్లగా లేచి వెనక్కు జరుగుతూ ఎవరికీ అనుమానం కలగకుండా గుంపు నుంచి మాయమయ్యాడు.

తన మిత్రులు వెళ్లగలిగే దారిని గమనిస్తూ పరిగెత్తాడు. శెట్టి ఇల్లు వదిలినప్పుడు మధ్యాహ్నం. కొద్దిదూరం పోయేసరికి సాయంత్రం అయ్యింది. ఛీ పాడు బతుకు. ఇక ముందుకు ఎలా నడిచేది శివ. ఇతరులు ఎవరినైనా ఇక్కడ పెట్టి నేను వెళ్లి పోవాల్సింది. తలలో వచ్చిన ఆలోచనలను ఉచ్చరిస్తూ, సగం దూరం పరిగెత్తడం, సగం దూరం నడవటం. అలా సాగింది అతని ప్రయాణం. సూర్యుడి వెలుతురు తగ్గుతుండగా చీకటి పడసాగింది. "సేవాభాయ్, హనుమప్ప, ఏమయ్యా ఏం చేయాలి?" అని బిగ్గరగా ఉచ్చరించాడు. బయట శెట్టి మనుషులు వెంటబడి వస్తారేమోనని భయం. చీకటి ఆవరిస్తున్నట్టే దారి కనిపించకుండా పోయింది.

ఏమి చేయాలో తోచక నడుస్తూనే ఉన్నాడు. రాత్రి నిశ్శబ్దంలో అడివి రంగు మార్చుకుంది. నిశాచర జీవులు జాగృతమై వేటకు పొంచి చూస్తున్నాయి. కీచు రాళ్లు రొదపెడుతున్నాయి. నక్కలు, తోడేళ్ళు ఊళపెడుతున్నాయి. అడవి జంతువుల కూతలతో బెదిరిన అతడి గుండె నోటికి వచ్చినట్లు అయింది. ముందరి దారి స్పష్టంగా కనిపించలేదు. ఆలోచించే శక్తిని కోల్పోయాడు. ఇక నడవడానికి సాధ్యం కాదని ఏదో ఒక చెట్టు ఎక్కి కూర్చోని ఉదయం వెలుతురు వచ్చిన తర్వాత వెళదామని అనుకొని, సరైన కొమ్మ ఉన్న చెట్టు కోసం వెదకసాగాడు. ఎత్తుగా ఉన్న ఒక పెద్ద చెట్టు వెదికి, "ఊఁ ఇది బాగుంది. సాధ్యమైతే వెడల్పుగా ఉన్న కొమ్మ మీద పడుకోవచ్చు. అయితే ఏదైనా పాము వస్తే, ఏమీ చేయడం సాధ్యం కాదు, అంతా దైవేచ్ఛ" అని గబగబా చెట్టు ఎక్కాడు. ఒక కొమ్మను పట్టుకొని పైకెక్కుతున్నప్పుడు దూరంలో నిప్పు కనిపించింది. "ఎవరై ఉండొచ్చు ? మా వాళ్లేనా? ఆ దొంగ ముండా కొడుకులు ఎందుకు ఉంటారు? డబ్బులు దొరికితే సారాయి తాగి మజా చేస్తుంటారు. నేను ఈ అడవిలో భయపడి చావాలి". ఇంకా పైకి ఎక్కాడు. ఏదో మెత్తగా చేతికి తగిలింది. "అమ్మా, కొండచిలువ" అని కిందికి జారాడు. ఎవరో గబుక్కున చేయి పట్టుకొని పైకి లేపారు. "లేదన్నా. నాదేమీ తప్పు లేదన్న. దొంగతనం చేసిన వాడిని నేను కాదన్నా" అని ఏమేమో వదరసాగాడు. "ఒరేయ్ వెధవా! నోరు మూసుకో" అని లాగికొట్టాడు. "ఎవరు లసుణనా? మెల్లగరా లంజాకొడకా! చంపుతావా ఏమి? మీరు కాదని కలవరించాను" అన్నాడు. "దొంగ నా కొడకా, ఇలా జనం ముందు నోరు తెరిస్తే మనకథ ముగిస్తుంది" అని మరొక గుద్దు గుద్దాడు. అటువైపునుంచి లాల్య మరొవైపు నుంచి గుద్ది, "వెధవా, నిన్ను నమ్మి వెనక వదిలిపెట్టి వస్తే జనం ముందు టాంటాం కొడతావా? ఇదేమైనా మన నాయకుడు దామ్లు భుక్యాకు తెలిస్తే నీ చర్మాన్ని వొలుస్తాడు" అని బెదిరించాడు. తింధ్గకు తన తప్పు అర్థమైంది. దొంగతనానికి వెళ్ళటానికి ముందు దామ్లు భుక్యా మొత్తం గుంపు మెదడునే మార్చి ఆలోచనలను నింపాడు. "మనం చేస్తున్నది సమాజానికి వ్యతిరేకమైన పని. ఈ పనిలో ఒకటి చావాలి లేదా గెలుపును సాధించాలి. మనమేమైనా జనం చేతికి దొరికితే చిత్రహింసలు పెట్టి చంపుతారు. అందుకే వీలైనంత వరకు దొరకకుండా తప్పించుకోవడం మంచిది" అని పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు. కొందరికి అర్థమైంది. మరి కొందరు అలాగే అన్నట్టు తలలు ఊపారు. ఇదే మొదటిసారి పెద్ద దొంగతనం చేయటం. దాన్లో తింధ్గకు దామ్లు తనను ఏం చేస్తాడోనని భయం ఆవరించింది. "రేయ్, లసుణ, లాల్య మీ కాళ్లు పట్టుకుంటాను"

అని బ్రతిమిలాడాడు. అయితే ఇద్దరు నికృష్ట హృదయులు. దామ్లు ముందు తూచా తప్పకుండా అంతా చెప్పారు. "ఒరేయ్, ఆలంజా కొడకుని లాక్కొని రాండ్రా. అది కాదు రా, అక్కడ దొంగతనం చేయడానికి పోవడానికి ముందు ఏం చెప్పాను. చచ్చినా సరే, ఎవరి ముందు విషయం చెప్పకూడదని చెప్పాను కదా ! వెనక ముందు చూడకుండా స్పృహ లేనట్టు వదురుతావా?"

కొరడాతో వాయించాడు. ఒంటి మీది ఒక ఒక పొర చర్మం ఊడి వచ్చింది."లేదన్నా, ఇంకొకసారి చేయనన్నా" అని బతిమిలాడినప్పటికీ వినకుండా వాయించాడు. "ఏయ్, వాడు చనిపోతే రేపు తండాలో నిన్ను ఉండనివ్వరు" అని అతని ప్రియమిత్రుడు చంద్యానాయక్ చెప్పడంతో వదిలేశాడు. రాత్రి అడవిలో శెట్టి ఇంటి నుంచి దొంగతనం చేసి తీసుకొని వచ్చిన ఆహారాన్ని తిని ఒక దీర్ఘనిద్ర చేసి, దారి తప్పించి, ముందుకు సాగారు. తింద్గ చర్మం ఊడి బాధ తీవ్రమైన నొప్పి వల్ల జ్వరం వచ్చింది. ఉన్నట్టుండి కలవరించసాగాడు. వెండి నాణ్యాలు, బంగారు నగలు భాగంగా ఉన్నాయి. తింద్గ ఒకవేళ నడవకుండా పడుకుని ఉంటే అతన్ని అంత దూరం మోసుకొని పోవడం కష్టమయ్యేది. తింద్గ బలంగా ఉండటం వల్ల పడుతూ లేస్తూ వారి వెనకే బయలుదేరాడు.

ఎప్పుడు ఇంట్లోకి చేరుకున్నారు పొద్దున్నే ముందునుంచీ తండా లో వున్నవారిలా ఇతరులతో కలిసిపోయారు. ఒక్కొక్కరి భాగానికి వచ్చిన అంటే ఒక్కొక్క సంచి వెండి నాణేలు, కొందరు కుండలలో నింపి నేలలో పూడ్చిపెడితే, మరికొందరు తమ పాత పెట్టె లోపల మూటకట్టి పెట్టారు. ఇంకొందరు గుడిసెల ముందరి దూలాలకు తాడుకట్టి కనిపించకుండా వేలాడదీశారు. ఆ రోజు జరిగిన సంఘటన వల్ల, తింద్గ, లసుణ, ఉమ్మా, సూర్యలు, 'ఇది మంచి పని కాదు. భార్యాపిల్లలు ఉన్న మనం ఇలా చేస్తే మన శవాలు కూడా దొరకవు' అని అనుకుని వారు నేరుగా చంద్యా, దామ్లల దగ్గరికి పోయి, "మీ సహవాసం చాలు. ఏదో కడుపు నింపుకోవడానికి చిన్నాచితకా పని చేద్దామంటే, మీరు చేసింది అబ్బా తలుచుకుంటే ఒళ్ళు వణుకుతోంది. మేము అంత ధైర్యంగా మీ వెనక ఎలా వచ్చామో దేవుడికి తెలుసు. అన్నా! నీవు ఇచ్చినది ఇప్పుడే తిరిగి ఇచ్చేస్తాం...మమ్మల్ని మాత్రం ఇకపై పిలవకండి. మేము రామంటే రాము" అని లసుణ పుల్ల విరిచినట్టుచెప్పాడు. చంద్యా, దామ్లులు కిమ్మనలేదు. వీళ్ళు చాలా సేపు మాట్లాడి లేచి వెళ్లిపోయారు. 'పోండ్రా నాయనలారా, వ్యభిచారం, దొంగతనం ఒకసారి మొదలైతే వదలడం అంత సులభం కాదు'–ఇది దామ్లు చూపులో దాగిన మాటలు. నాణ్యాలను బయటికి తీస్తే జనానికి అనుమానం

వచ్చి పోలీసులకు పట్టించడం కచ్చితం. దాంతో దామ్లు అందరినీ పిలిచి నాణ్యాలను ఇప్పుడే తీసి ఖర్చు చేయొద్దని హెచ్చరించాడు. అంతగా అవసరం ఉంటే పెద్ద పట్టణానికి పోయి దాన్ని చిల్లర చేసుకుని వాడుకోమ్మని చెప్పాడు. తాగేవారు, తినేవారు, అందరూ మౌనంగా ఉన్నారు. తింద్గ ఒక నాణ్యం తీసుకొని రాంపూర్‌కి వెళ్లి 'అన్నా, చిల్లర ఇవ్వండన్నా" అని చిల్లర చేసుకుని వచ్చాడు. అతనిలాగే మిగిలిన వారందరూ సూర్య అందరూ వేరు వేరు ఊళ్లకు వెళ్లి జనాలకు అనుమానం రాకుండా చిల్లర తెచ్చుకున్నారు. తాగడం, తినడం పొగరు చూపడం పెరిగింది. జనం మాట్లాడుతున్నప్పటికీ వారికి అర్థం కాలేదు. జనం ఎక్కడో పెద్ద దొంగతనం చేసినట్టున్నారు. అందుకే ఇంత దిమాక్ అని నానా రకాలుగా మాట్లాడుకున్నారు. తమ సంపాదన తమ సమస్యల మధ్య ఈ జనం మాటు ఏం వినాలని తమ పాటికి తాము మౌనంగా ఉన్నారు. దామ్లు భుక్యా మాత్రం అప్పేనపల్లి తండాలోని భగన్యా పూజారి అనే కంకాళి భక్తుని ఇంటివారితో తన కాసుల వ్యవహారం పెట్టుకున్నాడు. భగన్యాకు ఇద్దరు మగ పిల్లలు వాల్య విసళవత్, లాల్య విసళవత్‌లు. భర్తతో వుండలేక తిరిగివచ్చిన వారి చెల్లెలు సావి. ఆమెతో దామ్లు సంబంధం పెట్టుకున్నాడు. వెండి నాణేలనంతా తీసుకెళ్లి వారి ముందు పోశాడు. సావి కూడా చేతకాని భర్తతో కొట్లాడుతూ ఉండటంకన్నా దామ్లుతో సహవాసమే మంచిదని, అతను దొంగ అయితే ఏమి? అబద్ధాలు చెబితే ఏమి? దొంగతనానికి పోయి దొరికిపోతే ఎలాగూ అతని కథ ముగుస్తుంది. అప్పటిదాకా మంచి బలమైన ఆసామి అనుకుని అతన్ని తన బుట్టలో వేసుకుంది. దామ్లు భార్య గోమ్లి నలుగురు మగపిల్లలు ఇద్దరు అమ్మాయిలకు జన్మ ఇచ్చింది. అతని పాపపు సంపాదన ఇంటికి తీసుకు రాకుండా పాడైపోతే చాలని భావించి, ధనసింగ్ పొలంలో పనిచేయటానికి వెళుతోంది. ఆమె కష్టం చూడలేక ధనసింగ్ భార్య అప్పుడప్పుడు ఇంటికి కావలసినవి పిల్లలతో పంపిస్తుంది.

దాము తెచ్చిన వెండి నాణేల సంచి ఎక్కడ దాచి పెట్టాడో భార్య పిల్లలకు ఏ మాత్రం తెలియదు. కొంచెం కొంచెంగా కరిగిపోయింది. అతని సారాయి దురలవాటు వల్ల ఏమైనా దాచడానికి సాధ్యమా? రోజుకు ఇరవైనాలుగు గంటలు పనిచేసి సంపాదిస్తే చిల్లిగవ్వ మిగలదు. అలాంటప్పుడు తప్పుడు పని చేసి తెచ్చినది అలాగే పోతుంది. ఎప్పుడు వెండి రూపాయలు ఖాళీ అయినాయని తెలియగానే పెద్దవాడైన వాల్య విసళవత్, అతని చెల్లెలు సావి, అతన్ని అంతగా పట్టించుకోక తిరస్కారంగా చూడసాగారు. బుర్ర లేని దామ్లుకు వారి దృష్టి తనవైపు తిప్పుకోవడం

అనివార్యమైంది. మరొక పెద్ద దొంగతనం చేయడానికి పాత తండాలోని సభ్యులు నిరాకరించారు. మిగిలిన ఒకే ఒక మిత్రుడు చంద్యా. అతని దగ్గరికి పరిగెత్తాడు."ఏరా చంద్యా, ఎన్ని రోజులు అయ్యిందిరా. చెయ్యి దురదగా ఉందిరా. ఏమైనా చెయ్" అన్నాడు. అని అతని జవాబు కోసం ఎదురు చూశాడు. "ఏమోనప్పా. పాత అలవాట్లు వదిలేసి శుద్ధంగా ఉండే లంజకొడుకులు రామంటున్నారు. నీవు ఒక్కడివే ఏం చేయగవు?" గంభీరంగానే ఈ విషయాన్ని ప్రస్తావించాడు. "నీవు కూడా ఆ పిల్లల పార్టీ చేరావా? ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసే రకమని అంటారు కదా అలా. లంజకొడుకులూ, రూపాయలు కావాల్సినపుడు సరేనంటూ వస్తారు. చేతిలో డబ్బులు పడినతర్వాత అందరూ దూరమయ్యారు సరేలే. డబ్బులు కావాల్సి వచ్చినప్పుడు ఊఁ అన్నారు. డబ్బులు దొరికిన తరువాత అందరూ అందరూ దూరమయ్యారు. సరేలే. నేను ఒక్కడ్నే పోతాను. నాకు కొత్త కాదు" అని కోపంతో అన్నాడు. "అది కాదురా దామ్లు, వాళ్లు రావటం లేదని, నేనూ వదిలేశాను. పద ఎక్కడికి పోదాం?" అని అతని వెనుక బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. "అదేరా డబ్బులు అయిపోవడంతో ముఖం చూపించవద్దని అంటుంది సావి. మరుసటి రోజు నుంచి ఆమె ముఖం చూపించలేదు" అని నిస్సహాయతను వ్యక్తపరిచాడు. "అలాగా. పదపోదాం. ఎక్కడికైనా దూరంగా పోదాం. ఈసారి పెద్ద దొంగతనం చేద్దాం. ఏదైనా ఇల్లు చూసావా?" అని ప్రశ్నించాడు."ఎవరో మాట్లాడుకుంటున్నారు ఆదోని రంగారెడ్డి గురించి" అన్నాడు. ఆ ఇంటికి కన్నం వేసే ప్లాను సిద్ధమైంది. "అదికాదు. ఇద్దరికీ అంటే పని కాస్త కష్టం అవుతుంది" అని చంద్యా సలహా ఇచ్చారు. "ఇప్పుడు నీవు రాకపోతే నేను ఒక్కడినే పోతాను. ఏమంటావు?" అని దామ్లు అన్నాడు. వృత్తిరీత్య దొంగ అయిన చంద్యా అతను నిజంగానే అంటున్నాడని అనిపించింది. "రేయ్ పిచ్చినా కొడకా, నేను ఏదో సరదాగా అన్నాను. నువ్వు వెంటనే కోప్పడతావుకదా. నిన్ను ఒక్కడినే పంపి అక్కడ ఏమైందోనని నేను ఇక్కడ కంగారు పడటం కన్నా నీతో పాటు ఆదోనికి వస్తే మంచిది. పదా వెళ్దాం" అన్నాడు. ముందు వెనుక చూడకుండా ఆదోనికి ప్రయాణమయ్యారు. రంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న నూటయాభై పల్లెలకే పెద్ద జమీందారు. ధైర్యానికి పేరుపొందిన వాడు. వందలాది మంది జీతగాళ్లు, పనిమనుషులు. రాత్రి కాపలా కాసేవారు మధ్య అతని ఇంటి గోడ దాటడమే అసాధ్యం.

దామ్లు ఒక్క క్షణం వణికిపోయాడు. కాపలావాళ్ల చేతికి దొరికితే ముక్కలు ముక్కలుచేసి కుక్కలకు వేయకుండా తామే తినేస్తారు. నరరూప రాక్షసులు ఉన్నట్టున్నారని

మనసులో చెలరేగుతున్న భావాలను చంద్యాకు కనిపించకుండా కొద్దిసేపు ఆలోచించాడు. ఉన్నట్టుండి అతనికి ఏదో స్ఫురించింది. వెంటనే లేచి ఎదురుగా ఉన్న మనిషిని పిలిచాడు. “అన్నా, తొ గోర్‌మాటి కావకె” (అన్నా, నీవు గోర కదా?) అని పలకరించాడు. ఎదురుగా ఉన్న రంగారెడ్డి మనిషి బోంద్యా నాయక్ ఆశ్చర్యపోయాడు. “హోవ, తూకోణ్ , మన్న కింవ్.. గురుతు పెట్యావో” (అవును నువ్వు ఎలా గుర్తుపట్టావు) అని ఆశ్చర్యంతో అడిగాడు. ఎవరు గుర్తు పెట్టకపోయినా, ఈ నా కొడుకు ఎలా గుర్తుపట్టాడన్నదే పెద్ద ప్రశ్న మారింది. ఎవరికీ అనుమానం రాకుండా ఇంతకాలం తాను ఉన్నాడని బోంద్యా ఆలోచిస్తూనే ఉన్నాడు. “అన్న ఏం ఆలోచిస్తున్నావ్? ఏదో అకస్మాత్తుగా నా మనసు చెప్పింది నీవు బంజారా సోదరుడివి అని. ముందు వెనుక చూడకుండా పలకరించారు. నీకు ఇబ్బంది కలిగేటట్టు అయితే వెళ్లిపోతాను” అని చంద్యాను వెంటబెట్టుకుని బయలుదేరాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న చంద్యాను చూసి, “ఏయ్ ఉండవయ్యా. నీతో ఎవరో మనిషి వుండడం చూశాను. ఏ ఊరు? ఎందుకు వచ్చారు?” అని ప్రశ్నల మీద ప్రశ్నలు వేయసాగాడు. “ఏమీ లేదు. ఇతను నా తమ్ముడు. ఆదోనిలో ఇతనికి ఔషధం ఇప్పించి ఒకింత మాటలు వచ్చేలా, ఎముకలకు బలం వచ్చేలా చేస్తారట. విషయం తెలిసింది. సొంత తమ్ముడు. పేగుబంధం. ఆగలేకపోయాను. బయలుదేరాం. ఏదో ఇక్కడ చిన్న ఉద్యోగం సంపాదించుకుని మందులు ఇప్పించి, వైద్యం చేయించుకుని బాగుచేసుకుని తమ్ముడిని పిల్చుకునిపోదామని వచ్చాను” అని జాలి కలిగించే కథను అతని ముందు పెట్టాడు. ‘అలాగా మీ ఊర్లో అలాంటి జబ్బులకు మందులు ఇచ్చేవాళ్ల గురించి నేను ఎన్నడూ వినలేదు”. పని అనుమానించారు.“అయ్యో పాపం. విషయం తెలిసిమది. అయితే ఈ ఊళ్లో ఇలాంటి జబ్బులకు ఔషధం ఇచ్చేవాళ్లు ఉన్నారని నేను వినలేదు”అని అనుమానంగా అన్నాడు. “అయ్యో, మీకు అందరికీ ఎలా తెలుస్తుంది? ఇంత పెద్ద షావుకారు దగ్గర పనిచేస్తున్నారు. పర్వాలేదు. మేమే వెతుక్కుంటాం” అని అతనితో సూటిగా అన్నాడు. “అలాగే,ఎక్కడ దిగారు?” అని అడిగాడు. “ఇంకా ఇప్పుడే వచ్చామన్నా. తిండి తిప్పలు లేక పని కోసం తిరుగుతూ ఉన్నాం” అని అతని మనసును తాకేలా దీనంగా అన్నాడు. “అయ్యో పాపం, పనులు తర్వాత చూసుకోవచ్చు. ముందు రండి భోజనం చేద్దురు” అని కొద్ది దూరంలో ఉన్న తన ఇంటికి పిలుచుకొనిపోయి భార్య పిల్లలను పరిచయం చేశాడు.

దామ్లు–బోంద్యాల స్నేహం గట్టిపడటానికి 15 రోజులు పడ్డాయి. అతను

రంగారెడ్డి కుడిచేతి బంటు. సాంబశివారెడ్డి కి చెప్పి ఇంట్లో చిన్నచిన్న పనులు చేయడానికి పరిచారకుడిగా చేర్చాడు. దామ్లు చిన్న పనులను ఎంతో నైపుణ్యంగా చేస్తూనే రంగారెడ్డి దగ్గరయ్యాడు. ఎలా ఉందంటే స్వయంగా రంగారెడ్డిని తన కొడుకులైన తిప్పారెడ్డి, సత్యనారాయణ రెడ్డిల మీద అనుమాన పడసాగాడు. రెడ్డి దర్బారులో జరిగే ప్రతి ఘటనను ఎదురుగా చెప్పి, 'అమావాస్య రోజున' తమ ప్రణాళికను అమలు చేసే సన్నాహం చేసుకోసాగారు. ముందుగానే కొంత తెలుగు వచ్చేది. రంగారెడ్డి ఇంట్లో జనం మాట్లాడటం విని కాస్త మంచి తెలుగు మాట్లాడడం నేర్చుకున్నాడు. రంగారెడ్డి భార్య సావిత్రి, కూతురు కుసుమబాలలకు దామ్లు తనపై నమ్మకాన్ని కలిగించాడు. ఒకవైపు సంబంధాల చుట్టూ వల వేస్తూ మరోవైపు బంగారం డబ్బులు, పెట్టిన స్థలం జాడ తెలుసుకోవడానికి ప్రయత్నించసాగాడు. 'ఎక్కడ ఉంది తిజోరి. ఇన్ని రోజులైనా కనిపించదు కదా? అమావాస్య దగ్గరికి వస్తుంది కదా?' ఇలా ప్రతిరోజు అనుకునేవాడు. మొత్తం 40 గదులు. అన్ని గదుల్లోనూ సామాన్లు, పనిమనుషులు. ఎక్కడ ఏముందో తెలుసుకోవటం కష్టం. అయితే దామ్లు గద్ద కళ్ళనుంచి ఏది తప్పించుకోవడం సాధ్యం కాదు. ఆరోజు రంగారెడ్డి చిన్నది కానీ పెద్దది కానీ 39వ గది నుంచి బయటకు రావడం చూశాడు. రంగారెడ్డి చేతిలో డబ్బుల సంచి ఉండటం నిర్ధారించుకున్నాడు. అతను బయటికి పోవటాన్ని చూశాడు. రంగారెడ్డి ఆ గది తలుపులు భద్రంగా వేసి ఒక పెద్ద తాళం వేశాడు. అది అంతగా పరిగణలోకి తీసుకునే విషయం కాదు. అయినా ఇదే గది అని నమ్మకం కలిగింది. అయినా ఒక దశ చేరానుకదా అనే సంతోషంతో లోపలికి, మళ్లీ బయటికి వచ్చే అవకాశాలను వీలైనంత త్వరగా కనుక్కునే బాధ్యతను చంద్యాకు అప్పగించి అతన్ని ఈ పనికి సిద్ధం చేశాడు. ఇతర చోట్ల పనులను తగ్గించుకుని, ఆ గది చుట్టే తిరుగుతూ, అక్కడి గోడలను, కప్పును, దూలాలను పరిశీలించసాగాడు. అయిదారువేల ఎకరాల జమిందారు రంగారెడ్డి మొదటినుంచి ఆగర్భ శ్రీమంతుడు. వజ్రాలు, ముత్యాలు, బంగారం ఇంట్లో రాశులుగా పడివున్నాయి. బ్రిటీష్ కాలం నుంచీ బ్రిటీషుల పరంగా నిలబడ్డాడు. అనేక బిరుదులు రంగారెడ్డి తాత చెంగారెడ్డి పొందిన ఫోటోలు గోడమీద వేలాడుతున్నాయి. తక్కువ అనుకుంటే రోజుకు కనీసం వందమంది ఇంట్లోకి బయటికి తిరుగుతున్నారు. దురదృష్టమో, అదృష్టమో దామ్లు మాత్రం అప్పుడే ఇంట్లో పనులు నిర్వహించసాగాడు. బోద్యా సహాయంతో ఒక్కొక్క అడుగు పెడుతూ తిజోరి అనటం కన్నా బంగారం వెండి వజ్రాలు నిండివున్న గదికి దగ్గరగా వచ్చాడు. దానికి కిటికి లేదు. ఒకే తలుపు.

ఇంటి నట్టనడుమ కట్టిపుంది. ఉద్దేశపూర్వకంగానే ఆ గది చుట్టూ ఎవరైనా చూడటం కనిపిస్తే కాళ్లు చేతులు నరికి కుక్కలకు వేసేవాడు రంగారెడ్డి. చుట్టుపక్కల 50 పల్లెల్లో రంగారెడ్డి అంటే జనంలో ఒక సంచలనం పొంగుతుంది. అలాంటి అతని ఇంట్లో కన్నం వేయడమంటే ఒక గుండె కాదు, జోడుగుండెలు ఉండాలి. దున్నపోతుల సైజుల్లో ఉండే కుక్కలు బయట ఒకసారి మొరిగితే ఎంతటి ధైర్యవంతుల గుండెలైనా వణికేవి.

దీపావళి తయారీ ఆర్భాటంగా సాగుతోంది. వారం ముందే గోడలకు సున్నాలు రంగులు పూయసాగారు. దామ్లు ఇంటి లోపల రంగులు కొడుతూ ఆ గది మీద నిఘా పెట్టాడు. పనిమనుషులంతా భోజనాలకు పోయినప్పుడు రంగారెడ్డి లేదా పెద్ద భార్య సావిత్రి. లేదా కూతురు కుసుమబాల మాత్రమే ఆ గదిలోకి వెల్లడం గమనించాడు. ఆరోజు మధ్యాహ్నం ఎవరో బంధువులు డబ్బు కోసం వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్నవాడు పనిమనుషులు పనులమధ్య భోజనానికి వెళ్లే సమయం చూసి, గది ఎదురుగా ఉన్న స్తంబభాల మీద వేసిన అటకమీద అడ్డంగా పడుకున్నాడు. గదిలోపలికి పోయినవాళ్లు ఒకవేళ తలుపు వేయకపోతే లోపల ఏముందో అవన్నీ కనిపించేవి. ఊపిరి బిగపట్టి కాచుకొని కూర్చున్నాడు. రంగారెడ్డి పెద్ద కూతురు కుసుమబాల తిజోరి తాళం పట్టుకొని వచ్చి తలుపులు తెరుచుకుని లోపలికి పోయింది. బంగారు నగల రాశి నుంచి ఒక గొలుసు తీసుకొని మెడలో వేసుకుంది. అక్కడే ఉన్న అద్దంలో తన ముఖాన్ని చూసుకుంది. దాన్ని తీసి వందలాది నగలలోంచి మరో గొలుసును తీసుకొని వేసుకొని ఎలా కనబడుతోందని అద్దంలో చూసుకుని మురిసిపోయింది. వెండి నాణ్యాల రాశి, బంగారు నగల రాశి పడివుండటం చూసిన దామ్లకు తల తిరిగిపోయింది. కిందపడతాడేమోననే భయంతో గట్టిగానే పట్టుకొని కుదుటపడ్డాడు. ఒకవైపు భయం. ఒకవైపు సంతోషం. ఆ అమ్మాయి లోపల ఉండగానే లోపలికి పోయి దాక్కుంటే ఎలా ఉంటుంది? అని ఆలోచించాడు. అతని మిత్రుడు చంద్యాకు సమాచారం లేకపోవడం మౌనం వహించాడు. అయితే తిజోరి గది గురించి సరైన సమాచారాన్ని సరిగ్గానే సేకరించాడు. కుసుమబాల డబ్బు సంచి తీసుకోవడం ఆలస్యం కావటంతో రంగారెడ్డి లోపలికి పరుగున వచ్చాడు."ఏమమ్మా ఏమైంది?" అని అడిగాడు. "ఏమి లేదు నాన్న, వస్తున్నాను" అని అతనికి తృప్తి కలిగించే విషయాన్ని చెప్పింది. రంగారెడ్డి రాకతో దూరంలో ఏదో గుచ్చుకుంటున్నా భరిస్తూ పడుకొని ఉన్న దామ్లకు ఒంటికి వచ్చింది. అయితే ఎక్కడ పోవాలి? ఆపుకొని రంగారెడ్డి బయటికి వెళ్లే

వరకు ఎదురుచూడసాగాడు. తండ్రి కూతురు అవతలకి వెళ్లడం చూసి అటక మీదనుంచి దిగి నెమ్మదిగా బయటికి నడిచాడు.

ఈ విషయాన్ని చెప్పినప్పుడు చంద్యాకు గాలిలో తేలుతున్నట్టు అనిపించింది. అతని రాబోయే కలలు గురించి ఆలోచించసాగాడు. దామ్లు మాత్రం అమావాస్య రోజున పని ముగించే దృఢమైననిర్ణయాన్ని మార్చుకోలేదు. మరుసటి రోజు ముందుగానే తన ఊరికి పండుగకు వెళుతున్నట్టు తెలియజేయాలని అనుకున్నాడు. దీన్ని బోద్యా ద్వారా రంగారెడ్డికి చేర్చాడు. పండగకు వెళుతుండవచ్చుని రంగారెడ్డి కూడా దానికి విలువ ఇవ్వలేదు. ఆ రోజు సాయంత్రం చంద్యా రంగారెడ్డి ఇంటికి వచ్చి దామ్లును కలిశాడు. దామ్లు అతన్ని పిలుచుకొని ఎవరికీ తెలీదు కనిపించకుండా తిజోరి ఎదురుగా ఉన్న పత్తి మూటలు వేసిన పెద్దగదిలోకి తీసుకెళ్లాడు. పత్తిమూటల మధ్య మూడు రోజులు ఎవరికి కనిపించకుండా దాక్కుని ఉండాలని ప్రణాళిక వేశారు. వారి ప్రణాళిక ప్రకారం ఇద్దరు లోపల చేరుకున్నారు. బయటిదంతా కనిపించేలా చిన్న సందు చేసుకొని మొత్తం దేహాన్ని పత్తి మూటల మధ్య దాచుకున్నారు. రాత్రి ఎవరు లేనప్పుడు, అందరూ నిద్రలోకి జారుకున్నప్పుడు వీరి పని మొదలైంది. పొద్దుటి నుంచి ఇంటి నిండా మనుషులు ఆ వైపు నుంచి ఈ వైపుకి విరామం లేకుండా తిరిగేవాళ్లు. అటువైపు గదికి కన్నం చేయడం పిచ్చి సాహసం. రాత్రి పడుకునే ముందు రంగారెడ్డి వచ్చి తాళం పరీక్షించి వెళ్లేవాడు. అలాగే ఇప్పుడు వచ్చి వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దామ్లు పైకి లేచి ఒక గోడను పరీక్షించాడు. ఎక్కడ ఒకే దెబ్బకు గోడకు రంధ్రం ఏర్పడుతుందో చూశాడు. అక్కడి నుంచి తాము బయట పడాలని ఆలోచన. చంద్యా పడుకొని గురకలు పడుతున్నాడు. దామ్లు పని జరిగేంతవరకు నిద్ర పోకూడదని శపథం చేసుకున్నాడు. పక్కన గోడను మృదువుగా కొట్టి చూశాడు. పద్దెనిమిది అంగుళాల గోడ. ఎక్కడ కూడా దుర్బలమైన సద్దు చేయలేదు. ఎక్కడైనా నా రాయి ఎక్కువ తక్కువ ఉండొచ్చు అని అతనికి తెలుసు. దాని కనిపెట్టడంలో అత్యంత నిపుణులైన దామ్లు గోడను గమనిస్తూనే వచ్చాడు. ఒక స్థలంలో గోడ ఉబ్బి ఉండడం దామ్లుకు కనిపించింది. పట్టరాని సంతోషం కలిగింది. ఆ స్థలాన్ని ముట్టాడు.మెల్లగా చేత్తో తట్టాడు. డబ్‌డబ్‌మని సద్దు చేసింది. ఆ స్థలాన్ని గుర్తు పెట్టుకున్నాడు. అదే సమయంలో ఎవరో లోపలికి వస్తున్నట్టు అడుగుల చప్పుడు వినిపించింది. భయంతో ప్రాణాలు పైకి పోయినట్లు అయ్యాయి. ఎంత వేగంగా పోయినా పత్తి మూటలను చేరటానికి రెండు మూడు నిమిషాలైనా కావాలి. వచ్చినవాడికి కనిపిస్తే ఒకే దెబ్బకు ప్రాణాలు పోతాయి.

క్షణంపాటు కలవర పడ్డాడు. అడుగుల చప్పుడు దగ్గరవుతున్నట్లే అతని సిక్స్త్ సెన్స్ జాగృతం అయింది. అటక మీద అడ్డంగా పడుకున్నాడు. దీపం పట్టుకొని లోపలికి వచ్చిన రంగారెడ్డి వ్యక్తిగత అనుచ సెన్సరుడు గోపాల్‌రెడ్డికి బంధువు. నమ్మకమైన బంటు. అతనికి ఒక్కడికే ఎప్పుడైనా ఆ గదిలోకి ప్రవేశం ఉంది. అతనికి మెలకువ వస్తే ఆ గది దగ్గరికి వచ్చి చూసి వెళ్లడం వాడుక. అందుకే గోపాల్ రెడ్డి వచ్చాడు. ఎవరూ కనిపించకపోవడంతో తిరిగి వెళ్ళిపోయాడు.

'ఈ రాక్షసుడి నుంచి ప్రస్తుతం తప్పించుకున్నాను" అని అనుకున్నాడు దామ్లు. తర్వాత తాను ఒకసారి ప్రణాళికలోని మొదటిభాగం అన్నట్టు అక్కడంతా చూశాడు. జనం లేచి ఉండటం ఖచ్చిత పరచుకొని మళ్లీ పత్తి మూటల మధ్య దూరాడు. చిన్నగా గురకలు పెడుతున్న చంద్యాను లేపాడు."ఎవర్రా?" అని అరవబోతున్న వాడి నోరు మూశాడు. కళ్లు తెరిచిన చంద్యాకు తాము ఎక్కడున్నారో గుర్తుచేశాడు. తమ తర్వాతి ప్రణాళికను గుసగుసగా ఇద్దరు మాట్లాడుకున్నారు. అమావాస్య రాత్రి కోసమే ఎదురుచూడసాగారు. వారి ప్రణాళిక ప్రకారం రాత్రంతా లక్ష్మీపూజ జరుగుతుంది. రాత్రంతా మేలుకున్నా వేకువలో తూర్పులో వెండి చుక్క కనిపించే సమయానికి అందరూ గాఢంగా నిద్రపోవటం వాస్తవం. అలాంటి సమయంలో ఎలాంటి వాడికైనా కళ్లు మూతలుపడతాయి. రాత్రంతా మేల్కొన్నవారు ఆ సమయంలో కళ్లుమూసుకుంటారు. ఆ సమయంలో చేయాల్సిన పని చేసి పారిపోవాలి. దొరికితే చావే గతి! అలా దృఢంగా నిర్ణయించుకున్న ఇద్దరు, ఇంటి పనిమనుషులు అర్ధరాత్రి గాఢమైన నిద్రలో మునిగిన సమయంలో కొద్దికొద్దిగా గోడలోని రాళ్లను వదులు చేయసాగారు. మళ్లీ ఏదైనా అలికిడి వినిపిస్తే ఆ క్షణమే పత్తి మూటల మధ్య పడుకునేవారు. తిండితిప్పలు ఏమి లేకుండా ఒక మూలలో ఉచ్చపోస్తూ, ఆ ఘాటు వాసనలోనే కాలం గడపటం యమయాతన అయినప్పటికీ డబ్బు, సొమ్ములు గుర్తుతెచ్చుకొని అన్ని మరిచిపోయేవారు.

ఉదయం అయిదు గంటలకు ఆడవాళ్ళు ఇల్లు వాకిలి ఊడ్చి, నీళ్లు చల్లి, ముగ్గులు వేసి అలంకరించేలోపు రంగారెడ్డి స్నానం చేసి తయారయ్యాడు. తలవాకిలి నుంచి ఇరవైఆరవ గది లోపలికి వచ్చే తలవాకిలికీ, ఈ తిజోరి ఉన్న గదికి అవినాభావ సంబంధం ఉంది. తలవాకిలి ప్రవేశిస్తే ఎడమకు తిరిగి, కొంచెం ముందుకు పోయి కుడివైపు తిరిగితే సూటిగా తలవాకిలికి ముఖం చేసుకునే తిజోరి ఉన్న గది. అయితే ఇదే తిజోరి గది అని తెలుసుకోవడానికి ఒక నెల రోజులైనా అవసరం. రంగారెడ్డి తాత ముత్తాతల కాలం నుంచి పెద్ద ఇంటిని అభివృద్ధి చేస్తూ

గది చుట్టూ బందోబస్తు గోడను నిర్మిస్తూ వచ్చారు. అలాంటి భద్రమైన గోడలోని బొక్కలను దాము కనుక్కోవడం ఆశ్చర్యమేమీ కాదు. దాము గద్దకళ్ల నుంచి తప్పించుకునే స్థలం ఈ ప్రపంచంలోనే లేదు. కన్నం వేయడంలో అంత నిష్ణాతుడు. కొందరు ఆడవాళ్లు వచ్చి ఆభరణాలు తీసుకొని పోయారు. వాళ్లు తప్ప ఆ గది వైపు ఎవరు మసలలేదు. "పదరా, ఎవరూ లేరు" చంద్యా గుసగుసగా అన్నాడు. "కొడకా అక్కడ చూడు" అని రంగారెడ్డి, అతని భార్య, కూతురు మడి బట్టలు కట్టుకొని పూజా సామాన్లు పట్టుకొని లక్ష్మీ పూజకురావటం కనిపించింది. చంద్యా నాలుక కరుచు కున్నాడు. తిజోరి లోపలికి పోయినవారు మధ్యాహ్నం రెండుగంటలకు బయటకువచ్చారు. ఏ ఒక్కరికి ఆ గది దగ్గరికి రావడానికి అనుమతి లేదు. ఆరోజు ఉదయమే తెరిచిన ఆ గది తలుపు మరుసటి రోజు సాయంత్రం అదే సమయానికి మూయటం జరుగుతుంది. ఆ సమయం లోపల లక్ష్మీ దక్కితే దాము గెలిచినట్లు. లేకపోతే రంగారెడ్డి గెలిచినట్టు. ఆ రాత్రంతా ఆ గది తప్ప మిగిలిన గదిలలో మనుషులు నిండిపోయి రభసగా ఉంది. పిల్లలు దీపావళి పటాసులు కాలుస్తున్నారు. వాటి ధాం ధాం శబ్దాలు చెవులను బ్రద్దలు కొడుతున్నాయి. టపాసుల ధాం శబ్దానికి సరిగ్గా గోడకు దెబ్బలు వేస్తూ ఒక్కొక్క రాయిని రాళ్లను పెకిలించాడు. ఒక మనిషి సులభంగా దూరగలిగే కన్నం తీసి, అక్కడే ఉన్న సంచులలో నాణ్యాలను, బంగారు నగలను నింపుకుని మూటలు కట్టారు. తలవాకిలి దగ్గర ఒక కుక్క విపరీతంగా మొరగసాగింది. రంగారెడ్డి పనిమనిషి చిక్కను పిలిచి, "ఏమైంది ? ఏమైందో కొంచెం చూడు" అని చెప్పి లోపలికి పోయాడు. కుక్క అతను వచ్చి పోయినా మొరగటం ఆపలేదు. టపాసుల శబ్దానికి దానికి ఏమో అయ్యుండాలని మనుషులు దాన్ని పట్టించుకోవడం మానేశారు. కుక్క మాత్రం మెడలో కట్టిన ఇనుప గొలుసుపూడి వచ్చేలా వచ్చేలా లాగుతూ మొరగసాగింది. అకస్మాత్తుగా దానిని ఎవరైనా వదిలేస్తే దాము జీవితాన్నే నాశనం చేసేది. అతని అదృష్టమో ఏమో అన్నట్టు రంగారెడ్డి అల్లుడు సోమిరెడ్డి "ఏయ్, దొంగ నా కొడకా! ఏమి రా ఏమైంది రా నీకు? రేయ్ దుర్గా దాన్ని తీస్కునిపో" అన్నాడు. దుర్గ బలమైన మనిషి. అది ఎంత గట్టిగా మొరిగినా, పెనుగులాడినా పట్టుకొని తోటలోకి తీసుకొనిపోయాడు. రంగారెడ్డి కుక్క మొరగడం విని కొంతమంది గాభరా పడి బయటికి వచ్చారు."ఏమిరా దుర్గ ఏమైంది పాపం?" అని ఒకడు అడిగాడు."ఏమీ లేదన్నా అక్కడ చాలామంది ఉన్నారు. పైగా దీపావళి బాణాల శబ్దం..." అని సాకు చెప్పి దాన్ని గట్టిగా కట్టి వేశాడు. రాత్రిలోని ప్రక్రియలు కూడా గొప్పతనాన్ని

పొందాయి.

అటువైపు నుంచి ఇటు వైపు ఇటు వైపు నుంచి అటు వైపు జనసంచారం ఎక్కువైంది. అది క్రమంగా ఉదయం నాలుగు గంటల సమయానికి తగ్గింది. అక్కడే కూర్చొని కొంతమంది నిద్రలోకి జారుకున్నారు. మరికొంతమంది అలాగే నేలమీద వాలి పడుకున్నారు. చేపలకు మత్తు నూనె వేసి గుంటలోంచి పట్టుకున్నట్టు అయింది. దీన్ని ముందుగానే ఊహించిన దామ్లు, చంద్యాలు అరక్షణంలో మొత్తం తిజోరిని లూటీ చేసి పరారయ్యారు. దేవతా విగ్రహాలు తప్ప, తిజోరిలో ఏమీ లేకుండా ఖాళీ అయింది. రెండు సంచుల వెండి నాణ్యాలు, ఒక బంగారు నగల సంచి, కన్నం వేసిన స్థలానికి వచ్చి గట్టిగా గుద్ది రాళ్లు అటువైపు పడేలా చేసి సంచులు బయటికి సాగించిన తర్వాత, తర్వాత ఇద్దరూ దాటుకొని వెనుతిరిగి చూడకుండా దారులు మారుస్తూ తండా ను చేరుకోవాలనే ఆలోచన వారిది. రంగారెడ్డి ఇంటి నుంచి ఐదారు మైళ్లు దక్షిణానికి నడిచారు. పెద్ద అడవి వచ్చింది. అందులో అడుగు పెడితే ఎలాంటి వారు కూడా వాళ్లను వెతకడం అసాధ్యమని దామ్లుకు తెలుసు. ధృవతార కనిపించేలోపు అడవిని చేరాలని ఆలోచించాడు. భుజాల మీద సంచులలోని డబ్బు, వెండి, బంగారు నగల భారం అధికంగా ఉన్నప్పటికీ ఎలాగో నిభాయించుకుంటూ కొంతదూరం పరిగెడుతూ, కొంత దూరం వేగంగా నడుస్తూ అడవిలోకి ప్రవేశించారు. ఇక అడవి ప్రారంభమవుతుందని అన్నప్పుడు దారిలో మనుషులు ఎక్కడైనా బయలుకు కూర్చున్నారేమోనని చూశాడు. ఎవరూ కనిపించకపోవడంతో తానే కూర్చొని రెండు పాదాలతో దాన్ని తొక్కి కొద్ది దూరంలో ఉన్న నీటి కాలువలో కాళ్ళు కడుక్కొని స్నానం చేసి దక్షిణం నుంచి తూర్పు వైపు నడిచాడు. చంద్యా కూడా అలాగే చేశాడు. సూర్యుని కిరణాలు నేలమీదికి పడేసమయానికి తూర్పుదిక్కులో చాలా దూరం వెళ్లిపోయారు. సంవత్సరాలు కొద్దీ గొర్రెల మంద నుంచి గొర్రెలు దొంగలించి తిని తిని చాలా అయింది. అయితే అదే నైపుణ్యం ఇప్పుడు పనికి వచ్చింది. వారు చేరుకోవలసిన గమ్యం దూరంలో ఉంది. పగలు ఎవరి కంటపడకూడదని బాగా ఆలోచించి ఒక పెద్ద చెట్టును చూసి దాని మీద కూర్చొని కాలం గడపటం మంచిదని దామ్లు ఒక కొమ్మకు పగ్గం వేసి నాలుగు సంచులను పైకి లాగి గట్టిగా కట్టాడు. అలా నాలుగు సంచులను చెట్టు మీదికి ఎక్కించి ఎవరికీ కనిపించకుండా రోజంతా దాక్కుని కూర్చున్నారు.

రంగారెడ్డికి విషయం తెలిసినప్పుడు కాళ్ళ కింద భూమి కుంగిపోయినట్టయింది. "ఎవడ్రా దొంగనా కొడుకా" అని ఆవేశంతో అరిచాడు. మొత్తం గదిలో నాలుగు

వెండి దేవతా విగ్రహాలను వదిలి మొత్తం దోచుకోవడం చూసి వచ్చిన దొంగలు సామాన్యులు కారని అనిపించింది. "ఎవరు. ఆ మనుషులు నాకు కావాలి" అని కేకలుపెట్టాడు రెడ్డి. మొత్తం ఇల్లంతా పిడుగుపాటు తిన్నట్టు మౌనం ఆవరించింది. క్షణాలు గడుస్తున్న కొద్దీ ఇంట్లో జరిగిన ఒక్కొక్క విషయం బయట పడ్డాయి. బొంద్యా భయపడి పోయాడు. 'లంజా కొడుకు దామ్లు మా కులస్తుడని నమ్మించి ఇలా చేశాడు కదా. రంగారెడ్డికి ఈ విషయం తెలిస్తే తుపాకీతో కాల్చి చంపేస్తాడు' అని అతని మనసులో చెలరేగిన భయం అతన్ని వేధించసాగింది. ఎవరికీ చెప్పలేదు, చెప్పకుండా ఉండలేని పరిస్థితి. "రేయ్ దుర్గా, పాపను (కుక్కను) తీసుకొని రాపో" అన్నాడు రంగా రెడ్డి. దుర్గ కుక్కని విడిపించుకుని రావడానికి తోటకి వెళ్లాడు. తన పూర్వీకుల సంపదను తాను పోగొట్టుకున్నాడనే ఆలోచనతో అతని మెదడులోని నరాలు చిట్లిపోయి అరగంటలోనే రంగారెడ్డి శవమయ్యాడు.

దూరంలో ఎక్కడ రంగారెడ్డి కుక్క మొరుగుతుండటం వినిపించి చంద్యా పంచలో ఉచ్చ పోసుకున్నాడు."ఒరేయ్ పనికిమాలిన లంజకొడకా! పంచ ఎత్తి, నిక్కరు పక్కకు జరపకూడదా?" అని కోప్పడ్డాడు దామ్లు. "ఊరుకో రా నీ యబ్బ, దానెమ్మ, ఆ కుక్కను గుర్తు చేసుకుంటే ఉచ్చ వస్తుంది. అది మొరగడం వింటే" అని సంజాయిషీ ఇచ్చాడు. ఎక్కడో దూరం లో కుక్క మొరగడం అడవిలో వినిపించడం ఎలా సాధ్యం? దామ్లుకూ అనుమానం కలిగింది. ఒకవేళ రంగారెడ్డి ఇంటి కుక్కనా? అని అనుమానం పడ్డాడు. ఎప్పుడూ దొంగతనం చేసి వస్తున్నప్పుడు కుక్కను దారి తప్పించటానికి తమకు తెలిసిన పద్ధతులు పాటించేవారు. ఇప్పుడు అదే చేశారు. అయినా కుక్క అనుసరించి వచ్చివుంటే అది మితిమీరిందని, ప్రమాదకరమైందని ఇద్దరూ మనసులో అనుకున్నారు. అంతలో కుక్క మొరుగుతున్న సద్దు ఆగింది. "నేను చెప్తూనేవున్నాను. ఈ దొంగతనం వద్దురా. ఎందుకో పెద్ద గండం ఎదురు చూస్తోందని చెప్పినా నా మాటలు వింటావా? ఇప్పుడు అనుభవించు" అని చంద్యా కోప్పడ్డాడు."ఎందుకురా ఊరికే వాగుతున్నావ్. కుక్క మొరిగే సద్దు తగ్గింది చూడు. ఇక రెండు మూడు గంటల్లో సూర్యుడు మునుగుతాడు. ఇక్కడి నుంచి బయలుదేరితే ఊరు సరిహద్దు చేరేవరకు ఆగకూడదు" అని నచ్చజెప్పి చెట్టు మీద కళ్ళు మూసుకుని నిద్రపొమ్మని చెప్పాడు. దామ్లు మీద నమ్మకముంది. "మా అమ్మా, మా తల్లీ, మహాకాళి, సేవాభాయ్, ఈ ఒక్కసారి ఎలాగైనా మమ్మల్ని కాపాడు. ఇంకొకసారి ఈ పాడుపని చేయను. ఇంటి నుంచి ఎక్కడికి పోనంటే పోను" అని మెల్లగా చెప్పి కళ్లు మూసుకుని నిద్ర పోతున్నట్టు నటించాడు.

తండా జనం నెలరోజులు గడిచినా చంద్యా, దామ్లలు రాకపోవడంతో వారి ఆడవాళ్ల పట్ల జాలి చూపించారు. 'దొంగల భార్యలు ఏరోజైనా ముండమోయాల్సిందే. ఓదార్చుకోమ్మ. నీ తలరాత ఇలా అని రాసి ఉంటే ఎవరు ఏం చేయగలరు? నెల అయింది. ఇంకా రాలేదంటే ఎవరో వీళ్లిద్దరిని పట్టుకొని చంపి ఉంటారు" అని హాల్యా నాయక్ భార్య చావలి చెప్పి ఓదార్చింది. దామ్ల భార్య సోమ్లి పెళ్లి అయినప్పటి నుంచీ ఈ మాటలు విని విని ఆమె హృదయం కఠినమై పోయింది. జరిగేది జరగనీ. ఒకవేళ వస్తే ఉంటాడు. చనిపోయి ఉంటే చనిపోయాడని అనుకొని నా బతుకు నేను బతుకుతానని అనుకుంది.. అయితే ఇంటి నిండా ఉన్న పిల్లల కార్ఖానా తయారు చేసి దిక్కు లేకుండా చేసి పోయాడు పాడుమనిషి. ఇక పిల్లలకు సాకేవాళ్ళు ఎవరు? అన్నదే ఆమె చింత. దొంగతనానికి వెళ్లే రోజున రాత్రంతా నిద్రపోయేవాడు కాదు. అందువల్ల ఆమె గర్భవతియై అలా ఆరు మంది పిల్లలు కన్నది. సోమ్లి భర్త గురించి, పిల్లల గురించి దుఃఖిస్తు అందులోంచి బయటికి రాలేక పోయేది. తెల్లవారగానే చంద్యా భార్య సామి, సోమ్లి వెంట అడవికి వెళ్లి కట్టెలుకొట్టి మోపు కట్టుకుని ఊర్లోకి తెచ్చి "కట్టలమ్మా... కట్టెలు..." అని అరిచి వాటిని అమ్మి, వచ్చిన రొక్కంతో సరుకులు కొని తెచ్చి వంట చేసి పిల్లల కడుపు నింపేది. లేకపోతే ఉపవాసమే గతి. భర్త పెద్ద దొంగ. టూటీ చేస్తే దాన్ని లంజకో, ఇంకెవరికి ధారపోసేవాడు. సామి, సోమ్లిలు అలా పోయిన పాడు మనుషులు అలాగే పోవాలని మళ్లీ రాకుండా ఉండాలని శాపం పెట్టేవారు. అయితే వాళ్లు అలా ఆలోచిస్తున్న రోజున వీళ్ళు హఠాత్తుగా ప్రత్యక్షమయ్యేవారు.

అర్ధరాత్రి జనం గాఢనిద్రలో ఉన్న సమయం. తాండాలోని ఏదో కుక్క నోట్లోని నాలుకను ఎవరో ముల్లుతో గుచ్చినట్టు మొరగడం ప్రారంభించింది. మెడ విరిచి చంపేంత కోపం వచ్చింది దామ్లకు. బరువు మోసుకొని నడుస్తున్న ఆయాసం. కాళ్ల దగ్గరకు వచ్చిన కుక్కను జాడించి తన్నాడు. ఆ దెబ్బకు కుంయ్ కుంయ్ అంటూ అది దూరంగా పారిపోయింది. గుడిసెల దగ్గరికి పోయాడు. చీకట్లో పొరబాటున ఎవరి గుడిసెలోనైనా పోతే? అనుకుని ఆగాడు. 'సోమ్లి' అని మెల్లగా పిలిచాడు. ఎవరో కలలో పిలిచినట్టు గబుక్కున లేచి భర్త గొంతును గుర్తించి తలుపు తెరిచి లోపలికి వెళ్ళింది. అతను ఒక సంచి బయటపెట్టి లోపలికి పోయాడు. ఆమె ఏదో గింజలు తెచ్చాడని ఎత్తడానికి పోయింది. మూట కదల్లేదు. మాట్లాడకుండా లోపలికి వచ్చింది. "ఏమి తెచ్చినా ఏమి ప్రయోజనం? ఎవరింటిని నింపడానికో,

లేదాఏ ముండనో మురిపించడానికో అయివుంటుంది. ఇలాంటి బతుకు అవసరమా" అని గొణిగింది. దామ్లు అలసిపోయి ఉండటం వల్ల ఎక్కువగా మాట్లాడలేదు. మౌనంగా పోయి పిల్లల పక్కన గోనెపట్ట మీద పడుకున్నాడు. ఆమె కూడా అతన్ని పట్టించుకోక మూలలో పడుకుంది. తిన్నావా? ఉపవాసం ఉన్నావా? అని అడగటానికి గుడిసెలో ఏమైనా ఉంటే కదా! అయితే అతను లేచే లోపల పిల్లల కోసం ఏదైనా చేయాలనే దురాలోచన మాత్రం ఆమె తలను కొరుకుతోంది. అలిసి వచ్చిన భర్త గాఢమైన నిద్రలోకి ఎప్పుడూ జారుకుంటాడా అని ఎదురుచూస్తున్న సోమ్లి, భర్త గాఢమైన నిద్రలో ఉండటం గమనించింది. మెల్లగా లేచింది. చాలా కష్టపడి రెండు సంచులను విప్పింది. ఒక పెద్ద తపేలా నింపుకొని, కుండను నింపుకుని వంటగదిలో చప్పుడు కాకుండా గొయ్యి తవ్వి పూడ్చింది. నగలను జాగ్రత్తగా తీసి తన పుట్టింటివారు ఇచ్చిన పాతకాలపు పెట్టెలో పెట్టి తాళం వేసింది. ఏమీ తెలియనట్టు సంచులను కట్టి సరిగ్గా జోడించి పెట్టి వచ్చి పడుకుంది. తొలికోడి కూసే సమయానికి లేచే ఆమె ఆ రోజు భర్త లేచిన తర్వాత లేచింది.

దామ్లు సంచులను గమనించకుండానే ఎత్తుకొని పోయినవాడు ఎక్కడ మాయం చేశాడో తెలియదు. అయితే అప్పటి నుంచి ఇంటికి కావాల్సిన సరుకులను తెచ్చివేయసాగాడు. అయితే వాల్యా చెల్లెలు సావి మోహం ముందు పుంగి ఊదిన పాములా అయిపోయేవాడు. ఆమె అంటే అతనికి ఏమయ్యేదో, అంత పెద్ద దొంగ దామ్లు నీళ్లు నములుతూ ఉండిపోయేవాడు. రంగారెడ్డి భార్య దాచుకున్న వజ్రాల హారాన్ని జాగ్రత్తగా తీసుకుపోయి ఇస్తుండగా అది చూసి సావి పిచ్చిదానిలా అయిపోయింది."మగవాడంటే నువ్వేరా దామ్లు. భార్యను వదిలి ప్రియురాలిని ఎంతగా ప్రేమిస్తున్నావు కదా! నీ తాకత్తును మెచ్చుకోవాల్సిందే. ముందు భోజనం చెయ్. నా చేతులారా నీకు కావాల్సింది వడ్డిస్తాను" అని వయ్యారంగా లోపలికి పిలుచుకొని పోయింది."మీ ఆడవాళ్ళ విచిత్రమైన మనుషులు. ఒక్కొక్కసారి హృదయాన్ని తీసి చేతిలో పెడతారు. మరొక్కసారి హృదయం తలుపులు మూసి నిరాకరిస్తారు" అని నవ్వుతూనే బుగ్గ మీద చిటికె వేశాడు. అతని మాటల్లో ప్రేమ, రోషం, ద్వేషం అన్నీ ఉన్నాయి. డబ్బులు ముగిసే వరకు సకల సేవలు జరగడం ఖచ్చితం, అలాగే జరగసాగింది.

వాల్యా విసళవత్ ఇంటి తిజోరి లోపల వెండి నాణ్యాల సంఖ్య ఎక్కువ కావడంతో వాల్యాలో దురాశ గూడుకట్టుకో సాగింది. వాల్యా అతని చెల్లెలు సావిలది ఇద్దరిదీ ఒకే మనస్తత్వం. అయితే వారి తమ్ముడు లాల్యాకు ఇవేవి నచ్చేవికావు.

చెల్లెలు వ్యభిచారం మీద వచ్చే ఐశ్వర్యం అసహ్యించుకుని ఒకటి రెండు సార్లు కఠినంగానే మాట్లాడాడు. పైగా దామ్లను పిలిచి హెచ్చరించాడు. సావి ప్రేమ కోసం ఏమైనా చేయడానికి తయారుగా ఉన్న దామ్లకు లాల్య మాటలు నిద్రపోగోట్టాయి. "అదికాదురా లంజా కొడకా, నా కొడుకులు నా ఛాతీ ఎత్తుకు పిల్లలు పెరిగినారు. ఇంకా బుద్ధి రాకపోతే ఎలా? అలా చూడు నా పిల్లలను. వారు బలంగా తయారయ్యారు. వాళ్ల ఎదురుగా నువ్వు మా ఇంటికి వచ్చి వారి అత్తతో చేసే వ్యవహారం తెలిస్తే..." అన్నాడు. ఆ మాటలకు అతనిలో ద్వేషం పుట్టింది. ఎన్నడూ హత్య చేయని దామ్లకు హత్యచేసి అతని వ్యవహారం ముగించాలని అనిపించింది. సరైన సమయం కోసం ఎదురుచూడసాగాడు. లాల్య విసళవత్ తన అన్న వాల్య వ్యవహారాలకు విసుగుచెంది రోజూ గొడవ పడేవాడు. ఆ గొడవలు చివరికి చేతులు కలిపే స్థాయికి చేరాయి. అంతేకాదు "రేయ్, నువ్వేమి పెద్ద మనిషివి, నా భాగం నాకు ఇచ్చేయ్. నేను వెళ్ళిపోతాను" అని గట్టిగా చెప్పి వెళ్ళిపోయాడు లాల్య. వాల్య కోపం కట్టలు తెంచుకుంది. దొంగ సరుకు ఇంట్లో నిండుగా వున్నప్పుడు భాగం ఇస్తే సగానికి సగం తమ్ముడికి ఇవ్వాల్సి వస్తుందని ఆలోచించి దామ్లకు తమ్ముడ్ని చంపటానికి సుపారి ఇచ్చాడు. "చూడరా, మన దారిలో ముల్లులా తయారయ్యాడు లాల్య. ఎలాగైనా అతన్ని లేపెయ్. అటుతర్వాత నా చెల్లెల్ని చూడటానికి నువ్వు ఎప్పుడు కావాలంటే అప్పుడు రావచ్చు. అంతేకాదు ఈ ఇల్లు నీదే అనుకో" అని అన్నాడు. దామ్లకు లాల్య మీద కోపం ఉంది. అయితే ఎన్నడూ దాన్ని అతని ముందు వ్యక్త పరచ లేదు. దీపావళి చీకటి రాత్రి వేటకు తండా కు తండా వెళ్లింది. వాల్య మాత్రం ఏదో ఒకటి చెప్పి పక్కకు తప్పుకున్నాడు.

దామ్ల, చంద్యా, అతని గుంపు వేట కోసం బయలుదేరారు. వేటాడటం కోసమే అటు వచ్చిన లాల్య విసళవత్ గుంపులోంచి దారి తప్పాడు. అటుగా వస్తున్న దామ్ల అతన్ని తమ గుంపులోకి రమ్మన్నాడు. ఒంటరిగా ఉండటం కంటే గుంపులో వెళ్లడమే మంచిదని లాల్య వాళ్లతో కలిసి సాగాడు. అయితే దామ్ల మనసులో ఏముందో అతనికి తెలియదు. గుడెకోటె వెనుక కొండ మలుపు గుండా బయలుదేరిన వారు సుందూరు గుట్టకు అవతల దిగి 'నారిహళ్ల' అడవిని చేరారు. ఒక జింక కానీ, చెవులపిల్లి కానీ కనిపించలేదు. ఎవరి మనసులో ఏముందో ఎవరికి తెలుసు? ఒకరినొకరు నమ్ముకొని వేటకు వచ్చారు. పెద్ద పొద మధ్యలో ఏదో సద్దు కావటంతో అందరూ "ఏ లాల్య విసళవత్, పొదలో ఏదో జంతువు దాక్కొని ఉన్నట్టుంది చూడు" అని చంద్య అన్నాడు. సాదాసీదా మనిషి

అయిన లాల్య ఉన్నా వుండొచ్చని మెడ చాపి పొద లోపలికి చూస్తూ ఉండగా కత్తితో ఒకే దెబ్బకు తలను వేరుచేశాడు దామ్లు. రక్తం చివ్వుమని అతనిమీదికి చిమ్మింది. అక్కడే ప్రవహిస్తున్న 'నారిహళ్ళ'లో స్నానం చేసి తన గుంపుతో పాటు తిరిగి వచ్చాడు.

వాల్య, సావిలు చాలా సంతోషంతో ఉన్నారు. విషయం విని, "ఒక విషబీజం అడ్డుతొలగింది" అని వాల్య చెల్లెలి ముందు అన్నాడు. అయితే దామ్లు గుంపులో వేటకు పోయినవారు తిరిగొచ్చారు. అయితే తన భర్త ఎందుకు రాలేదు? అని లాల్య భార్య వాల్కి విచారంలో మునిగింది. ఏదో అనుమానం వేధించింది. ఆమె అంతటితో ఊరుకో లేదు. వెనక వీధిలో ఉన్న తన తండ్రి ఇంటికి పరుగెత్తింది. "నాన, అమ్మ, అన్నా, వేటకు వెళ్లినవాళ్లంతా తిరిగొచ్చారు. కానీ నా భర్త మాత్రం రాలేదు. అతనికి ఏమైందో? ఎందుకో నాకు గాభరాగా ఉంది" అని దుఃఖం ఆపుకోలేక బోరుమని ఏడవసాగింది. పులిలాంటి అతనికి ఆరు మంది అన్నదమ్ములు సమావేశమయ్యారు. "ఎందుకు? ఏమైంది? ఆ బోడి వెధవను వేటకు వెళ్లమని ఎవరు చెప్పారు? ఎవరి వెంబడి వెళ్లాడు?" అని వాల్కి పెద్దన్న సేవా అడిగాడు. "ఆ గౌడనట్టి దొంగ దామ్లు గుంపుతోపాటు వెళ్లాడు" అంది. ఆలోపు దామ్లును కలిసి తన తండ్రి గురించి విచారించడానికి వెళ్లిన చిన్న కొడుకుభీమ్లు వార్త తెచ్చాడు."పది పదిహేను కిలోమీటర్ల దూరం పోయినా తర్వాత వేరొక అక్కడికివచ్చిన వేరొక గుంపుతో కలిసి వెళ్ళాడట. వాళ్ల వెంట వెళ్లదంట" అన్నాడు. కుప్లేనపల్లి పక్కనున్న బ్యాడరహట్టి, కుప్పేనహల్లి చెరువు దాటితే ముందున్న కాలువ వరకూ భార్య పిల్లలంతా కలిసి వెతికారు. లాల్ జాడ దొరకలేదు. వారమంతా వెతికిన తర్వాత అనుమానం వచ్చి 'నారిహళ్ల' అడవికి చెల్లెలి బాధ చూడలేక ఆరు మంది అన్నదమ్ములు వెళ్లారు.

లాల్య ఇద్దరు కొడుకులు బయలుదేరడం చూసిన వారి పెద్దమామ గోప్యానాయక్ వద్దన్నాడు. "మీరు చిన్నపిల్లలు. మా వెంట అడవిలో ఎంత దూరం తిరుగుతారు. మేమంతా ఎతికి తీసుకొస్తాం. మీరు వెళ్లండి" అని చెప్పటంతో వాళ్లిద్దరు వెనక్కు తిరిగి వెళ్లిపోయారు. కాగడాలు పట్టుకొని రాత్రంతా అడవిలో వెతికారు. జాడ దొరకలేదు. దాంతో సోమ్లా నాయక్ జరిగిందేమిటో ఊహించాడు. ల్యా శవం అయిండవచ్చు. లేకపోతే అతను ఈపాటికి దొరికి ఉండాలి. లేదా తనే ఇంటికి వచ్చేసివుండాలి. తల నిండా చెడు ఆలోచనలు గిర్రున తిరిగాయి. సూర్యుడు తూర్పున పైకి వస్తున్నట్టే దట్టమైన కారడవిలో ప్రవేశించారు. గోప్యా నాయక్ చిన్న

తమ్ముడు పీర్యా నాయక్, "ఏదో జంతువు తిని కుళ్లిపోయిన వాసన వస్తున్న శవం ఇక్కడుంది. రండి" అని కేకపెట్టాడు. మరుక్షణమే ఆరుమంది అక్కడికి పరిగెత్తారు. శవం పూర్తిగా జీర్ణావస్థలో ఉంది. తల కనిపించలేదు. "అవును తల ఎక్కడ వుంది?" అని రెండవ వాడైన జాంప వెతికాడు. పొదల్లో పడివున్న రుండాన్ని బయటికి తీసిన తరువాత శవాన్ని ఇంటికి తీసుకుని వెళ్లటం అసాధ్యమని అర్థమైంది. దామతో వారు అడవిలోంచి ఎండు కట్టెలు ఏరుకొచ్చి శవం మీద పేర్చి రుండంతోపాటు శవాన్ని కాల్చి తమ కులపద్ధతిని ఆచరించారు.

కార్యక్రమాలను విధివిధానాలతో చేయడానికి ముందుకు వచ్చారు. కార్యం ముగిసి మందికి భోజనాలు పెట్టారు. కొంతమంది లాల్య గుణాలు పొగిడి కన్నీరు కార్చారు. అయితే లాల్య పెద్దన్న వాల్య, అతి చెల్లెలు సావి అంతా మరచి ఏమీ కాలేదన్నట్టు ఉన్నారు. అయితే లాల్య పెద్ద కొడుకు చిన్న, చిన్నకొడుకు రూప్ల నాయక్‌లు మాత్రం పక్కా సమాచారం సేకరించే వరకు అనుమానించకూడదనే అభిప్రాయంతో ఉన్నారు. కాలం అందరినీ మరిపించింది. అయితే తండ్రి హత్యను ఎలా మర్చిపోగలరు? వాళ్కి అన్నలు కూడా చంపిన వారికి అనుమానం కలగకుండా ప్రవర్తించసాగారు. వాల్య అతని చెల్లెలు సావిలు, వాళ్కికి ఆస్తిలో భాగం ఇవ్వడానికి నిరాకరించారు. వాల్య పిల్లలు కూడా తండ్రి దారిని అనుసరించారు. ఆ కారణంగా "మీరేం చేస్తారో చేసుకోండి. నా తమ్ముడిని మీ అన్నదమ్ములు చంపారు. ఇప్పుడు ఆస్తిని దోచుకొని అతని ఇద్దరు పిల్లలను వీధులపాలు చేయడానికి పూనుకున్నారు" అని మొసలి కన్నీళ్ళు కార్చాడు. ఇలా అయితే సమస్య పరిష్కరింపబడదని మరోదారి ఆలోచించారు. దీపావళి అమావాస్య రాత్రి దెబ్బకు దెబ్బ తీయాలని శపథం చేశారు. ఆ రోజు కోసం ఎదురుచూడసాగారు.

బలి పాడ్యమి రానే వచ్చింది. పోయినసారి జరిగిన భయంకరమైన హత్య నేపథ్యంలో వేట అని శబ్దం మా నాన్న శూరుని ఎదను వణికించింది. మాంసపు ముక్కనో, లేదా రసమో ఏదో తిని మా పాటికి మేము ప్రశాంతంగా వుంటే చాలని అనుకున్నాం. తండా లోని దుర్గమ్మ గుడి ఎదుట రెండు లేత గొర్రెలను కోసి పాత్రలో పట్టిన రక్తం చూడటానికి జనం కమ్ముకున్నారు. దామ్లు, చెంద్యాలు తమ ఎప్పటి హడావుడిలో రక్తపు ముఖం చూడటానికి వచ్చి ఎడమ చేతి వేలిని రక్తంలో అద్ది అక్కడే ఉన్న వేప ఆకులతో తుడుచుకోవడానికి కిందికి వంగాడు. అక్కడే నిలబడ్డ లాల్య నాయక్ కొడుకు బండి కల్లం నుంచి రంయ్‌మని దూకాడు. దెబ్బపడి, భయంతో పైకి లేచే ప్రయత్నం చేస్తుండగా మరొక దెబ్బ పడింది. దామ్లు

ఎందుకు ఏమిటి అని తెలుసుకునే లోపే ఎనిమిది పదిమంది ఊరి మధ్యకు లాక్కుని వచ్చారు. బండరాళ్లు ఎత్తి వేశారు. గౌడనహట్టి తాండా జనం భయపడి చూడసాగారు. ఏ ఒక్కరూ కిమ్మనలేదు. గౌడనహట్టి తాండాకు చెందిన విసళవత్ తెగ ముందు నిలబడి అన్నీ చేయసాగారు. మాంసం తినీ తిని కొవ్వెక్కిన దామ్లకు దెబ్బలు ఏమి తేడాగా అనిపించలేదు. అయితే అతను పైకి లేచి కుదుటపడి ఒక్కరినైనా కొట్టడానికి బలం పుంజుకోకుండా కొట్టసాగారు. తండా జనం అతను చెడ్డవాడు అయినప్పటికీ 'అయ్యో' అనే జాలి మాటలు నోటి నుంచి రాసాగాయి. కొట్టినట్టల్లా ఒళ్లు ఊపుతకదుములు కదుతోంది. ఎప్పుడైతే గోప్యా, అతని తమ్ముడు పెద్దరాయిని ఎత్తి ఎదమీద వేశారో, అప్పుడు దామ్ల చావు భయంతో కేక పెట్టి నేలకరిచాడు. అయినా అతన్ని కోలుకోనిస్తే ఏ ఒక్కరినీ అతను వదలడనే భయం రావటంతో ఊరి ముందున్న కళ్లంలో బోజ్యా నాయక్ సొప్పదంటు రాశికి నిప్పుపెట్టి ప్రాణాలతో సజీవంగా ఉన్న దామ్లను ఎనిమిది మంది అవలీలగా ఎత్తి నిప్పుల్లోకి విసిరారు. అతని గుడిసెకు నిప్పు పెట్టి పిల్లలను చంపి కేకలు వేసి పరుగెత్తుతుండగా కరమ్‌తోట్ తెగవారికి తెలిసి అందరూ అక్కడికి వచ్చే లోపున ఆ మొత్తం కుటుంబాన్ని ధ్వంసం చేశారు.

❖❖❖

5. చితికిన బతుకులు

వయసు మీరిన ధనసింగ్ తన కులం మీద జరిగిన దాడిని తన పిల్లలకు చెప్పలేని స్థితిలో ఉన్నాడు. అతని సోదర బంధువులంతా ఒకరి మాట ఒకరు వినకుండా పోయారు. 'ఆ రోజే నేను కూడా ఇక్కడి నుంచి వలసపోయి ఉంటే ఈ పాపిష్టి లంజా కొడుకు బతికేవాడేమో' అని బాధపడ్డాడు. పదిహేను రోజులపాటు మంచం పట్టాడు. ఈ విషయంతోపాటు అతడిని లోలోపల వేధిస్తున్నది రెండవ కొడుకు పరిస్థితి. నోట నాలుకలేని అమాయకుడు. వాడి భవిష్యత్తు ఏమిటి? ఏమైనాకానీ వాడిదంటూ ఒక జీవితం ఉంది. దాన్ని వాడు రూపొందించుకోవాలి. ఇలా ఆలోచించి...ఆలోచించి అతని బుర్ర వేడెక్కిపోయింది. ఈ పరిస్థితుల్లో తన కొడుకుకు ఎవరు పిల్లనిస్తారు? అనే తీవ్రమైన విచారంలో అప్పేనహళ్లి తండా వైపు బయలుదేరాడు. అతని సోదర సంబంధి దాష్ల హత్య జరిగిన చాలా రోజుల తర్వాత అతను బయటికి వచ్చాడు. ఆ రోజు అనుమానంతోనే బయలుదేరిన అతనికి అమ్‌గోత్ ఇంటివాడైన బద్యానాయక్ కనిపించాడు. అతను అప్పటికే బోయవీధికి సారాయి తీసుకునివెళుతు సగం సారాను మధ్య దారిలోనే అమ్మి, తాను కొంత తాగి కుప్పేనహళ్లి వైపు వెళుతూ కనిపించాడు. "హా రామ్ రామ్" అన్నాడు ధనసింగ్. రామ్ రామ్ స్వీకరించి లోకాభిరామాయణం మాట్లాడుతూ వస్తుండగా ఊరిచివరలో ఉన్న అతని ఇంటికి రమ్మని పిలిచాడు. "లేదులే, ఇప్పుడు కాదు. ఒక పని మీద బయలుదేరాను. ఇంకొొకసారి తప్పకుండా వస్తాను" అన్నాడు. "అయ్యో ధనసింగ్, ఇక్కడిదాకా వచ్చి అలాగే వెళ్లిపోతే బంధుత్వానికి ఏం విలువ ఇచ్చినట్టు? ఒకవేళ నీ మనసులో ఉన్న సమస్యకు మా ఇంట్లో జవాబు దొరకవచ్చు"

అన్నడు. బద్యానాయక్ మాటలు ధనసింగ్‌కు అర్థం కాలేదు. అయితే అతని ఇంటికి వెళ్లడానికి ధనసింగ్ నిర్ణయించుకున్నాడు.

అక్కడ బద్యా నాయక్ కూతురు ధనసింగ్‌కు నచ్చింది.

ధనసింగ్ ముందూవెనుకలూ ఆలోచించకుండా అమాయకుడైన తన కొడుకుకు ఈమె సరైనజోడి అని అంగీకారం తెలిపాడు. వారంలోపే బెల్లం శాస్త్రం చేద్దామని అన్నాడు. బద్యా నాయక్ కూడా అందుకు ఒప్పుకున్నాడు.

ధనసింగ్ తన తండాకు తిరిగివచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం సాయంత్రం గౌడరహట్టి నుంచి ఏడెనిమిది మంది కలిసి 'బెల్లం శాస్త్రం' నిర్వహించడానికి బయలుదేరాలని ధనసింగ్ స్వయంగా వెళ్లి తండా నాయకుడిని ఆహ్వానించాడు. బోతా నాయక్, ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ కులంలో జరిగిన భయంకరమైన హత్యకు సాక్షి. సాధ్యమైనంతగా ధనసింగ్ గురించి వ్యంగ్యంగా మాట్లాడాలని అనుకున్నవాడు, "అయ్యో దేవుడా, ఆ అమ్మాయి ఎవరికీ నచ్చని అమ్మాయి. ఆ అమ్మాయిని వద్దనుకున్నప్పుడు కనీసం అడవిలోనైనా వదిలి రాకూడదా? పోయి పోయి మీలాంటి వాళ్ళ ఇంటికి అమ్మాయిని ఇవ్వడానికి వచ్చాడుకదా ఆ చేతకాని వెధవ. లేదు ధనసింగ్, నేను రాలేను. మీలాంటి దొంగల, హంతకుల వెంట వస్తే మా మర్యాద మిగలదు" అని పుల్లవిరిచినట్టు మాట్లాడాడు. ధనసింగ్ బంధువు డావో సేణూనాయక్ విషయం తెలిసి నొచ్చుకున్నాడు. "అదికాదండి, ఆ రోజు నిండు సభలో మిమ్మల్ని ఊఁ అనమని మొత్తుకున్నాను. మీ గొప్పమనసు అంగీకరించలేదు. లేకపోతే ఆ వెధవ ఇలా మాట్లాడగలిగేవాడా? సరె, మనసులో పెట్టుకోకండి. ఏనుగు వెళుతున్నప్పుడు కుక్క మొరిగినట్లు అని అనుకోండి" అని అన్నాడు. తన వైపు నుంచి సేణూనాయక్ నలుగురి కూడగట్టాడు. ధనసింగ్ వైపు నుంచి ఏడెనిమిది మంది బయలుదేరారు. కుప్పేనహల్లి చేరేసరికి సాయంత్రమైంది. పద్ధతి ప్రకారం ధనసింగ్ కల్లు కుండలు తెప్పించాడు. భట్టి సారాయి అడిగినవారికి దాన్నీ ఏర్పాటు చేశాడు. గూడ్లిబాయిని తన రెండవ కొడుకు పంపానాయక్‌కు తెచ్చుకొనే మాటలు ముగించి, గౌడరహట్టిలో ఉన్న అచ్యుత భట్టు దగ్గర ఆడిగి ఒక నెలలోనే ఉన్న ముహూర్తాన్ని నిర్ణయించి తెలియజేస్తామని చెప్పి, రాత్రి భోజనాల తర్వాత బయలుదేరారు. సీత్కిబాయికి తన రెండవ కొడుకు పంపానాయక్ పెళ్లి విషయంగా చాలా కాలంగా బాధపడుతూవుంది. ఒకటి తెలిస్తే మరొకటి తెలియని అమాయకుడైన తన కొడుకు జీవితాన్ని ఎలా సాగిస్తాడోననే భయం వాళ్ల మనసులో గూడుకట్టుకుని ఉంది. అమ్‌గోత్ ఇంటి అమ్మాయి గూడ్లిబాయి చాలా జబర్దస్తుగా

ఉంది. ఆ అమ్మాయి తన కొడుకుకు ఆమె సరైన జోడి అనీ, బుద్ధిమంతుంతురాలనీ, సంసారాన్ని నిభాయించుకుని పోతుందనే నమ్మకంతో భట్టుగారి దగ్గర ముహూర్తం చూపించడానికి బండి కట్టారు.

దీపావళి మరుసటి రోజున మంచి లగ్నం ఉందని భట్టు అనుమతిచ్చారు. దీపావళికి ఇంకా ఒకటిన్నర నెల ఉంది. పెళ్లి ఏర్పాట్లు తొందరగా చేయాలి. ఖేము నాయక్‌కు ఐదుమంది మగ పిల్లలు, ఒక ఆడపిల్ల. ఆ మతిహీనుడికి పెళ్లి ఎందుకు అనుకొన్నారు? అయితే తల్లిదండ్రులు అతనికీ ఒక జీవితం అవసరమనుకున్నారు. అతని వంశం కూడా పెరగాలి. అందువల్ల అతనికి పెళ్లి అనివార్యమని గుర్తించారు. ధనసింగ్ తన వృద్ధాప్యంలో పెళ్లి పనులు ఉత్సాహంతో చేస్తున్నాడు. వియ్యంకులను పిలవడం, ఇంటికి కావలసిన సరుకులు, బట్టలు పాత్రలు అన్ని సిద్ధమవుతున్నాయి. కూతురి పెళ్లి చేసేటప్పుడు అంతగా తల పాడుచేసుకోలేదు. అయితే అమాయకుడైన పంపానాయక్ పెళ్లి ఆర్భాటంగా చేయాలని నిర్ణయించుకున్నాడు. పానగల్ మొదలు చిక్క జోగి, గోవింద గిరి, బండే బసాపురం మొదలైన ప్రాంతాలలో నివాసం ఏర్పరుచుకున్న కరమ్‌తోట్ సోదరులను స్వయంగా వెళ్లి ఆహ్వానించి వచ్చాడు. పెళ్లిపత్రికల వ్యవహారం పట్టణాల్లో, నగరాల్లో జరుగుతుండవచ్చు. ఆయితే తండాలో కేవలం పిలిస్తే జనం వచ్చేసేవారు. దూరపు బంధువులకు పిలవడానికి యువకులను పంపాడు. పెళ్లిఏర్పాట్లు ముగిసాయి.

కూడ్లిగి చందుశేఠ్ అంగడి లంబాడీల పెండ్లి బట్టలకు పెద్ద అడ్డా. చందు సేట్ మార్వాడి భాషకు దగ్గరగా ఉన్న గోర్‌బోలి అస్పష్టంగా మాట్లాడగలడు. పదిబండ్లు సాడీ మోరియా(పెళ్లి బట్టలు) తీసుకు రావడానికి వెళ్లి అంగడి ముందు నిలబడ్డాయి. అది చూడగానే, “ధనసింగ్ బాపు, రామ్ రామ్ ఘరేమె సే వారుఛక” (ఇంట్లో అందరూ క్షేమంగా ఉన్నారా) అని అడిగి, “నాన్య బేటార వీయచ్” (చిన్న కొడుకు పెళ్లి) ఫాటు గోడికోటవాల అవె. నాన్య నోవ సామనబ్యావతో దోణ” (వారికి సామాన్లు ఇవ్వండి) అని అన్నాడు. “హాం వేగగొదె వూచూ” (అలాగే ఇస్తాను) అంటూ పనికుర్రవాడు లోపలికి వెళ్ళాడు. ధనసింగ్, హనుమానాయక్ మరియు కూతురు టోలి పెళ్లిలో పొందినంత సంతోషాన్ని పొందాడు. పంపానాయక్‌కు ఒక పట్టు ధోవతి, ఒకట్రెండు మామూలు ధోవతులను, అంగీ, ఒక చక్కటి తువ్వాలు, చెప్పులు కొన్నారు. కోడలికి మార్వాడి అంగడిలోనే పెళ్లిదుస్తులు కొన్నారు. తర్వాత కొత్త చెప్పులు తీసుకొన్నారు. అటుతర్వాత జాగ్రత్తగా అన్నిటినీ మూటలు కట్టించి బండికి ఎక్కించారు. గుడెకోట చెరువుదాటి తండాకు వచ్చినప్పుడువు అప్పటికే

అర్ధరాత్రి అయింది. జనం గాఢసనిద్రలో ఉన్నారు. ఖేమునాయక్ భార్య రేమణి. వారి చిన్న కొడుకు, గోమ్లు, "అమ్మ కడుపు నొస్తుంది" అని గబగబా లేచి రెండుకు కూర్చోడానికి పరుగెత్తాడు. రేమణి వాడి వెనుకే చేతిలో లాంతరు పట్టుకొని పెరటి మూలకు వచ్చింది. దూరంలో బండి చప్పుడు విని, గోమ్లును వాడి 'పని' పూర్తి చేయనివ్వకుండా ముడ్డి కడిగి, లాక్కొని వచ్చింది. "ఇంకా పూర్తిగా కాలేదమ్మా, ఇంకా కూర్చోవాలి" అన్నాడు వాడు. బండ్లు ఊరివాకిలి నుంచి ఊళ్లోకి ప్రవేశిస్తున్నట్టే 'అవ్వా' అని పరిగెత్తాడు.

మరుసటి రోజు ఉదయం ఒక బండి గుడెకోట రాంభట్టు తోటవైపు బయలుదేరింది. "ఒరేయ్ నాలుగు కాయలు తీసుకురావడం మరువకు. జాగ్రత్త, ఎక్కడ నేలకు తగలకూడదు" అని హెచ్చరించాడు ధనసింగ్. "అలాగే పెదనాన్న. మీరు చెప్పినట్టు తీసుకొని వస్తాను" అని సాణునాయక్ ఒప్పుకున్నాడు. అతని వెనుక దకణ కూడా బయలుదేరాడు. "తొందరగా రండ్రా, కాయ లేకపోతే పందిరి నిలబెట్టడానికి రాదు" అనుకుంటూ ఎవరో వచ్చినట్టు అనిపించి వారి వైపు నడిచాడు. మావిడాకులు తీసుకొని రావడానికి ఇద్దరు ముగ్గురు కుర్రవాళ్లు పరిగెత్తారు. పూలు, జిల్లేడు, ఆకులు, మామిడి ఆకులు, తీసుకుని రమ్మని చెప్పటం మరువలేదు. ప్రతి కార్యానికి ప్రకృతిలోని ఒక్కో వస్తువును ఉపయోగించవలసి వస్తుంది. అడవి పక్కనే ఉండడం వల్ల దేనికోసమూ వెతుక్కునే పరిస్థితి రాలేదు. అందువల్ల పన్నెండు గంటల సమయానికి ధనసింగ్ ఇంటి ముందు ఒక పెద్ద పందిరి నిలిచింది. తండా నాయకుడు, కారభారి ఇద్దరు తప్ప, గుడెకోట తండాలోని వృద్ధులు, నడివయసు యువకులు పందిరిలో ఉన్నారు. కబుర్లు చెప్పుకుంటూ పెళ్లి కార్యక్రమాలకు సాక్షులయ్యారు. నూరేళ్ల పిక్లానాయక్ ధీటుగా కూర్చోని తన భాషలో అన్ని శాస్త్రాల గురించి సమాచారం చెబుతున్నాడు. వందేళ్ల రామవ్వ కూడా పంపానాయక్‌ను పెండ్లికొడుకును చేయడంలో సహాయం చేసింది.

మైదాపిండిని ఒంటికి పూసిన తర్వాత, అతని మామ దేవ్లనాయక్ అతని వెనకే నిలిచి, అన్ని కార్యక్రమాలను అతనే చేయడానికి ముందుకొచ్చాడు.

"కాలికి చెప్పులు లేకుండా బయటకు వెళ్లకూడదు నాయనా. లేత ఒళ్ళు కావడంవల్ల దుష్ట శక్తులు ఒంట్లోకి ప్రవేశిస్తాయి. ఒకటి మీ నాన్న చెప్పులయినా వేసుకో లేదా నీ చెప్పులైన వేసుకుని బయటికి వెళ్లాలి. మరీ అత్యవసరం అయితే మీ మామకు చెప్పు" అని సీత్కి కొడుకు చెప్పింది.

"వాడేమైనా చిన్నవాడా? ఎప్పుడో పెళ్లి జరగవలసింది. పెళ్ళి చేసివుంటే

ఇప్పటికే ఐదు మంది పిల్లల తండ్రి అయ్యేవాడు" అన్ని జీవనాయక్ తమాషా చేశాడు.

"కావాలంటే నువ్వే ఇంకొక పెళ్లిచేసుకో, లేదా నాలుగైదు పెళ్ళిళ్లు చేసుకోపో. ఎక్కువగా మాట్లాడితే నేను అంతా తీసేస్తాను చూడు" అని పంపానాయక్ బెదిరించాడు.

"రేయ్ పంపా, ఊరికే తమాషా చేశానురా" అని దేవల నాయక్ నచ్చజెప్పాడు.

బయట ఆడవాళ్ల గుంపు తమకు రావలసిన ఆకువక్కల కోసమ, "ఆ c ఎక్కడ పెళ్లికొడుకు, అందరు పక్కకు జరగండి, పెళ్లికొడుకుని బయటికి తీసుకు పోవాలి. వీరెందుకు ఇక్కడ గంటుపడ్డారు" అని వృద్ధురాలైన సామ్కిబాయి అంటూ చిన్న పిల్లలు బయటికి తరిమింది. కర్రస్తంభానికి కంబళి కట్టి రెడీ చేశారు. పందిరిలో నిలబడిన పెళ్లి కొడుకు పంపానాయక్‌ను పాటలు పాడుతూ పిలుచుకొచ్చిన స్త్రీలు తూర్పు ముఖంగా కూర్చోబెట్టి, వెళ్లి తమ స్థలంలో నిలబడ్డారు. ధనసింగ్ పెదనాన్న కొడుకు ధూప్లానాయక్ పీకలదాకా తాగి ఈ కార్యక్రమానికి అడ్డుపడుతున్నారు. ధనసింగ్ మంచి మాటలతో అతన్ని ఊరుకో పెట్టడానికి చూశాడు. అయితే ఆ మనిషి ధనసింగ్ మాటలకు ఏ మాత్రం విలువ ఇవ్వకుండా గొడవ చేస్తున్నాడు. తమ పూర్వీకులు కాపాడుకుంటు వచ్చిన లంబాడీ సంస్కృతి ఇలా తాగినవాళ్ల చేతికి చిక్కి నాశనం అవుతుండటం చూసి బాధ కలిగింది. "భార్యల సంపాదన తింటున్న లంజకొడుకులు సమాజాన్నే పాడు చేస్తున్నారు. ఏమి చేయాలో చెప్పు" అని తండా పెద్ద రూప్లానాయక్ తన మనసులోని మాటను చాలా కాలం తర్వాత ధనసింగ్ ముందు బయట పెట్టాడు. "పెద్దవాళ్లని కాదు. చిన్నవాళ్లని కాదు. అందరూ ఇలాగే తయారు అవుతున్నారు. వీళ్లను భగవంతుడే కాపాడాలి" తన మనసులో గూడుకట్టుకున్న బాధను బయటపెట్టాడు.

ధూప్లానాయక్ మాత్రం, "రేయ్ పనికిమాలిన వెధవల్లారా, ఏమనుకున్నార్రా? మీ తాత మోసం చేశాడు. మాకు ఏమీ ఇవ్వకుండా. మొత్తం ఇంటిని వేసుకున్నాడు. ఇప్పుడు ఏమైంది? ఈ పంపా సగం పిచ్చివాడు. అతనికి పెళ్లి చేస్తున్నాడు. ఏయ్ ధనసింగ్‌నాయక్, రారా పంచాయితీ చెయ్. ఓహో ఇతరులకు మాత్రం తీయగా మాట్లాడి న్యాయం ఇప్పిస్తావా? మాకు మోసం చేస్తారా? ఏయ్ పెళ్లి ఆపండి" ఒంటిమీద పూర్తిగా నియంత్రణ పోగొట్టుకున్నాడు. నలుగురు పట్టుకొని కూర్చోబెట్టడానికి ప్రయత్నించినా వినకుండా విదిల్చుకునిపోయి హీనమైన శబ్దాలతో తిట్టసాగాడు. ఎవరో ఆపబోతే వాళ్లను తోశాడు. అతను

తాగినప్పుడు తనను పట్టుకోలేనంతగా ఇబ్బందులు పెట్టడంతో అతని జోలికి ఎవరు వెళ్లే వాళ్లు కాదు. ఎందుకు బురదలో రాయి వేసి ముఖం మీద చిట్టించుకోవాలి అని అందరూ అనుకునేవారు. లేదా అతనితో పోట్లాడాలి. లేదా మాటకు మాట అనాలి. ఒకరిమీదొకరు పడి కొట్టుకుని ఏం ప్రయోజనం? అని జనం మౌనంగా దూరంగా వెళ్లి పోయేవారు. ధూప్లా హింస ఎక్కువైంది. అతని మీదికి దూకి కింద పడవేసి అతని మీద కూర్చొని కొడుతున్నవాడిని జనం బలవంతంగానే లేపారు. కిందపడి ఏమో తిట్టుకుంటున్న ధూప్లా, కొట్టిన వ్యక్తిని వదిలి విడిపించిన వాడి చేతిని పట్టుకున్నాడు. "రేయ్ చెయ్యి వదులు దూప్లా. మంచి మాటలతో చెబుతున్నాను. లేకపోతే నీ కాళ్లు చేతులు విరిచేస్తాను" గట్టిగా అరుస్తూ బెదిరించడానికి చూశాడు. "ఏం చూస్తావురా. నన్ను చంపేస్తావా, నేనంటే అంత పనికిమాలిన వాడిలా కనిపిస్తున్నానా? నువ్వెందుకు అతని విడిపించవు? ముందు జవాబు చెప్పు" అని మాట్లాడుతూ తూలి కూర్చున్న ఎవరి మీదనో పడ్డాడు. ఎవరి మీద పడ్డాడో అతను పట్టుకొని నాలుగు వాయించాడు. అక్కడే మొదలైంది కొట్లాట. అతను పట్టుకొని పిచ్చిగా వాయించాడు. తాగుబోతు ధూప్లా దుమ్ము దులిపారు. దెబ్బలు తిని చచ్చినవాడిలా పడిపోయాడు. పెళ్లికి వచ్చిన వందలాది మందికి సంకోచం, అసహనంగా అనిపించింది. అయినా తమ కులాల పెళ్లిలో ఇలాంటివి ఉంటేనే బాగుంటాయని కొందరి అభిప్రాయం కూడా.

తాగుబోతు స్పృహ వచ్చేవరకూ ఊరకే పడివున్నాడు. మెలుకువ రాగానే లేచి నేరుగా వెళ్లి నిలబడ్డాడు. పందిరి మధ్యలో నిలిపిన స్తంభాన్ని లాగి పడేసాడు. "లంజా కొడకల్లారా, సగం పిచ్చివాడి పెళ్లి చేస్తారా? ఎలా చేస్తారు? ఆపండి" అని. తిట్టసాగాడు. అక్కడ ఉన్న జనం నివ్వెరపోయి జరిగిపోయిన అశుభాన్ని చూసి కంగారుపడ్డారు. "ఎవడు వాడు, పట్టుకొని బయటికి తోయండి. ఎంత అపశకునం? జరగకూడనిది జరిగిపోయిందికదా!" అని డావో పరితపించసాగాడు. తమ సంప్రదాయంలో పందిరి స్తంభానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. దాన్ని ఇతను కిందపడవేశాడంటే, పిల్లవాడి జీవితం బాగుండదు. ధనసింగ్ స్తంభం కింద పడుతుండగా చూసి కుంగిపోయాడు. నేలకూలబడ్డాడు. చాలా సంతోషంగా జరుగుతున్న పెళ్లిలో ఎంతటి అనాహూతం జరిగిపోయింది కదా అనే కలవరంతో నియంత్రణను పోగొట్టుకున్నాడు."ఏమీ తెలియని నా కొడుకు బతుకును పాడు చేశావుకదారా లంజకొడకా. మేము నీకు ఏమైనా అపకారం చేశామా? ఏమి చెయ్యాలి దేవుడా ఇప్పుడు ఏం చేయాలి?" అని ధనసింగ్ కంటతడిపెట్టాడు. అది

చూసి అతని భార్య రోదించసాగింది. జనం ఒకవైపు అతన్ని, మరో వైపు అతనిభార్యను ఓదార్చసాగారు. పంపానాయక్ కూడా గాభరాపడ్డాడు. మొత్తం గుడెకోట తాండ జనం ఎంతటి అనాహతం జరిగిపోయింది కదా అనుకుంది. విషయం కార్చిచ్చులా వ్యాపించింది. తండా నాయకుడు, కారభారి "మహాపండితుడిలా మాట్లాడేవాడు. ఇప్పుడు బాగా అయింది చూడు. ఏమి చేస్తాడో తమాషా చూద్దాం. అంతే" అని తండా నాయకుడు కారభారితో అన్నాడు. దూరం నుంచి వచ్చిన బంధువులంతా కలిసి "చూడండి ముట్టకుండా ఉండాల్సింది. అయితే వాడు తాగిన మత్తులో చేయకూడనిది చేసి పోయాడు లంజకొడుకు. బంజారాల పెళ్లిలో పందిరి చాలా ముఖ్యం. అది తల మీద కలశం ఉన్నట్టు. భార్యాభర్తల సంబంధానికి, వారి కలిసి బ్రతకడానికి సూచనలా ఉంటుంది. అయితే తాగిన మత్తులో ధూప్లా భుక్యా కరమ్‌తోట్, తన సోదర సంబంధి అయిన పంపానాయక్ సగం పిచ్చివాడని నలుగురిలో నిందమోపి, అతని బ్రతుకు నాశనం చేయాలని చెప్పాడో లేదా ధనసింగ్ మీద కోపంతో చెప్పాడో మొత్తానికి జరగకూడని ఘటన జరిగిపోయింది. అక్కడున్న వారి మనసులో సూక్ష్మంగా కొన్ని విషయాలు వేధించసాగాయి. "పాపం పంపా నాయక్ బ్రతుకు బాగుపడదు. అసలే అతను సున్నితమైన మనిషి. అయ్యో దేవుడా ఎంతపని చేశావు. ఎవరి పిల్లలకు ఇలాంటివి జరగకూడదు" అని స్వయంగా తండా నాయకుడు అన్నాడు. ధూప్లాను లాక్కొని పోయిన ఖేము నాయక్, మరో నలుగురు బాగా కొట్టి, మత్తు దిగడానికి స్తంభానికి కట్టి చల్లని నీళ్లు పోశారు.

మొత్తం ఊరే ఆ సంఘటన వల్ల దిగ్భ్రాంతికి గురయింది. ఎవరి నోట విన్నా పంపనాయక్ గురించే. మూల మూలలో, సందు సందులలో ఆడవాళ్ళు, "విన్నావేమమ్మా, పాపం ఆ పంపా నాయక్ జీవితం బాగుండాలని వాళ్ళ నాన్న ధరసింగ్ పెళ్లి చేయడానికి ప్రయత్నించాడు. పెళ్లి పందిరిని ధూప్లా కిందికి పడదోశాడు. ఏ చెడు కాచుకుని ఉందో ఆ ఇంటికి? ధూప్లా ఎవరికి జోలికి పోయేవాడు కాడక్కా"–ఇలాంటి మాటలు అక్కడ అక్కడ తీవ్రంగా సాగాయి. ఇది ఇలాగే సాగితే మాటలకు రంగులు పూస్తారని భావించిన డావో సేణునాయక్ ఆలోచించి– "ధనసింగ్ పైకి లెయ్, ఏమి జరగలేదనుకో. నీవే ఇలా నిరాశగా కూర్చుంటే పెళ్లి ఆగిపోతుంది. ధూప్లా ఏమైనా స్పృహలో ఉండి చేశాడా? లేదు. బాగా తాగి స్పృహలో లేకుండా ఏమో చేయడానికి పోయి ఏదో జరిగింది. అలాంటివన్నీ మనసులో పెట్టుకోవద్దు. జరిగిపోయింది జరిగిపోయింది. దీనికి పరిష్కారం ఉందేమో చూద్దాం. ఏదో ఒకటి ఉండే ఉంటుంది" అని ధైర్యం నింపాడు. ధనసింగ్

కుంగిపోయాడు. అతని నోటి నుంచి మాటలే రాకుండాపోయాయి. బాధలోనూ పైకి లేచి సేవాభాయ్ మీద భారం వేసి, చేతిసైగ చేసి ఎద్దులబండి కట్టించి పెళ్లి కొడుకును బయటికి పిలుచుకొని రమ్మన్నాడు. కేవలం నాలుగు మైళ్ల దూరంలోని అప్పేనహళ్లి తండాకు ఇక్కడ జరిగిన సంఘటన చేరింది. బద్యానాయక కూతురు గూడ్లిబాయి పెళ్లి గురించి ఆలోచించాడు. చాలామంది అమ్‌గోత్ కులం వారంతా కలిసి బద్యానాయక్‌ను ఈ పెళ్లి ఆపమని హెచ్చరించారు. "కాకా! నువ్వు ఏమాలోచిస్తున్నావ్? మన సమాజంలో పెళ్లిపందిరి చాలా ముఖ్యం. పెళ్ళికొడుకు పెళ్లి ముగించి తిరిగి వచ్చేంతవరకు దాన్ని ఎవరూ ముట్టకూడదనే నియమముంది. మన సంప్రదాయం ప్రకారం పందిరి పడిపోతే, ఎవరైనా పడదోస్తే అపశకునం అంటారు. అమ్మాయి జీవితం బాగుండదు. మగపెళ్లివారు కొద్దిసేపట్లో బయలుదేరి వస్తున్నట్టు తెలిసింది" అని అతని పెదనాన్న కొడుకు రాముదు చెప్పాడు. బద్యానాయక్ మాట్లాడడం అవసరం అనిపించి, "పెళ్లి ఆపటం చాలా సులభం. ఒక మనిషిని పంపి రావద్దు అని చెప్తే ముగిసిపోతుంది. అయితే రేపు నా కూతురు గతి ఏమిటి? కుండా నోటిని మూయవచ్చు. అయితే జనం నోటిని మూయటం సాధ్యమా? ఇందులో ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ తప్పు ఏమిటి? చెప్పండి అతని చేసిన తప్పు ఏమిటి? మాట్లాడండి" అని తన కులస్థుల ముఖాలు చూశాడు. వాళ్ళలో ఒకడు– "ఏమైనప్పటికీ ఇది మన వంశపు ప్రశ్న. మన కులమర్యాదను నీవు ఇష్టం వచ్చినట్లు పాడుచేయడానికి మేము ఒప్పుకోము" అంటూ అంగిచేతులు మడిచి రౌడీలా మీదికి వచ్చాడు. "ఏం చేస్తావ్? అమ్మాయి తండ్రినని ఊరుకుంటున్నాను. ఎవడో తాగుబోతు వెధవ ఏదో చేస్తే అందులో పిల్లవాడి తప్పేముంది. రేపు ఉదయం పెళ్లి జరుగుతుంది అంతే" అని పుల్ల విరిచినట్లు జవాబిచ్చాడు. కొందరు కాస్త ఆలోచించి, "సరే నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో. అయితే ఏ కార్యానికీ మేము రాము" అని లేచి వెళ్లిపోయారు.

"పెదనాన్నా, పెళ్లికొడుకువైపు వాళ్లు సేవాభాయ్, మరియమ్మ గుడుల దగ్గరికి వచ్చేశారట. తండా నాయకుడు చాప, నీళ్లు ఇవ్వాలా వద్దా అని అడిగారు" అన్నాడు. "ఓయ్, నాయకుడి ఇంటివాళ్లు ఏమైనా కొత్త పద్ధతిని పెట్టారా? వెళ్లి కుర్రవాడిని కూర్చోబెట్టే ఏర్పాట్లు చేయండి. వెళ్లండి వెంటనే." అని బయటికి వచ్చి ఇంటివైపు కదిలాడు. అతని మూడవ తమ్ముడు చాప్లనాయక్ పెళ్లికొడుకు వైపు వారికి భోజనం ఏర్పాట్లు సిద్ధం చేశాడు. వాళ్ల పశువులను బాగా మేపి, పాలు పిండి, వెన్న కాచి పెట్టారు. పెద్ద కుండ నెయ్యి తెప్పించాడు. పెద్ద తపేలాలో పాలు కాచి పెట్టారు. ఒకవైపు సన్నబియ్యం అన్నం. ఉల్లిపాయల తొక్కు. వియ్యంకులను

వైభవంగా ఆహ్వానించే అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఇరువైపులా అమ్మాయిలు తల్లి, చెల్లెలు, వదిన, అన్న, తమ్ముడు–ఇలా అందరినీ పాటల్లో తిట్టి దీవించిన తర్వాత పెళ్ళికొడుకును పెళ్ళికూతురి ఇంటి ముందుకు పిలుచుకొని రావడం జరిగింది. శాస్త్ర ప్రకారం ఆడపెళ్ళివారు ఆహానించిన తర్వాత, చాప్ల నాయక్ ఇంటికి భోజనానికి లేచారు. పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు మిగిలారు. వారికి ఒకే కంచంలో భోజనం పంపాడు చాప్లనాయక్. వియ్యంకుల తర్వాత ఊరి ప్రముఖులను పిలిచి భోజనం పెట్టడం జరిగింది. ఒకే పిలుపుకు పెద్దవాళ్ళు 'సరే పదండి' అని పడుకున్నవారు లేచి వచ్చి భోజనం చేసి, వంట చేయించిన చాప్లను పొగిడారు.

పందిరిలోకి వచ్చిన జనం ఈత చాపలు, గోనెపట్టాలు వేసుకొన్నారు. తువ్వాళ్లను కొందరు లాక్కుని కింద పరుచుకుంటే, మరికొందరు శాలువాలనే దుప్పట్లుగా మార్చుకున్నారు. దీపావళి కావడం వల్ల చల్లటి గాలి వీస్తూ ఉంది. గాలి దెబ్బకు జనం కాళ్లు మడుచుకుని కడుపులోకి దూర్చుకొని దుప్పటి కప్పుకొని పడుకొన్నారు. రాత్రి గడిపి ఉదయం కార్యక్రమానికి సిద్ధమయ్యే తొందరవల్ల నిద్రలోకి వెంటనే జారుకున్నారు.

పెళ్లి కార్యక్రమాలు వారం రోజులు జరగడంతో చాలామంది ఉదయమే వెళ్లిపోయారు. రోజుకు ఒక కార్యం ముగిసి 'తాంగడి' (ఊరేగింపు) పంపాలి. ఉన్నట్టుండి తాగి ఒంటిమీద స్పృహలేని ధూప్లానాయక్ ప్రత్యక్షమయ్యాడు. "ఏమిటి ఈ వెధవ నా కొడుకు వెనకపడ్డాడుకదా, ఏమిటి వీడి ఉద్దేశం?" అని ధనసింగ్ ఆలోచనలో పడ్డాడు. అప్పటికే గూడ్లిబాయి అన్నలు హఠాత్తుగా ధూప్లాను ఎత్తుకొని పోయి బాగా కొట్టారు. తాగిన నిషాలో ఉన్న అతన్ని ఎవరో కొట్టకూడని చోట కొట్టడంతో అతను ఆఖరి శ్వాస పీల్చాడు. అప్పేనహల్లి తండా జనం గాభరా పడ్డారు. "ఒరేయ్ ఎవరైనా ఇతన్ని ఎత్తుకొని పోయి అతని తండాలో పారేసి రండి" అన్నారు. మరికొందరు "హాస్పిటల్లోనైనా చేర్చండి. బళ్లారికి తీసుకొనిపోండి" అన్నారు. అతను చచ్చాడో, బ్రతికాడో తెలియకుండా పోయింది. ధనసింగ్ భుక్యానాయక్ తన చివరి కాలంలో చూడకూడనివి చూసే పరిస్థితి వచ్చింది. పరిస్థితి చేజారి పోతున్నట్టు అనిపించింది. మనసు దృఢపరుచుకున్నాడు. మొత్తం చుట్టుపక్కలున్న న్యాయ పంచాయతీలో ధనసింగ్ మాటలే అంతిమ నిర్ణయంగా ఉండేవి. నలుగురి వెనక తిరిగి తన అవగాహనను పెంచుకున్నాడు. అనేక సంఘటనలు అతని ఎదుట ఘటించి పోయాయి. ఇంకా కొన్నింటికి ఇతనే కార్యకర్త. అయితే తన అమాయకుడైన కొడుకు పంపానాయక్‌కు జరిగిన అన్యాయం చూడలేక మనసులో మధనపడ

సాగాడు. పెద్దవయసులో చూసిన సంఘటనలను జీర్ణించుకోవడానికి భయం వేయసాగింది.

ధనసింగ్‌కు పెద్ద షాక్ అయ్యింది. తన కొడుకు పంపా భుక్యా కరమ్‌తోట్, కోడలు గూడ్లిబాయి, ఆమె అన్నదమ్ములు పశ్చిమానికి వలస పోవడానికి నిర్ణయించుకుని పెళ్లిలో ఇచ్చిన 'దేజువా' అంతా ఆమె తండ్రి నుంచి తీసుకొని ఎద్దుల బండి మీద ఎక్కించింది. ఒకటి తెలిస్తే ఇంకోటి తెలియని అమాయకుడైన పంపాను తండాను నుంచి వేరు చేసే ప్రయత్నం జరుగుతోందని సీత్కి గుండెలు బాదుకుని ఏడవసాగింది. ఖేమానాయక్‌కు ఏమి చేయడానికి తోచక మౌనం వహించాడు ధనసింగ్ పరిస్థితులను అర్థం చేసుకోక అయోమయంలో పడ్డాడు. పెళ్లిలో జరిగిన సంఘటన తర్వాత పంపానాయక్ ఈ ప్రదేశంలో నివసించం క్షేమం కాదని అనిపించింది. పెళ్లి జరిగిపోయింది. గూడ్లిబాయి ఎలాంటి పిల్లనో, ఎక్కడైనా మంచి జీవితాన్ని రూపొందించుకుంటే చాలని అనుకున్నాడు. అతని భార్య "ఒసేయ్ మంత్రగత్తె, ఏమీ తెలియని నా కొడుకును ఏమి మాయ చేశావే? నా వెనుక 'అమ్మా, అమ్మా' అంటూ తిరుగుతున్నవాడు నీ మాటలు విని వలస పోతున్నాడు. నీవు బాగుపడవు" అని శాపం పెట్టింది. పెళ్లి ఊరేగింపు గుడెకోటకు వెళ్లవలసింది వెళ్లనే లేదు. గూడ్లిబాయి చిన్నాన్న కొడుకు సాధునాయక్, ఆమె ఇద్దరు అన్నలు గుర్యానాయక్ , పోత్లానాయక్‌లు సంసార సమేతంగా బయలుదేరారు. వారికి అడవి అంటే భయం ఉన్నప్పటికీ, ఆ లంజా కొడుకు ధూప్లానాయక్‌ను కొట్టడం, అదీ పొరపాటున పడరానిచోట దెబ్బపడటంతో పోలీస్ కేస్ అవుతుందేమోననే భయంతో ఊరు వదలి బయలుదేరారు.

కొంతమంది వద్దన్నారు. కొందరు ఈ పాడు కొంపలో ఏముంది వెళ్లండి అన్నారు. మొత్తానికి ధనసింగ్‌కు మంచం పట్టడం ఒక కారణం అవసరమైంది. పంపానాయక్ భవిష్యత్తు గురించి ఆలోచించి మంచం పట్టాడు. ఖేమనాయక్ పిల్లలు ఇంటి నిండా 'తాత..తాత..' అంటూ అతని వెనకే తిరిగేవారు. అయినా అతన్ని పంపా గురించిన చింతనే తీవ్రంగా వేధించేది. తూర్పు వైపు ప్రయాణమైన వారిలో మొదటివారు పంపా-గూడ్లిబాయిలు. అడవిదారిలో సాగి అడవి మధ్యలో విడిది చేశారు. మళ్లీ ఉదయం కొట్టూరు మీదుగా బెణ్ణిహళ్లి, జిహటేరి, తర్వాత హరపనహళ్లి కొండల దగ్గర ఆగి, కొద్ది సేపు విశ్రాంతి తీసుకొని మళ్లీ ప్రయాణం కొనసాగించారు. హలవాగలు క్రాస్ దాటి, చిరస్తళ్లి, అలగిలవాడ, తెలిగి, దాటి వలస వచ్చిన వాళ్లంతా అక్కడ విడిపోయారు. పంప, గూడ్లిబాయిలు బండిగేరి

తండా వైపు బయలుదేరితే; గూడ్లిబాయి చిన్నాన్న కొడుకు సాధునాయక్ మరికొందరు "లేదు మామ, మీతో ఉండవచ్చు. ఎందుకో మనస్సు లేదు. మేము ముందుకు పోతాం" అన్నాడు. "అన్నా, మాకు ముందూ వెనుకా ఎవరైనా ఉన్నారా? మనమంతా ఒకే తండాలో ఎందుకు ఉండకూడదు?" అని అడిగింది. "లేదమ్మా ఈ రోజు ఉన్న ప్రేమ రేపు ఉండకపోవచ్చు. రేపు ఏమైనా పరిస్థితులవల్ల లేనిపోనివి జరిగితే అప్పుడు నిష్ఠూరాలు ఏర్పడితే ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవడం కష్టం. ఈ రోజే దూరంగా ఉంటే మన సంబంధాలు గట్టిగా ఉంటాయి" అని నచ్చజెప్పి అక్కడినుంచి తన గుంపుతో ముందుకు సాగాడు. దిక్కు లేనట్టు పంపానాయక్, గూడ్లిబాయిలు బండిగేరి తండా వైపు బయలుదేరారు.

సాధునాయక్ తెలిగె దాటి ముందున్న దుగ్గత్తి, కురుబరహళ్లి, కర్లళ్లి గంగరసి క్రాస్ దాటి హరిహర చేరాడు. అక్కడ కూడా నిలువలేక, మళ్లీ తూర్పువైపు బయలుదేరి అడవి చేరాడు. పంపానాయక్ మాత్రం బండిగేరి తండానాయకుడు రామ జాపాను కలిసి, "మహారాజ్ ! మేము తూర్పు దిక్కు తండా నుంచి వచ్చిన బంజారాలం. మీరు మా మీద కాస్త దయ చూపితే ఇక్కడే మీ తండాలో బతుకుతాం" అని అతని జవాబు కోసం ఎదురుచూశాడు. "రోజుకు వంద మంది ఇలా వస్తుంటారు. వచ్చేవారు వస్తుంటారు. పోయేవారు పోతుంటారు. తమ్ముడా, నీ పేరు ఏమన్నావ్?" అని అడిగాడు. "పంపాధనసింగ్ భుక్యాకరమ్‌తోట్" అన్నాడు. "పంపా, చూడప్పా నువ్వు మంచివాడిలో కనిపిస్తున్నావు. మా లంబాడి ఇతరులతో కలిసి ఉండరు. మా తండాల సంస్కృతి, ఆచరణలు భిన్నం. మా దేవుడు వేరు. ఇదంతా అర్థం చేసుకుని, మనరి అన్నతమ్ముళ్ల మాదిరి కలిసి మెలిసి ఉండాలి. దూరం నుంచి వచ్చావు. మా గిరిజనాయక్ ఇంటి పక్కన స్థలం ఉంది. వెళ్లి నీకు కావలసినంత స్థలంలో ఇల్లు కట్టుకో" అని అన్నాడు. పంపానాయక్ ఆయనకు నమస్కారం చేసి పరిగెత్తాడు.

ఎద్దుల బండిలో తీసుకొచ్చిన సామానులను దింపుకొని తలమీద చూరు వుండేలా చిన్న గుడిసె వేసుకున్నాడు.

ఇక్కడ అతని తండ్రి ధనసింగ్ ముసలి వయసులో పిల్లవాడిలా ఏడుస్తున్నాడు. ఏమీ తెలియని అమాయకుడు ఈ ప్రపంచంలో ఎలా బతుకుతాడో అని ధనసింగ్ ఆలోచన. తమ కళ్ల ముందు తిరుగుతున్న అమాయకుడైన కొడుకును తలుచుకొని తల్లిదండ్రులు ఇద్దరు రోదించసాగారు. "వాడు వెళ్లటమే మంచిది. ఈ పాడుతండాలో సర్దుకుపోవడం కష్టం. నా కొడుకు నోరు లేనివాడు. ఈ చలాకీ జనం వాడిని వేధించి వేధించి తరిమేవాళ్లు" అని సీత్కి భర్తను ఓదార్చింది. "అయ్యో నీకు తెలియదే.

ఈ మనుషులు ఎక్కడ ఉన్నా అలాగే ఉంటారు. అలాగే ప్రవర్తిస్తారు. పిల్లలిద్దరూ చిన్నవాళ్లు. కొత్తగా పెళ్లయినవాళ్లు. ఎక్కడ తిరుగుతున్నారో? ఆ లంజా కొడుకు పెళ్లిరోజున పందిరిని కింద పడదోయకుండా ఉంటే ఇలా అయ్యేది కాదు. మన పిల్లవాడు సరిగ్గా మాట్లాడలేదు. వ్యవహారజ్ఞానం లేదు. ప్రపంచంలో ఎలా బతుకుతాడో?" అని కంట తడిపెట్టాడు ధనసింగ్.

పంపానాయక్, గూడ్లిబాయిలు ఎక్కడున్నారో తెలుసుకొని రావడానికి వెళ్లిన ఖేమనాయక్ తిరిగి వచ్చాడు. "ఎక్కడికి పోయారో తెలియలేదు. వాళ్లే ఫలానా స్థలంలో ఉన్నామని ఉత్తరం రాస్తే తెలుస్తుంది పెదనాన్నా. అప్పటిదాకా వాళ్లు బతికివున్నారని అనుకొని ఊరుకోవాలి. అయినా పన పంపా తప్పటడుగులు వేసే పిల్లవాడు కాదు. పెళ్లిచేసుకుని వెళ్లాడు. ఎలాగో బతుకుతాడు. వాడి పాటికి వాడ్ని వదలండి" అని గట్టిగా చెప్పాడు. "ఒరేయ్ పనికిమాలిన వెధవా! వాడు నీలాగా కాదురా, చాలా సున్నితమైనవాడు. మోసం, వంచన ఒక్కటీ తెలియదు. వాణ్ణి పెళ్లి చేసుకొన్న అమ్మాయి గూడ్లిబాయి కూడా అలాగే ఉంటే ఏమవుతారు? వాళ్లు ఏమవుతారో?" అని ధనసింగ్ పెద్ద కొడుకు మాటల్ని ఆపాడు.

కొడుకు చింతతో మంచం పట్టిన ధనసింగ్ చాలా మెత్తబడ్డాడు. సరిగ్గా భోజనం, నిద్ర లేక వడలి పోయాడు. అలా అనటం కన్నా చావును ఆహ్వానించాడు. అతని సోదర సంబంధి అయిన కరమ్‌తోట్ కులస్థుడు కిందివీధిలో నివాసం వున్నాడు. హానగల్ వైపు వాడైనా చంపానాయక్ బోరుమని ఏడుస్తూ ధనసింగ్ దగ్గరికి వచ్చాడు. "చంపా నాయక్ ఏమైంది? ఎందుకిలా చిన్నపిల్లవాడిలా ఏడుస్తున్నావ్? నా సమస్య నాకు ఉంది. ఇతరుల సమస్య తీసుకుని నేను ఏం చేయగలను?" అని సమాధాన పరిచాడు. "ఏమని చెప్పను పెదనాన్న. మేము తిరిగి మా తాత ఉన్న చోటికి వెళతాం. హానగల్‌లోని దేసునాయక్ తండాకు" అని అన్నాడు."ఎందుకు? అలాంటి పరిస్థితి ఏమొచ్చింది? అది మన గత చరిత్ర" అని అంటుండగా పాత జ్ఞాపకాలు, అప్పటి ప్రయాణాలు గుర్తుకు వచ్చాయి. ధనసింగ్ కళ్లుమూసుకుని పాతవాటిని స్మృతి పటలం మీద తెచ్చుకునే ప్రయత్నం చేశాడు. అంతలోనే "పెదనాన్నా, ఈ మందితో వేగలేను. నేనైతే తిరిగి వెళ్లిపోతాను" అని పట్టుపట్టాడు. తన సొంత కొడుకే వలస పోయిన బాధ అతనికి ఉంది. ప్రపంచమంతా బాగుండాలని కోరుకునే ధనసింగ్ ఈ మాటలు విని ఎందుకో మరింత విచారానికి లోనయ్యాడు. "ఎందుకు నాయనా, మొండితనం చేస్తున్నావు? ఏమైందో వివరంగా చెప్పు. నాకు చేతనైన సహాయం చేస్తాను" అని నచ్చజెప్పడానికి చూశాడు. "లేదు పెదనాన్నా, ఈ ఊరు

వద్దు. వీరి సహవాసమూ వద్దు. దేసునాయక్ తండా మా నాన్న, తాతా పుట్టిన ఊరు. అది మన ఊరు. మేము అక్కడికే పోతాం" అంటూ మళ్లీ అదే మొండి వాదన. "సరే, వెళ్లు. నిన్ను ఆపడానికి నేనెవరిని? సొంత కొడుకే నా మాటలు వినకుండా దేశాంతరం పోయాడు. భార్యతోపాటు వెళ్లినవాడు బతికివున్నాడో, చచ్చాడో తెలియదు. వాడు ఒక కారణంగా పోయాడు. నువ్వు కారణం లేకుండా ఎలా వెళతావ్?" అని ప్రశ్నించాడు.

చంపా నాయక్ అతని పెదనాన్నకు జరిగిన సంఘటనను చెప్పాలా వద్దా అనే అయోమయంలో ఉన్నాడు. చెప్పకపోతే బాధపడతాడని చెప్పడం ప్రారంభించాడు. "పెదనాన్నా, మీ కోడలు తొలిసారి గర్భవతి అయ్యింది. మా పరిస్థితి మీకు తెలుసు. మేమంతా కష్టపడాలి. తినాలి. గుడెకోట జమిందార్ శేషప్ప దగ్గర పనికి చేరుకున్నాం. చాలా సంవత్సరాల నుంచి మేము అతని పొలాలు పనిచేస్తున్నాం. పనికి ఇచ్చిన పావో, సేరో గింజలు తెచ్చుకొని గంజి కాచుకుని తాగుతూ ఉన్నాం" అలా అంటున్నప్పుడు అతని మాటలు గద్గదికమయ్యాయి. "అవును నాయనా, మీ నాయన చేసిన పనికిమాలిన పని ఇది. తాను భూమి తీసుకొని మరెవరికో ధారపోశాడు. ఆరోజు నేను మొత్తుకున్నాను. కష్టపడి చేసుకున్నావు వదలకురా అని. ఎవడో వచ్చి బెదిరించాడని దాన్ని వదిలిపోయాడు. ఇప్పుడు నీకు నీ భార్య పిల్లలకు కష్టం వచ్చింది" అని మొత్తం చరిత్రను చెప్పాడు. అతని సోదరుడైన జాంపనాయక్ తండ్రి చెందానాయక్స్య భయపడ్డాడో లేదా ఆసక్తి లేక ఇలా చేశాడో ఆ దేవుడికి తెలుసు. అయితే పిల్లల కోసమైనా ఒక కొంత భూమిని చేసుకోలేదు. ఎంత అడుక్కున్నా దమ్మిడి కూడా దొరకని స్థితిలో ఎవరికి ఎవరవుతారు? ఉదయం నుంచి ఎద్దులతో పాటు ఎద్దులా శ్రమపడితే సాయంత్రం ఒక పావు ముగ్గిన జొన్నలను లేదా మట్టిబెడ్డలు నిండిన రాగిని ఇచ్చేవారు. అదే గొప్ప. "మా నాయన చేసిన గొప్ప పని వల్ల మేము ముగ్గురు అన్నదమ్ములు ఈ రోజు అనుభవిస్తున్నాం. నా భార్యకు ఇది తొలి కాన్పు. ఏవేవో కోరికలు" అని ఆగాడు.

తిండికి గతిలేని పార్తి తొలిసారిగా గర్భవతి అయింది. పార్తి దేహంలో పౌష్టికాహారాల కొరత ఉంది. ఆమె పొయ్యిలోని బూడిదను పిడికిళ్లు పిడికిళ్లు బుక్కేది. మంచి ఎర్రమన్ను దొరికితే ఒక పిడికెడు తీసుకొని మింగేసేది. నిజానికి అక్కడ ఉన్న అన్ని కుటుంబాల పరిస్థితి అదే. వర్షాకాలంలో వర్షం తీవ్రంగా కురవటం వల్ల నేలంతా తేమపట్టేది. నాటిన విత్తనాలు మొలకెత్తి అంతలోనే మొలకలు వడలిపోయి పసుపు రంగుకు తిరిగేవి. ఒకవైపు పంట పోయినందుకు

బాధపడ్డా అవి పశువులకు ఆహారమైనా అవుతుందని సంతృప్తిపడ్డారు. ఇంట్లో కూర్చుంటే ముద్ద పెట్టేవారు ఎవరు? ఇంటి నిండా బుట్టకింద దాచిపెట్టేటంతమంది పిల్లలు. వాళ్ల ప్రతిఒక్కరి కడుపులు నింపాలి. అందుకే పార్తి కూడా పనికి వెళ్లవలసిన పరిస్థితి వచ్చింది. చంపానాయక్ భార్య గోడు చూడలేక ఒక్కొక్కసారి బాధపడేవాడు. నిండు గర్భిణి పార్తి కడుపు మోసుకొని రెండున్నర కిలోమీటర్ల దూరంలోని గుడెకోట కరణం పొలంలో కలుపు తీయడానికి పోయినప్పుడు గట్టుపైన ఉన్న గుమ్మడి తీగకున్న కాయచూసి ఆశపడి, ఎవరికి తెలియకుండా కాయ తెంచుకొని సంచిలో వేసుకుంది. మెల్లగా ఇంటికి వచ్చి కాయకోసి కూరచేసుకుని తిన్నది. మరుసటి రోజు శేషభట్టు పొలంలో రాద్ధాంతమే జరిగింది. శేషభట్టు భార్య అలమేలు పనివాళ్లను ఇష్టం వచ్చినట్టు తిట్టింది. “నా పొలంలో గట్టుమీద పెరిగిన గుమ్మడికాయ దొంగిలించే ధైర్యం వచ్చిందా మీకు? బ్రిటిష్ కాలంలో మీరు చేసిన దొంగతనాలు మాకు తెలియదనుకున్నారా? ఏయ్ లంబాడి, మర్యాదగా నిజం చెప్తే సరే” అని ఐశ్వర్య గర్వంతో గట్టిగా అరిచింది. “మేము దొంగతనం చేయలేదమ్మా” అని ధానిబాయి జవాబిచ్చింది. “ఇంకెవరే సిగ్గులేని దానా?” అని అలిమేలు బెదిరించింది. ప్రతి ఒక్కరిని హింసిస్తూ ప్రశ్నించసాగింది. ఆమె మాటల హింస భరించలేక చీలిబాయి నిజం చెప్పేసింది. “అమ్మ ఆ చంపానాయక్ భార్య పార్తి గర్భవతి. ఆమె తీసుకొనిపోయి కూరచేసుకుని తిన్నది” అని అంటుండగానే “ఒసేయ్ ముండా నీ కోరిక తీరడానికి నా పొలంలోని గుమ్మడికాయ కావాలా?” అని ఆమె జడ పట్టుకుని లాగి అలాగే నేలమీద పడవేసింది. నాలుగు దెబ్బలు వేసింది. పార్తి నిండు గర్భవతి. దాడి చేయడం చూసి మానసికంగా బెదిరి పోయింది. ఆ దాడి వల్ల బిడ్డకు ఏమైనా అవుతుందేమోనని భయం. కడుపు పట్టుకొని బాధతో మూల్గుతూ “అమ్మా, ఎక్కడున్నావే, చచ్చాను దేవుడో” అని బిగ్గరగా కేకలు పెట్టింది. తండా ఆడవాళ్లు ఆమె సహాయానికి వచ్చారు. “పాపం ఇక్కడే కాన్పు జరుగుతుందేమో” అని మాట్లాడుకున్నారు. పార్తి పరిస్థితి చూసి అలమేల గాభరపడినా, దాన్ని దాచుకుని తారాస్థాయిలో అరవసాగింది.

పంచాయితీ కట్టమీద ధనసింగ్ కూర్చున్నప్పటికీ ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. తండా నాయకుడు, కారభరి, శేషభట్టు, అతని సేవకుడు తలారి కెంచ, మాదర యరబ వచ్చి దూరంగా బండలమీద కూర్చున్నారు. అతని వైపు జనం ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. “దొంగతనం చిన్నదైతే ఏమి? పెద్దదైతే ఏమి? గుమ్మడి కాయ అయితే ఏమి? బంగారం అయితే ఏమి? దొంగతనం దొంగతనమే.

ఇప్పుడు గర్భిణి కోరిక అంటారు. తాళి కట్టినవాడు భార్య కోరిక తీర్చాలి. ఆమె అడిగింది తెచ్చి ఇవ్వాలి. లేదంటే..." శేషభట్టు మాట్లాడుతూ ఉన్నాడు. అవమానంతో తలవంచుకున్నాడు. భట్టుకు వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం కోసు దూరంలో ఎవరికీ లేదు. వందలాది ఎకరాల జమీను, ఇంటి నిండా మనుషులు. ఆరు ఎద్దుల కమతం. పూర్వీకుల ఐశ్వర్యం. అదే దర్పంతో మురిసిపోతున్నాడు. చుట్టుపక్కల అతనంత తెలివైనవాడు కానీ ఐశ్వర్యవంతులు కానీ లేరు. శేషభట్టు మాటకు ఎదురు చెప్పే ధైర్యం ఎవరికీ లేదు. తండా నాయకుడు లేచి, "అయ్యా, ఏదో జరగరానిది జరిగిపోయింది. తప్పయిపోయింది. ముందు ఏం చేయాలి?" అని అతని ఆజ్ఞ కోసం ఎదురు చూడసాగారు."ఏమిరా తప్పు, పెద్ద దొంగతనం. చంపాగాడి ఇంట్లో అయిదారు ఆవులు ఉన్నాయని విన్నాను. వాటన్నిటినీ తోలుకొని పోయి మా పశు వుల మందలో చేర్చాలి. అదొక్కటే పరిష్కారం" అని అన్నాడు. ఇంకా నిర్ణయం జరగలేదు. అయినా మాదర యరబ పశువులను తోలుకుని వచ్చాడు. చంపా నాయక్‌కు ఏమి చేయాలో తోచక లేదు. "అయ్యా, ఒక గుమ్మడికాయకు ఆరు పశు వుల దండన. ఏమి న్యాయం?" అని ఏదో మాట్లాడబోయాడు. తలారి కెంచ చప్పున లేచి చంప నాయక్ మెడపట్టి "ఏమిరా లంబాడి కొడకా, అయ్యగారికే ఎదురు జవాబు ఇస్తావా? ఆయన చెప్పాడంటే అయిపోయింది. ఏ కోర్టు లేదు. ఏమీలేదు. అంతా ఆయనే" అని నాలుగు దెబ్బలు వేసాడు. ధనసింగ్ మాట్లాడలేకపోయాడు. మొత్తం వ్యవస్థనే తమకు వ్యతిరేకంగా ఉన్నప్పుడు గాలిలో చేతులు ఊపి ఒళ్లు నొప్పులు చేసుకోవడంలో అర్థం ఏముందని చంపానాయక్‌ను ఓదార్చడానికి ప్రయత్నం చేశాడు.

చంపానాయక్ అతని ఇద్దరు తమ్ముళ్లు పాత పెట్టెలను బయటికి తీశారు. ఉన్నటువంటి ఏవో కొన్ని సామానులను సంచిలో వేసి మూట కట్టి గుడెకోటను వదిలి వెళ్లి పోవడానికి సిద్ధమయ్యారు. ధనసింగ్ ఏమీ చెప్పలేని స్థితికి చేరుకున్నాడు. అతని చిన్నకొడుకు పంపానాయక్ వలసపోయినవాడు ఎక్కడున్నాడో ఎవరికి తెలియదు. అన్యాయం జరిగిన తర్వాత వెళ్లకండి, ఇక్కడే ఉండండి అని చెప్పడం ఎలాగో అర్థంకాక సందిగ్ధతకు గురయ్యాడు ధనసింగ్. చంపా, తిండ్గలు ఎవరినో బతిమిలాడుకుని ఒక బండిని సంపాదించి దేసు నాయక్ తండాకు బయలుదేరారు. తండానాయక్, కారభారి తాము చేసిన అకృత్యానికి పశ్చాత్తాపం కూడా పడకుండా చూస్తూ నిలబడ్డారు. తండాలోని కొంతమంది "పాపం నిండు గర్భిణి. అంత దూరం ఎలా వెళుతుంది? ఒరేయ్, నీ భార్య కాన్పు అయిన వారం తర్వాత

వెళ్లొచ్చు కదా. అంతవరకు ఆగకూడదా? దారిలో ఎక్కువ తక్కువ అయితే ఏం చేస్తావ్‌రా" అని సక్ర్యా అన్నాడు. "అయ్యో మామ, ఈ పాడు ఊరువదిలి ఇక్కడి నుంచి వెళ్లిపోతే చాలు. సేవాభాయ్, మరియమ్మలు ఉన్నారు. వాళ్లు చూసుకుంటారు. అయితే ఈ పాడు జనం మధ్య నుంచి వెంటనే వెళ్లిపోవాలి. మన పూర్వీకులు పుట్టి పెరిగిపెరిగిన, నిర్మించుకున్న తండాకు వాపస్ వెళ్లి అక్కడే గుడిసె వేసుకుంటాం" అని జవాబు కోసం ఎదురు చూడకుండా హడావుడిగా కదిలాడు. అతని సోదర సంబంధి అయిన ఖేమనాయక్ తండా సరిహద్దు వరకు వెళ్లి "వెళ్లిరండి చంపా, తింధ్గ, మీకు మంచి జరగాలి. సేవాభాయి మీకు మంచి చేయాలి. పార్తిని కాస్త జాగ్రత్తగా చూసుకోండి. గుజాసత్తికి వస్తారు కదా. అప్పుడు కలుద్దాం. నీవు ఏమి చింత చేయకు" అని చివరిసారిగా వీడ్కోలు చెప్పి వచ్చాడు. కరమ్‌తోట్ తెగ ఇండ్లు చాలా తగ్గిపోయాయి. అతని ముందే ఒక కొడుకు, సోదర బంధువులలో కొందరు తండా వదిలిపోయారు. పంపానాయక్ మాత్రం హరపనహల్లి తాలూకా తండాలో స్థిరపడ్డాడు. ఇప్పుడు గుడెకోట ఇంట్లో ఖేమునాయక్ పిల్లలతో ఉండటం తప్ప ఆ పెద్దలోగిలే కరిగిపోయింది. కరమ్‌తోట్ కుటుంబంలోని సగం జనం విషాదంలో కుంగిపోయారు. ఖేమనాయక్ కూతురు ఠకరి. దేన్యా, రాముడు, లాల్‌సింగ్ నాయక్ మొదలైనవారు. పందిరిని కిందికి పడదోసిన ధూప్లానాయక్ కరమ్‌తోట్ హత్య జరిగింది. తర్వాత అతని ఇద్దరు పిల్లలు ఏదో జబ్బుచేసి చనిపోయారు. వారి ఎడబాటును భరించలేక అతని భార్య చాలాకాలం బతుకలేదు. ఆమె అంత్యక్రియలను ధనసింగ్ భుక్యానే ముందు నిలబడి. చేశాడు. "కింవవెత్తకింవవేగ" అనే దుఃఖం కాలువై ప్రవహించింది. ఒక్కడే పరితపిస్తూ ఏవేవో గొణుగుతూ ఏడవసాగాడు. దేసు భూక్యా తండా గతవైభవం అతని కళ్ళముందు కదిలి మాయమైంది. అతని తండ్రి, తల్లి. సోదరులు, సోదరీమణులు, మొత్తం ఊరికి ఊరే షావుకారుతో ఘర్షణ, అతనికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసిన జనం. తెల్లవాళ్లతో పోరాటం. మూల మూలల నుంచి వచ్చినవారు. తర్వాత చెడుదారి పట్టిన అతని చిన్నాన్న పిల్లలు. వారిలో ఒకడు పెద్ద దొంగగా మారి కరమ్‌తోట్ వంశ గౌరవాన్ని పాడుచేస్తే; మరొకడు తనపై ఉన్న పగతో మొత్తం వంశాన్ని నిర్వంశం చేసి పెట్టాడు. "సేవాభాయ్, మరియమ్మ, ఏమిటి మీ లీల! కొందరి వంశాన్ని నిర్వంశం చేశారు. అయ్యో తల్లి గుజాసత్తి, నీ వంశం ఎలా పెరుగుతుందమ్మా? ఎలా నీళ్లు లేని నల్లరేగడి నేలలో విస్తారంగా పుట్టే గడ్డిలా కరుణించమ్మా పిల్లలను" పక్క మీద పడుకుని చాలాసేపటి వరకు ఒక్కడే కలవరిస్తున్నాడు. ఈ కల, కలవరింత తప్ప ధనసింగ్‌కు ఇంకేమీ ఉ

ండలేదు. పశ్చిమ సీమకు పోయిన చిన్నకొడుకు పంపా విషయం కోసం, మహాభారతంలోని ధృతరాష్ట్రుడు, కౌరవ-పాండవుల యుద్ధం సందర్భంలో తన సారథి అయిన సంజయను కుతూహలంతో అడిగినట్టు; ఎవరైనా పశ్చిమ సీమ నుంచి వచ్చారని అంటే, లేవలేని స్థితిలోనూ "ఏయ్ నా చిన్న కొడుకు, పంపా, అతని భార్య గూడ్లిబాయి బాగున్నారా? ఏమైనా విషయం చెప్పి పంపినారా?" అని అడిగేవాడు. ఒక్కొక్కసారి విన్నవారి మనసు కరిగి "ఊఁ బాగున్నారప్పా, చూసుకునిరమ్మని అన్నందుకే నేను ఇంత దూరం వచ్చాను. తాతా! ఎలా ఉన్నావో చెప్పు. ఇక నీ కొడుకుకు ఏమైనా చెప్పవలసింది ఉంటే చెప్పు" అని అంటే "ఏమి చెప్తావు, సుడిగాలి వీస్తే మోడువారిన చెట్టు ఎప్పుడు నేలకూలుతుందో తెలియదు. చావటానికి ముందు ఒకసారి మీ నాన్న నీ ముఖం చూడాలని అంటున్నాడు. నిన్ను ఒకసారి వచ్చిపొమ్మంటున్నాడు. ఎందుకంటే వాడు చిన్నతనం నుంచి నా ఎదమీద తలపెట్టుకొని పడుకునేవాడు" అని కంటి చివర్లో రాలుతున్న కన్నీటిని తుడుచు కుంటూ, "ఏం చేస్తాను, ఇప్పుడు వాడి తొడమీద ప్రాణం వదలాలని అనుకుంటున్నాను. అయితే..." ధనసింగ్ దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చాడు. "నాన్నా ఎందుకింత బాధపడతావ్. వాడు చిన్న పిల్లవాడు కాదు. ఎక్కడ ఉన్నా మీ ఆశీర్వాదంతో బాగానే ఉంటాడు. మీరు ఊరుకోండి" అని ఖేము గద్దించడంతో ధనసింగ్ మాటలు ఆపాడు.

ధనసింగ్ భుక్యా కరమ్‌తోట్ తన చివరి ఊపిరి కోసం ఎదురు చూస్తున్నాడు. బహుశా దేవుడు తనను మరచిపోయి ఉండొచ్చని శాపం పెడుతున్నాడు. తన సమవయస్కులు చాలామంది కాలం చేశారు. గుడెకోట తాండ నాయకుడు, బోత్యా నాయక్ చనిపోయి రెండేళ్లు గడిచాయి. కారాభారి కలమ్‌నాయక్, వెనక వీధి డావో సేణూ నాయక్, రూప్లా, ధాన్య, మంకాళి మొత్తం తండాలోని పెద్ద తలకాయలు లేకుండా పోయాయి.

చివరి కొండిలా ఉన్న ధనసింగ్ తన కొడుకు పంపా కోసం ప్రాణాలు బిగపట్టుకుని ఉన్నాడు. అయితే బతుకు రూపొందించుకుని క్రియలో నిమగ్నమైన పంపానాయక్ బండికేరి తండాలో జరిగిన ఒక చిన్న ఘటన వల్ల మరొక తండాకు వలస పోవాల్సి వచ్చింది.

బండికేరి వదిలిన తర్వాత అతను తూర్పులో ఒక తండా ఉందని ఎవరో చెప్పటం విన్నాడు. గుడెకోట వదిలివచ్చి సుమారు ఒక సంవత్సరం అయ్యింది. గూడ్లిబాయికి నెల తప్పింది. గర్భిణి కోరిక ఆరంభం అయింది. అతని అల్లుళ్లు,

అడవికి దగ్గరోని ఒక తండాలో స్థిరపడ్డారు. పంపానాయక్ ఇతరుల సహాయంతో గుడిసె వేసుకుని సంసారాన్ని విస్తరించే ఉత్సాహంలో ఉన్నాడు. అతని అమాయకత్వాన్ని పెట్టుబడిగా చేసుకున్న అతని అన్న, వదిన, సోదర బంధువులు ఊరివారందరిని మరిచారు. ప్రతిరోజు పడుకునేటప్పుడు మాత్రం "కాపాడు తండ్రి, ప్రాణం ఇచ్చిన వాడివి, కాపాడమ్మా తల్లీ, అనే శబ్దాలు ఉచ్చరించకుండా పడుకునేవాడుకాడు. తల్లిదండ్రుల జ్ఞాపకాలు వెంటాడేవి. వారి ఆశీర్వాదం వల్లనే తాను బతికాడనే నమ్మకం అతనిలో గాఢంగా ఉంది. లౌకిక వ్యవహారాల్లో అతనికి అంతగా ఆసక్తి లేదు. జనంతో వ్యవహారం జరిపే చలాకీతనం లేదు. అణా, దమ్మిడి లెక్కలు కూడా సరిగ్గా తెలియక సమస్యలో ఇరుక్కునేవాడు. తిండి గింజలు, ధాన్యం కొనేటప్పుడు పావు, అర్ధసేరు లెక్కలు కూడాంసరిగ్గా గుర్తించలేకపోయేవాడు. ఈ కారణంగా ఇతను జనం ముందు వినోదానికి గురయ్యేవాడు. గూడ్లిబాయి మాత్రం లెక్కల్లో చురుకు. అమాయకుడైన భర్తతో జీవితం గడపాలని నిర్ణయించుకున్న తర్వాత, మొద్దువాడైనా, మూర్ఖుడైనా భరించాల్సిందేనని అనుకుంది. అయితే పంపానాయక్‌లో ఎలాంటి చెడు గుణాలు లేవు. ఆతని మనసు బంగారం. చూడటానికి ఎత్తయిన మనిషి. అందగాడు. చెవికి పగడపు ఒంటి పోగు. చురకత్తుల్లాంటి మీసాలు, తెల్లటి ధోవతి, తెల్లటి అంగీ, భుజం మీద తువ్వాలు. ఒకసారి చూస్తే మళ్లీ చూడాలనిపించే కుతూహలం కలిగించే రూపం. గూడ్లిబాయికి చాలా నచ్చాడు. తన అమ్‌గోత్ కులం మర్యాద తనపై ఉండటం వల్ల, దానికి దెబ్బ తగలనట్టుగా నడుచుకోవటం తన ప్రథమ కర్తవ్యం అనుకుంది.

ఎదమీద పడుకొని నాన్న పాడే లాలిపాటతో, సన్నగా చేతులతో తట్టే స్పర్శతో నిద్రపోతున్నా పంపానాయక్ మరవగలడా? అతన్ని వదిలి బతకలేని స్థితిలో ఉన్న తండ్రి ఎవరు లేని ప్రాంతానికి ప్రయాణమయ్యాడనే విషయం ఆశ్చర్యకరం. ఎన్నడూ ఇల్లు వదిలినవాడు కాదు. మిత్రులతో కూడా పోచుకోలు కబుర్లు చెప్పేవాడు కాదు. తాను, తన ఇల్లు, అన్నతో కలిసి పని, అన్న పిల్లలతో ఆట– ఇవి ఒకప్పటి అతని దినచర్య. గూడ్లిబాయిని పెళ్లి చేసుకున్న తర్వాత స్వతంత్రంగా బతకగలడనే నిర్ణయం ఎలా వచ్చిందన్నది రహస్యం. పెళ్లిరోజున పెద్ద రాద్ధాంతమైంది. అతడి పెళ్లే జరగకుండా రూపొందించిన లోపలి కుట్ర, అక్కడ ఉంటే ప్రశాంతంగా బ్రతకలేననే పంపానాయక్ నిర్ణయం గురించి ఆలోచిస్తే, అతను మూర్ఖుడు కాదు, సూక్ష్మంగా ఆలోచించే తెలివైనవాడని అర్థం అవుతుంది.

పెళ్లి చేసుకున్న ఒక సంవత్సరానికి పంపానాయక్ తండ్రి అయ్యాడు.

అతని విచారం అంతా మంచం పట్టిన తండ్రి గురించి. ఒక ఉత్తరం లేదు. సమాచారం తెలియకుండా పోయింది. అప్పుడే ప్రారంభమైన వాహనాలు గుడదహట్టి తండా నుంచి మూడున్నర కిలోమీటర్లు దూరంలోని చెన్నళ్ళికో లేకపోతే ఐదున్నర మైళ్ళ దూరంలో ఉన్న హనుమాపుర లేదా బుళ్లాపుర, అదీ కాదంటే ఐదు కిలోమీటర్ల దూరం నడిచి బస్సు పట్టుకొని ఎటువైపు కావాలన్నా ప్రయాణం చేసేవారు.

దక్షిణానికి దామూరు, బగతూరు అనే పెద్ద పల్లెలాంటివి ఉండేవి. అక్కడ అనేక కొత్త కంపెనీలు, కార్ఖానాలు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగా పెద్దపల్లెలు స్వరూపాన్ని మార్చుకుని పట్టణాలు అయ్యాయి. పంపా, గూడ్లిబాయిలకు కూలీ పనులు చేసుకుంటూ బ్రతక వలసిన అనివార్యత ఉండేది. ఎందుకంటే వచ్చేటప్పుడు ఎవరో పుణ్యాత్ములు ఇచ్చిన డబ్బులను జాగ్రత్తగా పెట్టుకొన్నారు. వాటిని అలాగే దాచుకుని చేతి ఖర్చులకు వాడారు. గుడదహట్టి తండాలో గుడిసె వేసుకునే వరకు అవే డబ్బులు ఉపయోగపడ్డాయి. అటు తర్వాత అనే ప్రశ్న వచ్చినప్పుడు సంపాదించడం తప్పనిసరి అయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడినా చేతికి కూలీ డబ్బులు ఇచ్చేవారు కాదు. ఒకవేళ ఇచ్చినా ముగ్గిపోయిన జొన్నలు, లేదా మట్టిపెడ్డలున్న రాగులు. వాటిని తెచ్చి, శుభ్రం చేస్తే దక్కేవి పావుసేరు గింజలు మాత్రమే. కడుపుకు వాటితోనే గంజి. దాంతోనే జీవనం సాగింది. మొదటి బిడ్డ పుట్టినప్పుడు పంపానాయక్ ఆ అపరిచిత తండాలో తల్లి, తండ్రి, బంధువు లేకుండా చాలా కష్టపడ్డాడు. తండాలో ఉన్న వృద్ధస్త్రీలు, ఆడవాళ్ళు,చావణి, రూప్లి, పక్కీరజ్జి మంత్రసానులు గుడిసె తలుపు ముందుకు చేరవేసి, "బిడ్డా, నువ్వు బహదూర్ ఆడదాని కదా" అనిగూడ్లిబాయిలో ధైర్యం నింపుతూ, బిడ్డతల కనిపించడం కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నారు.

భార్యకు ఏమైందోనని కలవరంతో పంపానాయక్ తన ఇంటి దైవమైన గుజాసత్తిని ప్రార్థించాడు. ఆమెతోపాటు సేవాభాయ్, మరియమ్మలను మనసులోనే నమస్కరించుకుని వేడుకున్నాడు. గుడిసె లోపల వాతావరణం బిగుసుకుపోతున్నట్టే ఇతని ఊపిరి ఆగినట్టయి గుజాసత్తిని పదే పదే తలుచుకున్నాడు. భార్య కాన్పు సులభంగా జరిగితే ఆరుకొబ్బరి గిన్నెలు కానుకగా ఇచ్చి, తమ పద్ధతి ప్రకారం 'ఒళంగ్' (ప్రార్థన) చెప్పిస్తానని వేడుకున్నాడు. పంపా మొక్కును స్వీకరిస్తున్నట్టు గుడిసె లోపల నుంచి బిడ్డ ఏడుపు వినిపించింది. మసక వెలుతురులో బిడ్డను తడిమిన రామజ్జి "ఏ పంపా, మగబిడ్డరా" అని నవ్వుతూ అరిచింది. ఆ కేక వినగానే పంపా నాయక్ కాళ్లు ఉత్సాహంతో తడబడ్డాయి. పక్కింటికి వెళ్లి కంచు

తట్టను తెచ్చి గట్టిగా వాయిస్తూ "పంపా నాయక్‌కు మగపిల్లవాడు పుట్టాడప్పో" అని బిగ్గరగా కేక వేశాడు. ముందరి ఇంటి అడ్నాడి తింధ్గ పంప చేతిలోని కంచాన్ని లాక్కొని గట్టిగా వాయిస్తూ గంతులు వేశాడు. ఊరి మధ్యనున్న గుడదమ్మ కట్టమీద కూర్చున్న సోమరి కుర్రవాళ్ళల్లో కుతూహలం. "రేయ్ అడ్నాడి తింధ్గా రారా ఇక్కడికి" అని అరిచారు. ఊరికూరకే జనం ఎందుకో పిలిచారంటే ఏం హకీకత్తో అని మనసులో అనుకొని వారు పిలవటం వినిపించలేదన్నట్టు వెళ్లిపోయాడు. కట్టమీద కూర్చున్న వారికి ముడ్డి కాలినట్టయి "రేయ్ పనికిమాలినవాడా, ఎంత ధిమాక్‌రా నీకు. పిలిచినా విననట్టు వెళ్ళిపోతావా? మేమంటే చిల్లిగవ్వంత విలువ లేదా?" అన్నారు.

పంపా నాయక్‌కు బాధ్యత పెరిగింది. మొదట్లో భార్య భర్తలు ఇద్దరే. ఇద్దరూ కష్టపడి సంపాదించుకొని కడుపులు నింపుకునేవారు. ఇప్పుడు ఒక్కడే కష్టపడాలి. ఇద్దరి కడుపులు నింపాలి.

ఏదో విధంగా బాలింతలకు కాస్త గొర్రెతల మాంసం తెచ్చి వేయించి పెట్టాడు. రామవ్వ చెప్పిన మాటలు అతని చెవుల్లో గింగురుమంటున్నాయి. పిల్లవాడి తల, మెడ గట్టిపడాలంటే గొర్రెతల మాంసం తెచ్చి తినిపించాలని రామవ్వ అన్నది. అతను తన స్థాయికి మించి ప్రయత్నాలు చేయసాగాడు. శంకరల్లి జమీందారు దగ్గర అప్పు తెచ్చి సంసారం నడిపాడు. "నీవు ఏమీ చింత చేయకు. ఆరు నెలలు నీళ్లు ముట్టకూడదు. బిడ్డను రామవ్వ దగ్గర వదిలి నేను పనికి వస్తాను" అని భర్తలో ధైర్యం నింపింది గూడ్లి బాయి. తండా జనంలో ఎవరికీ భూమి లేదు. పంప రావటానికి మునుపు ఇరవై ముప్పై సంవత్సరాలలో చాలా మంది లంబాడీలు వలసవచ్చి స్థిరపడ్డారు. అంతకుముందు ఐదో పదో ఇండ్లు ఉండేవి. అయితే ఇప్పుడు 'పెద్ద కోట నిర్మించిన నాయకుల్లా, ఈ తండాను మొట్టమొదట కట్టినవాళ్లం మేము, మీరు ఇప్పుడు ఇప్పుడిప్పుడే వచ్చినవారు'- ఇలా పంపానాయక్ ముందు వంద సార్లు పూజారి తాత్లునాయక్, అతని గుంపు చెప్పిచెప్పి పీడించారు.

కష్టపడి బతుకే వారికి ఇలా ఊరికే కూర్చోవడం కాస్త కష్టమే. గూడ్లి బాయి రోజులను లెక్క పెడుతూ ఉంది. ఎప్పుడు రెండు నెలలు అవుతాయా? బిడ్డ చనుపాలు తాగడం ఆగింది. గూడ్లిబాయికి భర్తతోపాటు పనికి వెళ్లాలి అనే తపన. అయితే ఇంకా రెండు నెలలు ఎదురు చూడవలసి వచ్చింది. పచ్చి ఒళ్లు. ఏమైనా ఎక్కువ తక్కువ అయితే అని భయపడింది. అయినా నెల దాటగానే చిన్నచిన్న ఇంటి పనులు చేసుకోసాగింది. కట్టెలు ఏరుకుని రావడం, కసువు చిమ్మడం చేసుకుని

భర్త కోసం ఎదురుచూస్తూ కూర్చునేది. పంపా రాగానే రాగులలో రాళ్లను ఏరివేసి, సాధ్యమైతే మట్టిని జల్లెడపట్టి, పక్కింటి సోమ్లానాయక్ ఇంటికి వెళ్లి విసురుకొని వచ్చేలోపు గూడ్లిబాయి పొయ్యిమీద ఎసరుపెట్టేది. అందులో పిండివేసి వుడికించి, పొంగగానే కిందికి దింపి, చేత్తో కొట్టి రెండు ముద్దలు చేసి వెడల్పయిన పాత్రలో వేసి పెట్టేది. తర్వాత నిప్పుల్లో పచ్చిమిరపకాయలు కాల్చి, వెల్లుల్లి, చిటికెడు ఉప్పు, చింతపండు రసపిండి దంచి చట్నీ చేసేది. తర్వాత ఇద్దరు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తిని కుండలోని నీళ్లు తాగితే ఆ పూట భోజనం ముగిసినట్లే. మొదట్లో గురవ్వ చేసిన కషాయం తాగి గూడ్లి బాయి తన కన్నపేగు కోసం కష్టాన్ని దిగమింగుకొని రాళ్లను తిని కరిగించుకునే నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల తన బిడ్డతో కాలం గడిచిపోవటమే తెలియలేదు. తల్లి, తండ్రి, బంధువుల జ్ఞాపకాలు దగ్గర సంచరించని స్థితిని చేరింది. సాక్షాత్తు దేవుని స్వరూపమే అయిన భర్త పంపానాయక్‌ను పూజించి, అతని పాదాల చెంతనే పావనం కావటానికి అన్ని సంబంధాలను తెంచుకొని వచ్చిన తర్వాత మళ్లీ భవబంధాల మోహమెందుకు? అయితే గూడ్లిబాయికి గొప్పగొప్ప కలలు ఉన్నట్టు కనిపించలేదు. తన కొడుకు భగన్యానాయక్‌ను సాకటం, అతని కోసం వ్యవసాయం చేయడం, ఉన్న గుడిసెను మరింత పెద్దదిగా విస్తరించడం, ఇంట్లో నాటు కోళ్లు సాగడం, కాలక్రమంగా ఆవులు, గేదెలు, జోడెద్దులను తీసుకొచ్చే ఆలోచనలు ఆమె తలను ఆక్రమించాయి-ఇదే ఆమె కలగా మారింది. అమాయకుడైన భర్తకు భవిష్యత్తు గురించి కలలు కానీ, ఆలోచనలు కానీ తక్కువ. అందువల్ల అతని నిష్క్రియమైన బుర్రలో గూడ్లిబాయి ఆలోచనలు నింపింది. ఒకటిన్నర నెలలో దవళ దోఖ్ (పొయ్యిపూజ) కార్యక్రమం ముగించి అయిదు రాళ్లను తెచ్చి, ఎర్రమన్ను, సున్నం పూసి గుజాసత్తిని ప్రతిష్టించి 'ఒళంగ'-చెప్పటానికి ముత్తయిదువులను పిలిచి రెండు కొబ్బరి గిన్నెలను తెప్పించింది. తండా స్త్రీలు, పురుషులు, పిల్లలు కొబ్బరి బెల్లం ముక్కల ఆశకు పంపానాయక్ గుడిసె ముందు చచ్చిన పశువుల కోసం వచ్చిన రాబందుల్లా చేరారు. కళ్లకు కనిపించనంత చిన్నగా ముక్కలు చేసి, బెల్లం కలిపి పంచడం ఆరంభించిన గూడ్లి బాయి మీద పిల్లలు పడసాగారు. "రేయ్ పాడు పిల్లలు. ఎన్నడూ కొబ్బరి బెల్లం చూడలేదా? ఊరుకోండి. పక్కకు జరగండి, పక్కకు జరగండ్రా. మీ ఇల్లు పాడుగాను" అని కసిరింది. ఆమె మాటలకు ఒక్కడు కూడా బెదిరినట్టు కనిపించలేదు. బదులుగా ఆమె పంచుతున్న బెల్లం కొబ్బరి కోసం గిన్నెలో చేతులు పెట్టడానికి ప్రయత్నించారు. "అయ్యో శివుడా, రేయ్ పనికిమాలిన పిల్లల్రా మీరు, మీకు మానమర్యాదలు

లేవా? నేను పంచుతున్నాను కదా పక్కకు జరగండి" అని చేతిలోని గిన్నెను ఆడవాళ్ళకు ఇచ్చి "ఇంకా ఎవరెవరికి ఇవ్వాలో ఇవ్వండమ్మా" అని అక్కడినుంచి లోపలికి వెళ్ళింది. ఒక శాస్త్రం ముగిసింది. ఇంట్లో పసిబిడ్డను వదిలి పనికి వెళ్లాల్సిన పరిస్థితి గూడ్లిబాయికి ఎదురయ్యింది. గురవ్వకు బిడ్డను అప్పగించి పనికి వెళ్లాలని నిర్ణయించుకుంది. ఉదయం ఆరుకు బయలుదేరితే మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో అరగంట విరామం ఉండేది. ఆ సమయంలో ఆడవాళ్లు నెమ్మదిగా తిని లేచేలోపు గూడ్లిబాయి పరుగున ఇంటికి వచ్చి బిడ్డకు పాలు తాగించి పనికి వెళ్ళేది. ఒకసారి గౌడ, "ఏయ్, రోజూ ఏమిటి నీ గోల. మూసుకొని పనిచెయ్" అని అన్నాడు. దాంతో కదల్లేకపోయింది. బిడ్డకు పాలు ఇవ్వకపోవటంతో రొమ్ములు బిగుసుకుపోయినట్టు అనిపించేవి. ఆ వేదనను తనతోపాటు పనిచేసే సీత్కితోనో, రామితోనో– "ఎలాంటి మనిషి ఇతను. వీడి పాడె ఎత్త. ఇంట్లో ఎనిమిది తొమ్మిది నెలల బిడ్డ ఉందని చెప్పినా దయ చూపడు. పాలు ఎక్కువై ఉబ్బిన ఎదను పురుగులు కొరికిన వాడిలా చూస్తాడు" అని చెప్పి మనసు తేలిక పరుచుకునేది. అందుకు ఎలా ప్రతిస్పందించాలో తెలియని ఆడవాళ్లు ఆమె మాటలకు సమ్మతి వ్యక్తపరిచి మౌనం వహించేవారు. ఏ ఒక్కరికీ గూడ్లిబాయి పరిస్థితి, బాధ అర్థమయ్యేదికాదు. ఆమె మనసులో జరుగుతున్న మానసిక సంఘర్షణ అర్థమయ్యేది కాదు. గౌడదే ఒక లోకం. లౌకిక జగత్తులో దొరకగలిగే అన్ని సుఖాలను అనుభవించి భూమిమీది నుంచి మరుగైపోవాలనే అభిప్రాయం అతనిది. కొన్నిసార్లు రెండు పూటలా గంజి కోసం కొట్లాడుకునే కూలి జనాలతో "రేయ్ సరిగ్గా కలుపు తీయండ్రా బోడి వెధవల్లారా, లంజకొడుకుల్లారా, మీ యమ్మ, అర్ధసేరు గింజలకు తగినట్టు పని చేయండి" అనేవాడు. ఎంత నిజాయితీగా పనిచేసినా అమాయకులైన కూలీలను పీడించకుండా వదిలేవాడు కాదు. అతని గర్వపోతు మాటలకు, 'ఏయ్ పోవయ్యా, ఏ సీమ మనిషివి నువ్వు? ఈ ప్రపంచం విశాలంగా ఉంది. అదేమో అంటారు కదా మీ ఊరు గౌడ మరొక ఊరికి పశువులు కట్టే గూటం' అని అన్నామా ఇక ఆ రోజు ఉపవాసం తర్వాత చావే గతి. తండా చుట్టూ ఉన్న భూములన్నీ గౌడవే. ఆయనది పెద్ద కమతం. వంద రెండువందల నుంచి వేలాది ఎకరాలకు యజమానులు. సహజంగానే జీతగాళ్లకు తక్కువకూలి ఇచ్చి ఎక్కువ పని చేయించుకునే స్వభావం అతనిది. గూడ్లిబాయి, పంపానాయక్‌లు ఇప్పటిదాకా బ్రతికిన సమాజం ధనవంతులదే. పంపానాయక్‌కు వ్యవహారజ్ఞానం లేదు. ధనసింగ్ నాయక్ గౌడనహట్టిలో ఉన్నప్పుడు ఇంటి బాధ్యతలు చూసుకునేవాడు. అంతేకాకుండా అతను

కొద్దో గొప్పో వ్యవసాయం చేసేవాడు. అయితే ఇక్కడ తాము వ్యవసాయ కూలీలు. భూమి దున్నాలి. భూమిపై యాజమాన్యం సంపాదించాలి. తన కొడుకు భగన్య నాయక్ ఎద్దులను సాకటం, బండి తోలటం, పొలం దున్ని పంట పండించడం చూడాలనే కల ఇప్పుడు గూడ్లిబాయిది.

తొలకరి వర్షం భోరున కురవటంతో తండాలోని చెరువు నిండి కాలువలా ప్రవహిస్తోంది. తండా జనం నదిలోని కొత్త నీటి ప్రవాహం పొంగిపొర్లుతుండటం చూసి చేపలు పట్టడానికి వలలు, గాలాలు, బుట్టలు పట్టుకొని పోటీలు పడుతూ పరిగెత్తారు. జనం ఉత్సాహంగా చేపలు పట్టేటప్పుడు తాామూ చేపలు తినాలనే ఆశతో తెల్లవారుజామునే లేచిన గూడ్లిబాయి "వెళ్ళండి సరదాగా జనం చేపలు పడుతున్నారు. మీరూ పట్టుకొని రండి" అని భర్తను ఉత్సాహపరిచింది. పంపాకు చేపలు పట్టడం ఎలాగో తెలియదు. ఏమి చేయాలో తోచక సతమతమయ్యాడు. సరే, అక్కడ ఎవరినైనా అడిగితే చెబుతారని బయలుదేరాడు. అతనితో చనువుగా మాట్లాడే బిక్యా నాయక్, సామ్కా నాయక్‌లను, "అరే భాయ్, చేపలు పట్టుకుని రమ్మని నా భార్య నన్ను పంపింది. చేపలు ఎలా పెట్టాలో నాకు అసలు తెలియదు. నాకు కాస్త నాకు నేర్పిస్తారా?" అని బతిమిలాడాడు. బిక్యా, సామ్కాలు తాము పట్టుకున్న చేపలను వదిలి నవ్వసాగారు."చేపలు పట్టడానికి రానటువంటి వీడు ఎలాంటి మగవాడు?" అని అతని వైపు చూస్తూ నవ్వసాగారు. అయితే వాళ్ల వెనుకే గూడ్లిబాయి నిలబడి ఉండటం చూడలేదు. అతని నోటి నుంచి మాట రాగానే అతని మెడ పట్టుకొని, "నీ భారీ మగతనం ఎక్కడో చూపించరా సామ్కా?" అని గర్జించింది. "అక్కా తప్పయింది. నువ్వు ఉండటం చూడలేదు. తమాషాగా ఏదో అన్నాను. నన్ను క్షమించు" అని బ్రతిమిలాడాడు. "ఏదో తప్పు అయిందా? నేనూ ఇప్పుడు ఒక తప్పు చేస్తాను ఊరుకుంటావా?" అని అతని సంచిలోంచి ఒక కేజీ చేపలను ఎత్తుకుని, "పదవయ్యా, అతను మళ్ళీ చేపలు పట్టుకోనీ. ఒంటిలోని పొగరు దిగుతుంది" అని భర్తని పిలుచుకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది."ఒరేయ్ పనికిమాలిన మూడుకాసుల సామ్కా నాయక్, ఇదంతా నీకు అవసరమా ? ఏం చేస్తున్నావ్ ? ఉన్న చేపలను నోరు చేసి గూడ్లిబాయి తీసుకొని పోయింది. నీవు దాని పియ్య తిను" అన్నాడు. అతని పార్ట్‌నర్ బిక్యా. "పోనీలేరా, ఒకిన్ని చేపల కోసం ఎందుకిలా గింజుకుంటావు? దానమ్మ లక్షలాది చేపలు ఉన్నప్పుడు ఒక కేజీ చేపలు పోతే ఏమవుతుంది?" అని రెండు కేజీల బరువున్న ఒక చేప పట్టుకొని పైకి లేపాడు. "ఊఁ ఇక్కడికి రారా, చేప నీళ్లలో దూకటానికి గింజుకుంటోంది"

అని బిక్క్యాను పిలిచాడు సామ్యా. "ఎక్కడ ఎక్కడ" అంటూ బిక్క్యా పరుగున వచ్చి వలలో పడిన ఒక పెద్ద చేపను అవలీలగా పైకెత్తాడు."ఊఁ భలే మంచి చేపను పట్టావుకదరా! ఇంట్లో మాంసానికి, ఒంట్లో సారాయికి సరిపోతుంది. పదరా" అన్నాడు బిక్క్య. "సరే ఇంకొకసారి వల వేస్తాను. నువ్వు నోరు మూసుకొని చేపలను పోగుచెయ్యి" అని పట్టిన చేపలను ఒక్కొటొక్కటిగా అతనివైపు విసిరేశాడు. అరగంటలో పదికేజీల చేపలు పట్టుకుని, ఒక బీడి వెలిగించి, "ఉదయమే ఎవరి ముఖం చూశాను?" అనే సామ్యా ఆలోచించసాగాడు, 'పంప' అని గుర్తు తెచ్చుకున్నాడు. బిక్క్యకు గుర్తొచ్చింది. "అవును కదరా, వాడిని చూడటం మంచి శకునంరా. వాడు అమాయకుడురా. దేవుడులాంటి మనిషి. నేను హాస్యం చేస్తూ అనకూడని మాటలు అన్నాను. పాపం" అని బిక్క్య బాధపడ్డాడు.

గూడ్లిబాయి ఆర్భాటంగా బతుకు సాగిస్తోంది. దాన్ని గమనించిన గూరజ్జ, ఆ ఊరిలోని సర్వతప్పభట్టకు చెందిన గుడదహట్టి చెరువుగట్టు కింద ఉన్న రెండు ఎకరాల పొలాన్ని గూడ్లిబాయికి కౌలుకు ఇచ్చాడు. గూడ్లిబాయి కాళ్లు నేలమీద నిలవలేదు. అమాయకుడైన పంపానాయక్ ఏమీ తెలియని వాడిలా భార్య చెప్పిన పనులన్నీ ఒక్కటీ తప్పకుండా చేసేవాడు. ఇప్పుడు అతనికి కొత్త బాధ్యతలు ఒకటొకటిగా మీద పడసాగాయి. పొలం దున్నడానికి ఎద్దుల అవసరం గుర్తించాడు. వాటిని ఎలా సంపాదించాలనే ఆలోచనలో మునిగాడు. సర్వతప్పభట్ట తమ పశువుల మందులోంచి రెండు కోడెలను తీసుకొని పొమ్మని గూడ్లిబాయికి చెప్పి పంపాడు. గూడ్లిబాయి భర్తను పిలుచుకొని హెజ్జూరికి బయలుదేరింది. సర్వతప్ప బంగ్లా ముందు ఒకమూలలో నిలబడి "అయ్యా నేను గూడ్లిబాయిని. లంబాడి తండా నుంచి వచ్చాను" అని కేక పెట్టింది. పనిమనిషి బోయ సిద్లింగ "ఎవరిది." అని బయటకు వచ్చాడు. "అయ్యా, నేను గూడ్లి బాయిని. అయ్యగారు రెండు కోడెలను తోలుకొని పొమ్మన్నారు" అంది. గంధపు బొమ్మలా ఉన్న లంబాడి అమ్మాయి నిలబడి ఉండటం చూసిన సిద్లింగ మనసులో వందలాది ఆలోచనలు గిర్రున తిరిగాయి. "పాడు మనిషి, మాలాంటి పేదవాళ్ళ బతుకులతో ఆడుకోవడమే కాక ఇప్పుడు ఈ లంబాడి అమ్మాయి వెనుక పడ్డాడు" అని అనుకుంటూ ఏదో చెప్పడానికి నోరు తెరిచాడు. అంతలో 'రేయ్' అంటూ సర్వతప్ప కనుసైగ చేశాడు. "ఏయ్ లంబాడీ, నీ భర్త పంపానాయక్‌ను పెరట్లోకి పంపు" అన్నాడు. పూజ ముగించి జరీ అంచు పంచె మీద సర్వతప్ప అలాగే బయటకు వచ్చాడు. సర్వతప్ప అంటే తన లీలలకు హెజ్జూరులో, అలాగే తన చుట్టుపక్కల ఉన్న ఊర్లలోనూ ప్రసిద్ధుడు.

లంబాడీలు అంత సులభంగా దొరకరని అతనికి తెలుసు. అందులోనూ గూడ్లి బాయి సహవాసం అంటే నిప్పుతో సరసం చేసినట్టేనని చాలామంది అనుకుంటున్న మాటలు విన్నాడు. గడుసైన అమ్మాయిని లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు.

పంపానాయక్ కోడెలను పిల్లల మాదిరి జాగ్రత్తగా చూసుకోసాగాడు. ఆరు నెలలు వదిలి గౌరీ పౌర్ణమి అమావాస్య ముగిసి బలి పాడ్యమి అమావాస్య రోజున కరల్లి ఖాసీంసాబ్‌కు కోడెల బీజాలను తొలగించడానికి డబ్బులు ఇచ్చాడు. ఖాసీంసాబ్ అమావాస్య రోజున ముందుగా పంపానాయక్ కోడెల బీజాలను తొలగించడానికి పూనుకున్నాడు. తొలకరిలో రాగి, జొన్నకంకులను చేతిలో పట్టుకొని కోడెలను తినిపించాడు పంపానాయక్. కోడెలు చక్కగా ఏనుగుల్లా ఒళ్లుపట్టాయి. ఖాసీంసాబ్‌కు పంపానాయక్ కోడెలను లొంగదీయడం కాస్త కష్టమే అనిపించింది. బలిపాడ్యమి అమావాస్యకు రక్తంలో రాయడానికి వచ్చిన ధాక్యా, పీక, ఖేము, మంగ్ల్యా, బద్యా వయసు వచ్చిన కుర్రవాళ్ళు మూగుతాడును పట్టుకుని మెడను తిప్పి తోశారు. అయితే అది అంగుళం కదలేలదు. "అరే ఇట్లా కాదప్పా" అని అన్న వాడు బండితాళ్లు తెచ్చి కోడె నడుముకు బిగించి ఇద్దరు గట్టిగా తోశారు. తాలీంఖానాలో కసరత్తు చేసినవారి ముందు కోడె ఏం చేయగలదు? ఒకేసారి మూగుతాడు పట్టి తిప్పటం, ఖాసీంసాబ్ పగ్గం లాగిన పరిణామంగా కోడె నేలమీద దొర్లింది. పంపానాయక్ ఇంటి నుంచి ఆముదం నూనె తెచ్చాడు. అది గూడ్లిబాయి తానే స్వయంగా చేసిన ఆముదం నూనెలో పసుపు కలిపి పంపింది. గిన్నెలు తీసుకున్నవాడు బీజాలను కొట్టడానికి ముందు బీజాలను సవరి గట్టిగా నలిపాడు. కోడె 'అంబా' అని బాధగా వదిరింది. పంపానాయక్‌కు చాలా సంకటం కలిగింది. 'ఖాసీం అన్నా, కాస్త గడ్డి తీసుకుని రానా?" అన్నాడు. పంప ఏడ్పు ముఖాన్ని చూసిన ఖాసీం సాబ్ "అరె పంపా, ఎందుకు గాభరా పడతావ్ మీ కోడెకు ఏమీ కాలేదు. ఊరికే కూర్చో. కొంచెం తక్లీఫ్ అవుతుంది. అంతే" అని ఓదార్పుగా అన్నాడు. పంపానాయక్ బలవంతంగా దుఃఖం ఆపుకున్నాడు.

బీజాలు కొట్టిన తర్వాత పంప భార్య భార్య గూడ్లిబాయి పంపిన ఆముదము నూనె నంజు కాకూడదని పసుపుకొమ్మును ఎండబెట్టి, దంచి, నూనెలో కలిపి దాన్ని పూశాడు. "దేకోభాయి పంపానాయక్, ఒక వారం వరకు చాలా తక్లీఫ్ అవుతుంది. పశువులు కోడెలు గడ్డికూడా వేయవు. అందుకే నువ్వు రోజు చెరువులో ఈత కొట్టించు. వాపు తగ్గి పశువుల హాయిగా తిరుగుతాయి" అని ఖాసీంసాబ్ అన్నాడు. పంపానాయక్ అతని ప్రతి మాటకు 'అలాగే' అన్నాడు. తర్వాత ఖాసీంసాబ్‌కు

ఒక దమ్మిడి, బేడలు, బెల్లం, కొబ్బరి, ఒక గిద్దెడు జొన్నలు ఇచ్చి కోడెలను ఈత కొట్టించడానికి చెరువుకు తీసుకొని పోయాడు. బాధతో నడవలేకపోతున్నా కోడలు నీళ్లలో దిగటానికి సంకోచిస్తూ ముందుకు వెనక్కు కదలసాగాయి. ఒకదాన్ని ముళ్ళ చెట్టుకు కట్టి, మరొకదాన్ని "ఏయ్ రామ్...హూం...హే" అంటూ ఒళ్ళు తట్టి ప్రయత్నించాడు. దానికి విసుగు వచ్చినట్టుంది. నీళ్లు వద్దు. పంపానాయక్ సహవాసం వద్దన్నట్టు ప్రవర్తించసాగాయి. అయితే దాన్ని ఎలాగైనా ఈత కొట్టించడం అవసరం, అతని హింసను చూసిన సెణబు నాయక్ కొడుకు పితాంబ్రి నాయక్ "ఏం పెదనాన్నా" అని కోడెను పట్టుకుని, 'హెూ, హూ, ఎహెయ్' అని నిమిషానికి ఒక శబ్దం చేయసాగాడు. పంపకు మొదటే బుర్రపాడైపోయింది. "ఎందుకో నా మాటలు వినటం లేదు" అని పితాంబ్రి వైపు పగ్గాలు విసరి, వెళ్లి గట్టు మీద కూర్చున్నాడు. పితాంబ్రి ఒకసారి మగ్గం విసరి, తోక పురితిప్పి 'హె' అన్నాడు. కోడె రంయ్‌మని నీళ్లలోకి దూకి ఈత కొట్టసాగింది. పంపానాయక్ గాభరా పడ్డాడు. కోడె ఎక్కడ పోయిందో అని గట్టుమీద వెతకసాగాడు. "ఎక్కడికి పోయింది నా కోడె" అని అరిచాడు. అక్కడే ఎవరో తన ఎద్దుల ఒళ్ళు కడుతున్నవాడు "ఏయ్, నీ కోడె నీళ్ళలో ఈత కొడుతున్నది చూడు. ఎందుకు అలా గాభరాపడి మొత్తుకుంటున్నావ్" అని చూపించాడు. పంపా సంతోషంతో చెట్టుకు కట్టిన మరొక కోడెను తెచ్చి పితాంబ్రి చేతికి అప్పగించాడు. రెండిటినీ రెండుమూడు సార్లు ఈత కొట్టించి బిగుసుకున్న నరాలను సడలింపజేసి బయటికి తెచ్చి చెట్టుకు కట్టేసాడు. ఖాసీంసాబ్ చెప్పినట్టు ఒక వారంపాటు కోడెలు గడ్డి, నీళ్లు, దేన్నీ ముట్టలేదు. కాలం అన్ని గాయాలను మాన్పుతాయి అన్నట్టు కోడెలు ఎద్దులయ్యాయి.

గూడ్లిబాయి పెద్ద కొడుకు భగన్యనాయక్ పశువులు మేపుకొచ్చేంత వాడయ్యాడు. అది విద్యపట్ల అత్యంత నిరాసక్త మైన కాలం. వారం పొదుగునా పాఠశాలకు వెళ్లిన భగన్యనాయక్ కొన్ని అక్షరాలు నేర్చుకున్నాడు. అప్పట్లో విద్య చాలా దుబారా వ్యవహారం. ఇంట్లో పేదరికం. అతన్ని చదవటానికి ప్రేరేపించలేదు. నేర్చినవాటినే తలలో పెట్టుకొని పెద్ద పండితుడిలా ప్రవర్తించేవాడు. తండాలో ఉన్న ఒకరిద్దరు చదివిన వారిని ఆపి ప్రశ్నించేవాడు. ఇతని ప్రశ్నలకు జవాబు తెలియని వాళ్ళు భగన్యను చూడగానే పారిపోయేవారు. చూరు లేని ఇంటిని ఎత్తి నిలబెట్టే పూర్తి బాధ్యత నాయక్ మీద ఉంది. అయితే భగన్య నాయక్ అదే తండా పావాడినాయక్‌లా మరీ మొరటుగా, అవినీతితో ప్రవర్తించేవాడుకాదు. ఎన్నికలు పాతబడ్డాయి. ఈ

మధ్యన జరిగే ఎన్నికలు హత్యలు, దౌర్జన్యం, దోపిడీలు, కోళ్లు, సారాయి, నోట్లతో నడుస్తాయి. అప్పట్లో ఇలాంటి కష్టకాలం రాలేదు. ఎన్నికలు పాత బడ్డాయి. తండా లోని చెరువు పూర్తిగా ఎండిపోయింది. జనం సారాయి తాగడానికి అనుకూలం అయిందని సంతోషపడ్డారు. ఎందుకంటే చెరువు నిండితే మూడున్నర కిలోమీటర్లు గట్టు చుట్టూ తిరిగి పోవాలి. చెరువు ఎండిపోవడం వల్ల చెరువు మధ్యనుంచి నడుచుకుంటూపోతే ఒక కిలోమీటరు నడిస్తే చాలు. మాట్లాడుకుంటూ వెళ్లిపోవచ్చు. పరిస్థితి ఇలా ఉన్నప్పుడు జనాలకు గట్టును చుట్టుకుని రావాలంటే తల తిరిగిపోయేది. పావాడి మహా విలాసపురుషుడు. ఒక కార్యం ఉండనీ, ఒక పండుగ ఉండనీ, ఎన్నడూ తాగడానికి సెలవు పెట్టినవాడు కాదు. మున్నూరు–అవరత్నక మధ్య రోజు తిరిగేవాడు. అంతేకాకుండా చుట్టుపక్కల ఉన్న ఐదు పల్లెలకూ గుడదహట్టి కేంద్రం కావటంతో చుట్టూ ఉన్న సంగలాపుర, బోవినల్లి, సరళనహళ్లి, భేటీతండా –వీటికి కేంద్రమే గుడదహట్టి. పొద్దున్నే లేచి వారం కిందనే కాచిన సారాయి తాగి ఓటు వేయడానికి వచ్చాడు. డబ్బా ఎటు వైపు పెట్టారో, జనం ఎటువైపు కూర్చున్నారో తెలియక తూగాడు. ఎవరో పుణ్యాత్ముడు తీసుకొని పోయి ఓటు వేయించి తీసుకొచ్చి వదిలాడు. నిశ్శక్తుడైన పావాడి, “ఎవర్రా నన్ను ముట్టుకుంది...” అని దవడలు బిగించి, రాయి తీసుకొని విసరటానికి పోయినవాడు తూలిపడ్డాడు. అతను పడిన తీరుకు చనిపోయాడనే అందరూ అనుకున్నారు. ఎండలో కొద్దిసేపు దొర్లిన తర్వాత మత్తు దిగింది. గబుక్కున లేచి తువ్వాలుతో ఒళ్ళు తుడుచుకుని ఇంటివైపు పరిగెత్తాడు. అతని భార్య నాగి–

“ఒరేయ్, నీ తాగుడు పాడుగాను. నాలుగు కాసులు కూడా పెడదామని పెట్టివుంటే మొత్తం డబ్బులు కోసం తీసుకునిపోయినావు కదా? నీకు మానం మర్యాద ఉందా? ఎందుకు వచ్చావు. పోయినవాడివి అట్లాగే పోకూడదా?” అని వేకువనే కోడికూసినట్టు బాగా తిట్టింది. ఇంకా ఇక్కడే ఉంటే పోట్లాట మొదలతుందని బండి తోలుకుని వడ్డీ వసూలు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. పావాడి ఎద్దుల బండి చెరువు దగ్గరికి తోలుకొని రావటం, నరసాపుర తహసీల్దార్ దొర శింగారావు జీపు, బేడితండా వైపునుంచి ఎండిపోయిన చెరువులో దూసుకుని పోవటం ఒకేసారి జరిగింది. చిన్నగట్టు దాటి పెద్ద దిబ్బను ఎక్కిన బండి–జీపులు ఎదురెదురు అయ్యాయి. పీకలదాకా తాగిన పావాడి దారి వదిలి బండిని పక్కకు నడపకూడదని, జీపు డ్రైవర్ కొడుతున్న హారన్ శబ్దాన్ని లెక్క చేయలేదు. జీపు డ్రైవర్‌కు రోడ్డు వదిలి కారు నడిపితే చెరువులో చక్రం కూరుకుపోతుందనే భయం. బండివాడికి ఎక్కడ తన

బండి తలకిందులు అవుతుందేమోననే భయం. వీళ్ళిద్దరికీ వెనక్కి తగ్గే లక్షణాలు కనిపించలేదు. శింగారావు కిందకి దిగగానే సిరస్తేదారు సోమప్ప, తలారి నింగనాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాళప్ప పరుగున వచ్చారు.

"ఏయ్, నీ పేరేమి?" అని తహసీల్దార్ గంభీరంగా అడిగారు.

"ఎస్. పావాడి నాయక్" తాగిన మత్తులో కళ్ళు తిప్పుతూ అంతే గంభీరంగా జవాబిచ్చాడు.

"ఏమిటి? ఎస్. పావాడి నాయకా?" అని అడిగిన తహసీల్దార్ మళ్లీ అడిగాడు–

"ఎస్ అంటే ఏమిటి"

"ఎస్ అంటే ఎస్ !" ఏకవచనంలో జవాబిచ్చాడు.

తమాషాకు తహసీల్దార్ కొనసాగించాడు–

"ఎస్ అంటే"

"ఎస్ అంటే నో"

తాను సిద్ధం చేసుకున్న జవాబు ఇచ్చాడు.

"అవును ఈ కఱ్ఱదిమ్మెలను ఎక్కడికి సాగిస్తున్నావు? ఎవరి చెట్లవి?"

"చట్టప్రకారం నా పొలంలోని చెట్లు. నేనే నరికాను. వ్యవసాయానికి కావలసిన వస్తువులను చేయించటానికి బయలుదేరాను. కావాలంటే కేస్ వేయ్"

తహసీల్దార్ మౌనం వహించారు. సిరస్తేదారు సోమప్పకు కోపం వచ్చింది.

"ఏయ్ నాయక్. చట్టం నీకొక్కడికే తెలుసా? పదా స్టేషన్‌కు" అని దర్పం చూపాడు.

"చట్టం తెలిసినప్పటికీ స్టేషన్‌కు పిలుస్తున్నారు. వెళ్లి చట్టం తెలుసుకుని రండి. అటు తర్వాత మాట్లాడండి" అని వాళ్ల నోరు మూయించాడు.

ఈ తాగుబోతు సహవాసం ఎందుకని, తహసీల్దారు జీప్ డ్రైవర్ హుసేనితో–

"రివర్స్ గేర్ వేసి బండిని పక్కనుంచి పోనివ్వు" అన్నారు.

జీపు ఆయన చెప్పిన విధంగా సాగింది.

ఈ తమాషాను చూస్తూ నుంచున్న తండా కుఱ్ఱవాళ్ళు ఒక్కసారి బిగ్గరగా కేకలు వేశారు. తహసీల్దారుకు సంకోచం కలిగింది. పాడు లంబాడీల సహవాసం ఎందుకు? అందులోను ఈ వెధవ తాగివున్నాడని మనసులోనే అనుకుని మౌనంగా ప్రయాణం కొనసాగించారు. పావాడి నాయక్ తాను తాగి తహసీల్దారుతో వాదించడం సార్థమైందని అనుకున్నాడు. తానే గొప్పవాడని విఱ్ఱవీగాడు. ఆరోజు నుంచి పావాడి

నాయక్‌ను తడిమేవారు వందసార్లు ఆలోచించుకోవలసి వచ్చింది. 'ఆ లంజకొడుకు తహసీల్దారును కూడా వదల్లేదు. ఇక మనల్ని వదులుతాడా?' అని తమలో తాము మాట్లాడుకోసాగారు. తాగినపుడు పావాడి నాయక్ నోట ఇంగ్లీషు మాటలు మత్తును నింపుకుని బయటికి వస్తాయి.

గుడదహట్టి తండాలో బిగ్గరగా మాటల వినిపించసాగింది. పావాడికూ, గూడ్లిబాయికీ ఏదో గొడవ ప్రారంభమైంది. పావాడికి నిషా ఇంకా పూర్తిగా ఎక్కలేదు. ఒకటి రెండు ముంతల సారాయి మాత్రం తాగాడు. "ఏయ్, నువ్వు ఎవరమ్మా? ఏదో బుట్ట మోసుకుని వచ్చిందానివి. ఈ తండాను కట్టిన మమ్మల్నే ఎదురించి మాట్లాడుతావా? నీకెంత పొగరు?" అంటూ అస్తిత్వాన్నే దెబ్బ కొట్టే ప్రయత్నం చేశాడు. "ఎందుకురా భాడుకోవ్, నన్ను తడుముకుంటున్నావు? ఎవర్రా తండా కట్టినోడు? దిక్కులేని వాళ్లందరూ వలస వచ్చినవాళ్లే. ఏ నా కొడుకు ఇక్కడే శాశ్వతంగా ఉన్నాడో చూపించరా? అదేమో టస్ పుస్ అంటే నా దగ్గర సాగదు. వేరే ఎవరి దగ్గరైనా చూపించు" అని గర్జించింది. పావాడినాయక్‌ను పట్టిన దెయ్యం వదిలిపోయింది. అయినా మగవాళ్లు ఓడిపోకూడదని వాదించాడు. నోరు చేశాడు. "పోవే, ఎక్కువగా మాట్లాడితే నీమర్యాద తీస్తాను చూడు" అంటుండగా ఎప్పుడు పిడుగులా అతడిమీద ఎగిరిందో; పావాడినాయక్ బెదిరి తోక ముడుచుకుని కుక్కలా పారిపోయాడు. ఆ రోజు నుంచి అతని పొగరు తగ్గింది.

గూడ్లిబాయిది నోరు ఎక్కువ, కానీ వెన్నలాంటి మనసున్నది ఆమె కుటుంబం గురించి తండా జనం అనుకునేవారు. 'బుట్ట మోసుకుని వచ్చింది' అని పిలిచేవారు. "అలా అన్నవాళ్ళను కాళ్ళమీద పడేలా చేయకపోతే మా నాన్న అమ్‌గోత్ బద్యా నాయక్‌కు పుట్టినదాన్ని కాదు" అని సవాలు చేసి పంపాలాంటి అమాయకుడితో బతుకసాగింది. తన కొడుకు భగన్యనాయక్ బాల్యాన్ని తండాలోని మొద్దుపిల్లల్లా గోలీలు ఆడకుండా, ఆమ్‌గోత్ అనే ఆట ఆడకుండా, అండోల్ పండోల్ ఆటలు ఆడకుండా చేసింది. తండా కుర్రవాళ్ళ వెంబడి గుడి, హనుమప్ప తేరు, స్కూలు మైదానం అంటూ తిరగటానికి వదల్లేదు. వాడేమో వాడి ఇల్లేమో అన్నట్టు వుండేవాడు. చిన్నప్పటి నుంచే వాడు గూడ్లిబాయి పాఠశాలలో తర్ఫీదు పొందసాగాడు. తండ్రి వెంబడి పొలానికి వెళ్లేవాడు. ఆ చిన్న వయసులోనే వాడు తండ్రితోపాటు ఎద్దుల పగ్గాలు పట్టుకుని గట్టు వెంబడి ఎద్దులను మేపడం, వాడి తండ్రి గట్టుమీద కూర్చుని బీడి తాగుతుంటే వాడే మడక పట్టుకుని వరుస వెంబడి "ఏయ్ం నంది కురవతి హూఁ" అని ఎద్దులను గద్దిస్తూ నడుపుతున్న తీరులో మంచి వ్యవసాయదారుడి

లక్షణాలు కనిపించసాగాయి.

భగన్య నాయక్ ఎనిమిది, పదేళ్ళవాడవుతుండగానే తండా జనం ఎలా బండిని హారదూ నుంచి ద్వావనూరు పట్టణానికి వేరుశెనగ సంచులను అద్దెకు నడుపుతున్నారో తెలుసుకుని, తానూ అద్దెకు బండి తిప్పుతానని తల్లిని అడిగాడు. "అయ్యో నా తండ్రి. నువ్వింకా చిన్నవాడివి నాయనా, కాలం బాగులేదు నాయనా, ఒక వయసుకు వచ్చిన తర్వాత నీకు ఇష్టం వచ్చినట్టు చేద్దువులే" అని అతని కలలకు పుష్టినిచ్చింది.

ఒక్కో రోజున ఒక్కో అనుభవాన్ని పొందేవాడు. భగన్యనాయక్ తానే ఎద్దులను మేపటం, రంటె, కుంటే, కూరగి పట్టుకునే కళను హస్తగతం చేసుకున్నాడు. "అదికాదు, ఆ పంపా కొడుకు ఇంత చిన్న పిల్లగాడు. ఎంత హుషారు అనుకున్నారు. వాడు పొలం దున్నటం నిలబడి చూడాలిరా సూర్యనాయక్, అబ్బబ్బా అలాగే నీటుగా నేలను చీల్చుకుని వస్తుందిరా మడక" కుతూహలం ఆపుకోలేక బోయ కెంపీరజ్జ సూర్యనాయక్ ముందు వివరంగా అన్నాడు. సూర్యనాయక్ భరించలేకపోయాడు. ఈ దొంగనా కొడుకు మంది పిల్లలను పొగుడుతాడు కదా? తన పిల్లల గురించి మాట్లాడదు. అంతేకాకుండా బుట్ట పట్టుకుని వలస వచ్చినవారి గురించి, ఈ మధ్యన గుడదహట్టి తండాచేరుకున్నవారి గురించి మాట్లాడుతాడు. మా పిల్లలకు ఏమైంది? అని ఒక్కడే ఆలోచించసాగాడు.

గుడదహట్టి లంబాడీలతో, ఉప్పార చెన్న బసప్ప, సాబర దిన్నుసాబి, కాయక పక్కిరేశి, బారిక యంకప్ప ఎప్పుడు వచ్చి చేరుకున్నారో. తూర్పున అయిదారు ఉప్పరోళ్ల ఇండ్లు ఉన్నాయి. లింగాయతులు ఉన్నారు. చాకప్ప మాస్టారు ఉన్నారు. పైగా చాకలి శివుగ, కాళేర ఈర తాండాలో నివాసం ఉండటం వల్ల గుడదహట్టి చుట్టుపక్కల సణ్ణట్టి, అణిమేగల, చాకలబి తండాలకన్నా భిన్నమైంది. మొత్తం తండాలోని జనమంతా గోర్‌బోలితోపాటు కన్నడ మాట్లాడేవారు. ముసల్మానులు ఉర్దూలో మాట్లాడుతూ చాలా అన్యోన్యంగా ఉండేవారు. ఆ మొత్తం తండాలో పెంకుటిల్లు వున్నది ఉప్పార హులవప్పది మాత్రమే. అతనే తండాలో పెద్దమనిషి. తండాలోని లంబాడీలందరూ తెల్లవారుతుండగానే ఏదో ఒక పనిమీద వెళ్లి అతని ఇంటిముందు నిలబడేవారు. అర్ధసేరు, అరపావు రాగి లేదా పట్నం నుంచి వచ్చిన ఎర్ర జొన్నలో ఇస్తే పేదల పొయ్యి మండేది. ఎందుకంటే లంబాడీల జీవితాలకు ఒక క్రమశిక్షణ లేదు. చిన్నచిన్న వ్యాపార వ్యవహారాలు చేసుకుంటూ సామానుసరంజామా మోసుకుని ఊరి నుంచి ఊరికి తిరుగుతూ **సళాయి,** మాంసం

తినటంలోనే జీవితం సాగిస్తున్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఒళ్లు వంచి కూలీనాలీ చేయడం సాధ్యమా? చాలా కష్టంగా ఉండేది. స్త్రీలు కూలికి పోయి ఏదైనా తెస్తే ఆ డబ్బు మగవాళ్లు తాగడానికి, వేరే ఏదైనా దురలవాట్లకు ఖర్చయ్యేది. దూరప్రాంతాల నుంచి వలస వచ్చిన పక్షుల్లా ఎగురుతూ వచ్చినవారు తండా కట్టుకుని స్థిరనివాసం ఉండసాగారు. భరమానహట్టి నుంచి పశ్చిమానికి దుంబలూరు మూడు కిలోమీటర్లు. తూర్పుకు దిబ్బేనహళ్లి. ఉత్తరానికి దేగూరు, దక్షిణానికి నారదపుర, ద్యావనూరు, లమత్ర పెద్దపట్టణాలు. మార్కెట్లు, మిల్లులు. వందలాది మందితో కిక్కిరిసి వుండేవి. ద్యావనూరు మండిపేట, దుర్గవ్వ గుడి, మండక్కి బట్టి, హొంద సర్కల్, అటు వైపు వెళితే పెద్దాసుపత్రి, ఒక్క అణకు మరమరాల ఒగ్గాణి, దమ్మిడికి రెండు బజ్జీలు. ఉదయం పూట వచ్చి ఒగ్గాణి, రెండు మిర్చి బజ్జీలు తింటే మధ్యాహ్నం బి.కె. మిల్లు సైరన్ కూసే వరకూ ఆకలి వేసేదికాదు.

గుడదహట్టి జనంమాత్రం ఆదివారం సంతకు వెళ్లి కాయగూరలు, ఇంటికి కావలసిన సరుకులు, ఆకువక్కలు కొనేవారు. లంబాడీలు మాత్రం గొర్రెతల, లేదా సళొయికి అవసరమైన మసాలా దినుసుల కోసం సంతకు వెళ్లేవారు. సోమవారం దేగూరులో సంత. శుక్రవారం నారదపుర సంత, అది తప్పితే మంగళవారంలో జరిగే సంతకో, లేదా హరిపురలో శుక్రవారం జరిగే సంతకు తప్పకుండా వెళ్లేవారు. అంతేకాకుండా చెరువులో చేపలు, ఎండ్రకాయలు ఉండనే ఉండేవి. తెల్లవాళ్లు మన దేశం వదిలి వాళ్ల తమ దేశానికి పోయినప్పటి నుంచీ కరణాల ప్రాబల్యం కాస్త తగ్గింది. తలారులు కొత్తగా పన్నులు వసూలు చేయటానికి వెళ్లేవారు. తలారి తమ్మన్న ఉన్నట్టుండి తండాకు వచ్చినవాడు తప్పెట వాయించే కరియను వెంట బెట్టుకుని వచ్చాడు. రచ్చబండ దగ్గర నిలబడి తప్పెట వాయించి, "వినండప్పో వినండి. ప్రభుత్వం వాళ్లు గుడదహట్టి తండాలో తూర్పున ఉన్న అయిదు వందల ఎకరాల పొరంబోకు భూమిలో ఒక పెద్ద చెరువు నిర్మించే ప్రణాళిక వేసుకున్నారు. అందరూ కూలీకి రావాలప్పో..." అని బిగ్గరగా చెప్పాడు. తండా జనాలకు సంతోషం కలగలేదు. ఎందుకంటే తండా పక్కన వారికి చిన్నాచితకా జమీను ఉంది. చెరువుకట్ట కింది జమీను దుంబలూరివి. అయినా పశువులకు నీళ్లు దొరికుతాయని చెరువు గట్టు నిర్మాణపు పనికి వచ్చారు. తమిళనాడుకు చెందిన ఒడ్డరులను రాళ్లు కొట్టడానికి, చెరువుగట్టుకు గోడలు కట్టడానికి పిలిపించారు. ఊరి ఒడ్డరులకు రాళ్లు లేపే పని. ఎవరో ఒక ఒడ్డోనికి రాగి అండా దొరికిందని పుకారు లేచింది. జనం నెలలపాటు కథలు కట్టి చెప్పసాగారు. ఒడ్డోళ్ల గిడ్డప్ప పేరు మాత్రం చిన్నది. అయితే ఆసామి

ఆరడుగుల ఎత్తు. ఉదయమే రాగిముద్ద, పచ్చికారంతో వంకాయ కాల్చి చేసిన చట్నీ పెట్టుకుని రెండు రాగి ముద్దలు మింగి, రెండు చెంబుల నీళ్లు తాగి పనికి నిలబడితే సూర్యుడు పడమరలో మునిగిన తర్వాత చేసున్న పని ఆపేవాడు. గుడిసెకు వచ్చి, బావి నుంచి నీళ్లు చేది ఒంటి మీద పోసుకుని మళ్లీవేడి ముద్దలు తిని, సంపంగి చెట్టు నీడలో పడుకుంటే మళ్లీ తెల్లవారు జామునే లేవటం. నెలలు గడిచి, సంవత్సరం గడుస్తున్నా చెరువు పావువంతు ఒడ్డు పావువంతు నిర్మాణం పూర్తి కాలేదు. తొలకరి ప్రారంభం అవుతుండగా తండా ముందు ఎర్రటి ధూళి లేస్తే పని బంద్ ఆయ్యేది. మళ్లీ వేసవిలో పనులు ప్రారంభమయ్యేవి. రెండవ సంవత్సరం పనులకు జనం ఎక్కువమంది వచ్చారు. ఆంధ్రా నుంచి కూడా తాళ్ళుమ కొట్టడానికి కొంత మంది ఒడ్డర్లు, కట్టడం పనిచేసే ఒడ్డర్లు, సాయిబు గౌండలు, రాళ్లు మోసే కూలీలు, మట్టి మోసే కూలీలు పనులు చేస్తూ ఉన్నారు. గిడ్డయ్య భార్య లక్ష్మి అయిదవ కాన్పు సమయమని తమిళనాడులోని ఈరోడ్ వైపు వెళ్లింది. ఎవరో ఊరివారు ముద్ద చేసి పెట్టేవారు. ఆంధ్రా నుంచి వచ్చిన జనానికి పక్కనే టెంట్లు వేశారు. గిడ్డయ్య పక్కనే ఆంధ్రాకు చెందిన తిమ్మబోవి భార్యతో చనువు పెంచుకున్నాడు. ఒకే చోట పనిచేసేవాళ్లు. వాళ్లు తింటున్నప్పుడు తిమ్మబోవి భార్య చిక్కాలి కోడి మాంసం ముక్కలు కాల్చి పెట్టేది. ఒక్కొక్కసారి ముద్ద కూడా పెట్టేది. తిమ్మబోవికి కానీ, గిడ్డయ్యకు కానీ మనసులో ఏ చెడ్డ ఆలోచనలు లేవు. మామూలుగా మగవాళ్లు రాళ్లు లేపితే, ఆడకూలీ దాన్ని ఎత్తి బయట పెట్టేది. గిడ్డయ్య చూడటానికి మన్మథుడిలా లేడు. అయినా తిమ్మబోవికన్నా బాగున్నాడు. తన పాటికి తాను పని చేసుకుంటూ ఉండేవాడు.

తిమ్మబోవి దగ్గరికి రాళ్లు లేపడానికి గిడ్డయ్య వచ్చాడు. అతను ఆ పనిలో సాటిలేనివాడు. ఇద్దరు అర్ధంబర్ధం తెలుగులో మాట్లాడుకోసాగారు. బీడి వెలిగించి పని మొదలు పెట్టారు. ఒకసారి గిడ్డయ్య, తిమ్మబోవిలు బండరాయి లేపుతుండగా బండరాయి కింద ఏదో మెరుపులా మెరిసినట్టయి వెంటనే ఆ రాయిని లేపడం వదిలి మరో రాయిని గడ్డపారతో లేపాడు. పని చేసేటప్పుడు ఆ రాయి కింద మెరిసింది రాగి ఆండా కావచ్చని అనుకున్నాడు. అదేమైనప్పటికీ తన శ్రమకు లభించిన సంపద అనుకున్నాడు. చిక్కాలికి ఎలాగో విషయం తెలిసి, గిడ్డయ్య వెంటపడింది. “అదికాదురా గిడ్డా, నువ్వు ఏమి చూసినావు. అది నాకు కావాలా?” అంది. “వద్దు చిక్కాలి. అది ఎవరిదో సంపద. ఆశపడవద్దు” అని ఆమె నోరు మూయించటానికి ప్రయత్నించాడు. చిక్కాలి భర్తకు విషయం చెప్పింది. ఆశపోతు

భర్త, భార్యను పొగడి, అది ఒకవేళ బంగారమే అయితే ఆ బంగారంలో కొంతైనా తమకు దక్కితే ఈ రాళ్లుకొట్టే పనిమాని రాణిలా బతకొచ్చని నచ్చజెప్పాడు. ఎలాగైనా వాడికి నచ్చజెప్పు. ఒకవేళ వాడు కోరితే వాడి దగ్గర పడుకుని వాడి కోరిక తీర్చు. ఆ బంగారాన్ని ఎలాగైనా సంపాదించమని భార్యను పురికొల్పాడు. భార్య వినకపోతే 'పోవే నీ అమ్మ' అని గద్దించాడు.

ఆ రోజు రాత్రి తిమ్మబోవి పీకలదాకా తాగి గిద్దకు తక్కువ సారాయి మిగిల్చాడు. ఇంట్లో రెండు నాటు పుంజులను కోసిన చిక్కాలి మాంసం చారు, రాగిముద్ద చేసింది. చంద్రుడి వెలుతురులో కడుపు నిండా మాంసం తిన్న తిమ్మబోవి గిడ్డయ్య డేరాలోకి వెళ్ళి పడుకున్నాడు. గిడ్డ ఇంకా భోజనం చేయలేదు. చిక్కాలి కంచెంలో ముద్ద పెట్టి అతని పక్కకు వచ్చి కూర్చుని మాటలు మొదలుపెట్టింది. "ఏయ్ ఇక్కడ చూడ్రా" అంటూ అతని చేయి తీసుకుని ఎత్తయిన గుండెల మీద పెట్టుకుంది. గిడ్డయ్యకు చంద్రుడి వెలుతురు మసకబారినట్టు కనిపించింది. ఏమవుతుందో తెలిసేలోపు డేరాలోని వస్తువులు చెల్లావెదురు అయ్యాయి. "మగవాడంటే నువ్వేరా, నాకు నువ్వు కావాలి" అని అతని ఎదలో ముఖం పెట్టి చిక్కాలి అంది. తిమ్మబోవి, చిక్కాలిల పెళ్లయి అయిదారు సంవత్సరాలైనా చిక్కాలి ఒంటి బిగి తగ్గలేదు. ఇద్దరూ కోరికలతో ఒకరినొకరు పెనవేసుకున్నారు.

తెల్లవారింది. తిమ్మబోవి తన భార్య కనిపించకపోవటంతో లబలబా నోరు కొట్టుకున్నాడు. అతని బాగా పరిచయమున్నది గూడ్లిబాయి మాత్రమే. అప్పుడప్పుడు ఆమె ఇంటికి వెళ్లి దమ్మిడి, అణా చేతిఖర్చులకు ఇప్పించుకునేవాడు. ఒక్కోసారి ఆ ఇంట్లో రాగిముద్ద తిని వచ్చేవాడు. గూడ్లిబాయికి తిమ్మబోవిని పెద్దకొడుకును చూసినట్టు చూసేది. తిమ్మ నోరుకొట్టుకోవటం విని తన పొరుగువారిని పిలుచుకుని, ఏమయ్యిందోనని పరుగున వచ్చింది. "ఏమైంది తిమ్మబోవి, ఎందుకిలా లబలబా కొట్టుకుంటున్నావు?" అని గాభరాగా అడిగింది. "అయ్యో అక్కా తిరుపతి తిమ్మప్పా, ఏమని చెప్పాలి? నా భార్య చిక్కాలి, గిడ్డయ్యలు పారిపోయారు" అన్నాడు. దుఃఖంలో తనకు తెలియకుండానే తన మాతృభాష బయటికి వచ్చింది."అరే, కన్నడలో చెప్పరా, నీ భాష నాకు అర్థం కాదు" అని అంది గూడ్లిబాయి. "ఏం చెప్పనమ్మా, నా భార్య పారిపోయింది" అని సగం మాటలతో సగం విషయాన్ని చేత్తో సైగ చేసి చూపించాడు. విషయం గూడ్లిబాయికి అర్థమైంది. "అందుకేరా పనికిమాలిన వెధవా! ఇలాంటి వెధవలను నీ ఇంటి దగ్గరకు రానివ్వకూడదని అంటారు. అయినా నువ్వు మగవాడివైతే ఇలా జరిగేది కాదు. నువ్వు ముందు లేవయ్యా" అని అతన్నే తప్పుబట్టి మాట్లాడింది.

తిమ్మబోవి ఏదో సంజాయిషి చెప్పాడు. గూడ్లిబాయి అతని ఓదార్చింది. జనం మాత్రం బండరాళ్లను లేపేటప్పుడు గిద్దయ్యకు విజయనగర సామ్రాజ్యపు కాలపు బంగారు కాసులతో నిండిన ఒక రాగి ఆండా దొరికిందని, అందుకే తిమ్మ బోవిభార్య, గిద్దయ్యతో కలిసి పారియిందని, పారిపోయేటప్పుడు ఆ ఆండాను ఎత్తుకుని పారిపోయారని స్వయంగా తామే చూసినట్టు కథలల్లి ఇతరుల ముందు చెప్పసాగారు.

తిమ్మబోవి మళ్లీ గానుగెద్దులా మౌనంగా పనిలో మునిగిపోయాడు. బతుకును భారంగా అరగదీయసాగాడు. రోజూ రాత్రి భట్టి సారాయి తాగి తెలుగులో భార్యను తిరుగుతుండేవాడు. రోజురోజుకు చెరువుచుట్టూ గట్టు నిర్మాణం వేగంగా సాగింది. చెరువుగట్టు మాత్రం వర్షం కోసం ఎదురు చూస్తున్నట్టు చూసేవారికి అనిపించింది. చెరువు కింది జనం జయ బ్రాండ్ వరి విత్తనాలను తన బంధువుల నుంచి తెచ్చుకోవడానికి చర్చలు జరిపారు. కొందరు ఉన్న పొలాలను దున్ని విత్తనాలు నాటడానికి సిద్ధం చేసుకోసాగారు.

చెరువుగట్టు పూర్తయింది. ప్రారంభంలో సాధారణంగా ఉన్నా తొలకరి తీవ్రమైంది. వర్షం నుంచి, అడవినుంచి, ఇతర ప్రాంతాలనుంచి ప్రవహించిన నీళ్లు నేరుగా చెరువులోకి చేరుతూ రోజురోజుకు నీటి ప్రమాణం పెరగసాగింది. చెరువు నిండటంతో సంతోషపడ్డవారు దుంబలూరు ప్రజలు. వాళ్లలో ఉత్సాహం రెట్టింపయింది. ఎంత పంట వేస్తే ఎంత దిగుబడి వస్తుంది. మార్కెట్లో దాని ధర ఎంత ఉండవచ్చు. ఎంత ప్రమాణంలో నాట్లువేయాలి అని లెక్కలు వేసి మనసులోనే ఆనందంతో గంతులు వేయసాగారు.

తాము కట్టిన తర్వాత నిండిన చెరువు నీటిలో తన కన్నీళ్ళు వెతకసాగాడు తిమ్మబోవి. చెరువుగట్టు నిర్మాణానికి వచ్చి కూలీలంతా వెళ్లిపోయారు. అయితే తిమ్మబోవి మాత్రం కదలకుండా ఇక్కడే ఉండిపోయాడు. తన సొంత ఊరులో జరగబోయే అవమానాన్ని గుర్తుచేసుకొని సగం పిచ్చివాడయ్యాడు. ఒకరోజు చెరువులోకి దూకి చెరువు శాంతికి మొట్టమొదటి బలి అయ్యాడు. కొంతమంది అపశకునం అన్నారు. కొందరు చెరువు బలి తీసుకుందన్నారు. ఇంకా కొంతమంది పీకలదాకా తాగి జారిపడ్డాడు అన్నారు. అతనంటే పడనివారు చంపి చెరువులో తోసి ఉండాలని అన్నారు. అతని చుట్టూ అల్లుకున్న వదంతులలో సత్యం మాత్రం తిమబోవి శవంతో పాటు సమాధి అయింది. అటుతర్వాత జనంమాటల్లో నానా వేషాలు దాల్చాడు.

జనం వరినాట్లకు సిద్ధమయ్యారు. తొలకరి ముగుస్తూ వచ్చింది. చెరువులో

నీళ్లు తగ్గుతూవున్నాయి. అక్కడక్కడ నిలబడిన నీళ్లలో చిన్న చిన్న చేపలు, నానా రకాల బురద మట్టలను పట్టుకొని తిని మిగిలిన చేపలను ఎండ పెట్టుకున్నారు. ఇంకా కొంతమంది పక్క ఊర్లకు వెళ్లి అణాకు, దమ్మిడీకి కేజీ లెక్కన అమ్మి డబ్బులు కూడబెట్టుకున్నారు. ఇదిలా ఉండగా పంటలు పండిస్తున్నవారు చెరుకు వేయడం మొదలెట్టారు. చెరుకు పండించేవారు బెల్లపు గానుగ వేశారు. చెరువు ప్రజలకు ప్రాణాధారం అయింది. ఎద్దులు, గేదెలు, దూడలు మొదలు చిలుకలు, గోరువంకలకు చెరువు ఆసరా అయింది. చెరువు గట్టు మీద నాటిన మామిడి చెట్లు, చింత చెట్లు, రావిచెట్లు పెద్దగా పెరిగాయి. ఎవరో చెరువు తూము కింద ఒక రాయికి సున్నము, ఎర్రమట్టి పూసి, దానికి కుంకుమ, బండారం పూసి, కర్పూరం వెలిగించి చెరువు తూము చౌడమ్మ అన్నారు. చెరువుకింది పొలాల యజమానులు చౌడమ్మను పూజించ కుండా నాట్లు వేసేవారుకాదు. ఇలాగే తండా చుట్టూ వంద, రెండు వందల దేవతలు పుట్టుకొచ్చారు. గూడ్లిబాయి భగన్య తర్వాత పుట్టిన చాంపు, కేవడి, మంగు–జన్మనిచ్చిన బిడ్డలను సాకడంలో తిప్పలుపడసాగింది. సర్వతప్పా పొలం మాత్రమే మొత్తం కుటుంబానికి ఆశ్రయమైంది. తన పెద్ద కొడుకు భగన్య భుక్యా కరమ్‌తోట్ మాత్రమే తల్లికి తగ్గ కొడుకయ్యాడు. తల్లి కాలితో చూపిస్తే శిరసావహించడమే అతని పని. తండాలో బండ్లు అద్దెకు తిరుగుతూ ఉండటం చూసి అతని మనస్సు గిలగిల్లాడేది. ఐదారుసార్లు తన మనసులోని మాటను తల్లి ముందు చెప్పుకున్నాడు. "అమ్మా, నేను ఎద్దుల బండిని అద్దెకోసం బయటి ఊళ్లకు ఎందుకు తిప్పకూడదు" అని తన కుతూహలాన్ని వ్యక్తపరిచాడు. "నాయనా నువ్వు ఇంకా వయసుకు రాలేదు. మీ నాన్నను, మీ తమ్ముడిని, చెల్లెళ్లను పిల్చుకునిపోయి చెట్లు చేమలను, పొదలను నరికి శుభ్రం చేసి పదిహేను, పదహారు ఎకరాల స్థలం చూసుకోండి. అది సర్కారు భూమి. ఎవరి ఏమంటారో చూద్దాం" అని అతని ఉత్సాహాన్ని మరోవైపు తిప్పింది.

తండా జనం జనం ఊరి వైపు ఒక ఎకరానో, అర్ధ ఎకరానో తీసుకొని దాన్ని చేసుకోలేక దీర్ఘంగా నిట్టూర్పులు విడిచేవారు. భగన్యనాయక్, తన తమ్ములను, చెల్లెళ్లను వెంటబెట్టుకుని, తండ్రి పంపానాయక్‌తోపాటు వెళ్లి చిన్నచిన్న పొదలను నరికి, చతురస్రాకారంలో ఒక భూమిని చదును చేసి చుట్టూ గట్టు ఏర్పరిచాడు. కింద పారుతున్న కాలువ గట్టు నుంచి పైనున్న మట్టిదిబ్బ వరకు మొత్తం పదిహేను ఇరవై ఎకరాల స్థలాన్ని వ్యవసాయానికి అనుకూలంగా చేసుకోవాలని తండ్రి–పిల్లల ఆలోచన. తండానుంచి మూడుమైళ్ళ దూరంలోని అడవిలోకి నడిచి వచ్చిన

తండ్రి–పిల్లలు ఎలాంటి భయం లేకుండా, అనుమానం లేకుండా సంపూర్ణమైన విశ్వాసంతో చేపట్టిన పని పూర్తిచేశారు. అయితే విషాదం ఏమిటంటే అది రాతినేల, అక్కడ చాలాచోట్ల పెద్దపెద్ద బండరాళ్లు నేలలో ఉన్నాయి. అలాంటి నేలలో విత్తనాలు వేసినా పంట రావడం కష్టమే. ఒకవేళ వచ్చినా అయిదారు మూటలు మాత్రమే. పైగా వర్షం వచ్చినా నీళ్లు నిలబడటం కష్టం. నీళ్లతోపాటు భూసారం కొట్టుకుపోవడం వల్ల పెద్దపెద్ద బండరాళ్లు బయటికి కనిపించేవి. తొలకరిలో వర్షం గట్టిగా పట్టుకుంటే గట్లు, మొలకలు కొట్టుకుపోవడం సహజం. పెద్దపెద్ద సమస్యలు పుటుకుని వచ్చేవి. పెరిగిన పంట కడుపు నింపుకోవడానికి మాత్రం సరిపోయేది. అయితే ఖర్చులకు చిల్లిగవ్వ కూడా మిగలకుండా కాలం గడపడం కష్టమైంది.

భగన్యభుక్యా కరమ్‌తోట్ తండాలో ఏదైనా సాధించాలనే పట్టుదలను కలిగినవాడు. అతని తండ్రి పంపానాయక్ చాలా అమాయకుడు. ఇతను తండ్రి స్వభావానికి పూర్తిగా వ్యతిరేకి. వ్యాపార, వ్యవహారంలో చాలా తెలివైనవాడు. ఒక్క పైసా కూడా తేడా వచ్చేది కాదు. లెక్క పూర్తిగా సరిపోవాల్సిందే. అప్పటిదాకా వదిలేవాడు కాదు. సర్వతప్ప పొలంలో పనిచేసే కూలీల లెక్క, కలుపు తీసినది, కోతలు కోసినది అంతా అతడి తలలో ఉండేవి. భట్టుగారు లెక్క చేయడానికి కూర్చున్నప్పుడు అతని కన్నా ముందే కొడుకు, కొడుకుకన్నా ముందు అతను, భట్టుగారు అరకేజీ లెక్క తేడా చేసినా పట్టుకునేవారు. అందువల్ల భట్టుగారు చాలా జాగ్రత్తగా లెక్క చేసి ఇవ్వవలసిన వారికి ఇచ్చి మళ్లీ కొత్త లెక్కలు రాసేవాడు. భగన్య మాత్రం మొత్తం తండాలోని జనానికి ఆశ్చర్యం కలిగించేవాడు. పెంకుటింట్లో నివసించే ఉప్పార హులువప్ప మాత్రం దొంగ పనులు చేసే అతని పదకొండు మంది మగపిల్లల గురించి, పదహారు మంది మగపిల్లలున్న దిన్నిసాయిబు ఎదుట, “అది కాదు దిన్ని, ఈ జానెడు పొట్టెగాడు చేసే పనిలో పావువంతు నా పిల్లలు చేస్తే మా వంశం అభివృద్ధి చెందేది. వానెవ్వ ఏమంటావ్?” అని దిన్నిని అడిగాడు. “అదేనయ్యా హుల్లు, అదేమో సామెత ఉందికదా, ‘చేసుకున్నవారికి చేసుకున్నంత’ అనేలా మన పొరపాట్లు. మాకు పదకొండు మంది మగపిల్లలు ఉన్నారు. ఏ పనులూ చేయరు. ఒకడేమో జరా భార్య ఊరికి పోయివస్తానని పోతాడు. ఇంకొకడు పేటకు జాకే శ్యామ్‌కు వస్తానంటాడు. ఇలా ఉంటే కేతికా కామ్, ఘర్‌కా కామ్ ఏం కావాలి చెప్పు?” అని ఎదురుప్రశ్న వేశాడు. “ఏం చేయగలం. మన కర్మ. అనుభవించాలి కదా” అని దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు. “పోనీలే హుల్లూ బాయ్” అని ఓదార్చడానికి చూశాడు.

అయితే ఎక్కడో అతని మనస్సు మూలలో భగన్య కుటుంబం నిన్నా మొన్నా వచ్చి నివాసం ఏర్పరుచుకుని ఎలా అభివృద్ధి చెందుతున్నారో చూస్తూవుంటే తాను అనుభవిస్తున్న ఐశ్వర్యం తన నుంచి ఇతనికి బదిలీ అవుతుందేమోనని భయం ఏర్పడింది. కన్నడిగుడైన ఉప్పార హులువప్ప, తాను కులంలో ఉన్నతుడు, ఈ లంబాడీలు చాలా తక్కువ అని అనుకున్నాడు. అతని ఇంటి ముందు అతని కోసం ఎదురుచూస్తున్నా నాలుగైదు కుటుంబాలు అతని ఆజ్ఞానుసారం నడవడమే గొప్పతనంగా భావించేవారు. సంవత్సరంలోని 365 రోజులు గాదెలు, పాతరలు నిండి ఉండేవి. ఇంట్లో ధాన్యపు గది నిండుగా ఉండేది. ఇరవైనాలుగు గంటలూ పాలు, వెన్నె, మజ్జిగ గిన్నెలు నిండి తొణుకుతుండేవి. కట్టమీద మూలలో ఎప్పుడూ జొన్ననూకల అంబలి ఉండేది. దాంతో పాటు మజ్జిగ కూడా ఉండేది. వచ్చిన వాళ్లు దాన్ని వడ్డించుకొని మజ్జిగ పోసుకుని అక్కడే తినేవాళ్లు. ఈ సంపదంతా ఏదో ఒకరోజున మాయమయ్యే లక్షణాలు కనిపించాయి. వయస్సు పెరుగుతున్నట్టే పిల్లలు మాటలు వినకుండా పోయారు. ఊరు ముందున్న ప్రధానమైన భూములు కాస్త ఆసరా అయ్యాయి. అతని ఐశ్వర్యానికి అవే కారణమైంది.

భగన్య కోరిక ప్రకారం చంద్యానాయక్ బండిని ఒక అణాకు అద్దెకు తీసుకున్నాడు. బండిలో వేరుశెనగ మూటలు వేసుకుని సుమారు నలభై మైళ్ళ దూరం రవాణా చేస్తే రూపాయిన్నర అద్దె. తన కోడెలు బలంగా ఉండటం వల్ల, తాను కూడా ఒకటిన్నర రూపాయి సంపాదించవచ్చనే నమ్మకం కలిగింది. మొదటిసారి ఏమీ తెలియనివాడు నలభై మైళ్ల దూరంలోని నరసాపుర తండా నుంచి పదిహేనుమైళ్ల దూరం ఉన్న ద్వావనూరు మార్కెట్‌కు వేరుశనక్కాయలు తరలించాడు. వారానికి రెండు సార్లు తోలితే మూడు రూపాయలు దొరికేవి. జనం వారానికి రెండుసార్లు బండి తోలితే ఇతను మూడుసార్లు తోలేవాడు. అందువల్ల అతని సంపాదన ఎక్కువగా ఉండేది. ఇతరుల్లా అంగట్లో తినటం, సారాయి తాగటం అనే మాటే లేదు. పంచ అంచుకు డబ్బులు కట్టుకొని, నడుములో దోపుకునేవాడు. నేరుగా తల్లి గూడ్లిబాయి ముందుకొచ్చి ముడి విప్పి డబ్బులు తీసి తల్లి చేతుల్లో పెట్టేవాడు. అలా పైసా పైసా చేర్చి గూడ్లిబాయి చూడి గేదెను కొనేది. దానిమీద వందలాది కలలను కట్టుకునేది. గేదె ఈనగానే పాలు, పెరుగు, వెన్న, నెయ్యి అమ్మాలనే ప్రణాళికను రూపొందించు కునేది. మంగళవారం హరిపుర సంతలో నాటు పుంజులను, కోళ్లను అమ్మి డబ్బులను కూడబెట్టేది. కొడుకు తెచ్చిన కాసులను చేర్చి మూటకట్టి ట్రంకుపెట్టె మూలలో ఎవరికీ కనిపించకుండా దాచిపెట్టేది. భవిష్యత్తులో కూతురు, పెద్ద కొడుకు పెళ్లి

ఖర్చులు ఉన్నాయని ఆమెకు తెలుసు. నలుగురు మెచ్చుకునేలా జీవించాలన్నది గుడ్లిబాయి అభిలాష. దూరంలోని గుడెకోట నుంచి వచ్చిన జనం 'చీ కొట్టకూడదు' అన్నది ఆమె అభిప్రాయం. తమ అమ్‌గోత్ వంశస్థులు ఇప్పుడు అప్పేనహళ్లికి వెళ్లివుండొచ్చని అనుకుంది. ఆమె తండ్రి బద్యా నాయక్ చనిపోయి చాలా సంవత్సరాలే గడిచాయని తెలిసింది. అన్నలు, చెల్లెలు, చిన్నమ్మ పిల్లలు, వారి పిల్లల గురించి ఆలోచనలు వచ్చేవి. ఆ ఆలోచనలు ఎంతకూ ముగిసేవి కావు.

ఇలా ఆలోచిస్తున్నప్పుడు ఎవరో అపరిచితుడిలాగుడిసె ముందు నిలబడి "గూడ్లీ" అని పిలిచినట్టయి వచ్చి చూసింది.

"అరే రాముడు బీయా, ఎప్పుడొచ్చావు?" అంటూ అతను వచ్చిన సంతోషంతో మాటలే మరిచిపోయింది. అతను వచ్చిన సంతోషంతో ఏడవటం మరిచింది. దుఃఖం ఆపుకోలేక అతని మెడను పట్టుకొని తమ పూర్వ చరిత్రంతా గుర్తు చేసుకొని ఏడ్చింది."ఊరుకోమ్మా, జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు సుఖంగా ఉన్నావు కదా, ఊరుకో" అని రాముడు ఓదార్చాడు. తన పుట్టింటివారు ఇంత దూరం వచ్చారుకదా అనే సంతోషం. పుట్టి పెరిగిన అప్పేనపల్లి తండా జ్ఞాపకాలు దట్టంగా ఉన్నాయి. పెళ్లి అయినప్పుడు తనకు కేవలం పదేళ్లు. భర్త పంపానాయక్ వెంట వలస రావడం; తన అన్నదమ్ములు మలెనాడుకు– కొండ ప్రాంతం వైపు వలస పోవటం అంత జ్ఞాపకం వచ్చింది. అతను చాలా సంవత్సరాల క్రితం వచ్చాడు. వారానికి ఒకే ఒక మోటార్ బండి తిరుగుతూ ఉండటం వల్ల ఒకరినొకరు సంప్రదించే వ్యవస్థలు సరిగ్గా ఉండలేదు. ఉన్నా సమయానికి చేతిలో డబ్బులు ఉండేవికావు. అందువల్ల ఒక్కొక్క సీమ ఒక్కొక్క రాజ్యమైంది. రాముడు తన మామ పంపానాయక్ కోసం ఎదురుచూడసాగాడు. భగన్య కరమ్‌తోట్‌కు బుద్ధి వచ్చినప్పటి నుంచి తల్లిదండ్రుల బంధువులను చూడనేలేదు. చిన్నతనంలో ఒకసారి గుడెకోటకు వెళ్లిన జ్ఞాపకం.

అతని తాత ధనసింగ్ చనిపోయినప్పుడు శవ సంస్కారానికి వెళ్లాడు. అక్కడ కప్లా, అతని అన్న ఖేమునాయక్ కలిసి ఒక పెద్ద గొర్రె పొట్టేలును ఇచ్చారు. చాలా మంది వచ్చినందువల్ల ఊరివాళ్లు భోజనాలుఏర్పాట్లు చక్కగా చేశారు. గుడెకోట తండాలో తమ కరమ్‌తోట్ వంశస్తులంతా కలిసి వైభవంగా ఆ కార్యం జరిపించారు. చుట్టుపక్కల ఉన్న యాభై పల్లెలకు కావలసిన వ్యక్తి కావడం వల్ల రోజుకు ఐదువందల నుంచి ఆరువందల మంది పరామర్శించడానికి వచ్చేవారు. ఖేమునాయకే ముందు నిలబడి అన్ని పనులను చేస్తున్నాడు. అతని పిల్లలు రతన్ సింగ్, దేవల, ముంగల్యా,

లచ్చలు అప్పటికే పెళ్ళి వయసుకు వచ్చారు. దినకార్యాలు ముగిసి తర్వాత, "ఇక్కడ ఉండేది మేమిద్దరమే. ఎందుకు మనవాళ్లు లేని, తెలియని చోటికి వెళ్లి ఉంటారు. ఎవరికేమైనా జరిగితే ఆ విషయం కూడా మాకు తెలియదు" అని ఖేమునాయక్ చెప్పిన బుద్ధిమాటలు పంపానాయక్ పట్టించుకోలేదు. "ఏమో జరగాల్సింది జరిగిపోయింది. కష్టమో సుఖమో అక్కడ బ్రతుకుతున్నాం. అయినా 'వలస' అన్నది మనకేమైనా కొత్తదా? మన తాతముత్తాతలు అటువైపు నుంచి ఏదో సీమ నుంచి ఇటువైపు వచ్చారట. అలాంటప్పుడు మీ తండా నుంచి మా తండాకు ఒకరోజు ప్రయాణం. అది ఎంత దూరం? నీవు పిలిచినప్పుడు వస్తాను" అని తన నిర్ణయాన్ని తెలిపాడు.

"అరెరే ఎంత పెద్దవాడయ్యాడు నా అల్లుడు. రారా భగన్యనాయక్" అన్నాడు. "మామా, ఎప్పుడొచ్చావ్? తండాలో అందరూ బాగున్నారు కదా" అని విచారించాడు. "అందరూ బాగున్నాం. నువ్వు బాగుండాలి. ముందున్న భవిష్యత్తు నీదే" అని అన్నాడు. వాళ్లు మాట్లాడుతుండగా పంపానాయక్ ఎద్దులను లాక్కుంటూ వచ్చి "ఇక్కడికి రారా, ఎద్దులను కట్టెయ్" అని అరిచాడు. "వస్తున్నాను నాన్నా" అంటూ భగన్య అటువైపు పరిగెత్తాడు. ఎద్దుల పగ్గాన్ని పట్టుకొని, "ఊరు నుంచి రాముడు మామ వచ్చాడు" అన్నాడు. "అవునా? ఎప్పుడు వచ్చాడు?" అని గుడిసెలో ప్రవేశించాడు. కుశలప్రశ్నలు తర్వాత తమ కులపద్ధతి ప్రకారం తండా తూర్పున ఉన్న ఈతసారాయి కొట్టుకు పోయి తాగసాగారు. ఏ రోజు రాని పంపానాయక్ సారా అంగడికి వచ్చాడని హాస్యంగా, "ఏం పంపా, ఈ రోజు దారితప్పి వచ్చావా ఏమిటి?" అని అక్కడే కూర్చున్న జాంబ అడిగాడు. "లేదు జంబన్న, ఊరినుంచి మా అల్లుడు వచ్చాడు. తాగించకుండా పంపకూడదుకదా!" అని అన్నాడు. "కుప్పెనహళ్లి తండా బళ్ళారి సీమలోది. నాయక్, వర్షం, పంటలు బాగున్నాయా? ఇక్కడ ఎలుగుబంట్ల పీడ ఎక్కువగా ఉంది. మనకి ఇక్కడ వేరుశెనగ పండుతుంది. అయితే ఎలుగుబంట్ల దాడులు జరుగుతాయి. అందుకు తప్పకుండా కాపలా కాయాల్సిందే. లేకపోతే పొలంలో ఎలుగుబంట్లు వరుసగా వచ్చి పంటను నాశనం చేస్తాయి"- అని అడిగిన వాడికి 'చాలురా బాబు' అనేలా జవాబిచ్చాడు రాముడు. బడాయిలు చెప్పుకునే డావో తిమ్మ ఊరకుండక, "మన అమ్మాయి ఒకతె మిగిలిపోయింది. ఎవరైనా భుక్యా కుర్రవాళ్లు ఉంటే చెప్పు. మా పిల్ల పెండ్లి చేసి చేతులు కడుక్కుందామంటే కుదరటం లేదు" అని తన మనసులోని మాటను బయట పెట్టాడు. రాముడు నెమ్మదిగా ఒక ముంత సారాయి తాగి, జవాబివ్వాలని ఆలోచనలో పడ్డాడు.

ముంత ఎత్తినవాడు "తీసుకో మామ" అని నోటికి ముంత పెట్టినవాడు పూర్తయ్యేంతవరకు దించలేదు. మళ్లీ డావోవైపు తిరిగి, "ఆఁ అన్నా, ఇప్పుడు చెప్పు. అప్పుడు ఏమో అన్నావ్?" అని అడిగాడు. అతను తాగిన విధానం చూసి గాభరపడ్డ డావో తిమ్మనాయక్ సంకోచిస్తూనే "ఏమీ లేదు. నా కూతురుకు ఒక ఘుక్యా అబ్బాయితో పెళ్లి జరిపించాలని అనుకుంటున్నాను" అన్నాడు. "లేదయ్యా, మా వైపు పక్షులు ఈ ఊరి వైపు రావు. అందువల్ల మీ అమ్మాయిలు మా వైపు వస్తే ఎలా సర్దుకుంటారో ఆలోచించు?" అని ఏమేమో మాట్లాడాడు. మరొక ముంత తాగిన తర్వాత మాటలకు హుషారు వచ్చింది. పంపానాయక్ అల్లుడికి నచ్చజెప్పి వాపస్ పిల్చుకునిపోవడానికి తల ప్రాణం తోకకు వచ్చింది. ఎప్పుడో ఒకసారి రుచి చూస్తున్న అతనికి నిజంగానే విసుగొచ్చింది. డావో తిమ్మ నాయక్ అంతటితో వదిలేసే రకం కాదు. "తమ్ముడా, కొత్రి, అన్నగారు దూరపు సీమ నుంచి వచ్చారు. ఒక ముంత నా లెక్కలో ఇవ్వు" అని అంగడివాడికి చెప్పాడు. "ఊరికే పోవయ్యా, ఇప్పటికే ఈ అప్పు చాలా ఉంది. అప్పు తీరెంతవరకూ ఇకపై ఇవ్వను" అన్నాడు. "ఏరా ఒళ్లెలా ఉంది? నోరు మూసుకుని రెండు ముంతలు ఇస్తే బతికిపోతావ్. లేకపోతే..." అంటూ అతని మీదికి పోయాడు. "ఇస్తే డబ్బులు సరిగ్గా ఇవ్వవు. ఇవ్వకపోతే దాదాగిరి చేస్తావు. ఏమి చేయాలో తెలియటం లేదు" అని సారాకొట్టు ఈడిగ మంజ్యా గొణుగుతూ రెండు ముంతలు సారాయి ఇచ్చాడు. "అన్నట్టు నీ పేరు ఏమన్నావు?" అని అడిగాడు డావో తిమ్మప్ప నాయక్. "రాముడు" అని జవాబు ఇవ్వటం ఆలస్యం, "అవునవును నీ పేరు రాముడే. ఇప్పుడు గుర్తొచ్చిందిలే" అని ఒక సారాయి ముంతను అతని చేతికిచ్చి "ఈ మనుషులు ఇలాగే నాయనా, అన్నట్టు ఈ తండాలో నేను ఎవరు?" అని ప్రశ్నించాడు. ఆ రోజు సాయంత్రమే వచ్చిన అతనికి ఇతనెవరో ఎలా తెలుస్తుంది? "మీరు కారభారి" అని ఊహించి అన్నాడు "లేదు, నేనెవరో నీకు తెలిసినట్టు లేదు. నేను డావోను. కారభారికన్నా పెద్దపదవి నాది. నేనేమి చెప్పినా తండా నాయకుడు వినాల్సిందే. ఈ తండాలో నేను లేకుండా ఏ కార్యం జరగదు. అలాంటప్పుడు వీడెంత?" అని సారాకొట్టు వాడిని చూపించాడు. పంపానాయక్ నోరు తెరిస్తే తాగిన మత్తులో ఏమైనా అంటాడేమోనని మౌనంగానే వింటూ కూర్చున్నాడు. రామునికి తాగొద్దు అంటే అవమానంగా భావించవచ్చని అనుకున్నాడు. మరొకవైపు తాగకూడదనుకుంటే ఈ వెధవ స్వయంగా తాగిస్తున్నాడు. పరస్థలం అనే ఆలోచన ఒకవైపు. మొత్తం నాటక సన్నివేశాన్ని చూస్తున్న పంపానాయక్ కిమ్మన లేదు. జరిగేది జరగని అన్నట్టు ముంత ఎత్తి గుటకలు వేస్తున్నాడు. డావో తిమ్మ నాయక్‌కు

ఏ ఒకరా దొరకలేదు. తన పాత పురాణం కంతు విప్పటం ప్రారంభించాడు.

డావో తిమ్మ నాయక్ అంత ఆస్తిపరుడేమి కాదు. అతని పెద్ద కొడుకు పక్యా నాగలి పట్టుకునే వయసుకు వచ్చాడు. వ్యవసాయ పనులు బాధ్యతను వాడి భుజాల మీద మోపి తాను ఒళ్లు కడుక్కున్న ఎద్దులా అయ్యాడు. ఉదయమే గణియా నాయక్ దుకాణంలోనో లేదా పిర్యా నాయక్ దుకాణంలోనో దమ్మిడి ఇచ్చి నాలుగు వడలు, ఒక కప్పు చాయ్ తాగి తమ పక్కనున్న పల్లె మోమ్మిగేరికి పోయి, ఎవరు చేతికి చిక్కినా వారి దగ్గర విషయమంతా మాట్లాడటం రోజూ చేసే పని. మోమ్మిగేరి తండా నుంచి ఒకటిన్నర కిలోమీటర్లు నడిచి, సారథి భట్టు పొలం దాటితే, మోమ్మిగేరి తండా లంబాడీలు కనిపిస్తారు. కింద కాలువదిగి గట్టు ఎక్కితే మోమ్మిగేరి పరిచయం కానీ, కాకపోనీ విషయం వినటానికి ఒక మనిషి కావాలి. అంతే. తండాలోని ఆవులు,దూడలు, ఎద్దులు, గొర్రెలు, కోళ్లు మొదలు అనైతిక సంబంధాల పెద్ద పట్టికనే అతని తలలో సిద్ధంగా ఉండేది. "అన్నా, మా తండాలో అటువైపు మూలలో జింకాలి ఉందికదా, ఛీ ఏంచెప్పను?" అన్నాడు. ఈ జింకాలి ఎవరో తెలియక ఎదుట ఉన్నవాడు సమస్యలో చిక్కుకున్నట్టు సతమతమయ్యేవాడు. "అదే డిబరగాడి పెండ్లాం". మరొక అనుమానపు పురుగును వదిలాడు. డిబర ఎవరు? జింకాలి ఎవరు? ఒక్కటీ తలాతోక అర్థంకాక మోమ్మిగేరి వడ్డెర బసవ తెలియదంటే ఇంకే రామాయణం ఎత్తుతాడోనని, "అటువైపు మూలలో ఉన్న జింకాలి మొగుడు డిబర" అని వడ్డెర బసవ మళ్లీ అన్నాడు. "అవును ఆమే". తండా జనం గురించి బసవకు తెలుసని అనుకున్న తిమ్మానాయక్‌కు చాలా సంతోషం కలిగింది. "ఈ వెధవకు వారి గురించి తెలియజెప్పే కష్టం తప్పిందని తిమ్మ కథ ప్రారంభించాడు.

"ఇంతకు ఏమైంది కారభారి" అని వడ్డెర బసవ కుతూహలంతో అడిగాడు.

"మంచి గుర్రంలాంటి ఆడది. వాడ్ని చూస్తే ఒట్టి మేకపిల్లలా ఉన్నాడు. ఇంకేముంది? మా ఊరు పక్కనున్న తిప్పశెట్టిపల్లె గుండెగౌడ కన్ను పడింది. ఒకసారి ఎప్పుడో సంతలో చూశాడట. కథ ముగిసింది. ఎవరు ఏమిటి అని విచారించి విషయమంతా తెలుసుకుని రాకపోకలు మొదలుపెట్టాడు". బసవ తల పాడైపోయింది. "రేయ్ తిమ్మ నాయక్, నిన్ను" అంటూ అక్కడి నుంచి లేచిపోయాడు. తిమ్మ నాయక్ ఇతర విషయాలను తెలియజేయడానికి ఊరికి వెళ్లాడు. అక్కడ ఏ విషయాన్ని చెప్పాలి. ఎవరు పరిచితులు, చాయ్ తాగిస్తే చాయ్ తాగి, బీడి ఇస్తే బీడి కాల్చి, సాయంత్రం ఇంటికి వచ్చి, అక్కడేమైందో కూతురును, కొడుకును అడిగిని తెలుసుకుంటే అతని దినచర్య ముగిసినట్టే. రోజుకు మూడు నాలుగు సార్లు ఊరంతా తిరిగి అవీ

ఇవీ విషయాలు మాట్లాడి, రాత్రి ఇల్లు చేరి ముద్ద తిని పడుకుంటే మళ్లీ ఉదయం అదే పని.

ఉదయమే వెళ్లినవాళ్లు ఇంకా రాలేదుకదా అని గాభరా పడిన గూడ్లిబాయి తానే స్వయంగా సారాకొట్టుకు వెళ్లింది. పంపానాయక్, రాముడు లేవబోతే భుజం పట్టుకుని అదిమినట్టు వాళ్లు మాటల్లోనే కూర్చోబెడుతున్నారు. ఎప్పుడైతే గూడ్లిబాయి గొంతు వినిపించినట్లయిందో, “మళ్లీ ఎప్పుడైనా కలుద్దాం, మాట్లాడవలసిన చాలా ఉంది” అని గప్‌చుప్ అయ్యాడు.

“ఏయ్, ఆమాత్రం తెలియదా? పాపం మా అన్న ఎప్పుడు తిని వచ్చాడో ఏమో?” అని గొడవ పెట్టుకుంది. “అయ్యో పాపం. ఎవడో పనికిమాలినవాడు తండా డావో అంట. నేరుగా నా నా బుర్రలో చేయిపెట్టి గుజ్జును తీసేశాడనుకో” అని అన్నాడు. “ఎవరు ఆ తిమ్మ నాయకా? ఎక్కడికి పోయాడు? వాడిమెడలో నా చెప్పులు దండ వేస్తాను. మొత్తం సీమంతా తిరిగి తిరిగి మాట్లాడినా, అతని మాటలు పూర్తికావు. నా చేతికి దొరకాలి. వాణ్ణి చింతపండు చేస్తాను. భాడుకోవ్ నా కొడుకు” రాకరాక వచ్చిన తన అన్నను వేధించటం విని గూడ్లి చండీ అయింది.

రాముడు తిరిగి బయలుదేరేటప్పుడు అతని మనసులో మాత్రం తన మేనల్లుడు భగన్యనాయక్‌కు తన కూతురిని ఇవ్వాలని కలగన్నాడు. అయితే అతని చెల్లెలు గూడ్లిబాయి ఒప్పుకోదనే అనుమానం మనసులో తిరుగుతుండగా మనసులోని కోరికను బయట పెట్టకుండా బయలుదేరాడు. “మళ్లీ రా మామా” అని బామి, రేవడి, మంగు పదే పదే అంగలార్చారు. చిన్న వాళ్లు, బంధుత్వం అంటే ఏమిటో తెలియని వయసులో బయటనుంచి వచ్చినవారు అంత ప్రేమను చూపించినందుకు ఇంతగా భావోద్వేగం చెందారు. రాముడు భారమైన మనసుతో కుప్పేనహళ్లికి బయలుదేరాడు. తన చెల్లెలు తాను పట్టినపట్టును సాధిస్తుందనే నమ్మకం అతనికి ఉంది. అమ్‌గోత్ కులానికి గౌరవం తెచ్చేలా బతికిందనే నమ్మకంతో ప్రశాంతంగా కుప్పేనహళ్లికి బయలుదేరాడు. అతన్ని దుంబలూరుకు వదలడానికి భార్య భర్తలిద్దరు తమ సొంత బండిలోనే బయలుదేరారు. ఇప్పుడు వాళ్ల దగ్గర సొంతంగా ఎడ్లబండి, అడవిలో పదిహేను ఎకరాల భూమి, అంతేకాకుండా సర్వతప్ప పొలం, నారాయణ భట్టుగారి పొలం- ఇలా ఇద్దరు ముగ్గురు పొలాలను కౌలుకు తీసుకున్నారు. అందువల్ల ఇంటిమూలల్లోని గాదెల్లో ధాన్యం సమృద్ధిగా ఉంది. చేతిలో డబ్బులు తిరుగుతున్నాయి. గూడ్లిబాయి పెద్ద కొడుకుకు సంబంధం చూసి వచ్చింది.

కర్రా కులానికి చెందిన చావళిబాయికి పెళ్లయినప్పుడు తొమ్మిదేళ్లు. ఇంకా

ఋతుమతి కానటువంటి కూతురుకు తప్పనిసరిగా పెండ్లి చేయవలసి వచ్చింది బీదవాడైన జేకు నాయక్‌కు. ఇంటి నిండా పిల్లలు. జీపునాయక్ భార్య రామిబాయి ఉన్నట్టుండి చనిపోయింది. పదిమంది కొడుకులు ఇద్దరు కూతుళ్లు. దాంతో ఇల్లు నడపడానికి మరొక పెళ్లి చేసుకున్నాడు. ఆమెకూ ఇద్దరు పిల్లలు. జిమణు, హనుమ, పోమి, దకణు, జాత్ర్యా, పాత్లు మూడోది. చావళి ఎనిమిదో పిల్ల. పెద్ద భార్య పిల్లలు జమణు, హుస్సేన్ వివాహాలు చూసిందట. తర్వాత ఏదో రోగానికి బలి అయిందట. ఆ విషయం ఏ ఒక్కరికి అర్థంకాని చిక్కుముడిలా మారింది. పూజారి మొదలు నాటు వైద్యులు ప్రయత్నించారు. తండా పూజారి ఒంట్లో కాంకాళి అవతరించి ఇవన్నీ గాలిచేష్టలు ఏమీ కాదని ఒక ప్రకటన చేసింది. జేకునాయక్ ఎలాంటి ఇబ్బంది వచ్చినా పూజారి ఛత్ర్యానాయక్ దగ్గరికి పరుగెత్తేవాడు. “అయ్యా ఈ రోజు గొప్ప సమస్య వచ్చి పడింది” అని వినయంగా చెప్పుకున్నాడు. ఇప్పటిదాకా మౌనంగా కూర్చుని ఉన్న పూజారి ఛత్ర్యానాయక్ ఆవలించడం, ఒళ్ళు విరుచుకోవడం చేయసాగాడు. “నీవు బండరాయిలాగా మౌనంగా ఉన్నావు తండ్రి” అని జేకు అంగలార్చాడు. ఉన్నట్టుండి పూజారిని ఆవహించిన తండా ఆదిదేవి మహాంకాళి “రేయ్ కొడకా! ఇంట్లో తప్పు జరిగింది...ఊఁ ఊఁ... అది ఏమిటంటే ఎవరో ముట్టు మైల అయినవారు నా పవిత్రమైన మూర్తిని మైలపరిచారు” అని బెదిరించింది. “అయ్యో మా తల్లి, ఇలా అంటే ఎట్లాగమ్మా? మేము బుద్ధిలేని మనుషులం.ఏదో జరిగిపోయింది” అని జేకు వేడుకున్నారు.“అలాగే నాయనా, మీ అపరాధాన్ని మన్నించాలంటే ఒక కోడిని బలివ్వాలి. అది రేపు శుక్రవారం జరగాలి” అని గడువును సూచించాడు పూజారి. జేకు నాయక్ ఆందుకు ఒప్పుకొని శుక్రవారం పాపపరిహారం చేసుకోవడానికి ఇంటివాళ్లందరితో మాట్లాడాడు.

ఇది జరిగిన కొన్ని నెలల తరువాత జేకునాయక్ కూతురును గుడద బరమానహట్టి పంపానాయక్ కొడుకు భగన్యనాయక్‌తో సంబంధం నిశ్చయమయింది. పంపానాయక్ కొడుకు కోసం వధువును వెతుకుతున్నప్పుడు సణ్ణహట్టి తండా గురించి ఎవరో మాట్లాడుకోవడం విన్నాడు. ఆ విషయాన్ని ఇంటికొచ్చి గూడ్లిబాయి ముందు చెప్పాడు. ఆమె ముందూ వెనకా చూడకుండా కొడుకుకు లక్షణమైన అమ్మాయిని చూసే ఏర్పాటు చేసింది. గుడదహట్టి తండా నాయకుడు, భగన్యనాయక్ పనితీరు చూసి దిగ్భ్రాంతి చెందాడు. అందువల్లనే బండెక్కి ముందుగానే కూర్చున్నాడు. “చాలోనిరా ఫణమేరో మలక అజరాత వేజాచె” (పదండ్రా, దూరంలో ఉన్న ఊరుకు వెళ్లేలోపు అర్ధరాత్రి అవుతుంది) అని సలహా ఇచ్చాడు., కారభారి ఊంఛముండి

ధానానాయక్, డావో తిమ్మ నాయక్ అందరూ బయలుదేరారు. గూడ్లిబాయి తిట్లకు బెదిరి సగంమంది ఇష్టం లేని మనసుతోనే బయలుదేరారు. ఆ గూడ్లిబాయి సహవాసం వద్దప్పా, ఆమె నోరు ఎత్తితే, "ఓర ముచ్ఛిమ మారలోయ" (వాడి మీసాలకు నా సాదు పొయ్య) అంటుంది. పదండి కష్టమో సుఖమో. ఆ పంపానాయక్ దేవుడులాంటి మనిషి. అతనికి మర్యాద ఇవ్వడానికైనా వెళ్లాలి" అని పైవీధి విసళవత్ తెగకు చెందిన భయ్యత నాయక్ అన్నాడు. చాలామంది అతని మాటలను సమర్థించారు. మరికొంతమంది రాత్రి కార్యం ముగించిన తరువాత సారాయి తాగి పడుకొని తెల్లవారగానే బయలుదేరితే చాలనుకున్నారు. రాత్రి వెళ్లి అక్కడ చేసేదేముందని చాలా మంది సారాయి తాగడానికి వెళ్లినవాళ్లు ఉన్నారు.

సణ్ణట్టి తండా చేరేసరికి నిజంగానే అర్థరాత్రి అయింది. బండి శబ్దం విని పడుకున్న అమ్మాయిలు కళ్లు నులుముకుంటూ పరుగున వచ్చారు."వెతదురియాడిచె ఢిలిడచకాలి దురిబెనచె వాందరిసరీక" (అబ్బాయి తల్లి చాలా నెమ్మది. పనికిరాని అమ్మాయి చెల్లెలు కోతిలా ఉంది) అని పాటల్లో తిట్టసాగారు. ఇటు వైపు నుంచి కూడా నలుగురైదుగురు అమ్మాయిలు వధువును, ఆమె తల్లిని పాటల్లో తిట్టసాగారు. అటువైపునుంచి తిట్లవర్షం ప్రవహించసాగింది. వరుడు తండా నాయకుడి ఇంటి ముందు పోవలసి రావడం వల్ల మోళి (తీపు) పంచే కార్యక్రమాన్ని ఊరిలోని ఒక వృద్ధురాలి చేత పూర్తి చేయించిన తర్వాత వేతడు (వరుడు) లేరియా (అతని సహచరుడు) సణ్ణట్టి తండా నాయకుడు జగనూ నాయక్ ఇంటికి పోయారు. అక్కడ వారికి భోజనాల ఏర్పాట్లు చేశారు. అది ముగిసిన తర్వాత వధువు ఇంటి ప్రాంగణంలో వేసిన పందిరిలోకి తీసుకునిపోయారు. ఆ రాత్రి జరగవలసిన కొన్ని కార్యాలకు అందరూ చేరుకుని ఆ కార్యం ముగించారు.

ఉదయం తెల్లవారగానే బండ్లు నెలపొడువునా జరిగే కార్యక్రమాలకు పెళ్లికొడుకు ఒక్కడినే వదిలి తిరుగు ప్రయాణం కట్టారు. పేదవాడు జేకునాయక్ ఇంట్లో భగన్య భుక్యా కరమ్‌తోట్, అతని మామ మాత్రం ఉండిపోయారు. తొలకరి ఆరంభమయ్యే సూచన ఉండటంవల్ల మిగిలిన వారందరూ తిరుగు ప్రయాణం అయ్యారు. భగన్య నాయక్ లేకపోవడంతో గూడ్లిబాయికి ఏదో కొరతగా అనిపించేది. ఆమె పెద్దకొడుకును ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించేది. అతనికి జ్వరం వస్తే, దగ్గు వస్తే స్వయంగా తనకే వచ్చినట్టు బాధపడేది. ఏమీ తెలియని పంపానాయక్ వంశపుమొలక అయినా భగన్యనాయక్‌ను దంపతులు ఇద్దరూ ప్రాణం కన్నా ఎక్కువగా

ప్రేమించేవారు. రెండవ కూతురు హోమ్లికి వరుడిని చూసి పెళ్లి చేసే ఆలోచన ఉంది. మూడవవాడు ఫక్కీర నాయక్. పెళ్లికి తయారుగా ఉన్న చిన్నది చిమ్లిబాయిని ఇంటిదగ్గర వదిలి వెళ్లాలని ఆలోచించారు. ఈ మధ్యనే ఎవరో ఊరి బయట రెండున్నర ఎకరాల పొలం అమ్మకానికి పెట్టారు. ప్రాణం పోయినా ఒక్క కాసు పుట్టని కాలం. డెబ్బయి అయిదురూపాయలకు అమ్మకమైంది. ఉప్పార హులప్ప, దిన్ని సాయిబు, చాకలి శివుగ, ఉప్పార బసవలాంటి హేమాహేమీలు ఉన్నప్పుడు లంబాడీలకు ఎలా ధైర్యం వస్తుంది? అయినా బ్రాహ్మణ సర్వతప్ప ధైర్యం మీద తాను ఒకచెయ్యి చూసుకోవాలని గూడ్లిబాయి నిర్ణయించుకుంది. పొలం నాదాపురానికి చెందిన పంచమసాలి తెగకుచెందిన ఏకేసి అనే వ్యక్తిది. "ఎవరైనా జమీను తీసుకోండి. అయితే జమీను బరమానహట్టి దారిలో ఉంది. అకడికి వెళ్లి వ్యవసాయం చేయడానికి కుదరలేదు. ఎవరు డబ్బులు ఇస్తారో వాళ్లకే అమ్ముతాను" అని జనాలతో అన్నాడు. బీదవాళ్ల దగ్గర ఇరవై అయిదు గవ్వలు కూడా లేవు. అలాంటప్పుడు ఇరవై అయిదు వెండి రూపాయలు ఇవ్వడం సాధ్యమా అని ఆలోచించి మౌనం వహించారు. చేతినిండా డబ్బులున్న దిన్ని సాయిబు వదులుతాడా? ఒకవేళ అతను వదిలినప్పటికీ ఉప్పార హులువప్ప వదులుతాడా? ఎప్పుడూ తెల్లబట్టలు వేసుకుని, ఉన్న నాలుగు కాసుల్లోనే షావుకారులా ప్రవర్తించే చాకలి శివుగ వదులుతాడా? జనం వేపచెట్టు కట్టమీద, సేవాబాయ్ గుడి ముందర, హనుమప్ప గుడి ముందు కూర్చొని తమలో తాము చర్చించుకుంటున్నారు. పశువుల దళారి ధర్మారాయుడైతే అంతా తానే చూసుకున్నట్టు "ఈ వ్యాపారం ఎప్పుడో ముగిసింది. ఉప్పార హులువప్ప పొలం తీసుకున్నాడు. కావాలంటే అడగండి" అన్నాడు. "నోరు మూసుకో, మా దిన్నిసాయిబు దగ్గర తక్కువ డబ్బులు ఉన్నాయా? అతను డబ్బుల మీద పడుకుంటాడు. జమీను కొంటే అతనే కొనాలి" అని కట్టెల వ్యాపారి గంగునాయక్ అన్నాడు. ఎవరికివారు తమకు కావలసినవారి పేర్లు చెబుతున్నారు. తండా అంతట రాత్రీపగలూ అదే విషయం గురించి మాట్లాడుకోసాగారు. ఎవరికివారు తమకే ఆ పొలం దక్కుతుందని గొప్పలు చెప్పుకున్నారు. చివరికి ఎవరికీ దక్కలేదు. ఆడది, బంగారం, పొలం–ఎవరి తలరాతలో రాసిపెట్టి ఉంటుందో వారికి మాత్రమే దక్కుతుందని ఈ దేశంలోని జనం రామాయణ, మహాభారత కాలం నుంచి నమ్ముకుంటూ వస్తున్నారు. అలాంటప్పుడు ఎవరి దగ్గర పదిరూపాయలు ఎక్కువ ఉన్నాయన్నది ముఖ్యం కాదు. ఎవరు వ్యవహారం జరుపుతారు, ఎలా జరుపుతారన్నది ముఖ్యం. అందరి గొడవల్లో దూరిన గూడ్లిబాయి ఒక చిన్న రాజకీయం చేసింది. ఆమె జమీను

కొన్నదని విని జనం నిర్ఘాంతపోయారు. 'మనం మీసాలు గొరిగించుకోవాలి. ఒక మామూలు ఆడమనిషి పొలం కొన్నదంటే ఏమిటి? ఆమె గుండె ధైర్యం ముందు మనం గడ్డిపోచతో సమానం' అని అనుకుంటూ, నలుగురితో చెప్పుకుంటూ సారా కొట్టులో పదిహేను రోజులపాటు గూడ్లిబాయి గురించి చర్చ జరిగింది.

భగన్యనాయక్ పెళ్లి ఊరేగింపు ఇంటి ముందుకు వచ్చింది. సరిగ్గా అదే సమయానికి ఊరి ముందరి రెండెకరాల పొలం రిజిస్టర్ కాగితాల వ్యవహారం పూర్తయింది. తొలకరి వాన ఆకాశాన్ని చీల్చుకుంటూ భూమి వణికేలా కురిసింది. వచ్చిన బంధువులకు భోజనాలు పెట్టి పంపించిన మరుసటి రోజు చావళి పెద్దమనిషి అయింది. తల్లి లేని బిడ్డ అని గూడ్లిబాయి ఆమె బాగోగులు చూసింది. పుట్టింటి నుంచి ఆమె చెల్లెలు, అన్నలు, తండ్రి కొబ్బరి బెల్లం, ఖర్జూరం తీసుకొని వచ్చారు. పదిహేను రోజులు బాగా తినిపించి బలంగా తయారుచేశారు. జొన్నలు నాటే సమయానికి అమ్మాయి కాలిగుణం ఎలా ఉందోనని తెలుసుకోవటానికి చావళి స్నానం చేసిన రెండు మూడు రోజులకు కొత్త పొలంలో జొన్నలు విత్తడానికి మడక సిద్ధం చేశారు. నవవధువు చేత మడక మీద గిన్నె పెట్టించారు. ఆమె భర్తే మొదట మూడు సార్లు మడక దున్నాడు. తర్వాత గూడ్లిబాయి ఇతరులను విత్తనాలు నాటడానికి పురమాయించింది.

ఒక వారం తరువాత చూస్తే జొన్నలు వరుసలు వరుసలుగా మొలకెత్తటం కనిపించింది. ముందుగా పొలానికి వచ్చిన పంపానాయక్ ప్రతి ఒక్క వరుసను జాగ్రత్తగా చూసి ఇంటికి వచ్చి నవలేరి (నవవధువు) కాలిగుణం బాగుంది. జొన్నల మొలకలు అన్నీ సమానంగా మొలకెత్తి నిలబడ్డాయి" అన్నాడు. గూడ్లిబాయికి తాను చూడాలనే కుతూహలం కలిగింది. వారంలోనే దంటు బలిసి జొన్నలు మోకాలు ఎత్తుకు పెరిగాయి. ఎడమవైపునున్న మడిని దున్ని, కలుపు తీసి, చదును చేసే సమయానికి జొన్నలు నడుం ఎత్తుకు పెరిగాయి.

తొలిసారి చావళి గర్భం నిలవడం, జొన్న కంకులు తొంగి చూసినపుడు బయటపడింది. గూడ్లిబాయి, పంపానాయకులు సంతోషంతో పొంగిపోయారు. ఆమెతోపాటు పెళ్లయిన ఐదారు జంటలకు ఇంకా ఏమీ లేదు అన్నప్పుడు చావళి గర్భం ధరించింది. మనిషి ఎత్తుకు జొన్నకంకులు పెరిగి, కంకులు బరువెక్కి, పాలు నింపుకుని, పక్కకు వాలినప్పుడు, ఆరునెలల గర్భిణి దంటు పట్టుకొని కోయసాగింది. వేవిళ్లు మొదలయ్యాయి. పొలంలో ఉన్న పుట్టమన్నును ఉంటలు

చేసుకొని తినసాగింది. తన వంశపు మొలకను మోసుకున్న కోడలిని గూడ్లిబాయి చక్కగా చూసుకుంది. రెండుమూడు సార్లు కషాయం చేసి తాగించేది. మొదటి కాన్పుకు పుట్టింటివారు పిలవడానికి బండిని పంపారు. స్వయంగా పిల్ల తండ్రి జేకునాయక్, అతని కొడుకు హుసేని వచ్చారు. బొమ్మలతో ఆడుకునే వయసులోనే బిడ్డను ఎత్తుకుని ఆడించే అవస్థకు చావళి చేరుకుంది. ఇది ఆ కాలం నియమం. నిజానికి ఆ సమయంలో నడుమే గట్టిగా ఉండదు. అయినా పొట్టలో బిడ్డను మోసుకునేవారు. అలాంటి వాళ్లలో చావళి ఒకతె.

తొమ్మిది నెలలకే ప్రసవవేదన ఆరంభమైంది. ఒళ్లుపట్టని పన్నెండేళ్ల చావళి కష్టపడి మంత్రసాని సహాయంతో మగబిడ్డను కన్నది. జేకు సంతోషంతో, "రేయ్ కంచు తట్ట వాయించు. మనవడు పుట్టాడు" అని అరిచి కంచం కొట్టించాడు. కుర్రవాడు సణ్ణట్టి తండా వీధులలో దండోరా కొట్టాడు. మనవడి ముఖం చూడటానికి గూడ్లిబాయి, పంపానాయక్, అతని పెద్దకొడుకు భగన్యానాయక్ బండి కట్టారు. వీళ్లు వెళ్లేసరికి సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చాడు. మధ్యాహ్నం భోజనం సమయం కావడం వల్ల రూప్లి, తన ఆడపడుచుల సహాయంతో వచ్చిన వియ్యంకులకు వేడి వేడి జొన్న రొట్టెలు, నంచుకోవడానికి ఎండిన ఉప్పు చేపలను కాల్చి వడ్డించింది. నడుము మీద పంచ నిలవని వయసులోనే భగన్యానాయక్ తండ్రి అయ్యాడు. గూడ్లిబాయిని పట్టేవాళ్లే లేకుండాపోయారు. గూడ్లిబాయి, పంపానాయక్‌లు తాతయ్య, నానమ్మలైన సంతోషంతో అన్ని మరిచారు. "అరెరే, పిల్లవాడు అచ్చం వాళ్ల నాన్నలా ఉన్నాడు" అని గూడ్లిబాయి అంది. "అవును అచ్చం వాళ్ల నాన్నలాగే ఉన్నాడు" అన్నారు పిల్లవాడి మేనమామలు. సాయంత్రం అవుతుండగా మంత్రసానులు, తండా పెద్దలు పద్ధతి ప్రకారం వచ్చి ఒకవైపు చేరుకున్నారు. తండ్రి ఇంటివారు సారాయి తాగించడం పద్ధతి కావడంవల్ల భగన్యానాయక్ తానే స్వయంగా సారాకొట్టుకు వెళ్లి తన బావమరుదుల భుజాలమీద మూడునాలుగు కుండల కల్లు, రెండు కుండల సారాయి తీసుకొచ్చాడు. వాటిని తండా నాయకుడికి అప్పగించాడు.

బిడ్డ పుట్టిన ఏడవ రోజున 'దవళా దోఖాయేర' (అగ్ని పూజ) కార్యంలో భాగం వహించారు. ఇంటి బయట ఒక చిన్న పొయ్యిని చేసి, అందులో బొగ్గులు వెలిగించి, బాలింతను పిలుచుకొని వచ్చి గోధుమపిండితో చేసిన దీపాన్ని వెలిగించడానికి ఎడమకాలి బొటనవేలితో ఏడుసార్లు అగ్ని స్పర్శ కలిగించిన తర్వాత కొబ్బరికాయ కొట్టి, పూజ చేసి వచ్చిన పిల్లలకు, పెద్దవాళ్లకు నైవేద్యంపెట్టి, తీపుపులగాన్ని అందరికీ పంచడంతో ఆ కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఉదయమే పూజ ముగించి.

తిరుగు ప్రయాణానికి బండి కట్టారు. బయలుదేరేటప్పుడు "నెల తర్వాత పంపండి" (అమ్మాయి పని చేయటం మొదలు పెట్టాలని) అని చెప్పడం గూడ్లిబాయి మరువలేదు. జేకునాయక్, "అక్కా, మీరే తల్లిలాగా చూసుకుంటున్నారు. మేము బిడ్డని పంపుతాం. బాలింతరాలిని పెట్టుకొని ఏం చేస్తాం? నాలుగవ సోమవారానికి నెల అవుతుంది. పంపిస్తాం. మీ ఇంటి వస్తువు మీ ఇంటికి చేరాలి. మా ఇంట్లో ఎన్ని రోజులు వుంటుంది?" అని కూతురు అక్కడ సుఖంగా వుంటుందనే నమ్మకంతో తన మనసులోని మాటను చెప్పాడు. ఇంటినిండా పిల్లలు, సంపాదించేవారు తక్కువ. పొలం ఉంటే ఏమిటి? అడ్డదిడ్డంగా కురిసే వర్షానికి పొలంలో గడ్డి, కలుపు పిచ్చిగా పెరిగి వేసిన పంట పెరిగేదే కాదు.

చెప్పినట్టే జేకునాయక్, అతని రెండవ భార్య, ఆరవకొడుకు జాతునాయక్ చావళిని పిలుచుకొని తెల్లవారుజామున గుడదహట్టి తండాకు వచ్చారు. "అరే భేటీ హామ్లి, బిడ్డ అడవిదారిన వచ్చాడు. వందలాది క్షుద్రశక్తుల దిష్టి తగిలి వుంటుంది. పసుపుకుంకుమ నీళ్లతో దిష్టి తీయించి మూడు వీధులు కలిసే చోట బొడ్రాయి మీద పోయండి" అని అంది. గూడ్లిబాయి కూతురు మట్టికుండలో బొగ్గులు వేసి చిటికెడు పసుపును కలిపి ఆ నీటిని తమలపాకుతో తడిపి బిడ్డమీద దిగతీయడానికి వచ్చింది. "అరెరే రాజాబేటా పడుకున్నావా? చూడు అత్త వచ్చింది" అని హామ్లి వాడి బుగ్గ పట్టుకుని లేపి నీళ్ల గిన్నెను ఎడమ చేతిలో పట్టుకొని ఏడు సార్లు దిగతీసి బొడ్రాయి మీద పోయటానికి వెళ్లింది. అప్పుడే పశువులు ఊరి ముందరి చౌడమ్మ గుడిని దాటాయి. "ఒసేయ్ హామ్లి, మీ వదిన చావళి, బిడ్డ వచ్చారంట కదా" అని చమ్లి కుతూహలంగా అడిగింది. ఇద్దరూ పాము ముంగిసలా ఉంటారు. "ఏమో నాకు తెలియదు. ఇంటికి వచ్చి చూడు" అని హామ్లి ముందుకు నడిచింది. "ఏమి మురుస్తున్నావే ముండా, ఇంకేమీ ఇంటికి వచ్చేసాను. నేనే చూస్తానులే" అంది. "నీవేమి చెప్పనక్కర్లేదు. నిన్ను ఏం చేస్తానో చూడు" అని చేతిలోని కర్రతో దబదబా గేదె వీపుమీద బాది, గేదె వీపు మీద ఎక్కింది.

పశువుల కొట్టం కట్టమీద దీపం వెలిగించే తొందరలో కిరసనాయిల్ దీపం బాగుచేస్తున్నారు. గూడ్లిబాయి ఇంటింటికి వెళ్లి "అమ్మా చెల్లెలా సామ్కి, మీ అమ్మ రామి ఉందా? పీరి ఉందా, సావి ఉందా, చంద్రి ఉందా, థావరి ఉందా, దర్గి ఉందా?" అని అడుగుతూ ఆడవాళ్లను ఇంటి ముందు సమావేశపరిచింది. వంశోద్ధారకుడు పుట్టినందుకు పదవ తరం పూలతీగలా వ్యాపిస్తున్నందుకు తమ వంశంలో సతి అయిన గుజాసత్తికి 'ఒళంగ' చెప్పటానికి పిలుస్తోంది. "ఏయ్

గూడ్లిబాయి, పిల్లవాడికి ఏమి పేరు పెట్టారు? వాడి పేరు చెప్పి 'ఒళంగ' చెప్పాలి కదా?" అని తండా పెద్ద యజమాని గుజ్జరి అడిగింది. ఏంపేరు పెట్టాలని గూడ్లిబాయి ఆలోచిస్తున్నప్పుడే ఎవరో 'టాంక్యా' అన్నారు. అదే సరిగ్గా ఉన్నట్టు అనిపించి 'టాంక్యా' అని పిలువు" అని అంది. గుజాసత్తికి ఒళంగలో టాంక్యా భుక్యా కరమ్‌తోట్ పేరు వచ్చింది. ఆడవాళ్లు, పిల్లలు అందరూ 'టాంక్యా... టాంక్యా అని పిలిచారు. పంపానాయక్కూ ఆ పేరు పిలవడం సులభమైంది. భగన్యనాయక్ కూడా సంతోషంతోనే 'టాంక్యా' అని పిలిచాడు.

పచ్చి ఒంటితో ఉన్న బాలింతరాలు చావళికి మూడు నెలలు కూడా నిండా లేదు. గూడ్లిబాయి అర్ధరాత్రి ఐదుగంటలకు ఆమెను లేపి రాగులు విసరమని చెప్పింది. రాత్రంతా కుక్క పిల్లలా ఏడుస్తున్న కొడుకు, సరిగ్గా నిద్రలేక, తెల్లవారుజామున చిన్నగా కునుకు పట్టింది. కళ్లు మూసుకుని నిద్రలోకి జారిందో లేదో అత్త లేపింది. అప్పుడే భగన్యనాయక్, పేడ, కసువు ఎత్తి, రెండు గేదెల దగ్గర దూడలను వదిలాడు. వీళ్ల పీడ భరించలేక గేదలు విసిగి 'ఛూ, మీ ఇల్లు పాడుగానూ. ఒక గంట కళ్లు మూసుకొని పడుకోడానికి వదలరుకదా' అని శాపం పెట్టినట్టుంది. ఒక గిన్నె రాగులు విసిరి, పొయ్యిమీద జొన్ననూక పెట్టడానికి, పొయ్యిలోని బూడిదను తీసి, పొయ్యి వెలిగించింది. అంతలో బిడ్డ ఏడిస్తే గూడ్లిబాయి చావళి మీద గర్జించింది. భగన్యనాయక్ వారి జోలికి వెళ్లేవాడుకాదు. 'బుట్ట మోసుకొని వచ్చింది' అని పిలిచే వెధవలకు తాను ఏమిటో చూపించాలని పంతం పట్టి కష్టపడుతుండేది గూడ్లిబాయి.

చీకటి అనకుండా కంటికి కనిపించని దారిలో మూడున్నర నాలుగు మైళ్ల దూరం వెళ్లి విరుపాక్షయ్యస్వామి హెూటల్‌కు పాలు పోసి, ఊరి జనం లేచేలోపు ఇంట్లో ఉండాలి భగన్యనాయక్. మళ్లీ ఊరి తూర్పున పశువులు మేస్తున్న బయలుప్రదేశానికి వెళ్లి ఒకటి రెండు బుట్టల పేడ సేకరించి, తాడిచెట్టు దురుగమ్మ గుడి ముందున్న దిబ్బలో వేసి ఇంటికి రావాలి. భగన్యకు పని అంటే అంత శ్రద్ధ. పనంటే దైవం అనేవాడు. అతనికి అంతటి లక్ష్యం, శ్రద్ధ ఉండేవి. అతను ఖాళీగా కూర్చోవడం ఎవరు చూడనేలేదు. పిల్లల్లో పిల్లవాడైపోయేవాడు. పిల్లల గుంపుతో ఆటలు, భజనలు, వినోదాలు అన్నింటట్లో పాల్గొనేవాడు. గూడ్లిబాయి దేనికి అడ్డు చెప్పేది కాదు. ఊరి మధ్యనున్న వేప చెట్టు కట్టమీద జనంతోపాటు కూర్చునేవాడు. ఆ సమయంలో కూడా చేతిలో పగ్గం పేనడానికి నారు పట్టుకొని వాళ్లతో మాట్లాడుతూనే పగ్గం పేనేవాడు. వ్యవసాయంలో ఫలానా పని తెలియదు అనడానికి లేదు. అతనికి అన్నీవచ్చు. వ్యవసాయానికి వాడే అన్ని పనిముట్ల ఉపయోగమూ

అతనికి తెలుసు. ఒకవేళ తెలియకపోతే జనం దగ్గరికి వెళ్లి, తెలుసుకుని, నేర్చుకొని అనుసరించేవాడు. ఆటకు నిలబడితే అతని ప్రత్యర్థులు నివ్వెరపోవాల్సిందే. అలా ఆడేవాడు. జీవితాన్ని రూపుదిద్దుకునే పనిలో మునిగిన భగన్యానాయక్ ఒక మంచి రాయి దొరికితే దాన్ని ఇంటికి తెచ్చేవాడు. జనంకంటే ముందే అన్ని పొలాలను చుట్టుకొని అవసరమైన పనులలో సహాయం చేసి వచ్చేవాడు. నేల ఎండకు ఎండిపోయినా, జనం పొలాలలో పంటలు వాడిపోయినా, వర్షాకాలంలో బాగా నీళ్లు నిలువ చేసినందువల్ల, ఇతడి పొలంలో మాత్రం పంటలు పచ్చగా ఉండటం చూసి జనం అసూయ పడేవారు.

ఎవరు ఎంత వడ్లు పండించినా, ఇతనివి వాళ్ల కంటే రెండు మూడు సంచులు ఎక్కువగానే ఉండేవి. అందువల్లనే సర్వతప్ప, "అరే, మీ అమ్మ నల్లదెయ్యం. జీవితానికి కాస్త ప్రశాంతత ఇవ్వమని చెప్పు" అని తిట్టేవాడు, హాస్యం చేసేవాడు. "ఊరుకో ధనీ, నాకు మీ వయసు వచ్చినప్పుడు ప్రాణాలకు ప్రశాంతత దొరుకుతుంది" అని అతని వయసును గుర్తుచేసేవాడు. "నీ ముఖంలో బ్రాహ్మణకళ ఉందిరా. నువ్వు ఏదైనా అంటే ఎదుటివాడు ఒక గంటసేపు ఆలోచించి జవాబు ఇవ్వాలి, ఇలాగే వుండు. ఎప్పుడో ఒకప్పుడు నువ్వు గొప్పవాడివి అవుతావు" అని అంటూ అనేక విధాలుగా వాడికి బుద్ధిమాటలు నేర్పారు.

సర్వతప్పా తనకు సమయం దొరికినప్పుడంతా రామాయణం, మహాభారతం కథలను, చాణిక్యుడి కథను, పురాణంలోని పాత్రలను అతనికి పరిచయం చేశారు. అతను కూడా అంతే విధేయతతో, ఆప్త సేవకుడిలా వయసులో పెద్దవారైన సర్వతప్ప భట్టుగారి మాగాణిని చక్కగా చదును చేసి పెట్టాడు. ఒకప్పుడు వెయ్యి ఎకరాల జమీందారైన కరణం సర్వతప్పభట్టుకు ఇప్పుడు మిగిలింది ఐదారు ఎకరాలు మాత్రమే. సర్వతప్ప భట్టు తండ్రి జింకాలి కరణం బ్రిటిష్ కాలంలో కప్పం వసూలు చేసేవారు. దొంబలూరు చుట్టూ ఉన్న జకాతిపుర, కురుబరల్లి, సాబూరు, దిందూరు, దావేనళి మొదలైన పల్లెల జనం కప్పం కట్టలేక వదిలేసిన భూములను పేరిట మార్చుకున్నారు. బ్రిటిషువారు బళ్లారి నుంచి దొంబలూరులో జరుగుతున్నది చూడటానికి వచ్చేవారు కాదు. సంవత్సరానికి ఎంతోకొంత కప్పం వసూలు చేసి వాళ్లకు తీసుకుని చెల్లించి వస్తే చాలు! ఇక బ్రిటిషువారు పట్టించుకునేవారు కాదు. ఊరు చుట్టూ ఉన్న పోరంబోకు భూములు, పాడుబడ్డ భూములు, పత్రాలు లేని భూములు అన్నింటిని తమ పేరిట బదిలీ చేయించుకున్నారు. మొత్తం వెయ్యి ఎకరాల భూమి భట్టుగారిది అయిపోయింది. జింకాలి కరణం మొదటి భార్య కొంతెమ్మకు

ఆరుమంది అమ్మాయిలు. జింకాలి తండ్రి సుబ్బాభట్టుగారు చనిపోవడానికి ముందు, గంగాజలం వదులుతున్నప్పుడు కొడుకునుంచి మాట తీసుకున్నారు. "నాయనా , జింకాలి నీకు మన సంస్కృతి తెలుసు. నా పుత్ర గతిర్నాస్తి" అని చెప్పి, "నీవు ఎన్ని పెళ్లిళ్లు అయినా చేసుకో, సుబ్బాభట్టు వంశాన్ని పెంచు. అలా పెంచుతానని నాకు మాట ఇవ్వు. నేను ప్రశాంతంగా కళ్లుమూస్తాను" అన్నాడు. జింకాలి మరో దారి లేక తండ్రికి మాట ఇచ్చాడు. ముసలివాడు కళ్లు మూశాడు. అటు తర్వాత జింకాలికి కష్ట కాలం మొదలైంది.

జింకాలి రెండో భార్యకు కూతురు పుట్టింది. కోపంతో జింకాలి భార్య చెల్లెలినే పెళ్లిచేసుకున్నాడు. అతని తల్లి అలుమేలమ్మ కనిపించిన దేవతలందరికీ ముడుపులు కట్టి పూజలు పునస్కారాలు చేసింది. దాని ఫలితంగా అన్నట్టు సరోజమ్మకు మగపిల్లవాడు పుట్టాడు. అతనే సర్వతప్ప. అప్పట్లో ఆపరేషన్లు లేవు. ఏమీ లేదు. దాంతో సంవత్సరానికి, రెండు సంవత్సరాలకు ఒక బిడ్డ పుడుతూనే ఉంది. అలాగే జబ్బులూ వచ్చాయి. ప్లేగు, కలరా వంటి వందలాది జబ్బులు. కొన్ని జ్వరాలు వస్తే చావే గతి. చనిపోయినవి చనిపోగా మిగిలిన పిల్లలు బతికిబట్టకట్టాయి. బ్రిటిషుల కాలంలో శూద్రులు కొద్దోగొప్పో జమీనులో వ్యవసాయం చేసేవారు. జమీను యజమానికి ముక్కాలు భాగం ఇచ్చి, మిగిలిన పావువంతు అప్పుల బాధను అనుభవించేవారు. గాంధీజి పోరాటం వల్ల బ్రిటిషులు 1947లో భారత్‌ను వదిలినపుడు బ్రిటిషుల పరంగా ఉన్నవారు పెద్ద ఓటమిని అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఉత్సాహంలో ఎన్నో సంవత్సరాలుగా దున్నుతూ వచ్చిన తమ భూములను, కరణాల చేతుల్లో ఉన్నవాటిని కర్ణాటక లింగాయతులు, కురువ జనాంగంవారు, ఒక్కలిగలు తామే యజమానులని ప్రకటించుకున్నారు. ఆప్పుడు జింకాలి స్వాధీనంలో ఉన్న వెయ్యి ఎకరాలలో అయిదువందల ఎకరాలు మాత్రమే మిగిలాయి. అతని వెనుక ఉన్న రైతులు స్వాతంత్ర్యం దొరికిన తర్వాత సహజంగానే మారారు. అప్పటివరకూ కరణం చేతిలో అధికారం ఉండేది. జనం కూడా కరణం మాట వినేవారు. ఎప్పుడైతే నెహ్రూ ప్రధాని అయ్యారో భారత దేశంలో మార్పులు ఏర్పడ్డాయి. అందువల్ల రైతులు షావుకార్ల భూములను చేయటం వదిలిపెట్టారు. అందువల్ల జింకాలిగారి భూములు వ్యవసాయం చేసేవారు లేక, గడ్డిపెరిగి, కలుపు నిండిపోయి వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయి. భూములు లేని మాదర చంద్ర, తలారి కుంటీర, అప్పటిదాకా కౌలు చేస్తున్న సొమ్ము ఇవ్వలేక ముఖాలు దాచుకోసాగారు.

అందువల్ల జింకాలి అనివార్య పరిస్థితుల్లో ఆడపిల్లలున్నారని వారి పెళ్లిళ్ల కోసం సగం భూమిని పంచమశాలి దరూరు షావుకారు నాగప్పకు ఒకే సరిహద్దుకు చెందిన రెండువందల ఎకరాలు జమీను అమ్మాడు. జింకాలి కరణం ఈ తాపత్రయాలను చూసి గుండెపోటుతో మరణించాడు. అతని ఒక్కగానొక్క కొడుకు సర్వతప్ప భట్టు కొత్తగాలికి రెక్కలు విప్పుకుని ఎగరసాగాడు. జింకాలి బంగ్లాగా ప్రసిద్ధి చెందిన స్థలంలో పేకాట క్లబ్ ప్రారంభించాడు. ఆటలో మునిగి, మిగిలిన మూడువందల ఎకరాల్లో రెండువందల తొంభై ఎకరాలు చేజారిపోవటం గమనించలేదు. ఇక మిగిలింది కేవలం పదెకరాలు. అదీ మిగిలింది ఎలాగంటే ఆ పొలం జింకాలి తన భార్య పేరిట దానపత్రం చేసినందువల్ల. భూమిని అమ్మటానికి కుదరదని తెలుసుకున్న సర్వతప్ప మౌనంగా ఉండిపోయాడు. ఇప్పుడు భగన్య నిజాయితీగా కష్టపడి అందులో పంట పండించి ధాన్యం తెచ్చి వేసేవాడు. అందులోనే పిల్లలను దారికి తెస్తున్నాడు. అందువల్లనే సర్వతప్పకు భగన్య మీద ఎక్కడలేని అభిమానం. ఆయన ఇల్లు ఆంజనేయ దేవస్థానం ముందు ఉంది. ఇతను వెళ్లినప్పుడల్లా సర్వతప్ప భార్య జానికమ్మ అన్నం పెట్టి, చారు, నెయ్యి, ఊరగాయ వేసి వడ్డించేది.

సంవత్సరంలో ఉగాది పండుగకు, దీపావళి పండుగకు, నాగుల చవితి పండుగ మాత్రమే బియ్యం తెచ్చి వండుకొని పండుగ చేసుకునేవారు. ఎంత వరి పండించిన వారి భాగానికి వచ్చిన దాన్ని అమ్మేవారు. జొన్న నూకలు, రాగి నూకలు తెచ్చుకొని జొన్నరొట్టె, రాగిరొట్టె చేసుకుని తినేవారు. అంబలి కాచుకునేవారు. ఇదే వారి ఆహారం. భగన్యనాయక్ ఇంటికి వచ్చి “ఏం వంట చేస్తారు? పోయి జానకమ్మ వంట రుచి చూడండి, రుచిగా ఉండే వంట ఎలా ఉంటుందో అప్పుడు తెలుస్తుంది” అని ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చేవాడు. ఇంట్లో ఉప్పు ఉంటే చింతపండు లేదు, చింతపండు ఉంటే కారం లేదు, ఇలా ఉండే పరిస్థితిలో రుచికరమైన వంటలు చేయడం సాధ్యమా? ఇరుగుపొరుగు ఇళ్లల్లో ఒక మిరపకాయ చేబదులు తీసుకొని, ఒక చిన్న లోటా అంత ఉప్పును తెచ్చి జీవనాన్ని సాగించే లంబాడీలు ఎక్కడ? నెయ్యి పోసుకొని భోజనం చేసి చేతులు కడుక్కునే సర్వతప్ప ఎక్కడ? ఖాళీ సమయంలో భగన్యనాయక్ భార్యను పిలుచుకొని తండా ముందున్న అడవికి పోయి, కట్టెలు కొట్టి దయ్యంలాంటి మోపులు కట్టి భార్య తలమీద ఒకటి, తన తలమీదొక మోపు మోసుకొని వచ్చేవాడు. వాటిని మళ్లీ నాలుగైదు చిన్న చిన్న మోపులుగా కట్టి ఇద్దరు చెల్లెళ్లకు, తమ్ముడికి వేరు వేరుగా మోపులు కట్టి, అమ్మటానికి పక్కనున్న కన్నడిగులు

ఉండే ఊర్లకు వెళ్లేవాడు."కట్టెలమ్మా... కట్టెలు..." అని కేకలు పెట్టి ఎవరూ కొనకపోవటంతో, చివరికి సేరుగింజలకో లేదా అర్ధసేరు గింజలకో ఒక్కొక్క మోపును వాళ్ల ఇండ్ల ముందు వేసి, వాళ్లు ఇచ్చిన ముగ్గిపోయిన గింజలు తెచ్చుకొని, ఇంటికి వచ్చి దాన్ని విసిరి వంట చేసుకోవాల్సి వచ్చేది. ఒక్కోసారి పంట బాగా పండితే ఇంటినిండా గింజలు ఉండేవి. అయినా అంతా అందులోనే జరగాలి. ఇంటి ఖర్చు, సొంత ఖర్చులు, బట్టలు, పండుగ ఖర్చులు అన్నీ ఆ చిన్నసంపాదన మీదనే జరగాలి. అందువల్ల ఒక్కోసారి కూలిపనులకు పోయేవాడు. బండిని అద్దెకు తిప్పేవాడు. ఒక్కోసారి అడవుల నుంచి తెచ్చిన కలిమిపండ్లు, రేగుపండ్లు, జామపండ్లు, నేరెడు పండ్లు- ఇంకా రకరకాల పండ్లు తెంచి, బుట్ట నింపుకొని ఊళ్లోకి పోయి అమ్మి వచ్చిన చిల్లర కాసులు తెచ్చి తల్లి చేతుల్లో పోసేవాడు. గూడ్లిబాయి ఎవరినీ ఊరికే కూర్చుని తినడానికి వదిలేది కాదు. చావళి మాత్రం గాడిదలా వంటపని, ఇంటిపని చేసేది. గింజలు విసరడం, దంచడం మొదలైన పనులతోపాటు పొలాల్లో కలుపు తీయడం, పంట కోతకు వచ్చినప్పుడు కోతలకు, అప్పుడప్పుడు కూలీపనులకు వెళ్లటం, ఇలా అన్ని పనులను చేయవలసి వచ్చేది. పైగా ఆమెకు పాలుతాగే పిల్లలు. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో పిల్లల్ని కంటూ ఉండేది. పెద్దకొడుకు టాంక్యా ఆరోగ్యం అంతగా బాగుండలేదు. అప్పుడప్పుడు వాంతులు, భేదులు, జ్వరంతో నలిగిపోయాడు. వాణ్ణి దవాఖానాలో చూపించి చూపించి విసుగొచ్చింది. వాడి బుద్ధికూడా అంత చురుగ్గా లేదు. మొద్దు పిల్లవాడిలా ఉండేవాడు. వాడికి ఆరేళ్లు వచ్చినప్పుడు చెరువుగట్టు పక్కనున్న దిటనాళ తండాలో సర్కారువారు ఒక బడి తెరిచారు. ఇది పల్లె మధ్యలో ఉన్న గుడదహట్టి తండాలో కాకుండా పాఠశాల అక్కడ ఎలా సర్కారు బడి తెరిచారో ఎవరికీ అర్థం కాలేదు. కడబగేరి శాంతప్ప మాస్టారు దగ్గరికి భగన్య నాయక్ స్వయంగా వెళ్లాడు. "ఏమిరా భగన్య, ఎవరిని పిల్చుకుని వచ్చావ్?" అని మాస్టారు అడిగాను. "నా పెద్దకొడుకు సార్. వాడైనా నాలుగు అక్షరాలు నేర్చుకుంటాడని పిల్చుకునివచ్చాను" అని వినయంగా అన్నాడు. "సరే, ఏ తారీఖున పుట్టాడు? ఏ రోజు? ఏ నక్షత్రంలో పుట్టాడు?" అని మాస్టారు అడిగాడు. ఏదీ తెలియని భగన్య ఆ ప్రశ్నలకు నివ్వెరపోయాడు. బ్రాహ్మణులతో సహవాసం వల్ల తిథి,నక్షత్రాల గురించి కాస్త తెలుసు. అయితే అతని పెద్ద కొడుకు పుట్టిన సందర్భంలో వాటి గురించి ఆలోచించలేదు. వాడిని దవాఖానాల్లో చూపించడంలోనే కాలం గడిచిపోయింది. ఇవేవీ గుర్తురాలేదు. ఇక తిథి, రోజు, నక్షత్రాలు ఎవరికి గుర్తుంటాయి? "అదే ఏదో అమావాస్య వచ్చిందిసార్. ఆ అమావాస్య

రోజుకు ముందు రోజో, తర్వాత రోజో పుట్టాడు" అని తల గోక్కున్నాడు. శాంతప్ప మాస్టారు అనుమానిస్తూనే "అదికాదు రా, అమావాస్య అంటావు, ముందో వెనుకో అంటావ్. మీ లంబాడీలకు బుద్ధిలేదు. సరిగ్గా చెప్పు. అమావాస్యకు ముందా? అమావాస్య తర్వాత?" అని మళ్లీ అడిగాడు."అయ్యో స్వామి. మేము అడవి మనుషులం. ఈ మధ్యనే జనావాసానికి వచ్చాం. మాకదంతా ఎలా తెలుస్తుంది? అమావాస్యకు ముందు అయినా వెనుక అయినా ఏమీ ఫరకు లేదు. అమావాస్యకు ముందేనని అనుకోండి" అని అన్నాడు. "పోనీలే, ఏ అమావాస్యనో అదైనా గుర్తుందా?" అడిగాడు శాంతప్ప మాసారు. భగన్య నోరు మెదపలేదు. పాపం శాంతప్ప మాస్టారే ఐదారు సంవత్సరాలలో ఎన్ని అమావాస్యలు వస్తాయో వాటన్నిటిని గుర్తించి, అందులో పాఠశాల ప్రారంభమయ్యే మే-జూన్ మాసాలకు దగ్గరలో సరిగ్గా ఆరు సంవత్సరాలు పూర్తయ్యే అమావాస్యను కనుక్కొని, దాని వెనుకటి తేదిని చూసి టాంక్యా పుట్టినరోజును సృష్టించారు.

రెండు రోజులు బడికిపోతే ఒక వారం తాత వెంబడి ఎద్దులు మేపడానికి, గొర్రె పిల్లలను, పశువులను మేపుకుని రావడానికి టాంక్యా వెళ్లిపోయేవాడు. భగన్యనాయక్ రోజూ సాయంత్రం ఇంటికి రాగానే అక్షరాలను ఇసుక మీద రాయించి, సొంతంగా రాయమని చెప్పేవాడు. అయితే టాంక్యా 'అ' రాస్తే 'ఆ' రాసేవాడు కాదు. దాంతో భగన్య కోపంతో మండిపడేవాడు. భగన్యనాయక్ ఎంత కొట్టినా ప్రయోజనం కలగకపోవడంతో తానే మౌనం వహించి, పిల్లవాడిని స్కూలు మానిపించి వ్యవసాయ పనుల్లో పెట్టాడు. టాంక్యా తర్వాత చిమణి, బదియా, రామి, జేము, హాబు, గమలి, కేమ్యా, జాంప-ఇలా ఒకరి తర్వాత ఒకరు అన్నట్టు పదకొండుమంది పిల్లలు పుట్టారు. ప్రభుత్వం జనసంఖ్య వేగంగా పెరగడం గమనించి ఏదైనా ఒక దారి కనుక్కోకపోతే భారతదేశం కేవలం జనసంఖ్యతో నిండిపోతుందనే అనుమానంతో పిల్లలు ఎక్కువగా పుట్టిన వారికి సంతానం కలగకుండా ఫ్యామిలి ప్లానింగ్ చికిత్స చేసేవారు. మొదట్లో వంద రూపాయలు ఆశ చూపింది సర్కార్. చావళి ఒక్కతే ఇంటా బయటా పనిచేయాల్సి వచ్చేది. అంతేకాకుండా ఆమె గర్భవతి అయినా బాలింతరాలు అయినా అత్త గూడ్లిబాయి కోడలిని చూసుకునేది కాదు. ఈ చిత్రహింస చూసి భరించలేక భగన్యనాయక్ పదకొండవ కొడుకు జాంప పుట్టిన తర్వాత, పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు.

నాలగవ కూతురు రామి పుట్టినప్పుడు, భగన్య నాయక్ తన పెద్ద చెల్లెలు హామ్లిని తానున్న తండాలోని బంద తెగకు చెందిన సోమ్లు అనే కుర్రవాడితో సంబంధం

నిశ్చయించి పెళ్లి జరిపించాడు. అప్పుడు చావళికి కాస్త ఊపిరి తీసుకోవటానికి వీలు కలిగింది. అయితే వీరి పదకొండు మంది పిల్లలు పెద్దవాళ్లవుతుండటం గమనించిన గూడ్లిబాయి తన రెండవ కొడుకు ఫక్కీర గురించి ఆలోచించసాగింది. అన్ని సౌలభ్యాలు సమకూరి, రేపు పిల్లలు సంపాదనాపరులైతే, ఫక్కీరకు అన్యాయం జరుగుతుందని గూడ్లిబాయి ఏదో ఆలోచనలో పడింది. అప్పటికే ఇద్దరు కూతుర్లు వయసు వచ్చి పెళ్లికి సిద్ధంగా ఉన్నారు. అయినా వాళ్ల గురించి పట్టించుకోకుండా ఫక్కీరకు పది కిలోమీటర్ల దూరంలోని బాచేనహళ్లి తండాలోని చాణోతు తెగకు చెందిన జీతిబాయితో పెళ్లి జరిపించి తీసుకుని వచ్చింది. వారు పుట్టింటికి వెళ్లి తిరిగి వచ్చేలోపు గూడ్లిబాయి మనసులో వేలాది ఆలోచనలు వచ్చి పోయాయి. ఆమె ఊరుకోలేదు. ఆ ఒక్క వారంలోనే చావళితో ఇరవైసార్లు గొడవ పడింది. అట్లకాడతో కాళ్లమీద, చేతులమీద వాతలు పెట్టింది. కోడలిని, పిల్లలతోపాటు సణ్ణటి తండాకు తరిమింది. కొడుకు భగన్యనాయక్ ఇంటికి వచ్చే సమయానికి తలకు బట్ట కట్టుకొని మంచంలో పడుకొని గాయాలతో బాధపడుతున్నట్టు నాటకం ఆడింది."ఏమైందమ్మా, ఎన్నడు మంచం పట్టనిదానివి ఇప్పుడు ఏమైంది? పిల్లలంతా కనిపించడం లేదు? ఎక్కడికి పోయారు?" అని అద్దెకు తిప్పిన బండి నుంచి దిగివచ్చినవాడు పిల్లలు కనిపించకపోవడం గమనించి అడిగాడు. "అయ్యో నాయనా, ఆ ముండా ఎక్కడుంది? పొద్దున్నే లేచి కాస్త పని చెయ్యమ్మా అనేసరికి ఆ గుడ్లగూబ ఏమందో తెలుసా? "నీ కొత్త కోడలు వచ్చిందికదా, ఆమెకు చెప్పు, నేను ఇంతకాలం చేసిచేసి మెత్తగయ్యాను" అంది. "ఎందుకమ్మా అలా మాట్లాడతావు? అని అంటే నా చేతులు మెలితిప్పి నన్ను కొట్టింది. నన్ను కింద పడవేసింది. మీ చెల్లెల్ని కిందకి తోసేసింది. నా సవితి, ఎన్ని రోజులు వైరం మనసులో పెట్టుకుందో నాయనా. వద్దు నాయనా, ఈ జీవితం నాకొద్దు. నేను బ్రతకను" అని మొసలి కన్నీళ్లు కారుస్తూ, కొడుకు భగన్య నాయక్ రక్తం మరిగిపోయేలా దీనంగా మాట్లాడింది. అయితే అతడికి నిజం ఏమిటో తెలుసు. తన భార్య చావళి పదేళ్ల వయసులోనే ఈ ఇంటికి వచ్చింది. ఈ ఇరవైఏళ్లలో ఇరవైవేల అనుభవాలు మూటకట్టుకుంది. పడరాని కష్టాలు అనుభవించింది. ఆమె తన తల్లితో ఇలా ప్రవర్తించడం అసాధ్యం. తన తల్లి అబద్ధాలు చెబుతోంది. అంటే ఆమెతలలో ఏదో ఆలోచన ఉన్నట్టుందని అనుకొని, "ఎక్కడుందమ్మా, ఈరోజు దాని అంతు చూస్తాను. దాని ప్రాణం తీస్తాను. ఎక్కడుందో చెప్పు. నీ మీద చెయ్యి చేసుకున్నదంటే ఏమిటి?" అని లేని కోపం ప్రదర్శించాడు.

పిల్లలు లేని ఇల్లు బిక్కు బిక్కుమంటూ ఉంది. పిల్లలు లేని ఇంట్లో ఒక్క

క్షణం ఉండబుద్ధి కాలేదు. 'ఎవరి కుట్రకు ఎవరో బలి. ఈ ముసలి దాని తలలో ఏమి నడుస్తుందో ఏమో? తమ కుటుంబంలో చీలిక వచ్చేలా అనిపిస్తోంది. లేదా తమను ఇంటినుంచి బయటికి పంపే కుట్ర చేస్తుండాలి. కారణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక ఈమె మమ్మల్ని ప్రశాంతంగా బతకనివ్వదు. ఆమెకు తనపై మునుపటి ప్రేమ లేదు. చిన్న కొడుకు ఫక్కీర భవిష్యత్తు గురించే ఎక్కువ ఆసక్తి. బహుశా ఆస్తంతా వాడికి కట్టబెట్టాలని అనుకుందేమో?' ఇలా ఆలోచించి తమకోసం ఒక గుడిసె కట్టుకోవడానికి స్థలం వెతికాడు. బాచేనహళ్లిలోని పుట్టింటికి వెళ్లిన జీతిబాయి తిరిగి వచ్చింది. అప్పటివరకూ మంచంపట్టినట్టు నాటకం ఆడుతున్న తల్లీ, కూతుళ్లూ సేవాబాయ్ గుడి దగ్గర బాచేనహళ్లి తండా నుంచి వచ్చిన బండ్ల గురించి తెలియగానే గబుక్కున లేచి వారి స్వాగతానికి సిద్ధమైంది. చిన్న కోడలికి రత్నకంబళి వేసినట్టు స్వాగతం పలికింది. అన్ని నాటకాలను మౌనంగానే భగన్య నాయక్ గమనించాడు. అతన్ని 'నువ్వు తిన్నావా?' అని కూడా తల్లి గూడ్లిబాయి అడగలేదు. 'ఏమి చేస్తున్నావ్?' అని కూడా అడగలేదు. 'పొలానికి పోయావా?' అనీ అడగలేదు. వచ్చిన అతిథులకు ఉపచారం చేయడంలోనే మునిగింది.

భగన్యనాయక్ భార్యాబిడ్డలతో మరో చోటికి, వేరుగా కాపురం పెట్టడానికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అయితే తమంతట తామే ఇంటి నుంచి బయటికి వెళ్లేలా ప్రేరేపించిన ముసలితల్లి తెలివితేటలకు నివ్వెరపోయాడు. హుస్సేన్ సాబ్ ఇంటినుంచి రాత్రికి రాత్రే కర్రలు, దుంగలు, గడ్డి తెచ్చి తెల్లవారేలోపు ఒక పెద్ద గుడిసెను నిలబెట్టాడు. అతని తల్లిదండ్రులు 'ఎందుకిలా వేరుగా గుడిసె వేసుకున్నావు?' అని అడగలేదు. అతను నేరుగా తల్లి దగ్గరికి వచ్చి, "అమ్మా, నా భార్యాబిడ్డలను తీసుకొని వస్తాను. ఎన్ని రోజులు వాళ్లను పుట్టింట్లో వదిలేయగలను? టాంక్యా స్కూలుకు పోయే పిల్లవాడు. బడి మానేస్తే చెడిపోతాడు. వాళ్లను తీసుకొని వచ్చిన తర్వాత మేము వేరుగా కాపురం ఉంటాం" అని ఆమె జవాబు కోసం ఎదురుచూశాడు. తల్లి కిమ్మనలేదు. నోరు తెరిచి 'వద్దురా' అనలేదు. ఇంకా మాట్లాడితే మర్యాద వుండదని అరక్షణం కూడా అక్కడ నిలబడకుండా బయటికి వచ్చేశాడు. 'పాము చావలేదు కర్ర విరగలేదు' అనుకుంది ముసలిది. ఇదంతా మౌనంగానే గమనిస్తున్నాడు పంపానాయక్.

'కష్టపడి కుటుంబాన్ని సాకిన సొంత కొడుకును వదల్లేదు కదా! కొడుకు మనసును బాధపెట్టి బయటికి తరిమింది ఈ నీచమైన ఆడది' అని లోలోపల సంకటపడుతూ బయటికి చెప్పుకోలేక మనసులోనే పంపానాయక్ మరిగిపోయాడు.

అయితే మొత్తం తనకాయాకష్టంతో, కుటుంబాన్ని ఒంటిచేత్తో నిలబెట్టి, తండాలో నలుగురు శభాష్ అనేలా చేసిన పెద్దకొడుకును ఇంటి నుంచి బయటకు పంపి, ఒక ఉమ్మడి కుటుంబాన్ని కన్నతల్లే చీల్చింది. చీమలు పెట్టిన పుట్టలో పాము చేరుకున్నట్టు ఆమె రెండవ కొడుకు ఫక్కీర చేరుకున్నాడు. 'ఏయ్ బుట్ట ఎత్తుకొని వచ్చినవారే' అని మాట్లాడిన జనం నోరు మూయించిన పెద్దకొడుకు ఇప్పుడు ఆమెకు అవసరం లేకుండా పోయాడు. చిన్న వయసులోనే అడవిని నరికి ఇరవైఎకరాల పొలం సాగుచేశాడు. అంతేకాకుండా మరో అయిదు ఎకరాలు జనం దగ్గర కౌలుకు తీసుకున్నాడు. వేగంగా కుటుంబాన్ని అభివృద్ధిలోకి తెచ్చాడు. ఆ అభివృద్ధికి కారణమైన అతని ఉత్సాహాన్ని ముక్కలు చేసింది గూడ్లిబాయి. అతని మంచితనం మీద దెబ్బకొట్టింది. ఇంటి నిండా కిలకిలలాడే పిల్లలతోపాటు కొడుకును, కోడలిని ఇంటి నుంచి బయటికి పంపితే అతడు ఆ బాధ నుంచి కోలుకోలేడని ఆమె ఆలోచన. ఆ సమయంలోనే ఫక్కీరను ఎలాగైనా ఆస్తికి వారసుడిని చేయాలన్నది ఆమె దూరాలోచన.

గూడ్లిబాయి చేసిన కుట్రకు కొందరు నిజంగానే సంతోషపడితే, 'తండాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఒక కుటుంబాన్ని నిలువునా చీల్చిన దరిద్రపు ముండ' అని చాలామంది తిట్టేవాళ్లు. భగన్యనాయక్ ఒక్కడుంటే చాలు ఏమి కావలసినా చేయవచ్చని జనం మాట్లాడుకున్నారు. ఐదారు సంవత్సరాల వ్యత్యాసంలోనే తన అస్తిత్వాన్ని పోగొట్టుకున్న ఉప్పార హులువప్ప తన వృద్ధాప్యంలోనూ దిన్ని సాయిబును వెతుక్కుంటూ వెళ్ళాడు."ఎంత పని జరిగిందిరా దిన్ని సాయిబు. వాళ్ల అమ్మకు అలాంటి పాడుబుద్ధి ఏమిరా? మొత్తం గుడదహట్టి తండాలో ఒక ఇంటిని నిలబెట్టడం కోసం రాత్రీపగలూ ఒక్కటిగా చేసి శ్రమపడుతున్న కుర్రవాడిని పాడుచేసిందికదరా పాడుముండ. ఏం చేయాలిప్పుడు? అదికాదురా దిన్ని సాయిబు, కష్టపడే జనం తక్కువగా ఉన్నప్పుడు; ఇప్పుడు నా పరిస్థితి చూడప్పా, వందలాది ఎకరాల పొలం. అన్నదమ్ములు సంపాదించలేదు. నా పిల్లలు సంపాదించలేదు. గతంలో ఏదో వ్యవసాయం ఉండేది. కొద్దో గొప్పో వర్షం కురిసేది. పంటలు పండేవి. ఇంటినిండా గింజలు ఉండేవి. భూమాతకు ద్రోహం చేశారు. జాగ్రత్త పడలేదు. ఇప్పుడు కూటికి గతి లేదు" అని బాధగా అన్నాడు. "అయ్యో వదిలేయ్ హులువప్పా, అదంతా ఇప్పుడు ఎందుకు? ఆమె ఎవరి మాటా వినదు. ఆమె నోరు బొంబాయి. కేవలం నోటితోనే గుడదహట్టి తండాను బెదిరించింది. ఆమె అదృష్టానికి భగన్యలాంటి మనిషి పుట్టాడు. కష్టపడ్డాడు. కుటుంబాన్ని నిలబెట్టాడు. ఆస్తి

చేసుకున్నాడు. ఇప్పుడు అతనికి సంతానం ఎక్కువ. ఆ ఆస్తి అంతా వాళ్లకే పెడతాడని ఇంటి నుంచి బయటకి పంపింది. ఇంకా ఏమేమి చేస్తుందో?" అని తనకు తెలిసిన సత్యాన్ని చెప్పాడు దిన్నిసాయిబు. వారి సంభాషణల మధ్య తండా నాయకుడు, కారభారి, డావోలు వచ్చి కలిశారు. అందరి నోటా పెద్దకొడుకుకు అన్యాయం జరిగిందనే మాటనే గిరికీలు కొడుతోంది.

భగన్య నాయక్ గుడిసె వేసుకున్నాడు. అయితే సంసారం ప్రారంభించడానికి వస్తువులేవీ లేవు. కొడుకు భార్య చావళికి వాతలు పెట్టి, కొట్టి ఇల్లొదిలిపోయేలా చేసింది గూడ్లిబాయి. చాలా గడుసైన ముసలిది. ఇప్పుడు భగన్య బయటికి వెళ్లిపోతే, చెల్లెలి పెళ్లి, ఫక్కీర పెళ్లి అని ఒకింత భూమిని ఎక్కువగా అడగవచ్చు. పైగా తల్లితండ్రుల భాగం కూడా ఫక్కీరకు దొరుకుతుందనే ఆలోచన ఆమెది. సర్వతప్ప భట్టు అయిదారు ఎకరాల వరిమడి కూడా ఫక్కీర వచ్చేలా చేయాలని ప్రణాళిక రూపొందించింది.

భగన్యనాయక్ రెండు రోజులు ఇతరుల పొలంలో పనిచేశాడు. పెద్ద కొడుకు టాంక్యాకు స్పృహ తప్పిందని తెలిసి, పొద్దు వాలుతుండగానే తండాను వదిలి సణ్ణటి తండాకు బయలుదేరాడు. ఆరున్నర కిలోమీటర్ల దూరాన్ని అక్కడి జనం తినడానికి కూర్చుని, వాళ్ళు తిని లేచేలోపే దాటాడు. చావళి చేతిమీద, ఒంటిమీద గాయాలు అలాగే వున్నాయి. టాంక్యా ఎందుకో తనకు కళ్లు తిరిగినట్టు అయ్యిందని పడుకొని ఉన్నాడు. మిగిలిన ఎనిమిది, పదిమంది పిల్లలు కూడా వరుసగా పడుకొని వున్నారు. భగన్యనాయక్ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు. తనను తాను తిట్టుకున్నాడు. "తన తల్లి ఏమి చెప్పిన అదే సత్యం అనుకుని సత్యాన్నే నమ్మడానికీ నిరాకరించాడు. తన భార్యదే తప్పు అని ఆమెమీద ద్వేషం కలిగించే ప్రయత్నం చేసింది తన తల్లి" అని భార్య తమ్ముడు హుసేని ముందు బాధగా అన్నాడు. "మొత్తానికి నీకో సత్యం తెలిసిందికదా మామ. అంతే చాలు. ఎక్కడ నువ్వు మీ అమ్మ మాటలు విని మా అక్క జీవితం నరకం చేస్తావోనని భయపడ్డాం మామ" అన్నాడు హుసేని. "ఎన్నెన్నో కష్టాలుపడి నేను కట్టిన ఇంటినుంచి బయటకు తరిమింది మా అమ్మ. తన మనమలు, తన కోడలు అనే భావన లేకుండా ఇంటినుంచి బయటికి వెళ్లేలా చేసింది. తమ్ముడు, చెల్లెలు అంటూ మా అమ్మ చెప్పిన మాటలు విని ఇల్లు కట్టాను. ఇప్పుడు సంపాదన సరిగ్గా లేనప్పుడు తన చిన్న కొడుకు కోసం నా కుటుంబాన్ని వీధిపాలు చేసింది". తాను పుట్టినప్పటినుంచి తల్లి నీడ నుంచి బయటకు రాలేక సతమతమవుతున్న భగన్యనాయక్ పదకొండు మంది పిల్లల తండ్రి అయినప్పటికీ తన బాధను చెప్పుకోలేక

పరితపించసాగాడు. తన భార్యాపిల్లలతోపాటు తిరిగొచ్చి కొత్తజీవితాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు.

దిన్ని సాయిబు మాదిరి భగన్య నాయక్ జీవితం గురించి కలవరపడేవారి ఒక పెద్ద గుంపు తండాలో ఉంది. కొందరు గుండె లోతుల్లోంచి మాట్లాడారు. మరికొందరు పైపైకి మాత్రమే మాట్లాడి, మాటలు తేల్చేశారు. మూడో రోజు ఊరు ముందు పొలాన్ని ఆక్రమించారు. అడవిలోపలి ఇరవై ఎకరాల భూమివల్ల భగన్య నాయక్ తండా ముందు వెలిగిపోతాడని అనుకునేవారికి ఈ వార్త చాలా సంతోషం కలిగింది. వాళ్లలో ముఖ్యంగా అతడి బద్ధ శత్రువులైన హెమ్నానాయక్, తండా బంధపూజారి భోతానాయక్, కడెమని పూర్వ, వెనక వీధి సంక్రి, మాంకాళి, మంజ్యా- ఇలా పెద్ద గుంపు సారాకొట్టులో ఒక్కొక్క సీసా సారాయి తాగి సంతోషాన్ని పంచుకున్నారు. అయితే భగన్యనాయక్ గరికలాంటివాడని వారు ఊహించలేదు. నీళ్లు లేకపోయినా చిగురించే గరికలాంటి స్వభావానికి చెందినవాడు భగన్య. అయితే ఇప్పుడు అతనికి వెనుకనుంచి పెద్దదెబ్బపడింది. ఆస్తిలో అతని భాగం. అతని తల్లి మునుముందు ఏం చేస్తుందోనని ఆలోచించలేకపోయాడు.

బండి తండాకు వచ్చినప్పుడు సారథి కొండ వెనుక సూర్యుడు అస్తమిస్తున్నాడు. పదకొండు మంది పిల్లలతో గాయం మానని కాళ్లుచేతులతోనే చావళి బండి దిగింది. భగన్యనాయక్ కట్టిన తడికల గుడిసె పక్కన హుస్సేన్ నాయక్ బండిని నిలిపి, ఎద్దులను చెట్టుకు కట్టివేశాడు. కడవ తీసుకొని నీళ్ల బావి దగ్గరికి వెళ్లాడు. గూడ్లిబాయి రెండవ కూతురు చిమ్లి హుసేనిన్ని చూసి ఇంటికి పరిగెత్తి తల్లికి కబురు అందించింది. "ఎప్పుడు వచ్చింది" గంభీరంగానే అడిగింది. "తెలీదు. ఆమె తమ్ముడో, అన్ననో హుసేని కనిపించాడు. అతను నీళ్లు చేదడానికి బావి దగ్గరికి రావడం చూశాను. నీకు తెలిసిందో లేదోనని విషయం చెప్పాను. అంతే" అని ఆమె ముఖం చూసింది. గూడ్లిబాయి "ఆ బాడుకోవ్ నా కొడకు ఎక్కడున్నాడు? నాకు చెప్పకుండా, అడగకుండా ఆ పనికిమాలిన ముండను ఎలా తీసుకొని వచ్చాడు? ఆహా, మంత్రగత్తె ఎలా కూర్చోనుందో చూడు, పిచ్చిదానిలా" అని అరుస్తూ వెళ్లి, చావళి కనిపించగానే ఆమె బుగ్గలు పట్టుకుని పిండింది. అది చూడగానే "ఏయ్ మామి, నువ్వు ఇలా జనం మీద చెయ్యి చేసుకుని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. కాళ్లుచేతులు కాల్చింది చాల్లేదా? పో, మేము మీ ఇంటికి రాలేదు" అని చావళి అన్న హుసేని దబాయించాడు. "ఒరేయ్, బకరా నా కొడుకా, తినడానికి తిండి లేని మీకు బండి నిండా ధాన్యం పంపి సాకిన నన్నే ఎదురించి మాట్లాడుతావా? నీ కథ ఏమిట్రా?" అని అతని

మీదికి పోయింది. ఏదో వెతుకుతున్న భగన్యనాయక్ గొడవ విని పరుగెత్తి వచ్చాడు. ఎన్నడూ తల్లికి ఎదురు మాట్లాడనివాడు ఈరోజు ఈ రెండింటిలో ఏదో ఒకటి జరగాలని నిర్ణయించుకున్నాడు. సర్వతప్ప చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. 'నీ పాదాల కింద నిప్పులు పడ్డప్పుడు ఎలా ఆలోచించాలో అలా ఆలోచించాలి. నీ అస్తిత్వపు ప్రశ్న వచ్చినప్పుడు నువ్వే స్వయంగా పోరాడాలి. గట్టిగా మాట్లాడేవాళ్ల ఎదుట మెల్లగా మాట్లాడితే ప్రయోజనం లేదు'. సర్వతప్ప మాటలు గుర్తుకు రాగానే భగన్య సహనం కోల్పోయాడు. ఇప్పటిదాకా అన్నీ మౌనంగానే భరించినవాడు– "ఎందుకు ఇలా ఊరిజనం ముందు మర్యాద తీస్తావు ఊరుకో" అని అతను అంటుండగానే, "ఏమిరా, భార్య కొంగు పట్టుకుని తిరిగేటోడా, భార్య గులామువిరా నువ్వు. భార్య పియ్య తినరా లంజా కొడకా, నాకే ఎదురు చెప్తావా? అది ఏం చెప్పిందిరా బోసిడి. ఈ నా కొడుకు నా మీదే ఎగురుతున్నాడు" అని అతని చొక్కా పట్టుకోడానికి పోయింది. "ఊరకే చెయ్యి వదలవే. నువ్వు తల్లి అని ఊరికే వున్నాను" అని విడిపించుకోవడానికి చూశాడు. "ఏం చేస్తావ్‌రా ఊరిని పాడుచచేసేవాడా? ఏం చేస్తావో చెయ్" అని పంచ పట్టుకుంది. భగన్యనాయక్ కోపంతో మండిపడ్డాడు. "ఛీ... నీయమ్మ...పాడుముండా! ఊరి జనాన్ని నోరు చేసుకుని భయపెట్టేలా నన్ను భయపెడదామని అనుకున్నావా?" అని చేతికి దొరికిన కర్ర తీసుకొని తల్లి అని కూడా చూడకుండా ఇష్టమొచ్చినట్టు బాదాడు. "అమ్మో...చచ్చాన్రా" అని అరవసాగింది. "నీకన్నా గట్టిగా మాట్లాడతాను" అని ఎప్పుడైతే అతనూ అరవడం మొదలు పెట్టాడో ముసలిది మెత్తబడింది. గూడ్లిబాయి జగడానికి బెదిరిపోయిన జనం తలుపులు మూసుకున్నారు. అతని తండ్రి కొడుకు తరఫున మాట్లాడాడు. తండాలో అందరూ గూడ్లిబాయిని ఛీ... ఛూ...అని ఈసడించుకున్నారు. ఇదంతా జరిగిన తర్వాత ఆమె నోటి వాగుడు తగ్గింది.

పంచాయతీ ముందు జనం భగన్యనాయక్ తరఫున మాట్లాడారు. పూజారి, పీర్య, అతని గుంపు మాత్రం అతనికి ఆస్తి దక్కకూడదని వ్యతిరేకించారు. ఉప్పార హులువప్ప, దిన్ని సాయిబు, బోయ మలియప్ప, పల్లెటూరి మాస్టారు, సర్వతప్పలాంటి మాటల మాంత్రికులు అతని నోటిని మూయించేవారు. అలాగని ఎన్నడూ అన్యాయాన్ని ప్రోత్సహించలేదు.

"ఇప్పుడు అందరూ చేరారు. పంచాయతీ మొదలుపెట్టవచ్చు" అని అన్నాడు.

తండా నాయకడు, కారభారి, డావోలు తమ మనసుకు తోచినట్టు మాట్లాడారు. చాకలి శివుగ మాత్రం పంచ ఎత్తి పట్టుకుని "చూడండి భట్టుగారు, ఇది వాళ్ల

ఇంటి విషయం. మనం ఎందుకు తలదూర్చాలి? ఏదో నాలుగు మాటలు చెప్పి వెళ్లిపోండి. ఇంకా పెళ్లి కావలసిన కూతురు ఉంది. గుండెల మీద ఎలా కుంపటిలా పెరిగింది. ఈ భగన్యనాయక్‌కు చాలామంది పిల్లలు ఉన్నారు. సంపాదించుకుంటారు. వాడికి ఆస్తిపాస్తులు ఇవ్వాల్సిన అవసరంలేదు. బయటకు పోనీలెండి" అంటూ తన శుష్కవాదనను అందరి ముందు పెట్టాడు. సర్వతప్ప ఏమి మాట్లాడలేదు. అతని తరఫున దిన్నిసాయిబు మాట్లాడాడు "అది కాదయ్యా, నువ్వు ఏమి మాట్లాడుతున్నావు? నీ బుర్ర ఏమైనా పనిచేస్తుందా? లేదా? ఆ కూతురి పెళ్లి ఎలాగో చేయవచ్చు. ఇంతకు ముందు ఒక చెల్లెలి పెళ్లి భగన్య చేశాడుకదా! అలాగే భగన్య తల్లి, తమ్ముడు కలిసి చేయవచ్చు. ఇక ఇంతమంది పిల్లల్ని సాకటం చాలా కష్టం. భగన్యనాయక్ ఎలాంటివాడో తండాలోని వారందరికీ బాగా తెలుసు. ఇతర లంబాడీల మాదిరి అతను సోమరై ఉంటే నేనే వద్దనేవాడిని. భూమిలో అతనికి ఎంత భాగం రావాలో అది ఇవ్వాల్సిందే" అని కచ్చితంగా చెప్పాడు. ఉప్పార హులువప్ప, పల్లెటూరి మాస్టారు అతనికి వత్తాసు పలికారు. జనం అప్పటికే ఒక్కరొక్కరుగా వెళ్లిపోవడం మొదలుపెట్టారు. సర్వతప్ప లేచి నిలుచున్నాడు ఒకసారి చుట్టూ చూసి, "అయ్యా, తండా నాయకా! కారభారి! గూడ్లిబాయి! భగన్యనాయక్ నాకు బంధువు కాదు. నువ్వూ నాకు దగ్గరి మనిషివికావు. అయితే ఈ పంచాయతీకట్ట అన్నది దేవుని సన్నిధి ఉన్నట్టే. ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటానికి కుదరదు. న్యాయం ఎవరికైనా ఒకటే. నీకు ఒక న్యాయం మీ కొడుకుకు ఇంకొక న్యాయం అని ఉండదు. అతను నీ కన్నకొడుకు. నీ చిన్న కొడుకు ఫక్కీరనాయక్ కన్నా ముందు పుట్టినవాడు. అతనికి ఎక్కువ సంతానం. వాళ్లు కూడా నీ మనవళ్లే. రేపు ఎవరైనా వాళ్లను ఎవరి మనవళ్లని అడిగితే గూడ్లిబాయి మనవళ్లని చెప్తారు కదా" అని గూడ్లిబాయి ముఖం చూశాడు. ఆమె ముఖంలో ఎలాంటి భావాలు వ్యక్తం కాకపోయిప్పటికీ ఆమె మనసులో ఏదో కదలిక ఏర్పడిందని సర్వతప్పకు అర్థమైంది. మళ్లీ ఆమెపై ఒక భావనాత్మక దెబ్బకొట్టాడు "అది కాదమ్మా, నీవు నీ కొడుకుల విషయంలో వ్యత్యాసం చూపిస్తున్నావు. భగన్యనాయక్ కళ్లల్లో పుసులు తీయటానికి రానటువంటి వయస్సు నుంచే కష్టపడ్డాడు. ఈరోజు నీవు ఎలా వున్నావో, నీకు ఏమి ఉందో, నువ్వు దేన్ని చూసుకుని గర్వపడుతున్నావో దానికి కారణం వాడే. అలాంటి అతన్నే నువ్వు మోసం చేస్తే దేవుడు కూడా నిన్ను క్షమించడు" అన్నాడు. ఇక ఆమె భరించలేకపోయింది. "అలాగే స్వామి, మీరు ఎలా చెబుతారో అలాగే కానివ్వండి" అని దారికి వచ్చింది. ఇదే సరైన సమయం అని భట్టుగారు

“భూమిని సమానంగా పంచండి. ఎవరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. నీకు ఇష్టమైనవారి ఇంట్లో ప్రశాంతంగా ఉండు” అన్నారు. “నేను ఎవరి దగ్గరికి వెళ్లేదాన్ని కాదు. ఫక్కీర ఇంట్లో చివరివరకు పడివుంటాను. అయితే స్వామి మీరు చెప్పినట్లే ఉన్న పొలాన్ని ఇద్దరికీ సమానంగా పంచండి. అతనూ నా కొడకే. పడరాని పాట్లుపడి కట్టుకున్నాడు” అని ఏమో చెప్పడానికి ప్రయత్నించింది. అయితే సాధ్యం కాలేదు.

అడవిలోని పొలాన్ని రెండు భాగాలుగా గుర్తించారు. ఒకటి ఫక్కీరకు. మరొకటి భగన్యనాయక్‌కు. చిన్నవాడి పరిస్థితి రేపు ఎలా ఉంటుందోనని ఆలోచించి, గొడవలమారి పూజారివైపున్న భాగాన్ని పెద్దకొడుకు కొట్లాడుకుని చావాలనీ, భూమి సమానంగా ఉండటం వల్ల ఆ వైపు పొలాన్నే తీసుకోవటానికి ఒప్పుకుంది. గతంలో పొలంలో కనిపించిన, బయటపడిన రాళ్లనంతా, చెత్తనంతా పొలం గట్టు మీద కుప్పపోస్తే, పూజారి కొడుకు జింకాలు నాయక్ తమ పొలం పక్కనున్న పంపా నాయక్ పొలంలో పారవేసి గొడవలు పెట్టేవాడు. ఇది తెలిసిన గూడ్లిబాయి తన చిన్న కొడుకును ఆ జంజాటం నుంచి తెలివిగా తప్పించింది.

కొత్తగా కొనుక్కున్న పొలంలో తలా ఒకటిన్నర ఎకరం తీసుకున్నారు.

❖❖❖

6. చెదరిన కుటుంబం

మొత్తం ఇరవై ఎకరాల జమీను మనుషుల మధ్య దూరాన్ని పెంచింది.

ఫక్కీరకు పెళ్లయిన సంవత్సరానికి ఒక ఆడపిల్ల పుట్టింది. గూడ్లిబాయి గుండెలో ఎవరో నిప్పు పెట్టినట్టయింది. పెద్దవాడికి మొదటి మొదటి కాన్పులో మగ పిల్లవాడు పుట్టాడు. చిన్నవాడికి అలాగే మగపిల్లవాడు పుడతాడని అనుకుంది. సరే, ఇకపైన ఒక పిల్లవాడు పుట్టవచ్చు అనుకుంది. అయితే రెండవ సారి కూడా ఆడపిల్ల పుట్టడంతో, "నీ గర్భసంచిలో ఆడపిల్లలను నింపుకొని వచ్చావా? అదే కులపుదాన్ని కట్టుకొని వచ్చాడో? వాడికి ఏడుమంది మగపిల్లలు ముగ్గురు ఆడపిల్లలు. మరి నీకు?" అని మాటలతో పొడవసాగింది. అయితే ఫక్కీర భగన్యనాయక్‌లాంటి వాడు కాదు. ఫక్కీరకు భగన్యలా వినే అలవాటు లేదు. ఏమున్నా పట్టుకోవడం, కొట్టడమే. తల్లి మాటలకు వాడికి ఎప్పుడు పైత్యం నెత్తికెక్కిందో. గూడ్లిబాయిని పట్టుకొని ఆమె మోచేయి విరిచేశాడు. అయినా ఆమె ఊరకోకుండా కోడలిని హీనమైన మాటలతో తిట్టసాగింది. దాంతో ఒకసారి గూడ్లిబాయిని ఇంటి నుంచి బయటకు తోశాడు. అయితే తల్లి అనే మమకారంతో మళ్లీ లోపలికి పిలుచుకొన్నాడు. పెద్దకొడుకైన భగన్య మీద ఆమెకు కించిత్తయినా ప్రేమ, మమకారం, కరుణ లేకుండాపోయాయి. అతను వేరు కాపురం పెట్టిన తర్వాత ఎన్నడూ అతని పేరు ఎత్తలేదు. అతను పిలిచినా వెళ్లలేదు. ముసలి పంపానాయక్ మాత్రం పండుగ రోజులలో పెద్ద కొడుకు ఇంటికి వెళ్లేవాడు. ఇటువైపు ఆడపిల్లల సంఖ్య పెరుగుతుండగా అన్న మీద తమ్ముడు ఫక్కీరలో కోపం, ద్వేషం పెరగసాగాయి. పూజారి, అతని గుంపులోని మనుషులు నిరంతరం ఏవేవో చెప్పి అతని తలను పాడుచేశారు.

జబ్బులు, తాపత్రయాలు, పేదరికం, దారిద్ర్యం నిండిపోయిన ఇంట్లో భగన్యనాయక్ నిరాశ చెందాడు. అయినా ఎవరి ఇంటికి వెళ్లి గింజల కోసం చేతులు చాపలేదు. అతని స్వాభిమానం తెలిసిన సర్వతప్ప తానే స్వయంగా వెతుక్కుంటూ భగన్య గుడిసె దగ్గరకు వచ్చాడు. "అది కాదురా, ఇంటికి వచ్చి పరిస్థితి ఇలా ఉందని ఒక మాట చెప్పడానికి ఏమైందిరా నీకు? పెద్దమనిషివి అయిపోయావా? నీ కోసం కాకపోయినా భార్యాబిడ్డల కోసమైనా ఒకసారి లొంగాలిరా! పరిస్థితులతో పాటు సర్దుకుపోవాలి. చూడు ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. నీవు శ్రమించేవాడివే. ఒళ్లు వంచి కాయాకష్టం చేసినవాడివి. ఒక్కసారి నేలతల్లి నీ చేయి పట్టుకుంటే చాలు! ఎవరికీ లొంగకుండా ఉండగలవు. రేపు ఉదయం మా ఊరికి వచ్చి దుర్గమ్మగుడి వెనకున్న కురువ సంజీవ దగ్గరున్న రెండు ఎద్దులు తోలుకొని, అయిదారు సేర్లు జొన్నలు తీసుకొనిరా. ఆ తర్వాత జరిగేది చూద్దాం" అని అతడి ముఖం చూశాడు. భగన్య మాట్లాడే పరిస్థితిలో లేడు. అయినా "మరువద్దురా, నేను జీవితాన్ని చాలా చూసిన మనిషినయ్యా. నా మాట విను. నా పొలాలు చూడు, తేమగా ఉన్నాయి. రేపు పొద్దున నాగలికట్టి పొలం దున్ను" అని ముందుకు పోయాడు. భగన్య మనసులో పోరాటం జరిగింది. అతనికి మరోదారి కనిపించలేదు. ఉదయమే లేచి దొంబలూరు దారిపట్టాడు.

అతను వెళ్లేసరికి సర్వతప్ప చాయ్ తాగుతున్నాడు. "వచ్చేసావా? నువ్వు విచిత్రమైన మనిషివయ్యా. చీకటి వెలుతురు అన్నది చూడవు. ఉదయం జనం విశ్రాంతిగా పడుకునివుంటారు. నువ్వు చూస్తే దొంబలూరు చేరావు. చాయ్ తాగు" అని భార్యను పిలిచి చాయ్ తెమ్మన్నాడు. "చాయ్ వద్దు ధనీ. ఎద్దులు కావాలి" అన్నాడు. "వెళ్దాం లేవయ్యా, సంజీవ లేవద్దా? నువ్వేమో తొలికోడి కూయడానికి ముందే లేస్తావు. అలాగని జనమంతా లేవాలనే నియమం ఉందా?" అని అన్నాడు. చాయ్ తాగుతూనే ఎద్దులు ఎలా ఉండవచ్చని ఆలోచించాడు. ఎద్దులు పరుగెత్తగలవో, చురుగ్గా ఉన్నాయో, లేదా మొద్దుగా ఉన్నాయో? అలా ఉంటే ఎలా? అని తనలో ఆలోచించి "ధనీ, వాటికి ఎన్ని పండ్లు ఉన్నాయి?" అని అడిగాడు. "పదిహేను ఇరవై ఉండొచ్చు" అన్నాడు సర్వతప్ప. ఆ మాటలు విని భగన్య బిగ్గరగా నవ్వాడు. "అవేమైనా మనుషులా ధనీ, పదహైదు, ఇరవై ఉండేదానికి. అలా ఉంటే గడ్డివామును ఒక్క దెబ్బకు ముగించేవి. నాలుగు లేదా లేదా ఆరు ఉండాలి" అని మళ్లీ నవ్వాడు. "అవున్రా భగన్యా, ఈ సంగతి నాకు తెలియదు. నువ్వు చెప్పడం మంచిదైంది. జనం ముందు చెప్పివుంటే నవ్వులపాలయ్యేవాడిని. అది తప్పింది" అని తనకు

తెలియని విషయాన్ని సర్వతప్ప నవ్వుతూ అంగీకరించాడు.

పశువులను ఇంటికి తీసుకుని వస్తుండగా ఇంట్లో ఒక సంచలనం ప్రారంభమైంది. వ్యవసాయం చేయడానికి జోడెద్దుల అవసరం ఉంది. ఎవరి దగ్గర రెండుఎద్దులు ఉంటాయో వాడు బండిని అద్దెకు తిప్పుతూ, పొలాలు దున్ని వ్యవసాయం చేస్తూ నాలుగు కాసుల సంపాదించి హాయిగా జీవించగలడు. ఎద్దులు లేక భగన్యనాయక్ సతమతమయ్యాడు. తన పిల్లల భవిష్యత్తు చీకటిగా కనిపించేది. అయితే సర్వతప్ప సహాయంతో అతని సమస్య దూరమైంది. అత్యంత ముఖ్యమైన వ్యవసాయ పనిముట్లు నాగలి, గుంటక , జంతి, గొర్రు–మొదలైన వాటి అవసరం లేదా? ఎవరిని అడగాలి అనే ఆలోచనలో పడ్డాడు. ఎందుకంటే అతనికి ఎవరిని అడిగే అలవాటు లేదు. అన్నిటినీ సృష్టించుకునే అలాంటివాడికే ఈ పరిస్థితి వచ్చింది. అన్నిటి గమనిస్తూ గుడిసె ముందు కూర్చున్నాడు. ఎప్పటిలా దిన్నిసాయిబు, ఉప్పార హులువప్ప అతని గుడిసె ముందు నుంచి వెళుతున్నారు. గుడిసె ముందు రెండు ఎద్దులు కట్టేసి వుండటం గమనించి. “క్యా భగన్యా, ఎద్దును తీసుకొని వచ్చావు ఎంతకు కొన్నావు?” అని అడిగాడు. “లేదు సాయిబు కాకా, సర్వతప్పభట్టు ధనీ పశువులు. ఆయన పసువుల మందలో ఉన్నాయి. ధని పెద్దమనసు చేసి, “ఎందుకు బాధపడుతున్నావురా, నా మందలోంచి తోలుకొనిపో అన్నారు” ఆంటూ భగన్య ఆ రెండు ఎద్దుల ఒళ్ళు నిమిరాడు. వాటికి హాయిగా అనిపించి అతని చేతులను, ఒంటిని, తలమీది జుట్టును నాకసాగాయి. అతను వాటి శరీరమంతా చేతితో తడిమి, గడ్డి నోటికి అందించి లోపలికి వెళ్లబోయాడు. “పోన్లేరా భగన్యా, నీ అదృష్టం బాగుంది. సర్వతప్ప నీకు అండగా నిలబడ్డాడు. అంటే నీ కష్టాలు తీరినట్టే. బ్రాహ్మణులు తొందరగా ఎవరినీ నమ్మరు. ఒకసారి నమ్మితే వదలరు” అని హులువప్ప అన్నాడు. “ఇలా ఎందుకు మాట్లాడతావ్? భగన్యను తక్కువగా అనుకోవద్దు. నేలను తవ్వి నీళ్లు తీసేటటువంటి భట్టుగారు ఇతని పనితీరు చూసి ఎద్దులు ఇచ్చివుంటారు” అని నచ్చజెప్పుతున్నట్టు అన్నాడు. అయినా హులువప్పకు సంతృప్తి కలగలేదు. తన ఇంట్లో సంపాదన తగ్గుతూ వుండటం, పూర్తిగా దివాలా తీసే పరిస్థితిలో ఉండటం; అదే సమయంలో భగన్య నాయక్ ఎదుగుదల ప్రారంభమవుతుండటం ఆయన జీర్ణించుకోలేకపోయాడు.

భగన్య నాయక్ పెద్దకొడుకు టాంక్యా పాఠశాలలో ఎటువంటి అభివృద్ధి చూపకపోవడంతో, వాడిని చదువు మానిపించి వ్యవసాయానికి పెట్టాడు. వాడు పశువులను జాగ్రత్తగా మేపుకుని వచ్చేవాడు. వాటిని పట్టుకొని చేత్తో ప్రేమగా గడ్డి

తినిపించేవాడు. దాంతో అవి బాగా ఒళ్లుపట్టి దున్నపోతుల్లా పెరిగాయి. ముందరి దీపావళి బలిపాడ్యమి రోజున వాటికి– 'కసి' (బీజాలను పగులగొట్టే కార్యం) చేయించాలని భగన్య అనుకున్నాడు. హుసేనిని పిలిపించి 'కసి' చేయించాలని ఆలోచించాడు. మోమ్మీగేరికి వెళ్లిన భగన్యనాయక్ అక్కడ కనిపించిన హుసేనికి గుడగ అంగడిలో చాయ్ తాగించి "ఈ అమావాస్యకు మా కోడెలకు 'కసి' చేయాలి హుసేనన్నా. ఇప్పుడు చాలా కష్టపడి కోడెలను తెచ్చుకున్నాను. ఇక తొందరలోనే వ్యవసాయం చేయాలని అనుకుంటున్నాను. లేకపోతే ముందు రోజుల్లో చాలా కష్టమవుతుంది" అని అంటుండగా, "అరే భయ్యా, మేముండగా నువ్వు ఎందుకు చింతచేస్తావ్. పొద్దున్నే లేచి పశువులను బాగా కడుక్కుని రా. నేను చేసేస్తాను" అని హుసేని మాట ఇచ్చాడు. భగన్య నాయక్ మనసును ఎంత తొందరగా ఎద్దులను నాగలికి కట్టుకుని తన భూమిని దున్నుతానా అనే కలవరం ఆక్రమించుకుంది.

అమావాస్య రోజున కోడి కూయడానికి ముందే లేచి వస్తువులను బయట పెట్టి, కసువు చిమ్మి, మూలలో కుప్పచేసి, ఎద్దులను చెరువుకు తోలుకొని పోయి వాటి ఒళ్ళు కడిగి, తీసుకుని వచ్చాడు. ఆముదపు నూనెలో పసుపు కలిపి పెట్టిన గిన్నెను తీసుకొని ఎవరైనా ముందుగానే వస్తారేమోనని దుర్గమ్మ గుడి దగ్గరున్న పెద్ద వేపచెట్టు దగ్గరికి పశువులను తోలుకుని పోయాడు. తనే ముందుగా వచ్చాడు. ఇంకా ఎవరూ తమ పశువులను తీసుకుని రాలేదు. అక్కడ ఇతర కోడెలుకానీ, ఎద్దులుకానీ కనిపించలేదు. హుసేని కూడా కనిపించలేదు. అక్కడే నేలమీదికి లేచిన వేపచెట్టు బలమైన వేర్లకు ఎద్దులను కట్టాడు. అక్కడ లేతజంతువును కోసి దాని రక్తాన్ని పాత్రలో పట్టివుంచారు. అది చూసి భగన్య అందులో చిటికెన వేలు అద్దాడు. హుసేని సాబ్ వచ్చివుండవచ్చని గారకట్ట దగ్గరికి వచ్చాడు. అప్పుడే అక్కడికి వచ్చిన హుసేని "బాయీ భగన్యా, పసుపు, నూనె కలిపిన గిన్నె తీసుకొని రావాలి కదా?" అన్నాడు. "ఏమి హుసేని బాయ్, నా దగ్గర ఎక్కడి నుంచి వస్తుంది? ఇప్పుడు నేను మళ్లీ అన్ని మొదలు పెట్టాలి" అని అన్నాడు భగన్య నాయక్. "సరేలే భగన్యా, ఇప్పుడు ఎవరివైనా ఎద్దులు వస్తాయి. వాటితోపాటు కూర్గి గిన్నె వస్తుంది. అప్పుడు ముందు నీ ఎద్దులకే చేస్తాను" అని చెప్పి ఓదార్చాడు.

పిల్లలను ముద్దు చేస్తున్నట్టు కోడెలను ముద్దుగా చూసేవాడు భగన్యనాయక్. రోజూ సాయంత్రం మేపుకుని వచ్చిన తర్వాత చక్కగా వాటి ఒళ్ళురుద్ది, పత్తి గింజలు, నూకలు కలిపిన కుడితి పెట్టేవాడు. ఆ సంవత్సరం చివరి వరకూ మాఘమాసం

ముగిసేవరకూ పచ్చిగడ్డి మేపి, తర్వాత దాన్ని వదిలించి, ఎండుగడ్డికి వదిలినప్పుడు రెండు కోడెళ్లు ఒళ్ళు చేసి దున్నపోతుల్లా కనిపించసాగాయి. ఒకసారి భగన్య రెండో కొడుకు బదియా స్కూల్ నుంచి వస్తున్నాడు. సెలవులు ఉన్నాయని టాంక్యను ఎవరి పొలంలోనో కూలికి పంపి, ఎద్దులను మేపటానికి బదియా భుక్యాను పంపాడు. ఎద్దులను తన పొలం గట్టు వెంబడి మేపుకుంటూ పోతున్న అతని వయసువారైన చందియా, యంక అనేవారు కూడా తమ పొలం గట్టు వెంబడి ఎద్దులను మేపడానికి బయలుదేరారు. మౌనంగా తమ పని తాము చేసుకోవటం వదిలి "ఏమిరా బదియా, ఎక్కడికో బయలుదేరినట్టున్నావ్?" అని అడిగాడు. అసలే బదియాకు ముక్కుమీద కోపం. అయినా ఆపుకొని "ఎద్దులను మేపటానికి పొలం వైపు బయల్దేరాను" అన్నాడు. "ఈ ఎద్దులు మీవేనా? అయితే పనికిరావు. అదే చందియా కోడెల్ని చూడు, కోడెలంటే అవి. వాటి మీద చేయి వేస్తే చాలు, ఛెంగుమని ఎగురుతాయి" అని అన్నాడు. బదియా కూడా, "రేయ్ నా ఎద్దులు కూడా ఎగురుతాయి" అని వాటి ఒంటిమీద చేయివేసి 'టింగ్' అన్నాడు. అవి నాలుగు కాళ్ళు పైకెత్తి ఎగిరాయి. వాళ్లంతా కలిసి ఎద్దులను తోలుకుంటూ వచ్చారు. "ఏమిరా బదియా, బోడివెధవ, నీ కోడెలు గొప్ప కోడెలు అన్నట్లు మాట్లాడుతున్నావు కదా?" అని ఇలా ఏమేమో మాట్లాడుతూ రెచ్చగొట్టడానికి చూశాడు. అయితే పొట్లాడే మనసులేక బదియా మౌనంగా తన పొలం గట్టు వెంబడి నడవసాగాడు. అయినా వదలకుండా చందియా "రేయ్ నువ్వు మగాడివైతే మా ఎద్దుతోపాటు ఎగరడానికి వదలరా. అప్పుడు చూద్దాం ఎవరి దమ్ము ఎంత ఉందో?" అని నేరుగా జగడానికి ఆహ్వానించాడు. అయినా బదియా ఊరకున్నాడు. ఇద్దరు ఎద్దులను చెట్టుకు కట్టి, "ఏమలే, మేము చెప్పేది నీకు వినిపించదా?" అని మెడపట్టి లాగాడు. యంక ఊరుకోకుండా బదియా తలమీద కొట్టాడు. బదియాకు కోపం తలకకెక్కింది. "ఎందుకు రా, నీ అమ్మ, లంజా కొడకా" అని ఎద్దులను వదిలి, వాళ్ళిద్దర్నీ నేలమీద పడేసి గొంతు పట్టుకున్నాడు. "అమ్మా చచ్చాను, ఇంకొకసారి నీ తంటాకు రాను వదల్రా" అని బ్రతిమిలాడారు. బదియా వదిలాడు. చేయి వదలగానే, వాడి ఎద్దులు, వాళ్ళు కట్టిన ఎద్దుల దగ్గరికి వెళ్లాయి. నల్లఎద్దు బదియా ఎద్దుల వైపు ఓరకంట చూసి 'సూర్...సూర్...' మనసాగాయి. చూస్తూ చూస్తూ ఉండగానే రెండు ఎద్దులు పోట్లాటకు సిద్ధమయ్యాయి. నల్లఎద్దు రోషంతో ఒక్కసారిగా దూకడంతో బదియా ఎద్దు నేల కరిచింది. దాని దెబ్బకు గట్టిగా 'అంబా' అని ఆర్తనాదం చేసింది. నల్లఎద్దు పగ్గాలు తెంచుకుని పరుగుతీసింది. దాని పక్కటెముక బదియా ఎద్దుకు తగిలి ఒక

అంగుళం చర్మం లేచింది. రక్తం కారసాగింది. బోరున ఏడుస్తూ పరిగెత్తాడు. పగ్గం తెంచుకొని ఇంటి వైపు పరుగు తీసిన నల్లఎద్దును చందియా వెంటపడి పట్టుకొని వచ్చాడు. గాయం నుంచి రక్తం కారుతోంది. "ఏమి చేద్దాం రా, మా నాన్న చూస్తే చర్మం వలుస్తాడు" అని ఏడవసాగాడు. 'ఒరేయ్ ఒక పని చేద్దాం, వుండు' అని ముందుగా నేలమీది మట్టిని తీసి గాయం మీద రుద్దాడు. తరువాత అక్కడే ఉన్న పేడ తీసి పూశాడు. చర్మానికి సర్దుకున్న పేడ రక్తాన్ని కారడం ఆపింది. ఇద్దరు సంతృప్తి చెంది బదియా వెళ్లిన దిక్కుకు వ్యతిరేకంగా ఎద్దులను తోలుకుంటూ పోయారు.

ఈ విషయం ఇంటివాళ్లకు తెలిసింది. భగన్యనాయక్ చెవికి ఎవరి ద్వారానో ఆ విషయం చేరింది. తండ్రి మూతిముఖం పగులగొడతాడని అనుకున్నాడు బదియా. అయితే అలా జరగలేదు. గాయం సాయంత్రానికి పాతదైనట్టు అనిపించింది. ఎద్దు ఎగరటం గురించి ఎవరు ఎవరికీ చెప్పలేదు. విషయం లోలోపలే అణగిపోయింది. బదియానాయక్ పాఠశాలకు వెళ్లసాగాడు. ఏదో విధంగా పాఠశాలలో పాస్ అవుతూ వచ్చాడు.

ముందొక రోజున టాంక్య కొత్త ఉత్సాహంతో సర్వతప్ప పొలంలో నాగలి పట్టి ఏదేదో చేసి తండ్రి చేతిలో బాగా దెబ్బలు తిన్నాడు. మరుసటి రోజు తండ్రి చూపించినట్టు నీటుగా పొలం దున్ని వచ్చాడు. పేడ తీసి దిబ్బలో వేశాడు. తొలకరి వచ్చి చెరువు నిండడంతో నాట్లు వేయడానికి భూమిని సిద్ధం చేశాడు. తొలకరి వాన అడ్డదిడ్డంగా కురవడంతో చెరువులో నీళ్లు పొంగి పొర్లాయి. మూడవ రోజున మడులు చేసి, మొలకలు రావడానికి తండ్రీ కొడుకులు వడ్లు చల్లారు. ఊరి ముందరి పొలాలలో సగం వేరుశెనగ, సగం జొన్నలు వేశారు. ఇరవై ఒక్క రోజులకు సరిగ్గా వడ్ల మడిలో మొలకలు వచ్చాయి, మడిని చక్కగా తొక్కి విత్తనాలు చల్లారు. రెండు మూడు రోజుల్లోనే మడి అంతటా వడ్ల మొలకలు నిండిపోయాయి. పొలంలో జొన్నలు విస్తారంగా పెరిగాయి. తండా జనం ఇది చూసి భరించలేకపోయారు. తండాలోని దురుగవ్వ, సేవాభాయ్, పూజారి, విసళవత్ బరమ, తిప్పేసీ నాయక్, పైవీధి చాప్ల దబర, చకచంద్ర, కిందివీధి జాంబు, చిప్ప హనుమ, పాడ్నోబోత, ఇలా కనిపించిన వారందరు భగన్యనాయక్ గురించి మాట్లాడసాగారు. ఉప్పరులు, లంబాడీలు, బారికవాళ్లను అడిగారు. "వ్యవసాయంచేస్తే వాడిలాగా చేయాలి పంట పండిస్తే వాడిలా పండించాలి" అని చంద్రప్ప మనసులో నుంచి మాటలు వచ్చాయి. కట్టకింద చక్రం తయారు చేస్తున్న ఈరభద్రాచారి ఎదుట చెప్పసాగాడు. దూరంలో

మరొక మడకను చెక్కుతున్న మౌనాచారి మెల్లగా లేచి "రేయ్ చంద్రప్ప, వాడు దెయ్యంరా, వానెబ్బ, లంజా కొడుకు ఏ నక్షత్రంలో పుట్టినాడప్పా. ఎప్పుడైనా చూడు 'పనీ... పనీ...' అంటుంటాడు. అది తప్ప జీవితంలో వేరే ఏమీ లేదా?" అన్నాడు.

ఒక గడియ పాటు అక్కడ కూర్చున్న వారికి నోట మాట రాలేదు.

వరికంకులు విరగకాశాయి. గడ్డికి పోయేవాళ్లు, పొలాలకు నీళ్లు వదలడానికి పోయేవాళ్లు, నిలబడి విరగకాసిన కంకులను కళ్ళారా చూసి ముందుకు పోయేవారు. హయ్యర్ ట్వంటి నాలుగు ఎకరాలు, జయ చిన్నవి ఎరువులు వేయటం వల్ల ఒక ఎకరం పొలంలో పుష్కళంగా పంట పండింది. సర్వతప్ప తన పొలాల వైపు ఒక్కసారి కూడా రాలేదు. వడ్లు కోసి కళ్లం చేసి, తూర్పార బట్టించి, కుప్ప పోసి, ఒక్క గింజ కూడా వదలకుండా మూటలు కట్టి కళ్లంలోనే ఒకవైపున పేర్చసాగాడు. సర్వతప్ప ఏదో పంచాయతీకి వెళ్ళాడు. పని ముగించుకున్న తర్వాత కళ్లం చేస్తున్న చోటికి వచ్చాడు. అప్పుడు భగన్యనాయక్ చివరి మూటను ఎత్తి పెడుతున్నాడు. "ఎన్ని సంచులు అయ్యాయిరా భగన్య? నీ భాగం తీసుకొనిపో" అని అన్నాడు సర్వతప్ప. ఆయన రాక కోసమే ఎదురుచూస్తున్నా భగన్య నాయక్, "మూడువందల మూటలు అయ్యాయి ధనీ, అన్ని ఇక్కడే కట్టిపెట్టాను" అని చెప్పి, ఆయన జవాబు కోసం ఎదురుచూడకుండా వెళ్లి బండి ఎక్కాడు. "రేయ్ ఇంటి దగ్గరికి వెళ్లి బువ్వ తినిపో, అట్లాగే ఎద్దులకు కాస్త నీళ్లు, గడ్డి పెట్టరా" అని ఆయన కూడా ఇంటి వైపు బయలు దేరాడు.

బయట అంగణంలో పెట్టిన అండా నుంచి నీళ్లు తీసుకొని కాళ్ల మీద పోసుకుని లోపలికి ప్రవేశించగానే,"భగన్యా, అండాలో నీళ్లున్నాయి. కాళ్లు కడుక్కునిరా బువ్వతిందువు" ఇంట్లోకి వెళుతూ అన్నాడు సర్వతప్ప. అరుగు మీద ఒక మూలలో జపమాల పట్టుకుని కూర్చున్న ముసలిది "రామ రామ...రామ రామ...ఈ శూద్రుడు అండా ముట్టుకున్నాడు. కాలం పాడైపోయింది. రామ రామ" అని చెంపలు వాయించుకుంది. జానకమ్మ బయటికి రావడం చూసిన ముసలిది ఆ శూద్రుడిని బయటకు పంపమన్నట్టు సైగ చేసింది. అయితే జానికమ్మ మాత్రం అన్నం పండించిన దేవుడికి నైవేద్యం పెట్టకపోతే పూజించే రాతిదేవుడుకూడ మెచ్చుకోడని గాఢంగా నమ్మిన మనిషి.అందువల్ల ముసలిది చెబుతున్నది పట్టించుకోకుండా, "భగన్యా, మూడువందల మూటల వడ్లు వచ్చినాయంట. పంట బాగా పండిందిరా. ఇప్పటి వరకూ ఈ పొలంలో పండించిన పంటలో

మాకు ముప్పయి సంచులు ఎవ్వరు ఇవ్వలేదురా. కష్టపడితే భూమాత మోసం చేయదు" అని ఎన్నడూ చూడని భూమాతను ఆమె పొగిడింది. "అవునమ్మా, బాగా పండింది. ఇంటిల్లిపాది కళ్లలో కళ్లు పెట్టుకొని ఒళ్లు వంచి కష్టపడ్డాం" అని తమ కష్టాన్ని చెప్పుకున్నాడు. "అట్లా కష్టపడితేనే పంట చేతికి దొరుకుతుంది. భూమాత పాపిష్టిదికాదు. నమ్మినవాడికి అండగా నిలబడుతుంది"   అని అంటూ అన్నం, పులుసు, ఊరగాయ వడ్డించింది."బువ్వతింటూ ఉండు. నేను పాయసం తెస్తాను" అని లోపలికి పోయింది. తట్టనిండా పాయసం పోయించుకుని తాగే అలవాటు ఉన్న నాయక్‌కు వాళ్లు వడ్డించే పాయసం ఒక చెంచా కూడా సరిపోదని అనుకున్నాడు. ఒక లోటాలో పాయసం తెచ్చి ఇచ్చింది. ఇంకొంచెం ఇస్తే బావుండేదని అనుకున్నాడు. అతను భోజనం చేస్తూ ఉండటం అరుగు మీద నుంచి తొంగి చూస్తున్న ముసల్దానికి ఏమనిపించిందో, "ముండా కొడుకు, రాక్షసుడు ఎలా తింటున్నాడో చూడండి" అని గొణుక్కుంది. బిగ్గరగా చెప్పలేక గింజుకుంటున్న ముసలిదాన్ని చూసి భగన్యనాయక్ "ఏమవ్వా, బాగున్నావా?" అని ఎంగిలి చేత్తో కంచం పట్టుకుని పైకి లేచాడు."రామ రామ, ముందు చేయి కడుక్కో, ఆ తర్వాత మాట్లాడుదువురా ముండాకొడకా" అని శాపాలు పెట్టింది. తల బోడించుకున్న వితంతువు పెట్టే శాపం మంచిది కాదంటారు, ఎందుకొచ్చిన పీడ అనుకుంటూ జానకమ్మ పైనుంచి తగలకుండా పోసిన నీళ్లు తాగి, "చాలమ్మా, ధనీ పడుకున్నారేమో? నేను వెళ్ళినట్టు చెప్పండి" అని అక్కడి నుంచి కదిలాడు. చెట్టుకింద కూర్చోని గడ్డిని నెమరువేస్తున్న ఎద్దులను లేపి కాడిమాను కట్టి ఊరిదారి పట్టాడు.

సర్వతప్పా పండిన ధాన్యం గురించి ఏమీ ఇలా ఏమీ అడగలేదు. అయితే ఆయన పొలం కింద ఒక ముక్కాలు ఎకరా పొలాన్ని కురువ అర్జున చేస్తుండటం తెలుసుకున్న ఆయన, "ఏయ్ భగన్యనాయక్, మా పొలం కింద ముక్కాలు ఎకరా వరిమడిని కురువ అర్జున చేసుకుంటున్నాడట. అక్కడికి పోయి విచారించుకునిరా" అన్నారు. "అలాగే ధనీ" అన్నాడు భగన్య. అతను అక్కడి నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న తండాకు పోయాడు. తండా నుంచి ఉప్పర్ల, వడ్డెరలు, కురువల ఒకట్రెండు ఇళ్లు ఉన్నాయి. బ్రాహ్మణుల ఇండ్లు రెండు. లింగాయతులవి అంతే. భగన్యనాయక్ అంటే విశ్వాసమున్న మనిషని అందరికీ తెలుసు. దాంతో దారిలో కనిపించిన వారంతా ఏమి భగన్య, ఏమన్నా భగన్యా, ఏమప్పా భగ్యా, ఏమిరా భగన్యా అని రకరకాలుగా ప్రేమాభిమానాలతో పిలుస్తూ పలకరించారు. అందరికీ ఒకే కారణం చెప్పి కురువ అర్జున ఇంటికి వెళ్లాడు. అతని కంటే

చిన్నవాడైనప్పటికీ "అర్జునప్పా...అర్జునప్పా...అమ్మా అర్జునప్ప ఇంట్లో ఉన్నాడా?" అని గట్టిగానే అరిచాడు. "లేదప్పా, గూరప్ప అంగడి దగ్గర ఉన్నాడు చూడు" అని జవాబు వచ్చింది. "అట్లాగేనమ్మ, నేనే పోతాన్లే" అని ముందుకు నడిచాడు. "ఏమన్నా ఈ సమయంలో వచ్చావ్?" అని దారిలో కనిపించిన వసరప్ప అడిగాడు. "ఏమీ లేదు వసరా, అర్జునప్పతో ఏదో పనివుండి వచ్చాను" అన్నాడు. "ఇప్పటి వరకు ఇక్కడే ఉన్నాడప్పా. ఉండు, నువ్వు ఎందుకు పోతావు? అంగడి దూరంలో ఉంది. నేను పోయి పిల్చుకుని వస్తాను" అని చెప్పి బయలుదేరాడు వసరప్ప. వడ్డెర వసరప్ప గుడదహట్టి తండాలోని చాలామంది ఇండ్లకు గోడలు కట్టినవాడు. ఇంటిచుట్టూ గోడకట్టి, దాని మీద దూలాలు నిలిపి, దాని పైన తడికెలు పరిచి గడ్డి కప్పు వేసుకున్నాడు. ఏ సీమ నుంచో వాళ్ల నాన్న దొణ్ణె బోవి, అతని పెదనాన్న వచ్చి ఈ సీమలో స్థిరపడ్డారు. డొణ్ణెబోవికి ఐదుమంది పిల్లలు. వసరప్ప పెద్దవాడు. అతని తర్వాత హనుమ, కాక, కంపా. మిక్కీ, హిక్కిలు ఇద్దరమ్మాయిలు. కాలువ పక్కనున్న రాళ్లు లేపటం, రాళ్లు మోయటం, మట్టి మోయటం, గోడలు కట్టడం వీళ్ల బతుకుతెరువు. ఎవరినీ మోసం చేయలేదు. తారాతికిడీ వ్యవహారాలు నడపలేదు. తానేమో తన పనేమో అన్నట్టు ఉండేవాడు. ఒక్కోసారి వసరప్ప భార్య వేధింపులు భరించలేక తాగి పడుకుంటాడని జనం చెప్పేవాళ్లు. అతడి భార్య పిడవ్వ మాత్రం ఉదయమే గిన్నెలో ముద్ద, రోటి చట్నీ కలుపుకొని, "ఏమీ, యాడ వున్నావ్" అని వెతుక్కుంటూ వచ్చేది. భగన్యనాయక్‌కు సంకోచం కలిగింది. కురువ అర్జునను ఎలా అడగాలని అనుకున్నాడు. వసరప్ప తండాలో అందరికీ తెలిసినవాడు. ఇంటింటికి పోయి చాయ్ తాగి, బీడి కాల్చి ఎవరి ముందైనా నోరు తెరిచాడంటే తిడతాడేమోనని, జేబుమూలలో ఉన్న అణా తీసి, "ఇదిగోరా వసరా, సారాయి తాగు" అని ఇవ్వడానికి పోతే, "ఏయ్, ఏమి భగన్యా నువ్వు, మా ఇంటి దేవుడిమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నేను డబ్బు కోసం నీ వెంట రాలేదు. డబ్బు కావాల్సి వస్తే ములాజు లేకుండా ఒక అణా ఇవ్వప్పా, సారాయి తాగి వస్తాను" అని అడుగుతాను. అని భగన్య చెయి పట్టుకుని తన బాధనంతా చెప్పుకోబోయాడు. "ఉండనీలే, ఇప్పుడు నాకు సమయం లేదు" అని అతని చేతిని బలవంతంగా విడిపించుకుని అక్కడి నుంచి బయటపడ్డాడు.

కురువ అర్జున ఒక వక్క నోట్లో వేసుకొని, ఆకుకు సున్నం పూస్తూ, తన చిరుగుల, చారల చెడ్డీకి సున్నపు చేతిని తుడుచుకుంటూ నిలబడ్డాడు. "అర్జునప్ప"

అని భగన్యనాయక్ పిలిచాడు. "ఓ భగన్యా, కౌలు కోసం వచ్చావా? ఏమిటి సమాచారం?" అని అడిగాడు. "ఏమి లేదు నీతో కొంచెం పని ఉంది" అని అన్నాడు. "ఏమిటి నాతోనా" అని అనుమానంగానే అన్నాడు. "అవునయ్యా కొంచెం ఇటు రా" అని అక్కడ జనం ఉండటంతో అయ్యప్ప మేడ పక్కనున్న సందు వైపు నడిచాడు. అతను చేతిలోని ఆకులను అలాగే పట్టుకొని వచ్చాడు."ఏమి లేదు అర్జునన్నా, సర్వతప్పధనీ నీ పొలం అమ్మకానికి ఉందేమో తెలుసుకుని రమ్మని పంపారు. అందుకే ఇటువైపు వచ్చాను" అని అతని జవాబు కోసం అతని ముఖం చూశాడు. "అవును. పొలం అమ్మాలని అనుకున్నాను" అని గోడమీది పిల్లిలా నసిగాడు. మళ్ళీ ఏమనుకున్నాడో "ఒకవేళ పొలం అమ్మేటట్లయితే సర్వతప్పధనికి నేనే చెప్తాను" అన్నాడు. ఒక నిముషం ఆగి, "ఒక పనిచెయ్యి భగన్య, రేపో, మర్నాడో ఏ విషయం చెప్తాను. అప్పుడు నువ్వు వస్తే బాగుంటుంది" అని అర్జున అన్నాడు. "సరే! రేపు రమ్మంటావా? మర్నాడు రమ్మంటావా?" అని భగన్య అర్జున ముఖం చూశాడు. అతను ఏదో ఆలోచిస్తున్నట్టు నుదుటి మీద ముడుతలు స్పష్టంగా కనిపించాయి. 'ఎవరి సమస్యలు వారికుంటాయి. ఇతతుల సమస్యలు నాకెందుకు?' అని అనుకుంటున్నా భగన్యతో అర్జున "రేపు వద్దు, మర్నాడు సాయంత్రం రా" అని ఆకువక్కలునోట వేసుకొని నమలసాగాడు.

భగన్య, సర్వతప్ప తుములూరు శేషభట్ట, కురువ యంకేశి, గూరజ్జ, మేదర హనుమంత, చలువాది విఠప్ప, అర్జున ఇంట్లో వ్యవహారానికి కూర్చున్నారు. ఒక్కొక్కరుగా తమ శక్త్యానుసారం పొలం ధరను పెంచారు. ఎంత వరకు పెంచుతారో పెంచనీ అని సర్వతప్ప మౌనంగా ఉన్నాడు. చివరికి, "భగన్యనాయక్ తరఫున నాలుగు వందల డెబ్బయిఒక్క రూపాయలు. అర్జున నిజాయితీగా కష్టపడి పనిచేసేవాడు. పిల్లలు ఉన్నవాడు. అందుకే మిగతావాళ్ళ కంటే నాలుగు రూపాయలు ఎక్కువగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. మీరు మాట్లాడకుండా ఊఁ అనండి" అన్నాడు సర్వతప్ప. కురువ అర్జున భగన్యనాయక్ పేరు వినగానే, "అట్లాగే ధనీ, భగన్య నాయక్ కొంటానంటే నాకు అభ్యంతరం లేదు. అంతేకాకుండా మీరు కూడా వచ్చారు. వారం పదిహేను రోజుల్లో మీరు వచ్చి రిజిస్టర్ చేయించుకోండి" అని చెప్పి వచ్చిన జనానికి చాయ్ తాగించాడు. భగన్యనాయక్‌కు ఏమి జరుగుతుందో అర్థం కాలేదు.

కురువ అర్జునకు భగన్య పట్ల కృతజ్ఞత ఉండటానికి కారణం ఉంది. కొంతకాలం కిందట సర్వతప్ప పొలం నుంచే కురువ అర్జున, హోలిన పరమేష్, మేదర చౌడుగ,

చలువాది యంగటి నీళ్లు పారించుకునేవాళ్ళు. ఆ విషయంలో అర్జునకూ, హోలిన పరమేశికీ మధ్య గొడవ జరిగింది. "ఒరేయ్ నువ్వు ఒక్కడివే నీళ్లు పారించుకోవడానికి చెరువు ఏమైనా మీ తాత తవ్వించిందా?" అని జోరు చేశాడు. "అది అడగడానికి నీవెవర్రా?" పరమేశికి ముక్కు మీద కోపం."ఏమలే నీ అమ్మ..." అని పశువులను కొట్టే చెలకాలు తీసుకొని కొట్టబోయాడు. ఆ సమయంలో అక్కడే నిలుచున్న భగన్య గబుక్కున వచ్చి పరమేశి చేతిలోని చెలకలు లాక్కున్నాడు. ఆ విసురుకు చెలకాల దెబ్బ తలకు పడబోయింది నేలకు పడింది. పైగా పరమేశి తూలి నేలకరిచాడు. దాంతో మండిపడుతూ లేచి, "ఏయ్ లంబాడి, నీ అమ్మని..." అని అంటూ హోలిన పరమేశి భగన్యనాయక్ మీదికి పోయాడు. పొలంలో కాయకష్టం చేసి, పనిచేసి ఇనుప కడ్డీలా తయారైంది అతని శరీరం. ఎప్పుడైతే తల్లిని తిట్టాడో, "రేయ్, వెధవా, అర్జునను కొట్టి, ప్రాణం తీసి జైలుకు పోయేవాడివి. అది తప్పించడం నా తప్పా" అని వాడి కాళ్ళుచేతులు ఒక్క చోటికి చేర్చి, పైకెత్తి నాలుగుసార్లు నేలకేసి బాదాడు."అమ్మా చచ్చాను, అయ్యా చచ్చాను, ఎవరైనా విడిపించండి, చంపేస్తాడప్పో" అని పెడబొబ్బలు పెట్టాడు. అతడి నక్కబుద్ధి తెలిసినవారు, "బాగా బుద్ధిచెప్పాడు . దొంగ వెధవ, అరపావు పాలకు మూడు పావులు నీళ్లు కలిపి లీటరు లెక్కన అమ్ముతూ, జనాల్ని ఏమార్చి నాలుగు డబ్బులు సంపాదించి పొగరు చూపిస్తున్నాడు. ఈ లంబాడి భగన్యనాయక్ బాగా బుద్ధిచెప్పాడు" అని ఆంటూ తమ పాటికి తాము ఇళ్లకు వెళ్లిపోయారు.

సర్వతప్ప భగన్యనాయక్‌కు ఆశ్చర్యం కలిగించేలా చేశాడు. ఇదిగో నీవు వడ్లు పండించిన దానిలో 290 రూపాయలు నీ భాగానివి. పైన నేను వేసిన రూపాయలు నీకు అప్పుగా ఇచ్చానని అనుకో. వారం లోపల హగరూరికి పోయి నీ పేరుమీద పొలం రిజిస్టర్ చేయించుకో. పిల్లలు ఉన్నారు" అని ముఖం చూశారు. భగన్యనాయక్‌కు ఒక క్షణం నోట మాటలే రాలేదు. "అయ్యా, ఇంకా ఎద్దుల మీద అప్పు అలాగే ఉంది. దాన్ని తెంచుకొని లెక్క చేస్తే బాగుండేది" అన్నాడు. "ఎద్దుల అప్పు ఎక్కడికి పారిపోదు. ఇప్పుడు నీ ముందున్న సమస్యకు పరిష్కారం చూడు. మిగిలినది తర్వాత చూసుకుందాం" అని చెప్పి అతన్ని తండాకు పంపించారు.

తండా జనం భగన్య నాయక్ వరిమడి తీసుకున్నాడని విని ఈ విషయాన్ని జీర్ణం చేసుకోలేకపోయారు. వీధివీధులలో నిన్నామొన్న కళ్లు తెరిచినవాళ్లు ఆస్తి సంపాదించుకోవడం మొదలుపెట్టారని ఆశ్చర్యపడ్డారు. మరికొందరు మెచ్చుకున్నారు

కొంతకాలం గడిచింది.

భగన్యనాయక్ చూస్తూ చూస్తూ ఉండగానే పదెకరాలు కొనుక్కున్నాడు. పైగా దండూరు ఇలాకాలో రెండెకరాల పొలం పట్టుకున్నాడు. తండా ఇలాకాలోని పదహైదు ఎకరాల పొలం అమ్మకానికి వచ్చింది. ఉప్పార హులువప్ప కొడుకులు దిండా, డిల్లి, యమనూర కోటిలు, జోత పుర్లి నాలుగు డబ్బులు పోగుచేసుకొని తండాలో పేరు తెచ్చుకున్న భగన్యనాయక్ దగ్గరికి వచ్చారు. అతని ముత్తాత పేరుమీద ఉన్న ఆస్తిని అమ్మి వచ్చిన డబ్బుతో ఊరిలో వున్న తన స్థలంలో మేడ ఇల్లు కట్టడానికి ఏర్పాటు చేసుకున్నాడు. ఎప్పుడు పొలం అమ్మకానికి వచ్చిందో, ఇంటి విషయం పక్కన పెట్టి, వ్యాపారానికి కూర్చుందామని చెప్పాడు. సరే రేపు కూర్చుందామని వెళ్ళిపోయారు. ఈ విషయం తండాలో ఇంటింటికి వ్యాపించింది. దాంతో ఊళ్లోనివారు "ఏయ్, మా ఊరి ఆస్తి. ఆ నా కొడుకు ఎలా కొంటాడో చూస్తాం" అని తినడానికి కూడు లేనివాళ్లు కూడా ఏమేమో మాట్లాడసాగారు.

భగన్యనాయక్‌కు జనబలం ఉంది. అతని భాగానికి వచ్చింది మంచి భూమి. ఎనిమిది ఎకరాలు అడవి పొలం. మాగాణిలో వచ్చిన రెండెకరాలతో కలిపి మొత్తం ఇరవై రెండు ఎకరాల భూమి ఉంది. అయితే పంట మాత్రం అంతగా లేదు. ఆర్థికంగా బాగా ఎదగటానికి సాధ్యం కావడం లేదు. దానికి ముఖ్య కారణం ఇంటి నిండా పిల్లలు. పెళ్లి కావలసిన ఆడపిల్లలు. బడికి పోయిన పిల్లలకు పెద్దగా చదువు వంటబట్టలేదు. అయితే ఒక పొలంలో పంట రాకపోయినా, మరొక పొలంలో పంట వచ్చేది, ఆ కారణంగా జీవనం సాగించడానికి ధాన్యం గింజలు తక్కువగా ఉండలేదు. ఇంట్లో గింజలు దాచడానికి గాదెలు కట్టుకున్నాడు. తండాలో ఇంకా ఎవరూ ధాన్యం దాచుకోవడానికి నేలమాళిగలు, పాతరలు కట్టుకోలేదు. ఒకింత పెద్దవంశం అనబడేది తండాలోని పామడి నాయక్ విసళవత్‌దే. ఇద్దరుముగ్గురు సోదరుల పిల్లలు, మనవళ్లు కలిసివున్న పెద్దఉమ్మడి కుటుంబం. అయితే ఏమి జరిగిందో ఏమో ఉన్నట్టుండి సంసారాలు వేరయ్యాయి. ఉప్పార హులువప్ప తన పిల్లల మీద పట్టు సాధించలేక పోయాడు. అందరూ ఆరుగంటలకు లేచి పొలాలకు వెళితే వీళ్లకు పొలాలు దున్నటానికే రాకుండా తెల్లమెహం వేసేవారు. అది చూసి జనం వీళ్ళను ఎగతాళి చేసేవారు. పొలాల నుంచి ఆదాయం లేకుండా పోయింది. అదే సమయంలో భగన్యనాయక్ తన పదకొండుమంది పిల్లల్లో ముగ్గురు అమ్మాయిలు తండ్రిమాట మీరకుండా, తండ్రి గీచిన లక్ష్మణ రేఖను దాటకుండా కష్టపడేవారు. తమ పొలంలో పనిచేయడమే కాకుండా, కెంగూరువరకూ వెళ్లి కూలిపనిచేసి రెండుమూడు రూపాయలు సంపాదించేవారు. టాంక్య తర్వాత పుట్టిన

హామణి ఉన్నట్టుండి పదకొండు నిండి పన్నెండేళ్లకే ఋతుమతి అయింది. చావళికి ఒకవైపు సంతోషం, ఇంకొకవైపు దుఃఖం. పెళ్ళివయసు వచ్చిన ఆడపిల్లకు పెళ్లికాకపోతే ఎన్నో సమస్యలు. ఋతుమతి అయ్యి ఆరునెలలో, సంవత్సరమో ఆడపిల్ల ఇంట్లోనే కూర్చుంటె ఇక కథ ముగిసినట్టే. 'అయ్యో దేవుడా, ఋతుమతై సంవత్సరం గడిచినా సంబంధం కుదరలేదు. ఇలా అయితే ఎలా? ఇలాగే ముసలిదై పోతుందేమో?' అని జనం కుక్కనో, నక్కనో అడ్డం పెట్టుకుని ఏదో ఒకమాట అంటారు.

సంసారం పెద్దగా పెరుగుతుండగా సమస్యలు పెరగసాగాయి. గుడిసె తడికెలను ఆరడుగులు, మూడు అడుగులు పెంచుతూ పోయి ఇప్పుడు పెద్ద గుడిసె అయింది.

ఉదయం తొలికోడి కూసిన వెంటనే లేచి తమ తమ పనులు చేసుకోవాలి. కొమదరు గేదెలను మేపటానికి వెళ్లేవారు. కొమదరు కాళీ దుర్గమ్మ గుడి ముందు పశువులను మేపుతున్న స్థలంలో పశువుల పేడ తీసుకుని రావడానికి బుట్టపట్టుకొని బయలుదేరేవారు. రాగులు విసిరేవారు, పొయ్యిమీద అంబలి పెట్టేవారు, రాత్రి బూడిదను పొయ్యి నుంచి తీసి కట్టెలుపెట్టి పొయ్యి వెలిగించేవారు–ఇలా ఎవరి పనుల్లో వాళ్లు మునిగివుండేవారు. పొయ్యిలో కట్టెలు వెలగడానికి పావుగంట కావలసి వచ్చేది. పత్తికట్టెలు, చెట్టు బెరడు, ఎండిన పుల్లల మీద వంట జరగాలి. పండుగలకు మాత్రమే కట్టెపేళ్ళు.

టీ కావాలి. జొన్న దంట్లు పొయ్యిలో పెట్టి, ఊపిరిగొట్టంతో ఊది ఊది నిప్పు రగిల్చే సమయానికి వంటచేసే ఆడదానికి బుర్ర పాడైపోయేది. ఎందుకంటే మసక వెలుతురులోనే లేచి పేడకోసం వెళ్లినవారు, గేదెలను మేపడానికి వెళ్లినవారు తిరిగివచ్చేవారు. వచ్చినవారు కాళ్లుచేతులు, ముఖం కడుక్కొని నేరుగా మజ్జిగకుండ దగ్గరికి పోయేవారు. అందుకోసమే ఆడవాళ్ళు మజ్జిగ, చాయ్ తొందరగా చేసి పెట్టేవారు. మజ్జిగ అంబలి తాగినవారు చేతిలో కొడవలి, తాళ్లు పట్టుకొని గడ్డికోయటానికి వెళ్లేవారు. మరికొంతమంది కుడితి నీళ్లు పెట్టి, కొట్టంలోని పేడ తీసి, ఎద్దులను బయటకు వదిలి కొట్టంలోని కసువు చిమ్మేవారు.

భగన్యనాయక్ కుటుంబసభ్యులు ఒక పద్ధతికి కట్టుబడి, దాన్నే అనుసరించే వారు. పెద్దకూతురుకు పన్నెండేళ్లు వచ్చాయని సంతోషం కలిగింది. అప్పుడే భగన్య తాత అయ్యే కాలం సమీపించింది. వారి తండా తూర్పుకు పన్నెండు మైళ్ల దూరంలోని గుగ్రట్టి తండాలోని సేవఋనాయక్ కుమారుడు పికాళినాయక్‌కు అమ్మాయి అడగటానికి వచ్చారు. అబ్బాయి పర్వాలేదు. ఎలాంటి సమస్య లేదు. ఆపై

'దేవుడి దయ' అని దేవుడి మీద భారం వేసి చర్చలకు పిలిచారు. కూతురు పెళ్లి చేస్తున్నాడని ముసలి గూడ్లిబాయి ఆ పెళ్లిని తప్పించాలని ఆలోచించింది. చర్చమధ్యలో గూడ్లిబాయి లేచి, "లేదప్పా, నా మనవరాలు తండ్రి ఇంట్లో మహారాణిలా ఉంది. అక్కడికిపోయి తినడానికి కూడులేక చావాల్నా? లేదు. లేదు" అని ఏమేమో అసందర్భంగా మాట్లాడుతూ ఆ సంబంధాన్ని తెంచడానికి ప్రయత్నాలు చేసింది. పెళ్లి కొడుకువైపుగానీ, అమ్మాయివైపుగానీ ఎవరూ ఆమె మాటలను గంభీరంగా పరిగణించలేదు. ఆ సత్యాన్ని అర్థం చేసుకుని, "కాలం మారిపోయింది. ఏమి చేయగలం? ఆడమగ సిగ్గులేకుండా ప్రవర్తిస్తున్నారు" అని ఏమేమో వాగింది. అయితే వాస్తవం ఆమెకు తెలుసు. తన కొడుకు తప్పు చేసేవాడు కాదని ఆమెకు బాగా తెలుసు. ఆ ఆత్మవిశ్వాసం ఉంది. అందువల్ల కొడుకు ఇంట్లో పెళ్లి మాటలు జరిగేటప్పుడు ఇంక తాను నోరు మూసుకోవటం మంచిదని గ్రహించి మౌనంగా ఉండిపోయింది. అయినా అయ్యో సంబంధం కుదిరిపోయిందికదా అనే కలవరంలో తాను ఏమి చేస్తోందో మరిచిపోయింది.

ఒకవైపు పందిరి వేశారు. మరొకవైపున పులగం అండాలు. కూతురి పెళ్ళికి మొత్తం తండా జనానికి పులగం భోజనం పెట్టించాడు. ఎంతైనా ఖర్చుకానీ, ఇది మా ఇంట్లో జరుగుతున్న మొదటి శుభకార్యం అని భగన్యనాయక్ అనుకున్నాడు. చుట్టుపక్కలున్న నాలుగైదు పల్లెల నుంచి జనం వస్తారని పులగంలో నంచుకోవడానికి వంకాయ కూర చేయించాడు. అన్నం, చారు కూడా చేయించాడు. అంతేకాకుండా పేదవాళ్లు, గొప్పవాళ్ళు అనే భేదభావం లేకుండా అందరూ వచ్చి భోజనం చేసి ఆశీర్వదించి వెళ్లిపోయారు. సాయిబులు, ఉప్పారులు. లింగాయతులు. పేదలు, బ్రాహ్మణులు. కుమ్మరులు, చెలువాదులు, మాదిగలు, కమ్మరులు, కంసలులు, వడ్రంగులు ఇలా అన్ని రకాల కులస్థులు అన్నదమ్ముల మాదిరి వచ్చి కలిశారు. భగన్య పట్ల ప్రజలకున్న ప్రేమను చూసి సర్వతప్ప నివ్వెరపోయాడు. ఆయన ఎన్నో పంచాయతీలు చేశారు. అనేక సంబంధాలను జోడించారు. అయినా తన ప్రపంచం చిన్నది. భగన్య కూడా అలాంటివాడే. అతని మనసు ఎన్నడు గర్వంతో పొంగిపోలేదు. చిన్న పిల్లలనూ తిట్టినవాడుకాదు. బసవన్నగారు చెప్పినట్టు 'ఇతనెవరో అనిపించక, ఇతను మనవాడని అనిపిస్తాడు' అనేలా బతికి, దానిని నమ్మి ఆచరించేవాడు ఇతను. స్వయంగా సర్వతప్పనే ఆలోచనలో పడ్డాడు.

పెళ్లి ముగిసి ఊరేగింపుకు పోయినవారు తిరిగి వచ్చారు. మనుమరాలి ఇంట్లో ఉండటం గూడ్లిబాయికి అనివార్యమైంది. పుట్టింటికి పంపించే వరకూ 15–

20 రోజులు గు(గ్రట్టి తండాలో ఉండవలసిన అనివార్యత. అయితే ఆమె చిన్న కొడుకు ఫక్కీర కోళ్లు ఏమైనాయో, గొర్రెలు, గేదెలు, దూడల చింతే ఎక్కువైంది. ఏదో గు(గ్రటిలో ఒకటి రెండు వారాలు విశ్రాంతిగా ఉందామనే మనస్థితి ఆమెది కాదు. అల్లుడు పికాళి ప్రతిరోజు సాయంత్రం తాగటానికి కుండ నిండా సారాయి, నంచుకోవడానికి ఎండిన చేపలు, అది కూడా ఉప్పు వేసి ఎండబెట్టినవి, దాన్ని ముక్కలుచేసి మసాలాపూసి ఇచ్చేవాడు. గొర్రెను కోస్తే ఒక భాగం తెచ్చేవాడు. ఎండ్రకాయలను పట్టుకొచ్చి కాల్చి మిరపకాయలు వేసి చిదిమి చట్నీ చేసి ఇచ్చేవాడు, ఇంటివాళ్ళు అంబలి తింటే, ముసలిదానికి వేడివేడిగా వడ్డించేవారు. అయినా ఆమెకు తృప్తి లేదు. ఎవరిని పడితే వారిని సూటిగా నోటికి ఎలా వస్తే అలా మాట్లాడేది. పోనీలే ముసలిదని జనం మౌనంగా ఉండిపోయేవారు.

ఇరవై రోజుల కోసం పుట్టింటికి వచ్చినవారిని వారంలోనే పంపటానికి వియ్యంకులను ముసలి సతాయించింది. ఆ ముసలి సంసారంలో ఏదైనా సమస్యలు కలిగిస్తుందని చిమ్లిబాయిని, ఆమె తల్లి గూడ్లిబాయిని తిరిగి తండాకు పంపారు. ఇల్లు వదిలి పదిరోజులు ఇలా ఉండటం ఇదే మొదటిసారి. ఫక్కీర ఇద్దరు భార్యలు పనికి పోయారు. తొమ్మిదేళ్ల పెద్ద కూతురు గంగి తాత పంపానాయక్ బాధ్యత, ఇంటి బాధ్యతలన్నీ తీసుకుంది. అప్పటికే ఫక్కీరకు ఒక భార్యవల్ల తొమ్మిది మంది ఆడపిల్లలు పుట్టారు. గూడ్లిబాయి తన కొడుకుకు తప్పనిసరిగా మగపిల్లవాడు కావాలనే కోరిక, దురాశకు గురైంది. తన పెద్ద కొడుకు భగన్యనాయక్‌కన్నా చిన్నకొడుకు ఎందులోనూ తక్కువ కాకూడదనే మొండిపట్టు పట్టింది. ఫక్కీర మంచి మాటలతోనే చెప్పాడు, “అమ్మా, మగపిల్లవాడు, మగపిల్లవాడని ఎందుకు మొత్తుకుంటున్నావు? ఉన్న ఆడపిల్లల్నే మగపిల్లలు అనుకో. అయినా తప్పకుండా కావాలనుకుంటే అన్న పిల్లలు ఉన్నారు కదా” అని అన్నాడు. అతని మాటలు వినగానే, “ఎందుకురా మరొక ఆడదాన్ని కట్టుకునే తాకత్తు లేదా?” అని కొడుకుతో మాట్లాడుతున్నానన్నది మరచి అతని ఆత్మాభిమానానికి దెబ్బ కొట్టింది. దాంతో ఫక్కీర తండాలోని రంగోలిజుల్ఫా నాయక్ చెల్లెలు చంద్రిని పెళ్లి చేసుకుని వచ్చాడు. ఆమె కూడా పట్టుబట్టినట్లు ఆడపిల్లల్నే కన్నది. దాంతో గూడ్లిబాయి మనస్థితి పాడైపోయింది. తాను అనుకున్నదే సరైనదనే శుష్కవాదన ఒక కాలంలో ఎలాగో జరిగిపోయేది. అయితే అదే ఎల్లకాలం సత్యం అని అనుకోవడం అవివేకం. అయితే ఆ విషయం గూడ్లిబాయికి ఎలా అర్థమవుతుంది? తన మొండిపట్టుదల వల్ల ఓటమిపాలై మంచం పట్టింది. పెద్దకొడుకు అంటే నిప్పులు కక్కసాగింది. తల్లి జబ్బు పడిందని తెలిసి

మాట్లాడటానికి వెళ్ళిన భగన్యనాయక్‌ను నోటికి వచ్చినట్లు తిట్టింది. "పోరా భార్యకు సేవచేసే గులాం. నిన్ను నేను ఏమనుకొని సాకానో, దానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నావు. నువ్వు నా కొడుకువే కాదు. నా ముఖం నువ్వు చూడొద్దు" అని వాగసాగింది. భగన్యను మొదట్లో సర్వస్వంగా భావించిన తల్లి, జీవితాన్ని నేర్పిన తల్లి ఏమైనా అననీలే అని ఆమె మాటలను భగన్య పట్టించుకోలేదు. తలపాడు చేసుకోలేదు. అయితే ఆమె ఏదో అబద్ధాన్ని నమ్మకొని అసలైన నిజాన్ని మరుగుపరిచి నలిగిపోవటం అతనికి బాధ కలిగించింది. జనం మాటలు విని ఇలా మారిపోయిన తల్లిని ఎలా సంతృప్తిపరచాలో ఒక పెద్ద ప్రశ్నగా నిలిచింది.

భగన్యకు ఎంత ఆస్తి ఉందో దాదాపు ఫక్కీరకు అంతే ఆస్తి ఉంది. అయితే పోటీ ఉన్నది మగపిల్లలను పుట్టించడంలో. అందులో విఫలమైన ఫక్కీర పోటీ నుంచి చాలా దూరంగా ఉండిపోయారు. అందువల్ల అనివార్యంగా అతని ఇంట్లో దారిద్ర్యం ఆవరిస్తూ వచ్చింది. అయినా అతని కూతుళ్లందరూ కూలిచేసి, కుటుంబాన్ని సాకే శక్తి కలిగివున్నారు. అందువల్లనే ఎక్కువగా తల పాడు చేసుకోలేదు. ఫక్కీర ఈ అన్ని రకాల పరిస్థితులవల్ల, తల్లి ప్రభావం వల్ల ముంగోపి అయ్యాడు. అతను తల్లిదారిని పట్టుకొని ఎవరు ఏమన్నప్పటికీ తన వాదన సరైనదనే పొగరుబోతుతనానికి కట్టుబడ్డాడు. పీకలదాకా తాగి ఎక్కడబడితే అక్కడ పడిపోయేవాడు. ఉదయమే పొలం పనికిపోతే, ఎద్దులు సతాయిస్తే, అవి పడుకొని వుంటే వాటి కథ ముగిసినట్టే. ఒకసారి ఒక ఎద్దు ఎందుకో కూలబడింది. కోపంతో తోక విరిచాడు. దుడ్డుకర్రతో కొట్టాడు. లేవలేదు. ఫక్కీరకు ఎంత కోపం వచ్చిందంటే, ఆ మూగప్రాణిని కొట్టి కొట్టి చంపేశాడు. ఆ రోజు నుంచి జనం అతన్ని మూర్ఖుడని పిలువసాగారు.

ఫక్కీర్ నిష్ప్రయోజకుడు అయ్యాడు. భగన్య అభివృద్ధి చెందుతున్నటల్లా అతని తల్లి గూడ్లిబాయి భరించలేకపోయింది. జబ్బుతో మంచం పట్టినా, పడుకున్న మంచం మీదనే రాజకీయం చేయసాగింది. భగన్యనాయక్ ఉప్పార హులువప్ప పొలం కొనడానికి తిరుగుతుండటం తెలిసి మొదట్లో మౌనంగా ఉంది. అది చివరి దశకు వచ్చినపుడు ఏదో ఒకటి చేసి ఆ ప్రయత్నాన్ని భంగం చేయాలని వేచి చూస్తోంది. అయితే భగన్య ఎంత తెలివైనవాడో ఆమెకు బాగా తెలుసు. చిన్నవాడైనా ఫక్కీర తెలివైనవాడు కాదు. వ్యవహార జ్ఞానం లేనివాడు. ఏమైనప్పటికీ పెద్దవాడైన భగన్యది పాదరసం బుర్ర. ఏదో ఒకటి చేయాలని అనుకుంటే దాని అంతు చూసేవరకూ నిద్రపోయేవాడుకాదు. గూడ్లిబాయి పడుకున్న చోటే తన ఇద్దరు పిల్లల గురించి విశ్లేషించుకుంది. అమ్మాయిలలో మొదటిది ఆమె అన్నలా వుంటుంది.

రెండవది పెంపుడు జంతువులా ఉంటుంది. మొదటి దానికి, రెండవ దానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. పెద్దది తల్లి నీడలోనే పెరిగింది. అందువల్ల ఆమెకు తల్లి గుణాలే వచ్చాయి. గూడ్లిబాయి స్వయంగా తన రెండవ కూతురు చిమ్లిబాయిని చాలా కష్టపెట్టింది. అందుకే చిమ్లిబాయి ఎవరైనా రానీ, పెళ్లిచేసుకుని వెళ్లిపోయిన తర్వాత ఇక్కడ ఎవ్వరు చనిపోయినా సరే, ఈ ఇంటి వైపు అడుగుపెట్ట కూడదని నిర్ణయించుకునే వెళ్లిపోయింది. గూడ్లిబాయికి తాను చేసిన తప్పులకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. తాను చేసింది సరైనది కాదని తెలిసినప్పటికీ ఆమె బుద్ధి మారలేదు. పక్క మీదే అన్ని చేసుకోవటం మొదలు పెట్టింది. ఫక్కీరకు ఇంటి నిండా ఆడపిల్లలు ఉండటంతో అరక్షణంలో అన్నిటినీ కడిగి శుభ్రం చేసేవారు.

గూడ్లిబాయి చివరి ఘడియల్లో పెద్ద కొడుకును, చిన్న కూతురును చూడాలని పట్టుబట్టింది. ఫక్కీర అన్న దగ్గరికి పరిగెత్తాడు."అన్నా నిన్ను, చిమ్లిని చూడాలని పట్టుబడుతోంది. ఆమె చావుకు దగ్గరగా ఉన్నట్టుంది" అని ఏడుస్తున్నట్టు నటించాడు. భగన్యనాయక్ లేచి కొడుకు బదియానాయక్‌ను పిలిచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని చందాపూర్ తండాకు చెందిన జిలేబి నాయక్‌కు ఇచ్చి పెళ్లిచేసిన చెల్లెలు చిమ్లిని పిలుచుకొని రమ్మని పంపించాడు. తల్లి ఎంత వేధించినా, సోదరుడైన భగన్య మాత్రం ఎన్నడూ ఆమెను తక్కువగా చూడలేదు. ఆమెకు ఎమి తక్కువ చేయలేదు. తమ ఊరిలోనే ఇచ్చిన హామ్లి, ఆమె భర్త చిన్యా నిరంతరం భగన్య మీద పల్లునూరుతూనే ఉండేవారు. అతను పొలం కొనటం, తండాలో అందరికన్నా ఎక్కువ పంట పండించడం, అతని పిల్లలందరూ ఒకే ఇంట్లో నివసిస్తూ వుండటం– ఇలాంటి వాటిని భరించలేక విమర్శించేవారు. హామ్లికి పెళ్ళయి ఇరవై ఏళ్లు గడిచినా పిల్లాపీచూ లేదు. మొత్తం తండాకు తండానే ఆమె బుద్ధికి తగినట్టే దేవుడు చేశాడని అనుకునేవారు. అయితే చావళికానీ, ఆమె పిల్లలుకాని ఎన్నడూ ఎవరి గురించీ చెడుగా మాట్లాడే జోలికి వెళ్లేవారు కాదు. హామ్లి ఇంటికి ఎవరు వెళ్లక పోవటానికి కారణం ఆమె మూర్ఖమైన కోపాన్ని భరించలేకనే.

చిమ్లి, ఆమె భర్త జిలేబినాయక్ వచ్చేసరికి రాత్రి సరిగ్గా పదిగంటలు అయింది. గూడ్లిబాయి ఒక నిముషం కళ్లు తెరుస్తోంది. మళ్లీ మూసుకుంటోంది. ఆమె గుడిసె చుట్టూ చూస్తు తన చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోసాగింది. భగన్య తన గతాన్ని గుర్తుచేసుకొసాగాడు. భగన్య తన బాల్యం ఇదే తాండాలో గడిపాడు. తొలికాన్పులో పుట్టిన భగన్యకు మొదట్లో పోటీకి వచ్చేవారు ఎవరూ లేనందున గూడ్లిబాయి తన ప్రేమనంత భగన్యకు ధారపోసింది. భగు...భగు...అంటూ వాడి

వెనుకే తిరిగేది. అరక్షణంకూడా వదిలివుండేది కాదు. ఆమె కూలికిపోతే గూరవ్వ దగ్గర వదిలివెళ్లేది. పొద్దు వాలుతుండగా సరిగ్గా ఇంటికొచ్చి బిడ్డకు పాలు తాగించేది. తండ్రి పంపానాయక్ ఎప్పుడూ భగన్యను భుజాలమీద ఎత్తుకొని తిరుగుతుండేవాడు. అతనికి బుద్ధి వచ్చేంతవరకు తల్లి చేతిముద్దలు పెట్టేది. ఫక్కీర పుట్టిన తర్వాత రాను రాను ఆమె మనసు మారిపోయింది. అయినా సంపాదించేవాడు పెద్దకొడుకు భగన్య కావడం వల్ల అతన్ని దూరం పెట్టే ప్రయత్నం చేయలేదు. భగన్య పెళ్లి, తర్వాత పిల్లలు. అంత బాగుండేది. అందరూ సంతోషంగా ఉండేవారు.

అయితే ఉన్నట్టుండి ఫక్కీర్, చిమ్లిల పెళ్లి తర్వాత ఏమైందో ఏమో తనను బయటకు పంపి తనపై ద్వేషాన్ని కక్కసాగింది అని అనుకుంటే భగన్య మనస్సు బాధగా ముల్గింది.

'చేయని తప్పుకు చావళి మాత్రమేకాదు. నన్ను, నా పిల్లలను బద్ద శత్రువులుగా చూడసాగింది' ఆ మాటలు అనుకుంటున్నప్పుడు భగన్య కళ్లు చెమ్మగిల్లాయి. తల్లి శత్రువు అయినప్పటికీ మాతృప్రేమ పెద్ద ఖజానానే అనే భావన అతని ఎద లోపల అలాగే నిలిచిపోయింది.

తల్లి మంచం పట్టిన మీదట రెండు మూడు సార్లు భగన్య తల్లిని చూడటానికి వెళ్లాడు. అప్పుడు తల్లి పలకరించలేదు.

"యా యా ఎ యాడి" (అమ్మా...అమ్మా...ఎ అమ్మా) అని పిలిచిన పిలుపు చాలా దూరం ప్రయాణం చేసినట్టు ఉంది. బలవంతం మీద కళ్లు నెమ్మదిగా తెరుస్తోంది. ప్రయాణపు ఆయాసం అన్నట్టు కనిపించసాగింది. ఎక్కడో బ్రహ్మాండంలో కేక పెడుతున్నట్టు వినిపిస్తోంది. చిమ్లిని చూసి కళ్లు వెడల్పు చేసింది. ఇప్పుడు మాత్రం ఆమె కళ్లల్లో బాధ కనిపిస్తోంది. విషాదం ఉంది. తన పిల్లల పట్ల తానే వ్యత్యాసం చూపాననే అపరాధ భావన ఆమెను వేధిస్తోంది. మాట్లాడే ప్రయత్నం చేసింది. "నా పని అయిపోయింది. నేను నిన్ను పట్టించుకోలేదు బిడ్డ..." ఆమె మాటలు ఆగి ఆగి వచ్చాయి. భగన్య నాయక్ చేతిని ఫక్కీర చేతిలో పెట్టి, "నువ్వు ఏమి చేసినా వీళ్లకు..." అని చెప్పి చిమ్లి చేతినీ చేర్చింది. దూరంగా నుంచున్న జనం బోరుమని ఏడవసాగారు.

గుడ్లిబాయి చివరి ఊపిరి పీల్చింది.

మూలలో కూర్చున్న పంపానాయక్ చిన్నపిల్లవాడిలా ఏడవసాగాడు.

వయస్సు అన్నిటినీ నేర్పుతుంది. మౌనం, గంభీరం, ఓర్పు అన్నిటినీ. తండ్రి దుఃఖతప్తమైన మనసును అర్థం చేసుకున్న భగన్యనాయక్ అతను కూర్చున్న చోటికి

వెళ్లి బిగువుగా కౌగిలించుకుని ఇరవై ఏళ్లుగా తనలో గూడుకట్టుకున్న దుఃఖాన్ని వెళ్లగక్కాడు. ఏడుస్తూనే ఉన్నాడు. ఎవరి గురించి ఏమీ చెప్పకుండా అన్నిటినీ చూస్తున్నాడు. శవానికి స్నానం చేయించి, అలంకరించి, కాల్చడానికి పేర్చిన చితిమీద దేహాన్ని పెట్టి నిప్పుకు సమర్పించారు.

భగన్య నాయక్‌కు అందరికన్నా ఎక్కువగా దుఃఖం కలిగింది. బతుకును రూపొందించుకోవడం నేర్పించిన తల్లి. ముందు పెట్టిన అడుగును వెనక్కు పెట్టే ప్రశ్నే లేదు. ముందుకు పోతూనే ఉండాలి. ఇది కావాలి, ఇది వద్దు అనే ఎంపికలే లేవు. ఇలాంటి మాటలు నేర్పిన తల్లి ఉన్నట్టుండి చనిపోవడం నమ్మలేని సత్యమైంది. ఫక్కీర భార్యలు జ్యోతిబాయి, ఫమణిలు చాలా సంతోషపడ్డారు. పీడ వదిలిందని ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు. వారి పద్దెనిమిది మంది అమ్మాయిలకు నానమ్మ చచ్చిపోయిన దుఃఖం ఏమి లేదు. అయితే భగన్య పిల్లలకు మాత్రం చాలా దుఃఖం కలిగింది. చావళికూడా ఒక వారంవరకు ముసలిదాని మరణాన్ని మరవలేక పోయింది. భగన్య నెలలపాటు తల్లిని కలవరించాడు. ఆమె గయ్యాళి కావడం వల్లనే ఇతని అస్తిత్వం మిగిలివుంది. అత్యంత నికృష్టమైన మనసు కలిగిన ఫక్కీర ఇంట్లో ఉండడానికి మనసు అంగీకరించలేదు. బ్రతికి ఉన్నంతవరకూ మరొకరికి ఇబ్బంది కలగకుండా సాగటం మన కర్తవ్యం అని దృఢంగా నిర్ణయించుకున్నాడు. కష్టమో సుఖమో ఎది వచ్చినా బరించాలి అనుకున్నాడు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ తమ్ముడి ఇంటిముందు కుక్కలా పడివుండకూడదని నిర్ణయించుకున్నాడు. "నాన్నా, నా మనసుకు బాధ కలుగుతుంది. నువ్వు నా వెంట వచ్చి మా ఇంట్లో ఉండకూడదా?" అని తండ్రి పరిస్థితి గమనించి భగన్య అన్నాడు. "అయ్యో పర్వాలేదు నాయనా. ఇంకా ఎన్నిరోజులు బతుకుతాను? ఈ మాత్రానికి మీ ఇద్దరి మధ్య మనస్తాపం కలిగించడం ఎందుకు? ఇప్పుడు బాగున్నారు. అంతే చాలు" అతని మనసులో జరుగుతున్న పోరాటాన్ని అదిమిపెట్టి విషయాన్ని తేలికపరిచే ప్రయత్నం చేశాడు. 'నాన్నా, నీ భాగం పొలంకూడా వాడే ఉంచుకోనీ. వ్యవసాయం చేసుకుంటాడా చేసుకోనీ. లేదా ఏమైనా చేసుకోని. నువ్వు వచ్చి నాలుగు రోజులు సంతోషంగా వుండొచ్చుకదా!" అని భగన్య కపటం లేకుండా అన్నాడు. "నాయనా భగు, ఎక్కడ ప్రశాంతత నాయనా? అక్కడుంటే ఏమి? ఇక్కడుంటే ఏమి? చావు వెతుక్కుంటూ వచ్చేవరకు ఎదురు చూస్తాను. నన్ను ఒత్తిడి పెట్టకు" అని అన్నాడు. భగన్య తీవ్రమైన దుఃఖంతో తండ్రిని వదిలి ఇంటికి వచ్చాడు. పెద్దకొడుకుగా పుట్టినందుకు తనకు దక్కిన ఫలితం ఇదేనా? తల్లితండ్రుల సేవచేసుకునే అవకాశమే లేకపోయిందని

తనలో తాను నలిగిపోయాడు.

ముసలిది చనిపోయిన నెలలోనే ఫక్కీర తండ్రిని మూడుసార్లు కొట్టాడు. మధ్యలో మాట్లాడటానికి పోయిన భగన్యనూ ఇష్టం వచ్చినట్టు తిట్టి పంపాడు. భగన్యనాయక్ నిరుత్సాహంతో తండ్రి కోసం తమ్ముడు మాటలు పట్టించుకోకుండా మౌనంగా వుండిపోయాడు. తండ్రిని తన తమ్ముడు ఇష్టం వచ్చినట్లు తిట్టడం బదియా వింటే ఫక్కీరను చితకబాదాడనే భయం భగన్యది. నేను ఎంగిలి చేసిన చనుబాలు తాగి పెరిగినవాడు, పైగా కరమ్‌తోట్ వంశానికి చెందినవాడు. ఇప్పుడు మిగిలింది తామిద్దరే. అసలే తండాలో ఇతర జాతులకు చెందినవారు అభివృద్ధిని చూసి భరించలేక అడ్డుపడటానికి ప్రయత్నిస్తున్నప్పుడు అన్నదమ్ములైన తాము ఇలా పోట్లాడితే జనం దాన్ని దుర్వినియోగం చేస్తారని పెద్దమనసు చేసుకున్నాడు.

అయితే ఫక్కీర కేవలం ఒట్టిమాటలకు లొంగేలా కనిపించలేదు. భగన్యనాయక్‌ను వ్యతిరేకించేవారు గూడ్లిబాయి చనిపోయిన తర్వాత లేచి నిల్చున్నారు. ఆమె బతికి ఉన్నప్పుడు ఒక్క మగవాడు మీసాలు తిప్పి ఆమె ఎదుట వచ్చినవాడు లేడు. వచ్చినా ఆమె మాటలతోనే వాడి నోరు మూయించేది. ఆమె నోరు చూసి మొత్తం తండా జనమే భయపడి పక్కకు తప్పుకునేవారు. లేదా ఈమె జోలి ఎందుకని ఇళ్ళల్లో దూరి తలుపులు వేసుకునేవారు. ఇప్పుడు ఆమెలా మాట్లాడేవారు ఎవరూ లేరు.ఆ కుటుంబం పరంగా మాట్లాడేవారూ లేరని ఒక పెద్ద గుంపు భగన్యనాయక్‌ను దెబ్బకొట్టడానికి సిద్ధమవుతోంది. తండాలోని దురుగమ్మ గుడిపూజారి ఆ గుంపుకు నాయకుడు. మిగిలిన వాళ్లు శంక్రి, జేమ్లు, లసణూ, పైవీధి దళారి దురుగ్యా నాయక్, వెనక వీధి కాటెవాళ కుబేర నాయక్, పామగ నాయక్, సంగునాయక్‌లు. వీళ్లంతా ఒక్కచోట చేరి భగన్యను ఎలా దెబ్బకొట్టాలని కుట్ర చేయసాగారు.

"పదండ్రా, ఎప్పుడైతే గూడ్లిబాయి చచ్చిందో వాడి కథ ముగిసింది. వాడి తరఫున ఎవరు మాట్లాడుతారు? సాయిబులు మాట్లాడరు. ఉప్పారులు దగ్గరకు రారు. ఇకపైవీధి వడ్తా తెగవారు వీళ్లకి బంధువులు కాదు. వాళ్లు ఎందుకు వస్తారు? ఇక ఆ బాణోత్ కులస్థులు భగన్య అంటే పల్లునూరుతున్నారు. ఆ లంజా కొడుకులు కద్రా, చాప్లలు మన భివావత్‌లంటే ఉచ్చపోసుకుంటారు. మిగిలినది లింగాయతులు, మంగలి వాళ్లు, బారికోళ్లు, చాకలివాళ్లు, కురవలు. వీళ్లంతా తామేమో తమ బతుకులేమో అన్నట్లు ఉంటారు. ఇక వాడికి ముగుదారం వేసి ఆపేవాళ్లం మనమే" ఇలా ఒక ప్రణాళికను పూజారి తనశిష్యులకు, మిత్రులకు వివరించాడు.

గుడిపూజారి తాను అందరికీ న్యాయసమ్మతమైన పరిష్కారాలు

చూపించవలసిన వాడన్న స్పృహను ఆతను పోగొట్టుకున్నాడు. దళారి రంగన్యానాయక్ మాత్రం పూజారిని కొన్ని విషయాల్లో వ్యతిరేకించాడు. అయితే అతనికి ఒక సారా సీసా ఆశ చూపిస్తే అతను నోరు మూసుకునేవాడు. దాంతో అతను వాళ్లు చెప్పినదానికి తాళం వేసేవాడు. వాళ్లందరూ కలిసి రహస్యంగా సమావేశమై ఎలా భగన్య కుటుంబాన్ని నాశనం చేయాలి? ఎలా దెబ్బకొట్టాలి? అని రోజంతా తండాలోని జీవ్లి గుడిసెలో నాలుగు కోళ్లు కోసి, మాంసం వండించుకుని, ఒక కేస్ సారాయి తెప్పించి, అది చాలక జీవి తయారుచేసి పెట్టిన నాటు సారాను ఖాళీ చేశారు. ఆ సభకు నాయకత్వం పూజారి వహించాడు. అయితే భగన్య తమ్ముడు ఫక్కీరకు ఈ దుష్కార్యానికి నాయకుడి పట్టం కట్టారు. దళారి దరుగ్యా తాగిన మత్తులో ఫక్కీర కాళ్లు పట్టుకొని. "రేయ్ మామ, మీ అన్న భగన్య ఉన్నాడు కదా..." అని ఏమి మాట్లాడాలో తోచక ఊరకయ్యాడు. మధ్యలో పూజారి కలగజేసుకుని "మీ అన్న నగలు నాణ్యాలు దాచుకున్నాడు. నిన్ను బికారి చేసి తాను మజా చేస్తున్నాడు. మీరు వేరుపడటానికి ముందే మీకు తెలియకుండా సొమ్మంతా తీసుకొని పోయాడు. పాపం మీ తల్లితండ్రులు అమాయకులు. అతను సమయం చూసి వేరుగా పోయాడు" అని ఫక్కీర బుర్రలో విషబీజాలు నాటాడు. ఇప్పుడు అతని మనసులో మరి కొన్ని అనుమానాలు చోటు చేసుకున్నాయి. అదే సమయానికి జీవ్లి సారాయి సీసా ముందు పెట్టింది. ఎత్తి ఒక గుక్కలో ఖాళీ చేశాడు. తల దిమ్మెక్కింది. బుర్ర మొద్దుబారింది. ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో అనే స్పృహే లేకుండా పోయింది. పూజారి తాగి అక్కడి నేలమీద ఒరిగిపోయాడు. అతని సహచరులు అంతా మూలన పడుకున్నారు. జీవ్లి ఒక క్వార్టర్ తాగి మాంసం ముక్కలను నంచుకుని, కడుపు నిండా తిని, నోరు తుడుచుకుంది. ఈ పాడుతాగుబోతులు ఎప్పుడు లేచి వాళ్ల ఇళ్ళకు వెలతారోనని ఎదురు చూడసాగింది. 'ఈ పనికిమాలిన వెధవలు, ఇతరులు ఇప్పించే మందు మాంసం కనిపిస్తే చాలు నోళ్లు వెళ్లబెట్టుకుంటారు' అనుకుంది.

"గుడ్లు పెట్టే నాలుగు కోళ్లు కనిపించటం లేదు. రేపు తెల్లసవారనీ. ఆ తర్వాత ఉంది మజా. ఎవరి దిబ్బలో నా కోళ్ల ఈకలు దొరుకుతాయో ఆ నా కొడుకుని వదలను" అని శివమెత్తినట్టు చిమణి తిడుతూ ఉంది.

ఊరు పంచాయతీ కట్ట దగ్గర పూజారి అపరాధిలా నిలబడ్డాడు. ఫక్కీర, దళారి దురుగ్యా ఆరోజు నిషాలో కోడి మాంసం తిన్నారో లేదో ఇంట్లో కోడి కోసుకొని చారు చేసుకున్న విషయాన్ని పిచ్చిజింగు వెళ్లి చిమణికి చెప్పాడు. ఆ మాటలు వినగానే కోపంతో చిమణి చీర పైకిపట్టుకుని పరుగు తీసింది. జీవ్లి కోడి

కోసి వంట చేయడానికి ముందే "అక్కా, నాకు దాని కళ్లు, తల, కొన్ని ముక్కలు ఇచ్చెయ్. తింటాను" అన్నాడు. అయితే ఆ పిచ్చివాడు అందరి దగ్గరికి పోయి మేము ఇలా మాంసం తిన్నామని చెప్పాడట "ఏయ్ పోరా, దరిద్రుడా, మహా వచ్చాడు మాంసం అడగటానికి. పోరా మేమే తింటాం" అని కుక్కను కసిరినట్టు కసిరి తరిమిందట. దాంతో వాడి పిచ్చి ప్రకోపించి, "నీ అమ్మ, నీకు బుద్ధి చెప్తానుండు. ఈ కోళ్లను ఎవరు తీసుకొచ్చారు? కోళ్లదొంగ ఎవరు? అన్ని విషయాలు సాయంత్రం కోళ్లను వెతుకుతున్న వాళ్ల దగ్గరికిపోయి చెప్తాను" అని బెదిరించి బయటకు వచ్చాడు. "పోరా, పిచ్చి నా కొడకా. నీలాంటి వాళ్ళను చాలా మందిని చూశాను" అని జీవ్లి చేతిలోని కర్రతో నాలుగు దెబ్బలు వేసి తరిమింది. ఆరోజు సాయంత్రం చిమణి తన కోళ్లను ఎవరో దొంగిలించారన్నది నిర్ధారించుకుని వీధిలోకి వచ్చి తిట్టసాగింది. అది చాలా ఆలస్యంగా జింగు చెవిలో పడింది. సొట్టకాలు లాక్కుంటూ వెళ్లి జీవ్లి ఇంట్లో జరిగిన కుట్రను అక్షరం పొల్లుపోకుండా వివరించాడు. తండాలో జరుగుతున్న ఇలాంటి అవినీతి మీటింగులకు చేతికి దొరికిన కోళ్లను చౌకగా ఇస్తున్న ఇద్దరు గిరాకీలు ఉన్నారు. ఒకడు జమల నాయక్. గింజలు ఏరుకుంటున్న కోడిని అవలీలగా ఎత్తుకునిపోతాడు. ఇంకొకడు సంగ. కనిపించిన కోడిని రాయితో కొట్టి గాయపరిచి కిందపడిన కోడిని ఎత్తుకొనిపోయేవాడు. పూజారి, మరి కొంతమంది జీవ్లి ఇంట్లో మాంసం చేయించుకుని తిన్నారని జింగు చిమణికి చెప్పాడు. చిమణి వెంటనే జీవ్లి ఇంటికొచ్చింది. తన కోళ్ల ఈకలను అక్కడ పడ్డాయేమోనని వెతకసాగింది. "ఏయ్, నువ్వెవరే, నా ఇంటికొచ్చి చూడ్డానికి? నేనేమైనా దొంగ అనుకున్నావా… దరిద్రపు ముండా" అంది. భర్త చనిపోయి ఆరు సంవత్సరాలు అయ్యాయి. నిస్సారమైన జీవితం గడుపుతూ ఉండటంతో ఆమె గయ్యాళిగా మారింది. చిమణికి విషయం అర్థమైంది. "ఏమీ లేదక్క, గుడిసెలో ఈకలు పడి ఉండాలి కదా. ఒక్క ఇక పట్టుకొచ్చి నాకు చూపించు. ఏ దొంగ నాకొడుకు దొంగతనం చేశాడు. నేను ఊరుకోను. కష్టపడి కాకులకు గద్దలకు దొరకకుండా కాపలా కాసి, బుట్ట కింద మూసి సాకాను. ఎవడో మిండెగాళ్ళకు పుట్టిన కొడుకు ఎత్తుకొని వచ్చాడు?" అంటూ చిమిణి లోపలికి దూసుకుపోయింది. జీవ్లి ఆమెకు అడ్డుగా నిలబడి, "మా ఇంట్లో ఎలా దూరుతావే ముండా, దెయ్యంలా నేను ఇక్కడే నిలబడ్డాను. అడక్కుండా లోపలికి తోసుకొస్తావుకదా, నీకేమైనా మానమర్యాదలు ఉన్నాయా? ఈకలు లేవు, రెక్కలు లేవు. పద బయటికి" అని బలవంతంగా బయటికి తోసింది. "ఎందుకు, నువ్వు మహా పతివ్రతవి, మూసుకొని పక్కకు జరుగు" అని ఆమెను

మూలకు తోసి కోడిని చంపి, దాని ఈకల్ని ఒలిచిన స్థలంలో పడివున్న ఈకలను తీసుకొని చీరకొంగులో మూట కట్టుకొని బయటికి నడిచింది.

మత్తు దిగి మెలుకువ వచ్చిన పూజారి జరిగిందంతా విన్న తర్వాత మిగిలివున్న కాసింత మత్తు కూడా దిగిపోయింది. కోడి తినేటప్పుడు ఎందుకో వేరే దేన్నో తింటున్నట్టు అనిపించింది. అది ఇంత తీవ్రమైన పరిస్థితిని తెస్తుందని అనుకోలేదు. తాండా నాయక్, కారభారి ఒక్కొక్కరికి ఇరవై అయిదు రూపాయల చొప్పున దండన చెల్లించమని తీర్పు ఇచ్చారు. దళారి దురుగ్యా ఆ రోజే ఒక గేదె వ్యాపారం కుదర్చడంతో వచ్చిన ఏడు రూపాయల్లోంచి ఐదురూపాయలు చెల్లించి, "ఏయ్, పూజారీ, థూ ఏమి జన్మరా నీది?" అతని పాడుబుద్ధి గురించి తండా కు తెలిసివుండటంతో, అతని కారణంగా ఐదురూపాయలు దండన కట్టవలసి వచ్చిందికదా అని విసుగుతో. "తండా నాయక్, ఏదో తప్పు అయిపోయింది. క్షమించండి" అని పంచాయతీ కట్ట మెట్లు దిగాడు. మిగిలినవారు రాతి విగ్రహం నిల్చున్నారు. చేతిలో చిల్లిగవ్వ ఉంటే కదా మాట్లాడటానికి? "నాలుగు రోజులు సమయం ఇవ్వండి, ఇప్పుడు హఠాత్తుగా కట్టమంటే కుదరదు" అని పూజారి మర్యాద పోతుందని అంగలార్చాడు. "తినేటప్పుడు ఇలాంటి ఆలోచనలు రాలేదు. మరొకరి వస్తువును తినటం నేరం!" అని కారభారి మండిపడుతూ అన్నాడు. అయితే ఎవరికీ వినే ఓపిక లేదు. చివరికి తండా నాయక్, "సరే. వచ్చే శుక్రవారం రోజున చిమణి చేతిలో మీరు చెల్లించవలసిన దండన కాసులు ఉండాలి. లేకపోతే తర్వాతి పరిణామాలు మరోలా ఉంటాయి" అని హెచ్చరించాడు. కారభారి కూడా తండా నాయకుడి నిర్ణయాన్ని సమర్థించాడు. తర్వాత ఇద్దరూ కిందకు దిగి వెళ్లిపోయారు.

అందరూ పూజారిని తిట్టుకుంటూ వెళ్లిపోయారు. ఊరకూరకే వాళ్లు పిలిచినందుకు పోయినందువల్ల ఫక్కీర దండన కట్టి వచ్చాడు. అతను పూజారి మాటలకు లొంగిపోయి అతను చెప్పుదు మాటలు వింటున్నాడు. పుజారి అప్పుడప్పుడు ఫక్కీర ఇంటికి వెళ్లేవాడు. ఫక్కీర రెండవ భార్య చంద్రికి దూరపు బంధువు అని చెప్పుకొన్నాడు. మొత్తానికి ఆమె దగ్గరికి పోయి గంటలకొద్దీ కబుర్లు చెప్పేవాడు. ఆమె చేతులను, శరీరాన్నిఅప్పుడప్పుడు తాకుతూ మాట్లాడేవాడు. దూరపు బంధువని ఫక్కీర కూడా అనుమానించలేదు. రాను రాను పూజారి పగటిపూట రాకుండా రాత్రిపూట రావటం మొదలు పెట్టాడు. కుండ మూతిని మూయగలంకానీ, జనంలోని నోటిని మూయటం సాధ్యమా? విషయాలు ఒకరి నోటినుంచి మరొకరి నోటికి ప్రవహించసాగాయి. వదంతులు ఎగిశాయి. పుకార్లు ప్రబలినాయి. ఇలాంటి

విషయాల గురించి జాగ్రత్తపడకుండా ఫక్కీర తన సొంత సోదరుడు భగన్యనాయక్ మీదనే కసి పెంచుకోసాగాడు. పూజారి ప్రణాళిక ప్రకారం భగన్యను కోర్టు చుట్టూ తిప్పి వేధించాలన్నది. కోర్టుకు పోయినవాడు కాటికి పోయినట్టే అన్నది సామెత. కోర్టుకు పోవడం అంటే చచ్చేవరకు తిరుగుతూనే ఉండాలి. ఆ విధంగా అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టి వాళ్లు కొట్లాడుకొని, పోలీస్ స్టేషన్‌కు, కోర్టుకు, జైలుకు వెళ్లాలన్నది పూజారి ఉద్దేశం. ఈ విషయాన్ని భగన్య ముందు తప్ప మిగిలిన అందరి ముందు ప్రస్తావించి వాళ్లకు వినోదం పంచి తాను వికృతానందం పొందేవాడు.

ఫక్కీర దాదాపు ఒంటిమీద స్పృహ లేకుండా ఒకటి రెండు సార్లు నడుస్తూ దారిన పోతున్న వారిమీద పడసాగాడు. పైగా వాళ్లని దూషిస్తూ, గొణుక్కుంటూ భగన్య ఇంటి వరకు వచ్చాడు. అంగనంలో నిలబడి తల్లిని, భార్యను, ఒక్కరినీ వదలకుండా తిట్టడం మొదలుపెట్టాడు. అతను ఎంత వదిరినా ఎవరు కిమ్మనకుండా గుడిసె తలుపులు మూసుకుని మౌనంగా భగన్య కుటుంబసభ్యులు లోపల కూర్చున్నారు. అర్ధరాత్రివరకూ అతని ఆగడాలు ఇలాగే సాగాయి. జనం సాధ్యమైనంతగా మనోరంజన పొంది తమతమ ఇళ్లకు వెళ్లిపోయారు.

పూజారికి అవమానంగా అనిపించింది. ఆ రోజంతా దురుగవ్వ, సేవాభాయ్ పూజలు చేశాడు. ఏమి చేసినా భగన్య కొడుకులు గొడవకు రాలేదు. ఆలోచించాడు. ఏమి చేస్తే వాళ్లు గొడవకు వస్తారా అని తలబద్దలు కొట్టుకున్నాడు. అప్పుడే గుడికి ఎవరో అగరొత్తులు వెలిగించటానికి వచ్చారు. అక్కడ అతని అవస్థ చూసి బెదిరిపోయి బయటనుంచే నమస్కారించి వెళ్లిపోయారు. "ఈ పూజారికి దెయ్యం పట్టింది. గర్భగుడిలో తలబాదుకుంటూ కేకలు పెడుతున్నాడు" అని వాల్యా కొడుకు జింగ్యా అన్నాడు. ""దేవస్థానంలోకి దెయ్యాలు రావడం సాధ్యమా? నీ అవ్వ... జింగ్యా చెబుతున్నది అబద్ధం. సరిగ్గా చూసి చెప్పు. ఆ పూజారికి పిచ్చిపట్టిందని చెబితే ఎవరు నమ్ముతారు?" అని పీకే నాయక్ అన్నాడు."అవును మామ, పూజారప్పకు పిచ్చి పెరగడం తెలియనే లేదు" అని జింగ్యా చెబుతుండగా అదే సమయంలో పూజారి వచ్చాడు. పీకు కన్ను గీటి అతని మాటల్ని ఆపాడు. "మీ నాన్నకు పిచ్చి పట్టిందిరా జింగ్యా నా కొడకా" అని జింగ్యాను పట్టుకోడానికి పరుగున వచ్చాడు. "లేదు, నీ పెండ్లానికి పిచ్చి పట్టిందిరా పూజారీ" అని వెక్కిరించి అక్కడి నుంచి పారిపోయాడు. పూజారికి ఏం చేయాలో తోచక కుర్రవాళ్లు చెప్పిన విషయాన్ని ఆలోచించాడు. "అయ్యో, నిజంగానే పిచ్చి పట్టడానికి ముందు జాగ్రత్తపడాలి" అని ఎవరూ తన మాట వినలేదని నిర్ధారించుకుని ముందుకు పోయాడు.

రోజూ తెరుస్తున్న సమయానికి ముందే చేమ్లునాయక్‌కు చెప్పి సారాయి కొట్టు తలుపు పూజారి తీయించాడు. "లేదు పూజారప్ప, ఇంకా సారాయి రాలేదు. నిన్న తెచ్చింది కూడా మిగల్లేదు. నా పెండ్లాం గాడిదను తోలుకునిపోయింది. కొద్ది సేపట్లో వస్తుంది" అని అంగలార్చాడు. అయినా వినకుండా పూజారి లోపలకి దూరాడు. అతనితోపాటు ఫక్కీర, దళారి దురుగ్యా, హెున్నానాయక్, కాళునాయక్‌లు వెళ్లి తమ తమ స్థలాలు పట్టుకుని కూర్చున్నారు. పూజారప్ప తన జడలో దాచిన బీడితీసి, "రేయ్ కాళు, అగ్గిపెట్ట ఇవ్వరా" అన్నాడు. కాళు ఉడుత మార్కు అగ్గిపెట్టెను అతని వైపు విసిరాడు. పుల్ల తీసి గీచి బీడీ ముట్టించుకొని, రెండు దమ్ములు లాగి మాటలు ప్రారంభించాడు.

"చూడరా ఫక్కీరా, మన కళ్లెదుట భగన్య రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నాడు. ఈ విషయం విన్నావా? సర్వతప్ప పొలంలో వడ్లు, అడవి పొలంలో జొన్నలు, ఇంకొక పొలంలో వేరుశనగలు పండినాయంట" అని చెబుతుండగా పూజారికి ఒళ్లంతా ముండ్లు గుచ్చుకున్నట్టయ్యింది. ఫక్కీర మౌనంగా వింటున్నాడు. తన అన్న మీద మొదటినుంచి ద్వేషం ఉన్న ఫక్కీర, పూజారిలాంటివారి సహవాసం చేయటంతో ఆ ద్వేషం మరింత పెరిగింది. ""చూడరా పకీర ఈరోజు ఏం చేస్తావో తెలియదు, మీ అన్నతో, వాడి కొడుకులతో నువ్వు గొడవపడాలి. ఆ లంజకొడుకులు నిన్ను కొట్టాలి. మాలో కొంత మంది విడిపించడానికి వస్తాం. అలా వచ్చి వాళ్లను బాగా కొడతాం. తర్వాత నువ్వే వెళ్లి వాళ్లు నిన్ను కొట్టినట్టు పోలీసులకు రిపోర్ట్ ఇవ్వాలి. దాంతో ఆ నా కొడుకులు అందరూ జైలుకుపోతారు" అని విక్రమార్కుడిని వదలని బేతాళుడిలా వెంట పడ్డాడు.

ఫక్కీర చీకటిపడుతున్నట్టే బాగా తాగాడు. ఎప్పుడైతే మత్తు బాగా ఎక్కిందో అప్పుడు భగన్య నాయక్ గుడిసె ముందుకొచ్చి, "రేయ్, రారా బయటికి. ఎన్ని రోజులు ఆడవాళ్ల లాగా లోపల కూర్చుంటావు. నీకు దమ్ముంటే, మీసం ఉంటే రా బయటికిరా" అని తిడుతూనే ఉన్నాడు. జనం చీకటి పడటానికి మునుపే సారాయి తాగటానికి తమ పాటికి తాము వచ్చి తాగి మాయమయ్యేవారు. "రోజూ వీడి పీడ ఉన్నదే. పాపం పిల్లలతో ఎంతో కష్టపడుతూ, ఏదో సంపాదించుకుని, ఏదో తిని బతుకుతున్నారు భగన్య కుటుంబీకులు. ఇతరుల సంపదపట్ల ఆశపడేవారుకాదు. ఎన్నడు పంచాయతీ కట్టమీద కూడా చాయ్ కూడా తాగినవాడు కాదు. కల్లు, సారాయిని దూరంగా పెట్టాడు. ప్రతిరోజు ఒకటిన్నర బాటిల్ తాగి, ఒక బాటిల్ ఇంటికి తీసుకుని పోతాడు. ప్రతి రోజు పని ముగిసిన తర్వాత వచ్చి తాగి వెళు

తుండటం ఎవరికీ తెలియదు. అయితే కొంతమంది ఉదయం నుంచి సాయంత్రం వరకు సారాకొట్టు దగ్గరే కాపలా కాసేవారు. ఇతను ఎవరితోనూ కలిసేవాడు కాదు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఎవరికి తన డబ్బుతో కల్లు సారాయి తాగించేవాడుకాదు. ఇదే చాలా మందికి వ్యతిరేకమైంది. పైసా ఖర్చు పెట్టకుండా ఇతరులు తాగిస్తే తాగేవాళ్లకు ఈ విషయం మింగుడు పడకపోవడంతో అతనిపట్ల కోపంతో ఉండేవారు. ఈ నా కొడుకు మా వైపు తిరిగికూడా చూడడుకదా అని ముందుగానే సారాకొట్టు చేరుకుని, సగం బాటిల్ తాగి బోణి చేసి, అరుగుమీద ముడ్డిమోపేవారు. దళారి దురుగ్యా, పైవీధి లసణు, వెనుక వీధి డావో, డావేర్, లచ్మా, కారబారి కమల, ఒక పెద్ద గుంపే ఉండేది. ఎవరు తాగడానికి వస్తారో వాళ్లు ఒక బాటిల్ తీసుకొని బానలో పోసి, ఒక గుటుకు తాగిన తర్వాత, బంధుత్వం కలుపుకుని మాటలు విసిరే వారు. "ఏం మామ, జొన్నలు కోశారా? వానెవ్వ, ఎలా పెరిగిందంటావు జొన్నలు. మనుషులు పొలంలోకి వెళితే భయపడుతారు. కంకులు ఎలా ఉన్నాయంటే బాగా బలిసిన బంతుల్లాలా నిండుగా ఉన్నాయి. ఏదో లాటరీ తగిలింది" అతని ముందు పదేపదే ఇలా అనడం మొదలు పెట్టారు. అతనేమైనా ఇతడి మాటలకు ఉబ్బిపోయడా కొవ్వెక్కిన దున్నపోతు అని అతని చేత ఖర్చు పెట్టించేవారు. అతనంతట అతనే, "అరే మీరు సగం తీసుకో" అనాలి. అలా ఒప్పించి అతను సగం అంటే వీళ్లు ఒక బాటిల్ పూర్తిగా తీసుకొని మరికొంతసేపు పొగిడి, అతడు రెండో బాటిల్ తీసుకున్నప్పుడు అందులోనూ సగభాగం తాగి ఇంటికి పోయేవారు. అతను తెలివైనవాడైతే, బాటిల్ తాగేవరకు ఏమీ అనకుండా ఉంటే, "మామ ఒక బాటిల్" అని పళ్లికిలించేవారు. అలా అడిగేటప్పుడు మర్యాద వదిలేసి అడిగేవారు. దాంతో అతను పిచ్చిగా తాగిస్తే, వాడికొకటి వీడికొకటి అని ఐదారు బాటిళ్లు తాగి, అతని చేత డబ్బులు ఇప్పించి ఇంటికి పోయేవారు. వీరందరి చలాకీతనం తెలిసిన భగన్యనాయక్ వీళ్లతో సహసం చేస్తే సమస్యలు వస్తాయని, ఎప్పుడో ఒకసారి వచ్చి తనపని కాగానే వెళ్లిపోయేవాడు. అందువల్ల భగన్య నాయక్ తమ చేతికి దొరకడని, దెబ్బలకు లొంగడని మాట్లాడుకునేవారు.

ఫక్కీర ఎప్పటిలాగే నేరుగా సేవాభాయ్, దురుగమ్మ గుడి వేపచెట్టు అరుగు మీద కూర్చోని మాటలు మొదలుపెట్టాడు. వాడి గొంతు వినగానే వినోదాన్ని పొందటానికి, పక్కనున్న వీధి పిల్లలంతా తమ నోటి నుంచి జీపు నడుపుతున్నట్టు శబ్దంచేస్తూ, పరుగులు తీయసాగారు. ఫక్కీర సంవత్సరాల పేర్లను చెబుతున్న తీరును గమనించసాగారు. ఇంకా ఎక్కువ ఆనందం అంటే, ఎదురు పార్టీ వచ్చి

గంటు పడ్డప్పుడు."రేయ్‌చౌడా, అది కాదు, వీడు ఆ భగన్యనాయక్‌ను ఎంతగా తిడుతున్నాడు. మూడు రోజులైంది. నేను చూస్తూనే ఉన్నాను. వాళ్లు ఇంట్లో ఉన్నారా? లేదా నాటకం ఆడుతున్నారా?" అని వెనకవీధి సాము కొడుకు జింకా అడిగాడు. "ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ఇతని ఎముకలు విరచవచ్చు. ఈరోజు ఏదో ఒకటి జరుగుతుంది చూడు" అని చౌడప్ప అన్నాడు. నీళ్లు చేదుకోవడానికి వచ్చిన ఆడవాళ్లంతా "ఈ పాడు మనిషి జిడ్డులా పట్టుకున్నాడు, రోజూ రాత్రి అయితే చాలు, ఆడవాళ్లు ఇటువైపు రాకుండా చేశాడు దొంగసచ్చినోడు" అని జాంపా పెండ్లాం పీరి పక్కనున్న సావంత్రి చెవిలో అంది. ఫక్కీర, చూసిచూసి చాలై, గుడిసె తలుపు జరిపి లోపల అడుగు పెట్టబోయి తొట్రుకుని పడ్డాడు. ముక్కు బెదిరింది. "రేయ్ లంజా కొడకల్లారా, మీరు పది మంది ఉన్నారని, మీ బలాన్ని చూపిస్తున్నారా? నా ముక్కు పగులగొట్టారుకదరా" అని నొప్పి భరించలేక కొద్దిసేపు గిలగిల్లాడాడు. కాసేపటికి కుదుటపడి, లేచి మళ్లీ తలుపు జరిపి లోపలికి దూరబోయాడు. రోజూ అతని ప్రవర్తన చూసి చూసి విసుగొచ్చిన బదియా, వాడి అన్న టాంక్యాలు "రేయ్ దొంగ నా కొడకా, మా వెంట ఎందుకు పడుతున్నావ్‌రా, చిల్లిగవ్వకూడా మా నాన్నకు ఇవ్వకుండా బయటికి తరమడం సంతృప్తిగా లేదా? ఇక్కడి నుంచి ఊరికే పోతే మిగిలిపోతావ్ లేదా..." అని నచ్చచెప్పడానికి చూశారు. "ఏం చేస్తావ్ రా, కొడతావా? అంత మగాడైతే నన్ను ముట్టుకోరా?" అని సవాల్ చేశాడు. దాంతో అన్నదమ్ములిద్దరూ అవలీలగా అతన్ని ఎత్తి నేలకేసిబాది, మూతిముఖం చూడకుండా పిడిగుద్దులు గుద్దారు. లోపల వంటచేస్తున్నా చావళి బయట గొడవ జరుగుతున్నట్టు అర్థమై గబుక్కున వచ్చి చూసి, "రేయ్ పనికిమాలిన వెధవల్లారా, వదలండ్రా చచ్చిపోతాడు." అని పిల్లల చేతుల్లోంచి విడిపించింది. ఆ సమయంలో భగన్య నాయక్ పైవీధిలోని జమణి ఇంట్లో కూర్చుని ఉన్నాడు. విషయం తెలియగానే పరుగున వచ్చాడు. అప్పటికే ముక్కు ముఖం చూడకుండా చితకబాది కింద పడేశారు. ఫక్కీర పరిస్థితి తెలిసిన వెంటనే గాయపడ్డ అతన్ని తీసుకుని పోవటానికి అతని కూతుర్లు పరుగెత్తుకొచ్చారు. అర్ధరాత్రిలో కువకువమనే చిలుకల్లా ఆ ఆడపిల్లలు ఏడవసాగారు. ఏమీ చెప్పినా వినిపించుకోకుండా ఇష్టం వచ్చినట్టు తిట్టసాగారు. మూడ్నాలుగు రోజుల నుంచి ఈ నాటకం చూస్తున్న హుస్సేనజ్జ, కెంచజ్జ, ఉప్పార హులువప్ప ఒకింత న్యాయం తరఫున ఉండటంవల్ల అందరికీ నచ్చజెప్పి, భగన్యనాయక్ కొడుకులను బాగా తిట్టి, గొడవను అణచివేశారు. అయినా అమ్మాయిల ఏడుపులు మాత్రం తగ్గలేదు. పూజారి, దళారి దురుగ్యా గుంపు అక్కడ

చేరుకుంది. అయితే ఫక్కీరకు సహాయం చేయడానికి వచ్చేలోపు అతని కథ ముగిసిపోయింది. "ఒరేయ్, మీ అయ్య, దొంగనా కొడుకుల్లారా, మీ అందరినీ నమ్మి ఇక్కడికి వచ్చాను. ఆ ఇద్దరు కలిసి నన్ను చితకబాదారు. అబ్బా చచ్చాను, అమ్మా చచ్చాను" అని పలువరించాడు. పూజారి ప్రణాళిక విఫలమైంది. "ఒరే ఫక్కీర మంచిదైందిరా. నీ శరీరం మీద గాయాల గుర్తులున్నాయి. అది చాలు, ఏ నా కొడుకు వచ్చి వీళ్లను జైలు నుంచి విడిపిస్తాడో నేనూ చూస్తాను" అని దళారి దురుగ్యాతోపాటు రాత్రికి రాత్రి బండికట్టించి తండా నుంచి ఆరుమైళ్ల దూరంలో ఉన్న దేవూరికి బయలుదేరారు. అక్కడి పోలీస్ స్టేషన్లో కేసు వేయమని వాళ్లను పంపిన పూజారి, ఆ రాత్రి తన పని పూర్తిచేసుకోవాలనే దురాలోచనతో ఉన్నాడు.

ఎద్దుల బండి తండా వదిలే సమయానికి అర్ధరాత్రి. ఊళ్లో జనం నిశ్శబ్దంగా పడుకుని ఉన్నారు. బండి అటు కదిలిందో లేదో పూజారి ఫక్కీర ఇంట్లో దూరాడు. అది చూసిన భగన్యనాయక్ పొలంలో పనిచేసే మనిషి వచ్చి విషయం చెప్పాడు. "కేసు పెట్టడానికి వెళ్లిన వారి ఇంటికి మనం పోతే, ఆ నీచుడు ఏదైనా కొత్త సమస్య సృష్టిస్తాడు. ఏలాగైనా పాడైపోనీలేరా ధావూ" అని నచజెప్పి అతన్ని పంపేశాడు. అయితే భగన్యకు నిద్రపట్టలేదు. బీడీ వెలిగించుకుని కాల్చసాగాడు. ఇది ఏమిటి తమ కులానికి అంటిన శాపమా? తమ తల్లి, తమ తాత, ముత్తాతల కథల్లో ఇలా సోదరులే అడ్డుపడి కష్టపడి బాగుపడేవారిని దెబ్బతీసిన చరిత్ర గుర్తుకొచ్చి బాధగా అనిపించింది. ఊరి జనం మాటలు విని తోడబుట్టిన తమ్ముడు అన్నకు వ్యతిరేకంగా కేసును నమోదు చేయడం… 'ఛీ పాడు బతుకు, ఇక్కడ ఏ సంబంధాలకు విలువ లేదు. నమ్మకం లేదు. ఇక మా ముందరి తరాలవారి గతేమిటి?' అని మనసులోనే దుఃఖంతో మునిగిపోయాడు. ఇతరులను ఏమైనా చేయగలడు. అయితే సొంత తమ్ముడిని ఎలా నిభాయించడం. ఆలోచించి ఆలోచించి విసుగొచ్చింది. పూజారి తన సొంత తమ్ముడి గుడిసె నుంచి బయటికి రావడం అతని కంట పడింది. భగన్యనాయక్ రక్తం మరిగిపోయింది. ఉచ్చపొయ్యడానికి వెళ్లినట్టు అతని వెనకే బయలుదేరాడు. వెనుక వీధిని దాటేటప్పుడు, ఛత్ర్యా ఇంటి సందులో దూరి తన ముఖం కనిపించకుండా కళ్లు మాత్రమే కనిపించేలా తువ్వాలును చుట్టుకున్నాడు. పూజారి ఆ సందులోకి తూలుతూ వచ్చాడు. గబుక్కున అతని మూతిముఖం చూడకుండా ఎడాపెడా కొట్టాడు. నోరెతనివ్వకుండా పిడికిలి బిగించి కొట్టకూడని చోట బలంగా కొట్టాడు. అసలే మత్తులో ఉన్న పూజారి సందులో ఒక్కసారిగా మూర్ఛపోయి కిందపడిపోయాడు. అతన్ని అలాగే వదిలేసి భగన్యనాయక్ ఎవరూ

చూడకుండా వచ్చి తన గుడిసె చేరుకున్నాడు.

పూజారి తాగి వీధిలో పడివుండటం చూడటానికి మొత్తం తాండా జనం గుమిగూడారు. అదే సమయానికి సరిగ్గా ఎద్దుల దళారి చెన్ని కొడుకు రాజు పూజారి తలమీద ఉచ్చ పోయడం చూసిన జనం పగలబడి నవ్వసాగారు. అప్పుడు పూజారికి మెలకువ వచ్చింది. జనం గుమిగూడి ఉండటం చూసి గాభరా పడ్డాడు. ఇంకా తాను బతికే ఉన్నానని నిర్ధారణ చేసుకొని పైకి లేవడానికి ప్రయత్నించాడు. రాత్రి అపరిచితుడు కొట్టిన దెబ్బలకు నరనరాలు భరించలేనంత బాధతో మూలుగుతున్నాయి. బలవంతంగా లేచి కాళ్లీడుస్తూ ఇంటికి బయలుదేరాడు. తల దిమ్ముగా ఉంది. ఎవరు కొట్టి ఉండవచ్చు? అనుమానించడానికి ఎవరో తెలియక, 'దొంగ నా కొడుకు, కొట్టకూడని స్థలంలో గట్టిగా కొట్టాడు. ఇంకా గట్టిగా కొట్టివుంటే ఈ పాటికి ప్రాణం పోయివుండేది. ఎవడో మంచివాడే అయివుండాలి. ప్రాణం పోయేలా కొట్టలేదు' అని అనుకుంటూ గడపకు కాలు తట్టుకొని మూడు పల్టీలు కొట్టాడు. అతని కొడుకు జీకు తండ్రిని మించినవాడు. తండ్రిని చూసి పగులబడి నవ్వడం మొదలుపెట్టాడు. 'ఎంత మొత్తుకున్నా నీ తలరాత ఇంతే. రాత్రి తాగింది ఇంకా దిగలేదు. అంతేకాకుండా ఎక్కడో, ఎవరి గుడిసెలోకో దూరి వచ్చావ్. రేపు జనం నిన్ను గుడిలోకి వెళ్లకూడదంటే ఏం చేస్తావ్? థూ పాడువాసన. ఎవరి పియ్య మీద పడ్డావో? పో, పోయి చెరువులో స్నానం చేసిరా" అని కసిరాడు. పూజారికి దవడలు విపరీతంగా నొప్పి పెడుతున్నాయి. కోపంతో కొడుకుని తిట్టాలని నోరు తెరిచాడు. అంతే, అతని నోటిలోని దంతాలు ఊడి చేతిలోకి వచ్చాయి. "అయ్యో సేవాభాయ్, తల్లీ దుర్గమ్మ" అని అరిచాడు. అయితే నోటి నుంచి శబ్దం రాలేదు. మరింత నొప్పిగా అనిపించింది. కళ్లు మసకబారినట్టయి అక్కడే నేలకు ఒరిగాడు. 'వీడెమ్మ, లంజా కొడుకు సంపాదించడు. పైసా వదలడు. కక్కేవాళ్ల నోటిని నాకేవాడు. ఎవరో ఒకరిని బతిమిలాడి, బెదిరించి పీకలదాకా తాగుతాడు. పైగా కూలీనాలీ చేసి తెచ్చిన నాలుగు కాసులను లాక్కునిపోతాడు' అని అనుకుంటూ బయటికి నడిచాడు. పూజారి భార్య ప్రేమి అతన్ని చూసి,'రాత్రి ఏ ముండ దగ్గరకి పోయాడో? ఇప్పుడు వచ్చాడు' అని గొణుగుతూ తనపాటికి తాను చద్ది కట్టుకొని భగన్యనాయక్ పొలంలో కలుపు తీయడానికి పోయింది. అక్కడా కూలీ మనుషుల నోట పూజారి విషయమే. "ఎలాంటి కాలం వచ్చిందప్పా. దేవుడిని పూజించేవాడు ఇలా తాగి తెలివి లేకుండా ఎక్కడపడితే అక్కడ పడివుంటే, ఇక మిగతా జనం పరిస్థితి ఏమిటి?" అని వడ్డా కులం వీధిలోని జింగాలి అంది. "అది కాదు జింగాలి. ఆ పిల్లవాడు

చూశావా? చూస్తూ చూస్తూ ఉండగానే అతని తలమీద ఉచ్చపోశాడట. ఛీ...ఆ దురగమ్మ ఇంకా ఇతన్ని ఎలా భరిస్తూవుందో అర్థంకావడం లేదు" విసళవత్ వీధిలోని సేతిబాయి చెప్పి పడిపడి నవ్వసాగింది. పూజారి మొత్తం తండా జనం మధ్య చర్చకు గ్రాసం అయ్యాడు. అతను పంపించిన జనం రిపోర్టు చేసి, పోలీసులకు బాగా చాడీలుచెప్పి వచ్చారు. తెల్లవారేసరికి పోలీసు మామలు వచ్చి లంజా కొడుకులను పిలుచుకొనిపోయి ఎముకలు విరగ్గొడతారు చూడండని తమలో తాము మాట్లాడుకుంటూ అడ్డదారిలో వస్తున్నారు. ఇరుగుపొరుగు పొలాల్లో పనికిమాలిన తమ గురువు గురించి జనం మాట్లాడుకుంటూ నవ్వుకోవడం చూసి, పూర్తి కథ తెలుసుకునే తపనతో బండిని వేగంగా పరిగెత్తించటానికి ఎద్దులను చెలకాలతో కొట్టి గద్దించాడు దళారి.

భగన్యనాయక్ తెల్లవారే లేచాడు. సర్వతప్ప లేచి ఎక్కడికైనా వెళతాడేమోనని హడావుడిగా వెళ్లి అతని ముందు నిలుచున్నాడు. రాత్రి జరిగిందంతా ఒక్కటి వదలకుండా వివరించాడు. అంతా విని, "సరే, ముందు ఒక కప్పుచాయ్ తాగు. అటుతర్వాత ఆలోచిద్దాం" అని పెరట్లోకి వెళ్లాడు. జానకమ్మ ఒక లోటాలో చాయ్ ఇచ్చింది. చాయ్‌తాగి పూర్తిచేస్తుండగా సర్వతప్ప అంగీ తొడుక్కుని తయారై వచ్చాడు. బయట ఉన్న చెప్పులు వేసుకుని భగన్య నాయక్‌ను వెంటబెట్టుకుని బయలుదేరాడు. దేగూరుకు వెళ్లి పరిచయమున్న పోలీస్ నారాయణప్పను కలిసి ఒక మాట చెబితే మంచిదని బస్సు కోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు. బస్సు రాలేదు. రాళ్ల లారీ వస్తే దాన్ని ఎక్కారు. దొంబలూరు నుంచి దేగూరు నాలుగుమైళ్లు. లారీ పావుగంటలో దొంబలూరు చేరింది. పోలీస్ చెక్ పోస్ట్ దగ్గర వీళ్లిద్దరూ దిగటానికీ, అదే సమయంలో నారాయణప్ప హెడ్‌కానిస్టేబుల్ చామణరిగె సబ్ ఇన్‌స్పెక్టర్ బొంజెగౌడను కలవడానికి బయలుదేరాడు. సర్వతప్పను చూసి నారాయణప్ప,"ఏం ధనీ మీరు ఇక్కడ? ఏమి సమాచారం?" అని అడిగాడు. "అవునప్పా, మీ దగ్గర ఒక పనివుంది" అని పక్కకు తీసుకునిపోయి మా తండాలోని ఫక్కీరకు చెందిన కేసు నమోదు అయ్యిందా?" అని అడిగాడు. "ఓ అదా, చాలా సీరియస్ కేసు అయ్యగారు. ఆ పిల్లలు చిన్నవాళ్లయినా బాగా కొట్టారు. రేపువచ్చి వాళ్లని తన్ని లాక్కునివచ్చి ఏరోప్లేన్ ఎక్కిస్తాను ఏమనుకున్నారో?" అని భగన్య నాయక్‌కు భయం పుట్టించడానికి అతని వైపు చూశాడు. అయితే సర్వతప్ప ఇలాంటివారిని వెయ్యి మందిని చూసినవాడు."నిజానికి ఏమైందంటే ఆ ఫక్కీర తాగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఆ చిన్న పిల్లలు భరించలేక నాలుగు దెబ్బలు వేశారు. వాడు బాగా తాగి ఎక్కడెక్కడో పడి దెబ్బలు తగిలించుకున్నాడు.

వాటిని చూపి వీడు మనసుకు తోచినట్టు కేసు పెట్టాడు. మీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ మా బంధువు. ఆయనకు ఒక మాట చెప్తానులే. నారాయణప్పా, మీ స్థాయిలో పిల్లలకు ఇబ్బంది కలగకుండా చూడు" అని సర్వతప్ప అన్నాడు. "అయ్యో మీరు మమ్మల్ని మర్చిపోయారు. ఆ కేసును ఇక్కడే పరిష్కరిస్తాను. మీరు నిశ్చింతగా వెళ్లండి" అని అన్నాడు. సర్వతప్ప జేబు నుంచి ఇరవైఅయిదు రూపాయలు తీసి నారాయణప్పకు ఇచ్చి, "పిల్లల్ని పిలిచి నాలుగైదు దెబ్బలు వేసినట్టు చేసి ఇక్కడే పరిష్కరించండి. లేదు కోర్టుకు వెళతామంటే దాన్ని వాయిదా వేయండి. పిల్లలను ఎక్కువగా భయపెట్టవద్దు" అని అన్నాడు. లారీ నారాయణప్ప కోసం నిలబడి వుంది. "అలాగే ధనీ, మీరు ఏమీ చింత చేయకండి" అని నారాయణప్ప, ఇరవై అయిదు రూపాయలు జేబులో పెట్టుకుని, ఈ రోజు ఉదయమే ఎవరిదో మంచి ముఖం చూశానని అనుకొని లారీ ఎక్కాడు. ప్రతిరోజు క్రాస్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబడినా కేవలం నాలుగు రూపాయలు కలెక్షన్ అయ్యేది. బిచ్చగాళ్ల మాదిరి చాటున కూర్చోని లారీ శబ్దం వినిపించగానే పరిగెత్తి వచ్చి చేయి చూపి లారీని ఆపడం. డ్రైవర్ల దగ్గర డబ్బులు ఉంటే 'అన్నా, తీసుకో' అంటూ పది పైసలు, నాలుగణాలు, ఎనిమిదణాలు, రూపాయి–ఇలా తమ శక్తికొద్దీ ఇచ్చేవారు. రోజుకు ఎన్నో లారీలు తిరిగేవి. అవి ఏమీ ఇవ్వకుండానే వెళ్లిపోయేవి. అయితే రాళ్లలోడు తెచ్చేటప్పుడు మాత్రం డబ్బులు దొరికేవి. ఆ కారణంగా ఒక్కొక్క రోజు చాయ్‌కి కూడా డబ్బులు దొరికేవి కావు. అందువల్ల పల్లెటూర్లలో జగడం అని కేసు వస్తే, తంతే బూరెల గంపలో పడినంత సంతోషం. ఎవరైతే అయిదు, పది ఇస్తారో చట్టం వారి వైపే. ఎవరికైతే డబ్బు తాకత్తు ఉండదో వారు ఎముకలు విరగ్గొట్టుకుని ఊరికి తిరిగి వచ్చేవారు.

మరుసటి రోజు భగన్యనాయక్ ఇంటి ముందు నారాయణప్ప పంపిన పోలీసు ధన్‌సింగ్ నాయక్ వచ్చాడు. అతను పైవీధి కపలిబాయి చెల్లెలి కూతురును పెళ్లి చేసుకునే విషయంగా మాటలు జరిగాయి. ఆ కారణంగా అతను ఆమె ఇంటికి పోయి వీరి ఇంటికి వచ్చాడు. అక్కడే అతను టాంక్యా, బదియాల నాయక్‌ల గురించి వివరాలు సేకరించుకుని వచ్చాడు. ఇంటిముందు నిలబడి "ఎవర్రా టాంక్యా, బదియాలు?" అని అడిగాడు. టాంక్యా ముందుకొచ్చి "నేనే సార్" అన్నాడు. "ఎందుకురా? ఒళ్లు కొవ్వెందా? మంచివాళ్లు తండాలో ఉండకూడదా? మీలాంటి చెడ్డవాళ్లు ఉండాలా? పదా పోలీస్‌స్టేషన్‌కు" అని గద్దించాడు. భగన్య నాయక్

అంతా చూస్తూ మౌనంగా ఉన్నాడు. ముందుకొచ్చి, "ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో అందరికీ తెలుసు. మీ పని మీరు చేయండి. నారాయణప్పగారు అంత చూసుకుంటారు" అన్నాడు."ఎవరు నువ్వు? పోలీసులంటే కొంచెం కూడా భయం లేకుండా మాట్లాడుతున్నావ్?" అని గద్దించాడు ధనసింగ్ నాయక్. అతను కపాలిబాయి బంధువు అని భగన్యనాయక్‌కు తెలుసు. అందుకే అతను తండాలో తన ప్రతాపాన్ని చూపించుకోవడానికి ఉత్సాహం చూపుతున్నాడు. అయినా అది పోలీసులకు భయపడే కాలం. పోలీసులు, కోర్టు తిరిగేవారంటే ఏదో పెద్ద నేరం చేసినవారని జనం అనుకునేవారు. పోలీసులు అంటే కొంతమంది నిలుచున్న చోటే ఉచ్చపోసుకునేవారు. అందువల్ల భగన్యనాయక్ కొంచెం భయపడుతూనే మాట్లాడాడు. తండ్రి కొడుకులు ధనసింగ్‌నాయక్ సైకిల్ వెంట నడుస్తూ బయలుదేరారు. దేగూరు చేరేసరికి అక్కడ ఫకీర్, దళారి, పూజారి, దురుగ్యా, మరో ఇద్దరు సొసైటీ హోలప్ప కొట్టులో ఒక్కో ప్లేటు బజ్జీలు తిని, చాయ్‌తాగి ఫక్కీర జేబుకు చిల్లు పెట్టారు. అతని తరఫున మాట్లాడటానికి వచ్చారు. ధనసింగ్‌నాయక్ పూజారికి బంధువు. అందువల్ల అతనికి చెప్పి బాగా కొట్టించి మరెన్నడూ ఊళ్లో తలెత్తి తిరగకుండా చేయాలని బండి కట్టుకొని వచ్చాడు.

నారాయణప్ప ఇద్దరినీ కూర్చోబెట్టి సమస్య పరిష్కరించి పంపించాలని అనుకున్నాడు. "మీ ఇద్దరూ అన్నదమ్ములు. బయటివాళ్లు కాదు. పరాయివాళ్లు ఈరోజు ఏమేమో చాడీలు చెప్పి రెచ్చగొడతారు. రేపు అవసరానికి ఎవరూ రారు. ఏదైనా జరిగితే ముందుగా వచ్చేది బంధువులే. మీలో మీరు ఇలా కొట్లాడుకుంటే జనం దాని లాభాన్ని పొందుతారు" అని మాటలు ప్రారంభించాడు. అయితే అతని మాటలు ఫక్కీర మీద ఎలాంటి ప్రభావం కలిగించకుండా పూజారి అప్పటికే అతని బుర్రపాడు చేశాడు. అందువల్ల ఫక్కీర నారాయణప్ప మాటలను పట్టించుకోలేదు. ఆ విషయం నారాయణప్పకూ అర్థం అయింది. ఈ కొడుకు జనం మాటలు విని తాను నాశనం కావడమే కాకుండా, అన్న భగన్యనాయక్‌ను నాశనం చేస్తాడని అనుకున్నాడు. టాంక్యా, బదియాలను లోపలికి పిలుచుకొనిపోయి రెండు దెబ్బలు వేసి, ఇంకెప్పుడైనా గొడవ చేస్తే ఏరోప్లేన్ ఎక్కిస్తాను" అని గద్దించాడు. ఒత్తిడి తట్టుకోలేక టాంక్యా పరుగున పోయి పోలీస్ స్టేషన్ ముందున్న వేప చెట్టు పక్కన కూర్చున్నాడు. ఫక్కీరకు చాలా సంతోషం కలిగింది. "లంజా కొడుకులు దున్నపోతుల్లా తిరిగేవారు. మమ్మల్ని చూసి గర్జించేవారు. ఇప్పుడు గర్జించమను. చూస్తాను" అని బిగ్గరగా నవ్వాడు. పూజారి, దళారి అతను అన్నదానికి అవునంటూ

తలూపి, అతని అతని దగ్గరున్న డబ్బుల్ని ఖాళీ చేయించడానికి బయలుదేరారు. నారాయణప్ప బయటికి వచ్చి, "రేయ్ ఫక్కీర నాయక్" అని పిలిచి సైగ చేశాడు. ఫక్కీర లేచి లోపలికి పోయాడు. "ఒక ఇరవై ఇవ్వు' అన్నాడు. అంత డబ్బు ఎక్కడ ఉంది స్వామి, మేము కూలినాలి చేసుకునే జనం. మా దగ్గర..." అని రాగం తీశాడు. నారాయణప్ప, "చూడు, నువ్వు చెప్పినట్టే కుర్రవాళ్లిద్దరినీ మా వాళ్లు బాగా కొట్టారు. అందరికీ ఇవ్వవలసింది ఇచ్చి ఇక్కడి నుంచి వెళ్లు" అని బెదిరించాడు. "అయ్యా, నా దగ్గర ఉన్నది ఇంతే" అని చెప్పి ఏడున్నర రూపాయలు తీసి ఇచ్చి, చేతిలో డబ్బులు లేక వాళ్లిద్దరిని పలకరించకుండా బయటికి నడిచాడు.

కోర్టుకు అన్నదమ్ములు వాయిదాలు తీసుకొని తిరగసాగారు. భగన్య ఇంట్లోని చిన్నపిల్లలను వదిలి టాంక్యా, బదియా, చిమణి, జేము, రామి, హోమ్లి, రాము,చావళి మొత్తం తొమ్మిది మందిమీద కేసు వేశాడు. అతను పదకొండుమంది పేర్లు రాయించాడు. భగన్యను వేధిస్తున్నది అతని కొడుకు బదియా స్కూలు విషయం. ఒకవేళ ఏదైనా ఎక్కువ తక్కువ అయితే అని ఆలోచించి సర్వతప్పకు చెప్పి, వకీలు ద్వారా బదియా పేరు తొలగించేలా చేశారు. అలా మూడు నాలుగు వాయిదాలు తిరిగిన తర్వాత ఫక్కీరకు బుద్ధి వచ్చింది. పోలీస్ స్టేషన్, కోర్టు అంటే ఏమిటో అర్థమైంది. కేసు వెనక్కి తీసుకోవడానికి ఒప్పుకున్నా డు.

భగన్యనాయక్ అన్నీ మరచి సంపాదన వైపు దృష్టి సారించాడు. ఈ కోర్టుకు తిరగడం వల్ల అతనికి అంత ఇబ్బంది ఏమీ కలగలేదు. చిన్నపిల్లవాళ్లను వదలి, పెద్దవాళ్లు పొలంలో వారం పొడుగునా పనులు చేసి దమ్మిడి దమ్మిడి కూడబెట్టి కోర్టు ఖర్చులు భరించారు.

అయితే ఫక్కీరకు మాత్రం పూజారి దళారీలకు చాయ్, టిఫిన్, ఆకువక్కలు మొదలు, సారా తాగించటంవరకూ అతనే ఖర్చుపెట్టాలి. అందువల్ల అతనికి ఊపిరాడకుండా పోయింది. "పోండిరా మీ సహవాసం పాడుగాను. ఒక బాటిల్ సారాయి కోసం వంద రూపాయలు దండన కట్టినట్టయింది" అని వారి సహవాసం వదిలిపెట్టాడు. కొత్త అవతారం, కొత్త వేషాలు వేసే పూజారిబుద్ధి తెలియని తండా జనానికి రాను రాను పూజారి వల్ల మంచి రోజులు లేవనే సత్యం అర్థం అయింది. అతని సహవాసం చేసిన వారందరికీ ఒడిలో నిప్పులు కట్టుకున్నట్టు అనిపించింది. అందరూ తప్పనిసరిగా అతన్ని భరిస్తూ వచ్చారు. ఫక్కీర రెండవ భార్య పెద్ద కూతురు రంకి ఎవరి పొలంలోనో గొర్రె వదిలిందని ఆ పొలంవారు జనాన్ని వెంటబెట్టుకుని

ఫక్కీర ఇంట్లోకి దూరి గొడవ చేయసాగారు. ఎంతైనా తమ చిన్నాన్న, అతని పిల్లలు కష్టాల్లో ఉంటే వారిని చూస్తు ఊరుకొలేక టాంక్యా, బదియాలు ముందుకొచ్చి ఎప్పుడు కొట్టారో, ఎలా కొట్టారోకానీ వచ్చిన జనం వెనక్కు చూడకుండా పారిపోయారు. ఫక్కీరకు తన తప్పు అర్థమైంది. చుట్టుపక్కల ఉన్న మొత్తం తండాలో ఉన్నది కరమ్‌తోట్‌ల కుటుంబాలు రెండు. ఎవరు కొట్టుకున్నా, ఎవరు తిట్టుకున్నా, ఎవరు హత్య చేసినా, పలకరించటానికి, మనవారని చెప్పుకోవడానికి ఉన్నది అన్నదమ్ములైన మేమిద్దరమే. ఇలా చాలాసేపు ఆలోచించాడు. "లంజా కొడుకు పూజారి పత్తా లేడు. నేను ఉన్నానుకదా, నేను ఉన్నాను కదా, ఈ తండా లో నిన్ను ముట్టే నా కొడుకు ఎవడున్నాడు, ఒక చెయ్యి చూసుకుంటాను అన్నాడు. దళారి నా కొడుకు ఇతరుల గంటును మింగేవాడు" అని గట్టిగా తిట్టసాగాడు. అతను తన పార్టీ వదిలితే, ఇక భగన్యను లొంగదీయడానికి ఎవరూ ఉండరు. ఉన్నది ఇతనొక్కడే. ఇతన్ని పోగొట్టుకోకూడదని పూజారి సారాయి కొట్టునుంచే, "అరే ఫక్కీర ఏమైంది? రా ఒక్క తాగుదాం" అని ప్రేమగా పిలిచి, మాయమాటలు చెబుతూ రెండు సీసాలు తాగించి మెల్లగా సమాధానపరిచి మళ్లీ తన వైపు తిప్పుకున్నాడు. ఫక్కీర బుద్ధి పనిచేయలేదా? నిజంగానే అతను పూజారి మాటలు వినేవాడా? లేదా అతని పెద్దన్న భగన్యనాయక్ మంచితనాన్ని భరించలేక ఇలా చేస్తున్నాడా? నిజమేమిటో అతని మనసులో తొంగి చూసేవారు ఎవరు? పూజారి మాత్రం స్పష్టంగా ఉన్నాడు. ఇక్కడ తండాలో అతని రమావత్ తెగవాళ్ల బలగం ఎక్కువగా ఉంది. అయితే ఎక్కడి నుంచో బుట్టలు మోసుకొని, కడుపులు చేతబట్టుకుని వచ్చిన ఈ కరమ్‌తోట్ తెగవారు, అందులోనూ భగన్యనాయక్ బాగుపడుతున్నాడన్నదే అతడి బాధ. ఎలాగైనా అతను అభివృద్ధి చెందకుండా చూడాలి. దానికి ఉపాయం ఏమిటి? లోపల ఒక శత్రువును సృష్టించాలి. ఆ శత్రువు అతని సొంత తమ్ముడు ఫక్కీర. ఇక రెండవ శత్రువు పెద్దయింటికి చెందిన పదిపదకొండు మంది పిల్లలున్న దిన్ని సాయిబు. కాసిం సాహెబ్. అయితే వారికి భగన్యనాయక్ ఆరాధ్యదైవం. అతని గురించి వారిముందు ఏమైనా అంటే ముఖంమీద ఉమ్మి, బయటికి తరుముతారు. కాబట్టి ప్రయోజనం లేదు. ఇక ఉన్నది ఒకే ఒక్కడు. అదే ఎద్దుల దళారి యంక. చుట్టుపక్కల ఉన్న పట్టణాలకు వెళ్లి ఎద్దులు, గొర్రెలు, పందులు, కోళ్ల–వ్యాపారం కుదుర్చుతాడు. అతనికి ఏడెనిమిది మంది పిల్లలు. అతనికి నాలుగుసీసాలు తాగిస్తే చాలు, ఎవరినైనా ఇష్టమొచ్చినట్లు తిడతాడు. ఇష్టం వచ్చినట్లు చేస్తాడు. శనిలా పీడిస్తాడు. ఈ ఇద్దరు శత్రువులను తన అస్త్రాలుగా వాడుకొని భగన్యనాయక్‌ను

దెబ్బకొట్టాలని పూజారి ప్రణాళిక రూపొందించాడు. అందుకోసమే ఫక్కీర రెండో భార్య చంద్రితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఇక గుడగా యంకన్నను బాగా తయారు చేశాడు. యంక తండాలో తక్కువగా, పట్టణంలో ఎక్కువగా ఉండేవాడు. అతని భార్య పిల్లలను, అతని తమ్ముడు సణ్ణీర బాగా చూసుకుంటాడని మొత్తం తండాలో గుసగుసలుగా మాట్లాడుకునేవారు. సణ్ణీర పిల్లలిద్దరూ తల్లిలేని పిల్లలు. ఎక్కడెక్కడో తిరిగేవారు. ఈ సణ్ణీర మాత్రం యంకన్న భార్య కొంగులో చేరుకుని లోకాన్నే మరిచిపోయాడు.

సణ్ణీర నిష్ప్రయోజకుడు అయ్యాడు. అయితే యంక ఇంటి ముఖ్యమైన స్తంభాన్ని నిలబెట్టాడు. పొలం ఉన్నప్పటికీ ఇద్దరు కూలీనాలీ చేసుకనేవారు. వీధిలో దున్నపోతుల్లా తిరుగుతున్న ఆరేడుమంది పిల్లల్ని మందలించి, పదిహేను ఎకరాల పొలాన్ని స్వయంగా నిలబడి చదును చేశాడు. పాడుబడ్డ గుడిసె స్థానంలో కొత్త గుడిసెను కట్టాడు. యంకన్న పొలం హద్దులను చెరిపి, ఆ పొలాన్ని తన పొలాల్లో కలిపాడు. గుడగా యంకన్న భార్య సావి ఏ విధంగా సణ్ణీర మీద ప్రభావం కలిగించిందో తండాలోని సంసారులకు అంచనా ఉంది. సావి ఇంతకుముందు అక్కడక్కడ లంబాడి మగవాళ్లకు కన్నుగీటుతూ ఉండటాన్ని సణ్ణీర బంద్ చేశాడు. "ఒసేయ్ ముండా! పిల్లల్ని వదిలి పనికిమాలిన పశువులా ఎక్కడికి తిరుగుతున్నావ్? నేను కష్టపడి సంపాదిస్తున్నాను, నువ్వు ఇలా బయట తిరిగి కనిపించిన వాళ్లందరికి కొంగు పరుస్తున్నావా? నన్ను ఏమని అనుకుంటున్నావ్?" అని ఒళ్లు హూనం అయ్యేలా ఎప్పుడైతే కొట్టాడో, యంకకన్నా ఇతనే మెరుగు అనుకుని బయటి సంబంధాలు తెంచుకుంది. ఇదంతా ఏమీ తెలియని యంక పట్టణానికి తిరుగుతూ వ్యాపారం చేయసాగాడు. సణ్ణీర కొడుకు జోగ్యా, కూతురు కాళీ. వారి తల్లి చనిపోయి పదిహేను సంవత్సరాలు అయింది. ఉన్న తండ్రి మరొకరి వలలోపడి, పిల్లల్ని అనాథలు చేశాడు. వాళ్లు తండ్రి ప్రవర్తన భరించలేక తండా దురుగమ్మ గుడిపక్కనే చిన్నగుడిసె వేసుకొని కూలీనాలీ చేసుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నారు. సణ్ణీర సంపాదన పెరుగుతున్నట్టే, ఇతరుల దగ్గర గప్పాలు కొడుతున్న యంకన్న ఆరుమంది పిల్లలు తండాలో దున్నపోతుల్లా తిరగటం మొదలుపెట్టారు. పామ, గాణి, సోమ, చంద్ర, పాప, తిమ్మలు వెళ్లి సాయిబులను తడుముకోవడం, ఏ లంబాడీలు బలహీనంగా ఉంటారో వాళ్ల మీదకి వెళ్లి అనవసరంగా ఇబ్బంది పెట్టేవారు. ఊర్లో ఉన్న అయిదుమంది అమ్మాయిలు చిక్కి, గంగి, నింగి, చామి, నిమ్మి లను బెదిరించసాగారు.

పూజారికి పండుగ. ఒకవైపు ఫక్కీర. మరోవైపు యంక. 'ఈ నా కొడుకులు

వేసిన పంట కోయకూడదు. అయినా వాడి విలువ ఏమిటి? తండా కట్టినవాడు మా ముత్తాత కెంజ హన్మంత. ఈ పనికిమాలిన వెధవలు ఎక్కడినుంచో వచ్చి మూడవందల సంవత్సరాల క్రితం కట్టిన ఈ సంస్థానాన్ని పాలిస్తున్నారుకదా?" అని కోపంతో వణకసాగాడు. "ఏయ్‌కాకా! నువ్వెందుకు అతని మాటలకు కోపం తెచ్చుకుంటావు?" అన్నాడు దళారి దురుగ్యా నాయక్. కడుపులో సారాయి పడకపోతే ఈ పూజారి కాళ్లుచేతులు వణుకుతాయని అతనికి తెలుసు. అయితే అతను పట్టుకుంటే వదలడని కూడా తెలుసు. ఒకమాట చెప్పిమౌనంగా ఉండిపోయాడు. సణ్ణీర పక్కన కూర్చోని భగన్యను దెబ్బకొట్టాలి. అతని సంపాదనను అధిగమించాలి. అతనికన్నా ఎక్కువ పొలం, ఇల్లు సంపాదించే తాకత్తు ఉన్నది నీకు ఒక్కడికే అని పూజారి సణ్ణీరను రెచ్చగొట్టాడు. గతంలో భగన్య పొలంలో సణ్ణీర పనిచేసేవాడు. ఇప్పుడు అతన్ని అధిగమించాలనే పట్టుదల వల్ల పూజారి మాటలు మత్తెక్కించ సాగాయి. "చూడు సణ్ణీర, ఒకటి-అతని పిల్లల కాళ్లుచేతులు విరగ్గొట్టి పనులు చేయకుండా చేయాలి. రెండవది-కోర్టు కచేరీలకు తిప్పి, ఆ మనిషిని మెత్తబడేలా చేయాలి. నీ దగ్గర ఆ శక్తి ఉంది. ఈ తండాలో నువ్వు ఒక్కడివే మగవాడివి" -ఇలా ఉన్నది లేనిది చెప్పి భగన్యనాయక్ ఎదురుగా కనిపిస్తే సణ్ణీర అతని వైపు గుర్రుగా చూసేలా చేశాడు. భగన్యనాయక్ తన శత్రువును కూడా ప్రేమించేవాడు. ఎవరు ఏమన్నా మౌనంగా వెళ్లిపోయేవాడు. సణ్ణీర రెండుమూడు సార్లు గొడవ పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. "సరేలే సణ్ణీర, నువ్వే పెద్దవాడివి" అని కోపం దిగమింగుకొని లేచి అక్కడినుంచి వచ్చేశాడు. భగన్యనాయక్ మహాభారతంలోని కృష్ణుడి కథను విన్నాడు. వంద తప్పులు చేసేవరకూ ఏ విధంగా కృష్ణుడు ఓర్పు పోగొట్టుకోలేదో అలాగే సణ్ణీర వంద తప్పులు క్షమించాడు. ఎప్పుడైతే అతని ఆగడాలు మితిమీరాయో, ఇక భరించలేక భగన్య, "ఏమలే, నీ యవ్వ లంబాడీలు అంటే ఏమనుకుంటున్నావు?" అని వాడి మెడపట్టి వంచి, నాలుగు దెబ్బలు వేశాడు. సారాయి కొట్టులో జరిగిన గొడవ వీధిదాటి తండాలో వ్యాపించడంతో అందరికీ తెలిసింది. యంక ఆరుమంది పిల్లలకూ, భగన్యా ఆరుమంది పిల్లలకూ గొడవ జరిగి ఒకరినొకరు కొట్టుకున్నారు. పెద్దవాడైన టాంక్యాను నీళ్లు చేదే బావిదగ్గర యంక మూడవ కొడుకు హులియా తడిమితే అతను ఊరుకుంటాడా? పట్టుకొని నాలుగు దెబ్బలు వేశాడు. విషయం యంక పెళ్లాం సావిని చేరింది. "ఏమిరా నా కొడుకు మీద చేయి చేసుకోవడానికి ఎంత ధైర్యం? రారా చూస్తాను" అని ఆమె చీర గోచిపోసి భగన్యనాయక్ గుడిసె ముందు నిలబడి తిట్టడం మొదలు పెట్టింది. "ఏయ్ ఊరకే నోరు మూసుకొనిపోమ్మా.

మేము కావాలని కొట్టలేదు. అతనే ఏమేమో తిట్టాడు. అందుకే కొట్టాం. నోరుమూసుకునిపో" అని అంటుండగానే, ఆమె వెనక ఉన్న దమరు, డిగ్గాలు మోసంతో వచ్చి టాంక్యా మీద దాడిచేశారు. ఏదో చదువుతున్న బదియా టాంక్యా కేకలు వినగానే బయటకు వచ్చాడు. తన సోదరుడి మీద సావి, దమరు, డిగ్గా కమ్ముకొని ఉండడం చూశాడు. కోపం నెత్తికెక్కి గుడిసె పక్కనున్న కర్ర తీసుకొని వాళ్ల మూతి ముఖం చూడకుండా బాదసాగాడు. దమరు ఒకవైపు, డిగ్గా ఒకవైపు పారిపోయారు. ఒక్కతే దొరికిన సావిని దెబ్బలు బయటికి కనిపించకుండా అన్నదమ్ములు వాయించారు. "యప్పో చచ్చాను, వదలండ్రా, నీకు దండం పెడతాను మీ అమ్మలాంటిదాన్ని" అంది. "మా అమ్మ ఇలా జగడాలకు వీధిలోకి వచ్చిందా? చూడు" అని ఆమెను తిట్టి అక్కడి నుంచి తరిమేశారు.

సణ్ణీర అక్కడ భగన్య చేత దెబ్బలు తిని వచ్చాడు. ఇక్కడ సావి, దమరు, డిగ్గా హులియా ముగ్గురినీ భగన్య పిల్లలు చావగొట్టారు. ఎవరూ నోరెత్తకుండా ఇంట్లో ఒక మూలలో పడుకునివున్నారు. అయితే ద్వేషపుపొగ ఒళ్లంతా సంచరించసాగింది. ఎవరు ఎవరిమీద ఎప్పుడు పడతారో తెలియదు. "రేయ్ బదియా, నీవు ఒక్కడివే ఎక్కడికి వెళ్లకు. బుద్ధిగా చదువుకోరా అంటే నీకు ఊరి విషయాలు కావాలి. రేపు తెల్లవారేలోగా నీవు దొంబలూరు చేరాలి. మా కష్టాలు మాకు ఎప్పుడూ ఉన్నవే. నీవు ఇక్కడ ఉండి చదువు పాడుచేసుకోవద్దు. వాళ్లలో మంచితనం లేదునాయనా. మనల్ని చూస్తే వాళ్లకు కడుపుమంట...అసూయ...నిలువ నీటిలో ఉచ్చపోసే రకాలు. అందుకే మన లంబాడి జనం ఎప్పుడూ బాగుపడలేదు నాయనా. వెళ్లి చదువుకొని నువ్వయినా బాగుపడు తండ్రీ" అని భగన్యనాయక్ కంట నీళ్లు పెట్టుకున్నాడు. చావళిబాయి ఇదే సరైన సమయమని, "ఎప్పుడూ చూసినా మండిపడుతుంటావు. అతను కొట్టాడు. వీడు తడుముకున్నాడు అని జనం ప్రాణాలే తీస్తున్నావు. నువ్వు ఈ తండాలో ఉండడానికి పనికిరావు. వెళ్లు. కష్టమో సుఖమో నాలుగు అక్షరాలు నేర్చుకుని ఏదైనా సాధించు" అని అతనికి బుద్ధి చెప్పింది. ఆరోజు తిట్టించుకున్న బదియా జూన్ నెలలో పాఠశాల మొదలయ్యే సమయానికి దీపదహళ్లి హాస్టల్ చేరుకున్నాడు.

భగన్యనాయక్‌కు తండా నిండా శత్రువులు ఉన్నారు. సంవత్సరానికి సరిపడా రాగిని ధాన్యపుకొట్టులో నింపి, ఇంటి ముందున్న పాత పాతరలోనూ జొన్నలు మూటలుకట్టి జాగ్రత్త చేశాడు. బడుగుబీదలు ఎవరైనా అడగడానికి వస్తే; వచ్చిన వారికి ఒక సంచి, రెండు సంచులు ఇచ్చేవాడు. చుట్టూ తండాల నుంచి జనం

వర్షాకాలానికి ముందే ధాన్యం గింజలకోసం వచ్చేవారు. జోరుగా పట్టుకునే వర్షం దెబ్బకు మెత్తబడిన భూమి సారం కొట్టుకునిపోయి, నిస్సారమవ్వటంతో పంటలు సరిగ్గా పండేవికావు. ఎవరిదో ఐదు గిద్దెళ్లు, ఇంకెవరిదో ఒక పల్లం, ఒక పుట్టి ఇలా జనం ప్రకృతితో కుస్తీ పడుతున్నారు. భూసారం కొట్టుకొనిపోయి దిగుబడి తక్కువ అవుతుండగా, ప్రజల అహంకారం మాత్రం ఆకాశాన్ని అంటుతుండేది. ఒకరి కష్టాలు మరొకరు పట్టించుకొవడం మానివేశారు. పశువుల పేడ మోసుకునిపోయి దిబ్బలలో పోసి, చొప్పలు, కసువు అని దొరికిందంతా దిబ్బలలో వేసి, వాటిమీద మట్టి కప్పి కంపోస్టు చేసి, ఎరువు వేసి, పంట పండించడానికి పూనుకునేవారు. తొలకరిలో ఒకసారి వర్షం పడితే పొలంలో నీళ్లు ప్రవహిస్తే, మడులు కట్టి నీళ్లు బయటికి పోకుండా చేసేవారు. పొలం దున్ని, విత్తనాలు నాటేవారు. అయితే జనం పొలంలో తెల్లటి కసువుపడి జొన్న మొక్కలు ఎండిపోయి, కంకులను తెంచలేని పరిస్తితి ఉంటే; భగన్య పొలాలలో జొన్న మొలకలు కళకళలాడుతుండేవి. దానికి కారణం సరిగ్గా సమయానికి భగన్య, భగన్య పిల్లలు కలుపు తీసి భూమిని దున్నేవారు. ఆరుసాళ్లకు ఒకటన్నట్టుగా కందులు, పెసలు, జొన్నలు, మధ్యన సజ్జలు, అలసందులు ఇలా రకరకాల విత్తనాలు వేసి, సంవత్సరానికి సరిపడే ధాన్యపుగింజలు పండించేవారు. కందుల కోత తర్వాత, దంపుడు కల్లంలో, కందులను ఎండబెట్టేవారు. కంకులు కోసిన తర్వాత సాళ్ల మధ్యన నాటిన గింజలు మొలకెత్తేవి. పావు ఎకరంలో ఇంటికి కావలసిన మిరపకాయలు, సొరకాయ, బంతిపూలు, ధనియాలు, జీలకర్ర, ఒక వరుసలో ఉల్లిపాయలు, ఆవాలు ఇలా అన్నిటినీ పొలంలో పండించేవారు. అందువల్ల కోతల కాలం ముగిసే సమయానికి అనేక రకాల పువ్వులు, కాయగూరలు, ఆకుకూరలు దొరికేవి. చిక్కుడు, బెండకాయలు, టమోటా, సొరకాయలు, గోరుచిక్కుడు- ఇలా ఆరునెలలు వర్షాకాలంలో తినటానికి చాలినంత పంట. ఎక్కువైన వాటిని పక్క పొలం వాళ్లకూ, పశువులు మేపడానికి వచ్చిన ఆడవాళ్లకు, బయటి ఊరివారి వాల్లకూ ఇచ్చినా ఇంకా మిగిలేవి. బంతిపూలు సరిగ్గా దీపావళి అమావాస్యకు, బలిపాడ్యమికి వికసించేవి. వాటిని జాగ్రత్తగా కాపలా కాసి ముందు రోజు సాయంత్రమే కోసి బుట్టలో పెట్టి నీళ్లు చిలకరించి, రెండుమూడు రోజులవరకూ పెట్టి, దండలు కట్టి ఎద్దులకు, గుమ్మాలకు కట్టేవాడు. భగన్యనాయక్ పిల్లల కోసం దమ్మిడికి దమ్మిడి చేర్చి కూడబెట్టేవాడు. అలా దాచిన సొమ్ముతో అమ్మకానికి వచ్చిన పొలాన్ని కొనేవాడు. మొత్తం తండా జనానికి భగన్యనాయక్‌ను చూస్తే ఆశ్చర్యం. అతని వ్యతిరేకులకు అసూయ. ద్వేషం. అతన్ని

సారాయి కొట్లో చూడాలన్నదివారి కోరిక. అతను తాగుడు వ్యవసానికి బానిసై ఆస్తులు పొగొట్టుకుని దరిద్రుడవ్వాలని వారి అత్యాశ. అయితే అతను ఎన్నడూ సారాయి కొట్లో ఎవరికంటా పడలేదు. సాయంత్రం కాగానే జనం తాగేవారు. ద్యామ, "అన్నా తలుపులు వేస్తున్నానప్పో, లేవండి" అని చెప్పి మొత్తుకున్నా, అర్ధరాత్రి వరకూ జనం ఉండేవారు. అందులో తాగేవారు తక్కువ. పనికిమాలిన కబుర్లు చెప్పడానికి వచ్చేవారు ఎక్కువ.

సణ్ణీర మాత్రం భగన్యనాయక్ చేతిలో దెబ్బలు తిన్నాడు. అందుకే ఎలాగైనా అతనిపై పగతీర్చుకోవడానికి కాచుకొని ఉన్నాడు. ఏమి చేసినా సంపాదనలో అతన్ని అధిగమించటం సాధ్యంకాదని, శారీరకంగా అతనిమీద దాడిచేసి పగతీర్చుకోవాలని ఆలోచించాడు. పైగా పూజారి, ఫక్కీర, దళారి దురుగ్యా నాయక్, కడేమని కృష్ణ, పెంకుటింటి నాయక్, ఇలా రోజురోజుకు గుంపు పెరుగుతూ పోయింది. ఇలా పెరిగిన పెద్ద గుంపు మంచి చేయలేక, చెడును చేయలేక సతమతమవుతూ ఉంది. అదే సమయంలో సరిగ్గా తండాలో ఉన్న నరసాపురం ఉప్పార చౌడప్ప పదహైదు ఎకరాలు ఏదో ఇబ్బంది వల్ల అమ్మాలనుకుని, నేరుగా భగన్య నాయక్ దగ్గరికొచ్చి చర్చలు జరిపాడు. భగన్యనాయక్, "అలాగే చౌడన్నా, నేను పిల్లలున్నవాడిని. కొందామనే ఉంది. మీరు అమ్ముతామని అంటే నేను కాదనలేను. సర్వతప్ప భట్టుగారిని మధ్యన పెట్టుకొని వ్యవహారం ముగిద్దాం" అన్నాడు. చుట్టూ ఎవరూ లేరని నిర్ధారణ చేసుకోవడానికి కాండ్రించి ఉమ్మాడు. చ్యామ్లనాయక్ మామిడి చెట్టువెనక ఉన్నట్టు గుర్తించగానే భగన్యనాయక్ మౌనం వహించాడు. అయితే సాదాసీదా చౌడప్ప, "చూడు భగన్య నాయక్, నువ్వు ఏమీ తెలియనివాడివి కాదు. నువ్వు ఎలాంటి మనిషివో చుట్టుపక్కల ఉన్న ఆరుపల్లెలకూ తెలుసు. మా తండ్రికి, మీ తండ్రికి మధ్యన చాలా స్నేహం ఉండేది. మా తండ్రి ఇప్పుడు మంచం పట్టాడు. అప్పుడప్పుడు మీ తండ్రి పంపానాయక్ గురించి చెబుతూ ఉంటాడు. ఒక కాలంలో మా తాత మీ ఇంటికి భోజనానికి వచ్చాడట. ఇప్పుడు మీకె పొలం అమ్మాలని మా అన్నదమ్ములం మాట్లాడుకున్నాం. ఇవ్వడం తీసుకోవడం విషయంలో నువ్వు చెప్పినట్టు చేద్దాం. వ్యవహారం వ్యవహారమే. రేపు మీ ఇంట్లో నేను ఒక రొట్టె తింటాను. నీవు నా ఇంట్లో ఒక రొట్టె తినాలి. అయితే వ్యవహారం మాత్రం స్పష్టంగా ఉండాలి. అదే చాలా కాలం నిలబడేది" అని మనసులో ఉన్నదంతా దాచుకోకుండా బయట పెట్టాడు. సాయంత్రపు చీకటిలో చెట్టువెనక ఉచ్చపొయడానికి కూర్చున్న మనిషి ఆకృతి అస్పష్టంగా ఉంది. భగన్యనాయక్‌కు విషయం ఒకవైపున సంతోషం కలిగిస్తే,

మరొకవైపున ఈ విషయం మరొకరి చెవిన పడిందికదా అని చింత పట్టుకుంది. ఆ విషయం తండా అంతటా వ్యాపించి, ఒంటిమీద గుడ్డలేనివాడుకూడా రేపు కట్టమీద కూర్చుని నేనూ ఉన్నానన్నట్టు తలదూరుస్తాడని విసుగు వచ్చింది. అయినా విషయం పొక్కుతుంది. జనం అడ్డుపడతారు. ఊరన్న తర్వాత ఇదంత సహజమేనని సమాధానపడ్డాడు. అయితే తనకు వచ్చిన సమాచారాన్ని భార్య చావళి దగ్గర తప్ప ఇంకెవరితోనూ పంచుకోవటానికి ప్రయత్నించలేదు.

విషయం రోజుకొక రూపాన్ని పొందసాగింది. పొలం అప్పటికే సణ్ణీర తీసుకున్నాడని వార్త వచ్చింది. తండా నాయకుడి కుమారుడు సీతారాం నాయక్ వెళ్లి, "ఒరేయ్, ఏ రేటుకైనా అమ్ము, పొలం మాత్రం నాకు వదిలేయ్యాలి. నేను తండా నాయకుడి కొడుకును. తండా కట్టినవాళ్లం మేము. అంతేకాకుండా నీవు అమ్ముతున్నది మా ముత్తాత ఆస్తిని. అమ్మాలనుకుంటే మాకే అమ్మాలి' అని బెదిరించి వచ్చాడని కొందరు మాట్లాడుకున్నారు. మరికొందరు మటాగానహళ్లి చాకలి శివానంద తీసుకున్నాడని అన్నారు. మరికొందరు భూమి అప్పటికే ద్యావనూరు దళారి హుస్సేన్ కొన్నాడని అన్నారు. చౌడప్ప మాట్లాడింది కేవలం భగన్యనాయక్‌తో మాత్రమే. కానీ గాలివార్తలు తండా అంతటా వ్యాపించాయి. అంతేకాదు, చౌడప్ప తమ్ముడు విష్ణుమనుషులు వచ్చి తండానూ, పూజారినీ ఒక చెయ్యి చూసుకుంటామని అన్నారట. తన అనుచరుడిని ముందు పెట్టుకుని పూజారి నారదపురకు బయలుదేరాడు. గంగమాళి అంగడిలో మిర్చి బజ్జి తిని, చాయ్ తాగిన తర్వాత జేబులో డబ్బుల కోసం తడుముతున్నట్టు చేసి, "ఏయ్ అమ్మా, గంగమాళవ్వ, నా పెండ్లాం పొద్దున్నే నా జేబులో ఉన్న డబ్బంతా తీసుకున్నట్టుంది. రేపు పొద్దున్నే వచ్చి ఇచ్చి వెళతానమ్మా. ఆంజనేయస్వామి మీద ప్రమాణం" అని పెద్దగా నోరుతెరిచి అన్నాడు. గంగమాళవ్వకు పూజారి కొత్త కాదు. అతను దేవుడి మీద చేసే ప్రమాణాలు కొత్తవి కావు. అయితే జనంలో అతని మర్యాద తీయటం బాగుండదని, "పూజారయ్యా, ఎన్నో సార్లు దేవుడి మీద ప్రమాణం చేశావు. మీ సేవాభాయ్ మీద ప్రమాణం చేయవు. మా దేవున్ని మధ్యలో తెచ్చి కష్టాల్లో చిక్కుకుంటావు. జాగ్రత్త". పూజారికి సమస్య పట్టుకుంది. అయితే ఘటికుడు వల్ల, "ఏయ్, ఏమిటమ్మా అలా అంటావు? ఏదో అవసరం ఉండటంతో వచ్చాను. నేనేమైనా వంద కిలోమీటర్ల దూరంలో ఉన్నానా? తట్టుకొని పడితే మా ఊర్లో ఉంటాను. అంత దగ్గర్లో ఉంది మా ఊరు. ఇలా ఎందుకు మాట్లాడతావ్ గంగమాళవ్వ. నీవేమైనా తెలియనిదానివా?" అని ఆమెను మాటలతో మభ్యపరిచి అక్కడి నుంచి బయల్దేరాడు. ఉప్పార చౌడప్ప ఇంటికి

వెళ్లడానికి దళారి దురుగ్యాను పిలిచాడు. అతను అప్పటికే ఎవరిదో గేదె అమ్మిపెట్టే విషయంలో మధ్యవర్తిగా వెళ్లాడు. ఇక వ్యాపారం అయిపోతుందన్నంతలో పూజారి దగ్గర నుంచి పిలుపు వచ్చింది. ధరను నిర్ణయించినవాడు "ఇప్పుడే వస్తాను" అని చెప్పి పూజారి దగ్గరికి పరిగెత్తాడు.

చౌడప్ప ఇంటి ముందు వసారాలో ఎవరి అనుమతి అడగకుండా వెళ్లి కూర్చున్నాడు పూజారి. "చౌడప్పా, ఏయ్ చౌడప్పా" అని అరిచాడు. ఆ సమయంలో రొట్టెలు తిని చేతులు కడుక్కుని నీళ్లు తాగుతున్నాడు చౌడప్ప. పూజారిని చూడగానే 'అరే వీడు గుడదహట్టి పూజారి. ఎందుకు వచ్చాడు?' అని అనుకున్నాడు. నోటిలో నీళ్లు పోసుకొని పుక్కిలించి ఉమ్మి, తువ్వాలుతో చేతులు, నోరు తుడుచుకుంటూ వసారాలోకి వచ్చాడు. "రావయ్యా మహానుభావా, చాలా సేపటినుంచి ఎదురు చూస్తున్నాను. నువ్వు చూస్తే అంతఃపురంలో హాయిగా కూర్చునివున్నావు" అని ఎలాంటి సంకోచం లేకుండా అన్నాడు పూజారి. "ఎక్కడ అంతఃపురం పూజారప్ప, పొలం నుంచి ఇప్పుడే వచ్చి రెండు రొట్టెలు తిన్నాను" అని అన్నాడు చౌడప్ప. పదిహేను ఎకరాల పొలానికి ఒకే సర్వర్ నెంబర్. మొత్తం పొలం అరచేయిలా శుభ్రంగా ఉంది. వర్షం కురిస్తే ఒక్కచుక్కకూడా పక్కకు పోకుండా భూమి సమతతలంగా ఉంది. పంటలు పండక బాధపడుతున్న ప్రతి ఒక్క రైతుకు పొలం ఉంటే ఇలా వుండాలని అనిపిస్తుంది. చౌడప్ప అన్నదమ్ముల గొడవల్లో పొలం అమ్మవలసిన అనివార్య పరిస్థితి వచ్చిందే తప్ప వాళ్లు పొలాన్ని అమ్మే వ్యక్తులుకారు. గుడదహట్టిలో చెపుకోదగ్గ వ్యక్తిలా ఉన్న ఉప్పార హులువప్ప మాట ఒకప్పుడు దర్జాగా సాగేది. ఇప్పుడు బొక్కబోర్లాపడింది. దిన్నిసాయిబు ఇంటి నిండా పిల్లలు. ఎంత సంపాదించినా; ఏమీ ప్రయోజనం లేదు. దళారి యంక, సణ్ణీర అతని ఆరేడుమంది పిల్లలసంపాదనతో దర్పం చూపిస్తున్నారు. అయితే అతనికి ఇదంతా గుర్తుకు రావడంలేదు. పైవీధి చౌహాన్ తెగవారు ఈ కరమ్‌తోట్‌లకు బుద్ధిచెప్పాలని ఊరకూరకే వచ్చి పొలం వ్యాపారంలో తలదూర్చి ధర పెంచారే తప్ప పొలంకొనే శక్తి లేదు. పూజారి ఎంత ప్రయత్నించినా చౌడప్ప మాత్రం లొంగలేదు. "ఏయ్ చౌవుడా! ఇంతదూరం నిన్ను నమ్ముకొని వచ్చాను. నువ్వు చూస్తే మాట వినటం లేదు" అని కోపంతో అన్నాడు పూజారి. "నిజం ఉంటే నేనే నిన్ను పిలుస్తాను" అని జారుకొన్నాడు. అతను అలా చెప్పడానికి కారణం ఉంది. పూజారిలాంటివాడు మొత్తం ఊరంతటికీ తెలుసు. అతను సత్యం తప్ప అన్నీ చెబుతాడు, అన్నీ చేస్తాడు. అందువల్ల అతని గురించి జనం అంతగా తల పాడుచేసుకునేవారే కాదు. పూజారికి ఏమనిపించిందో ఏమో,

లేచి తువ్వాలు దులుపుకొని అక్కడి నుంచి బయలుదేరాడు.

భగన్యనాయక్ మాత్రం సరిగానే పట్టు బిగించాడు. చౌడప్ప, అతని అన్నదమ్ములు తిరగనట్టయ్యారు. కుడిపక్కన, సేవాభాయ్ గుడి పక్కన, గుడదమ్మ గుడి కట్టమీద జనం నిండిపోయారు. గుడదలే, దొంబలూరు, నారదపుర, శంకరనట్టి, చోళిహట్టి, చాంగలాపుర, హొసు క్యాంప్, దేగూర, దణ్ణాయనహట్టి, సొన్నాపుర, సంగనహళ్లి, గౌరిహళ్లి, గపనూర, కోటిపుర, కోకటనూర, కోటితండా, కవలూరు తండాల జనం ఎలాగో విషయం తెలుసుకుని అక్కడికి వచ్చి ఆ గుంపులో కిక్కిరిసి నిలబడ్డారు. సర్వతప్పభట్టుగారికి తల తిరిగిపోయింది. భగన్యనాయక్ పొలం వ్యాపారం పరిష్కారం కావడం అసాధ్యమని ఆలోచనలోపడ్డారు. అయినా అతని అదృష్టంలో అదే పొలం రాసివుంటే, మహిరావణుడు వచ్చినా తప్పించలేడని తనకు తాను నచ్చ చెప్పుకొని జనం మాటలు వినసాగారు. నారదపుర చాకలి కెంప మాత్రం అందరికన్నా ముందు లేచి, "శాంతించండి, మాట్లాడకండి. పొలం తీసుకోవడానికి మేమూ వచ్చాం. చౌడప్ప ఏ రేటుకు ఇస్తాడో నేను అదే రేటుకు కొనడానికి సిద్ధంగా ఉన్నాను. హొసుక్యాంప్ చింప్లా, శంకరహట్టి శంభులింగ, చోళిహట్టి థావు, చాంగలాపుర కడిమనె కొరెప్ప, గౌరిహళ్లి బందాసాబ్, గణపనోరు కాద్రిసాబ్, కాటిపుర సాకవ్వ కొడుకు సంకప్ప, అంతేకాకుండా ముఖ్యంగా గుడదహట్టి తాండా పూజారప్ప, తండా నాయకుని కొడుకు భీమ్లా నాయక్, దళారి యంకన్న, తమ్ముడు సణ్ణీర కుడా ఉన్నారు" అని అన్నాడు. కావాలనే భగన్యనాయక్ పేరు ప్రస్తావించకుండా మాటలు కొనసాగించి, "ఊఁ చౌడప్ప, ఇంకా వచ్చేవారు ఎవరు కనిపించడం లేదు. మొదలు పెట్టు. ఎవరికి తాకత్తు ఉంటే వాడు తీసుకుంటాడు. చూద్దాం. ఎవరికి ఎంత దమమ్ముందో?" అని ఒక రాయి మీద కూర్చున్నాడు చాకలి కెంప. కెంప మాటలు చౌడప్పకు నచ్చలేదు. ఎందుకంటే తానే స్వయంగా వెళ్లి భగన్య నాయక్‌కు పొలం అమ్ముతామని చెప్పివచ్చాడు. అన్నదమ్ముళ్లు కూడా మాట్లాడుకున్నారు. తమ భూమి ఒక యోగ్యుడికి దక్కాలని వారి అభిప్రాయం. అయితే అమ్మకం రోజున దాని చిత్రమే మారిపోయింది. వంద, రెండువందల మంది చుట్టుపక్కల పదహారు మైళ్ల దూరం నుంచి వచ్చారు. ఎవరి అదృష్టం ఎలా ఉందో? ఎవరికి అన్నం రుణం కలిసివస్తుందో వారికి పొలం దక్కుతుందని చౌడప్ప మనసులోనే సమాధానపడ్డాడు. "వినండి మేము పొలం అమ్ముతున్నామంటే దాని అర్థం ఎలాగైనా ఎవరికైనా అమ్మడానికి వచ్చామని కాదు. మాకు అలాంటి పరిస్థితి రాలేదు. అయితే ఏదో ఒక చిన్న సమస్య ఉంది. అందుకే అమ్మకానికి పెట్టాం. దీని

అర్థం మేము దివాలా తీశామని కాదు. శంకరట్టి నుంచి గుడదహట్టి తండాకు వచ్చి వ్యవసాయం చేసి పంట పండించడం ఇబ్బందిగా ఉంది..." అని అన్నదమ్ములు తొమ్మిది మందిలో బుద్ధిమంతుడుగా పేరు తెచ్చుకున్న చౌడప్ప అన్నాడు. అన్నదమ్ములు చౌడప్ప మాటలకు బద్ధులన్నది స్పష్టం చేశాడు. హరక్కూ సాయిబు వేలం పాట పాడటానికి నియమించబడ్డాడు. అతను లేచి జనం మధ్యకు వచ్చి, "చౌడప్ప పొలం సర్కార్ సవాల్" అని అంటుండగా చాకలి కెంప "ఎకరానికి నూర్రూపాయలు" అని గర్వంగా అరిచి, ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. "చూడండన్నా, చాకలి కెంప పాట ఎకరానికి నూర్రూపాయలు. ఒకసారి..." అని అంటుండగానే, హొస క్యాంప్ చింప్లా "నూటొక్కటి" అన్నాడు. వెంటనే చాంగ్లాపుర కోడెప్ప ఎనిమిది అణాలు పెంచి "నూటొక్క రూపాయిన్నర" అని కూర్చున్నాడు. డబ్బులంటే ప్రాణాలే ఎగిరిపోయే కాలం, కూలీకి పోయినా అణా, దమ్మిడి దొరికేకాలంలో నూరు రూపాయలు అంటే ఒక కల. అలాంటప్పుడు, ఎక్కడెక్కడో తిరిగి వాళ్లకు వీళ్లకు టోపీ పెట్టి అయిదు వందలు, వెయ్యి చేతిలో పెట్టుకున్న చాకలి కెంప 'ఈ లంబాడి ఏం తీసుకుంటాడనే భ్రమతో 80 లేదా 85 రూపాయలకు ఖరీదు చేసే పొలాన్ని 'నూరు' అని అరిచి, అందరి దృష్టి మరల్చడానికి చూశాడు. చివరికి పాట 110కి చేరటంతో డబ్బులు ఎలా సమకూర్చాలని ఆలోచిస్తూ కూర్చున్నాడు. గౌరిహళ్లి బందాసాబ్ 109 అన్నప్పుడే భగన్యనాయక్ ఉలిక్కిపడ్డాడు. అప్పటిదాకా ఉత్సాహంగా ఉన్న కెంప భగన్యనాయక్ 110 అనేసరికి నోరు మూసుకొని కూర్చో అన్నాడు. 110 అని అరవడం విని బిత్తరపోయాడు. ఈ లంబాడి కొడుకు కోసం ఈ పాటకు వచ్చాడు. ఎలాగైనా అడ్డుపడాలని చూస్తున్నాడు. భగన్యనాయక్ 110 అని కేకవేసి గుంపులో ఆశ్చర్యం కలిగించాడు. చాకలి కెంప, 'పర్వాలేదు, ధైర్యముంది కొడుక్కు ఈ కొడుక్కి ఎంత ధైర్యం ఉందో నేను చూస్తాను' అని తన అనుచరులతో మాట్లాడుతుండగా హరక్కూ సాయిబు "సర్కార్ సవాల్ 110 ఒకసారి, రెండోసారి, మూడోసారి" అని "పొలం భగన్యనాయక్ చెందింది. పాట ముగిసింది" అని చెప్పి కూర్చున్నాడు. "ఏయ్ నేను పాడుతాను. ఏయ్ హరక్కూ ఎందుకురా పాట ముగించావు?" అన్నాడు. "ఏ కెంపన్నా, మాదేముంది. భగన్య నాయక్ నసీబ్‌లో ఉంది. పోయి గొర్రెతల మాంసం తిని రెండు బాటిలు సారాయి తాగి పండుకో" అని ముఖం మీద అన్నాడు. భగన్యనాయక్ దగ్గరికి పోయి "అన్నా, పదిరూపాయలు ఎక్కువ అయింది. దేవుడున్నాడు భయపడకు" అని సవాల్ పాట పాడినందుకు రూపాయిన్నర తీసుకొని అక్కడి నుంచి బయలుదేరాడు. "క్యాబే, సారాయి తాగమని

నాకే చెప్తావా? నా కొడకా? పొగరా" అని హరక్కా సాయిబు కాలర్ పట్టుకున్నాడు. తనకు జరిగిన అవమానం కనిపించనీయకుండా నాటకం ఆడసాగాడు. "ఎవడ్రా భగన్యనాయక్? వాడి దగ్గర ఏముంది రా చూస్తాను" ఎగరసాగాడు. అదే సమయంలో భగన్యనాయక్ తమ్ముడు ఫక్కీర, తండాలో పెళ్లి చేసిచ్చిన అతని పెద్ద చెల్లెలు హోమ్లి పరిగెత్తుకుంటూ వచ్చారు. "అన్నా, అమ్మ చనిపోయే ముందు..." అని మొదలుపెట్టింది. "అన్నా మాకు ఒక్కొక్క ముక్క భూమి ఇస్తే మేము మీలా బ్రతుక్కుంటాం" అని బతిమిలాడింది. అతని తల్లి చనిపోయేటప్పుడు,"చూడు నాయనా, ఈ కరమ్‌తోట్ వంశంలో పుట్టినవారు మీ నలుగురు, ఒక చెల్లెలు వేరే ఊరిలో వుంది. మీరు ముగ్గురు కలిసి ఉండండి. ఫక్కీర బోళాశంకరుడు. వాణ్ణి బాగా చూసుకో. నువ్వు ఏమి ఆస్తి సంపాదించినా అందులో ఒక పావు భాగం ఇవ్వు" అని మాట తీసుకుంది. అందువల్లనే పదిహేను ఎకరాల పొలంలో మూడున్నర ఎకరాలు చెల్లెలికి, మూడున్నర ఎకరాలు ఫక్కీరకు, మిగిలిన ఏడు ఎకరాలు తానే పెట్టుకోవాలని భగన్యనాయక్ అనుకున్నాడు. డబ్బులు కట్టి పత్రాలు తన దగ్గరే పెట్టుకున్నాడు. వచ్చిన జనం మంచిదయిందని, కష్టపడేవాడికి పొలం దక్కిందని సంతోషపడి తమ ఊళ్లకు వెనుతిరిగారు. మరికొంతమంది చౌడప్ప మోసం చేశాడు. సర్వతప్ప మోసం చేశాడు. అతను మోసం చేశాడు, ఇతను మోసం చేశాడు అని శాపాలు పెడుతూ ఒక పెద్దగుంపు కట్టుకొని తమకు కలిగిన నిరాశను పంచుకున్నారు. భగన్య, సర్వతప్పల మీద నిందలు వేయడానికి ప్రయత్నించారు. భగన్య, సర్వతప్ప, చౌడప్పలు ఒక్కటై, తమ ఆటలు సాగకపోవటంతో తిట్టుకుంటూ ఇంటికి వెళ్లారు.

పొలం కొనుక్కున్న తర్వాత భగన్యనాయక్ ఇంకా ఒంటరి అయ్యాడు. శత్రువుల సంఖ్య మరింతగా పెరగసాగింది. పూజారి హింస పెరిగింది. 'అబ్బా ఊరొదిలి పారిపోయి వచ్చిన బికారి' అని పూజారి గొర్రె మీద, కోళ్ల మీద నెపం పెట్టి తిట్టసాగాడు. అతని కోపం ఎక్కువ కావడానికి మరొక కారణం, ఫక్కీర అతని సహవాసాన్ని వదిలిపెట్టాడు. వీళ్లు ముగ్గురూ ఒకటైతే మొత్తం ఊరిని నాశనం చేస్తారని ప్రజలలో చెడు ప్రచారం చేయసాగారు. కొంతమంది పూజారి మాటలకు వత్తాసు పలికారు. మరికొంతమంది భగన్య కచ్చితమైన మనిషి అన్నారు. కానీ జనానికి ఏదో ఒక వార్తకావాలి. అయితే తన కష్టంతో అభివృద్ధిలోకి వస్తున్న భగన్యను ఎలాగైనా నాశనం చేయటానికి పొంచివున్న వ్యక్తులను ఎలా నియంత్రించాలి?

పొలం కొన్న తర్వాత చేతిలో డబ్బులులేక భగన్యనాయక్ ఇబ్బంది పడసాగాడు.

ఒక పంట చేతికి దొరికేవరకు చాలా కష్టమైంది. ఇంటి నిండా పిల్లలు. అందులో కొందరు సంపాదించే వయసుకు వచ్చారు. మరికొందరు ఇంకా చిన్నవారు. అతని పెద్ద కూతురు జీతిబాయి పన్నెండేళ్లకే పెళ్లిచేసుకుని భర్త ఇంటికి పోయి సంసారం చేసుకుంటూ ఉంది. పదహారేళ్ల వయసులోనే ఒక ఆడపిల్లను కన్నది. అదే సమయంలో కాలువలకు నీటి సౌకర్యం లభించింది. వర్షాలు లేక పంటలు లేక భిక్షం ఎత్తుకొంటున్న వాళ్లకు జీవనాధారం దొరికినట్టయ్యింది. రైతుల కష్టానికి ఫలితం దొరకసాగింది. దాంతో వాళ్లంతా ఇప్పుడు సుఖమైన జీవితం గడపసాగారు. చుట్టూ రెండు మూడు తండాల జనాలను ఎవరూ పట్టలేకపోయారు. జీతిబాయి భర్త సేవానాయక్‌ది ఎనిమిది ఎకరాల వరిపొలం. పొలంలో వేరుశెనగ వేశాడు. కెనాల్ వచ్చిన తర్వాత మొదటిసారి పంట విస్తారంగా పండింది. ఒక్కొక్క చెట్టుకు నూటాయాభై గుత్తుల వేరుశెనగ దిగబడి వచ్చింది. తెంచి, వొలిచి, రాశి పోయడం దుస్తరమైంది. చుట్టూ నీరావరి పొలాలు కావడం వల్ల ప్రజలు ఎక్కడివారు అక్కడే పనులకు కుదురుకున్నారు. కొందరు శనక్కాయలు పెరకడానికి గుత్తకు ఇచ్చారు. మరికొందరు గుత్తకు ఇస్తే సరిగ్గా పని చేయరని కూలీ ఇచ్చి చేయించుకున్నారు. మరికొంతమంది అయిందికానీ అని గుత్తకు దొరికితే గుత్తకు, కూలికి దొరికితే కూలికి పెట్టుకున్నారు. వేరుశెనగ గుత్తులను పెరికి, ఆరవేయసాగారు.

వేరుశనగ నాటినవాళ్లు, కూలీ చేసేవాళ్లు లేక ఎర్రటి ధూళి ఎగిసితే గుండె వణకసాగాయి. ఎర్రటిధూళి వచ్చిన వెనువెంటే తొలకరి ఆర్భాటం చూపిస్తోంది. తొలకరి మొదలైతే నేలలోని వేరుశెనక్కాయలు మొలకెత్తాయి. అందువల్ల జనం గాభరపడ్డారు. అయితే భగన్యనాయక్ అదృష్టం ఆరుమంది అల్లుళ్లు, నలుగురు కోడళ్లు, మొత్తం ఇంటివాళ్లు బండ్లు కట్టుకుని నెలరోజులు అక్కడే మకాం పెట్టారు. చిమణిబాయి ఇంటిపని అయింది. పొలంలో పనికూడా పూర్తయింది. పొలమంతా పెరికి, బాగు చేసి, నాలుగు చినుకులు పడిన వెంటనే దున్ని పొలంలో ఎరువులు చల్లారు. ఆ రోజు సాయంత్రం ఇంటి ముందు తాను ఆరవేసిన ఒక సంచి వేరుశెనగలు వేసుకొని, ఎద్దుల మేతకోసం గడ్డిమోపులు వేసుకుని, తమ ఊరివైపు ప్రయాణమయ్యారు. ఇది దాదాపు ఎనిమిది సంవత్సరాలుగా ఆగకుండా సాగుతోంది. సేవానాయక్ పేరు చుట్టుపక్కల జనంనోట నానుతోంది. సంవత్సరానికి ఒక ఎకరంపొలం, ఒక జత మంచి ఎద్దులను కొనుక్కునేవాడు. అతని సోదరుడు ఇద్దరు మగపిల్లలను, ముగ్గురు ఆడపిల్లలను వదిలి చాలాకాలం కిందటే చనిపోయాడు. అనాథలైన అతని పిల్లలను తెచ్చి తానే సాకాడు. అతనికీ చిన్న చిన్న

పిల్లలు. ఇంటి నిండా అల్లరి. సంవత్సరానికి ఒకటన్నట్టు ఇంటి నిండా ఎనిమిది మంది పిల్లలు. పెద్దవాడు పుట్టగానే జబ్బుతో పుట్టాడు. రెండోది చామి. మూడోవాడు సంక. నాలుగోవాడు చాప్ల. ఐదోవాడు జింగాలు. ఆరు, ఏడు అమ్మాయిలు. ఒకరిని తప్పితే ఒకరిని ఆసుపత్రికి తీసుకోవాలి తీసుకెళ్లాలి. శంబణ్ణ డాక్టర్ సర్కిల్లో సొంత క్లినిక్ పెట్టుకున్నాడు. డాక్టర్ దగ్గర ఇతనిది ఒక ఖాతా ఉంది. వారంలో నలుగురైదుగురు ఆసుపత్రికి వచ్చేవారు. ఎప్పుడు చూసినా ఆసుపత్రి. డాక్టర్ దగ్గర ఇతని ఖాతా ఉండటం వల్ల జబ్బులు రావడం ఎక్కువయ్యాయో లేదా జబ్బులు రావటం వల్లనే ఖాతా పుట్టిందో అర్థంకాక డాక్టరే తబ్బిబ్బయ్యాడు. వేరుశనగ అమ్మిన తరువాత షావుకారు కొట్టులో చెసిన అప్పు తీర్చాడు. 'దానికి దీనికి సరిపోయింది' అన్నట్టు ఉండేది. మళ్లీ తొలకరిపంటకోసం చేసిన అప్పు నోరుతెరుచుకొని ఉండేది. అతని తాగే అలవాటు. ప్రతిరోజు సాయంత్రం సారాయి కావాలి. ఇక సంపద వుండటం సాధ్యమా? ఇంట్లో వచ్చిపోయేవాళ్ళ గుంపు. చిమణిబాయికి పొయ్యిముందు నుంచి లేవడానికి కుదరనంత పని. ఆమె పెద్ద కూతురు ఛామి. అంత పెద్దదేమీ కాదు. పొయ్యి ముందు కూర్చుని పనిచేసే స్థితిలో లేదు. చిమణిబాయి ఆడపడుచు పింగాణి భర్త ఇంట్లోనూ, పుట్టింట్లోనూ పనిచేయాలి. వంట కూడా చేయాలి. జీవ్ల పింగాణి భర్త. అన్ని పొలాలకు నీళ్లు పారించాడు. నిద్ర చెడి ఇంటికి వచ్చి ఒకట్రెండు గంటలు నిద్రపోయి, మళ్లీ అల్లుడి పొలాలకు నీళ్లు పారించడానికి వెళ్లేవాడు. ఎర్రగా ఉండే పింగాణి వెనక ఇంటి శక్ర్యా మీద ఎప్పుడు కన్ను వేసిందో ఏమో! తెల్లవారగానే చాయ్ తాగుదామని ఇంటికి బయలుదేరినవాడు తన ఒంట్లో బాగాలేదని, తిరిగి పొలానికి వెళ్లినవాడు శాశ్వతంగా నిద్రలోకి జారిపోయాడు. కాసేపు ఏడుపు నాటకం, చనిపోయిన వ్యక్తి గుణగానాలు సాగాయి. కాలం ఎవరికోసం ఆగదు. జనం జీవ్లను మరిచిపోయారు. అయితే సేణు పరిస్థితి గంభీరం అయింది. వరిపొలాలు ఎండిపోయాయి. అంతా తనదేనన్నట్టు శ్రమిస్తున్న మనిషి ఉన్నట్టుండి శవమయ్యాడు. జనం మాట్లాడుకున్నారు. సమాజంలో చెలరేగిన నిందలు అనుకొని మౌనంగా ఉండిపోయారు.

తనను మించి తన కూతురు చిమణి తన కంటి ఎదుట ఐశ్వర్యాన్ని అనుభవిస్తున్నందుకు భగన్యనాయక్ చాలా సంతోషపడ్డాడు. ఎంతైనా తనవి నీరావరి భూములు కావు. తొలకరి వర్షం బాగా కురిస్తేనే పొలాల్లో పంట కనిపించేది. లేకపోతే పశువులు మేత లేకుండా నకనకలాడవలసి వస్తుంది. అలాంటప్పుడు వర్షం తగ్గితే ఒకట్రెండు కెనాల్లో వచ్చే నీళ్లను కట్టి, తన పొలాలకు మళ్లించటంతో

పంట బాగా పండింది. దాంతో ఊరికంతా సేణు చిన్నషావుకారని అనిపించు కున్నాడు. చిమణి మాత్రం పుట్టింటివారనే ములాజు లేకుండా అందరిని పనిమనుషుల్లా చూసేది. ఆరేడేళ్లు సంవత్సరాలు అన్నిటినీ భరిస్తూ కుటుంబ సమేతంగా అల్లుడి పొలానికి వెళ్లి పనిచేసేవారు. రాను రానూ కూతురు ప్రవర్తనతో విసిగిపోయి ఇకపై ఆ ఇంటికి వెళ్లి అవమానింపబడటం సమంజసం కాదనుకున్నారు. వెళ్లడం మానేశారు. చిమిణి మనిషి చేత కబురు పంపినా ఎవరూ వెళ్ళటానికి ఇష్టపడలేదు. తన పొలంలోనే పనులు ఎక్కువగా ఉన్నాయి.

ట్యాంక్ కొడుకు సాంకోల అప్పటికే పనిలోకి చేరాడు. రెండో కొడుకు జాంబు బడికి పోతున్నాడు. మూడోవాడు తల్లి పాలు తాగుతున్నాడు. రెండో అమ్మాయి పెద్దమనిషి అయ్యింది. మరొక పిల్ల సుమారుగా ఉంది. భగన్యనాయక్ మూడోకొడుకు బదియా అంతో ఇంతో చదువుకున్నాడు. వాడి తర్వాత పుట్టిన నాలుగోవాడు చోకిబాలు. అతను మంచి అమ్మాయి అని మేనమామ కెంప్యా నాయక్ కూతురు పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కొడుకు ఎలాగో మెట్రిక్ పాసయి మాస్టారు అయ్యాడు. రెండవవాడు బడి వదిలి తండాలో భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. పెద్ద కూతురు పెళ్లి వైభవంగా జరిగింది. ఆమెకూడా అత్తవారిమటికి వెళ్లిపోయిన తర్వాత ఇంటి పనుల ఒత్తిడి తగ్గింది. తన చదువు, ఉద్యోగ విషయంగా పెళ్లి చేసుకోకుండా ఉండిపోయిన బదియా నాయక్ సర్కార్ నౌకరి కోసం తిరిగి తిరిగి చివరికి ఏదో ప్రైవేట్ నౌకరి పట్టుకున్నాడు. అయితే సర్కారీ నౌకరి చేస్తున్న అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. కేవలం అమ్మాయిలే పుట్టడం వల్ల మగబిడ్డ కోసం వెయ్యి ముడుపులు కట్టాడు. పదిమంది ఆడపిల్లలను కన్న తర్వాత, చివరికి పన్నెండవ కాన్పులో మగబిడ్డ పుట్టడంతో మొత్తం కుటుంబం సంతోషపడింది. బదియా తర్వాత జేమ్లు, హామ్లిల పెళ్లి చేయటం అనివార్యమైంది. మగపిల్లలకు పెళ్లిళ్లు కాస్త సంవత్సరం అటూఇటూ అయినా పరవాలేదు. కానీ అమ్మాయిల పెళ్లిళ్లు ముందుగానే జరగాలి. అప్పుడే మర్యాద ఉంటుందని భగన్య దంపతుల వాదన. ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన మర్యాద మట్టిపాలు కాకూడదన్నది భగన్య భార్య ఆమె ఆలోచన. అందువల్ల దూరపు బంధువుల అబ్బాయి సమణా నాయక్‌కు ఇచ్చి పెళ్లిచేసిన తర్వాత జేమ్లు పెళ్లిచేశారు. వీళ్లందరికీ ఒకరిద్దరు పిల్లలుపుట్టే సమయానికి టాంక్యా పెద్దకొడుకు సాంకోల పెద్దవాడయ్యాడు. రెండో కూతురు పీకే పెళ్లికి వచ్చింది. నేను ఈ ఇంట్లో ఇంతగా ఉన్నప్పటినుంచి శ్రమపడ్డాను. నా కూతురును సర్కారీ నౌకరి చేసేవాడికి ఇచ్చి పెళ్లిచేయాలని

టాంక్యా, అతని భార్య పట్టుబట్టారు. భగన్యనాయక్‌కు పెద్ద కుటుంబాన్ని నిర్వహించడం ఒక సమస్యగా మారింది. అతనికి కావలసినంత భూమి ఉంది. సొంతంగా సంపాదించాడు. అయితే ఒక్కోసారి అతివృష్టి లేదా అనావృష్టి వల్ల చేతికి పంట దొరకడం అంతంత మాత్రమే. ఏనుగు కడుపుకు అరకాసు మజ్జిగ అన్నట్టు ఉండేది సంసారం.

నానా ఇబ్బందులు వేధించసాగాయి. పని చేసేవారు తక్కువ, తినేవారు ఎక్కువ అన్నట్టుంది పరిస్థితి. సమతుల్యత తప్పింది. ఒక సంవత్సరానికి ఒకరి పెళ్లి చేస్తే, మరొక సంవత్సరం ఒక ఎకరం కొనేవాడు. అయినా అతని మీద ఉన్న భారం తగ్గేది కాదు. ఇంట్లో పిల్లలు మనవళ్లు కిక్కిరికిపోయారు. ఒకరి కాలు మీద ఒకరి కాలు. ఇంట్లో తిరగడానికి కూడా సాధ్యం కానంతగా కిక్కిరిసి ఉండేవారు. అందువల్ల అప్పుడప్పుడు గొడవలు జరిగేవి. ఇంతమంది జనంతో ఉన్న ఉమ్మడి కుటుంబంలో నలుగురు అమ్మాయిల పెళ్లిళ్లు చేసిన భగన్యనాయక్. వాళ్ల సంసారం, వాళ్ల పిల్లలతో సంసారం అడవిపొదలా విస్తరించింది.

ఎలా అరవై ఏళ్లు గడిచాయో, ఎలా వున్నారో, ఎలా తిన్నారో మొత్తానికి అందరూ తమపాటికి తాము ఎలా పెరిగిపెద్దవారయ్యారో ఎవరికీ అర్థం కాలేదు. సోమ్లా , జాంప్ల ఇంకా విద్యాభ్యాసం చేస్తూ ఉండగానే రాష్ట్ర రాజకీయాల్లో ఒక పెద్ద అనాహూతం తలదూర్చింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించింది. అన్నిచోట్ల సారాయి ప్యాకెట్‌ల దాడి. కొందరు తండా మంది తమ పాత అలవాటు ప్రకారం భట్టి సారాయి అమ్మటం ప్రారంభించారు. మద్యం నిషేదించిన తర్వాత సారాయి మీదనే బతుకు తెరువును పెట్టుకున్న గుడదహట్టి పైవీధి రామా నాయక్, వెనుక వీధి జీవప్ప, కింది వీధి సపోళియా, బేస్త మంగు, ముగ్గుపిండి అమ్ముతున్న దుగ్గాణి నాయక్ సారాయి తాగిన వారంలోనే చనిపోయారు. జనం సారాయిలో విషముందని వాదించారు. అయినా తాగుబోతుల వ్యసనం తగ్గలేదు. ఒకే వారంలో తండాలో ప్యాకెట్లు వేలకువేలు పెరిగాయి. ఒక తాలూకాలో కనీసం నలభై తండాలు. వంద, రెండువందల పల్లెలు. తాలూకా కేంద్ర ప్రదేశం కలుపుకొని రెండు మూడు లక్షలరూపాయల వ్యాపారం జరిగేది.

అదే సమయంలోనే భగన్యనాయక్ కుటుంబంలో అంతర్గత కలహాలు ఉత్పన్నమై విస్ఫోటనం చెందింది. బదియా కొద్దోగొప్పో చదువుకుని ఉద్యోగంలో చేరుకొన్నాడు. తన తమ్ముళ్లు చదువుకొని పైకి రాలేదని బాధపడ్డాడు. తన తొమ్మిదవ తమ్ముడు సోమ్లను తన వెంట పిల్చుకునిపోయాడు. అతను ఎంతోకొంత

చదువుకొన్నాడు. చిన్నవాడైన జాంప్ల పదిసార్లు ఫెయిలై, ఉన్నట్టుండి బుద్ధి తెచ్చుకున్నట్టు చక్కగా చదువుకోసాగాడు. అదే సమయంలో వృద్ధుడైన భగన్యనాయక్ పొట్టలోని రాయి అతని అనారోగ్యానికి కారణమైంది. అతన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆ కారణంగా టాంక్యా, జేమలు ఒకవైపు అయితే, కేమ్యా, అతని భార్య భీమి మరొక వైపు అయ్యారు. జేమ ఇంటి బాధ్యత తీసుకున్నాడు. సంవత్సరంలో వచ్చిన పూర్తిపంట లెక్క ఇవ్వలేదని బదియా తండ్రి దగ్గర చాడీలు చెప్పాడు. ఆస్తి పంచడమే మంచిదని తండాలో చెబుతూ తిరిగాడు. ఇది తారాస్థాయికి చేరింది. టాంక్యా, జేమలు వయసుదాటిన భగన్య, చావళిల మీద చేయి చేసుకున్న కారణంగా ఇల్లు దిక్కు లేకుండా పోయింది. బదియా లోలోపల కుట్ర రూపొందించాడు. దానికి తోడుగా భగన్యనాయక్ విరోధులు కుటుంబంలో చిచ్చుపెట్టి బయట నిలబడి సంతోషంగా చూడసాగారు.

నలుగురితో వేరుపడ్డ బదియా మరో నెలలో మరొకరిని బయటికి పంపాడు. సూర్యనాయక్, జంప్ల నాయక్‌లు కలిసి ఏదో చేసేస్తామనే ఉత్సాహంతో చాంప స్కూలు వదలవలసి వచ్చినప్పుడు, “అంతా నీ కోసమేనయ్యా. ఎందుకు ఆలోచిస్తావ్? చదువుకొని చేసేది అంతలోనే ఉంది” అని అతన్ని బుజ్జగించాడు. తర్వాత సూర్యనాయక్, “తల్లిదండ్రులను చూసుకుంటూ ప్రైవేటుగా ఏదైనా డిగ్రీ సంపాదించు. నా పొలాన్ని నువ్వే చేసుకో” అని అతని ఆశకు తిలాంజులు వదిలేలా చేశాడు.

సూర్యనాయక్ కూడా నౌకరీ దొరకక బతుకు తెరువు కోసం తిప్పలు పడుతున్నాడు. అక్కడక్కడ నౌకరి కోసం అర్జీలు పెడుతున్నాడు. చివరికి సూర్యనాయక్‌కు ఒక చిన్న ఉద్యోగం దొరికింది.

అతను అటు నౌకరికి వెళ్లాడు. ఇటు చాలా రోజుల నుంచి మంచం పట్టిన అతని తల్లిని ఆసుపత్రిలో చేర్చారు.

“నాయనా, నేను ఎక్కువ రోజులు బ్రతకను. ప్రాణం ఉన్నప్పుడే నాలుగు అక్షింతలు వేస్తాను. పెళ్లిచేసుకో” అని వలవల ఏడ్చింది.

సూర్యనాయక్‌కు దిక్కుతోచలేదు. బయటికి పోయిన ముగ్గురిలో మిగిలిన ఇద్దరికీ పెళ్లి చేయాలనే విషయాన్ని పట్టించుకోనప్పుడు, బదియానాయక్ ఒకటి రెండు చోట్ల తిరిగి అమ్మాయిని వెతికాడు. అయితే అతను చేసిన పెద్ద తప్పు ఏమిటంటే, సూర్యనాయక్‌కన్నా పదేళ్లు చిన్నదైన వందనా అనే అమ్మాయితో పెళ్లి చేశాడు.

❖❖❖



Courtesy: Tribal Museum Hyderabad,Telangana.

7. జీవన పోరాటం

సూర్యనాయక్ పరిస్థితి దయనీయంగా తయారైంది. అతను చెప్పేది ఆమెకు అర్థమయ్యేది కాదు. ఆమె చెప్పేది అతని అర్థమయ్యేది కాదు. మొత్తానికి సూర్యనాయక్ చిన్న ఉద్యోగంతోనే జీవితం ప్రారంభించాడు. ఉన్నత స్థాయికి చేరాలనే పట్టుదలతో ఉన్నాడు. అయితే ఇప్పుడు చేరిన విసుగు తెప్పించేది. అయినా ఆ ఉద్యోగాన్ని అయిష్టంగానే లాక్కొస్తున్నాడు. కొత్తగా ఉద్యోగంలో చేరడం వల్ల నెలకొక కాజ్యువల్ లీవ్, అది ఒక నెల ఉద్యోగం చేసిన తర్వాత అతని ఖాతాలో జమా అయ్యేది. అతనికన్నా తక్కువ చదువుకున్నవారు అతనిమీద అధికారం చెలాయిస్తున్నారు. అందువల్ల నౌకరి అంటేనే జుగుప్స కలిగేది. అయితే బతుకుతెరువు అనివార్యం. భార్య, పుట్టబోయే బిడ్డల కలలు ఒకవైపున ఉంటే, ప్రస్తుత స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలనే తపన మరొకవైపు. అలా కలలు కంటూ అత్యంత సూక్ష్మమైన అతని పనిలో చిన్నచిన్న పొరబాట్లు జరిగితే, అతని సహోద్యోగి ఫిర్యాదు చేసేవాడు. మరుసటి రోజు ఉదయం అది మీటింగ్‌లో చర్చింపబడేది. "ఏమండి, మీకు ఉద్యోగం చేయాలనే అభిప్రాయం ఉన్నట్టు లేదు" అని పైఅధికారి విమర్శించేవాడు. కాలిబొటనవేలు నుంచి తలవరకు పెరిగిన రక్తపు ఒత్తిడిని ఆపుకొని, "లేదు సార్, ఎందుకో కాస్త..." అనే కారణం చెప్పబోయాడు. "ఇది ప్రభుత్వసంస్థ నాయక్. చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈమధ్య చాలామంది అడగటం లేదు. ఒకవేళ అడిగితే మీ మీద ఎన్ని ఫిర్యాదులను నమోదుకావచ్చు, ఆలోచించండి" అన్ని జాగ్రత్తలు చెప్పి వాతావరణాన్ని తేలికపరచడానికి చూశాడు. అయితే ఇతరులు ఊరకే వదులుతారా? "అదేమిటండీ, పనిమీద ధ్యాస లేకుంటే ఎందుకు పనికి రావాలి?

మేము ఏ ఉద్యోగం వల్ల నాలుగుముద్దలు తింటున్నామో ఆ ఉద్యోగాన్ని ఇలా అగౌరపరిస్తే ఎలా?" పీకే కటువుగా అన్నాడు. పైఅధికారి సూర్యనాయక్ వైపు చూశాడు. సూర్యనాయక్ వచ్చిన కోపాన్ని అణచుకుంటూ, "ఇకపై అలా జరగదు సార్, ఏదో కొత్త ఉద్యోగం. సర్దుకోవడానికి కొంత కాలం పడుతుంది సార్" అని విసురుగా అన్నాడు. నిన్నమొన్న వచ్చినవాడు ఇలా గట్టిగా మాట్లాడుతున్నాడని పీకేకు విసుగు కలిగింది. అయితే అది కనిపించనీయకుండా మాటలు పొడిగించకూడదని "సరే, సరే, వెళ్లు, సాయంత్రం ట్రాన్స్మిషన్ బాగుండాలి" అని పంపాడు. "కచ్చితంగా సార్, మీ ఆశీర్వాదం ఎప్పుడూ ఉండాలి" అని లేచి బయటికి నడిచాడు. తను చదువుకున్న సాహిత్యానికి, ఇప్పుడు చేస్తున్న ఉద్యోగానికి ఏ మాత్రం సంబంధం లేకుండా శారీరకంగా పని చేస్తున్నాడు. అతనితోపాటు చదివినవారు; అతనికన్నా వెనకవున్న వారు ముందుకుసాగి మంచిస్థితిలో ఉన్నారు. ఇప్పుడు సూర్యనాయక్ చదువులో ముందుకు పోయినట్టు జీవితంలో అభివృద్ధికాకపోవడంతో మానసికంగా బాధపడుతున్నాడు. ఇప్పుడు అతని ముందు తాను ప్రజల మధ్యన గుర్తింపు ఎలా తెచ్చుకోవాలన్న ప్రశ్న ఉంది. తన తండ్రి భగన్యనాయక్‌లా ప్రజాభిమాని కావాలన్నది అతని కోరిక. తండ్రి పరంపరను కొనసాగించాలన్నది అతని అభిలాష. అందువల్లనే అలాంటి పరీక్షకు కావలసిన యాభైఎనిమది శాతం కోసం కష్టపడ్డాడు. కష్టానికి ఫలితం దక్కింది. పదిహేను రోజుల ఎర్న్‌లీవ్, మెడికల్ లీవ్ పెట్టి చదవడానికి కూర్చున్నాడు. తన కోసం ప్రత్యేకంగా ఒక గది అద్దెకు తీసుకొని, ఆ ఊళ్లో సంసారం పెట్టడం కుదరదని, హాస్టల్లో ఉన్న కొంతమంది స్నేహితులను కలుసుకోవడానికి ప్రయత్నించాడు."నేను పదిహేను రోజులు..." అని అంటుండగా "రావయ్యా, నువ్వు ఏమి మోసుకొని పోతావ్? లేదా ఎవరి తలలోని తెలివినేమైనా లాక్కుని పోతావా?" అని అతని స్నేహితులు హాస్యం చేశారు.

భార్యకు చెప్పి నాలుగు జతల బట్టలు తెచ్చుకొన్నాడు. లైబ్రరీలో,చర్చల్లో, పుస్తకాల్లో మునిగాడు. పదిహేను రోజులు కఠినంగా పరిశ్రమించాడు. ఉన్న చిన్నగదిలో రెండు మంచాలు. వాటి మీద ఇద్దరు. బయట నుంచి ఎవరైనా వస్తే మధ్యలో ఇద్దరు. వారి తలవైపు సూర్యనాయక్ పడుకునేవాడు. పదిహేను రోజులు అర్హత పరీక్ష గురించి చర్చ. దేశం గురించి చర్చ. ప్రజల గురించి చర్చ. ఇంకా ఏవేవో విషయాల గురించి చర్చలు జరిగేవి. ఒక్కొక్కసారి ఎవరో తాగివచ్చి చర్చను మరొక దిశకు మరలించి, చివరికి అది వ్యక్తిగతమైన చర్చకు దారి తీసేది. "ఏయ్, నీకేం తెలుసు?" అని ఒకరంటే, "రేయ్, నువ్వు చాలా తెలివైనవాడివిలేరా!" అని

తాగినవాడు అనేవాడు. చివరికి ఈ తాగుబోతు సహవాసం ఎందుకని మిత్రులంతా మౌనంగా ఉండిపోయేవారు. ఆ తాగుబోతు మిత్రుడు నిషా దిగేవరకు చెప్పులు వదిలే చోట ముడుచుకుని కూర్చునేవాడు. ఏ రోజైనా కుర్రవాళ్లకు కోడిమాంసం తినాలనిపిస్తే, "ఉద్యోగం చేస్తున్నవాళ్ళు ఉన్నారుకదా?" అని సూర్యనాయక్ వైపు చూపించేవాడు. సూర్యనాయక్‌కు ధర్మసంకటం. మిగిలినవారు తప్పనిసరిగా సగం డబ్బులు వేసినా మిగిలిన సగం ఇతని జేబు నుంచి చెల్లించవలసి వచ్చేది. దాన్నే గదిఅద్దెగా భావించి మౌనం వహించేవాడు. ఖర్చు తగ్గించడానికి ఎవరికీ తెలియకుండా వెళ్లి భోజనం, టిఫిన్ ముగించి వచ్చేవాడు. అతని పదిహేనురోజుల బడ్జెట్ కళ్లెం వేసేది. పరీక్ష ముగియగానే అప్పటివరకూ అనుభవిస్తున్న ఒత్తిడి అంతా తగ్గి సినిమా చూడాలని అనిపించింది. అర్ధరాత్రి ఒంటిగంటకు బస్సుఉండటం వల్ల గదిలో చోటిచ్చిన వాడికి కృతజ్ఞత చెప్పటానికి అతనితోపాటు సినిమా చూశాడు. చివరికి సూర్యనాయక్‌కు మిత్రులు వీడ్కోలు పలికి సాగనంపారు

సూర్యనాయక్ దిగ్భ్రాంతి చెందాడు. పద్దెనిమిదవ శతాబ్దం చివరలో జరిగిన విషాదాన్ని వంద సంవత్సరాల ఓ వృద్ధురాలు చెప్పిన కథ. కేట్ విన్సలెట్ సౌందర్యానికి మరులుపోనివారు లేరు. సూర్యనాయక్ తన మిత్రుడితోపాటు భోజనం చేసి, అతన్ని వాపస్ పంపి తాను వెళ్లాలనుకున్నాడు. పంజలూరుకు వెళ్లడానికి బస్సుకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

కళ్లను నిద్ర కమ్ముకుంటోంది. రాత్రి పదిగంటలయితే చాలు. అప్పటిదాకా మేలుకుని ఉండటమే ఎక్కువ. తర్వాత నిద్రపోకుండా వుండేవాడు కాదు. ఇంట్లో అందరూ కబుర్లు చెప్పుకుంటూవున్నా, ఇతను కూర్చున్న చోటే నిద్రపోయేవాడు. కబుర్లలో మునిగివున్నవారు అది చూసి, 'ఊఁ సూర్యుడు పడుకున్నాడు' అని తమలో తాము అనుకునేవారు. ఉదయం నాలుగింటికే లేచేవాడు.

బస్టాండ్ మూలలో కూర్చోని నిద్రలో తూలసాగాడు. ఏదో బస్సు సద్దు విన్న వెంటనే ఉలిక్కిపడి లేచి పక్కనున్న వారిని టైము అడిగి మరలా కనులు మూసుకున్నాడు. ఒకటింపావుకు వచ్చిన బస్సెక్కి పంజలూరుకు పోయాడు.

ఊరికి వెళ్లినప్పుడంతా హాస్టల్‌కు ఫోన్ చేసి అడిగేవాడు, ఈ రోజు, రేపు, మర్నాడు... కుతూహలం పెరగసాగింది. ఫలితాలు ఏమై ఉండవచ్చని కలవర పడేవాడు. తన జీవితపు కలను సాకారం చేయటానికి అబ్దుల్ ఖాదర్ ఖాన్ అనే రిటైర్డ్ హెడ్మాస్టర్ మెట్రిక్ పాసయిన వారి కోసం, ఫెయిలయిన వారికోసం, ప్రత్యేకంగా సెకండరీ బోర్డులో నమోదు చేసి ఒక కొత్త కోర్సు తెరిచాడు. సూర్యనాయక్ ఆ

అబ్బాయిలకు పాఠం చెప్పడానికి ఒకట్రెండు గంటలు వెళ్లసాగాడు. ఒక సంవత్సరం తర్వాత మరొక కుర్రవాడితో కలిసి తానే ట్యూషన్లు చెప్పటం ప్రారంభించాడు. అదీ ఒక పాతకాలపు అంగడి మీద ఒక గుహలాంటి గదిలో. తన పెళ్లిలో మామ ఇచ్చిన రాలీఫ్యాన్ తీసుకుపోయి ఆ గదిలో పెట్టాడు. ఇంగ్లీష్, లెక్కలు ట్యూషన్ తరగతులను ప్రారంభించాడు. మొదట ఏడుగురు పిల్లలు వచ్చారు. తర్వాత నలుగురు... కొద్దిరోజుల్లోనే ఆ గది నిండిపోయింది. ఆ సమయంలోనే ఫలితాలు తెలుసుకోడానికి ఫోన్ చేశాడు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఫలితాలు ప్రకటించబడ్డాయి. ఎక్కడో పెట్టిన హాల్ టికెట్టు వెతికాడు. నెంబరు తీసుకుని సీనియర్ అధికారికి ఫోన్ చేశాడు. ఆ రోజు మధ్యాహ్నానం మూడుగంటలకు ఫలితాలు తెలిశాయి. అర్హత పరీక్షలో అతను పాసయ్యాడు. సూర్యనాయక్‌కు చాలా సంతోషం కలిగింది. అవమానాలతో, నిందలతో నిండిన జీవితంలో నమ్మకం ఏర్పడింది. "పర్వాలేదండి. మొత్తానికి సాధించారు" అని అక్కడున్న వారంతా అన్నారు. వాళ్లకు ధన్యవాదాలు తెలిపాడు.

దాని తర్వాత కర్ణాటక సర్వీసు కమీషన్ ఎగ్జామ్స్ ప్రకటన వచ్చింది. పట్టు వదలని బేతాళుడిలా విజయం వెంటపడ్డాడు. అప్పుడే అతని భార్య వందనకు నెల తప్పింది. అతని తమ్ముడి జాంప భార్యకు ఏడునెలలు. అతని తల్లి చావళి పరిస్థితి గంభీరంగా ఉంది. బహుశా ఇద్దరు మనుమళ్లను చూసి ప్రాణాలు వదలాలని అనుకున్నట్టుంది. అదే సంవత్సరం గుడదహట్టి తండాలో ఇంటికొక వేటకోసి పండుగ చేయాలని ప్రణాళిక వేసుకున్నారు. సూర్యనాయక్‌కు కొడుకు పుట్టిననెలలో నామకరణం చేయాలని వియ్యంకులు రావడంతో తండాలో ఇంటింటపూజ అని 'వేట' కోయటానికి పూనుకొన్నారు.

బదియానాయక్ తాను ఒక్కడే అన్నీ చేయవలసి వస్తుందని ఇంటికి వెళ్లిపోయాడు. సూర్యనాయక్ అత్త ముందు "పెద్ద గొర్రె కోశానత్తా, కానీ నాకు బలగమే లేదు" అని భోరున ఏడ్చాడు. అతని పెళ్లి రోజున సూర్యనాయక్ అనుభవించిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కాలంలో అతని పెళ్లికి మూడున్నర వేలు రూకడి (ఓలి) ఇచ్చాడు. అతని భాగానికి వచ్చిన ఆరేడు ఎకరాల భూమిని జాంప అనుభవిస్తూ వుండటమే కాకుండా, డబ్బును అడిగి తీసుకునేవాడు. అయితే సూర్యనాయక్ తన గోడు వెళ్లబోడుకున్న తర్వాత ఈ మాట చెప్పిన తర్వాత అతని బంధువులు జాంప గురించి ఉన్నదున్నట్టు సూర్యనాయక్ ముందు చెప్పారు. "మీ తమ్ముడు మేము వచ్చినందుకు సంతోషంగా లేడు" అని అని అతని చిన్నత్త చెప్పింది. "ఎందుకు,

మొత్తం ఇల్లు అనుభవిస్తున్నది చాలదంటనా? పైగా అడిగినప్పుడంతా డబ్బులిస్తుంటాను" అని సూర్యనాయక్ బిగ్గరగా అరిచాడు, అక్కడున్నవారు గొడవ వద్దని నచ్చజెప్పారు. అయితే సర్వస్వాన్ని అనుభవిస్తున్న తమ్ముడు నలుగురి ముందు అంటున్న మాటలకు బాధపడి, "ఇతనికి ఎంత చేసినా అంతే. సంతృప్తి లేనివాడు" అని మనసు కుదుటపరుచుకున్నాడు.

ఇది జరిగిన నెల తర్వాత అతనికి మగబిడ్డ పుట్టాడు. భార్య వందన పుట్టింట్లో ఉంది. అదే సమయంలో అతని ముసలితల్లి అన్నంనీళ్లు వదిలి మంచాన పడిందని తెలిసింది. సూర్యనాయక్ సెలవుపెట్టి, భార్య వందనను, కొడుకు అంకుర్‌ను తీసుకొని వచ్చాడు. వారమైనా అయితే ముసలిదాని పరిస్థితి కుదుటపడలేదు. ప్రాణం పోలేదు. చావళి పుట్టిన ఊరికి చెందిన మంగోలి బాయి, భీమణి డొకరిలు వచ్చి చావళికి తోడుగా పడుకునేవారు. తండాలోని బంధువులు ముసలిదాని ఒంట్లోంచి ప్రాణపక్షి ఎప్పుడు ఎగిరిపోతుందా అని నాలుగురోజులు ఎదురుచూశారు. అయితే పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో వాళ్లు వెళ్లిపోయారు.

ఇంట్లో ఒక విధమైన భయంతో కూడుకున్న వాతావరణం. ముసలిదాని ప్రాణం ఇప్పుడో అప్పుడో అన్నట్టుంది. ఏదో కలవరం. ఎందుకంటే ప్రాణం పోయిన వెంటనే ఏడవటం, జనాన్ని పిలవటం చాలా కష్టం. అందువల్ల ఉదయమే తొందరగా తినాలి. చిన్నపిల్లలున్న ఆడవారు రోజంతా పిల్లలకు పాలివ్వాలి. ప్రతిక్షణం నరకంగా వుంది. అయితే ప్రాణం ఎప్పుడు పోవాలో అప్పుడే పోతుంది.

పదిరోజులు కోమాలో ఉన్న తర్వాత దేహం నుంచి మలమూత్రాలు ఒక్కసారిగా విసర్జింపబడి, ప్రాణం పోయింది. ఊపిరి ఆగింది. ఎక్కడి నుంచో ఎగిరి వచ్చిన పక్షిలా ధనసింగ్ నాయక్ వంశీయుడైన పంపానాయక్ పరంపరను బలంగా తీర్చిదిద్దటంలో నోటినుంచి ఒక్కమాట అనకుండా భగన్యనాయక్‌తో అన్ని విధాల సహకరించి బతికిన, జీవితంలో దౌర్జన్యాలు, బాధలు, మానసిక ఒత్తిడులు అనన్నిటిని భరిస్తూ, పదిమంది పిల్లలకు జన్మనిచ్చిన చావళిబాయి ప్రాణాలు వదిలింది. ఆమె శరీరం నిర్జీవమైంది. పరంపర వేళ్లను తెంచుకొని ఒక మహావృక్షం భూమిపై కూకటివేళ్ళతో సహా పెకలింపబడ్డట్టు మంచం మీద పడివుంది. పెద్ద కూతురు జీతిబాయి పెద్ద కూతురు సావిత్రికి అప్పటికే పెళ్లయి ఒక కూతురు వుంది. పెద్దకొడుకు కన్నీర పెళ్లయి అతని పిల్లలు చేతికి వచ్చారు. పెద్దకొడుకు టాంక్యా కూతురు, కొడుకుల పెళ్లిళ్లు జరిగాయి. ఇలా పిల్లలను, మనవళ్ళను, మునిమనవళ్ళను చూసింది. ఇప్పుడు వాళ్లంతా శోకసముద్రంలో మునిగిపోయారు.

పదిమంది పిల్లల వంశపు తీగను కళ్లారా చూసి కళ్లుమూసింది. భగన్యనాయక్ దుఃఖం ఆపుకోలేక విలపించసాగాడు."ఏయ్, భగన్యనాయక్, ప్రపంచంలో అన్నీ చూసి చనిపోయింది. ఊరుకో. ఆమె దేన్నీ సగంలో వదిలివెళ్లలేరు. సంసార బాధ్యతలను పూర్తిగా నిభాయించి, ముత్తయిదువుగా చనిపోయింది. పుణ్యాత్మురాలు. జనంచేత ఒక్కమాట కూడా అనిపించుకోలేదు" అని చావళి ఊరిమనిషి అయిన సామ్కి అంది. ఆమె వరుసకు చావళికి పెద్దనాన్న కూతురు కూడా. ఆమెకూడా పశువులను కాసేది. దుఃఖం ఆపుకోలేక అందరి ముందు ఏడవసాగింది. ఆమెను ఓదార్చవలసి వచ్చింది.

"ఏయ్ మాసి, ఊరుకో మా అమ్మ కష్టసుఖాల్లో నువ్వు భాగస్థురాలివి. ఊరుకోమ్మా. ఎన్నడూ మా అమ్మ కఠినంగా మాట్లాడలేదు. పదిమంది మధ్యన ఎన్నడూ భేదభావం చూపలేదు" అంటూ జీతీబాయ్ తల్లి గుణగణాలను పొగిడింది. ఇకముందు భగన్యనాయక్ మరింతగా కుంగిపోతాడని ఊహించిన సూర్యనాయక్ లోలోపల కుమిలిపోసాగాడు.

తండాకు తండానే చావళి మరణవార్త విని దిగ్భ్రాంతి చెందింది. ఆమె కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, పిల్లలు, మనవళ్లు, మునిమనవళ్లు అక్కడ చేరటం చూసి, "ఈ కుటుంబం ఒక్కటే చిన్న తండా అంత ఉంది" అని భగన్యనాయక్ విరోధుల గుంపులోని సక్ర్యా అన్నాడు. ఎప్పుడైతే కుటుంబాలు చీలిపోయాయో అప్పుడే చావళి సగం ప్రాణం పోయింది. అంతకు ముందు మద్యపానం దూరమైన రోజు మరో సగం పోయింది. ఎందుకంటే ముసలిదానికి రక్తపోటు, సందివాతం. గ్యాస్ ఉన్నాయి. నాలుగు అడుగులు వేస్తే అలసట అనేది. కష్టజీవి. రోజంతా ఏదో ఒక పని చేస్తుండేది. పొలంలో పనిచేయాలి. ఇటు ఇంట్లోనూ వండివార్చాలి. రాగి విసరటం, దాన్ని దీనిని శుభ్రం చేయటం–ఇలా ఒకటారెండా పొద్దుటి నుంచి ఒకటే పనులు. పనులు చేసి చేసి ఆమె దేహాన్ని గంధంలా అరగదీసుకుంది. పిల్లల్ని కని, సంసారాన్ని ఏర్పరచుకొని పిల్లలను పెంచింది. కరమ్‌తోట్ వంశానికి నీడనిచ్చే విశాలమైన మహావృక్షంలాంటిదామె. అదిప్పుడు నేలకూలినట్టు అనిపించింది.

సూర్యనాయక్ తండ్రి కోసం, పండుగ పబ్బాలప్పుడు తండాకు వచ్చేవాడు. తండ్రి భగన్యనాయక్ ఖర్చులకు కావలసిన డబ్బులు ఇచ్చేవాడు. సూర్యనాయక్ తన భాగానికి వచ్చిన పొలం గట్టుమీది వేపచెట్లను తండ్రి అమ్మాడని జాంప చెప్పాడు. "నన్నేమి అడుగుతావు? మీ నాన్న తన ఖర్చులకు డబ్బులు లేవని ఇటుకలభట్టి వాడకి అమ్మాడు" అని తండ్రి పేరు చెప్పి డబ్బులు దోచుకున్నాడు.

అది చాలదన్నట్టు సూర్య నాయక్ భాగానికి వచ్చిన ఇంటిస్థలం మీద కన్నేశాడు. సూర్యనాయక్ పునాది తీయించాలని అనుకుంటే జాంప ఉదయమే జేమ్లాను పిలుచుకొనిపోయి రెండు ప్యాకెట్లు తాగించి, "ఏయ్, నీకు అక్కడ జాగా రాదు, రావడం కష్టం" అని చెప్పించాడు. అదే సమయానికి జీకిబాయి భర్త కూడా వచ్చి కలిశాడు. టాంక్యా, కేమ్యాలిద్దరూ ఒక్కటై నోరులేని సూర్యనాయక్ నోట మట్టికొట్టారు. పుట్టింట్లో ఉన్న జింగాలికి విషయం తెలియగానే పరిగెత్తుకొచ్చింది. "ఎవఁరా నా భర్త స్థలం కోసం గొడవ పెట్టుకునే మగవాడు" అని నిలబడి పావువంతు స్థలాన్ని జరిపి, ఇల్లు కట్టడం మొదలు పెట్టింది. సూర్యనాయక్ అప్పుడే తన ఉద్యోగం వదిలి పంజలూరుకు వీడ్కోలు చెప్పాడు. కర్ణాటకలోనే పెద్ద ఊరైన మొళకాల్మూరుకు మాస్టారుగా వచ్చాడు. సుమారు ఏడున్నర సంవత్సరాల దీర్ఘ తపస్సు చేశాడు. చాతకపక్షిలా ఎదురుచూశాడు. ప్రతిరాత్రి కాలేజి లెక్చరర్ కావాలని కలలు కనేవాడు. అనేకసార్లు అతని పక్కింటి వ్యక్తి ప్రొఫెసర్ అయినట్లు కలలు కనేవాడు. ఇతను మాత్రం ఎక్కడా ఎంపిక కానట్టు ఒట్టికలలు కనేవాడు. ఆ కలలు నిజమయ్యే క్షణం కోసం అతను ఆత్రంగా ఎదురు చూసేవాడు.

మొళకాల్మూరు విశ్వవిద్యాలయంలో అసిస్టెంటు ప్రొఫెసర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు కోరినప్పుడు దరఖాస్తు ఎవరిద్వారాలనో తెప్పించుకున్నాడు. దరఖాస్తు ఇవ్వడానికి మాత్రం స్వయంగా తానే వెళ్లాడు. దరఖాస్తు ఇచ్చి వచ్చేటప్పుడు అదే విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్న ప్రొఫెసర్‌గారిని కలవడానికి వెళ్లాడు. "ఇక్కడ ప్రొఫెసర్ చెంగ్యానాయక్ అనేవారు ఎక్కడున్నారు?" అని ఆఫీసు గుమాస్తాను అడిగాడు. "చెంగ్యానాయక్‌గారా, ఇలా వెనక్కి వెళితే వారి ఛేంబర్ కనిపిస్తుంది. అక్కడ ఉంటారు" అన్నాడతను. భవిష్యత్తులో తాను సెలెక్ట్ అయిన తర్వాత ఇదే వాతావరణంలో తిరుగుతానేమోనని అనుకుంటూ ఉండగా చెంగ్యానాయక్‌గారి ఛేంబర్ కనిపించింది. "నమస్కారం సార్, నా పేరు సూర్యనాయక్" అని పరిచయం చేసుకున్నాడు. ఆయన చూపించిన కుర్చీలో కూర్చున్నాడు. "బాగున్నావా, దరఖాస్తు పెట్టావా? నీ తలరాతలో ఈ పవిత్రమైన స్థలంలో ఉద్యోగం చేయాల్సిన అదృష్టం ఉంటే ఎవడూ తప్పించలేడు. ప్రయత్నం చెయ్. నీకు మంచి జరగాలి" అన్నారు. చాయ్ తాగించి పంపారు. అదే ఊర్లోనే ఒక ప్రైవేట్ కాలేజీలో ఒక ఖాళీ ఉందని తెలిసి గతంలో తాను దరఖాస్తు పెట్టడం గుర్తొచ్చింది. నాలుగైదు నెలల తర్వాత మొళకాల్మూరు విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. చెంగ్యానాయక్‌కు ఫోన్ చేశాడు. "సార్, ఏం చేయమంటారు సార్?"

అన్నాడు. "చూడు నాయనా, ఇక్కడ డబ్బులతో పనులు జరుగుతాయని వార్తలు ఉన్నాయి. మరి నీవేమి చేస్తావో? చూడు" అని ఫోను పెట్టేశారు. అక్కడ ఇక్కడ అడిగాడు. ఇంత పెద్ద రాష్ట్రంలో సూర్యనాయక్‌ను గుర్తించి సిఫారసు చేసే మంచితనం ఎవరికుంది? ఇవ్వడానికి డబ్బు లేదు. అయినా ఒక ప్రయత్నం చేద్దామని రాజకీయ నాయకులను కలవాలని అనుకున్నాడు. అలా అనుకుని ఎవరి ద్వారానో శాంతరామ్ భట్ అనే రాజకీయనాయకుడి గురించి తెలుసుకున్నాడు. అతని దగ్గరికి వెళ్లడానికి సిద్ధమయ్యాడు. పెద్దవాళ్ల ఇళ్లకు ఒట్టి చేతులతో పోకూడదని తండ్రి చెప్పిన విషయం గుర్తొచ్చి కొంత డబ్బు జేబులో పెట్టుకుని వెళ్లాడు. ఆయన్ను కలవగానే, "సార్, నా పేరు సూర్యనాయక్. పంజలూరులో ఉద్యోగం చేస్తున్నాను. అభివృద్ధిలోకి రావాలని కల కంటున్నాను. తాము పెద్దమనసుతో ఈ ఉద్యోగానికి నన్ను సిఫారసు చేయమని మనవి సార్" అని ఆయన ముఖం చూడసాగాడు. ఒక్క నిముషం తన ఇంటి అడ్రసు ఇతనికి ఎవరు ఇచ్చారని ఆ రాజకీయనాయకుడు ఆలోచనలో పడ్డాడు. తర్వాత ఓ అరగంట ఒక ఉపన్యాసం ఇచ్చాడు. చివరికి సూర్యనాయక్, "తాము పెద్దమనసుతో ఉద్యోగం ఇప్పిస్తే జీవితాంతం మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాను సార్" అని దీర్ఘదండప్రమాణం చేసి, వెనక్కు తిరిగాడు. ఇది అతని తండ్రి చెప్పిన మంత్రం. "సరే నాయక్, నిన్ను చూస్తే మంచివాడిగా కనిపిస్తున్నావు. నువ్వు పో, నేను ఫోన్ చేసి చెప్తాను" అని రాజకీయనాయకుడు అన్నాడు.

బెంగళూరు నుంచి మొళకాల్మూరుకు వచ్చేసరికి రాత్రయింది. రాత్రి లాడ్జిలో పడుకొని తెల్లవారగానే లేచి స్నానం చేసి ముఖ్యమైన సర్టిఫికెట్లు తీసుకొని ఇంటర్వ్యూకు వెళ్లాడు. బయట ఇరవై అయిదు మంది హేమాహేమీలు కూర్చునివున్నారు. అందులో ఒకడు డిసి కొడుకట. అతని మాటలు విని అందరూ నిర్ఘాంతపోయారు. సూర్యనాయక్, 'ఈ పోస్టు తనకు రాదు' అని మనసులోనే అనుకున్నాడు. అయినా ఇంతదూరం వచ్చినప్పుడు లోపలికి వెళ్లి ఇంటర్వ్యూ ఇవ్వడమే సమంజసమని అనుకున్నాడు. పక్కన కూర్చున్న అందమైన అమ్మాయి వైపు చూశాడు. 'మీరు' అని నీళ్లు నమిలాడు. అరగంట బిల్డప్ ఇచ్చింది. ఎవరో ఈ జీవి అని అనుకుంది. ఆమె వంతు వచ్చినప్పుడు ఆమెకు మంచి జరగాలని మనసులో కోరుకున్నాడు. ఆమె లోపల్నుంచి బయటికి రావడం చూస్తే ఇప్పటికే ఆమె చేతిలో సెలక్షన్ ఆర్డర్ ఉన్నట్టు ప్రవర్తించింది. సగం దుఃఖంతోనే సూర్యనాయక్ అని పిలిచిన జవాన్ గొంతు విని తలుపు తెరుచుకుని లోపలికి ప్రవేశించాడు."సిట్‌డౌన్ మిస్టర్ సూర్యనాయక్" అని ఒక లావుపాటి వ్యక్తి అన్నాడు."థాంక్యూ సార్" అని చెప్పి

కూర్చున్నాడు. "జస్ట్ సే ఫివ్‌వర్డ్స్ అబౌట్ యువర్ సెల్ఫ్" అని ఎవరో అడిగారు. అది పరిచితమైన కంఠం. తిరిగి చూశాడు. అతనికి రెండు సంవత్సరాలు పాఠం చెప్పిన కల్లూరు మాస్టారు. అతడి గురించి అడిగిన కొన్నిప్రశ్నలకు తడబడినప్పుడు,"నాయక్, మనం మనుషులం, గాభరా పడకుండా ఉన్న విషయాన్ని చెప్పు" అని లావాటి వ్యక్తి ధైర్యాన్ని నింపాడు. కొద్ది క్షణాల తర్వాత విశ్వాసంతో బయటకు వచ్చాడు. అయితే ఈ ఉద్యోగం తనకు దొరుకుతుందని నమ్మకం లేకుండాపోయింది.

తిరిగి పంజలూరుకి వచ్చాడు. ఆ నెల చివరిరోజుల్లో జేబులు ఖాళీ. భార్యను పిలుచుకొని సముద్రపు తీరంలో తిరగడానికి వచ్చాడు. జనం పానిపూరి, ఐస్‌క్రీం తినేటప్పుడు వాళ్లనే తన భార్య చూస్తుండడం గమనించి, "కొద్ది రోజులు ఆగు, నేను ప్రొఫెసర్ అయిన తర్వాత ఏమి కావాలన్నా తినిపిస్తాను, నువ్వు కావాలన్నది కొనిస్తాను" అని అన్నాడు. జేబులో డబ్బులు లేక పోవడంతో సముద్రతీరం నుంచి ఇంటివరకు కొడుకుని ఎత్తుకుని నడుస్తున్నాడు. "మీవి కేవలం కలలు చూపించే మాటలే. ఎప్పుడు ఈ హొటల్లో భోజనం, ఐస్‌క్రీమ్ ఇప్పిస్తారో ఆ దేవుడికే తెలుసు" కలలు చూసి చూసి విసుగొచ్చిన వందన అన్నది. ఆదివారం సాయంత్రం షేర్ ఆటోకు ఇవ్వడానికి నాలుగు రూపాయలు లేక బస్సుకోసం ఎదురుచూడటం; సంపాదన చాలక పోవడంతో ట్యూషన్లు చెప్పడం; అక్కడక్కడ ఇతర కార్యక్రమాలు; ఇలా పెద్ద సంఘర్షణ ఎదురయ్యింది. నాలుగవ వేతన సంస్కరణలు అమలు కావటంతో ఒకింత నెమ్మది లభించింది. నాలుగువందలు ఉన్న మూలవేతనం ఆరువేలకు పెరిగింది. అరియర్స్ చేతికి అందాయి. వెంటనే ఆ డబ్బును రెట్టింపు చేయాలనే ఆశతో కాఫీతోటలకు కూలీమనుషులను పంపడానికి ప్రణాళిక వేశాడు. అతని దగ్గరున్న యాభైవేల రూపాయలను కూలీమనుషులకు తలా మూడువేల రూపాయల ప్రకారం ఇచ్చి వర్షకాలంలో కొంతమందిని పంపాడు. ఇలా మూడు నాలుగు నెలల్లో సంపాదించిన కమిషన్ డబ్బును మేస్త్రిని నమ్మి సుడుగాడు సిద్ధులకు, అతనికి తెలిసిన కొందరికి- మొత్తం యాభైమందికి డబ్బులు ఇప్పించాడు. దీపావళి రోజున చిన్న మేస్త్రి సుడుగాడు సిద్ధుల గుంపు తీసుకుని వెళ్లేటప్పుడు, వీధిలోని కొంతమంది మోసం చేసి పారిపోయారు. మేస్త్రి తన వెనక ఉన్న నలుగురిని పిలుచుకొనిపోయి జానేఖానాలో చేర్చాడు. కమిషన్, బస్సుఛార్జ్ మొదలైనవి మాట్లాడాడు.

ఇబ్బంది ఎక్కడ వచ్చిందంటే సూర్యనాయక్ తమ తండాలోని కొంతమంది ఉప్పారులకు అడ్వాన్స్ ఇచ్చి ఒక టెంపోలో జానెఖనాలో విడిచి రావడానికి వెళ్లాడు.

కాఫీతోటల గురించి కేవలం వినడమే తప్ప చూడలేదు. ఒకే విధమైన ఇళ్లలో వరుసగా పడుకోవాలి. కనీసమైన జీవితాన్ని సాగించడానికి ప్రజలు హింసలు భరించి కష్టపడాలి. అక్కడి రైటరు, మేస్త్రీలు కూలీలను ఘోరంగా హింసిస్తారు. మనుషులను మనుషులుగా చూసేవారుకాదు. అందంగా ఉన్న అమ్మాయిలను లైంగికంగా వాడుకునేవారు. జానేఖానా మేస్త్రి జోసఫ్ దుర్మార్గుడు. విద్యావంతుడైన సూర్యనాయక్‌ను నీచంగా చూసేవాడు. కాఫీతోటకు వచ్చే జనం సంపాదించు కోవడానికే వస్తారని అనుమానం. సూర్యనాయక్‌ను ఒక కూలివాడిలా చూసేవాడు. మహా అయితే కమిషన్ తీసుకునే దళారీలా చూసేవాడు. సూర్యనాయక్‌కు జ్ఞానోదయం అయింది. తాను తప్పు చేశాడని అనుకున్నాడు. అదే సమయంలో కర్ణాటక సర్వీస్ కమీషన్ ఎగ్జామ్స్‌లో మంచి మార్కులు వచ్చాయి. అతని ర్యాంకు వెతకడానికి కంప్యూటర్‌లో ప్రింట్ తీసుకున్నాడు. అతని ర్యాంకుకు ఎలాంటి ఉద్యోగం దొరుకుతుందా అని అనుమానం కలిగింది. అయినా బోర్డులో జరిగే గోల్‌మాల్లో ఏమి కావాలన్నా జరగవచ్చని తెలుసు. చేతిలో డబ్బులు లేకపోయినా "జోసఫ్ గారు, చూడండి కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో 787 మార్కులు తెచ్చుకున్నాను. ఏమైనా ఇన్‌ఫ్లూయెన్స్ చేయడానికి అవుతుందా?" అన్నాడు. జోసఫ్‌కు గొర్రె దొరికినట్టు అనిపించింది. "అలాగే నాయక్, మా తోట యజమానికి ముఖ్యమంత్రి బంధువు. నీవు ఊఁ అంటే పదహైదు, ఇరవై లక్షలకు డీల్ కుదుర్చుతాను" అన్నాడు. పైసాకే ఠికాణా లేని సూర్యనాయక్ లక్షల మాటలు విని ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. "ఏమన్నారు సార్?" అని అర్థంకానివాడిలా అతని ముఖం చూశాడు. "ఓ ఇరవై లక్షలు తీసుకొనిరా. నేను మాట్లాడి ఇప్పిస్తాను" అని స్పష్టంగా చెప్పాడు. సూర్య నాయక్‌కు తన కాళ్లకింది భూమి కుంగినట్టు అనిపించింది. "ఆఁ" అని నోరు తెరిచాడు. "మరీ ఎక్కువ అనిపించటం లేదాసార్?" అని గొణిగాడు. "అయ్యా మేస్త్రి, తెలివైనవాడివని, చదువుకున్నావని అంటావ్. ఇదేనా నీ జ్ఞానం? రేపు క్లాస్ వన్ ఆఫీసర్ అయితే జీపులో తిరిగేవాడు అనవలసిన మాటేనా ఇది?" అని మునగచెట్టు ఎక్కించడానికి చూశాడు. "అయినా సార్, మాలాంటివాళ్లకు ఈ డబ్బు చాలా ఎక్కువే" అని స్పష్టంగా అన్నాడు. "సరే మీ ఇష్టం" అని జోసఫ్ లేచి లోపలికి వెళ్లాడు.

జానేఖానా నుంచి కూలీజనం పారిపోయి మరోచోట పనికి చేరుకున్నారు. దాంతో తనకు రావలసిన కమీషన్ సొమ్ము రాకుండా పోయింది– అదేదో 'ఎద్దులో వచ్చిన లాభం ముడ్డిలో పోయింది' అని సామెత సూర్యనాయక్ కథ అయింది.

ఏదో చేయబోయి ఇంకేదో అయింది. మేస్త్రి మాటలు విన్న ఉప్పర కుర్రవాళ్లు తమలోనే ఒకరిని మేస్త్రీగా ఏర్పరుచుకున్నారు. వచ్చిన కూలి డబ్బుల్లో సరిగ్గా కమిషన్ ఇవ్వకుండా ఎగ్గొట్టారు. దాంతో సూర్యనాయక్ పెట్టిన పెట్టుబడి కరిగిపోయింది. విషయం తెలిసిన భగన్యనాయక్, "ఒరేయ్ సూర్యా, చిలక్కి చెప్పినట్లు చెప్పాను. ఆ కాఫీతోట సహవాసం వద్దని చెప్పాను. ఈ కాఫీతోటలకు కూలీలను పంపినవాళ్లలో ఎవడు బాగుపడ్డాడో చూపించు?" అని సూర్యనాయక్ ముఖం చూశాడు. అతను చేసిన అపరాధానికి తలదించుకొని పశ్చాత్తాపపడసాగాడు.

సూర్యనాయక్, వందనాకు ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు అంకుర్, చిన్నవాడు అవదేశ్. సూర్యనాయక్ తమ్ముడికి ఐదుమంది పిల్లలు. సూర్యనాయక్ పంజలూరులో ఉద్యోగం చేస్తున్నప్పుడు భగన్యనాయక్‌ను పిలుచుకొని మద్రాసు, కన్యాకుమారి, తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనం చేయించడాన్ని కథగా అందరి ముందు చెప్పేవాడు. అటుతర్వాత అతను మాసలూరుకు పోయినప్పుడు, తండ్రిని మాసలూరుకు తీసుకెళ్లాడు. అది పెద్దపట్టణం. అదే తమ గ్రామంలో అయితే ఇంటినుంచి చాయ్ దుకాణానికి బయలుదేరితే దారిపొడుగునా పెదనాన్న, తాత, మామ, కాకా అని జనం పలకరించేవారు. బాగోగులు అడిగేవారు. కష్టసుఖాలు చెప్పుకున్నారు. సలహాలు అడిగేవారు. ప్రాంతమంతా తిరిగి ఆస్పత్రిలో చూపించి వీపు నరం బాగవ్వనందుకు, "మామ దస్సేకహాతోమార్తో నస్ ఛళ్ కరన్ వేగిచ' (మామ. ఒకసారి విసుర్రాయి గూటంతో కొడతావా? నరాలు 'చట్'మంటాయి) అని మధ్యదారిలో అడిగాడు. "రేయ్ తమ్ముడా, రేపు ఉదయం రా" అని అన్నాడు. మరుసటి రోజు అతను రావటానికి ముందే లేచి పొలానికి వెళ్లి తిరిగివచ్చి ముఖం కడుక్కొని సూర్యుని ఎదుట నిలబడి నమస్కారం, నిన్న చెప్పినవాడు వస్తే ఏడురాళ్లను వరుసగా జోడించి, విసుర్రాయి గూటంతో ఏదో మంత్రం చదివి నరానికి కొట్టేవాడు. తర్వాత ముందుకుసాగి మరొక రాయికి నాలుగు మంత్రాలు చెప్పి, దిష్టితీసి ముందుకు విసిరాడు. ఇలా రెండు వారాల తర్వాత ఇంగ్లీష్ దవాఖానకు వెళ్లినా బాగవ్వని నడుమునొప్పి మాయం అయింది. భగన్యనాయక్ ఇది ఎవరి నుంచి నేర్చుకున్నాడు? ఎలా నేర్చుకున్నాడు? మొత్తానికి ఈ రెండు విద్యలను నేర్చుకున్నాడు. దేవుడు ఒంటిమీదకు వస్తున్న అతని ఐదో కొడుకు అందాని మొదట్లో 'హం...హూం" అని నోటికి వచ్చినట్లు, దేవుడు ఒంటిమీదకు వచ్చినట్టు మాట్లాడేవాడు.

తాగిన మత్తులో భగన్యనాయక్, చావళిలు-'యాడిదేకెస్ కాళో మాతేక మనక్యా ఛా పూజ్ సాయవేసల' (అమ్మా తల్లీ, నువ్వే కాపాడాలి. మా మనుషులను

నువ్వే కాపాడాలి) అని చేతులు జోడించి దేవుడితో సంభాషణ జరిపేవారు. ఎప్పుడైనా ఊరికి వస్తున్న సూర్యనాయక్‌కు ఇదొక సవాలుగా నిలిచింది. "అదికాదు, ఆ శూద్రదేవుడు సంస్కృతంలో మాట్లాడకుండా గోర్‌బోలిలో నేరుగా మాట్లాడుతున్నాడుకదా, చాలాఆశ్చర్యంగా ఉంది" అని చాలామంది సంస్కృత పండితులతో చర్చించాడు. వాళ్లు సందిగ్ధంలో ఎక్కువ తక్కువలు మాట్లాడితే తమ బండారం బయట పడుతుందని నవ్వి మౌనంగా ఉండిపోయారు.

ఇలాంటి పరిసరాల్లో బ్రతికిన భగన్యనాయక్ మాలూరు క్వార్టర్స్‌లోని జీవితానికి సర్దుకోవడానికి సతమతమయ్యాడు. పై అంతస్తులోని ఇల్లు, మాట్లాడటానికి జనమే లేరు. బహిర్భూమికి వెళ్లాలంటే విదేశీ కక్కసు. చెప్పుకోలేక, అనుభవించలేక తనలో జరుగుతున్న సంఘర్షణను అణుచుకున్నాడు. ప్రతిరోజు సారాయి తప్పదు. వారానికి ఒక సారి చేపలు, మాంసం తప్పకుండా కావాలి. ఎందుకంటే గుడదహట్టి తండా చెరువు నిండితే చాలు, చేపలకు, పీతలకు కొరతనే ఉండేది కాదు. స్వయంగా భగన్యనాయక్ అత్యంత ఒడుపుగా చేపలు పట్టడంలో నిష్ణాతుడు. పరిస్థితి ఇలా వున్నప్పుడు సూర్యనాయక్ బతుకు సందిగ్ధంలో పడింది. అతని క్వార్టర్స్ నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న సారాయి అంగడి నుంచి వారానికి నాలుగు పెద్ద ప్యాకెట్లు, రెండుమూడు రోజులకు సగం ప్యాకెట్లు కొనేవాడు. అలా కొంటున్నప్పుడు రెండుమూడుసార్లు అతని కాలేజీలోనే పనిచేస్తున్న ఒక ప్రొఫెసర్ చూసి అసహ్యించుకున్నాడు. అయితే సూర్యనాయక్ అందుకు తలపాడుచేసుకోలేదు. నిజమేమిటో అతనికి తెలుసు. అతను సారాయికి, సిగరెట్టు అలవాటుకు దూరంగానే ఉన్నాడు. అందువల్ల ఆ ప్రొఫెసర్‌కు ఏదో ఒక రోజున నిజం తెలుస్తుందని అప్పుడు అతను అర్థం చేసుకుంటాడని నిశ్చింతగా ఉన్నాడు. అతని తండ్రి భగన్యనాయక్ క్వార్టర్స్‌లో ఉన్నప్పుడు రెండవ కొడుకు అవదేశ్ మూడేళ్ల పిల్లవాడు. భగన్యనాయక్ ఇంటి మూలలో బీడీ కాల్చితే, దాన్ని గమనించిన ఆ పిల్లవాడు "నాకు ఇవ్వు" అని అడిగేవాడు. "నువ్వు తాగకూడదు నాన్నా" అని అంటే "ఎందుకు?" అని అడిగేవాడు. "ఎందుకంటే దాన్ని తాగితే చచ్చిపోతారు" అని తప్పించుకోవడానికి అంటే పిల్లవాడు వెంటనే "మరి నువ్వు చావలేదే?" అని ఎదరు ప్రశ్న వేశాడు. "నేను పెద్దవాడిని, నువ్వు చిన్న పిల్లవాడివి కదా అన్నాడు" అన్నాడు భగన్యనాయక్. "ఏయ్ అబద్ధం చెపుతున్నావు, గిల్లుతాను చూడు" అని వాడు బెదిరించాడు.

సూర్యనాయక్‌కు తమతోపాటు తండ్రి భగన్యనాయక్ మాలూరులో ఆరునెలలు ఉండటమే తెలియలేదు. కాలం అలా గడిచిపోయింది. అంతలో అతని తమ్ముడు

'నాన్నను పంపు. అక్కడ అతను ఉండలేదు' అని అనలేదు. ఇతను వినలేదు.

బదియా, అతని కొడుకు మాలూరు నుంచి దూరంలో ఉన్న ఇలాఖాలో పనిచేస్తున్నాడు. తండ్రిని చూడటానికి వచ్చిన వాడు,"ఊరమ్మ వేటను కోస్తున్నాం. నీవు లేకుండా ఎలా పండుగ చేయాలి?" అని మానసికంగా ఒత్తిడి పెట్టాడు. అతని మానసిక బ్లాక్‌మెయిలింగ్‌కు బలి అయిన భగన్యానాయక్ గుడదహట్టికి వెళ్లాడు. అక్కడ మంచం పట్టాడు. సూర్యనాయక్ సాహిత్య అకాడమీ నుంచి ప్రవాసానికి ఆర్థిక సహాయం పొంది పదిహేను రోజులు రాజస్థాన్లో బంజారా జనసముదాయం గురించి అధ్యయనం చేయడానికి భార్యా పిల్లలతోపాటు వెళ్లినవాడు తిరిగివచ్చాడు. అతని తమ్ముడు పాతకాలపు ఫోనులో, "నాన్న ఇక బతకడు. ముఖం చూసుకొని వెళ్లు" అని అన్నాడు. మరుసటి రోజున బయలుదేరాల్సినవాడు ఆరోజుకే టికెట్ బుక్ చేసుకొని హడావుడిగా జైపూర్ నుంచి తిరిగివచ్చాడు. ఢిల్లీకి పోవాలని, ఇండియా గేట్, పార్లమెంట్ చూడాలని పిల్లలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. వాళ్ల ఉత్సాహం మీద నీళ్లు చల్లినట్లు అయ్యింది.

పదకొండు అక్షోణిల సైన్యం ఓడిపోయి కౌరవులంతా హతులై, అంపశయ్యలో ఉన్న భీష్ముడిలా అతని తండ్రి భగన్య నాయక్ పడుకొని ఉన్నాడు. చావళి చనిపోయి సరిగ్గా పదేళ్లయ్యాయి. ఈ పదేళ్లలో ప్రపంచంలో అనేక మార్పులు జరిగాయి. పదవ లేదా పదకొండవ మీటు భుక్యా కరమ్‌తోట్ పరంపర ప్రవహించే నీటిలా కొత్తకొత్త రూపాన్ని పొందుతూ ముందుకు సాగింది. గుడెకోట, అప్పేనహళ్లి, బండె బస్సాపుర, చిక్కజోగిహళ్ల, ఇంకా మూడునాలుగు తండాలలో ఉన్న కరమ్‌తోట్ కులస్థులు ఆర్థికంగా కష్టాల్లో జీవించారు. భగన్యనాయక్ కులం చాలా ప్రబలంగా ఉండేది. తర్వాత మలెనాడు వైపు అంటే కొండప్రాంతం వైపు వెళ్లిన గూడ్లిబాయి సోదరులు ఎప్పుడో ఒకసారి ఇంటి పండుగలకు వచ్చారు. అది జరిగి ఇప్పుడు ఇరవై ఏళ్లకు పైగా గడిచివుండొచ్చు. గుడదహట్టి తండాలో పండుగ ఆచరించారు. కార్మికుల శ్రమవల్లనే ధనవంతులైన పెట్టుబడిదారులైనా లంబాడీలకు ఈ మాట అన్వయించదా? సూర్యనాయక్ ఆలోచించాడు. "నేను మూర్ఖుడినా? చేతకానివాడినా? వ్యవహారం తెలియని గుడ్లగూబనా? వసూలు చేయడానికి రాకపోతే డబ్బులు ఇవ్వకూడదు. పుస్తకం,విత్తం, స్త్రీ –ఇతరులకు ఇవ్వకూడదు. ఇస్తే అంత సరళంగా తిరిగిరావు" అనే సత్యం సూర్యనాయక్‌కు తెలిసినప్పటికీ మోసపోయాడు. అతని పెద్దన్న టాంక్యా కొడుకు గుడదహట్టి తండాలో లక్షలాది రూపాయలు అప్పు ఇస్తున్నాడని జనం మాట్లాడుకునేవారు. "అతనికి వసూలు చేయడం ఎలా సాధ్యం?

అతను ప్రభుత్వ ఉద్యోగి?” అని సూర్యనాయక్ వడత్యా సంబాజి దగ్గర అన్నాడు. వడత్యా సంబాజి అడిగాడు– “ఏయ్ ఇవ్వరా? అని అడగటానికి నోరులేని నీకు చేతకాదు. నువ్వు ఇచ్చిన డబ్బు తిరిగిరాదు. ఆ డబ్బు ఎక్కడో పోగొట్టుకొని పోయిందని నోరుమూసుకుని ఉండిపో. ఎందుకు అడిగి మర్యాద పోగొట్టుకుంటావు?” అన్నాడు. ఆ రోజు నుంచి తండాలో ఎదురుగా కనిపించినప్పటికీ ‘ఎప్పుడు వచ్చినావు సూర్యన్నా?’ అనేవారులేరు. వాళ్లంతా కలిసి వడత్యా సాంబాజికి ఒకట్రెండు మిరపకాయలు, బ్రాందీ ప్యాకెట్లు ఇచ్చి ‘ఇలా చెప్పు, నీ మాట వింటాడు. ఒకసారి మాట్లాడు’ అని చెప్పి ఉండవచ్చనే అనుమానంతో భార్య వందనా దగ్గర చర్చించాడు. “మీరూ– మీ అప్పులవాళ్లు. మీకు వ్యవహారాలు జరపడం తెలియదండి. మీ భాగం సొమ్మును జనానికి ఎందుకు తినిపిస్తారు? పిల్లలు అడిగితే ఒక ఆట బొమ్మలు కొనివ్వలేదు. ఇప్పుడు...” అని కొట్టినట్టు చెప్పింది. ‘థూ, ఈ ఆడవాళ్ల దగ్గర ఎలాంటి సలహాలు అడగకూడదు’ అని సూర్యనాయక్ మౌనం వహించాడు.

గుడదహట్టి తండా పూర్తిగా మారిపోయిందని అనిపించింది. తండాలోని దురుగమ్మ గుడి నుంచి, వెనక వీధిని దాటే వరకు దారిలో కనిపించిన పెద్దలందరి కాళ్లకు నమస్కారం చేయాలని అతని తల్లి చావళిబాయి నేర్పింది. “నాయనా, శరణం శరణం అన్నవారికి మరణం లేదునాయనా, పెద్దల ఆశీర్వాదం నిన్ను సదా కాపాడుతుంది” అని అనేది. ఆ సంస్కారం, గౌరవం ఇప్పుడు లేవు. దుర్గమ్మకట్ట వేపచెట్టు, తండా మధ్యన ఉన్న వేపచెట్టు ఇప్పుడు లేవు. గుడదహట్టి తండా అంతటా జనం బాగా తాగి, అప్పుల బాధ భరించలేక, లేదా అలవాటు వదలలేక తాగీ తాగీ చనిపోయిన మగవాళ్ల కారణంగా వయసులోని ఆడవాళ్లు వితంతులయ్యారు. అయితే సాయిబులు, బోయలు, లింగాయతులు, బేస్తల్లో ఆ విధంగా తాగి చనిపోయినవారు లేరు. ‘ఇక ముందున్నది ఇతని వంతే’ అని అంటున్నప్పుడు ఉప్పర హనుమా ఏదో విధంగా బతికి బయటపడ్డాడు. జనం కేవలం సంబంధం పెట్టుకోవడానికి గుడదహట్టి రాలేదు. పాతసంబంధాలు మరుగయ్యాయి. కొత్త సంబంధాలు పుట్టుకొచ్చాయి. చిన్న తండాలో సూర్యనాయక్ రెండవ అక్క బంధువులు ఉన్నారు. బహుశా, సూర్యనాయక్ తల్లివైపువారి వియ్యంకులు కావచ్చు. పెద్దక్కకు ఎనిమిది మంది మగపిల్లలు, ముగ్గురు నలుగురు ఆడపిల్లలు. ఆ ఊరిలో సగం ఊరు వారిదే. గుడదహట్టిలో మాత్రం సగం తండా వారిదే. తండాలోని ఒక గ్రామ పంచాయతీ పోటిలో వీళ్లే గెలిచేటంత జనసంఖ్య ఉండేది. అందులో ఇంజనీర్లు, డాక్టర్లు, మాస్టార్లు, పోలీసులు, వకీళ్లు–ఇలా అన్ని రకాల ఉద్యోగాల్లోనూ

భగన్యనాయక్ మనవళ్లు ప్రవేశించారు.

సూర్యనాయక్ మొదటి తరానికి చెందిన అత్యంత అధికంగా చదువుకున్న విద్యావంతుడు. అతను మాలూరులో ఉండగానే భార్యను చదివించాడు. గుడదహట్టి తండాలో కట్టించిన పెంకుటిల్లు తప్ప వాళ్ల తండ్రి ఇచ్చిన ఆరెకరాల పొలానికి అరెకరం కూడా కలపలేకపోయాననే బాధ అతనికుంది. గుడదహట్టి తండాలోని దగుల్బాజి జీనానాయక్ రెండెకరాల పొలం కేవలం యాభైవేలకు తీసుకో అన్నాడు. అయితే అతని మొదటి భార్య కొడుకు చిమణి మాస్టార్ పెద్దదగుల్బాజి. వాడు తండ్రిని మించినవాడు. అందువల్ల ఆ జమీను వైపు చూడనేలేదు. చివరికి చేతిలో ఉన్న కొద్దిపాటి డబ్బును ఇంటికి పెట్టకుండా కాఫీతోట కూలీవాళ్లకు ఇచ్చి నష్టపోయాడు. అతని దగ్గర అప్పు తీసుకున్న బుడ్డానాయక్ అనే లోఫర్ చెప్పా పెట్టకుండా కాఫీగింజలు తెంచడానికి వెళ్లాడు. సూర్యనాయక్ ఫోన్ చేసి, "ఏమిరా, దొంగనా కొడకా, సొమ్ము ఇవ్వు" అని అన్నాడు. ఆ బుడ్డానాయక్ ఎదురు తిరిగి, "ఇచ్చే సొమ్మా, మూసుకొని పోరా, పిచ్చినా కొడకా!" అన్నాడు. నోరు తెరిస్తే మర్యాద పోతుందని, ఎవరి దగ్గర ఏమీ మాట్లాడకుండా నోరు మూసుకున్నాడు. అటువైపు పీతాంబర్ మేస్త్రి ఇచ్చిన డబ్బులు సుడుగాడు సిద్దులు ఇస్తారా? వందన ఉండే తండా పక్కనున్న తెప్పరగేరి హరిజనవీధికి చెందిన చంపి, మణకు, "అప్పా? ఏ అప్పు? ఎవరిచ్చారు? ఎప్పుడు ఇచ్చారు? చెప్పు?" అని ఎదురు తిరిగారు. "థూ, మీరు బాగుపడర్రా" అని అడగటమే వదిలేశాడు. కొంచెం కూడా మర్యాద లేని జనం దగ్గర వసూలు చేయడం కష్టం. కొంతమంది అయితే "అరే అన్నా, మీకేం తక్కువైంది? దేవుడి మంచి ఉద్యోగం ఇచ్చాడు" అని అతనికి జవాబిచ్చారు.

గుడదహట్టి తండాలోని హనుమంత దేవుడు జంటలను వేరు చేస్తున్నాడంటూ, భర్త చనిపోయిన ఆడదాని దగ్గరికి వెళ్లి ఓదార్చినట్లు నాలుగు మాటలు చెప్పి లొంగదీసుకోవడానికి ప్రయత్నించే జనమూ ఉన్నారు.

అక్కడ ఉన్నటువంటి విద్యావంతుల్లో సూర్యనాయక్ ఎక్కువగా చదువుకుని వుండొచ్చు. అయితే అతను తండాకు వెళ్లినప్పుడు మాత్రం "అవునప్పా, ఎన్ని కోట్లు దాచావు?" అని గింజగార కన్నడ ఉబరేశి అడిగాడు. అతనికన్నా వయసులో పెద్దవాడైన సూర్యనాయక్, "కోటి రూపాయలా? తిండికి, బట్టకు, పిల్లల ఫీజుకు, పుస్తకాలకు..." పురాణం చెబుతున్నట్టు చెప్తున్న అతన్ని ఆపి,"అయ్యో, అవునా? పెట్రోల్ బంక్‌లో పనిచేయడానికి పోయిన మన హుంబేసి కొడుకు కొట్రి బెంగళూరులో నాలుగు సైట్లు, ద్యామపుర సిటీ మధ్యలో ఒకట్రెండు, హరిపుర

దగ్గర రెండెకరాలు కొన్నాడట. ఎంత తక్కువన్నా ఆరేడు కోట్లు సంపాదించాడు. నువ్వేమో పెద్ద చదువు చదివి పెద్ద స్కూల్లో మాస్టారువంట. కనీసం నీ జీతం లక్ష ఉండదా?" అని అతని ఆత్మాభిమానం మీద దెబ్బకొట్టాడు కన్నడ గింజగార ఉబరేశి. సూర్యనాయక్ ఏమి చెప్పాలో తెలియక, 'అబ్బా, ఈ జనం ఎంత నాజూకుగా మాట్లాడతారు. నాకు మాటలే రావు' అని భార్య ముందు అన్నాడు. "అవునండి వాళ్లు మాటల మరాఠీలు. మా నాన్నను చూశారు కదా, స్కూల్ ముగించి, సిటీకి పోయివచ్చారంటే ఊరి వార్తలంతా రేడియోలో ప్రసారం చేసినట్టు చెప్పేవారు. మీరు ఉన్నారు మన్నుతిన్న పాములా! ఎప్పుడైనా నాతో కానీ, పిల్లలతో కానీ మనసు విప్పి మాట్లాడారా? లేదు. మిమ్మల్ని నవ్వించడానికి మేము పార్టీ చేయాలి" అని అన్న వందన గింజగార ఉబరేశి కన్నా గర్వపోతూ అనిపించింది. ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు, సంసారానికి అవసరమైన మాటలు వేరే. వ్యవహారానికి అవసరమైన తెలివి తేటలు వేరు. మునగ చెట్టు ఎక్కించే మాటలు వేరు. ఈ సత్యాన్ని ఆమెకు ఎవరు తెలియజేస్తారు?

సూర్యనాయక్ ప్రపంచమే వేరు. అతను ఏదో ఒక విలువకు కట్టుబడి వుండాలని అనుకుంటాడు. ఎందుకంటే అతని వృత్తి అలాంటిది. విద్యార్థులు ఇతన్ని అనుసరిస్తారు. తనే నీతి తప్పితే మొత్తం విద్యార్థుల సమూహం పాడవుతుందని ఇతని అభిప్రాయం. అయితే ప్రజల దృష్టిలో ఇతనొక పనికిరానివాడు. గుడదహట్టి తండాలో డజన్ మంది నిన్నా మొన్నటి కుర్రవాళ్లు చదువుమాని అల్లరికి పడినవాళ్లంతా బెంగళూరుకు పోయారు. అక్కడ పెట్రోల్ బంక్, హోటల్, అక్కడక్కడ ఏవేవో ఉద్యోగాలు చేస్తారు. మోసాలు చేసే విద్యలు నేర్చుకుని కొద్దికాలంలోనే ఎవడో నాలుగు కార్లు కొన్నాడని అంటారు. కొందరు కోటి సంపాదించాడని అంటారు. వాళ్లకు ఇతనికి భూమికి ఆకాశానికి ఉన్నంత వ్యత్యాసం ఉందంటారు. తండాలో ఇంటికి రెండు మూడు బైకులు. తండలోని దురుగమ్మ, సేవాభాయ్‌ల గుడి మట్టికట్టడం స్థానంలో ఇప్పుడు పూర్తిగా సిమెంట్ నిర్మాణం కనిపిస్తోంది. సర్కారువారి పనికిమాలిన ప్రణాళిక వల్ల తండా లోపల ఒక్క బండి తిరిగేలా లేదు. ఎందుకంటే మొత్తం తండాలో సిసి రోడ్లుకానీ, మురుగునీళ్లు పోవడానికి కాలువలుకానీ లేవు. రోడ్డంతా బురద బురద, మురుగునీళ్లు. ఒక్కొక్క మూలకు ఎగ్‌ఫ్రైడ్‌రైస్ అంగళ్లు, బ్రాంది దొరికే స్థలాలు, అయితే పాత గొడవలు అలాగే ఉన్నాయి. లఫంగాలు, కుటుంబాలను నిలువునా చీల్చేవాళ్లు ఇంకా ఎక్కువయ్యారు. వాడెవడో నాలుగు అక్షరాలు నేర్చుకొని మిడిమిడి జ్ఞానంతో భగన్యనాయక్ మీద విషం కక్కుతున్న దళారి దురుగ్యా మనవడు

షణ్ముఖ అనేవాడు, తలారి దగ్గరికి పోయి, జమీన్ ఎవరి పేరుమీద ఉంది? ఎవరు అమ్మారు? ఎవరు తమ పేరిట చేసుకున్నారో చూసుకొని వచ్చి పొలం యజమాని మాట ఇచ్చినది తప్పినట్టుగా రుజువు చేసి అతని మనవళ్లతో, "రేయ్ మీ నాలుగు ఎకరాల పొలం మీ తాత పేరిట ఉంది. ఇప్పుడు ఎవరు చేస్తున్నారో వారి దగ్గరికి వెళ్లి పొలం వదలండని చెప్పండి" అని తంటాలమారి షణ్ముఖ రెచ్చగొట్టాడు. మూడో, నాల్గవ తరంవారు గాభరాపడ్డారు. తంటాలమారి షణ్ముఖ మాటలు విని శంకరాపురం సోమీసింగ్ మనవడు తిప్ప అజ్జనను నిలదీశాడు. అతను తలారి దగ్గరికి పోయి పరిస్థితి తెలుసుకొని సర్దుబాటుకు వచ్చాడు. ముత్తాత చేసిన ఈ పనివల్ల ఇప్పుడు అతని మనవడు అజ్జన లక్ష రూపాయలు దండన చెల్లించి తన పేరిట చేయించుకున్నాడు.

షణ్ముఖ, గింజగార ఉబరేశి, చహాదుశాన్ శంకినాయక్, పాపనాయక్, శంబులింగ నాయక్, అంతా ఇదే దందాకు దిగారు. రోజూ తల పాడుచేసుకున్న ఎవరో ఒక గొర్రెలాంటివాడిని వెతకడం, సాయంత్రం ఉచితంగా అతడి డబ్బులతో బ్రాందీ, సారాయి ఏర్పాటు చేసుకోవడం. కొందరిని బెదిరించి, మరికొందరిని ఎదిరించి, మళ్లీ కొందరికి బెంగళూరు పేపర్ ఆగర్భశ్రీమంతుడైన సంపాదకుడిలా బ్లాక్ మెయిల్ చేసి ఆరోజు ఖర్చును సాధించుకోవడం. వెనుకటి పెద్దల విలువలకు ఈ గుంపు మసి పూయటానికి నిలబడింది. తండా పంచాయితీ చెదరిపోయి ఎన్నో సంవత్సరాలు అయ్యాయి. ఎవరు తండా నాయకుడు? ఎవరు కారభారి? ఎవరు డావో? ఊహూఁ అన్నీ నామరూపాలు లేకుండా పోయాయి. గతంలో తండా నాయకుడంటే చుట్టుపక్కల ఉన్న ఊర్ల పెద్దలు గౌరవించేవారు. వాళ్లు కూర్చుంటే ఆ స్థానానికి ఉన్న విలువ వేరు. ఇప్పుడు మిడిమిడి జ్ఞానంతో కాలేజీ మెట్లెక్కినవారు, చదువు ముగించి డబల్ డిగ్రీ ముగించి ఉద్యోగాలు దొరకక–ఉన్న కొద్దిపాటి పొలంలో ఒళ్లువంచి పనిచేయలేక ఉన్నటువంటి చార్‌సొబీస్‌ల వెనుక ఎవరు వచ్చినా, ఎవరూ రాకపోయినా ఒకటే అన్నట్టుగా ఉంది. అది చాలదన్నట్టు దళాలి దురుగ్యా మనవడు షణ్ముఖనాయక్, అతని బంధువు ఏదో ప్రైవేట్ కంపెనీని ముంచి, తాను పెద్ద ఇంజనీరునని చెప్పుకుంటూ పాపం పద్దెనిమిదేళ్ల తండా అమ్మాయిని నమ్మించి గొంతు కోశాడు. ఆమెను శవం చేశాడు. అయితే ఈ విషయాన్ని జనం మరిచిపోయారు.

అయినా తండా తన స్వరూపాన్ని మార్చుకుంది. తొలకరిలో వర్షాలు తగ్గుతుండటంతో నీళ్లులేక ఎండిపోయిన చెరువు స్థలాన్ని జనం పూర్తిగా ఆక్రమించుకొని

కంచెలు కట్టుకున్నారు. కొందరు ఇల్లు, స్థలాలు పట్టుకొని మాదే అని హక్కు పత్రాలు లేకపోయినప్పటికీ దాదాగిరితో భూమిని దోచుకున్నారు. పొలాలకు ప్రవహించి వచ్చే చిన్న కాలువలను దుష్టులు ఆశపోతుతనంతో గట్టులను కొట్టేసి, తగ్గులో మట్టి నింపి సమం చేసి, భూములుగా మార్చుకున్నారు. మేడలు, దిబ్బలు ఏమీ మిగలలేదు. రచ్చబండల జాడే లేదు. హుర్దల్లివాగు, ఆపినవాగు, చిన్నవాగు, పెద్దవాగు, ఏవీ లేవు. ఇప్పుడు కేవలం చెరువు ఒక నామావశేషమైన కళేబరంలా కనిపిస్తుంది. దాన్ని నలువైపుల నుంచి జనం ఆక్రమించుకున్నారు. గతంలో చెరువుగట్టు వెనుక ఊరు ఉండేది. సూర్యనాయక్ తాను పెరిగి పెద్దవాడవుతుండగా గట్టుమీద జీడిమామిడి చెట్టు, చింత చెట్టు, ఎత్తయిన రావి చెట్టు, నేరేడు చెట్లు యథేచ్ఛగా ఉండటం చూశాడు. అప్పుడు చిలుకలు, గోరువంకలు ఇంకా రకరకాల పక్షులు చెట్లమీద కూర్చునేవి. ఇప్పుడు చెట్లు ఎండిపోయాయి. రాను రాను భూగర్భంలో నీటిమట్టం ఇంకిపోయింది. ఆరువందలు, ఏడువందల అడుగుల లోతుకు నేల తవ్వినా నీళ్లు దొరకడం లేదు. కాఫీ తోటకు వెళ్లి అడ్వాన్స్ తెచ్చి బోరుబావులు వేయించడానికి ఎప్పుడైతే జనం పట్టుదలకు పోయారో; పక్కపక్కనే బోరులు తవ్వించి నేలతల్లిని హింసించారు. నీళ్లు పడితే ఇక వాళ్ల అహంకారానికి అంతులేదు. అయినా ఆండ్రాయిడ్ మొబైల్ ఫోనులు, కార్లు, బైకులకు లెక్కలేదు. తండావదిలి పెట్రోల్‌బంకుల్లో చేరి మోసంతో డబ్బు సంపాదించినవాడే షావుకారు. అతను తండాకు వచ్చినప్పుడు మెరిసిపోతున్న అంగీ, జీన్స్ ప్యాంట్, చేతికి బ్రేస్ లెట్, ఎడమచేతిలో పొడవైన మొబైల్ ఫోన్ చూసి మరులుపోయిన ఆడది, "ఓ మామా, ఇప్పుడు వచ్చావా?" అనేది. నిజానికి 'అన్న' వరుస అయినవాడు ఇప్పుడు 'మామ' అయిపోయాడు.

సూర్యనాయక్ తన యాభై ఏళ్ల జీవిత ప్రయాణాన్ని ఆశ్చర్యకరమైన దృక్కులతో చూస్తూ వచ్చాడు. అతని ఆనాటి కల కడుపునిండా కూడు దొరికితే చాలన్నది. అందువల్లనే అతను పంజలూరులో సైకిల్ మీద తిరిగాడు. నాలుగు రూపాయలకు షేర్ ఆటోలో తిరిగాడు. గంటలకొద్దీ బస్సుకోసం ఎదురుచూశాడు. అతని రెండవ కొడుకు అవదేశ్ పుట్టిన తర్వాత ఒక్కొక్క కల సాకారం పొందసాగింది. సైకిల్‌కు బదులుగా బి.వి.ఎస్.100 బైక్ కొనుక్కునే దశకు చేరాడు. తరువాత మాలూరు విశ్వవిద్యాలయానికి సంబంధిత కాలేజిలో చేరాక ఆర్థికపరిస్థితి కాస్త మెరుగుపడిందే తప్ప అతని స్థాయి మార్చ్‌హండ్రెడ్ కారుకు బదిలీ కాలేదు. అవే కలలు కోటి కార్ల, బంగళాలవి. ఇప్పటికీ కలలను మోసుకొని బతుకుతున్నాడు.

మాలూరుకు వచ్చినప్పుడు ఒక కొత్త అధ్యయనపు జగత్తు ఉందని చాలా సంతోషపడ్డాడు. తన చదువు అధ్యయనంలో తనదైన ఒక ప్రత్యేకతను ఏర్పరచాలని అతని ఆశయం. అతని అధ్యయన విభాగంలో కొందరు మంచివారు ఉండేవారు. మరికొందరు ఈర్ష్యపడే ప్రవృత్తి కలవారూ ఉండేవారు. సూర్యనాయక్ మాత్రం తన పని, తన చదువు, తన ఉపన్యాసం, విద్యార్థి అభివృద్ధి కోసం సమయాన్ని కేటాయించేవాడు. అతనితోపాటు బ్యాక్‌లాగ్ పదవిలో ఎంపికైనవారిలో కొందరు ఇతనికన్నా చాలా పెద్దవారు. కొందరు ఇతని వయస్సువారు. అయితే అక్కడ జరుగుతున్న రాజకీయాలే వేరు. అల్పసంఖ్యాకుల, అధిక సంఖ్యాకుల బలిష్టమైన కులాల మధ్య శాండ్‌విచ్ అయ్యాడు. భుజాలకు జోలె వేసుకుని 80వ దశకం వేదాంతుల్లా ఫోజు కొడుతున్న గడ్డాలున్న మాస్టార్లు పక్కా కులవాదులే. వాళ్లమాదిరి ఇతనూ ఉంటేనే ఒక దశవరకు బ్రతకచ్చేవారు. లేకపోతే ఎండిన ఆకుల్లా చెదరగొట్టేవారు. ఇలాగే ఇంకొకడు కాల్చిన వంకాయ ముఖంవాడు. ఇద్దరిని మోసం చేసి మాలూరు సమీపంలో పదెకరాలు భూమి తీసుకొని రైతుకు టోపీ పెట్టాడు. ఆ మనిషి సూర్యనాయక్ అభివృద్ధిని చూసి మండిపడేవాడు. సూర్యనాయక్ ఆదివాసినో, మూలవాసినో లేదా కర్ణాటక రాష్ట్ర పరిశిష్టజాతికి చెందినవాడై ఉంటే, అతని అవకాశంలో సూర్యనాయక్ ఒక్కడే భాగస్థుడు–అయితే అందరినీ స్వీకరించే స్వభావానికి చెందనివారు బయటికి తరిమారు. మాలూరులో ఇతని ఆరంభపు రోజులు చాలా కఠినంగా ఉండేవి. ఇతను అనుకున్నట్టుగా అక్కడ పరిస్థితి లేదు. అతను చదివేటప్పుడు విశ్వవిద్యాలయంలో కొందరు నాయకులు కేవలం సమ్మెలు చేయాలని అడ్డంగా నిలబడి గొర్రెలను తరుముతున్నట్టు తరిమేవారు. ప్రజాప్రభుత్వ వ్యవస్థలో వైయక్తికతకు విలువే లేదు. తమకు ఇష్టం వచ్చినట్టు తరగతులకు వెళ్లటానికి సాధ్యం కానటువంటి పరిస్థితి. హరికేతు, మాంతేశ్‌లు మరొక సంఘంలో పెద్దనాయకులు. వారి ఆగడాలు చెప్పనక్కర్లేదు. ఎప్పుడు కావాలన్నా స్ట్రైకులు చేయించడం వారి దందా అయిపోయింది. ఒక పట్టీ తయారుచేసుకున్నారు. దాని ప్రకారం ఎవరి దగ్గరైనా డబ్బులు వసూలుచేసేవారు. ఫలానా ప్రొఫెసర్ ఇన్ని రూపాయలు, ఈ మాస్టారు ఇంత, ఆ మాస్టారు అంత ఇవ్వాలని వసూలు చేసేవారు. వి.సి.కి అనుకూలంగా కానీ, వ్యతిరేకంగా కానీ ధర్నాలు చేయగలరు. అలాగే సీట్ ఇప్పించడానికి, సీట్ నిరాకరించడానికి ఒక పెద్ద లాబీనే ఉంది. అక్కడ ఉద్యోగం చేస్తున్న దుర్మార్గుడైన ఒక ప్రొఫెసర్ ఉన్నాడు. అతని అన్న కొడుకుకు ర్యాంకు కావాలి. అంతే. ఏదో ఒక పనికిమాలిన విభాగంలో, అతని కులస్థుడైన మరో చేతకానివాడు ఉన్నాడు. ర్యాంకు

ప్రకటించిన తర్వాత, మళ్లీ రీవాల్యూవేషన్ చేయించి ర్యాంకు వచ్చిన వాడికన్నా ఎక్కువ మార్కులు వేయించి, ర్యాంకులు మార్చే కుట్రనే జరిగింది. తాను తలుచుకుంటే విద్యారంగంలో ఏదైనా చేయగలడని రుజువు చేశాడు. ఇలాంటి సన్నివేశంలో అల్పసంఖ్యాక సముదాయానికి చెందిన సూర్యనాయక్ స్వతంత్రంగా ఏ దిశలో పైకి రాగలడు? అతని అభివృద్ధిని భరించలేని ఉన్నత వర్గాలవారు అణచివేయడానికి ప్రయత్నించేవారు. కింది వర్గంవారు ఇతను మా వాడు కాదన్నట్టు లోలోపల కత్తులు నూరేవారు. అయినా తన అస్తిత్వం కోసం ఒంటరిగానే పోరాడవలసి వచ్చింది.

మూడు సంవత్సరాలు ఎస్.ఎస్.ఎస్.లో బాగా పనిచేసి అవార్డు తీసుకునే సమయంలో కేశవానంద అనేవాడు, డబ్బులు తీసుకొని బాగా తిని, తాగి, గొప్ప ఆదర్శాలను వల్లె వేసి, బీరకాయ పీచులాంటి అతని బంధువు మాటలు విని అవార్డు రాకుండా చేశాడు. అదే సమయంలో ఇతనికి ఆ పదవి ఇవ్వాల్సి వస్తుందని బెంగళూరులో మీటింగ్ ఉందనే సాకు చూపించి జరగవలసిన కార్యక్రమాన్ని రద్దు చేయించాడు. ఇవన్నీ సూర్యనాయక్కుకు అర్థంకాదని అనుకున్నారు. ఈ సంఘర్షణలన్నింటి మధ్య గడ్డిపోచలా సవాళ్లను ఎదుర్కోవడం ఒక కఠినమైన మార్గమైంది. అతని తండ్రి భగన్యనాయక్‌ను తండాలోనే అతని పోరాటం వల్ల జనం భరించలేకపోయారు. జీవితంలో సూర్యనాయక్ పడుతున్న కఠిన పరిశ్రమ తీవ్రస్థాయిలో ఉంది. అయితే అతను తండ్రి తాలీంఖానాలో తర్ఫీదు కావడం వల్ల, పైగా తండాలో పెరిగి ఉండటం వల్ల, పట్టణంలో మనుషుల తప్పుడు ప్రవర్తనలను గుర్తించగలిగాడు. కేవలం అవగాహన వల్లనే తాము గొప్పజ్ఞానాన్ని సంపాదించామని ప్రదర్శించడానికి జరిపే బూటకపు, చలాకీతనపు అవగాహన అతనికి ఉండటంవల్ల వీటన్నిటిని అధిగమించి నిలబడటానికి సాధ్యమైంది.

ఆ సమయంలోనే మాలూరుకు వెళ్లినప్పుడు ఒక సంఘంవారు ఉపన్యాసం ఇవ్వడం కోసం పిలిచి, అక్కడ ఏమి జరుగుతుందో దాన్ని సమర్థించి, దాన్ని పొగుడుతూ ఉపన్యాసం ఇవ్వాలని అతనిమీద ఒత్తిడి తెచ్చారు. ఉపన్యాసానికి ముందు ఇతనికి తెలియకుండా వేలాది రూపాయలు వసూలు చేశారు. రెండవది వారి సిద్ధాంతాన్ని తూచా తప్పకుండా ప్రచారం చేయాలని ఒత్తిడిపెట్టారు.

సూర్యనాయక్‌కు తాను ఎలాంటి సందిగ్ధంలో చిక్కుకున్నాడోననే భయం పట్టుకుంది. సంఘాలు ఇలా కూడా ఉంటాయా? పోరాటాలు ఈ విధంగా దిక్కు తప్పాయని అతనికి అర్థమైంది. ఆ రోజే వాటన్నిటికీ ముగింపు పలికాడు. ఆ

సంఘం వారు కనిపిస్తే తప్పించుకొని తిరగసాగాడు.

పదేళ్లకాలం మాలూరులో పొందిన అనుభవాలు జీవితాంతం ఎక్కడా దొరకలేదు. ప్రాంతీయ అవమానాలు, కుల అవమానాలు, వ్యక్తులలో అసమానత అక్కడి విశ్వవిద్యాలయంలో తాండవం చేస్తోంది. వాటినే కోటులుగా వేసుకున్న కొంతమంది కోటీశ్వరులు అయ్యారు. కొంతమంది మాస్టార్లు వసూలుభాయ్‌లైతే, మరికొందరు రియల్ ఎస్టేట్ దందాలో బాగా డబ్బు సంపాదించారు. వీటన్నిటిని చాలా సూక్ష్మంగానే గమనించాడు. విద్యారంగం, పండిత వర్గం దివాలా తీసి వుండడం స్పష్టంగానే కనిపిస్తోంది. రాజకీయ నాయకుల్లా వాళ్లను వీళ్లను బుజ్జగిస్తూ తరగతులలో తమ వ్యక్తిగత ఆలోచనలను వెదజల్లుతూ ముప్పయి అయిదు, నలభై సంవత్సరాలు గడిపిన మాస్టార్లు అమెరికా నుంచి వచ్చిన ఒక విద్యార్థిని బెదిరించి పారిపోయేలా చేసిన సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అయ్యాడు.

అతని సహోద్యోగి ఒకరు విద్యార్థుల దగ్గర, వారికి సరిపడని కొందరి దగ్గరికి పోయి "రేయ్, వాళ్లు మీకన్నా ఎక్కువగా చదవలేదు. మీరు బి.ఎ. చదివారు. వాళ్లు కేవలం మీ కన్నా రెండేళ్లు ఎక్కువాగా చదివారు. ఎం.ఎ.చేశారు. అంతే. వ్యత్యాసమేమీ లేదు" అని తమ వ్యతిరేకుల బుర్రలను విషమయం చేశారు.

సూర్యనాయక్ వీటన్నిటిని చాలా దగ్గరినుంచి అతి సూక్ష్మంగా గమనించాడు. అతను తన పేరును, తన ఆత్మీయతను స్థాపించడానికి పెనుగులాడుతూ ఉండేవాడు. తన ప్రభావాన్ని ఏర్పరచడంలో ఆటంకం ఏర్పడింది. చాలా కాలం క్రితం నుంచే మారుతూ వచ్చిన పరంపర ప్రవర్తనను గుర్తించటానికి పెనుగులాడాడు. భార్య వందనాకు, అతని మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇద్దరు మగపిల్లల మానసిక వ్యత్యాసాలను అర్థం చేసుకొని మారుతున్న సందర్భాలకు సరిగ్గా సర్దుకోవడంలో పెద్ద ఘర్షణ ఏర్పడింది. తన తల్లిదండ్రులతోపాటు నలభైమంది ఉన్న ఉమ్మడి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన సూర్యనాయక్‌కు కుటుంబ విలువలు తెలుసు. అతని తండ్రికి తనదైన సమస్యలే వేరుగా ఉండేవి. శ్రమ-సంపాదన, సమాజంలో గుర్తింపబడటానికి గొప్పసంఘర్షణలే జరిగాయి. అయితే సూర్యనాయక్ అవగాహన, భార్య జ్ఞానం, ఇద్దరు సర్దుకునిపోవడానికి సతమతమయ్యేవారు. అతను పి.యు.సి. చేస్తున్నప్పుడు ఎలాంటి అవకాశాలూ లేవు. డిగ్రీకి వచ్చినప్పుడు పాత కాలేజ్, ఆ ఇంగ్లీష్‌ను మాట్లడేవారిని చూసి ఉన్నట్టుండి వచ్చే వర్షాన్ని చూసినట్టు గాభరా పడేవాడు.

ఉదయం హాస్టల్, పాతలైబ్రరీలో కూర్చొని చదువుకున్న స్థలాలు, స్టూడెంట్

హోమ్‌లోని నోటీస్‌బోర్డుకు అతను రాసి, అతికించిన పద్యాలు చదివి మెచ్చుకున్నవారు, ఆకాశవాణిలో దొరికిన అవకాశాలు... ఒక్కటొక్కటిగా గుర్తుకొచ్చాయి.

అతను బి.ఎ. ముగించే చివరి రోజులలో వచ్చిన జిరాక్స్ మిషన్ వెంటపడ్డ యువకులు లైబ్రరీలో కూర్చోని చదవటమే మానివేశారు.

❖❖❖

8. ఆగని ప్రయాణం

అప్పటికే 1990 దశకం ప్రారంభమైంది. కమ్యూనికేషన్ విప్లవ ప్రభావం పెరిగింది. 1960లో కేవలం ప్రయోగాత్మకంగా అమలుపరచడం జరిగింది. టీవీ అనే భూతం కాలక్రమంగా గొప్ప శ్రీమంతుల ఇంట్లో కాలు పెట్టింది. 1989లో సూర్యనాయకు బిఎ చదువుతున్నప్పుడు మహాభారత్ ధారావాహికను చూడటానికి ప్రతి ఆదివారం హాస్టల్లో ఉదయమే లేచి, ముఖం కడుక్కుని, టిఫిన్ చేసి, దిబ్బమీద ఉన్న బంగ్లాకు పరుగెత్తడం గుర్తొచ్చింది. అతను జనవరి 26 రిపబ్లిక్ డే పెరేడ్‌కు వెళ్లినప్పుడు శ్యామ్ పిట్రోడా కమ్యూనికేషన్ విప్లవంవల్ల టెలిఫోన్ బూతులు, టెలిఫోన్ కాయిన్ డబ్బాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. డాక్టర్ రాజకుమార్‌గారి 'దేవతా మనుష్య' సినిమా సంచలనం సృష్టించింది. అమితాబచ్చన్ 'కూలి' గాలి దేశమంతటా ఎగిసింది. చాలామంది బుల్లితెర కళాకారులు సినిమాలో కాలుపెట్టారు. అప్పట్లో కన్నడిగులకు ఒక్కడే రాజ్‌కుమార్, తమిళ్‌కు ఎం.జి.ఆర్. తర్వాత రజనీకాంత్, తెలుగులో చిరంజీవి, హిందీకి అమితాబ్‌బచ్చన్ స్టార్‌డమ్ నడుస్తోంది.

ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత అనేకసార్లు, టెలిఫోన్ బూత్, ఎస్.టి.డి నుంచి మిత్రులకు ఫోన్ చేశాడు. అప్పటికే లైబ్రరీలు బిక్కుబిక్కుమంటూ ఉంటే; పుస్తకాలు దుమ్ముధూళిని నెమరువేస్తుండేవి. విశ్వవిద్యాలయాల్లో కులం, మతం గొడవలు వుండకూడదు. అయితే యథేచ్ఛగా ఆ వాసనలతో నిండిపోయాయి. ఇందువల్లనే సూర్యనాయక్ ఎం.ఎ. చివరి సంవత్సరంలో కులరాజకీయాలకు బలై ఫెయిల్ అయ్యాడు. అదే అతడిని నిప్పుల్లో పడిన ఫీనిక్స్ పక్షిలా మళ్లీ పైకెగిరేలా చేసింది. నాన్ అకడెమిక్ ఉద్యోగంలో చేరిన సూర్యనాయక్ పంజలూరులో సుమారు

ఏడున్నరేళ్లు గడిపాడు. "ఛూ లంజా కొడకు, చూడంద్రా, అప్పుడు ఏదో మెరిశాడు, ఇప్పుడు ఎందుకు పనికిరానివాడయ్యాడు" అని అతని తరగతిలోనే చదివి, అతను చెబుతున్నట్టు విని, రాసి, పాసై ఏదో విధంగా బంగారప్ప ముఖ్యమంత్రి అయినప్పుడు; రూరల్‌లో ఉండేవారికి 15% ఉద్యోగాలు ఇచ్చినప్పుడు ఉద్యోగం సంపాదించు కున్నాడు. జూనియర్ కాలేజ్ స్నేహితులు, ప్రైవేట్ జూనియర్ కాలేజ్‌లో చేరిన మిత్రులు బార్‌లో రాత్రి కలిసినపుడు సీరియస్‌గా మాట్లాడుకునేవారు. పంజలూరుకు రావటానికి ముందు తిరుగుబాటు చేసి సమాజంలో మార్పు తీసుకుని రావటానికి పూనుకున్నాడు. అన్ని పల్లెల్లో అక్షరాస్యత ప్రమాణం పెరగాలని వరల్డ్ బ్యాంక్ ఇచ్చిన వేలాది కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వ ప్రణాళికల్లో డబ్బులు లేకుండా పనిచేసి, జనంచేత ఛీ...ఛూ...అనిపించుకున్నది మాత్రం సూర్యనాయక్‌లాంటివారు. దాంతో చెడ్డ పేరు. ప్రవేట్ కాలేజీని వదిలే పరిస్థితి వచ్చింది. ఇక్కడ అతనిని తీవ్రంగా వేధించింది కులం. ఎందుకంటే అతనికి చిన్న వయసులోనే దొరుకుతున్న కీర్తిని చూసిన బసవన్న అనుయాయులే అతనికి విరోధులయ్యారు. ఆ ఊరి మాఫియాలు ఊరు చుట్టూ ఉన్న తండాకు చెందిన స్త్రీ-పురుషుల గురించి పొలంలో పనిచేసేవారని, కట్టెలు తెచ్చేవారని మాత్రమే రాశారు. ఈ నేపథ్యంలో వచ్చినవాడు తమ ఎదురుగా కుర్చీ మీద కూర్చుంటే ఎలా? "రేయ్ తమ్ముడూ, నేను కమిటీ మెంబర్‌ని. సలాం చెయ్" అని వేలిముద్ర వేసే సభ్యుడు గద్దిస్తూ మాట్లాడిన ఒక్కో మాటకు దిగ్భ్రాంతి చెందాడు. ఇలాంటి బుర్రలేని జనం, "ఛీ...ఏమిటండి, ఇతను మన వయసు అమ్మాయిలను -అబ్బాయిలను రాత్రి-అర్ధరాత్రి అనకుండా పల్లెలకు పిలుచుకొని పోతుంటాడు. మర్యాదస్తులు ఎలా బ్రతకాలి?" అని మాట్లాడుకునేవారు. ఇలాంటి తలలు లేని జనం మధ్య మరికొంత కాలం ఉండివుంటే అతడి శవాన్ని లేపేవారు. చివరికి అతను విసిగిపోయి, వద్దనుకుని బయటకు వచ్చాడు.

అనుభవం మనిషిని గట్టిపరుస్తుంది. మీ అభిప్రాయాలను బలపరుస్తుందని అనడానికి సూర్యనాయక్ జీవితమే ఒక ఉదాహరణ. ఎన్ని ఉలి దెబ్బలు తిన్నాడు. ఈ పాడు సమాజంలో మంచివాడుగా, నిజాయితీపరుడుగా ఉండటం ఎంత అపాయమో అతనికి విశ్వవిద్యాలయంలో ఉన్న రోజులలో, ఆకాశవాణిలో పనిచేస్తున్న సమయంలో తెలుసుకున్నాడు. కాకా పట్టేవారికి, చంచాగిరి చేసేవారికి, తార్పుడుగాళ్లకు, బ్యాగులు మోసేవారికి, ఇక్కడి నుంచి ఫోన్‌లో రికార్డు చేసుకునిపోయి చూపించేవారికి మాత్రమే అన్నీ సాధ్యం. అలాంటివారిదే ప్రపంచం. సత్యాని-నిజాయితీకి విలువ లేదు. ఈ సంఘర్షణలో అతను నలిగిపోయాడు.

జీవితం అంటే బి.ఎం.డబ్ల్యూ. కారు కొనడం, పెద్ద హొటల్లో డిన్నర్ చేయడం, ఎప్పుడూ హైటెక్ బస్సులోనే తిరగడం అని అనుకునేవాడు. అయితే జీవితం వాస్తవమైన పాఠాలు చెప్పింది. పదిరూపాయలు సంపాదించడం ఎంత కష్టమనే సత్యాన్ని అంకుర్, అవదేశ్‌లకు అవగాహన కలిగించడానికి సూర్యనాయక్ సతమతమవ్వసాగాడు. తన వెనుకటి సంకోచం, కష్టం, పేదరికం గురించి చెబితే, 'అది నీ కర్మ. నీ కాలం అలా ఉండేది. మీ నాన్నకు బుద్ధిలేదు. పదిమంది పిల్లలను పుట్టించాడు. మా నాన్నకు బుఱ్ర ఉంది. ఇద్దరు పిల్లలను మాత్రమే పుట్టించి, వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాడు' అని అతనికే బుద్ధిచెప్పారు. సూర్యనాయక్ వారి మాటలకు తబ్బిబ్బయ్యాడు. అతనికి ఒక ఘడియ ఏది సత్యమో అర్థం కాలేదు. భగన్యనాయక్ తన మొత్తం బాల్యాన్ని, యవ్వనాన్ని, అతని తండ్రి పంపా నాయక్, తల్లి గూడ్లిబాయి, తన ఇద్దరు చెల్లెళ్ల కోసం కష్టపడుతూ జీవించాడు. పెళ్లయిన తర్వాత అతని తల్లి వొట్టి చేతులతో ఇంటి నుంచి బయటికి పంపినప్పుడు బుట్ట కింద దాచేలా పదిమంది పిల్లల భవిష్యత్తును రూపొందించడానికి రాత్రీపగలూ కష్టపడ్డాడు. నేలను దున్ని, వ్యవసాయం చేసి జీవితం నిర్మించుకున్నాడు. గుడసెలో ఎద్దులు, కోళ్లు, పదిమంది పిల్లలు ఉండేవారు. తొలకరిలో గుడిసే కారేటప్పుడు సూర్య తల్లి, పదిమంది పిల్లలను ఒకింత పొడి స్థలంలో పడుకోబెట్టి, కంచాలు, లోటాలు, పాత్రలు, గిన్నెలను నీళ్లు కారే చోట పెట్టి కాపాడేది. వేపచెట్టుమీద పిడుగు పడినపుడు, పిడుగును సవాలు చేస్తున్నట్టు, "అర్జున, ఫల్గుణ, పార్థ , భీభత్స ..." అని నెమ్మదిగా జపిస్తూ పిల్లల్లో ధైర్యం నింపింది కదా! సారాయి తాగి జనం మధ్యదారిలోనే పడి పోయినప్పుడు, భగన్య నాయక్ ఆ రోజుటి అలసట తీర్చుకోవడానికి ఒక ప్యాకెట్ తాగి, భార్య చావళికి ఒక ప్యాకెట్ తెచ్చి యిచ్చి, సమానత్వాన్ని పాటించాడు. అంతేకాకుండా అనవసరమైన ఖర్చులకు కళ్లెం వేసి, దురలవాటుకు దూరంగా వుండి, భవిష్యత్తు రూపొందించటం కోసం, కనిపించినవారందరి పొలాలను కొన్నాడు. చివరికి సొంత కొడుకులే అతన్ని కొట్టి అవమానించలేదా? ఇంకా రెక్కలే రాని పిల్లల మాటలు సూర్యనాయక్‌ను నిర్లిప్తుడిగా మార్చివేసేవి. అతని తండ్రి, తాత, ముత్తాత, నాటిన చెట్ల వేరులు చాలా లోతుకు దిగి, తమ కుటుంబపు వేర్లు పాతాళానికి దిగివుండటం వల్ల అతని పదిమంది పిల్లల సంసారపు చిన్నచిన్న చెట్లు భద్రంగా ఎలాంటి సుడిగాలి వచ్చినా తలకిందులై దొర్లిపడకుండా భద్రంగా నేలలో ఊనుకున్నాయి. పెద్దవాడైన టాంక్యా పిల్లలు కోటీశ్వరులయ్యారు. అతడి ముగ్గురు కూతుళ్లు బాగానే బతుకుతున్నారు. రెండోవాడి పిల్లలు చక్కటి విద్యావంతులై

సర్కారు నౌకరి సంపాదించుకుని అతన్ని కష్టాల నుంచి బయటపడేశారు. మూడో కూతురు ఐశ్వర్యవంతురాలైంది. అయితే ఆమె ఇంటి వాస్తు సరిగ్గా లేదేమో లాభనష్టాలు ఒక్కటీ అర్థంకాకుండా ఉంది. నాలుగో కూతురు, ఆమె పిల్లలు ధనవంతులయ్యారు. అయిదవవాడి పిల్లలు కాస్త ఇబ్బందులు పడుతున్నారు. ఎంత సంపాదించినా కడుపులు నిండటం లేదు. రెండో కొడుకు సంజయ్‌కు ఏడుమంది ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు, రెండోవాడు బద్రికి నలుగురు పిల్లలు. వారు సంపాదన లేకుండా, కాఫితోటలో పనిచేయడం, చెరుకు కోయటం, కూలీపనులు చేస్తూ జీవితం సాగిస్తున్నారు. ఆరవవాడికి ఆరుమంది పిల్లలు. ఒకరిద్దరూ చదువుకున్నారు. ఒకరిద్దరు వ్యవసాయం చేస్తున్నారు. ఒకామె రాణి అంగడి పెట్టుకుంది. ఆరవవాడైన సూర్యకు మాత్రం ఇద్దరు పిల్లలు. చిన్నవాడికి అయిదు మంది పిల్లలు. మొత్తం కుటుంబం ఓట్లు ఎవరికే పడితే వాళ్లే గెలవచ్చు. ఒకసారి భగన్యనాయక్ గెలిచాడు. తర్వాత ఒకట్రెండు సార్లు గ్రామపంచాయితీ ఎలెక్షన్‌లో గెలవటం తప్ప వేరే ఏ ప్రయోగాలను చేయలేదు.

సూర్యనాయక్ తన పిల్లలకు భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అన్నీ రకాల ప్రయత్నాలు చేశాడు. సర్దుబాటు కోసం జరిగే సంఘర్షణలో ఎక్కడ భవిష్యత్తుకు ప్రమాదం ఏర్పడుతుందేమోనని, చాలా జాగ్రత్తగా అడుగులు పెట్టాడు. భగన్యనాయక్ చెప్పిన ఎన్నో యశోగాథలను, ఆయన నేర్పిన నానుడులను, పిల్లలకు చెప్పే ప్రయత్నం చేశాడు. అయితే ఇప్పటి యుగం పాతకాలంలా లేదు. మొత్తం ప్రపంచమే వారి చేతిలో ఉంది. ప్రపంచకరణీకరణం జరిగిన నేపథ్యంలో ప్రపంచం చాలా చిన్నదైంది. గ్లోబల్ విలేజ్ అనే పరికల్పన. ప్రభుత్వ కార్ఖానాలను ప్రైవేట్‌పరం చేయడం జరిగింది. ఎవర్ని అడిగినా సాఫ్ట్‌వేర్ అనేవారు. ఏదో ఒక కంపెనీలో, వారి గెస్ట్‌హౌస్‌లో బస చేసిన సూర్యనాయక్ మనుషులు యంత్రాల్లా తిరుగుతుండటం చూశాడు. అదే కంప్యూటర్ బ్లాగులను పాడుచేసింది. మొబైల్ ఫోన్ వచ్చిన తరువాత అందులో ఆటాడుతూ కాలం గడపటం ఆరంభిస్తే భోజనం, ఫలహారం వదిలేసేవారు. అవదేశ్ అయితే రెండు చేతులతో ఆడటానికి కూర్చుంటే, రోజంతా అతనికి తన మీదనే ధ్యాస ఉండేది కాదు. అతని తరం పిల్లలు టెక్నాలజీని ఉపయోగించుకుని బాగుపడి జీవితాన్ని రూపొందించుకున్నారు. అదే టెక్నాలజీని వ్యసనంగా చేసుకున్న కొడుకు బాగుపడలేదు."ఏమండి ఈ కుర్రవాళ్లు ఏ దిశలో సాగుతున్నారు?" అని అతనితోపాటు ఉద్యోగం చేస్తున్న రంగప్ప అడిగాడు. "రంగప్పా, ఆ విషయం గురించి అడగకుండా ఉండటమే మంచిది" అన్నాడు సూర్యనాయక్. అతను ఆలోచించి బాధపడటానికి

సిద్ధంగా లేదు. ఎందుకంటే అప్పుడు సాఫ్ట్‌వేర్ స్ఫుటనిక్ యుగమని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇప్పుడు వేరే ఏదో లోకంలో జీవులు బతికి వున్నాయి. వాటిని భూమి మీదకు ఆహ్వానించాలని చాలామంది మాట్లాడుతున్నారు. పరిస్థితి ఇంకా ముందుకుసాగి ప్రకృతే ఆశ్చర్యపడేలా కృత్రిమ చంద్రుడిని, కృత్రిమ సూర్యుడిని చైనా దేశం సృష్టించడానికి ముందుకొచ్చిందని విజ్ఞానలోకంలో భయం పుట్టింది. అణుబాంబ్, అణువిద్యుత్ తయారైంది. ముందేమిటి అని మనిషి ప్రశ్న. ఈ మధ్యన నాసావారు 2020లో మంగళ గ్రహానికి స్టేట్ టూరిజంను ప్రారంభించడానికి పూనుకున్నారని ప్రపంచం మాట్లాడుకొంటోంది. వైజ్ఞానికుల ఆవిష్కరణలో మరొక ముఖ్యమైనది న్యానో రోబో. మనిషి రక్తనాళాల ద్వారా దేహాన్ని చేరుకున్న క్యాన్సర్ ఉంటే; ఆ సమస్త జీవకోశాలను వెతికి వెతికి న్యానో రోబో హత్య చేస్తుంది. అందువల్ల మనిషి ఆయుష్షు నూటానలభై వరకు పెరగవచ్చని కొందరు మేధావుల అంచనా.

ఈ కొత్తదనాలన్నిటి మధ్య భారత్‌లోని అల్ప జాతిలా మనిషిని ప్రశాంతంగా జీవించటానికి వదలకపోవడం పెద్ద ప్రమాదమే. నాల్వడివారి కృపకు లోనైన బంజారాలు భారత రాజ్యాంగంలో పరిశిష్ఠ జాతి తెగలో చేరినపుడు మైసూరు సంస్థానంలో ఉన్న రిజర్వేషన్ పాత మైసూరు భాగంలోని వేళ్ల మీద లెక్కపెట్టగలిగేటంత జనులకు దొరికింది. అరుసుగారు ఎం.జి. హావనూర సమితిని రూపొందించిన తర్వాత నూటొక్క జాతులలో బంజారా, లంభాని, లమాణి ఒకే అర్థాన్నిచ్చే సముదాయం వారు-మూల ఆదివాసి సముదాయం వారైనప్పటికీ దురదృష్టావశాత్తు వాళ్లను పరిశిష్టి జాతి సమూహంలోకి చేర్చడం జరిగింది. ఈ నూటా ఎనిమిది జాతులలో కొన్ని పేరుకు మాత్రమే ఉన్నాయి. వాటిల్లో చాలా కులాలకు ఇప్పటికీ న్యాయం లభించలేదు. ఎందుకంటే ఆ సముదాయంలోని వారెవరికీ విద్యా, ఉద్యోగం సౌకర్యాలు అందనేలేదు. ఇంకా కొన్ని సముదాయాలు రిజర్వేషన్ విషయాన్నే పెట్టుకుని ఒక కొత్త గందరగోళాన్ని సృష్టించారు. పిల్లలను అమ్ముకునేటంతటి నికృష్ట పేదరికంలో ఉన్న బంజారా సముదాయం స్థితి ఏమిటనే భయం సూర్యనాయక్‌ను తీవ్రంగా వేధించింది.

సూర్యనాయక్ స్థితి ఎలా మారిందంటే తలెత్తి చూస్తే దళితుల కళ్లల్లో కారంపొడిని చల్లుతారు. కింద కాలు చైనులు అంటే అతని సహకులస్థులు నిప్పుల తునకలను ఆరకుండా కాపాడుకున్నారు. కింద కాల్చుతుంది. పైన గుచ్చుకుంటుంది. ఇలాంటి సందిగ్ధంలో పిల్లల భవిష్యత్తు కల ఒకవైపు ఉంటే; ఇంకా అజ్ఞానమే

నిండివున్న సమాజంలోని జనం ఎప్పుడు అభివృద్ధి చెందుతారన్న భయం మరోవైపు. పైగా నూటొక్క జాతుల వారికి అధికారం ఎప్పుడు దొరుకుతుంది? వాళ్ల ప్రశాంతమైన జీవితాన్ని ఎప్పుడు గడుపుతారు? వాళ్ల పిల్లలు ఎప్పుడు అధికారులు అవుతారనే నమ్మకపు ఆశాకిరణం అన్వేషణలో గడిచిపోయిన రోజులను తీసివేసి, రానటువంటి రేపటిరోజులను లెక్కిస్తూ, వచ్చిన ఈ నాటి అవకాశాన్ని కృతజ్ఞతాపూర్వకంగా అనుభవిస్తూ ఓ కొత్త చమత్కారం కోసం ఎదురుచూస్తూ సంతకు పోయాడు.

తల్లితండ్రులు తెచ్చిన సంత గంటులో తినటానికి తెచ్చివుండగలిగిన చిరుతిళ్ల కోసం తల్లితండ్రులు ఇంకా రాలేదని సగం దారివరకూ పరుగునవెళ్లి చూసి, ఇంకా రాకపోవటంతో బిక్కముఖం పెట్టుకుని ఆడుకునే పిల్లల్లా, దారి వెంబడి నడుస్తున్నాడు.

❖❖❖

MALAAN

A Historical novel of the Lambadis



Author: Prof. N. Shantha Naik

Translated by: Ranganatha Ramachandra Rao

Prof. N. Shantha Naik, Teaches English literature at Vijayanagara ShriKrishnadevaraya University, Bellary, Karnatak, India. As a creative writer in Kannada as well as in English penned four novels, four short stories collection and equal number of plays and article collections also. He focused on one of the largest tribal community of India which is known for Holi and Deepavali. He is specialized in teaching American English, Linguistics at M.A Graduation students.

He has quite a number of PhDs in his credit. He Submitted a Major research on Banjara Language and cultural Dictionary. He has written a Play in English the Banjara warrior, and a novel Gormati-An ending journey. He recited poetry in world bookfair-2019.He was invited by Wisconsin university Madison America deliver lectures on Tribal oral Narratives and Tribal education in India. He also participated in the conference across the world few of them are City University Hong Kong, Philippines etc,.He also delivered Key-note address in many universities and colleges.

మలాణ్ • లంబాడీల చారిత్రక నవల

Publishing Agency: **Vislavath Lalunayak Memorial Knowledge Centre**

ISBN 978-81-962450-0-9

Printer's Details: Printone Digital Bangalore, India.
Edition Details: (I)

Price: 360/-

Publisher's Address: *H.No: 2-17-76/2/11/2 Road No: 8, Raghavendra Nagar Kalyanpuri, Uppal. Hyderabad-039*